

# బహుముఖ

ప్రముఖ విమర్శకులు, పాత్రికేయులు
రచయితల పరిశీలనలు, వ్యాఖ్యలు



*I am a poet  mothered by a Village*
*and fathered by a City.*

*- Devipriya*

కవిత్వమంటే
కనురెప్పలవెనక మూసిన నిశీధిలో
చూచకాన్ని మీటుతున్న చూపుడువేలు,
కవిత్వం
ఇంద్రధనుసుకి
నిద్రలో కనిపించే బ్లాక్ అండ్ వైట్ స్వప్నం!

*(ఒక సాంకేతిక శకలం : తుఫానుతుమ్మెద)*

# బహుముఖ

**విశ్లేషణలు ◆ పరామర్శలు ◆ ప్రేమలు ◆ ఆలింగనలు ◆ అభిమానాలు**

*దేవిప్రియ 'గాలిరంగు'కి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు - 2017*
*ప్రకటించిన సందర్భంగా*
*ఇది 'దేవి' ప్రేమికుల ఆత్మీయ సమర్పణ*


సంపాదకులు :

**బి. నరసింగరావు** **ప్రొ. ఘంటా చక్రపాణి**
**ఖాదర్‌మొహియుద్దీన్** **డా. సీతారామ్**
**బండ్ల మాధవరావు**



సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ.

*bahumukha*

*(the multifaceted)*

*critiques on devipriya*

*October 2018*

*title design & line art : giridhar arasavelli*

*photo : suman pusuluri*

*caricatures : seela veerragu, mohan,*
*sankar, narsim, ramana geevi*

*photo credits: b. narsinga rao, subba rao, bharathbhushan and*
*many anonymous photographers.*

*publisher*
*saahitimitrulu - vijayawada*
*28-10-16, maszid street, arundelpet, vijayawada - 520 002*
*cell : 93929 71359*

*distributors :*
*navodaya book house*
*opp. aryasamaz, kachiguda, hyderabad*

*phone : 040-24652387, 9247471361*

*e_book : www.kinige.com*

*printed & bound by*
*srisri printers, vijayawada - 520 002*
*cell : 9490634849   email : srisriprinters.vja@gmail.com*

₹ 300



*I believe I am a link*
*between the poets that*
*went before me and the*
*poets that come after me.*

*- Devipriya*



# నా కవిత్వం

కవిత్వానికి వరదగుడి కంటే యెక్కువ రంగులు వేయగలవాడే కవి. కవిత్వాన్ని అతి సామాన్యంగానూ, అసామాన్యంగానూ చెప్పగలవాడే కవి. వస్తువును సమాజ పరంగా స్వీకరించి, ప్రజలను ఉద్దేశించి, ప్రజలను సంబో ధించి పాడగలవాడే కవి. కుటుంబంలో సమాజాన్నీ, సమా జంలో కుటుంబాన్నీ దర్శించగలవాడే కవి. పదాల అర్థం, పదాల అందం, పదాల పదును తెలిసి, సరయిన స్థానంలో సరయిన మాటను ఉపయోగించడం కవిత్వ కళలో భాగ మని తెలిసినవాడు కవన యవనికను పారదర్శకం చేయ గలడు. మాటమర్మం తెలిసినవాడు, మాటలను ప్రదర్శన కోసంకాక, తన మనోభావనను చదివేవాడికీ, వినేవాడికీ ప్రసారం చేయడం కోసం ఉపయోగిస్తాడు. ఊహ చేయలేని వాడు ఉపన్యాసకుడు కాగలడేమోకానీ కవి కాగలడా? వర్జిల్ పదివేల పంక్తులున్న తన చరిత్రాత్మక అసంపూర్ణ మహాకావ్యం ఏనియెడ్‌ని పది సంవత్సరాలపాటు రోమ్‌లో తీరుబడిగా కూర్చుని రచించాడని చెపుతారు. ఆధునిక,

సమకాలిక కవికి అలా కుదరదు. అత్యాధునిక కవి, ఈ ఇరవై ఒకటో శతాబ్దపు కవి తొందరలో వున్నాడు. తొమ్మిది వ్యాకరణాలూ చదవ నక్కరలేదు కానీ, ఈనాటి కవికి కవితా నిర్మాణ సామాగ్రీ, సాధనసంపత్తీ మస్తిష్కయంత్రపు మీటల ఫలకంమీద వుండాలి. ఊహ వ్యోమనౌకవలె తృటిలో పైకి దూసుకు పోవాలి. చదివిన తరువాతో, విన్న తరువాతో మనం క్షణకాలం నిశ్శబ్దంగా వుండిపోకపోతే అది సఫల కవిత్వం కాదు. మనని కవ్వం చిలికినట్టు చిలకకపోతే అది సఫలకవిత్వం కాదు. మనని ఒక లిప్తపాటయినా గగనంలోకి, గాలిపటం వలె ఎగరవేయక పోతే అది సఫల కవిత్వం కాదు. నా కవిత్వం ఇటువంటి స్థితికి చేరాలనే నా సాధన. కవి ఒక నిరంతర పాంథుడూ, ఒక నిరంతర నిషాదుడూ కావాలి. పారిపోయే దుప్పిని పట్టుకోవాలి. పైకి లంఘించే చిరుతను బాణంతో కొట్టిపడవేయాలి. అదే నా యాతన.







# బహుముఖం...


| | | |
|---|---|---|
| ఒక మహానదిని గురించి... | – సీతారామ్ | 11 |
| గురువుల నుంచి జ్ఞానం, ప్రజల నుంచి పాఠాలు. | దేవిప్రియ | 15 |
| 'గాలిరంగు' మీద 'కామెంటరీ' | – ఎ.బి.కె. ప్రసాద్ | 20 |
| 'ఇం...కొకప్పుడు' కవి ఆత్మకథ | – వరవరరావు | 24 |
| "కవిత ఉంది, వింటావా?" | – కె. శివారెడ్డి | 32 |
| అద్వితీయ మిత్రుడు దేవిప్రియ | – కొండుభట్ల రామచంద్రమూర్తి | 35 |
| యుద్ధం చేస్తూ శాంతిని కోరే కవి | – ఓల్గా | 38 |
| సెలయేరువంటి కవి దేవిప్రియ | – కె. శ్రీనివాస్ | 42 |
| వానగాలి అల | – పాపినేని శివశంకర్ | 45 |
| భయప్రాయంనుంచి లక్ష్యగానానికి! | – కల్లూరి భాస్కరం | 49 |
| దేవి అభిమానం అనుభవించాల్సిందే | – వాసిరెడ్డి నవీన్ | 55 |
| ఆత్మీయ స్పర్శలాంటి అరనవ్వు | – వాహెద్ | 57 |
| దేవుడు నిజంగా దేవుడే ! | – జగన్నాథశర్మ | 86 |
| విస్మయావేశాల కవిత్వం | – ఖాదర్ మొహియుద్దీన్ | 91 |
| బహుముఖ సంగమం | – మాడభూషి శ్రీధర్ | 94 |
| సునిశిత కవి దేవిప్రియ | – బండ్ల మాధవరావు | 97 |
| మహోన్నత కవి దేవిప్రియ! | – యాకూబ్ | 100 |
| గాలికి రంగులద్దిన దేవి | – వంశీకృష్ణ | 105 |
| దేవి ఆత్మకవిత 'ఇం..కొకప్పుడు!' | – డా. రవూఫ్ | 112 |
| మన కాలపు కవిదేవుడు దేవిప్రియ | – డా. ప్రసాదమూర్తి | 115 |
| ప్రజలతో నిర్మించబడిన కవి | – బాలసుధాకర మౌళి | 119 |
| కవిత్వంలో 'తుఫానుతుమ్మెద' | – బి. తిరుపతిరావు | 123 |
| ఆసియాలో అగ్రశ్రేణి కవి | – రామతీర్థ | 131 |




| | | |
|---|---|---|
| తాడి'కొండంత' కవి దేవిప్రియ! | – పెనుగొండ లక్ష్మీనారాయణ | 135 |
| కవిజర్నలిస్టు... జర్నలిస్టుకవి... | – పసునూరు శ్రీధర్‌బాబు | 138 |
| ఒక వాస్తవిక స్వప్నం | – దర్భశయనం శ్రీనివాసాచార్య | 166 |
| దేవిప్రియతో నా ఎన్‌కౌంటర్లు | – వరవరరావు | 171 |
| అసామాన్యుడు మా దేవిప్రియ | – ఓల్గా | 180 |
| కవన మహాశిల్పి దేవిప్రియ | – కె.ఎన్.వై.పతంజలి | 183 |
| షుక్రియా, దేవిప్రియా ! | – ఎండ్లూరి సుధాకర్ | 186 |
| కవిత్వంలో 'మరపురానివి' | – డా. విజయ్ కోగంటి | 194 |
| 'నీటిపుట్ట' లాంటి దేవిప్రియ కవిత్వం! | – చేరా | 205 |
| సాహస ప్రియదేవి | – నగ్నముని | 212 |
| జ్ఞాపకాల సెలయేరు | – సి.యస్. రాంబాబు | 215 |
| దేవి 'ప్రియ' తరంగాలు | – పున్నా కృష్ణమూర్తి | 217 |
| ఆనాటి, మానాటి దేవిప్రియ | – జింబో | 219 |
| ఆయన ఒక నిశ్శబ్దస్వాప్నికుడు | – శిలాలోలిత | 221 |
| అసాధారణ కవి | – నందిగం కృష్ణారావు | 224 |
| వ్యంగ్యప్రియ 'దేవి' | – మృణాళిని | 225 |
| సినీ దేవి 'ప్రియ' దర్శనం | – కాకరాల | 230 |
| తెలుగుకు ఉర్దూ షేర్ల పదును! | – సామల సదాశివ | 236 |
| నిరుపమాన రూపకాలు | – డాక్టర్ జె.భాగ్యలక్ష్మి | 238 |
| కవితాసముద్రం ఒడ్డున నిలబడి... | – జి. శ్రీరామమూర్తి | 247 |
| కవిత్వ రహస్యాలు తెలిసిన కవి | – నలిమెల భాస్కర్ | 250 |
| అంతర్ముఖీనత ఆయన ప్రత్యేకత | – అఫ్సర్ | 255 |
| మెత్తని పదజాలం... పదునైన భావజాలం | – జ్వాలాముఖి | 260 |
| కాలమిస్టుగా నాకు 'అమ్మచెట్టు' | – సి. వెంకటేష్ | 269 |
| చిన్నపత్రికలకి కొండంత అండ | – బైస రామదాసు | 271 |
| స్నేహానికి మరోపేరు ! | – స్మైల్ | 273 |
| అతి నాజూకైన కవి | – గుడిహాళం రఘునాథం | 274 |
| దేవిప్రియది ఒక విశిష్టధార! | –ఎన్. వేణుగోపాల్ | 275 |
| ప్రసార మాధ్యమాల ప్రవక్త | –సుధామ | 280 |
| దేవిప్రియ ఓ తుఫానుతుమ్మెద | – సీతారామ్ | 288 |
| ఒకే ఒక్కడు దేవిప్రియ! | – హరిశంకర్ | 290 |




కల్తీలేని కవిత్వం! – జగన్ 292

సూర్యసమానుడు దేవిప్రియ – శాతవాహన అనబడే షేక్ గులాంగౌస్ 295

ప్రియ బాంధవ్యం – బి.కె. ఈశ్వర్ 297

రాగప్రియ – దేవిప్రియ – ధవళ సత్యం 300

ఆ ఇద్దరూ – డాక్టర్ కె. ఉమారాణి 305

కవిత్వంగా జీవించిన దేవిప్రియ – రమణజీవి 307

'రన్నింగ్ కామెంటరీ' 309

తెలుగు జర్నలిజం ఆధునిక యుగకర్త – ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి 311

ఆయన చెప్పుచేతల్లో తెలుగు శబ్దం – ఖాదర్ మొహియుద్దీన్ 313

రన్నింగ్ కామెంటరీ దశాబ్దాలు – కె. శివారెడ్డి 315

అనిరత సాధ్యత సాధించాడు – కె. శ్రీనివాస్ 317

ఇది దేవిప్రియ భారతం ! –ప్రొఫెసర్ ఎండ్లూరి సుధాకర్ 319

పాత పదాలకు కొత్త అర్థాలు – చేరా 324

ఇంటర్వ్యూలు 339

నా కవిత్వాన్ని నేను స్పృహతో కాపాడుకున్నాను!

– గోపాలకృష్ణ, ఖాదర్‌మొహియుద్దీన్, ప్రసాదమూర్తి : సమన్వయకర్త పి.ఎస్. రాంబాబు 341

నేనొక చెట్టునైతే – దేవిప్రియ – కృష్ణుడు 366

తడి ఆరని ప్రేమకావ్యం ! – గంగాధర్ వీర్ల 373

రచన అనేది పని కాదు, పనితనం – దర్భశయనం శ్రీనివాసాచార్య 377

బతుకుదారిలో....

దేవిప్రియ బతుకుదారిలో..... 387

English Section :

Knowledge from Teachers ! Lessons from People! - Devipriya 395

An ode to Intimate Poetry - Srivathsan Nadadhur 399

Verse Vignettes of a Velocity poet - Jagadhathri 402

Devipriya is right into the 21st Century - Dr. Ayyappa Paniker 404

The moving finger writes... - Shanti Nanisetti 407

I have two aidens now ! - Sammu (Samatha) 411

From an Immaculate daughter...! Dr. P. Neelima 412

Dad - The light of my life and the beat of my heart! - Iva 413

Devipriya for me - Ignites, Inspires, and Instructs ! - Amith 414

ఊపిరిసలపని ఉద్వేగంతో.... దేవిప్రియ 415



సీతారామ్

# ఒక మహానదిని గురించి...

"నా రేపటి లోకం

ఈనాటి కల్పనలోనే

ఇమిడి ఉంది"

అని ఎంతో స్పష్టంగా దృక్పథ బలంతో గుర్తించిన కవి దేవిప్రియ. ఈ గుర్తించటంతోటే ఆగిపోకుండా నేటిదాకా రేపటి లోకం కోసం వర్తమాన కల్పనను కొనసాగిస్తూనే ఉన్నారు. ఒక అర్ధశతాబ్దంపాటు తెలుగు సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, సంగీతం, సినిమా, జర్నలిజం లాంటి నిత్య సవాళ్లు ఎదుర్కోవలసి వచ్చిన రంగాలలో సమున్నత సృజనశీల వ్యక్తిత్వాన్ని సముదాత్తంగా నిలుపుకున్న కవి దేవిప్రియగారే.

దేవిప్రియ గురించి సంక్షిప్తంగా చెప్పడం సాధ్యం కాదు. విస్తృతంగానే మాట్లాడాల్సి ఉంటుంది. ఆయన రాసిన 'అమ్మచెట్టు' కవిత్వంనుండి 'ఇం...కొకప్పుడు' దాకా నిర్మించి ఇచ్చిన రూపకాల రహదారులను, సామాజిక, రాజకీయ సంవేదనలను, కూర్చిపెట్టిన సిమిలీల సాగరాలను, వెలిగించి ఇచ్చిన దీప్తి చైతన్యాలను సతతమూ గుర్తుకు తెచ్చుకోవలసిందే. నిత్య పరిణామశీలమైన కాలగతిలో దేవిప్రియ కవిత్వం ఒక ప్రధానమైన పాయగాకాక ఒక మహానదిగా ప్రవహిస్తూ వచ్చిందన్న సంగతి ఇప్పుడిప్పుడే తెలుగు సాహిత్యం గ్రహించగలుగుతూ ఉన్నది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందనికాక నిజంగానే దేవిప్రియ రాసిన కవిత్వం పలువిధాల తెలుగు కవిత్వ వస్తు, రూప, దృక్పథ పరిణామ చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తున్నది.

తెలుగు సాహిత్యం లేదా కవిత్వరంగానికి ఒక వదలని జాడ్యం ఉంది. అదేమిటంటే ఏ కవినిగురించీ సమగ్రంగా విశ్లేషించుకోలేకపోవటం, స్థాన స్థితి గతులను కచ్చితంగా నిర్ధారించుకోలేకపోవటం. ఈ జాడ్యానికి దేవిప్రియకూడా బాధితమయ్యారు. తాను ప్రధానంగా పని చేసింది పత్రికారంగం అయినప్పటికీ, వివిధ





హోదాలలో ఎన్నో ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక పనులకు ఆద్యత్వం వహించినప్పటికీ తాను రాసిన కవిత్వం గురించి తెలుగు పాఠకలోకం లేదా తెలుగు సాహిత్యకులు ఏమనుకుంటున్నారనే విషయంపై దేవిప్రియ పెద్దగా దృష్టి పెట్టలేకపోయారు. కవిత్వం రాసి ఊరుకున్నారు, అంతే. ప్రతి ఒక్కరూ తెలుగు కవిత్వానికీ, సాహిత్యానికీ సరైన విమర్శ లేదు, విమర్శకులు లేరు అని అనేవారేకాని కవిత్వ గుణ,దోష,దృక్పథ విచార చర్చ చేసే ఆసక్తి ఉన్నవారు మాత్రం అరుదు. దేవిప్రియ కవిత్వానికి రావలసినంత ఖ్యాతి, దక్కవలసినంత గౌరవము దక్కలేదనే భావిస్తాను. దీనికి కారణం మరేమీ కాదు. సృజన చేయటమే తన పనిగా, ప్రప్రథమ కర్తవ్యంగా దేవిప్రియ భావించారు తప్ప మరొకటి తలవలేదు. తెలుగు కవిత్వానికి, సాహిత్యానికి ఏం కావాలో ఆలోచించి వాటిని సమకూర్చారు తప్ప, తన కవిత్వానికి ఏం కావాలన్నది దేవిప్రియగారికి పెద్దగా పట్టింపు ఉన్న విషయం కాదు.

ఈ బహుముఖను వెలువరిస్తున్న సందర్భంగా తెలుగుకు సహజమైన అనేక విశేషణాలతో దేవిప్రియగారిని రూపుకట్టవచ్చు. అయితే, బహుముఖమైన ఆయన మూర్తిత్వాన్ని ఆవిష్కరించడమే ఈ సంకలనం ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యసాధనలో భాగంగా వ్యాసకర్తల పేర్లు పునరావృతం అయినప్పటికీ 'దేవి-30 స్వరపత్రం 2002' నుంచి, అలాగే రన్నింగ్ కామెంటరీ సంపుటాలోంచీ కొన్ని రచనలను తీసుకున్నాం. ఈ సంకలనంలోని వ్యాసకర్తలందరికీ దేవిప్రియగారి వ్యక్తిత్వ, స్వభావాదుల గురించి ఒక మేరకు తెలుసు. అందుకే ఏ ఒక్కరుకూడా అటువంటి సాహసం చేయలేదు. దీనిలో తమ భావాలను వ్యక్తీకరించిన వారిలో ఎక్కువమందికి దేవిప్రియ గారితో సుదీర్ఘమైన స్నేహసంబంధం ఉంది. దేవిప్రియ గారిని బహుముఖ రంగాలలో వారి ప్రజ్ఞా ధురీణతను సన్నిహితంగా చూసినవారే ఉన్నారు. అందుకే ఈ సంకలనంలోని వ్యాసాల్లో ఒక ఆత్మీయ పరిమళం, సాన్నిహిత్యం సర్వత్రా కనిపిస్తాయి.

దేవిప్రియ బహుముఖ ప్రజ్ఞాశీలాన్ని, సృజనాత్మక సంవేదనాశీలతను, దేవిప్రియ నిబద్ధ, నిమగ్న సాహిత్య దృక్పథాన్ని సదిశలో అర్థం చేసుకొని అవగాహన పెంచుకోవడానికి ఈ వ్యాసాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

ఇక్కడే దేవిప్రియ సారస్వత కృషి గురించి ఒక్కమాట చెప్పాలి. సంపూర్ణమైన మానవుడిని, పరిపూర్ణమైన మానవ సమాజాన్ని ఆకాంక్షిస్తూ తన రెండు కళ్లను సూర్యచంద్రులుగా చేసి నిరీక్షించిన ఒక స్వాప్నికుడి అంతరంగ కథనం దేవిప్రియ కవనం.

భాషలో, భావనలో, ఊహలో, అభివ్యక్తిలో చివరకు దృక్పథ ప్రకటనలో ఒక సృజనాత్ముడైన కవి ఎంతటి పంతమూ, పట్టింపులతో ఉండాలో అంతే పట్టింపును ప్రదర్శించిన కవి దేవిప్రియ. ఒకానొక కవితలో దేవిప్రియ ఇలా అంటారు.





"నా పుట్టినరోజుదేముంది
ఒక కాడ్వెల్ తరువాత
ఒక శ్రీశ్రీ తరవాత
ఒక ప్రాణిగ్రాహి తరవాత
ఒక చెరబండరాజు తరవాత
ఒక శివసాగర్ తరవాత
పుట్టినవాణ్ణి నేను
ఎంతో వెనుకబడ్డవాణ్ణి నేను"

ఈ అందరి తరువాత తాను వెనకేం పడలేదు కాని, తెలుగు కవిత్వాన్ని ముందుకు నడపడానికి నిశ్శబ్దంగా పూనుకున్నారు. ఆ పనిని నిర్నిరోధంగా కొనసాగిస్తున్నారు. వెనుదిరిగిచూస్తే దేవిప్రియ ఈ నాలుగు దశాబ్దాల కాలంలో నాటిన మైలురాళ్లూ, మహాగమ్యాలు అన్నీ స్పష్టంగానే కనిపిస్తాయి. ఆ స్పష్టతనివ్వటం కోసమే ఈ బహుముఖ.....


*('బహుముఖ' సంపాదకవర్గం తరఫున)*

⚜

***కలలవలలో పడినట్టేపడి***
***కంటిఏటిలో కలిసిపోయిన ఊహచేప***
***దొరుకుతుందా మళ్ళీ చేతికి...***
***కో అంటే కోటి పదచిత్రాల పక్షులు***
***వచ్చి వాలతాయి కానీ, భుజం మీద,***
***వర్ణరహిత రూపరహిత గంధరహితమైన ఆ***
***భావన***
***సంభావన ఏ తపస్సుతో తిరిగి సిద్ధిస్తుంది..***
***అది యెట్లా మూర్తిమంత మవుతుంది ...!***

(ఝలక్ : గాలిరంగు)





న్యూఢిల్లీలో, 12 ఫిబ్రవరి 2018 న కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు
శ్రీ చంద్రశేఖర కంబార చేతుల మీదుగా 'గాలిరంగు'కి అవార్డును అందుకుంటున్న దేవిప్రియ.




*'గాలిరంగు' కవితా సంపుటికి సాహిత్య అకాడెమీ – 2017 పురస్కారం : ధన్యవాదాలు తెలుపుతూ, న్యూఢిల్లీలోని కమానీ ఆడిటోరియమ్‌లో దేవిప్రియ చేసిన ఆంగ్ల ప్రసంగం తెలుగు పాఠం.*

# గురువులనుంచి జ్ఞానం. ప్రజలనుంచి పాఠాలు.

గౌరవనీయులైన సాహిత్య అకాడమీ అధ్యక్షులు శ్రీ చంద్రశేఖర కంబార...
అకాడమీ కార్యదర్శి, నా ప్రియమైన సోదరుడు శ్రీ శ్రీనివాసరావు...
వేదికమీద ఉన్న ప్రముఖులకు...
సభలో ఆసీనులైన ఆలోచనాపరులందరికీ నా నమస్సులు...
ఈ మెత్తని అరిచేతులతో కలుక్కుమంటున్న నా మోకాళ్ళను అదుముకుంటూ, ఈ ఉత్తేజకరమైన మలుపు దగ్గర కాసేపు ఆగి గతాన్ని గుర్తు చేసుకుంటూవుంటే, నేను ఎంతోమందికి ఎన్నో విధాలుగా రుణపడి ఉన్నాననిపిస్తోంది. ప్రప్రథమంగా నాకు మా అమ్మ గుర్తుకు వస్తోంది. నిండుపున్నమి జాబిలుల వంటి పాలిండ్ల చనుబాలతో నా పసిదేహం ఆకలి తీర్చి.. నాకు కవిత్వాన్ని పట్టించిన మా అమ్మ. అమ్మా.. నువ్వు ఏ లోకం ఉన్నా? నీకు నా కృతజ్ఞతలు... ఇక, ఈ జీవితంలో ఇంతదూరం





ప్రయాణించానంటే దానికి కారణం నా అర్ధాంగి రాజ్యలక్ష్మి. ఆమే తోడుగా లేకుంటే నా ఈ ప్రయాణం ఇంతదాకా ఇలా సాగేది కాదు. దుఃఖిత హృదయంతో ఈ అవార్డును ఆమె అనంత జ్ఞాపకాలకు అంకితం చేస్తున్నాను. మా అబ్బాయి ఇవా, అమ్మాయి సమత, నా అభౌతిక పుత్రిక డాక్టర్ పి. నీలిమ, డాక్టర్ పాలేరు శ్రీనివాస్, నా ఆత్మబంధువుగా అందరూ భావించే ప్రఖ్యాతకవి కె. శివారెడ్డి, ఎస్.ఎమ్. మలిక్ భాయ్, నాకు అత్యంత ప్రియమైన తమ్ముడు ఖాదర్ మొహియుద్దీన్, వాసిరెడ్డి నవీన్, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కె. శ్రీనివాస్, మల్లేపల్లి లక్ష్మయ్య, నాళేశ్వరం శంకరం, బి. నర్సింగరావు, సిధారెడ్డి, వరవరరావు, బండ్ల మాధవరావు, విశ్వేశ్వరరావు, పెనుగొండ, శివశంకర్, యాకూబ్, రామతీర్థ, కృష్ణుడు.. వీళ్ళే కాకుండా నా మనసులో మెదులుతున్న మరికొంతమందికి ఈ సందర్భంగా ధన్య వాదాలు తెలియజేస్తున్నాను.

గుంటూరువంటి ఒక చిన్న పట్టణంలో, ఒక అతి సాధారణ పోలీసు కుటుంబంలో పుట్టిన నేను బాధలు, కష్టాలు, దోపిడి, పీడనలను భరిస్తున్న ప్రజలమధ్య పెరిగాను. రాజకీయాలు, సమాజాన్ని రకరకాలుగా విభజించే రాజకీయ, ఆర్థిక శక్తుల గురించి నాకప్పటికి యేమీ తెలియదు. దారిద్ర్యరేఖకు వెంట్రుకవాసి ఎగువన ఉన్న నేను నా కౌమార్యంలో, ఆ వయసులోని లక్షలాదిమంది పిల్లల్లాగే ఓ అద్భుతమైన కలల ప్రపంచంలో విహరించాను.

లెక్కకి మించిన నా పూర్వీకుల మసకబారిన జ్ఞాపకాలు నన్ను చరిత్ర భారంనుంచి విముక్తం చేశాయి. నా కలలను వెతుక్కుంటూ ముందుకు వెళ్ళిపోయే స్వేచ్ఛ నాకు దొరికింది. నాదైన సొంత గూడు నిర్మించుకునే అవకాశం దక్కింది. కాలక్రమంలో అదే నాకు 'రాజమహలు'గా మారింది. మొదట్లో కొత్త మోజులు, ఆకర్షణలు నన్నూ ఆవహించాయి. జీవితంలోనూ, నా తొలినాళ్ళ కవిత్వంలోనూ అవి ప్రతిఫలించాయి. సామాజిక అర్థ గతిని అర్థం చేసుకోవడానికి నాకు దాదాపు ఓ దశాబ్దం పట్టింది. ఒక నీటిసుడి విస్తరించి ప్రవాహంగా మారిన జీవితం నాది. ఈ అరుదైన సందర్భంలో.. నాలో ఎగసిపడుతున్న కొన్ని ఆలోచనలను మీతో పంచుకోవాలనిపిస్తోంది.

నా మూలాల గురించి చెప్పవలసివస్తే, నా పూర్వీకులది అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు. మహాభారతంలోని దాయాదుల పోరులాంటిది జరిగిన చరిత్రాత్మక యుద్ధక్షేత్రమైన పల్నాడు కృష్ణానదీ తీరంలోనే ఉన్నా, అది తడితాకక ఎండిపోయిన రాళ్ళూ రప్పల ప్రాంతం.



ఓ పట్నపు మంత్రసాని నా శిశుదేహానికంటిన రక్తపు మరకల్ని తుడిచి, వెచ్చని తువ్వాలులో చుట్టి... ఇంకా తెరుచుకోని నా కళ్ళల్లోకి చూస్తూ... 'ఇదిగో చూడు.. నీ కడుపున ఓ కవి పుట్టాడు' అని మా అమ్మ చేతిలో నన్ను పెట్టి ఉంటుంది.

నిలువునా ఆక్రమించే ఈ కవిత్వంతో ప్రేమలో పడిన నాటినుంచి దాదాపు నలభ య్యేళ్ళుగా నేను ఏ క్షణానా అందుకు చింతించింది లేదు. అలాగని, ప్రశాంతంగా ఉన్న క్షణమూ లేదు. నీలో అశాంతి లేకపోతే నువ్వు కవివి కానే కావు. నేను కవిత్వమై అభివ్యక్తమై దాదాపు పది సంపుటాలు వెలువరించడం వెనుక వెంటాడుతున్నది ఆ అశాంతే... ఆ సంఘర్షణే...

నాకు చిన్నప్పుడు బడిలో, ఆ తరువాత కాలేజీలో గొప్పగొప్ప అధ్యాపకులు తెలుగు వ్యాకరణాన్ని, ఛందస్సును, కొంత చరిత్రనూ బోధించారు. కానీ, జీవితంలోని అసలైన గొప్ప పాఠాలన్నీ నేను సమాజంనుంచీ, ప్రజలనుంచీ నేర్చుకున్నవే. ఈ నేలమీద రాజకీయం కానిదేదీ లేదని నేను తెలుసుకున్నాను. ప్రతి కావ్యం, ప్రతి పురాణం, ప్రతి పవిత్ర గ్రంథం... ఏదీ రాజకీయాలకు అతీతం కాదు.

ఒకవేళ దేవుడు ఉంటే, అది ఏ దేవుడైనా.. విష్ణువు, అల్లాహ్, క్రీస్తు లేదా బుద్ధుడు... పేరేదైనా కావచ్చు... దేవుడి పేరుమీద జరుగుతున్న హింస అంతా నిజానికి దేవుడికి వ్యతిరేకంగా జరుగుతున్న హింసే. శాంతిని ప్రేమించే, ప్రవచించే గొప్పగొప్ప దేవుళ్ళు అందరూ ఆయుధాలతో ఉంటారెందుకు అని నేను మా అమ్మను అడిగేవాణ్ణి. ఆ ప్రశ్న అడిగినందుకు మా నాన్న నన్ను ఎప్పటికీ క్షమించలేదు. కవిగా, మనిషిగా నాకు ఒక 'మతం' ఉంది. అదే స్వేచ్ఛ! పక్షులు ఆకాశంలో విహరించినట్టు, చేపలు నీటిలో ఈదినట్టు, జంతువులు భూమ్మీద సంచరించినట్టు, ఒక కవిగా నేను ప్రజల్లో ఉంటాను. నేను నా భారతదేశపు ప్రజల మనిషిని. నేను పుట్టిన దేశాన్ని ప్రేమించే స్వేచ్ఛ నాకు ఉండాలని నమ్ముతాను. ఏ కళ అయినా నైతిక విలువల్ని స్పృశించకపోతే అది కళే కాదు. దానివల్ల ఆశించిన మార్పు సాధ్యం కాదు. నేను ఎప్పుడూ ఒకటే నమ్ముతూ వచ్చాను. నా కవిత్వంకానీ, నా రచనలుకానీ ఈ దేశంలోని బలహీనులకీ, బాధాసర్పదష్టులకీ, ఓ ఆసరా ఇచ్చే ప్రయత్నం చేయాలి.

మనుషులు మనుషులను చంపుతున్నారు. వాళ్ళ 'దేవుళ్ళు' ఏమి చెప్పారన్నదీ... వేల ఏళ్ళుగా ప్రవక్తలు, ప్రబోధకులు ఏ విలువలు బోధించారన్నదేదీ వారికి పట్టదు. దయాగుణాన్ని మించిందిలేదనే అద్భుతమైన భారతీయతత్వం 'అనృశంస' .. ఇప్పుడు ఏ సింధూ నదిలో మునిగిపోయింది? ఏ గంగా ప్రవాహంలో కొట్టుకుపోయింది?



గింజను ఎవరు నాటారో వాళ్ళే దాని పంటను తినాలి అన్నాడు 18వ శతాబ్దపు సూఫీ మేధావి షా ఇనాయత్. ఫ్రెంచి విప్లవానికి చాలాముందే చెప్పిన మాట ఇది. ఇప్పటికీ మనం దీని గురించే కలలు కంటూ కవితలు రాస్తున్నాం. నాటకాలు, నవలలు రాస్తు న్నాం. కానీ, అందుకు భిన్నమైన వాస్తవాన్ని నిస్సహాయులమై చూస్తున్నాం.

నాది దృఢమైన మనసు కాకపోవచ్చు. నా సాహిత్యంపట్ల నాకు అలవిమాలిన గర్వం లేకపోవచ్చు. నా సాటి కవులలో కొందరికిఉన్న ధారణశక్తి నాకు లేకపోవచ్చు. కానీ, ఒక విషయం మాత్రం నేను బలంగా నమ్ముతున్నాను. మానవ విముక్తిని నేను నరనరానా కాంక్షిస్తున్నాను. అణచివేతకు గురైనవాడి స్వరాన్ని వినిపించడానికి నేను కట్టుబడి ఉన్నాను. అంతరాత్మను లెక్క చేయకుండా, మరణానంతర ఊహా ప్రపంచాలు, అభూత కల్పనల మోజులో కనుక మనం పడిపోతే రేపటి తరాలు ఒక పురా ఆటవిక భవిష్యత్తులోకి కళ్ళు తెరుస్తాయి. జైనయుగం తరువాత తమిళనాడులో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినందుకు చర్మం ఒలిచి వేలాడదీయబడిన వర్గాలకి పట్టినగతే ప్రశ్నించేవారికి ఇప్పుడూ పడుతుందనే భయాలు పెరుగు తున్నాయి. నిరంతర శోధనను ప్రేరేపించిన ఉపనిషత్తుల దేశంలో ఇలాంటి పరిస్థితులు, ఇప్పటికే సంఖ్య తరిగిపోతున్న భారతీయ జిజ్ఞాసువులను వెంటాడుతున్నాయి.

ఒక పద్ధతి ప్రకారం సాగుతున్న హింసాత్మక దాడుల పీడకలలు, సగం ఆకలితో, సగం నిద్రతో అలమటిస్తున్న ఈ దేశాన్ని కల్లోలపరచడం ఆగాలి.

వివేకవంతుల స్వరం బలంగా వినిపించకపోతే అరాచకశక్తుల గొంతులు పెరుగుతాయి.

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత దేశంలో అధిక సంఖ్యాక ప్రజలు ఇప్పటికీ, శతాబ్దాలుగా అనుభవించిన బాధలు, కష్టాలనే ఇంకా భరిస్తున్నారు. ఈ పరిస్థితులు మన సృజనాత్మక ప్రపంచాన్ని ప్రభావితం చేయలేకపోతే మనలో ఏదో పెద్ద లోపం ఉందనే అనుకోవాలి. వ్యవస్థ బాగానే ఉంది, మార్చవలసింది యేమీ లేదనుకోవడం కన్నా నిరర్థకమైన ధోరణి మరొకటి ఉండదు.

ప్రమాద ఘంటికలు మోగుతూనే ఉన్నాయి. ఖండాలూ, సముద్రాలూ దాటి అవి చెవుల్లో హోరెత్తుతూనే ఉన్నాయి. ఇది ఆలోచనాపరులందరూ కళ్ళు తెరవవలసిన సమయం. వారు తమతమ సౌకర్యవంతమైన క్షేత్రాల్లోంచి బయటకు వచ్చి, తమ పాదాల కింద జరుగుతున్న భూప్రకంపనలను స్పర్శించాలి.




భారత రాజ్యాంగంలోని ప్రవేశిక డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మనకు అందించిన



ప్రజాస్వామ్య పవిత్ర గ్రంధం. అది డొల్ల పదాల కలబోత కాదు. సాహిత్య రంగంలో ఉన్న సామాన్యులమైన మనం, సామాజికంగా వెనుకబడిన వర్గాలతో కలిసి రాజ్యాంగ స్ఫూర్తి అమలు అయ్యేందుకు కృషి చేయాలి. సమాజంపట్ల బాధ్యత కలిగిన ఒక కవిగా నేను ఈ దేశ నిర్మాణంలో రెక్కలు ముక్కలు చేసుకున్న ప్రజల చరిత్ర మాత్రమే బలంగా ఎలుగెత్తి చెప్పాలని ఆశిస్తాను. అంతేకానీ, అధికార దాహంతో, రాజ్య విస్తరణ కాంక్షతో రక్తపుటేరులు పారించిన చక్రవర్తులు, జహాపనాల చరిత్రను కీర్తించవలసిన పని నాకు లేదు. కవులుగా, రచయితలుగా మనం స్వప్నాల్ని ఆవిష్కరించడంతోపాటు వాటిని సాకారం చేసే దిశగా దేశ నిర్మాణానికి వినమ్రంగా ఇటుకలు అందించాలి. రేపటి మన పిల్లలందరూ హాయిగా బడికి వెళ్ళి చదువుకోగలిగే దేశనిర్మాణం జరగాలి. జబ్బులనుంచి విముక్తి కలిగించే ఆస్పత్రులు, చేయడానికి పని, తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, వేసుకోవడానికి బట్టలు ఉండాలి. అన్నింటికన్నా ముఖ్యంగా, ఆలోచించే స్వేచ్ఛ, భావ ప్రకటన హక్కు ఉండాలి. నేను స్వేచ్ఛకు ఇచ్చే నిర్వచనం ఇదే. అదే నా దృష్టిలో అసలైన భారతదేశం.

ధన్యవాదాలు.

*( ఆంగ్లంనుంచి అనువాదం  పసునూరు శ్రీధరబాబు )*





ఎ.బి.కె. ప్రసాద్

# ‘గాలిరంగు’ మీద ‘కామెంటరీ’

పాటనూ, మాటనూ మోసుకెళ్ళే శక్తికూడా గాలిదే. అంటే అన్యాయాలపైన, అక్రమాలపైన గళం విప్పగలిగే మనిషికి కావలసిన శక్తీ, ఇంధనమూ కూడా గాలిలోనే ఉన్నాయి. ఏటినీ నీటినీ నిలబెట్టేవాడికీ, నిప్పునికూడా నీటిలో మండించే వాడికీ, ఏనుగుని తొండంమీద నడిపించేవాడికీ, ఎవరెస్టు పర్వతాన్ని చపాతీలా చాప చుట్ట గలిగిన వాడికీ, నీవూ నేనూ ఎవరూ చేయలేని పనులు చేయడానికి సంకల్పించిన వాడికీ గాలికి రంగులద్దడం, ఆ రంగులను మనకు చూపడం పెద్ద పనా?

***‘నీ పెదవులు నీవి- మాట్లాడు/ నీ నాలుక నీది - మాట్లాడు***
***నిటారైన నీ శరీరం నీది-మాట్లాడు/ నీ ఆత్మ ఇప్పటికీ నీదే- మాట్లాడు మరి!***
***నీకున్న వ్యవధి స్వల్పకాలమే- అందుకే మాట్లాడవయ్యా!***
***సత్యం ఇంకా బతికే ఉంది- అందుకే చెప్పేసెయ్!***
***నీవేం చెప్పాలనుకున్నావో- అదంతా .....”***

*- ఫైజ్ అహ్మద్ ఫైజ్ (‘భారత ఉపఖండ చరిత్ర’ నుంచి)*

ఈ సందేశాన్నీ, ఈ ఉద్దీపననీ ఒంట పట్టించుకున్న, ఆధునిక తెలుగు కవితా క్షేత్రపు అగ్రశ్రేణి కవి దేవిప్రియ. ‘గాలిరంగు’ ఆయన సృజనే. ఈ కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం ఆలస్యమైందే కానీ, అబ్బురమైనదేమీ కాదు. స్వేచ్ఛాప్రియులు ఎవరైనా త్యాగనిరతిని వదులుకోలేరు. తమ బాధాతప్త హృదయాలకు దారిద్ర్యమే బహుమానంగా వచ్చినా వెనుదీయరు. అలాంటి వ్యక్తిత్వం దేవిప్రియ సొంతం. కవిత్వంమీద ఆయన ముద్ర అలాంటిదే. రాజకీయ, సామాజిక, ఆర్థిక, తాత్త్విక కారణాలెన్నింటినో ఈ కవి శ్వాసించాడు. వాటికి స్పందించాడు. తనదైన దృక్కోణాన్ని కోల్పోకుండా దేవిప్రియ చేసిన అక్షర చాలనమే ‘గాలిరంగు.’



దేవిప్రియ ఒకే కార్యక్షేత్రానికి పరిమితం కాలేదు. కవిత్వంతోపాటు కథ, పత్రికారచన, చలనచిత్రాలు, చిత్రానువాదం ఆయన కలానికి పరిచయాలే. నేను సంపాదకునిగా పనిచేసిన 'ఆంధ్రప్రభ', 'ఉదయం' దినపత్రికలలో తొలిసారి (1982 నుంచి) రాజకీయాలమీద నిత్య వ్యంగ్య వ్యాఖ్యాన ప్రక్రియను ప్రారంభించినవాడు దేవిప్రియ. అదే 'రన్నింగ్ కామెంటరీ.' దీనికి వ్యంగ్యచిత్రం కూడా తోడై తెలుగు పత్రికారంగంలో వినూత్న పోకడగా అవతరించింది. పరిశోధనాత్మక జర్నలిజానికి ఒజ్జబంతిగా అవతరించిన 'ఉదయం'లో 'సంతకాలు' శీర్షికనుకూడా దేవిప్రియ రమణీయంగా నిర్వహించాడు. తెలుగువారైన పలువురు ముస్లిం కవులకు ఆయన మార్గదర్శకుడు. ఈ కవులంతా 'వెతల మైదానంలో' జీవిస్తూకూడా తమ 'తనాన్ని', వ్యక్తిత్వాన్ని సమున్నతంగా నిలబెట్టుకున్నవారే. ఎంతగా ప్రణయ శృంగార కవిత్వానికి ఆకర్షితుడైనప్పటికీ గాలిబ్ ఒక జీవన సత్యాన్ని ఆవిష్కరించకుండా మాత్రం తప్పించుకోలేకపోయాడు. 'మనిషి బాధ చైతన్యానికి నిదర్శన'మని చెప్పాడాయన. మరో మహాకవి ఖలీల్ జిబ్రాన్ మానవాళి వ్యథార్త జీవిత యథార్థగాథను ఆవిష్కరిస్తూ ఇలా అన్నారు, 'మీ కోసం పాడాను కానీ మీరు నర్తించలేదు/ మీ ముందు రోదించాను కానీ మీరెవరూ స్పందించలేద'ని. ఇందుకు కారణం – 'స్పందించలేకపోవడానికి కారణం – మీ ఆత్మలు ఆకలి బాధతో విలవిలలాడడమూ, 'మీ హృదయాలు దాహంతో ఎండిపోవడమూ' తప్ప మరేమీ కాదంటారాయన. 'మానవ జీవితం మృత్యువుకన్నా బలహీనమైతే/ మృత్యువు సత్యానికన్నా బలహీనం కదా!' అన్న మహోన్నత కవి ఖలీల్ జిబ్రాన్. ఈ తాత్త్విక చింతనకు చెందిన దేవిప్రియ కవితా సంపుటి 'గాలిరంగు' కూడా ఆ కోవలోనే జీవన సత్యాలను విప్పిచెప్పింది. అసలు 'గాలిరంగు' అన్న పదబంధమే ఒక వైచిత్రి.

గాలికి వాసన సంగతేమో కానీ, రంగూ రుచీ ఉంటాయా! ఉంటాయనే అంటాడు దేవిప్రియ. ఎలా? మనిషి ఆయువు ప్రాణవాయువు. కానీ ప్రాణవాయువును పీల్చినవారంతా మనుషులుగా బతకడం లేదు. మనుషులుగా ఉండడం లేదు కూడా. మనిషితనాన్ని అడ్డంపెట్టుకుని అడ్డదారులలో జొరబడేవారూ ఉన్నారు. సుగంధాలనూ, దుర్గంధాలనూ గాలే మోసుకురాగలదు. శ్రేష్ఠమైన పైరగాలీ, దుర్భరమైన పడమటి గాలీ, కొండగాలీ, అడవిగాలీ కూడా నిజమే. పాటనూ, మాటనూ మోసుకొచ్చే శక్తికూడా గాలిదే. అంటే అన్యాయాలపైన, అక్రమాలపైన గళం విప్పగలిగే మనిషికి కావలసిన శక్తీ, ఇంధనమూ కూడా గాలిలోనే ఉన్నాయి. కాబట్టే గాలికీ రంగులు వేస్తానని ఈ కవి భావన. గాలికి అతడు వేసే రంగు ఎరుపా, తెలుపా, చిలకపచ్చా, ఆకుపచ్చా? ఆ రంగులు ఏవైనా, గాలిబ్ అన్నట్టు, 'మల్లెలు, గులాబీలు, చంపకవల్లులు పూస్తాయి. కానీ వసంతం రాకను ప్రకటించేవి రంగులే!" కానీ దేవిప్రియ 'గాలిరంగునైనా ఊహించగలనుగానీ/ రానున్న రేపటి రూపే చూపుకందడంలేద'ని ఆక్రోశించాడు.



ఎన్నో ఉత్ప్రేక్షలతో పేదవాడి బాధలను అక్షరబద్ధం చేసిన దేవిప్రియకి గాలి ఒక ప్రతీక. తన దేశ సామాన్య ప్రజాబాహుళ్యం డెబ్భయ్యేళ్ల తరువాత కూడా సాంఘిక, రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం అంగలారుస్తున్న విషాదాన్ని చూసి కుపితుడైన దేవిప్రియ ఒక ప్రశ్నను సంధించాడు: 'దేనికీ భయపడను/ జలపాతాల ధారలు పట్టుకుని/ఊగుతూ దూకుతూ అరణ్యాలు దాటినవాణ్ణి/ అల్లకల్లోలంగాఉన్న ఈ దేశంలో సముద్రాలకున్న సంవేదన (అలలకల్లోలం) కూడా/ మన పౌర మానవుడికి లేదెందుకు?" అని!

నిజమే, దేశంలో పౌరసమాజం ఎదగకుండా పాలకవర్గాలు రోజుకొక తీరున పౌర స్వేచ్ఛపైన, భావ ప్రకటనా స్వాతంత్ర్యంపైన, భిన్నాభిప్రాయ ప్రకటనలపైన యుద్ధం ప్రకటిస్తున్నాయి. అదేమంటే రాజద్రోహం అంటున్నాయి. 'క్షేమం అవిభాజ్యం అన్నందుకు జైళ్ళునోళ్లు తెరుస్తున్న' సమయంలో, పౌరసమాజం భీకరంగా విరుచుకు పడవలసిన రోజులివి. ఈ విషయాన్ని కనిపెట్టి ముందుగానే హెచ్చరించాడు 'గాలిరంగు' కవి: 'ప్రవక్తలు పారిపోతారు / స్వాప్నికులు సిలువలెక్కుతారు / నియంతలు త్యాగ పురుషుల వెనుక శరణు తీసుకుంటారు / రక్త పిపాసులు చేతిలో పుష్పగుచ్ఛాలతో తిరుగుతారు/ జాతి ఆకాంక్షలను కొందరు/ సముద్రాలకు ఆవల మర్రిచెట్టు తొర్రలలో దాచిపెడతారు/ పొలాల పురుగు మందు చావులూ/ ఆదివాసీ తిరుగుబాట్లదారులూ/ దగ్ధమవుతున్న అరణ్యాలూ, రగులుతున్న పర్వతశ్రేణులూ/ నవభారత నిర్మాణ నినాదాల కంటికి కనిపించవు/ వేదికలూ నివేదికల మధ్య/ ప్రశ్నలూ జవాబుల మధ్య నిరుపేద భారతం నలిగి నరకం అనుభవిస్తూ ఉంటుంది/ రామలీలా మైదానం ఒక్కటే/ జాతీయ ప్రత్యక్ష ప్రసారాల ప్రాధాన్యత అవుతుంది!' అంతేగాదు, 'మానవుడు ఎన్ని వైజ్ఞానిక విజయాలు సాధించినా, మాటలు నేర్చుకుని, లిపులు మార్చుకుని మరీ/ దేవుళ్లను సృష్టించుకున్నాం, నక్షత్రాలకు నామకరణం చేసి, గ్రహాలను విగ్రహాలుగా మార్చాం.../ కానీ, సోదరా! మనిషి మాలిన్యాన్ని ఇన్ని నులివెచ్చని కన్నీళ్లతో కడిగి శుభ్రం చేయలేక పోయాం' అంటాడు దేవిప్రియ. అతను త్యాగానికీ, రక్తానికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని 'అచరిత్ర' కవితలో బలంగా ఆవిష్కరించాడు:

'కురుక్షేత్ర రణరంగమైనా/ కల్వరిగిరి దారైనా/ కర్బలా మైదానమైనా/ రక్తం ఒక్కటే! సెల్యులార్ జైలు ఉరికొయ్యలకి వేలాడినా/ ఉగాండా అడవుల్లో తిరగబడి నేల కొరిగినా/ నల్లమల అరణ్యాలలో స్మారక స్తంభాలై నిలిచినా/ త్యాగం ఒక్కటే.../ అయినా ఎవడు నమోదు చేస్తున్నాడు/ తరతరాలుగా తడి ఆరకుండా మెరుస్తున్న/ నెత్తుటి బడబానలాల మూల చరిత్ర..? ఏ హోమరు, ఏ వాల్మీకి/ ఏ వ్యాసుడు/ ఏ కంబడు/ ఏ నన్నయ/ రాశాడు, రక్తబీజాలు చల్లుకుంటూ/ ఇతిహాస ఊసర క్షేత్రాలలో/ మందార పాదముద్రలు వదిలి వెళ్లిన జనవీరుల గాథ?"





ఎంత ఎత్తు ఎదిగినా బాల్యాన్ని మరచిపోనివాడు దేవిప్రియ దృష్టిలో ధన్యజీవి. తన కవిత్వంలో చిన్నతనం, పల్లెతనం, గ్రామీణ చిహ్నాలూ, ప్రతీకలూ, చిన్నచిన్న అనుభవాలు పదేపదే కనిపిస్తూండటానికి కారణం ఆ బాల్యమే. బహుశా అడివన్నా అతనికంత ఇష్టం. అయితే గార్డెన్ రెస్టారెంట్ చల్లగాలిని రుచి మరిగినవాడు, ఫ్యాన్ విసిరే చల్లగాలిలో శరీరాన్ని ఆరేసుకోవడానికి అలవాటు పడినవాడు 'అడివి'ని ఎలా ఇష్టపడగలడు? ఈ ప్రశ్నకు దేవీప్రియ ఇచ్చిన సమాధానం – నేటి అజ్ఞాత వీరులైన విప్లవకారుల గురించిన విస్పష్ట ప్రకటనే. ఎందుకంటే, రేపటి ఆకాశానికి ఈ రోజునే పూచిన సూర్య పుష్పానివని కీర్తిస్తూ–చెప్పదలచుకున్న సత్యాన్ని దేవిప్రియ విప్పాడు: ప్రజలకోసం విప్లవకారులు చేస్తున్న త్యాగాలను జ్ఞప్తికి తెచ్చుకుని 'నీ ముళ్ల ఒడిలో నా వాళ్లు విశ్రమించారు/ నీ చల్లని కనురెప్పల నీడలో/ నావాళ్లు సేదదీరారు/ నీ కొమ్మలే, నీ ఆకులే / నీ గాలులే సాక్షిగా/ నా వాళ్లు ఒరిగిపోయారు/ విల్లంబులూ, తుపాకులూ/ జారవిడిచారు/ అడివీ, నా అడివీ/ ఆ బాణాలు ఏరివుంచు/ ఆ ఆయుధాలు దాచివుంచు' అని రహస్యంగా సందేశమిస్తాడు. రైతుకూలీల, శ్రమజీవుల శరీరం నిత్యమూ శ్రమ సంగీతాన్ని వినిపిస్తూనే ఉంటుందంటాడు. అతనికి శబ్ద రహస్యం తెలుసు. తనను కమ్ముకున్న 'రెండు నిధుల్నీ, రెండు విధుల్నీ' కవి పేర్కొన్నాడు. 'నాలుక మీద కవిత్వం/ తలమీద దారిద్ర్యం' అనేవి రెండు నిధులట. 'కవిత్వ నిత్య నిబద్ధం/ దారిద్ర్య విముక్తి యుద్ధం' అనేవి రెండు విధులట!

ఆంధ్రజాతి, అదే తెలుగు జాతి ఆంధ్ర/సీమ/తెలంగాణగా మూడు ముక్కలు, మూడు చెక్కలవడాన్ని దేవిప్రియ అదే 'తెలుగు శాసనం'గా పేర్కొంటూ 'పొలంగట్లు మారాయి/ పెత్తందార్లు మారారు' (గాలిరంగు) తప్ప శ్రమ జీవులైన రైతు, కూలీల నసీబులు మాత్రం మారలేదని ఆ 'శాసనం'లో చిత్రించాడు. మళ్లీ ఒక హంసపాదు పెట్టుకుని, పోనీలే 'ఉద్వేగమో, ఉద్రేకమో చాలదని తేలింది' కదా, "భాషకంటే బల మైనదొకటి శాసిస్తోందికదా నీ ఊపిరిని / ఏ ఒడ్డున ఎవరు నిలబడినా / మనిషి తోటిమనిషి కోసం పోరాడనీ/ తెలుగు పలుకు/ తెలుగు లిపి/ సజీవ మానవ మహా శాసనం మీద చిరస్థాయిగా నిలిచిపోనీ' అని దేవిప్రియ జాతి విశాల ప్రయోజనాల దృష్ట్యా రాజీమార్గం ఎంచుకున్నాడు. ఏది ఎలా ఉన్నా, కళింగ యుద్ధానంతరం శాంతి మార్గాన్ని ఎంచుకుని బౌద్ధధర్మాన్ని పాటించడానికి సిద్ధమైన అశోకుడిని 'దేవానాం ప్రియ' (దేవతల ఆశీస్సులు పొందినవాడా) అని సంబోధించినట్టుగా మనం, సహమానవులైన ప్రగతిశీల సారస్వతీయుల అభినందనలు అందుకుంటున్నందుకు 'మానవానాంప్రియ– దేవిప్రియ' అని ఆశీరాక్షతలు చల్లుదాం!

*(దేవిప్రియకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించిన సందర్భంగా)*

*సాక్షి, డిసెంబర్ 26, 2017*



వరవరరావు

# 'ఇం...కొకప్పుడు' కవి ఆత్మకథ

దేవిప్రియ 'ఇం...కొకప్పుడు – ఇప్పటి కవిత్వం' ఆయన ఆత్మకథ. స్వీయ చరిత్ర అనవచ్చుకానీ అందులో వేదాంత చర్చ (స్థవనీయ సృష్టి, పేజి 87 అగ్నిశంశ్య, పేజి 102 వంటివి) కూడ ఉంది. కనుక కాసేపు అట్లాగే చూద్దాం. వేదాంతం ఉంది. వైదికం కాదు. వేద అంతం. తెలుసుకోవాల్సింది తెలిసిన దగ్గరికి చాలునన్న తృప్తి. జీవితం అర్థమైందన్న తృప్తి. దర్భశయనం శ్రీనివాసాచార్య విపుల అవతారికలో ఆయనను 'అపురూపధ్యాని' అన్నాడు. 'పైగంబరకవి'గా ప్రారంభమై మళ్లీ పరిణత పైగంబరుడుగా రూపొందిన ప్రయాణం దేవిప్రియది.

'ఒక్కోసారి, నాలోపలి ఈ రీవైండ్–పాజ్–ప్లే–బటన్‌లు లేకపోయినట్టయితే యేమైవుండేదా అని ఆశ్చర్యపోతుంటాను. అప్పుడప్పుడు, నేనిప్పుడిప్పుడు అరణ్యాలలో, ఆకాశాలలో, సముద్రగర్భాలలో, పాతాళమార్గాలలో ప్రయాణిస్తున్నాననిపిస్తుంది. నా సహజ జీవన చేతనలో శాశ్వత ద్వైదీభావన సంశయమేమీ నేను అనుభవించడం లేదా అంటే, లేదని చెప్పలేను. ఒక అనియంత్రిత మధనక్రియ యేదో లోలోపల జరుగుతున్నట్టు నాకు లీలగా స్ఫురిస్తుంది. అది ఆత్మదర్శనమో, ఆత్మావిష్కరణమో, అంతరాత్మతో ఆగి ఆగి జరుగుతున్న నిరంతర సంభాషణమో.'

అరవై ఆరేళ్ల జీవితంలో అందరు కష్టజీవుల బతుకుల వలెనే ఆయన ఆత్మకథ 'ఒక ఎండ కథ' – పేజి 141 (మరుపురానివి కొన్ని, పేజి 119 అరవై అయిదు, పేజి 122)గా ప్రారంభమైంది. జాషువా తాత్విక ఎత్తుగడతో తన కథ చెప్పడం ఇట్లా ప్రారంభిస్తాడు.

*ఈ ఎండలోనే కదా*
*లేలేత చర్మం ఎర్రగా కందిపోతుంటే నేను*
*వినుకొండ చెట్లమీద కోతి కొమ్మచ్చి లాడింది.*



అమ్మ ఏడుపు చూడలేక తప్పిపోయిన తమ గేదె కోసం తాడికొండనుంచి నంబూరుదాకా సుతిమెత్తని అరికాళ్లతో చెప్పులు లేకుండా తిరిగి గాలించింది.

*ఈ ఎండలోనే కదా*
*నాన్న నాకు వదిలేసిన ఇంగ్లండు ర్యాలీ సైకిల్ మీద*
*గుంటూరు హిందూ కాలేజీ హైస్కూలుకి*
*చెమటలు కారుతూ చక్కర్లు కొట్టింది*

*ఈ ఎండలోనే కదా*
*లేమల్లె పొగాకు కంపెనీలో నుదురు తుడుచుకునే*
*తీరికకూడా లేకుండా బేళ్ల తూకం లెక్కలు రాసింది*

.... వంద రూపాయల జీతం కోసం వేకువనే లేచి ఆర్‌టిసి బస్సులో హైదరాబాద్ నుంచి సదాశివపేట బస్టాండు నిర్మాణ స్థలానికి అర్థాకలితో వగర్చుకుంటూ వెళ్లి వచ్చింది.

మద్రాసు పాండీ బజారులో పస్తులతో కలిసి పాడుకుంటూ పాదయాత్రలు చేసింది.

ఎయిర్ కండీషనర్లూ, ఎడతెగని విమానయానాలూ తన బతుకులో ప్రవేశించ డానికి ముందు ఎండలో మెరిసే నీడలలో మెదిలే జనం మధ్యనే బతుకు పోరును అభ్యాసం చేశాడు దేవిప్రియ. జర్నలిజం దాహంతో తాడిశెట్టి ఆంజనేయులు ప్రెస్ చుట్టూ కాలేజీ ఎగగొట్టి కాలినడకన ప్రదక్షిణలు చేశాడు. కవిత్వ సభల సందడిలో పడి పరీక్ష మానేసి విజయవాడ వెళ్లి శ్రీశ్రీతో కరచాలనం చేసి వచ్చాడు.

పసిపిల్లలకి పిడికెడు మెతుకుల కోసం మూసీ నగరంలో సొమ్మసిల్లుతూ వెతుకు లాడాడు. విలువల కోసం ఆయాచిత భద్ర జీవితకలశాలను కాలదన్ని ముళ్ల కిరీటాలను స్వచ్ఛందంగా ధరించి సగర్వంగా తిరిగాడు. ధిక్కారాన్నీ ప్రశ్ననీ కౌగిలించు కుని బానిససౌఖ్యాలమీద తిరగబడ్డాడు. తన షరతులమీద తాను బతకడానికి పలు విద్యల ఇంద్రచాపాన్ని ఎక్కుపెట్టి ఒక లోకనీతిని సవాల్ చేసి నిలిచాడు.

తొలుత సినిమా రంగంలో అనిశెట్టి సుబ్బారావు దగ్గర కొంతకాలం పని చేయడంతో ప్రారంభించి జర్నలిజంలో స్థిరపడ్డాడు. ఎమర్జెన్సీలో 'ప్రజాతంత్ర'లో కవిత్వం పేజీ కోసం, శ్రీశ్రీ, 'అనంతం', కమలాదాసు జీవిత చరిత్ర కోసం ఎడిటర్‌గా ఆయన గుర్తుండిపోతాడు. అంతే ఇదిగా తెలుగు దినపత్రికల ముఖపత్రం దిగువన ఆయన ప్రవేశపెట్టి రెండున్నర దశాబ్దాలు నిర్వహించిన రాజకీయ వ్యాఖ్యానం 'రన్నింగ్ కామెంటరీ' దేవిప్రియ ట్రేడ్‌మార్క్‌గా నిలిచిపోతుంది.



జర్నలిజంలో ఎంత ముద్ర వేసాడో సినిమా స్క్రీన్‌ప్లేలలో 'దాసి', 'రంగుల కల' వంటి సినిమాలతో అంత ప్రభావం వేసాడు. ఆయన 'తుఫాను తుమ్మెద'గా పిలుచుకునే ప్రజాగాయకుడు గద్దర్‌పై తొలి పూర్తి నిడివి ఆంగ్ల డాక్యుమెంటరీ చిత్రం 'మ్యూజిక్ ఆఫ్ ది బ్యాటిల్‌షిప్' నిర్మించి దర్శకత్వం వహించాడు. 'హైదరాబాద్ మిర్రర్' అనే పత్రికకు వ్యవస్థాపక ప్రధాన సంపాదకుడుగా, డైరెక్టర్‌గా ఇస్లామిక్ స్టడీస్ మల్లిక్ భాయ్ సహకారంతో పని చేసాడు. హెచ్‌ఎంటివి సీనియర్ ఎడిటర్‌గా, 10-టి.వి.లో కన్సల్టింగ్ ఎడిటర్‌గా వ్యవహరించాడు. అడ్వర్టయిజింగ్ సంస్థలోకూడా క్రియేటివ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించాడు. ఎన్నికల నిర్వహణాధికారిగా పనిచేసిన కె.జె. రావు జీవితకథను 'కోబ్రా డ్యాన్సర్' అనే పేరుతో ఇంగ్లీషులో రాసాడు. గురజాడ పుత్తడిబొమ్మ పూర్ణమ్మను – పూర్ణమ్మ, ది గోల్డెన్ డాల్ అని ఇంగ్లీషు చేసాడు.

వేదన, ఆర్తి, అనుభూతి, సమాజంపట్ల ఆశావహమైన కన్‌సర్న్, సమాజ చలనాలపట్ల నిశిత పరిశీలన, పురోగామి దృక్పథం ఉన్న కవిగా సామాజిక, రాజకీయ వ్యాఖ్యాతకూడ కనుక ఆయన సమాజానంద స్వామి, గరీబు గీతాలు, ఇన్నా అల్లాహ్, రన్నింగ్ కామెంటరీ మూడు సంపుటాల వ్యంగ్య కవితలుకూడా ప్రచురించాడు. మనిషిని చూస్తే మాత్రం మనిషి కోసం తపించే తాత్విక స్వభావంఉన్న, మాటలు కొరవడే సుతి మెత్తనితనం కనిపిస్తుంది.

ఈ వ్యాపకాలు, ఈ వృత్తి, ప్రవృత్తులతో పాటు ఇంచుమించు హైదరాబాద్, అల్వాల్ రాచకొండ టవర్స్‌లో తన 'అమ్మచెట్టు'లో స్థిరపడిన జీవితంలో ఒక పెద్ద కుదుపు వచ్చింది. ఆయన జీవన సహచరి, ఆయనకు అత్యంత ప్రియమైన 'రాజీ' 2014లో తీవ్ర అనారోగ్యానికి గురయి, దాదాపు రెండు నెలలు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో జీవన్మరణ పోరాటం చేసి సెప్టెంబర్ 9న కన్నుమూసింది.

*రెండు శ్వాసల్లో*
*ఒకటి లేకుండా బతకడం ఎలా అనిపించింది.*

ఉన్నట్టుండి అంతా మారిపోయినట్లనిపించింది.

*పిడికిట పట్టి పరుగెత్తుకు వచ్చిన వెలుతురు*
*కింద జారిపోయి చీకటిలో కలిసిపోయినట్టు*

అనిపించింది.

*నాలోంచి నన్నెవరో బయటికి నెట్టి*
*లోలోన అంతా ఆక్రమించుకున్నట్టు...*

అనిపించింది.

*ఒంటరితనం ఒక్కటే*
*తోకమీద నిలుచుని బుసలుకొడుతున్న పాములా*
*చుట్టలు చుట్టలుగా అంతటా ఆక్రమిస్తున్నట్టు*

కూడ అనిపించింది.

*ఈ దిగులు*
*భూమికన్నా బరువు*
*ఈ వగపు*
*ఏటికన్నా లోతు*
*ఈ కోత*
*కత్తికన్నా పదును*
*ఈ అదను*
*క్షణం కన్నా*
*కురుచ...*

ఇన్ని పక్షులమధ్య ఒక పిట్టపిల్ల ఏకాంత కువకువ... ఇన్ని మబ్బుల నడుమ ఒక మబ్బుతునక ఒంటరి మెలకువ.

ఈ మెలకువనుంచి దేవిప్రియ 'ఇప్పటి కవిత్వం' వచ్చింది. 'వెయ్యి వయొలిన్ల విశ్వవాద్యగోష్ఠి ముగిసిన తరువాత ఖాళీ అయిన ఆవరణలో ప్రగాఢ నిశ్శబ్దం తన శేషయాత్ర అనిపించింది. కానీ 'క్రితంకీ తరువాతకీ మధ్య రుధిర పాదముద్రల ప్రయాణం' దీర్ఘపోరాటంగా ఎంచుకున్నాడు.

దేవిప్రియ నిశ్శబ్ద నిఘంటువులో చిక్కుబడిపోయినపుడు వెలువడిన శబ్దమే కవిత్వం. ఆ స్థితిలోనూ ఆయన 'మూగచీకటి'లో 'ఎండపాము'వంటి పదబంధాలు రచించాడు.

ఆయన 'రాజీ'కి రాసిన కవితలో ఒప్పుకున్నాడు;
సగం తెరిచిన 'అమ్మచెట్టు' తలుపు వెనుకనుంచి...
తల బయటికి పెట్టి....'
*'నీ వియోగంలో విలపిస్తున్న నా కన్నీళ్లు తుడవడానికి*
*సమాధిని బద్దలు కొట్టుకుని నువ్వు*





అనుక్షణం నా అక్షరాల రెక్కలతో ఎగిరి వస్తున్నట్టు...!'

'అమ్మచెట్టు' అల్వాల్‌లో దేవిప్రియ అపార్టుమెంటు పేరుకూడా.
దేవిప్రియ 'లక్ష్యగానం'లో తన ప్రాపంచిక దృక్పధాన్ని ప్రకటించుకున్నాడు.

*నాకు*
*ఆస్ట్రేలియా అబోరిజినుల*
*ఆదిమూలాలు కావాలి*
*దండకారణ్య సంతాన సంకేతాల*
*అంబుల పదునూ కావాలి*
*నాకు కరాచీ భూగర్భ మురుగు సొరంగాలలో మునకలేస్తున్న*
*నిరుపేద ముస్లింల విముక్తి కావాలి*
*స్వాతంత్ర్యం సాక్షిగా ఇంకా*
*తలమీద మానవ మలం మోస్తున్న*
*అణగారిన భారత హైందవ సంతానం*
*కళ్లనిండా ఆత్మగౌరవ ఆనందమూ కావాలి*

అది కరాచీ భూగర్భమే కానక్కర్లేదనుకుంటాను–అహ్మదాబాదు, హైదరాబాదు లలోని ఘట్టాలను గురించికూడా మాట్లాడాలి. మానవ మలం మోసే అంటరాని వాళ్ళు మాత్రం హైందవ సంతానమే.

*నాకు*
*సకల జనుల సమస్త జాతుల*
*శాంతీ కావాలి*
*శాంతి కోసం*
*అనివార్యంగా జరిగే*
*యుద్ధమూ కావాలి,*
*ఎందుకంటే*
*నాకు అంతిమంగా*
*విరగపండిన చేను మధ్యలో*
*మంచె మీద నిలువెత్తున నిలబడి*
*రివ్వున వడిసెల తిప్పుతున్న*
*మనిషి కావాలి.*



విముక్తి గురించి అందరికన్నా ముందు డెబ్భై ఏళ్లుగా విముక్తి కోసం పోరాడుతున్న పాలస్తీనియన్లు, కశ్మీరీల గురించి మాట్లాడాల్సి ఉంటుంది.

తనకు కావాల్సింది నలుగురితో కలిసి సాధించడానికి తన అవగాహనతో తానేం చేస్తాడో చెప్తాడు.

*గతం ఒక నాదం*
*వర్తమానం ఒక శృతి*
*భవిష్యత్తు ఒక రాగం*
*మూడు స్వరాలనూ ఆలపించి అన్ని కలలూ రచించి వచ్చాను*

'ఒక చలిరాత్రి'లో స్పష్టంగా దండకారణ్య గెరిల్లాలపట్ల గౌరవాన్ని ప్రకటిస్తాడు.

*మంచు తడిసిన అరణ్యాల చలిలో*
*ముడుచుకున్న హరిత వృక్ష మండపాల కింద*
*ప్లాస్టిక్ గుడారాలలో*
*చల్లబడిన తుపాకులను కవోష్ణంగా*
*కౌగలించుకుని అరుణ నక్షత్ర మండలాలని*
*సృష్టిస్తున్న నిరాశ తెలియని వీరుల*
*సుదూర గమ్యం కళ్లముందు కదలాడినప్పుడు*
*పొర్లాడినా నిద్ర రాదు, రెప్పలు అతుక్కుపోవు అంటాడు.*
*పాఠం వినడమే తప్ప ప్రశ్నలడగడం నేర్పని సమూహంలో*
*యుగయుగాల నియంత్రిత యోచనల చీకట్లలో*
*నెగళ్లు వెలిగించడం నేరమవుతున్న సమాజంలో*
*దేశపు సరిహద్దుల లోపలే మన భద్రతా బలగాలు*
*మనతోనే నిత్య ప్రత్యక్ష యుద్ధానికి దిగుతున్న సందర్భంలో*
*కలవరపడుతున్న కళ్లకి, ప్రశ్నలు గుచ్చుకుంటున్న*
*కళ్లకి నిద్ర యెలా పడుతుంది యే రుతువులోనైనా*

అని తన వర్గ దృక్పథాన్నికూడా దాచుకోకుండా చెప్తాడు.

'తుది' అనే కవితలో

*అల్లకల్లోలంగా వున్న*
*ఈ దేశంలో సముద్రాలకున్న సంవేదన కూడా*
*పౌర మానవుడికి లేదెందుకని*





వేదాలు అపౌరుషేయాలేమీ కాదు, పురుషస్వామ్య భావజాలంతో కూడిన పౌరుషేయాలేనని చెప్తూ మోడిత్వ ఫాసిజపు 'ఏకీభవించని పీకనొక్కే' స్థితిని 'భస్మ వాటిక'లో చిత్రిస్తాడు.

*జీవితాశ వెలుగులు వెదజల్లుతూ మసలే*
*రచయితల పలుకుల్లో*
*ఈ నైరాశ్య నిస్పృహల నిప్పు కణికలేమిటి?*
*సామాజిక వివక్షతో పోరాడేవాళ్లు*
*నేడిలా విషవర్షధారలలో*
*తడిసి అడుగులు జారే దుస్థితి ఎందుకు?*

దేవిప్రియ(కవిత్వం)లో నాకు కొరుకుడు పడనివీ, మింగుడు పడనివీ లేవని కాదు. వర్గదృష్టికి వెలుపల అన్నింటా మంచినీ, సామరస్యాన్నీ చూసే దృష్టిని విశాల మైందీ అని అనలేం. మైదానప్రాంతాల్లో, నగరాల్లో, విద్యాలయాల్లో తనవంటి కవుల మధ్యకూడా విప్లవం మ్యూజిక్ ఆఫ్ బ్యాటిల్‌షిప్‌గా ఉన్నప్పటి  ఉత్సాహం ఇప్పుడు కోల్పోవడానికి బాధ్యత పూర్తిగా ఉద్యమానిదే కాదు. ఎందుకంటే ఇప్పుడు వినిపిస్తున్నది విరామ సంగీతం కాదని ఆయన కవితల్లోంచే దండకారణ్య కవి సమయాలను నేను ప్రస్తావించాను.

నిన్న గ్రామాలకు తరలి రాడికల్స్‌తోపాటు భూకంపం సృష్టించిన పల్లెపల్లెకు పాట ఇవ్వాళ పార్లమెంటుకు బాటగా మారవచ్చు. దండకారణ్యంలో ముప్పైఏళ్ల సాంస్కృతికోద్యమ చరిత్ర రచించుకున్న చేతనా నాట్యమంచ్ – సాంస్కృతికోద్యమాన్ని 'ప్రజాయుద్ధపల్లవి' అని ఒక ప్రజాప్రత్యామ్నాయ ఉపశీర్షిక పెట్టింది. పదివేల సాంస్కృ తిక కార్యకర్తల సభ్యత్వంతో అక్కడ ఏభై ఏళ్ల నక్సల్బరీ వార్షికోత్సవాలను ఏభై వేల మందితో జరుపుకున్నారు – జనతన సర్కార్, పీపుల్స్ మిలీషియా, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం పర్యవేక్షణలో...

*అక్కడ*
*దిక్కులు పిక్కటిల్లిన తప్పెటలున్నాయి*
*గిరులు తరులలో గుక్క తిప్పుకోకుండా*
*గింగిరాలు తిరిగిన నినాదాలున్నాయి*
*పరిసర భూములన్నీ*
*లయబద్ధంగా ప్రకంపించిన*
*గజ్జెల కాళ్ల పరివర్తనలున్నాయి*
*రుతువుల మధ్య రేఖలు చెరిపేసి*



*రేయింబవళ్లని ఏకం చేసిన ఆ సారించిన నారి*

*ఫెళ ఫెళ శబ్దాలు!*

*విని, అవి*

*అరణ్యాల మీదుగా మైదాన భూములలోకి*

*పెనుగాలులుగా వీచి ఆకాశ హర్మ్యాలని*

*గడ్డిపోచలలా అల్లాడించిన*

*అంతర్గత పెను ప్రమాదాలని* ప్రకటించి నిన్నటి ప్రధాని గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలమీద యుద్ధమే ప్రకటించాడు. ఈనాటి ప్రధాని బస్తర్‌లో 'ఆపరేషన్ ప్రహార్' అని, ఒరిస్సాలో హంటింగ్ మావోయిస్టు మిషన్ అని, ఎఒబిలో ఆల్ అవుట్ వార్ అని, దేశవ్యాప్తంగా 'సమాధాన్' అని ప్రకటించి అమెరికా, ఇజ్రాయెల్‌లను తోడు తెచ్చుకొని దాడి చేస్తున్నాడు.

ఔను నిజమే. అక్కడి వర్గపోరాటం నిన్నటివలె శత్రువు బలహీనంగా ఉన్న చోట దెబ్బకొట్టి తప్పుకునే గెరిల్లా యుద్ధతంత్రమే కాదు, చలనయుద్ధ స్థాయికెదిగింది.

*ఇరు పక్షాల సైనికులూ తలపడుతున్నారు.*

ఎర్రంచు నల్లగొంగళ్లను ఇప్పుడక్కడ చూడవచ్చు. వాటితోపాటు ఇవ్వాళ సాయుధ సాంస్కృతిక సైన్యం ఆలివ్‌గ్రీన్ దుస్తులు, ఆయుధాలు, ప్రజాగీతాల ఆలాపనలు భుజాలపై – కిట్లలో, పెదవులపై పాటలలో మోస్తున్నారు.

ఇటీవలనే ఆంధ్ర–ఒరిస్సా సరిహద్దు రామగూడ అడవిలో ఇదివరకెన్నడూ దేశంలో జరుగనంత పెద్ద ఎన్‌కౌంటర్‌లో విప్లవ నాయకులు, ఆదివాసీలు – ఎక్కువగా మహిళలు అమరులయ్యారు. ప్రజాసాంస్కృతిక యోధుడు పి.కె.ఎం. ప్రభాకర్ అమరుడయ్యాడు.

ప్రజాయుద్ధ నౌక గాయపడింది. అనేకమంది ఈదివచ్చి, తీరంలో లంగరు వేసి, విప్లవోద్యమం అక్కడ శత్రువుపై ఆంబుష్ నిర్వహించింది. ప్రజావిప్లవ కౌన్సిళ్లు నెలకొల్పి వ్యవసాయం చేస్తున్నది. వ్యవసాయ విప్లవం చేస్తున్నది.

*'కాలం ఆలపిస్తోంది విను*

*ఒక అజ్ఞాత స్వరంలో*

*పరిచిత యుద్ధ గీతాన్ని'....*

యుద్ధ విరామంలో గీతాలుంటాయి. యుద్ధ విరామ గీతాలుండవు.

మనకు అపరిచిత స్వరమే కావచ్చు కానీ ప్రజలకు కాదని దేవిప్రియకు తెలుసు. 'ఇంకొకప్పుడు' సభలో ఈ అవిరామ గీతాన్ని దేవిప్రియతోనే కాదు 'గ్యాలక్సీ ఆఫ్ కవుల'తో పంచుకున్నాను కూడ.





కె. శివారెడ్డి

# "కవిత ఉంది, వింటావా?"

"Every genuine art is necessarily radical since it cuts through & penetrates the sheet of trivalisation that enveloped everyday life."

*- A. R. Magno*

**నా**కు కవిత్వమెప్పుడూ బార్బుడ్‌వైర్ (ముళ్లతీగ) మీద పచ్చగా అల్లుకుంటున్న బచ్చలాకుతీగలా కన్పిస్తుంది. ఒకపక్క కొత్తగా మొలుస్తున్న లేతాకులూ, మరోపక్క పండి, ఒత్తితే సిరాముద్దలైపోయి, వేళ్ళకు అక్షరాలంటుకుపోయే కాయలూ – అదీ కవిత్వం.

ఎప్పుడూ ముళ్ళతీగను ఆధారం చేసుకుని పాకాల్సిందే. ముందుకు సాగాల్సిందే. ప్రతికవీ ముళ్ళతీగమీద అల్లుకుంటున్నాడు. ముళ్ళతీగమీద పడుకుంటున్నాడు. ప్రతికవి స్పృహలో ముళ్ళతీగ ఒక భాగమైపోయింది. ముళ్ళతీగమీద పచ్చనాకుల్తో పాకే తీగ కవిత్వం. సూర్యుణ్ణి పట్టి గర్భంలో యిముడ్చుకుని పచ్చగా నవ్వే ఆకు కవిత్వం.

దేవిప్రియ పైకి కన్పించేంత తృప్తిగా లోన ఉండదు. అతని కవిత్వం వెచ్చగా తగుల్తుంది. గట్టిగా వత్తితే ముళ్ళు గుచ్చుకుని మనచేతుల్లో రక్తం విత్తనాల్లా మొలుస్తుంది. ఒక అశాంతి అంతర్లయగా నడుస్తుంది. పైకి యింత నిండుగాఉండే మనిషిలో ఇంత agony వుందా, యింత అసంతృప్తి అగ్నివుందా అన్పిస్తుంది. అతని పద్యాలు చదవండి. చదివింతర్వాత సుఖంగా వుండలేం. ఒక 'అనీజీనెస్' పాములా కదుల్తూ వుంటుంది. ఎవ్వరూ దించుతారన్న ఆశ లేకుండా, బరువును మోస్తున్నట్టు వుంటుంది.

సారాంశంలో దేవిప్రియ ప్రజలకి సంబంధించిన కవి. ఇది అతని 'సమాజానందస్వామి'లోనూ, 'రన్నింగ్ కామెంటరీ'లోనూ, 'అమ్మచెట్టు'లోనూ చూడవచ్చు. యూరప్ పరిణామాలమీద ఆక్రోశించినా, 'వడ్రంగిపిట్ట'కి సమాధానం చెప్పినా, 'డబ్బు'



సర్వవ్యాపకత్వాన్ని గురించి మాట్లాడినా, నగరం నడివీధిలో తిరుగుతున్నా, ఆఫీసులో కుర్చీలో కూర్చున్నా, అతని ఆత్మ ఒక సామూహిక చేతనతో అనుసంధానం చేసుకునే వుంటుంది.

అట్టడుగునుంచి వచ్చినవాడు, దారిద్ర్యం క్షోభ తెలిసినవాడు. కళకి నిజమైన మూలాలు ఎక్కడున్నాయో అతనికి తెలుసు. 'బతుకుతడి' యింకా ఆరిపోనివాడు. మధ్యలో ఆగిపోకుండా చివరిదాకా రాయగల విద్యుత్తు వున్నవాడు. అతని కవిత్వం ఎవ్వరినీ తికమక పెట్టదు. చాలా స్పష్టంగా, సూటిగా, హాయిగా వుంటుంది. నిర్మలమైన నీరులా వుంటుంది. పైనుంచి పోస్తుంటే పారదర్శకంగా కనిపిస్తుంది. అస్పష్టతలకి, సంక్లిష్టతలకి అతని కవిత్వం చాలా దూరం. చాలా స్వచ్ఛంగా, సారళ్యంగా కదుల్తూ వుంటుంది.

సునాయాసంగా పలకటం, ఆడంబరంగాని అలంకారికతో అలరించటం. క్రోధం అతని అక్షరాలకంటుకుని, రాత్రిపూట మెరిసే రేడియంలా వుంటుంది. కట్టలు తెంచుకు ప్రవహించే ఉద్రేకం గాదు అతనిది. అంతర్లీనంగా వుండి, అతని చెప్పుచేతల్లో వుంటుంది. పద్యంమీద 'అదుపు'వున్న కవి.

మనమంతా పల్లెల్లోవుంటే ఎలాంటి కవిత్వం రాసేవాళ్ళమో తెలియదు. పల్లెల్లో పుట్టి పెరిగి, ఉదరపోషణార్థం నగరాల్లో నివసిస్తూ, పల్లెల్ని మరిచిపోకుండా వున్న వాళ్ళు, పల్లెల్ని ప్రాణవాయువుగా స్వీకరించినవాళ్ళు. ప్రజల్ని మరిచిపోకుండా వున్నవాళ్ళు, ప్రజల్ని, ప్రజోద్యమాల్ని ఆహ్వానిస్తున్నవాళ్ళు, ఉద్యమాలకి బాసటగా నిలుస్తున్నవాళ్ళు, ఉద్యమాల్లో ప్రత్యక్షంగా విలీనం కాలేక ఉద్యమంపట్ల అకుంఠిత ప్రేమ ఉన్నవాళ్ళు, ప్రజల్నుంచి ఈ శారీరక దూరం ఉందన్న ఒక భ్రమ కలిగిస్తున్న ఒక స్థితి – ఈనాటి కవిత్వంలో ఒక ప్రత్యేక గుణమౌతుందా?

ఈ విషయంలో దేవిప్రియ exceptionలా కనిపిస్తాడు. ఈ విషయంలోనే పాతగానూ, సరికొత్తగానూ కనిపిస్తాడు.

*'నాకు*
*రెండు నిధులున్నాయి*
*నాలుకమీద కవిత్వం*
*తలమీద దారిద్ర్యం*
*నాకు*
*రెండు విధులున్నాయి*
*కవిత్వ నిత్య నిబద్ధం*
*దారిద్ర్య విముక్తి యుద్ధం –'*
*'దుక్కి దున్నిన ప్రతిసారీ*



*కంకి తల తెగి నేలమీద రాలిన ప్రతిసారీ*
*నేను పుడుతూనే ఉంటాను –*
*ప్రపంచ సతత హరితతత్వాన్ని కాపాడటానికి*
*పచ్చపచ్చగా నేను గిడుతూనే ఉంటాను'*

ఇక వచనకవిత్వం అనే మాటను పరిహరించాల్సిన అవసరం వుంది. ఇప్పుడున్నది కవిత్వమే. ప్రధానస్రవంతి ఏదైతే, అదే ఆనాటి కవిత. కవిత్వం ఎప్పుడూ వచనం గాదు. వచనం ఎంత కవితాత్మకమైనా కవిత్వం గాదు. ఈనాటి కవిత్వానికి దానిదైన ఒక సంగీతం వుంది. ఆ సంగీతం తెలిసినవాడు దేవిప్రియ.

ఏది రాసినా తన సామాజిక బాధ్యతని విడనాడనివాడు. దినపత్రిక శరీరంలో 'రన్నింగ్ కామెంటరీ'ని ఒక అంగం చేసినవాడు. కార్టూన్ కవితలో వ్యంగ్యాన్ని అద్భుతంగా కలగలిపినవాడు, ఇంతచేసినా సీరియస్ కవిత్వంపట్ల ప్రధాన ధ్యాస వున్నవాడు. రన్నింగ్ కామెంటరీలాంటి కవితలు అలవోకగా అలా చెప్పగలడు. కానీ సీరియస్ కవిత రాసినప్పుడే 'కవితవుంది వింటావా' అంటాడు.

'అమ్మచెట్టు' తర్వాత దాదాపు పదేళ్ళకి మళ్ళీ 'నీటిపుట్ట'! సత్తావుండి విపరీతమయిన స్పందనాశక్తివుండి, ఊగిపోయే గుణంవుండి, దేవిప్రియ రాయాల్సినంత రాయటం లేదని నా అభియోగం. రాయాల్సినవాళ్ళు రాయాల్సినంత రాయకపోవడంవల్ల రాగూడని రాతలు ఎక్కువగా వస్తాయని నా భయం.

నెగటివ్ అంశ వున్న కవిత్వాన్ని నేను అనుభవించలేను. Sick poetryని ఒప్పుకోను. దేవిప్రియలో దిగులువున్నా అతను sick poet కాదు. అంతర్వాహినిగా వున్న వేదన అతనికి ఎరువుగా ఉపయోగపడి, కవిత ఏపుగా ఎదిగి పూవుల్ని, కాయల్ని అందిస్తుంది. 'పైగంబరకవి'గా పుట్టి 'నీటిపుట్ట'కవిగా ఎదిగిన దేవిప్రియ అక్షయకవి.

*('నీటిపుట్ట'కు ముందుమాట)*
*23.12.1990*

⚜

**హైదరాబాదుకేమి బాధ, అయినా,**
**అది వున్నవాడికి అభినవ రాధ,**
**లేనివాడికి ముప్పూటలా బాధ!**

(రాధానగరి : అమ్మచెట్టు)



కొండుభట్ల రామచంద్రమూర్తి

# అద్వితీయ మిత్రుడు దేవిప్రియ

నా చిరకాల మిత్రులలో అతిముఖ్యుడూ, అత్యంత ఆత్మీయుడూ, అద్వితీయుడూ మా ఖాన్‌సాబ్. పరస్పరం కలుసుకోవడానికి ముందే చిగురించిన స్నేహం మాది. నేను బెంగుళూరులో 'ఆంధ్రప్రభ' దినపత్రికలో పని చేస్తున్న రోజుల్లోనే (1970 దశకం) దేవిప్రియ 'ప్రజాతంత్ర' సంపాదకుడు. చిన్న వయస్సులోనే సంపాదక పీఠాన్ని అధిష్ఠించిన ప్రతిభాశాలి. జర్నలిజం వృత్తిజీవితం ఆరంభదశలో నాకు క్రీడలంటే మక్కువ. 'ప్రజాతంత్ర'లో ఆటలపైన ఒక కాలమ్ 'క్రీడి' అనే కలం పేరుతో రాయడానికి అవకాశం ఇచ్చారు. ఆ వ్యాసపరంపర చాలా మాసాలు నడిచింది.

కంఠీరవా స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు చూసేవాడిని. లేట్‌కట్ బ్యాట్స్‌మన్, సునీల్ గావస్కర్ చెల్లెలి భర్త గుండప్ప విశ్వనాథ్ ఇంటికి వెళ్ళి ఇంటర్వ్యూ చేశాను. ఫుట్‌బాల్ మాంత్రికుడు పీలేపైన రాసిన వ్యాసం ఇప్పటికీ గుర్తుంది. ఇటీవల రష్యాలో ముగిసిన ప్రపంచ ఫుట్‌బాల్ పోటీలు జరిగినంత కాలం కళ్ళలో పీలే మెదులుతూనే ఉన్నాడు. 'ప్రజాతంత్ర'లో కాలమ్ ఆరంభించిన తర్వాత చాలా కాలానికి నేనూ, దేవిప్రియ హైదరాబాద్‌లో కలుసుకున్నాం. అంతవరకూ మాకు కామన్ ఫ్రెండ్ నండూరి పార్థసారథి ద్వారా విషయాలు తెలిసేవి. 'ఉదయం'లో మా సాన్నిహిత్యం పెరిగింది. ఒకరినొకరం 'ఖాన్‌సాబ్' అంటూ ప్రేమగా పిలుచుకోవడం అప్పటినుంచే. మార్క్సిస్టు పార్టీ అగ్రనాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అస్తమించినప్పుడు ఆయన పార్థివకాయానికి ఇద్దరం కలసి నమస్కరిస్తున్నప్పటి ఫోటో ఇప్పటికీ పదిలంగా ఉంది. సుందరయ్యపైన ఖాన్‌సాబ్ రాసిన రన్నింగ్ కామెంటరీని ఎన్నటికీ మరిచిపోను. మార్క్సిస్టుపార్టీ కార్యాలయంలో గోడమీద రాసుకున్నారు.

దేవిప్రియ గొప్ప పాత్రికేయుడు. అంతకంటే గొప్ప కవి. అంతకంటే గొప్ప ప్రేమాస్పదుడు. భార్యనూ, పిల్లల్ని అంత గాఢంగా ప్రేమించిన మరొక వ్యక్తి నాకు కనిపించలేదు. అర్ధాంగి రాజేశ్వరి మరణం తాలూకు విషాదంనుంచి ఇప్పటికీ పూర్తిగా



కోలుకోలేదు. తల్లి, తమ్ముడు చనిపోయినప్పుడు అనుభవించిన వేదనను కవితలద్వారా సమాజంతో పంచుకున్నారు. స్నేహితులతో అనుబంధం జీవితపర్యంతం కొనసాగు తుంది. తాత్కాలికం అనే మాట దేవిప్రియ నిఘంటువులో లేదు. పైపైన మాట్లాడటం తెలియదు. హృదయపూర్వకంగా మనుషులను ప్రేమించడం తెలిసిన మనిషి. ఒకరి గురించి ఆగ్రహంతో, ద్వేషంతో మాట్లాడగా నేను వినలేదు.

రాజకీయంగా, సామాజికంగా గట్టి అభిప్రాయాలు ఉన్నప్పటికీ వాదులా డుతూ ఎన్నడూ కనిపించలేదు. తనచుట్టూ సమాజంలో జరుగుతున్న పరిణామా లను మనసుకు పట్టించుకుంటూ, నిర్దిష్టమైన నిర్ణయానికి రావడం సహేతుకమైన ప్రక్రియ. తన అభిప్రాయాలను 'రన్నింగ్ కామెంటరీ'లో సూటిగా, కవితాత్మకంగా, బలంగా చెప్పడంవరకే తన బాధ్యత. ఇతరులతో వాదించి వారిని ఎట్లాగైనా ఒప్పించా లనే పట్టింపు లేదు. భిన్నాభిప్రాయాన్ని గౌరవించే సంస్కారం ఉంది. సామరస్యమే జీవనవేదం. కఠోరవాస్తవికత తెలియకముందు మనలో చాలామంది సమసమాజం సాధ్యమనే భ్రమలో బతికినవాళ్ళమే, యధాతథవాదులతో సంఘర్షించిన వారమే. కాలక్రమంలో అనుభవం నేర్పిన పాఠాలు నేర్చుకుంటూ అభిప్రాయాలు మార్చు కుంటూ, కొండొకచో ఒదిగిఉంటూ ప్రయాణం సాగిస్తున్నప్పటికీ మౌలిక విలువల విషయంలో రాజీ వీసమెత్తయినా లేదు. దేవిప్రియ చెంతకు అనేక అవకాశాలు వెతు క్కుంటూ వచ్చాయి. చిన్నతనంలోనే శ్రీశ్రీవంటి మహాకవుల సాంగత్యం అబ్బటం సామాన్యమైన విషయం కాదు. గుంటూరునుంచి నేరుగా మద్రాసు వెళ్ళడం, పినిసెట్టితో అనుబంధం కారణం కావచ్చు. శ్రీశ్రీవంటి ఆరాచకవాదితో సుదీర్ఘంగా ఆత్మకథ రాయించడం మరెవ్వరికీ సాధ్యంకాని మహత్కార్యం. హైదరాబాద్‌లో కొండంత అండగా నిలబడి దేవిప్రియ, రాజ్యలక్ష్మిల వివాహం జరిపించిన ఆత్మబంధువు కవి శివారెడ్డివంటి మంచి స్నేహితులు దొరకడంకూడా అదృష్టమే. సుప్రసిద్ధ సినీదర్శకుడూ, సృజనశీలీ నర్సింగరావుతో, ప్రముఖ వాగ్గేయకారుడూ, యుద్ధనౌక గద్దర్‌తో బలమైన స్నేహబంధం మరో పార్శ్వం. మాభూమి, రంగులకల వంటి సినిమాలకు స్క్రిప్టు, పాటలు రాయడం, గద్దర్‌పైన డాక్యుమెంటరీ నిర్మించడం, కవిత్వంలో కొత్త శిఖరాలు తనదైన మార్గంలో అలవోకగా అధిరోహించడం దేవిప్రియ అపారమైన ప్రతిభకూ, బహుముఖప్రజ్ఞకూ నిదర్శనం. వర్తమాన పరిణామాలను అధ్యయనం చేస్తూనే పాతాళంలో ఏమి జరుగు తోందో, ఆకాశానికి ఆవల ఏమి జరగబోతోందో ఊహించగల మేధాశక్తి, హృదయ వైశాల్యం ఉన్న కవి, రచయిత ఆయన. ప్రతి వాక్యాన్నీ ఒక కావ్యంగా మలచగల అశేషప్రజ్ఞ ఆయన సొంతం. 'ఉదయం'లో చూశాను. 'హెచ్ఎంటీవీ'లో గమనించాను. 'అమ్మచెట్టు'నుంచీ చూస్తున్నాను. పొద్దుటే ఆఫీసుకు వచ్చి, ఆ పేపరూ, ఈ పేపరూ తిరగేసి, టైమ్, ఇండియా టుడే దగ్గరనుంచి అన్నిరకాల మ్యాగజైన్లూ చదివేసి, తన దగ్గరికి వచ్చినవాళ్లతో కబుర్లు చెప్పి, రానివాళ్ళకు ఫోను చేసి అనేక విషయాలు



మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నట్టే కనిపించేవాడు. ఈ పనులన్నీ చేస్తూ ఉండగానే మనకు తెలియకుండా బుర్రలో మరో ట్రాక్ నడుస్తూ ఉండేది. మస్తిష్కంలో పదాలు అల్లుకునేవి. సాయంత్రం రన్నింగ్ కామెంటరీ రాసి ఇవ్వవలసిన సమయం ఆసన్న మయ్యేసరికి అష్టపది ఆవిష్కృతం అయ్యేది. ఆ రోజు సాయంకాలం జరిగిన పరిణామం పైన వ్యాఖ్యానం అందులో ఉండేది. ప్రముఖ కార్టూనిస్టు మోహన్ టేబిల్‌పైకి వెళ్ళి రేఖాచిత్రానికి స్ఫూర్తి ప్రసాదించేది. రన్నింగ్ కామెంటరీ మాత్రమే కాదు, దేవిప్రియ కవిత్వం సర్వస్వం అందంగా ముస్తాబై కాగితంపైన పడుతుంది. అక్షరం మార్చవలసిన అవసరం ఉండదు. అది అరుదైన ప్రతిభ.

ఒకే సంస్థలో, ఒకే ఉద్యోగంలో ఎక్కువ కాలం ఉండటం దేవిప్రియ వంటి కవికి అసాధ్యం. మనసు మార్పు కోరుకుంటుంది. వర్తమానంతో విసిగిపోతుంది. యథాస్థితిని రోసి కొత్త బాట పట్టి కష్టాలు కొనితెచ్చుకుంటుంది. చింత లేదు. వెనుకంజ లేదు. నూతనత్వాన్ని ఆస్వాదిస్తుంది. కొత్త అనుభవాలను రక్తగతం చేసుకుంటుంది. కవిత్వంలో కొత్త పోకడలు పోవడానికీ, సరికొత్త కోణాలు ఆవిష్కరించడానికీ ఉత్సాహపడుతుంది. అన్ని రంగాలలో అన్ని ఘనకార్యాలు చేయడానికీ, అన్ని విజయాలు సాధించడానికీ ఈ మనస్తత్వమే కారణం కావచ్చు. నాపైన ప్రగాఢమైన ప్రభావం వేసిన హితుడు దేవిప్రియ. నా చేత 'వార్త'లో కవిత్వం రాయించింది ఆయనే. ప్రఖ్యాత దర్శకుడు కె.విశ్వనాథ్‌కు 'శంకరాభరణం' ఎంత కీర్తి తెచ్చి పెట్టిందో హెచ్ఎంటీవీలో ఉద్యమసదృశంగా నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్–దశ దిశ' కార్యక్రమం నాకు అంతటి ప్రతిష్ఠ తెచ్చింది. ఆ శీర్షికను సూచించిన సహచరుడుకూడా దేవిప్రియే. నా విజయా లలో భాగస్వామి కావడమే కాకుండా తన ఖ్యాతిలో నాకు పిసరంత వాటా ఇచ్చారు. నాకు అంకితం ఇచ్చిన 'గాలిరంగు' కవితా సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు రావడం నాకూ గర్వకారణం. ఈ ప్రత్యేక సంచికలో ఖాన్‌సాబ్ గురించి నాలుగు ముక్కలు రాసే అవకాశం దొరకడం నా అదృష్టం.

దేవిప్రియ మరికొన్ని దశాబ్దాలు వాగ్దేవికీ, సమాజానికీ సేవ కొనసాగిస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటూ....

⚜

*యోగములన్ని తెలిసి, ఉప*
*యోగములన్ని అరసి నరయోధుడు ధరలో*
*ఏగతి సృజించగలడోయ్*
*ఈగల రెక్కలనయినను, ఇన్షా అల్లాహ్*

(ఇన్షాఅల్లాహ్ శతకం)



ఓల్గా

# యుద్ధంచేస్తూ శాంతినికోరే కవి

*‘నేనింకా కలలు కంటున్నాను*
*నేనింకా నన్ను నేను తొలుచుకుంటున్నాను*
*నేనింకా అనుక్షణం దహనమవుతున్నాను*
*నేనింకా నిరంతరం మునిగి తేలుతున్నాను*
*పద్యం రాసిన ప్రతిసారీ*
*నేనిప్పటికీ భస్మమై మళ్లీ రూపొందుతున్నాను”*

**– దేవిప్రియ**

కవిత్వం కోసం తపన చెంది, దహించుకుపోయి, ‘గాలిరంగు’ల మూలాల్ని తెలుసుకుని, నిరంతరం కవిత్వమైపోగల మనిషి ‘దేవిప్రియ’. తన కవిత్వాన్ని చదరంగపు ఆటతో పోల్చుకుంటూ, ‘అక్షరాలు దేని గడిలో అవి పడిపోతాయి’ అంటూ, ‘గణితం, రసాయనం, అలంకారం కలిసిన ప్రతిసారీ ఒక నూతన పద్యం పుడుతుంది’ అంటూ తన కవితా ప్రక్రియ రహస్యాన్ని తాను తెలుసుకుని ఆవిష్కరించగల సత్తావున్న కవి దేవిప్రియ. గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును పునాదిగా, భవనంగా, శిఖరంగా భావించుకుని మూడింటినీ ముద్దాడి రాగల త్రి‘కాలజ్ఞుడైన’ కవి అతను. అన్ని కాలాల లోకీ అలవోకగా ప్రయాణం చేయగల అనితర సాధ్యుడైన కవి.

కవిగా దేవిప్రియ ప్రయాణం మొదలైంది 60లలో. చిన్ననాడు పాఠశాల గురువులే పునాది గట్టిగా వేశారు. కళాశాలలో ‘కరుణశ్రీ’ దగ్గర నేర్చుకున్న పాఠాలు ఛందస్సు మీదకూడా గట్టి పట్టునీ, భాషా సంపదనూ అందించాయి. నేనూ, దేవిప్రియ యిద్దరం ఎ.సి. కాలేజీలో సహాధ్యాయులం కావటం వలన కవిగా ఆయన తొలి అడుగులను దగ్గరనుంచి చూశాను. రెండు మూడేళ్లు ఇద్దరం కలిసి నడక నేర్చుకున్నాం. ఆ నడకలోనే అర్థమైంది దేవిప్రియ చూపు లోతైనదని. బి.ఎ. మొదటి సంవత్సరంలో



నేనూ, బీనా తరగతి గదిలో చేసే అల్లరిని నిశ్శబ్దంగా గమనించే దేవిప్రియ – అప్పటి కింకా ఖాజా హుస్సేన్‌గానే మాకు తెలుసు – రెండవ సంవత్సరంలో ఒక ఛందోబద్ధ కావ్యాన్ని, తన చేతిరాతతో ఉన్నదాన్ని నా చేతిలో పెట్టి చదవమన్నాడు. దేవిప్రియ కలం పేరుగా అప్పటికే పెట్టుకున్నాడు.  రోజూ క్లాసులో ప్రశాంతంగా చిరునవ్వులు చిందించే ఈ పిల్లవాడికి ఇంత శక్తి సామర్థ్యాలున్నాయా అని ఆశ్చర్యపోయాం. ఇతను పెద్దయ్యాక తప్పక నారాయణరెడ్డిగారంతటి కవి అవుతాడు, అప్పుడు మనం ఇతని ఆటోగ్రాఫ్ కోసం పరిగెత్తాలి కదా అనుకున్నాం. ఇప్పుడే ఆటోగ్రాఫ్ తీసుకుందామా అని దురాశపడ్డాం.

మూడో ఏడాది దేవిప్రియ సుగమ్‌బాబుని తీసుకుని మా ఇంటికొచ్చాడు. అతని వెనకే కిరణ్‌బాబు. ఆ తర్వాత కమలాకాంత్‌ని పరిచయం చేశాడు. మనం ఐదుగురం కలిసి కవితా సంకలనం ఒకటి తీసుకొద్దామన్నాడు. నాక్కాస్త భయం వేసినా సరేనన్నాను. ఆ వేసవి సెలవుల్లో 'యుగ సంగీతం' సంపుటాన్ని పైగంబర కవులు పేరుతో ప్రచురించాం. డా. పరుచూరి రాజారామ్ ఆవిష్కరించారు. ఆ రోజులు చాలా సంచలనాలతో గడిచాయి. ఒకవైపు శ్రీకాకుళోద్యమంలో నా గురువులు, స్నేహితులు అమరులవుతున్నారు. ఇంకోవైపు, శ్రీశ్రీ షష్టిపూర్తి. ఇంకొన్ని నెలలకు విరసం ఆవిర్భావం. వీటన్నిటినీ నేనూ, దేవిప్రియ, సుగమ్‌బాబు కలిసి పంచుకున్నాం. మా ఇంట్లోని చిన్న లైబ్రరీ గదిలో గంటలు, గంటలు కరిగిపోయేవి మాటలతో, మౌనాలతో. విరసం సభలకు ఖమ్మంకూడా కలిసే వెళ్లాం. ఆ తర్వాత దేవిప్రియ మద్రాసు వెళ్లిపోయాడు. మళ్లీ ఎన్నో సంవత్సరాలకు 1985లో అనుకుంటా హైదరాబాద్‌లో కలిశాడు. చిన్నప్పటిలానే ఆప్యాయంగా నవ్వుతూ "ఏరా, ఎలా వున్నావు" అని పలకరించేసరికి ప్రాణం లేచొచ్చినట్లయింది.

అప్పటికే దేవిప్రియ చాలా సాధించాడు. కవిగా ఎంతో పేరు. 'అమ్మచెట్టు' వంటి గొప్ప తొలి సంకలనం. 'ప్రజాతంత్ర' పత్రికకు సంపాదకుడిగా తన విలక్షణ శైలిని అందరికీ పరిచయం చేశాడు. శ్రీశ్రీని ఆత్మకథ రాయటానికి ఒప్పించటం, ఆయనతో వేగటం, రాయించి సంచలనాలను తట్టుకుని నిలబడటం మామూలు పని కాదు. అనంతమైన ఓరిమి దేవిప్రియలో ఉంది. దానితోపాటు అంతులేని అసహనంకూడా ఉంది. ఐతే ఎక్కడ ఎప్పుడు దేని కోసం ఓర్పు వహించాలో, ఎక్కడ ఎప్పుడు దేని కోసం అసహనం ప్రదర్శించాలో తెలుసుకునే వివేకంకూడా ఉంది. ఆ వివేకమే తన జీవితాన్ని నడిపించిందనిపిస్తుంది నాకు.

ఆంధ్రప్రభలో, 'ఉదయం' దినపత్రికలలో కొన్నేళ్లపాటు రన్నింగ్ కామెంటరీ నిత్య నూతనంగా అలా నడిపించటానికి సమాజం, రాజకీయాలపట్ల ఎంత అవగాహన ఉండాలి! ప్రజల పక్షమే నిలబడే తన రాజకీయ అవగాహనను, సామాన్య ప్రజలకు



హాయిగా అర్థమయ్యేలా, వ్యంగ్యంగా, చురకలతో, చెణుకులతో, అతి చిన్న రూపంలో యిమిడ్చి అందించటం ఎంత కష్టమైన పని! ఆ పనిని సునాయాసంగా, ఇష్టంగా చేశాడు దేవిప్రియ. కొన్ని లక్షల మందిని కొన్నేళ్లపాటు ప్రతిరోజూ ఆలోచింపజేశాడు. దీనితోపాటు అద్భుతమైన పాటలు, కవితా సంకలనాలు, సినిమా ప్రయత్నాలు – తాను నిదానంగా ఉన్నట్టు కనిపిస్తూనే జీవితాన్ని పరిగెత్తించినవాడు దేవిప్రియ.

‘నీటిపుట్ట’ నుంచీ యెదురుచూస్తున్నాను. చివరకు ‘గాలిరంగు’కి అకాడెమీ అవార్డు వచ్చింది. అవార్డు వచ్చిందంటే ఆ అవార్డుకే గౌరవం తెచ్చే రచయితల కోవ లోనివాడు దేవిప్రియ. ఎలాంటి కవిత్వం దేవిప్రియది! ఎంత విశాలమైనది అతని కవితా దృక్పథం!

*‘నాకు*
*ఆస్ట్రేలియా అబోరిజనుల*
*ఆదిమూలాలు కావాలి*
*దండకారణ్య సంతాన సంకేతాల*
*అంబుల పదునూ కావాలి*
*నాకు*
*పురాణ పురుషుల*
*పుట్టు పూర్వోత్తరాలు కావాలి*
*మానవ వికాస వనంలో*
*పురివిప్పి ఆడిన వసంత యామినుల*
*చెరిగిపోని పాదముద్రల జాడలూ కావాలి*
*నాకు*
*కరాచీ భూగర్భ*
*మురుగు సొరంగాలలో మునకలేస్తున్న*
*నిరుపేద ముస్లిముల విముక్తీ కావాలి*
*స్వాతంత్ర్యం సాక్షిగా ఇంకా*
*తలమీద మానవ మలం మోస్తున్న*
*అణగారిన భారత హైందవ సంతానం*
*కళ్లనిండా ఆత్మగౌరవ ఆనందమూ కావాలి.*
*నాకు సకల జనుల సమస్త జాతుల*
*శాంతీ కావాలి*
*శాంతి కోసం*
*అనివార్యంగా జరిగే యుద్ధమూ కావాలి.’*

శాంతిని, యుద్ధాన్ని నిరంతరం తన హృదయంలోంచి కవిత్వంలోకి అనువదించి మనకు యుద్ధం మీద, శాంతి మీదకూడా ప్రేమ కలిగేలా చేస్తున్న కవి దేవిప్రియ. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు దేవిప్రియకు ప్రకటించిన వేళ ఆయన మిత్రులందరూ ఆయన కంటే ఎక్కువగా ఆయన సహచరి రాజ్యలక్ష్మిని తల్చుకుంటారు. ఆమె ఉంటే ఆ సంబరమే వేరు. కానీ ఈ సంబరం తెలుగు కవిత్వానిది. కేవలం దేవిప్రియది కాదు. అతని మిత్రులదీ అసంఖ్యాక అభిమానులదీ కాదు.

*సాక్షి, 25.12.2017*



**పలుకు**
**పన్నీటి బొట్టంత,**
**కానీ**
**అంతే పరిమళం**
**అంతే విరిదళం.**
**కవిత**
**కన్నీటి చుక్కంత,**
**కానీ**
**అంతే ఆర్ద్రం**
**అంతే సాంద్రం**

(మరొక రెండు : అరణ్య పురాణం)



కె. శ్రీనివాస్

# సెలయేరువంటి కవి దేవిప్రియ

సాహిత్యవిమర్శలో చేసే నిర్ధారణలు, ఆవిష్కరణలు కవుల తరువాతి రచనలను చక్కదిద్దడానికి బదులు ప్రిజుడిస్ చేస్తాయట. అటువంటి భయానికి కాబోలు, అజంతా కడదాకా పుస్తకం వేయకుండా, తనను ఒక కాలక్రమంలో అర్థం చేసుకోనీయకుండా ప్రయత్నించాడు. దేవిప్రియని ఏ కవిత్వానికి ఆ కవిత్వం, ఏ పుస్తకానికి ఆ పుస్తకం చదివి ఆనందించడమే తప్ప, అన్నింటినీ కలిపి ఆయన సాహిత్యవ్యక్తిత్వాన్ని కనుగొనవలసిన అత్యవసరం అప్పుడే ఏమీ లేదేమోనని నా అనుమానం. కవిత్వ ప్రయాణంలోని అంతస్సూత్రాన్ని కనుగొన్న తరువాత ఆ ప్రయాణం ఇకముందు అలా కొనసాగదనే అర్థం. అందువల్ల అటువంటి అన్వేషణల జోలికి పోకుండా, కొన్ని ఇంప్రెషన్స్‌ని మాత్రమే పంచుకుంటాను.

దేవిప్రియలో ఎంతో ముచ్చటగా అనిపించేది – ఆయన కవిత్వంతో పెట్టుకున్న సంబంధం. ఆయనకు కవిత్వం ఒక ఊపిరి సలపనీయని ఉద్వేగం కాదు. తీవ్ర భావావేశం కాదు. వ్యసనం కాదు, వ్యాపకమూ కాదు. ఇష్టమైన పెంపుడు కుక్కపిల్లను ప్రయాణంలో వెంటబెట్టుకు వెళ్ళినట్టు ఆయన కవిత్వాన్ని తీసుకువెడతాడు. అది ఆయనతోపాటు ఉంటుంది అంతే. అందువలనే ఆయన కవిత్వం పాఠకులకు సముద్రపు ఆటుపోటు అలలమీద జరిపే సర్ఫింగ్‌వలె కాకుండా, సరస్సుమీద జరిపే పడవ ప్రయాణంవలె నెమ్మదిని కలిగిస్తుంది. కలవరం కలిగించడానికి బదులు కన్నీరు తెప్పిస్తుంది. జలపాతంవలె కాక సెలయేరువలె అలరిస్తుంది. పాఠకుడిని రద్దు చేసే తాదాత్మ్యం ఇవ్వడానికి బదులు, కొంత దూరాన్ని అనుమతించి సహానుభూతికి వీలు కల్పిస్తుంది.

అనేక సిద్ధాంతాలు, ఆచరణలు, అస్తిత్వ స్పృహలతో కిటకిటలాడిన మూడు దశాబ్దాల కాలంలో దేవిప్రియ తాను నిలచునే చోటును. తన కాలిబాటను తానే

తొలుచుకున్నాడు, మలుచుకున్నాడు. తన నేపథ్యం, బాల్యం, పడిన కష్టాలు, వీటన్నింటి నుంచి తాను ఒక సమసమాజవాది కావడం అనివార్యం అని ఆయన అనుకుంటాడు. అందులో పెద్ద విశేషం ఏమీ లేదని కాబోలు ఆయన ఉద్దేశం. మనుషులు సమానత్వాన్ని కోరుకోవడం, దరిద్రాన్ని, అసమానతలను, దోపిడి, అణచివేతలను వ్యతిరేకించడం అత్యంత సహజమైన విషయాలన్నట్టు పరిగణించి తక్కిన విషయాల గురించి దేవిప్రియ రాస్తాడు. ఆయా ఆదర్శాలతో అభిప్రాయా లతో తనకు ఒక మానవీయ సంబంధం ఉంటుంది. లేకపోతే, ఒక రష్యన్‌ని చూసినప్పుడు తనకు కలిగిన ఉద్వేగాన్ని 70వ దశకంలోకూడా కవిత్వీకరించడం సాధ్యం కాదు. సోవియట్ యూనియన్ పతనమైనప్పుడు, బెర్లిన్‌గోడ కూలినప్పుడు విప్లవ కమ్యూనిస్టులు 'డెజావూ'లో, పార్లమెంటరీ కమ్యూనిస్టులు 'డిఫెన్సు'లో పడిపోయినప్పుడు ఒక సాధారణ వ్యక్తి మనసులో సుడులు తిరిగిన ఆశాభంగాలకు అక్షర రూపం ఇవ్వగలిగింది దేవిప్రియ ఒక్కడే. బాబ్రీమసీదు కూల్చివేత ఆయనలో తీవ్రమైన ఆగ్రహం కంటె పరివేదనే పలికించింది. తీవ్రమైన రాజకీయ సందర్భాలలో తన వైఖరులను ప్రదర్శించేటప్పుడు – తన మధ్యతరగతి భద్రజీవితాన్ని ఆయన ఎన్నడూ అక్షరాల కింద కప్పేయడు. పోరాటాలనో, త్యాగాలనో కీర్తించేటప్పుడు తన అర్హతల గురించి మథనపడతాడు. ఆ మథన సరి అయినదా కాదా అన్నది వేరు విషయం కానీ, కవికి ఉండవలసిన వినయాలలో అది ఒకటి. రాజకీయ ఆదర్శాల సాధన కోసం సుడులు తిరిగిన ఆవేశాలమీద ప్రయాణిస్తూ, తెలుగు కవులు పోగొట్టుకున్న కొన్ని సున్నితత్వాలను ఏరుకుని జాగ్రత్త చేసిన కవులలో దేవిప్రియ ఒకడు. అందుకే ఆయన ఒక్కొక్కప్పుడు తిలక్ దారిలో నడిచాడేమో అనిపిస్తుంది. సున్నితమైన వ్యక్తీకరణ విషయంలోనే పోలిక తప్ప తిలక్ మోసుకు వచ్చిన భావకవిత్వపు శబ్దసంచయం ఏదీ దేవిప్రియలో కనిపించదు. ముప్ఫయేళ్ళ కవిత్వ ప్రయాణంలో ఆయన 'కొత్తదారులన్నిటినీ' అభిమానిస్తూనే సొంతదారిలో నడుస్తున్నాడు.

వ్యక్తిగతమంతా రాజకీయం అన్నది రచయితలందరికీ కూడా వర్తించ వలసినదే కానీ – దేవిప్రియకు మాత్రం రాజకీయంతో సహా అన్నీ వ్యక్తిగతమే. ఆయన తరచు తల్లి గురించి, భార్య గురించి, బాల్యం గురించి రాయడాన్ని గమనించినప్పుడు – పర్సనల్ పోయెమ్స్ ఎక్కువ రాస్తాడని నిర్ధారణ చేయడం సులువే. అయితే, ఆయన పచ్చి రాజకీయం గురించి రాసిన కవిత్వంలోనూ ప్రియురాలి గురించి రాసిన పద్యంలోనూ ఒకే 'ధ్వని', ఒకే 'జీర' కనిపిస్తున్నప్పుడు – ఈ కవికి రాజకీయంకూడా వ్యక్తిగతమేనేమో అనిపిస్తుంది. అలాగని రాజకీయ వస్తువులలో మునిగితేలే కవి కాదీయన. రాజకీయాంశాలను కేవలం 'హృదయం' తోనే ముట్టుకునే కవి. ఇటీవలి సంవత్సరాలలో ప్రపంచం చవిచూసిన నిస్పృహలకు,





సంచనాలకు చిగురుటాకువలె చలించిపోతాడు తప్ప, స్థితప్రజ్ఞత్వం ప్రకటించడు. ప్రవక్తృత్యాలకు, గాంభీర్యాలకు విసిగిపోయి ఒక సాధారణ ప్రతిస్పందన కోసం, ఒక మానవీయ ఉద్వేగం కోసం తపించినప్పుడు దేవిప్రియ కవిత్వం ఆ లోటు తీర్చడానికి ప్రయత్నిస్తుంది.

కవిత్వం గురించిన పిచ్చి ప్రేమలు కూడా దేవిప్రియకు లేవు. కవిత్వాన్ని దాని ప్రాతివ్రత్యంనుంచి, స్వచ్ఛతావాదులనుంచి, పర్‌ఫెక్షనిస్టుల నుంచి రక్షించవలసింది చాలా ఉంది. కవిత్వం అన్ని వేళలా ధీరోదాత్తం కానక్కరలేదని, ఒకొక్కప్పుడు అది విదూషకత్వంకూడా ప్రకటించవచ్చునని శ్రీశ్రీ అంతటివాడే చాటాడు. దేవిప్రియకు అటువంటి భేషజాలు ఏవీ లేవు. సమాజనందస్వామి ద్వారానే ఆయన అనేకులకు తొలి పరిచయం. తరువాత రన్నింగ్ కామెంట్రీ, ఆ తరువాత గరీబు గీతాలు – బహుశా ఇవన్నీ శ్రీశ్రీ సాంగత్యం ఆయనలో ప్రతిఫలించిన తీరుకు ఉదాహరణలు కావచ్చును. చాటుమాటుగా కూడా సొంత చాటువులను చదవడానికి ఇష్టపడని 'అతిజాగ్రత్త కవికులం' పెరుగుతున్న కాలంలో దేవిప్రియ లోని ఈ వైవిధ్యంకూడా ఒక అంతరిస్తున్న కవిత్వసుగుణం.

ఆకలి, పోరాటం దేవిప్రియను, ఆయన కవిత్వాన్ని రక్షిస్తూ ఉంటాయని శివారెడ్డి ఒక సందర్భంలో ఆశ్వాసన అందించాడు. బహుశ అది నిజమే అయి ఉండవచ్చు. 'సమసమాజాన్ని' కోరేవాడయినా విప్లవకవి అనిపించుకోవాలని ప్రయత్నించని దేవిప్రియ, మైనారిటీవాది కావాలనికూడా అనుకోలేదు. అయినా అవి తనలో కలిగిస్తున్న కల్లోలాన్ని ఆయన దాచుకోలేదు. కవిత్వవస్తువులకు సంబంధించి ఆయన ప్రకటించే విశాలమైన రేంజి ఒక్కొక్కసారి ఆశ్చర్యం కలిగించినా అర్థం అవుతూనే ఉంటుంది. కానీ గద్దర్ మీద రాసిన కవితను టైటిల్‌గా తీసుకున్న 'తుఫాను తుమ్మెద' సి. నారాయణరెడ్డికి అంకితం కావడంలోని వైచిత్రి అర్థం అవుతూనే ఉన్నా – జీర్ణం మాత్రం కాదు.

*('దేవి' 30 'స్వరపత్రం 2002 నుంచి)*

⚜

**నా కవిత్వం, నిజమే,**
**ఒక వాస్తవిక స్వప్నం!**

(బ్రహ్మాండస్వప్నం .. గంధకుటి)



*పాపినేని శివశంకర్*

# వానగాలి అల

ఇప్పటి కవుల్లో కొద్దిమందే నా కిష్టం. వాళ్లలో దేవిప్రియ మరీ ఇష్టం. నా యిష్టానికీ కారణాలెన్నో.

నా మొట్టమొదటి రచన (అచ్చులో) 'కలుపుమొక్క' అనే కథ 1977లో 'ప్రజా తంత్ర' పత్రికలో వేసినవాడు దేవిప్రియే. వేస్తున్నట్లు తననుంచి ముందుగా ఉత్తరం వచ్చింది. అట్లా నాకు తొలి రచనా సంతోషం కలిగించాడు.

ఆ తర్వాత పైగంబరకవిగా, సమాజానందస్వామిగా దేవిప్రియను గుర్తించాను. సమాజానంద స్వామి కవితలు అప్పటికీ ఇప్పటికీ మాత్రాచ్ఛందస్సులో మంచి ఒడుపు, విరుపుగల రచనలుగా నాకెంతో నచ్చుతాయి. హాస్యవ్యంగ్యాలు సున్నితంగా, సునిశితంగా పలికించిన కవితలవి.

*'ఏడడుగుల కథానాయకుడు*
*ఇంపాలా కారు ఒక్కటీ'*

అంటూ యద్దనపూడి మార్క్ నవలల్ని ఎగతాళి చెయ్యడం –

*'అర్థమైందా అసమానతకు అసలు కారణం*
*అన్నం రుచి మరిగి వెన్నం తినక పోవడం'*

అని వెన్న తిని ఆహారసమస్యను నివారించవచ్చన్న వినోభాభావే గారి సదుపదేశాన్ని వెక్కిరించిన వైనం ఇప్పటికీ ఆహ్లాదం కలిగిస్తాయి. ఇక సమాజానందస్వామి మొదలు 'రన్నింగ్ కామెంటరీ'దాకా దేవిప్రియ చమత్కారాలు, అందమైన అంత్యప్రాసలు సరేసరి.

*'టిక్కెటు కావాలంటే మూడు మైళ్ల క్యూ*
*సీటు దొరికి కూర్చునేది కొద్దిమంది, వెరీ ఫ్యూ'*

అలవోకగా అమిరే ఇటువంటి అంత్యప్రాసలు ఆరుద్రలోనైనా దొరకవు.



హైదరాబాదు సాహిత్యసభల్లో దేవిప్రియ పరిచయమయ్యాడు. 'నేనూ గుంటూరు వాణ్ణేనోయ్' అన్నాడు. నేను సంతోషించాను. అయితే అది యాదృశ్చికం. అందులో విశేషమేం లేదు.

ఏ హోటల్ గదిలోనో ఉన్నప్పుడు సాహిత్యమిత్రులు కలవడం మామూలే. అయితే తక్కినవాళ్లంతా ఏ పానగోష్టిలోనో ఉన్నప్పుడు మేమిద్దరం ఏదో తింటూ, సాహిత్య విశేషాలు, గుంటూరు సంగతులు మాట్లాడుకునేవాళ్లం. తను గుంటూరు వచ్చినప్పుడు నేను కలవడం.. అట్లా ఇట్లా మా పరిచయం పెరిగింది. వాళ్ల అమ్మను చూసినప్పుడు ఆమె ఎవరికైనా అమ్మ కాగలదన్పించింది. కనుకనే తల్లిని గురించి గొప్ప ఆర్ద్రతగల కవితలు రాశాడు దేవిప్రియ.

*'అమ్మా*
*నీపాట మెట్లమీదనుంచే*
*ఆకాశం నేలకు దిగివచ్చిందమ్మా*
*భూగోళమంతా సంకోచించి*
*నీ కనుకొలుకుల్లో కన్నీటి బిందువై నిలిచిందమ్మా'*

అనే కవిత చాలు అతణ్ణి ప్రేమించడానికి. చూడంగానే పరాకుగా, గంభీరంగా కన్పించే దేవిప్రియలో నిసర్గ మానవుడున్నాడని అందరికీ తెలీదు. దేవిప్రియ గొప్ప రసార్ద్ర బిందువు.

ఎన్నో సాహిత్యసభల్లో కవి సమ్మేళనాల్లో కలసి పాల్గొన్నాం. ఎంతోదూరం కలసి ప్రయాణించాం. 1990లో 'ఒక సారాంశం కోసం' కవితాసంపుటి ఆవిష్కరణ అతని అధ్యక్షతలోనే జరిగింది. తెలియని దాన్నికూడా తెలిసినట్టు నమ్మించగల చాతుర్యం అతనికి లేదు. ఆత్మప్రశంస అంతకన్నా లేదు. కవిత్వంలోగాని, జీవితంలోగాని అతను నిరాడంబరంగా మెలగటం నాకెంతో నచ్చింది. 'పందిరి మీదికి ద్రాక్షతీగని' పాకించినంత నిశ్శబ్దంగా కవిత్వం రాయటం తెలుసు తనకి.

కష్టాలెన్నో పడ్డాడు జీవితంలో. అవి ఎవరికీ చెప్పుకోలేదు. గుండెదిటవు కోల్పోనూ లేదు. విషాదవీచిక గాక ఎప్పుడూ ఒక చిరునవ్వే అతని ముఖంలో చూశాను.

పుస్తకాలు ప్రచురించడంలో మా యిద్దరికీ పోలిక ఉంది. అదుగో అంటే ఆర్నెల్లు, అంత నిదానం (ఆలస్యం) అన్నమాట.

మొదట్లో హైదరాబాదు సాహిత్య సభల్లో పాల్గొనటం, సాహితీమిత్రుల్ని కలవడం చాలా ఉత్సాహంగా ఉండేది. రానురాను అక్కడి సాహిత్య రాజకీయాలు అర్థమవుతున్న కొద్దీ కొంత నిరుత్సాహం ఏర్పడింది. అటువంటి వాతావరణంలో దేవిప్రియలాంటి వారు అరుదుగా కన్పిస్తారు. సాహిత్యేతర పంకం సోకని పద్మం దేవిప్రియ. తన కవిత్వాన్ని దేనికీ పణంగా పెట్టని వ్యక్తిత్వం అతనిది.



బహుశా ఈ వ్యక్తిత్వ స్వాతంత్ర్యమే లేదా స్వతంత్ర వ్యక్తిత్వమే అతనిని మరే కవికీ ప్రతిధ్వనిగా మార్చకుండా నిలిపింది. తన కవిత్వరథానికి గుర్రాలూ, పగ్గాలూ, సారథీ అన్నీ తనే. చోదకులు లేరు. చక్ర రక్షకులూ లేరు. దేవిప్రియ ఎవరి కోసమో ఉద్యమాల్ని ప్రేమించినవాడు కాదు. పోరాటాల్ని ఆహ్వానించినవాడు కాదు. ఆ ప్రేమ అతని అంతరంగమంతా ఆవరించి వుందని నా నమ్మకం. వ్యవస్థను వర్ణించేటప్పుడు అతని స్వరంలో ఎక్కడో వేదన వేధిస్తుంది. అది అతని ఋజుత్వానికి గుర్తు.

ప్రతి కవితలోనూ అప్పుడే, మొలకెత్తిన వేరుసెనగ మొక్కకు మల్లే కనిపిస్తాడు దేవిప్రియ. వానగాలి అలకు మల్లే తోస్తాడు. అంత కొత్తదనం, అంత మెత్తదనం.

'దేవిప్రియ కవిత్వంలో నవనవ' (Freshness) అనేది కవిత్వ పరిశోధకులకు మంచి విషయం అవుతుంది. ఈ నా మాటలకీ ఒక రకంగా అదే శీర్షిక పెట్టొచ్చు.

ఎవరో, ఎన్నడో వాడివాడి అరిగిపోయిన మాటలు, మాటల దండలు, ఆసక్తి రేకెత్తించని ఆలోచనలు కవిత్వం ముసుగులో మిమ్మల్ని ముసురుకుని మీరు మూర్ఛిల్లే టప్పుడు దేవిప్రియని తల్చుకోండి. అతను 'అమ్మచెట్టు', 'నీటిపుట్ట', 'తుఫాను తుమ్మెద' లాంటి అద్భుత పదజాలంతో మిమ్మల్ని సేదదీర్చుతాడు. అప్పుడు మీకొక 'సూర్యచంద్రుడో', 'సంగీతసూర్యుడో', కీ.శే.చందమామో కన్పిస్తే, బెర్లిన్ శిథిలాల్లో 'హిట్లర్‌నవ్వో', గాలినదిలో తేలే 'ఏక్‌తారో', 'గడ్డకట్టిన జలపాతమో' విన్పిస్తే మీరు తప్పకుండా తేరుకుంటారు.

*'నా జాజి తీగని*
*నా చిన్ని సన్నజాజుల్ని*
*నా అపురూప కల్పనా లోకాన్నీ*
*తుదిశ్వాస వరకు*
*నా కళ్ల సూర్యరశ్మితో కాపాడుతుంటాను నేను'* – అని దేవిప్రియ చెప్పు కుంది నిజమే.

కాలం గడిచేకొద్దీ కవులు వాడిపోతుంటారు. రుచి, పచిలేని వడిలిపోయిన కవిత్వఫలాలు మనకందిస్తూ 'ఎంత బాగున్నాయో చూడు' అని తట్టి చెప్తుంటారు. దేవిప్రియ ఎప్పుడూ చెప్పడు. ఎప్పటికప్పుడు ఇంకా ఇంకా నవనవలాడే పళ్లు కాస్తాడు. చలికాలం మిరపచేలో మంచులో తడిచిన చిన్న రామ్ములగకాయ లెపుడైనా తిన్నారా? తినకపోతే దేవిప్రియ కవితలు చవిచూడండి. పోనీ, 'ధరణి... ధరిత్రి... భూమి' అనే పండు రుచి చూడండి.

*'భూమి*
*పిండితో చేసిన పీఠభూములు*
*రాతితో చేసిన రాగి రొట్టెలు*



భూమి పచ్చపచ్చటి ఉద్యానవనాలే కాదు
వెచ్చవెచ్చటి రక్తజలపాతాలు కూడా
భూమి
మధ్య మధ్య మతి భ్రమించే
మమతానురాగాల మాతృమూర్తి'

అని కంపించిన ధరిత్రిని నిరూపించినప్పుడు అద్భుతమైన Metaphorization చూస్తాం.

'కవిత్వమంటే రెండు విరుపులూ, రెండు చరుపులూ మాత్రమే కాదు' అని అతనికి తెలుసు. అది 'పద్మవ్యూహంలోంచి బయటపడే ప్రయత్నం' చేయడం అన్న దేవిప్రియ సంక్లిష్టకవులకు భిన్నంగా తోస్తాడు. చిన్నపిల్లాడు లేతవేళ్లతో, అరిచేతుల్లో మట్టిబొంగరం చేసి 'అచ్చారుగుక్క' పట్టించడం ఎప్పుడైనా చూశారా? అంత అమాయకంగా, అందంగా, లేలేతగా ఉంటుంది అతని కవిత.

ఆ గుక్కపట్టిన బొంగరం అట్లానే చెక్కుచెదరకుండా నిలబడిపోయినట్టు తిరగడానికి కారణం అతని గోర్వెచ్చని భావాలశక్తి.

'మానవీయ భావనల ఉద్యానవనాలలో 'రేకురెక్కల సీతాకోకచిలుకల్ని చూడగలడు దేవిప్రియ. 'నిప్పులనదిలో ఈదుతున్న మహాద్భుతమైన మాటల మంచు చేపను' దర్శించగలడు. 'ఆకురాలు కాలంలో అరణ్యారాణి కేశాలను పరికించగలడు. 'వృక్ష వక్షస్థలం' గమనించగలడు. కదిలే రైలును 'ఇనుపజింక' అన్నాడు దేవిప్రియ. ఎగిరే విమానాన్ని 'మేఘయంత్రం' అన్నాడు. ఇవన్నీ అతని అపురూపమైన ఊహాశక్తిని, సృజనాత్మకతని తెలియచేస్తాయి. అతని పదచిత్రాలు, భావచిత్రాలు ఎప్పటికప్పుడు ఎంతో తాజాగా ఉండడానికి అతనిలోని గొప్ప సృజనాత్మకతే కారణం.

జీవితాంతం ఒకే రూపచట్రంలో కవితలు రాసేవాళ్లున్నారు. వాళ్లు ఒక్కొక్క భావాన్ని బెసక్కుండా, మంచి బాడిసతో మేకులు గొట్టి, బిగువైన చట్రాన్ని మన చేతికిచ్చి, భావాల అందం చూడమంటారు. అవి అప్పటికే శిలువమీద చివరి ఊపిరి పీలుస్తుంటాయి. దేవిప్రియ కవితలకీ క్రమనిర్మాణ పద్ధతి ఉంది. అక్కడక్కడా refrain ఉంది. అయితే వాటివల్ల భావాలు గిడసబారటం ఉండదు. కవిత్వ ద్రవస్థితిని, దానిలోని ఆర్ద్రతని జాగ్రత్తగా కాపాడుకున్నాడతను. అందుకే నాకిష్టం, దేవిప్రియ అంటే !

*('దేవి'30 'స్వరపత్రం' 2002 నుంచి)*



కల్లూరి భాస్కరం

# భయప్రాయం నుంచి లక్ష్యగానానికి!

కవిత్వం, సంగీతం, ముఖ్యంగా శాస్త్రీయసంగీతం బాహ్యప్రపంచానికి చెంది నట్టు కనిపిస్తూనే చెందని ప్రపంచాలు. కవులు, సంగీతకారులు బాహ్య ప్రపంచంలో ఉంటున్నట్టు కనిపిస్తూనే వాళ్ళ ప్రపంచంలో వాళ్ళు ఉంటారు. ఆ ప్రపంచంలోకి వెళ్ళదలచుకున్న ఇతరులకు చాలా తర్ఫీదు కావాలి. బాహ్యమైనవి పక్కకు తోసేసి పూర్తిగా నిమగ్నమయ్యే నిష్ఠ కావాలి. రెండు ప్రపంచాల మధ్య అలవోకగా రాకపోకలు సాగించగల నేర్పు కావాలి. బాహ్యప్రపంచం వచనం. అందులో తర్క వితర్కాలు, హేతునిర్హేతుకాలు, వాద ఉపవాదాలు, యుద్ధాలు, సుఖదుఃఖాల గట్లు ఒరుసుకుంటూ ప్రవహించే మానవజీవితాలు, ఆ జీవితాల గురించిన చరిత్రలు, సమాచారాలు, నిన్నటి భగ్నపథకాలు, రేపటి స్వప్నప్రణాళికలు ఉంటాయి. అది జ్ఞానప్రపంచం. జ్ఞానాన్ని నిరంతరాయంగా వడగట్టి సిద్ధంచేసే ప్రపంచం. ఇలాంటి బాహ్యవచనప్రపంచంలో కూరుకుపోయిన వాళ్లకు కవిత్వ, సంగీతప్రపంచాలలోకి అడుగు పెట్టడానికి చాలా సంసిద్ధత కావాలి. కదలని నిష్ఠ, చెదరని నిమగ్నత కావాలి. ఆ ప్రపంచాలలో తనను తాను లయం చేసుకునే రసాయనికత కావాలి. అది ఒక్కోసారి కొందరికి జీవితకాల నిరీక్షణ అవుతూ ఉంటుంది.

దేవిప్రియ పత్రికారచయితగా బాహ్యవచనప్రపంచానికి చెందినవారు. అదే సమయంలో కవిగా కవిత్వప్రపంచంలోకి అవలీలగా వెళ్లగలిగి, ఉండగలిగినవారు. ఆ విధంగా ఆయన ఉభయప్రపంచజీవి.

...

'రన్నింగ్ కామెంటరీ' కవిగా ఎనభై దశకం నాటికే ఆయన తెలుసు. ఆ తర్వాత కవిగానూ తెలుసు. వ్యక్తిగత పరిచయం మాత్రం తొంభై దశకం చివరిలోనే. తను 'ఆంధ్రప్రభ' కార్యాలయానికి  తరచు వచ్చినప్పుడు జి. శ్రీరామమూర్తి (నిజం)



గారితో కలసి కొన్ని ఇష్టాగోష్ఠులు, కొన్ని సాహిత్యం కబుర్లు, కొన్ని ఛలోక్తులు. ఆ గూటినుంచి నేను ఎగిరిపోయాక అనుకోకుండా ఎప్పుడైనా ఎక్కడైనా కలవడం. ప్రతిసారీ చెవిని కాకుండా హృదిని తాకే ఆత్మీయమైన పలకరింపు.

తన సమకాలీన సంపాదకులు దేవిప్రియపై అసూయ చెందడానికి ఒక కారణం ఉంది. అది, శ్రీశ్రీ ఆత్మకథను 'అనంతం' పేరుతో తను సంపాదకుడిగా ఉన్న 'ప్రజాతంత్ర'లో ప్రచురించడం! శ్రీశ్రీ రచనలను ప్రచురించే అవకాశం, ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం ఆయన సమకాలీన సంపాదకులకు ఎందరికో కలగలేదు. ఈ యుగం నాదన్న ఒక మహాకవి ఆత్మకథను ప్రచురించే అవకాశం కలగడం చిన్న విషయం కాదు. ఆ కవితోపాటు తననుకూడా చారిత్రిక స్మరణలో ఉంచగల మహద్భాగ్యం అది.

...

దేవిప్రియ ఇప్పటి కవిత్వం 'ఇం..కొకప్పుడు'లోకి తలదూర్చాను. ఆయన చెప్పుకున్నట్టు నిజంగా అది ఆయన ఇప్పటి కవిత్వం. 2014 దేవిప్రియ జీవితంలో రెండు కల్లోలాలు తెచ్చిపెట్టింది. ఒకటి అంతఃకల్లోలమైతే, ఇంకొకటి బాహ్యకల్లోలం. మొదటిది వ్యక్తిగతం. అంతవరకు తన పక్కనే ఉన్న జీవనసహచరి కన్నుమూయడం, అరవై అయిదేళ్ళ వయసులో ఆయనను ఎటు అడుగువేయాలో తోచని నాలుగురోడ్ల కూడలిలో దిక్కుతోచని అయోమయస్థితిలో ఒంటరిగా నిలబెట్టింది. ఆ ఒంటరితనపు దిగుళ్లు, గుబుళ్ల అభివ్యక్తి ఈ సంపుటి అంతటా పరచుకుంది. ఆ ఒంటరితనం విధించిన అంతర్ముఖత్వం జీవితాన్ని కొత్తగా అర్థం చేసుకునేవైపు, కొత్త నిర్వచనాలు చెప్పుకునే వైపు, చిన్న చిన్న మాటలలో అనంతార్థాలను నిక్షేపించేవైపు నడిపించి కవిత్వంలో విషాదాన్ని భయవిహ్వలతను నింపుతూ గుండెల్ని మెలితిప్పుతూనే దానికి కొత్త లోతునిచ్చింది. లోతునే కాదు, అందుకు తగిన నుడికారాన్నీ ఇచ్చింది. రెండవ కల్లోలం కవిగతం. అది కవులు, కళాకారులతోపాటు బుద్ధిజీవుల భావప్రకటనా స్వేచ్ఛకు కూడా మరణశాసనం సిద్ధమవుతున్నదా అన్న భయ సందేహాలను రేకెత్తించిన సంవత్సరంకూడా. ఆ భయగ్రస్తతనుకూడా దేవిప్రియ కవిత్వం వ్యక్తీకరించింది. అసలు సంపుటి మొదలే 'భయప్రాయం' అనే కవితతో.

అరవై అయిదేళ్ళవరకూ తనతోఉండి, తనులేని స్థితిని ఊహలోకికూడా రానివ్వని అర్ధాంగి హఠాత్తుగా కన్నుమూశాక ఇక మిగిలింది అంతా భయప్రాయమే. గాలి బిగదీయకముందే ఊపిరి ఆగిపోతున్నట్టు అయిపోతుంది. ఊగుతున్న నీడలేవో మీద తూలిపడుతున్నట్టు, ఎన్నడూ చూడని రంగులేవో తన ముందు చిందులేస్తున్నట్టు, ఎప్పుడూ ఊహించని ఉప్పెన యేదో పక్కన ఎక్కడో పొంచి ఉన్నట్టు అనిపిస్తుంది. జంకెరగని నడక ఇప్పుడు కొత్తగా తడబడుతుంది. ఇది మరొక మరణమేమో లేక మరో జననమేమో అనిపిస్తుంది.



భార్యావియోగ దుఃఖం ఇంకా బహుముఖాలుగా వ్యక్తమైన కవిత్వం ఇది.

*నువ్వు లేని మనఇల్లు*
*నన్ను అణువణువూ భయపెడుతోంది....*
*నువ్వు లేని ఇంట్లో*
*అడుగుపెడితే ఎవరిదో పరాయి ఇంటిలో ప్రవేశించినట్టుంటోంది...*
*అక్కడున్న ఆ కాసేపూ*
*నేనొక యంత్రంలా తిరుగుతున్నాను...*
*నీ పిలుపులూ, నీ జ్ఞాపకాలూ,*
*డ్రెస్సింగ్ టేబుల్ మీదా, గోడలమీదా, తలుపుల మీదా*
*అతికించివున్న సూర్యబింబాలవంటి*
*నీ నుదుటి మందారవర్ణపు బొట్టు స్టిక్కర్లు*
*నన్ను సన్నసన్నగా ముక్కలు తరుగుతున్నాయి....*
*..........*
*నువ్వు ఎప్పుడు వస్తావని*
*ఆ పావలా బిళ్ళంత బొట్టు*
*నిట్టూరుస్తూ ఎదురు చూసే క్షణాలు*
*అమూర్తంగా గుమ్మానికి ఎండు మామిడాకుల్లా*
*ఎప్పుడైనా రాలడానికి సిద్ధంగా ఉన్నాయి....*
*...........*
*నీడ నేల మీద పడకుండా*
*ఎండలో నడవడం యెలా?*
*రెండు శ్వాసల్లో*
*ఒకటి లేకుండా బతకడం ఎలా?*

ఈ మహాదుఃఖానికి సరిపోయినట్టే మాటలుకూడా గొప్ప బరువునూ, సాంద్రతనూ తెచ్చుకోవడం దేవిప్రియ కవిత్వంలో కనిపిస్తుంది. అంతేకాదు, ఆయన వాక్యాలు నిర్వచనీయతను, ఉటంకింపు లక్షణాన్ని పొదవుకోవడం కనిపిస్తుంది.

*ఈ దిగులు*
*భూమికన్నా బరువు*
*ఈ వగపు*
*ఏటి కన్నా లోతు*
*ఈ కోత*
*కత్తి కన్నా పదును*
*ఈ అదను*



క్షణం కన్నా కురచ...
'నిశ్శబ్ద ప్రశ్న' అనే కవిత చూడండి:
నిశ్శబ్దాన్ని నిర్వచించడం ఎలా?
ఆలోచనలన్నీ
ఆచరణగా మారేవరకూ
మధ్యలో ఉన్న దూరమేనా నిశ్శబ్దం?
..........
శబ్దం సామూహికం
నిశ్శబ్దం వ్యక్తిగతం
అవాంఛిత శబ్దాల నుంచి
ఐచ్ఛికంగా విడివడే అనుభవం నిశ్శబ్దం
కవి ఇంకో చోట ఇలా అంటాడు:
ఉచ్ఛ్వాసలో
లోనికి వెళ్ళిన లోకం
నిశ్వాసలో
పద్యమై బయటకు వస్తుంది.

అక్షరాల హ్రస్వరేఖలతో కవి గీసిన లఘుచిత్రాలుకూడా చూపులకు తగులుకుంటాయి :

సమీపించే కొద్దీ
తీరాలు దూరంగా జరిగిపోతున్నాయి
ఏదో ఎప్పుడూ తాకని గాలి ఒకటి
ఎక్కడినుంచో వచ్చి వీపు తడుతోంది
ప్రశాంతంగా ఉందనుకున్న తోట
ఉన్నట్టుండి కలవరానికి గురయి
ఎడారి కలలోకొచ్చిన పూలగుత్తిలా
అల్లాడిపోతోంది
సందడిగా సంతలాగా సాగుతున్నచోట
అకస్మాత్తుగా నిశ్శబ్ద చలనాలు
అటూ ఇటూ నీడల్లా పాకుతున్నాయి
................
వెయ్యి వయొలిన్ల విశ్వవాద్యగోష్ఠి
ముగిసిన తరువాత ఖాళీ అయిన
ఆవరణని ఆవరించిన
ప్రగాఢనిశ్శబ్దం నా శేషయాత్ర

.................
దేనికీ భయపడను
జలపాతాల ధారలు పట్టుకుని
ఊగుతూ దూకుతూ అరణ్యాలు దాటినవాణ్ణి
...............
ఎన్నడో ఆ వాడని ఖాళీ చేసి వెళ్ళిపోయిన
జెకొస్లోవియన్ల అడుగుజాడలకోసం ఇంకా బతికివున్న
చెట్ల మీదనుంచి వీస్తున్న సనత్ నగర్ గాలి
ఎవరూ చూడకుండా వచ్చి రోడ్లమీద వెతుకుతోంది
రాత్రిగా మారుతున్న సాయంత్రం
మరొక వేకువగా అవతరించే అనంత రహస్య రసాయనికచర్య
అదృశ్యంగా కొనసాగుతోంది

దేశాన్ని చుట్టుముట్టిన బాహ్యకల్లోలంపై స్పందించడంలో దేవిప్రియలో కవే కాక అదనంగా పత్రికారచయితకూడా ఉన్నాడు. నోట్లరద్దుతో సహా ఆయా పరిణామాలు ఆయన దృష్టిపథంనుంచి తప్పించుకోలేవు, తప్పించుకోలేదు.

మెరుపుల మాలలు
మెడలో ధరించి తిరిగే కవుల కళ్ళలో
ఈ భీతావహ ఆగ్రహమేమిటి?
....
రక్తసిక్తమవుతున్న మాట
పోటెత్తుతున్న విద్వేష అసహనంలో
పొర్లి పొర్లి దుఃఖపడుతున్నదేమిటి?
స్వేచ్ఛా విహంగాల కాళ్ళకి
దారాలు కట్టి చీకటి వలలోకి
లాగి గాయపరుస్తున్న ఈ అరాచకమేమిటి?
....
అప్రజాస్వామిక ఆంక్షల కత్తుల బోనులో
అక్షరాలు ఇప్పుడు
ఎటువైపు నిలబడి ఎవరి తరపున పోరాడగలవు?
...........
అల్లకల్లోలంగా ఉన్న
ఈ దేశంలో సముద్రాలకున్న సంవేదనకూడా
పౌరమానవుడికి లేదెందుకు?





*...*

*అణుయుద్ధాల కంటే ముందు*

*జనయుద్ధాలు జరగవలసిందేనా?*

*.............*

*అకస్మాత్తుగా ఆకాశం మధ్యలో*
*సూర్యుడు అస్తమించినట్టు,*
*ఉన్నట్టుండి యుద్ధరంగంలో*
*ఇరుపక్షాల సైనికులూ స్తంభించిపోయినట్టు,*
*సముద్రమథనక్రియలో హఠాత్తుగా*
*కవ్వం విరిగి జలగర్భంలోకి జారిపోయినట్టు,*
*గాయపడిన యుద్ధనౌక*
*తిరిగివచ్చి తీరంలో లంగరు వేసినట్టు,*
*కాలం ఆలపిస్తోంది విను ఒక*
*పరిచితస్వరంలో అపరిచిత విరామసంగీతం!*

భయప్రాయంగా మొదలై, 'మంచెమీద నిలువెత్తున నిలబడి / రివ్వున వడిసెల తిప్పుతున్న మనిషి కావా'లన్న లక్ష్యగానంతో ముగిసే ఈ కవితా సంపుటిలో చాలా ఎక్కువగా వినిపించేది వ్యక్తిగా, కవిగా దేవిప్రియ జీవితంలో కాలం ఆలపించిన అపరిచిత విరామ సంగీతమే.

⚜

**మెదడుచెట్టుకి**
**రుతువులతో యేంపని,**
**అది సతతహరితం...**
**అహర్నిశలూ**
**అక్షరాలనీ సప్తస్వరాలనీ**
**పూస్తుంది,**
**రాగ బంధాలనీ, రంగుల్నీ**
**రాలుస్తుంది,**
**నిరంతరం,**
**ఆలోచనలనీ ఆయుధాలనీ**
**కాస్తుంది.**

(కల్పతరువు : అమ్మచెట్టు)



వాసిరెడ్డి నవీన్

# దేవి అభిమానం అనుభవించాల్సిందే

కొంతమంది చూడడానికి గుంభనంగానూ, కూల్‌గానూ ఉన్నట్లు కన బడతారు. వారికి దగ్గరగా వెళ్లాలంటే, 'అమ్మో అంత పెద్దాయన మనతో మాట్లాడతారా', అనిపించేట్లు ఉంటారు.

కానీ ఒక్కొక్కసారి అనుభవాలు అందుకు భిన్నంగా ఉంటాయి.

ఎప్పుడో 1988లో ప్రజాసాహితి సంపాదకుడుగా ఉన్న రోజులు. ప్రజాసాహితి నూరవ సంచిక విడుదలయింది. పత్రికలకు సమీక్షలకు ఇద్దామని కొంచెం బెరుగ్గానే ఆంధ్రజ్యోతిలో ఆయన కాబిన్‌లోకి వెళ్లాను. విషయం చెప్పి సంచిక కాపీని ఇచ్చాను. అప్పటికప్పుడే దాన్ని అబ్బురంగా తిరగేస్తూ ఎంతో మెచ్చుకుని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని గొప్ప కృషి అంటూ పొగడ్డం మొదలుపెట్టారు. అంతేకాదు, సమీక్ష కాదు పెద్ద వ్యాసమే రాయించాలని, అప్పటికప్పుడు ఫొటోగ్రాఫర్‌ని పిలిచి, ఫొటోలు తీయించి నాతో చిన్నపాటి ఇంటర్వ్యూ కూడా తీసుకున్నారు.

అది ఆయననుంచి నేను కోరుకోని ప్రోత్సాహం, నేను ఊహించని ఆత్మీయత, అనుకోని ఆదరణ.

అప్పుడర్థమైంది–ఓహో దేవిప్రియ అంటే ఇదా అని, మూటగట్టుకున్న ఆత్మీయతను మనసులో నింపుకున్న వ్యక్తిత్వం అంటే ఇలా ఉంటుందా అని. అప్పటి దాకా నా దృష్టిలో దేవిప్రియ వేరు, ఆ తర్వాత వేరు. తొలిరోజుల్లో కలిసింది తక్కువే అయినా ఆయన ఆత్మీయస్పర్శను అనుభవిస్తూనే ఉన్నాను. సందర్భం వచ్చింది కాబట్టి ఒక రహస్యం చెప్పాలి. నేను కథలు రాసానంటే ఎవరూ నమ్మరు. అప్పుడప్పుడు అడుగుతుంటారు, కథలెందుకు రాయవని. రాశానని చెప్పుకోవడానికి నాకు సిగ్గు. ఎందుకంటే వాటి స్థాయి అంతంత మాత్రం కాబట్టి. నా మొదటి కథ అచ్చేసింది ప్రజాతంత్ర వారపత్రిక. అప్పుడు దానికి దేవిప్రియ సంపాదకులు. ఇది జరిగింది



1978లో. అప్పటికి నాకు దేవిప్రియ ఎవరోకూడా తెలియదు. కథ పంపిన వారం రోజుల్లో ఉత్తరం వచ్చింది. ఆ వెంటనే కథ అచ్చయింది. ఆ తర్వాత నాలుగైదు కథలు రాసినా నాకు బాగా గుర్తుండిపోయిన కథా సందర్భం ఇదే. అలా నాకు గుర్తుండిపోయే ఒక సందర్భం దేవిప్రియతోనే ముడిపడివుంది.

ఆమధ్య నాకు అరవై సంవత్సరాలు నిండిన సందర్భంలో పదిమంది ఆత్మీయులతో ఆరోజు సాయంత్రం గడిపే ఏర్పాటుచేసి, అది నాకు మర్చిపోని రోజుగా మిగిల్చిన దేవిప్రియ ఇప్పుడు నాకు పూర్తిగా అర్థమయ్యాడు. మొన్నటికి మొన్న తణుకులో 'కథ 2016' ఆవిష్కరణ సభలో ఆత్మీయ అతిథిగా ఐదు నిమిషాలు మాట్లాడమంటే, నా నలభై సంవత్సరాల సాహితీజీవితాన్ని అరగంటసేపు విడమర్చి చెప్తే, నాకు సిగ్గనిపించింది. సామాజిక కార్యక్రమాలతో ముడిపడిన సాహిత్య కార్యకర్తగా నన్ను అభిమానించిన తీరు అది.

సాఫీగా సాగిపోయే జీవితంలో ఎవరికీ రాకూడని కష్టం దేవిప్రియకొచ్చింది. దేవిప్రియ జీవితంలో అన్నీ తానే అయిన రాజ్యలక్ష్మి హఠాత్తుగా వెళ్లిపోవడంతో అంతా శూన్యం అయింది. దాన్ని తట్టుకోవడం ఆయనకు కష్టమే. రెండేళ్ళ తర్వాత ఇప్పుడు కాస్త కుదుటపడినట్లు అనిపిస్తుంది.

దేవిప్రియ మా ఇంటికి దగ్గరగా వచ్చాక దగ్గరితనం మరింత దగ్గరయింది. నవీన్ నిశ్చల్ అంటూ ఆత్మీయ పలకరింపుతో రోజుకొకసారైనా ఫోను చేయాల్సిందే.. అదీ నేను ఫోను చేయననే నిష్ఠూరంతో సహా.

దాదాపు 50 సంవత్సరాల సాహిత్యకృషి, అనేక రంగాల లోతులు చూసినవాడు. ప్రధానంగా కవి. పత్రికారంగంలో అపార అనుభవం. ప్రకటనల రూపకల్పనలో గొప్ప ప్రతిభ. రన్నింగ్ కామెంటరీ సృష్టికర్తగా లక్షలాది పాఠకుల అభిమానం పొందినవాడు. మాజీ ఎలెక్షన్ డెప్యూటీ కమీషనర్ కె.జె. రావు గారి జీవితచరిత్రను అద్భుతంగా ఆంగ్లంలో మలచినవాడు. సినిమారంగంలోనూ తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నవాడు. ఇలా ఎన్నయినా చెప్పుకోవచ్చు.

నిజానికి ఎప్పుడో రావాల్సిన సాహిత్య అకాడమి పురస్కారం ఇప్పుడైనా వచ్చినందుకు సంతోషంతో ఈ నాలుగు మాటలు.

**నిప్పు తెలియక ముందునుంచీ**
**మనిషికి తప్పు తెలుసు...**

(యుద్ధమే శరణ్యం .. చేపచిలుక)



వాహెద్

# ఆత్మీయ స్పర్శలాంటి అరనవ్వ

నాకు దేవిప్రియ రాసిన రన్నింగ్ కామెంటరీ అంటే చాలా ఇష్టం. గరీబు గీతాల్లో పద్యాలంటే ఇష్టం. గీటురాయి కార్యాలయంలో మహిళా ఉద్యోగులు ఎవరూ లేరు. అది చిన్న ఆఫీసు. నలుగురైదుగురు కలిసి వారపత్రిక నడుపుతున్న కార్యాలయం. దేవిప్రియ గరీబు గీతాల్లో రాసిన కందపద్యం అప్పుడప్పుడు తలచుకుని నవ్వుకునేవాడిని.

*సంపాదక మండలిలో*
*శంపాలతలుండ తగవు శాంపిలుకైనా,*
*చంపాలని ఎడిటర్లని*
*పంపిస్తే తప్పు నువ్వు పతిత గరీబూ*

మా కార్యాలయంలో అలాంటి పరిస్థితే ఉందిలెమ్మనుకునేవాడిని. హఠాత్తుగా మలిక్‌గారు ఒకరోజు దేవిప్రియ మన కార్యాలయానికి వస్తారనగానే కాస్త ఆశ్చర్యం కలిగింది. అప్పటికి ఆయన మనోరమ పత్రిక పెట్టారు. దేవిప్రియగారితో మలిక్‌బాయ్‌కి పరిచయం, సాన్నిహిత్యం ఉంది.

దేవిప్రియ, గొప్ప కవి, సాహిత్యంపై మంచి పట్టు ఉన్నవారు, అలాంటి వ్యక్తి వస్తున్నాడంటే కలవడం చాలా సంతోషమే కదా, అలాగే కాస్త బెరుకుకూడా ఉండేది. కాని ఆయన్ను కలిసిన తర్వాత చాలా సాదాసీదాగా అనిపించారు.

దేవిప్రియ నాకు కవిత్వంలో గురువువంటి వారు. మనోరమ ప్రారంభించిన తర్వాత ఆయన చాలా తరచుగా గీటురాయికి వస్తుండేవారు. ఆయనతోపాటు ప్రముఖ విమర్శకుడు చేకూరి రామారావు గారుకూడా వస్తుండేవారు. నాకు దేవిప్రియ పాకెట్ కార్టూన్‌కి రాసే రన్నింగ్ కామెంటరీ అంటే చాలా ఇష్టమని చెప్పాను కదా. అదే శైలిలో రాయాలని ప్రయత్నించేవాడినికాని సాధ్యమయ్యేది కాదు. ఇక లాభం లేదనుకుని ఆయన్నే అడిగాను. అప్పటికి మాత్రాఛందస్సు గురించి తెలియదు. చాలా ఓపిగ్గా మాత్రాఛందస్సు గురించి చెప్పి ఎలా రాయాలో టెక్నిక్స్ వివరించారు. అంతేకాదు,



కందపద్యం నడక గురించి కూడా ఆయన ద్వారానే నేర్చుకున్నాను. మాత్రా ఛందస్సులో రాసే బదులు కందంలో రాస్తే బాగుంటుందనిపించింది. కందం నాలుగు పాదాలను ఎనిమిది పాదాలుగా ముక్కలుచేసి రాసేవాడిని. ఒకసారి దేవిప్రియతోపాటు చే.రా. వచ్చారు. గీటురాయి తిరగేస్తూ నేను రాసిన కందం వద్ద ఆగారు. ఎవరయ్యా కంద పద్యాన్ని ఇలా ముక్కలు ముక్కలు చేశాడని, క్రింద రచయిత పేరు చూశారు. నేను "ఏ.డబ్ల్యు" అని పొడి అక్షరాలతో ఆ కాలమ్ కోసం రాసేవాడిని. ఇదేంటి, పేరేంటని అడిగారు. దేవిప్రియ 'పన్'కు పెట్టింది పేరు. అది "ఏ.డబ్ల్యు" మీరు క్రికెట్‌లో 'ఎల్ బి డబ్ల్యు' అనుకున్నారా ఏంటి అన్నారు. చే.రా. నవ్వుతూ, సరే ఈ 'ఎల్ బి డబ్ల్యు' ఎవరయ్యా అన్నారు. నేను అక్కడే ఉన్నాను. నన్ను చూపించి వీడే అన్నారు. సుబ్బరంగా నీ పేరు పెట్టి రాయకుండా ఈ పొడి అక్షరాలేమిటి? కందం నడక బాగుంది. బాగా రాస్తున్నావని చే.రా. మెచ్చుకోవడం ఒక గొప్ప అనుభూతి. అప్పుడే దేవిప్రియ, నా పేరు వాహెద్‌తోనే రాయాలని తీర్మానించడమే కాదు, ఆ కాలమ్‌కు "వారెవా" అని పేరు పెట్టారు. అసలు కందంలో రాయడమెందుకు, హాయిగా మాత్రాఛందస్సులో రాయి కాస్త స్వేచ్ఛ ఉంటుంది అన్నారు. మాత్రాఛందస్సులో ఆ కాలమ్ చాలా కాలం గీటురాయిలో రాశాను. ప్రముఖ ఎడిటర్ పతంజలికూడా పిలిచి చాలా బాగా రాస్తు న్నావని మెచ్చుకోవడం మరో కితాబు. దేవిప్రియ 'పన్'గురించి చెప్పుకోవాలంటే చే.రా. గారికి సంబంధించిన మరో సంఘటన చెప్పాలి. ఒకసారి గీటురాయిలో రచయితల సమావేశం నిర్వహించాం. చే.రా.గారు ఆ సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం లంచ్ మా కార్యాలయంలోనే. చే.రా.గారి ప్రసంగంతో చాలా ఇంప్రెస్ అయిపోయిన అహ్మద్ మొహియుద్దీన్ స్వయంగా చే.రా.గారికి వడ్డిస్తూ చికెన్ లెగ్ పీస్‌లు రెండు ఆయనకు వేశారు. చే.రా. నేను తినలేనయ్యా అన్నారు. పక్కనే కూర్చుని భోంచేస్తున్న దేవిప్రియ వెంటనే 'మీరు లింగ్విస్టిక్ అని చెప్పారు కదా, ఆయన లింబిస్టిక్ అనుకుని ఉంటాడు' అన్నారు.

దేవిప్రియతో నా స్నేహం గురుశిష్యుల సంబంధం వంటిది. దేవిప్రియను మలిక్‌గారు ఎలాగోలా ఒప్పించి గీటురాయికి ఆయన సేవలందేలా చేశారు. అందువల్ల తరచు ఆయన గీటురాయి కార్యాలయానికి రావడం నాకు చాలా లాభించింది. లాతూరులో భూకంపం వచ్చినప్పుడు జరిగిన సంఘటన ఇక్కడ తప్పక ప్రస్తావించాలి. ఒక రోజు మలిక్‌గారితో కబుర్లలో పడి దేవిప్రియ రాత్రి గీటురాయి కార్యాలయంలోనే స్టే చేశారు. ఆ రాత్రి ఈ భూకంపం వచ్చింది. నేను సెకండ్ ఫ్లోర్‌లో, ఇంట్లో ఉన్నాను. ఫస్ట్ ఫ్లోర్‌లో మలిక్‌గారి రూములో మలిక్ గారు, దేవిప్రియ గారు ఇద్దరు నిద్రపోతున్నారు. భూకంపం కుదుపులకు మలిక్ గారు మేల్కొన్నారు. దేవిప్రియనుకూడా నిద్రలేపారు. 'భాయ్, భూకంపంలా ఉంది' అని దేవిప్రియతో చెప్పారు. దేవిప్రియ చాలా మామూలుగా 'అవును ట్రెమర్స్, మరేం పర్వాలేదు పడుకోండి' అని



నిద్రపోయారు. మలిక్‌గారు 'పర్వాలేదా.. సరే' అని ఈయనకూడా నిద్రపోయారు. పొద్దుట ఆఫీసు తెరిచిన తర్వాత ఇద్దరు చెప్పుకుంటూ నవ్వుకున్నారు.

ఈ భూకంపం విశ్వరూపం తెలిసిన తర్వాత దేవిప్రియ ఒక కవిత రాశారు. 'ధరణి.. ధరిత్రి.. భూమి...' అనే శీర్షికతో రాసిన కవిత అది. అద్భుతమైన కవిత. మలిక్‌గారు కూడా గొప్పగా కవిత్వం రాస్తారు. ఆయన మరో కవిత 'నేల జలదరించింది' శీర్షికతో రాశారు. గీటురాయి అప్పుడు టాబ్లాయిడ్ సైజులో వచ్చేది. ఇద్దరి కవితలు ఒక పేజీలో ఒకదాని పక్కన మరో కవితగా వేశాం. వీరిద్దరి కవిత్వం చూసిన తర్వాత నాకుకూడా రాయాలనిపించింది. 'భూమి కంపించింది' అంటూ ఒక కవిత రాశాను. అంటే పోటీగా రాస్తున్నావా అంటూ నవ్వారు. అంతేకాదు, వచన కవిత్వం అభివ్యక్తికి సంబంధించి చాలా ఉపయోగకరమైన సూచనలిచ్చారు. రచనలు చేయాలంటే చదవడం చాలా అవసరమని గట్టిగా చెప్పేవారు. ముఖ్యంగా ప్రాచీన సాహిత్యాన్ని చదవాలని, మంచి తెలుగులో రాయాలంటే పద్యకవిత్వం కూడా చదవాలని చెప్పి నాతో ఆముక్త మాల్యద, వసుచరిత్ర, శృంగారనైషధం, పాండురంగ మహత్యం, రఘువంశం చదివేలా చేశారు. తెలుగు ఛందస్సుపై పట్టు రావాలంటే అప్పకవీయం తిరగేయ్ అన్నారు. తెలుగు వాక్యాన్ని సులభంగా, సరళంగా ఎలా రాయాలో నేర్పింది ఆయనే.

గరీబు గీతాల తర్వాత ఆయన రాసిన మరో శతకం పేరు 'ఇన్షాఅల్లా' శతకం. ఒకసారి లంచ్ టైములో మలిక్‌గారు, నేను, దేవిప్రియ, ఆసిఫ్‌భాయ్ (తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్ మేనేజరు అప్పుడు) కూర్చుని భోంచేస్తున్నప్పుడు కందపద్యాలతో మరో శతకం దేవిప్రియ రాస్తే బాగుంటుందన్న ప్రస్తావన వచ్చింది. ఎవరో 'ఇన్షాఅల్లా' అన్నారు. దేవిప్రియకూడా 'ఇన్షాఅల్లా' అంటూ, ఇదే మకుటంతో రాస్తానన్నారు. 'ఇన్షాఅల్లా' అని మకుటంతోరాస్తే నాల్గవపాదంలో యతిమైత్రి ఇబ్బంది పెడుతుందేమో అన్నాను. రాసేవాడికి ఏదీ ఇబ్బంది కాదన్నారు. ఆ తర్వాత ఇన్షాఅల్లా శీర్షికతో ఈ పద్యాలు గీటురాయిలో వరుసగా వచ్చాయి. అనేక జీవనసత్యాలను ఈ శతకంలో ప్రకటించారు.

*లోపాలకు లోటేమిటి*
*వేపాకుల మండలాగ వేలుగ వున్నాయ్,*
*చూపాలిక నవ మార్గం*
*ఈ పాటుల నుంచి ఒకడు, ఇన్షా అల్లాహ్ !*

గీటురాయి పత్రిక పేజీలను తీర్చిదిద్దడంలో కొత్త ఒరవడి ప్రవేశపెట్టింది దేవిప్రియగారే. టాబ్లాయిడ్ సైజులో వస్తున్న పత్రిక రూపురేఖలు మార్చి మ్యాగజైనుగా అందమైన లేఔట్‌తో తయారు చేయించడంలోకూడా దేవిప్రియదే ప్రధానపాత్ర. 1996 జనవరినుంచి గీటురాయి మ్యాగజైను సైజులోకి మారింది. అప్పట్లో తెలుగుదేశం రాజకీయాలు, అధికారం కోల్పోయిన ఎన్టీరామారావుపై కవరు కథనం వచ్చింది.



'అధికారం ఎవరి చరణదాసీ కాదు' అని కవరుపై శీర్షికతో డిజైను చేయించింది దేవిప్రియే. మ్యాగజైను సైజులో మొదటి పత్రిక సిద్ధమవుతున్నప్పుడు రన్నింగ్ కామెంటరీ శైలిలో --

*గీటురాయి పాఠకులకు*
*కొత్త ఏటి సలాము*
*సాటిలేని మీ ప్రేమకు*
*ఈ పత్రిక గులాము*

*కొత్త రూపు, కొత్త చూపు*
*మీకే పునరంకితం*
*శరవేగం మన ధ్యేయం,*
*నత్తనడక ఇక గతం !*

అని రాసి నాకిచ్చారు. గీటురాయిలో నేను మాత్రాఛందస్సులో రెగ్యులర్‌గా రాసే "వారెవా" శీర్షికలో ఇది వేసి కింద దేవిప్రియ అని రాయించి ప్రూఫు ఒకసారి చూడమని ఆయనకిచ్చాను. 'వారెవా' నువు రెగ్యులర్‌గా రాసే శీర్షిక కదా. నీ కాలమ్‌లో మరొకరు రాయడం మర్యాద కాదు, నీ పేరుతోనే వేసేయ్ అన్నారు. నేను వద్దని చెప్పినా బలవంతం చేశారు. అలా నా పేరుతో వచ్చిన ఈ పంక్తులు నిజానికి రాసింది దేవిప్రియ.

దేవిప్రియతో అనుబంధంవల్ల చాలా నేర్చుకున్నాను. గీటురాయి నుంచి ఈ అనుబంధం తర్వాత హెచ్ఎంటీవీ వరకు విస్తరించింది. హెచ్ఎంటీవీలో నేను పని చేస్తున్నప్పుడు దేవిప్రియకూడా అక్కడ ఉన్నారు. 'సందర్భం' శీర్షికతో ప్రతిరోజు ఒక ముఖ్యకథనాన్ని రాత్రి ప్రసారం చేసేవాళ్ళం. ఆ ప్రోగ్రామ్ బాధ్యత నాది. ప్రతిరోజు ఒక ముఖ్యకథనాన్ని రామచంద్రమూర్తిగారో, దేవిప్రియ గారో స్వయంగా సూచించేవారు. దానికి సంబంధించిన సమాచార సేకరణకు దాదాపు మూడు గంటల సమయం గడిచిపోయేది. ఆ తర్వాత రాయడమూ, మరోవైపు అవసరమైన వీడియోలు తీయమని ప్రొడ్యుసర్‌కు పురమాయించడం, యాంకర్ పార్ట్ షూట్ చేయించమని మరొకరికి చెప్పడం, వీడియో ఎడిటర్లకు అవసరమైన టైం ఇవ్వాలి. లేకపోతే వీడియో ఎడిటింగ్ కష్టమవుతుంది. టీ.వీ.లో పని అంతా హడావుడి. అయితే ప్రింటుకు వెళ్ళేదిలేదు కాబట్టి టైపు చేస్తున్న ప్పుడు తప్పులొచ్చినా పట్టించుకునేవాడిని కాదు. స్క్రిప్టు రాసిన తర్వాత దేవిప్రియ గారికి పంపించేవాడిని. వాక్యంలో చిన్న లోపంఉన్నా ఆయన వెంటనే కరక్షన్ రాసే వారు. చివరకు ప్రూఫు తప్పులుకూడా సరిదిద్దేవారు. ప్రింట్‌కు వెళ్ళేది కాదు కదా అంటే, వాయిస్ ఓవర్ చదివేవాళ్ళు ఈ తప్పులే చదువుతారు. భాష విషయంలో ఆ మాత్రం శ్రద్ధ లేకపోతే ఎలా అనేవారు. ఒక్కోసారి ఆయన

మందలిస్తారని తప్పించుకు తిరిగేవాడిని. ఆయన రాసిన కవిత 'ఒకరోజు.. ప్రతిరోజు'లో హెచ్ఎంటీవీలో పనిరోజు దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు.



*"సాగర్, ఆ*
*సాయి ఫోటో బూడిద*
*మన ఛానెల్లో ఎన్నాళ్ళు రాలాలి?"*
అంటూ ప్రారంభించి,
*'సందర్భం స్క్రిప్టు చూసి*
*గంటన్నరయింది, వాహెద్ తీసుకుపోడేం ...*
*.............................*
*చారి ఏడీ... బాలకృష్ణ రాడా...*
*ద్రష్టలు కాదయ్యా .. దష్టలు..*
*............................*
*ఉరుకులూ పరుగులూ*
*ఎక్స్‌ప్రెస్ రైలేదైనా పట్టాలు దిగి*
*న్యూస్ ఫ్లోర్‌లోకి దూసుకు వస్తోందా ..*
*'ఔను, ప్రింట్ వేరు, టీవీ వేరు భాయ్'*
*ఖాన్ సాబ్ కొత్త అనుభవ ఉవాచ.."*

అంటూ రాసిన పంక్తులు తర్వాత చదివినప్పుడు ఆ దృశ్యాలన్నీ కళ్ళముందు కదిలాయి. ఆయన ఖాన్‌సాబ్ అని చెప్పింది రామచంద్రమూర్తి గారిని.

పుచ్చలపల్లి సుందరయ్యగారు చనిపోయినప్పుడు 'సోషలిజం ఈ దేశపు/ బిడ్డల తల నిమిరినపుడు/ ఎర్రబడిన ఏ మబ్బుల/ తేరుమీదొ వచ్చిచూడు' అని దేవిప్రియ రాసిన రన్నింగ్ కామెంటరీ ఒక గొప్ప కవి మాత్రమే రాయగలిగిన పద్యం. అన్నాదురై చనిపోయినప్పుడు కరుణానిధి ఒక కవిత రాసి "అన్నా.. వెళ్తూ వెళ్తూ.. నీ హృదయం ఇచ్చి వెళ్ళరాదా" అని రాశారు. ఇలాంటి అభివ్యక్తి ప్రతి కవికి సాధ్యం కాదు. 'నాలుకమీద కవిత్వం/ తలమీద దారిద్ర్యం' తన రెండు నిధులుగా చెప్పుకున్న గొప్ప కవి మాత్రమే ఇలాంటి ఆర్ద్రమైన వాక్యం రాయగలడు. 'జమ్‌జమ్మల్‌మర్రీ' అనే పాటలో 'ధారలు కట్టిన చెమటే జరీపైట నీకు, చల్' అని రాసిన వాక్యం చదివినప్పుడు అహ్మద్ ఫరాజ్ రాసిన "నీ తలపై ఈ పైట చాలా అందంగా ఉంది కానీ, ఈ పైటను జెండాగా ఎగరేస్తే చాలా బాగుండేది" అనే వాక్యాన్ని పోల్చి చూడండి. ఇద్దరూ విప్లవాన్నే రాశారు. ఇద్దరూ స్త్రీ సాధికారత గురించే రాశారు. ఇద్దరూ పైటనే ప్రతీకాత్మకంగా ఉపయోగించారు. ఇద్దరిలోనూ అద్భుతమైన ఊహే కవిత్వమైంది. ప్రేరణాత్మకమైన, స్ఫూర్తిదాయకమైన ఊహ. అహ్మద్ ఫరాజ్ ఊహకన్నా ఇందులో దేవిప్రియ ఊహ,



అభివ్యక్తి నాకు గొప్పగా అనిపించాయి. సినిమా పాటలో ఆయన కవిత్వాన్ని ఒంపారు.


ఐదు దశాబ్దాలుగా తనదైన శైలిలో సాహిత్య సృజన చేస్తున్న దేవిప్రియకి. "గాలిరంగు" కవిత్వ సంపుటికి కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. నిజానికి ఎప్పుడో రావలసిన పురస్కారం.

దేవిప్రియ మంచి కవి మాత్రమే కాదు, దేవిప్రియ గొప్ప కవి. ఆయనతో అనుబంధం నెమరు వేసుకుంటే రాయాలనిపించే విషయాలు ఇంకా చాలా చాలా మిగిలే ఉంటాయి. ఎప్పుడు తలచుకున్నా ఆ అరనవ్వు ఆత్మీయస్పర్శలా హాయిగా తాకుతుంది. కలలో కూడా పలకరిస్తుంది....భాయ్... సలామలైకుం.

*నగరమా*
*నే రాసే కావ్యానికి*
*నాడీమండలానివై నినదించు,*
*నా కవిత్వపు నరనరానా*
*నిర్భీతి రక్తానివై ప్రవహించు,*
*వీధుల్లో వికసించిన సూర్యుడివై*
*నన్నావహించు,*
*నా అక్షరాల అధికారపీఠమెక్కి*
*నన్ను నిర్దేశించు;*
*నగరమా నగరమా*
*నేనొక మౌంటురోడ్డునై*
*నీ వెన్నుపూసగా మారిపోతా...*

(నగరావేశం : నీటిపుట్ట)

FLUID POET
FROZEN MOMENTS








తండ్రి ఇమామ్

⚜

*రక్తసిక్తమైన ఈకలతో నేలని శుద్ధి చేస్తున్న*
*అలనాటి పలనాటి పందెంకోడివి నువ్వు,*
*విరిగిన గడియారపు ముల్లుని*
*గుండెల్లో గుచ్చుకుని గుంభనంగా నవ్వుతున్న*
*విషాదవిదూషకుడివి నువ్వు ...!*

*(విషాద విదూషకుడు : తుఫానుతుమ్మెద)*



పెంచి పెద్దచేసిన తల్లి హలీమున్

*రంజానంటే నాకు*
*ఫాతెహాల కోసం ఎదురుచూడడం,*
*పలావు ఆరగించి*
*అగరువత్తుల వాసనలమధ్య,*
*నా బుజ్జితమ్ముడిని పక్కకితోసేసి*
*అమ్మ పొట్టమీద అడ్డంగా పడుకుని*
*ఆదమరిచి నిద్రపోవడం!*

*(బాల్య రంజాన్ : తుఫానుతుమ్మెద)*



కన్నతల్లి హుస్సేన్‌బీబీ

⚜

**అమ్మా,**


**నీ కవిత్వంలో**

**ఆదాముబరువు కింద నలిగిన**

**అవ్వ మూలుగు వినిపించిందమ్మా...**

*(అమ్మ పాడిన ఆ పాట : తుపాను తుమ్మెద)*





*దేవిప్రియ 1966–67*

⚜

***పుస్తకాలే నా బస్సులూ రైళ్ళూ విమానాలూ***
***పుస్తకాలే నా నావలూ అంతరిక్ష నౌకలూ***
***పుస్తకాలే నా హార్మోనియమ్‌లూ వేణువులూ వీణలూ...***
***నా కాలం నా పుస్తకాలతోనే సంభాషిస్తుంది***
***బహుశా, కలకాలం !***

*(నా కాలం : అరణ్య పురాణం)*





*దేవిప్రియ 1975*

⚜

నేనింకా కలలు కంటున్నాను
నేనింకా నన్ను నేను తొలుచుకుంటున్నాను
నేనింకా అనుక్షణం దహనమవుతున్నాను
నేనింకా నిరంతరం మునిగి తేలుతున్నాను
పద్యం రాసిన ప్రతిసారీ
నేనిప్పటికీ భస్మమై మళ్ళీ రూపొందుతున్నాను

(ఇం– కొకప్పుడు)





దేవిప్రియ చదువుకున్న తాడికొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

తాడికొండలోని వెల్లంకి వెంకటప్పయ్య హైస్కూలు






పి.యు.సి. – తెనాలి వి.ఎస్.ఆర్. కళాశాల

డిగ్రీ – గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల








ఒక అపురూపచిత్రం!
గుంటూరు ఆంధ్ర క్రిష్టియన్ కాలేజీలో 'ప్రత్యేక తెలుగు' తరగతి వీడ్కోలు చిత్రం 1967–69
పై వరుసలో ఎడమనుంచిమూడవ వారు దేవిప్రియ. రెండవ వరుసలో రెండవ వారు ఓల్గా.
కూర్చున్న వారిలో ఎడమ నుంచి మూడవ వారు ప్రఖ్యాత 'పుష్పవిలాప కవి',
దేవిప్రియ, ఓల్గాల తెలుగు అధ్యాపకులు కరుణశ్రీ.



*1969 గుంటూరు సభలో*

*కె. శివారెడ్డి, దేవిప్రియ (మైక్), అద్దేపల్లి, టి.ఎల్.కాంతారావు*



దేవిప్రియ : ఫొటో – బి.నరసింగరావు



పెళ్ళినాడు రాజ్యలక్ష్మి, దేవిప్రియ : 16 జూలై 1973 హైదరాబాదు.



మొదటి బిడ్డ ఇవాసూర్యతో రాజ్యలక్ష్మి, దేవిప్రియ



రాజ్యలక్ష్మి, దేవిప్రియ, ఇద్దరు పిల్లలు సమత, ఇవా. (మధ్యలో రచన)

దేవిప్రియ ఇద్దరు పిల్లలు ఇవా – సమత







సమత, ఇవాతో నాన్న దేవిప్రియ






కుటుంబం : అమిత్ విన్సెంట్, ఇవాసూర్య, దేవిప్రియ, రాజ్యలక్ష్మి, మృదుల, సమత



రాజ్యలక్ష్మి, సమత, ఇవాసూర్య, అమిత్ (చేతుల్లో కైరా గుడియా), దేవిప్రియ 2009.



మనుమరాలు ఆకాంక్ష, మనుమడు ఆర్యదేవ్ తో

మనుమరాలితో రాజ్యలక్ష్మి





కొడుకు ఇవా, కోడలు మృదుల, మనుమడు, మనుమరాలు



దేవిప్రియ గారి మనుమడు, మనుమరాలు
సింబా (ఏయిడెన్ ఆంథోని అమిత్),
గడియో (క్రిస్ జోన్నా అమిత్).






తమ్ముడు కీ.శే. బాబుతో దేవిప్రియ కుటుంబం

**రమ్మని కబురు వచ్చాక**
**రాయంచలైనా రయ్యిన**
**ఎగిరిపోవలసిందే...**
**హంసలదీవికి**
**కొత్తహంసలను పంపవలసిందే**
**నవధవళ వర్ణాలను నింపవలసిందే!**

*(హంసలదీవి : అరణ్యపురాణం)*



దేవిప్రియ, రాజ్యలక్ష్మి – 1992–93



నాగార్జునసాగర్‌లో దేవిప్రియ, రాజ్యలక్ష్మి






ఒక గంభీర ముద్రలో రాజ్యలక్ష్మి

⚜

***రెక్కలొచ్చిన పిల్లలు***
***ఎవరి చెట్టుని వారు వెతుక్కున్న తరువాత,***
***కొత్తగా అడిగింది ఆమె***
***'ఇప్పుడెలా బతుకుతాం'...?***
***కళ్ళల్లో నీళ్ళు***
***గుండెల్లో నిప్పు ఆరకుండా...***
***ఎప్పటిలాగానే... ఇలాగే... సరేనా...!***

(ఇద్దరమే : చేపచిలుక)



రాజ్యలక్ష్మికి రమణజీవి రేఖాచిత్ర నివాళి : 2017



జగన్నాథశర్మ

# దేవుడు నిజంగా దేవుడే !

అవునవును అవి వేసవిరోజులే! అప్పుడవి నిద్రలేని రాత్రులే! రమణి పుట్టింటికి వెళ్ళింది. కాదు కాదు, పంపించాను. తల్లితోపాటుగా పిల్లలూ వెళ్ళారు. ఇంట్లో...అది ఇల్లు కాదు,గది. ఆ గదిలో ఒక్కణ్ణే కూర్చుని హైదరాబాదులో ఉండడమా లేక మద్రాసుకి పారిపోవడమా అని ఆలోచిస్తున్నాను. నలుగురు ఉండే గదిలో ఒక్కణ్ణే ఉండడం, ఏదీ అంతుచిక్కక ఉండడం ఇబ్బందిగా ఉంది. సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తున్నాను. గుండెల్నిండా, గదినిండా పొగ. ఊపిరి ఆడడం లేదు. అప్పుడు 'శర్మా' అన్న పిలుపు వినిపించింది. బయటికివచ్చి చూశాను. శివారెడ్డిగారు!

"నవీన్‌నగర్ అంటే ఖైరతాబాద్‌కి ఇంతదూరం అనుకోలేదయ్యా! పైగా కొమ్మ మీద కోతిలా మూడో అంతస్తులో ఉన్నావు" అని నవ్వారు శివారెడ్డి.

గదంతా కలయజూశారు.

"రమణీ పిల్లలూ ఏరీ? ఎక్కడ?" అడిగారు.

"ఊరికి పంపించాను."

"ఊరికే పంపించావా?" నవ్వుతూ అడిగారు శివారెడ్డి.

"మీకు తెలియనిదేముంది గురువుగారు? ఉద్యోగం లేదుకదా." అన్నాను.

"ఉద్యోగందేముంది లేవయ్యా! వస్తుంది, పద! ద్వారకకు వెళ్దాం."

శివారెడ్డిగారూ నేనూ ద్వారకకు బయల్దేరాం. వెంకటరమణాకాలనీలో పకోడీలు వేస్తోంటే ఓ వందగ్రాములు వేడివేడి పకోడి తీసుకున్నాం. తింటూ మాటల్లో పడ్డాం.

"దేవుడు (దేవిప్రియ) ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరాడు.. తెలుసుకదా, ఆయనకు ఇంకొక అసిస్టెంట్ కావాలి. చేరతావా?" అడిగారు శివారెడ్డి.

"మనకిస్తారా?" అడిగాను.

"ఇస్తారా అంటే వెళ్ళి అడగాలి. కలవాలి. ఇంట్లో కూర్చుంటే ఉద్యోగాలు వస్తాయా?" అన్నారు శివారెడ్డి.

"అడిగితేనో,కలిస్తేనో ఉద్యోగం ఇచ్చేస్తారా? అంత అమాయకుడా దేవిప్రియ?" అడిగాను.

"ఆ మాట నిజం. దేవుడు అమాయకుడే" అన్నారు శివారెడ్డి.

ఆసరికి ఖైరతాబాద్ చౌరస్తా ఇరానీ రెస్టారెంట్‌కి చేరుకున్నాం ఇద్దరం.

"ఇక్కడో చాయేద్దాం. తర్వాత ద్వారకాలో కాఫీ వేద్దాం." అన్నారు శివారెడ్డి.

"దో చాయ్" అని చెప్పి, రెస్టారెంట్లో కూర్చున్నాం.

దేవిప్రియతో పరిచయం, అతనిపెళ్ళి, ఉద్యోగపరంపర...అన్ని విషయాలూ చెప్పి,

"అమాయకుడు కాకపోతే దేవుడు కవిత్వం ఎందుకు రాస్తాడు? నువ్వు మాత్రం తెలివైన వాడివా? తెలివైనవాడివైతే కథలు ఎందుకు రాస్తావు?" అన్నారు శివారెడ్డి. దేవిప్రియ ఇంటి అడ్రస్ చెప్పారు.

"రేపు పొద్దునే దేవుడి ఇంటికెళిపో! ఉద్యోగం కావాలని అడుగు...." అన్నారు.

ఆ రాత్రి గడచి తెల్లారింది. రాత్రి ప్రారంభమై తెల్లార్లూ వర్షం కురిసిందేమో! పొద్దున ఎలా ఉందంటే...చల్లచల్లగా ఉంది. ఆశఆశగా తియ్యతియ్యగా ఉంది. ఈజీగానే దేవిప్రియగారి ఇల్లు తెలుసుకున్నాను.

బాల్కనీలో లుంగీ కట్టుకుని, చల్లగా ఉన్నదేమో! ఎండకాగుతున్నారు దేవిప్రియ. నన్ను చూస్తూనే –

"రావయ్యా పంతులూ! రారా" అన్నారు.

నన్నెవరూ అంతకుముందు 'పంతులు' అని పిలవలేదు. కొత్తగా అనిపించింది ఆ పిలుపు.

పక్కనున్న కుర్చీ చూపించి 'కూర్చో' అన్నారు.

"రాజీ" అని కేకేశారు. 'రాజీ' అన్నది వారి శ్రీమతి పేరు.

"పంతులొచ్చాడు. ముందు మంచి కాఫీ ఇవ్వు. తర్వాత టిఫిన్ అన్నీ చూద్దాగాని..." అన్నారు.

కాఫీ వచ్చింది. తాగుతున్నాను.

"చెప్పు, ఉద్యోగం కావాలా?" అడిగారు దేవిప్రియ. అవునన్నాను.

"కావాలంటే నాకో, శివుడు(శివారెడ్డి)కో చెప్పాలి. అంతేగాని, ఎందుకయ్యా వచ్చీరాని ఇంగ్లీషులో ఎడిటర్ (నండూరి రామ్మోహనరావు) గారికి అంత ఉత్తరం రాశావు?" అడిగారు దేవిప్రియ.

"వచ్చీరాని ఇంగ్లీషులోనే కాద్సార్, తాగి మరీ రాశాను." అన్నాను.





“ఏడిశావు” అన్నారు నవ్వుతూ.

“పిల్లల్నీ, పెళ్ళాన్నీ ఊరికి పంపించేశావా? ఒక్కడివీ ఏం చేద్దామనుకుంటు న్నావు?” కోపగించారు దేవిప్రియ.

“వెళ్ళి వాళ్ళని ఊరినుంచి తీసుకుని రా! నీకు ఉద్యోగం వచ్చినట్టే.” అన్నారు అంతలోనే!

నిజం చెప్పనా! ఆ క్షణం నేను దేవిప్రియ కాళ్ళు పట్టుకున్నాను. కన్నీళ్ళు పెట్టుకున్నాను.

“ఎయ్! ఊరుకో! పిచ్చాడా! ఏం ఉందిందులో.” అని నన్ను లేవదీశారు దేవిప్రియ. కన్నీళ్ళు తుడిచి ‘పిచ్చిపంతులు’ అని నవ్వారు.

“నువ్వు ఏం చదివావు? నీకు ఏం వచ్చు అన్నది నేను అడగను. నీ గురించి నాకు అంతా శివుడు చెప్పాడు. నువ్వు బుద్ధిగా పని చెయ్యి చాలు.” అన్నారు.

“నిన్ను నువ్వు తక్కువ చేసుకోకు.” అని హెచ్చరించారు.

“అప్లికేషన్ తెచ్చావా?” అడిగారు. తెచ్చానని, ఇచ్చాను. తెరచి దానిని చూడను కూడా చూడలేదు.

పదిహేను రోజులు గడచిపోయాయి. ఆంధ్రజ్యోతినుంచి పిలుపు లేదు. భార్యా బిడ్డల్ని తెచ్చేశాను ఆనాటికి. కష్టంగా గడుస్తున్నాయి రోజులు. ఓ మధ్యాహ్నం పూట ఆంధ్రజ్యోతి పిఆర్ఓ మా ఇంటికి వచ్చారు.

“రేపు ఉదయం పదకొండు గంటలకు మీకు ఇంటర్వ్యూ ఉంది.

మర్నాడు ఇంటర్వ్యూ ముగిసింది. చీఫ్ సబ్ఎడిటర్‌గా ఉద్యోగం వచ్చింది. ఊహించని హెూదా! అయితే గియితే సబ్ఎడిటర్‌గా తీసుకుంటారనుకున్నాను. అంతే గాని ఇంత హెూదా ఇస్తారనుకోలేదు. అంతా ‘దేవుడిదయ’ అనుకున్నాను. ఆనాడు ‘నిన్ను నువ్వు తక్కువ చేసుకోకు’ అని దేవిప్రియగారు హెచ్చరించింది ఇందుకా? అనుకున్నాను.

ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రవేశించాను. నేనూ, ఎంవి, మీసాల శివప్రసాద్, అంతా...నలుగురమే సెక్షన్లో. ఎవరి పనులు వారు బుద్ధిగా చేసుకునేవారం. అప్పట్లో మంగళవారం మాకు డెడ్‌లైన్. ఆ రోజు ఎంత రాత్రయినా పేజీలు ఇచ్చి తీరాలి. మాటకి దేవిప్రియ పత్రిక అసిస్టెంట్ ఎడిటరేగాని, ఆయనెప్పుడూ క్యాబిన్‌లో కూర్చున్న పాపాన పోలేదు. మాతోపాటు మా దగ్గరే సెక్షన్లో కూర్చునేవారు. జోకులు తెగ చెప్పుకునేవాళ్ళం. రాత్రి తొమ్మిది అయినా పని కాలేదంటే...ఇంకా రెండు మూడుగంటలు పని ఉన్నదంటే... పదండి డిన్నర్‌కి అనేవారు దేవిప్రియ. పంజాగుట్టలో ‘వందన’ అని ఒక బార్ అండ్ రెస్టారెంట్ ఉండేది. అక్కడికి డిన్నర్‌కి తీసుకుని వెళ్ళేవారు. డిన్నర్‌కి ముందు వెచ్చగానో, చల్లగానో ఏం తీసుకుంటారో తీసుకోండి



అనేవారు. ఆయనేమీ తీసుకునేవారు కాదు. మమ్మల్ని తీసుకోమని ఒకటే గోల చేసేవారు. బీర్లు చెప్పేవాళ్ళం. బీరు తాగి కడుపునిండా తిని, బయల్దేరబోతుంటే...

"పంతులూ! టూటీఫ్రూటీ అని ఇక్కడ ఐస్‌క్రీం బాగుంటుంది. తిను." అనేవారు దేవిప్రియ.

"వద్దులెండి" అంటే...

"మొగమాటపడకు." అని నవ్వేవారు.

టూటీఫ్రూటీ తినిపించేవారు. ఆనాటినుంచే ఎక్కడ ఏ హోటల్లో డిన్నర్ చేసినా ఆఖర్లో టూటీఫ్రూటీ తినడం నాకు అలవాటైంది. అలవాటైన సిగరెట్ మానేశాను. మందుకూడా పెద్దగా ముట్టడం లేదు. టూటీఫ్రూటీ మాత్రం నేటికీ మానలేక పోతున్నాను.

టూటీఫ్రూటీ తింటుంటే...

"దేవుడిప్రసాదం. మానలేకపోతున్నాడు." అంటారు శివారెడ్డి.

టూటీఫ్రూటీనే కాదు, వారం వారం ఓ కథ రాయడాన్ని కూడా అలవాటు చేసింది దేవిప్రియగారే! అప్పట్లో ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'అగ్రహారం కథలు' అని నాచేత కథలు రాయించింది ఆయనే! రాయడానికి ముందు ఆ కథలు దేవిప్రియగారికి చెప్పేవాణ్ణి. కళ్ళు మూసుకుని వినేవారాయన. విని...

"పంతులూ! నువ్వు కథలుకూడా బాగా చెబుతావయ్యా! నువ్వు పత్రికా రంగంలో కంటే సినిమారంగంలో లేదంటే టీవీ సీరియల్స్‌లో బాగా రాణిస్తావు. ప్రయత్నించ రాదూ?" అనేవారు. ఆ మాట పట్టుకునే ప్రయత్నాలు చేసి, సినిమా రంగంలో రాణించక పోయినా, టీవీరంగంలో ఓ పుష్కరకాలం నిలదొక్కుకున్నాను.

నేను ఎక్కడ ఉన్నా, ఏ రంగంలో ఉన్నా వెన్నంటి ఉంటున్నట్టే ఉండేవారు దేవిప్రియ. నవ్వుతూ నేను కనిపిస్తే...

"పంతులూ! నీకిక తిరుగులేదు, ఆడుకో!" అని భుజం తట్టేవారు.

వర్షం అంటే గొడుగు కొనిపెట్టేవారు. ఎండలంటే చెప్పులు కొనిపెట్టేవారు. నా పర్సు ఖాళీగా ఉంటే...

"ఏంటి పంతులూ, పర్సు ఖాళీగా ఉంది. ఈ రెండొందలూ అందులో ఉంచు." అని ఇచ్చేవారు.

కాలం కలసివచ్చింది, నాలుగు కాణులు వెనకేసుకున్నాను. ఈసారి హోటల్ బిల్ నేను కడతానంటే...నేటికీ శివారెడ్డి, దేవిప్రియ అనేమాట ఒకటే!

"ఈ జన్మకి ఇలా కానీ! మమ్మల్ని కట్టనీ! వీలుంటే వచ్చే జన్మలో నువ్వు కడుదూగానీ."

వచ్చేజన్మ ఉందో లేదోగాని, ఉంటే మాత్రం ఆ అవకాశం రావాలని కోరుకోని రోజంటూ లేదు.



కవిగా దేవిప్రియ, పత్రికా రచయితగా దేవిప్రియ గురించి ఎవరైనా ఎంతైనా మాట్లాడతారు. వాటి గురించి నేనంతగా మాట్లాడలేను. ఎందుకంటే వాటి గురించి నాకు పెద్దగా తెలీదు. అందుకే 'దేవుడు'గా దేవిప్రియ గురించే మాట్లాడాను. నేను మాట్లాడిన ఈ నాలుగు మాటలూ నిజం. ఇందులో ఒక్క ముక్కకూడా అబద్ధం లేదు. అమ్మతోడు. దిక్కులేనివారికి దేవుడు దిక్కంటారు. అలా హైదరాబాద్ నగరంలో నాకు దేవిప్రియ దిక్కయ్యారు. అందుకు వారికి శిరసువంచి పాదాభివందనం చేస్తున్నాను.

⚜

*నేనూ మనిషినే*
*నువ్వూ మనిషివే*
*రెక్కలు ముక్కలయ్యే నేను*
*లెక్కలు రొక్కమయ్యే నువ్వు-*
*'నవరంధ్రముల కాయమన్నా*
*నిన్ను నట్టేట ముంచురోరన్నా..'*
*తెలిసికూడా గురుడా*
*ఎందుకీ మతయోగం ఆశ్రమభోగం,*
*పరమపదించరాదా*
*తక్షణమోక్షం కోసం !*

( తత్వబోధ.. చేపచిలుక)



ఖాదర్ మొహియుద్దీన్

# విస్మయావేశాల కవిత్వం

ఆధునిక తెలుగు కవిత్వానికి నిసర్గమైన ఒక తాజాదనాన్నీ, అభివ్యక్తికి అతి నాజూకయిన ఒక నిజాయితీనీ, పాఠకుడిని భావుకుడిని చేసే ఆత్మీయమయిన ఒక అమాయికత్వాన్నీ అందించిన కవి దేవిప్రియ.

దేవిప్రియ కవిత్వం పదాల రణరంగం కాదు. చాలామంది ప్రముఖుల కవిత్వాలలో తరచుగా తారసపడే మాటల ట్రాఫిక్ జామ్ ఈయన కవిత్వంలో మచ్చుకయినా కనిపించదు. తొలిపొద్దు సంధ్యలో సేదదీరేందుకు బయలుదేరిన సుతిమెత్తని పాదాల అలికిడిలా, సున్నితంగా మన కర్ణపుటాలను తాకుతాయి దేవిప్రియ వచనపద్యాలు. కోమలమయిన ఈయన కవితావాక్యాలు చిమ్మచీకట్లను ఛేదించు కుంటూ వెలుగుల తీరాలదాకా తీసుకువెళతాయి. దేవిప్రియ భావచిత్రాలు మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. కొత్తగా, వింతగా ఈ లోకాన్ని వీక్షించే దేవిప్రియ కవిత్వం ఒక నిర్దిష్టమైన అర్థంలో విస్మయావేశాల కవిత్వం. ఈ కవి నిరంతరం దృశ్యజగత్తులోని ప్రతి కదలికనీ తన అంతరంగంలో పదిలంగా అలంకరించుకుంటూ వాటిని సందర్భో చితంగా సద్వినియోగం చేసుకునే సదవకాశం కోసం ఎదురు చూస్తుంటాడేమో అనిపిస్తుంది. తనవద్దవున్న నిధులను గురించి దేవిప్రియ యేమయినా చెప్పి వుండవచ్చును గానీ నిజానికి ఆయన సముపార్జించున్న సంపద మనిషినీ, ప్రకృతినీ, మొత్తంగా సృష్టినీ దర్శించే ఆయన చూపులోనే నిక్షిప్తమై వుంది. ప్రతీ వస్తువునీ ఒక ఉదాత్తమయిన మెటఫర్‌గా మాత్రమే చూడటంలోనే వుంది. ఆ చూడటంలో ఒక ఆశ్చర్యం, ఒక విస్మయం, ఒక పులకరింత. వాటి అభివ్యక్తిలో ఒక మృదుత్వం, ఒక తాజాదనం, ఒక అధివాస్తవిక శబ్దచైతన్యం. అదే ఈ కవి తనకుతానుగా సమకూర్చుకున్న అతి విలువయిన సంపద.

దేవిప్రియ కవిత్వంలో కనిపించే 'క్రాఫ్ట్‌వాల్యూ'తోపాటు 'కంటెంట్ వ్యాల్యూ'



కూడా ఎంతో గంభీరమైనదీ, ఉదాత్తమైనదీను. ఒక సాధారణమయిన నీటిబొట్టుతో పాటు కన్నీటిచుక్క గ్రావిటీని సయితం గుర్తించగల అరుదయిన శక్తి ఈ కవి స్వంత ఆస్తి. తనదయిన ప్రత్యేక కవితాశిల్పం ద్వారా చిరుగాలి తాకిడికి సైతం ప్రకంపించే మనిషి అంతశ్చేతనలోని అతి సున్నితమయిన సితారు తీగెలను తాకగల శక్తి దేవిప్రియ అభివ్యక్తికి వుంది. ఆయన కవిత్వాన్ని అల్లే తీరు మన ఆధునికత అంత కొత్తది. మన స్మృతిపరంపర అంత పాతది. కవిత్వంలో ఆయనది స్వచ్ఛమయిన రుజుమార్గం. 'నిరంతరం మస్తిష్క తటాకంలో పొంగిపొర్లటానికి తన్నుకులాడ్తూన్న తీవ్రభావనలకి' అక్షర రూపాలు దేవిప్రియ కవితలు.

అనేకానేక క్రాంతులు, భ్రాంతులకు ఆలవాలమయిన ఇరవయ్యో శతాబ్దంలో కళ్ళు తెరచి, తనచుట్టూ ఊపిరి సలపనీయని రకరకాల సిద్ధాంతాలు, పార్టీల రేఖా చంక్రమణాలు, ఆచరణలు, అస్తిత్వచైతన్యాల సందోహంలోనూ ఏమాత్రం గందరగోళానికి గురికాకుండా స్థిమితంగా తనదయిన మార్గాన్ని తానుగా నిర్మించుకుని స్థిరంగా నిలబడినవాడు. దాదాపుగా అయిదు దశాబ్దాల తన కవితాప్రయాణంలో కొత్తకొత్త దారుల్నీ, ధోరణుల్నీ గుర్తిస్తూ, సమాదరిస్తూనే తనదయిన స్వంతమార్గాన్ని నిర్మించుకుని ముందుకు సాగిపోతూన్న కవి దేవిప్రియ. చాలామంది ప్రముఖ కవులు అనుకుంటున్నట్లుగా ఇతివృత్తమే కవిత్వమని ఆయన ఏనాడూ అనుకోలేదు. తెలుగులో శివసాగర్, వరవరరావుల తరువాత బలమైన ఒకేఒక రాజకీయ కవి దేవిప్రియ. తన సామాజికతకీ, రాజకీయ వైఖరికీ, వైయక్తికతకీమధ్య ఈ కవిలో ఎక్కడా సరిహద్దు రేఖలు కనిపించవు. చిత్రంగా చెరిగిపోయే ఈ రేఖలను మనం ఈయన కవితలలో అడుగడుగునా గమనించవచ్చు.

ఆధునిక తెలుగు కవిత్వంలో దేవిప్రియ తొక్కిన కొత్త పుంతలు, తెలుగు జర్నలిజంలో ఆయన తీసుకువచ్చిన కొత్త ఒరవడి, చేసిన ప్రయోగాలు, వేసిన కొత్త బాటలు, ఒక్క మాటలో చెప్పాలంటే ఈ విషయంలో తనతో సాటి రాగలిగినవారు ఆయన సమకాలికుల్లో మరొకరు లేరుగాక లేరు.

'మరణమే నీ యదార్థ ఛాయ' అన్నప్పుడు నిజంగా ఆయన ఒక తాత్వికుడు. 'తుఫానుతుమ్మెద'ను పలకరిస్తున్నపుడు ఆయన ఒక విప్లవకారుడు. మహంకాళి జాతరలో బెల్లి లలితను చూసినపుడు ఆయన ఒక తీవ్ర క్రోధాగ్నిపరుడు. 'పూలను నేనొక చామనఛాయ పువ్వు పూజ కోసమే దొంగిలిస్తాను' అన్నప్పుడు ఆయన ఒక నిర్మలప్రేమికుడు. 'మసీదు మెట్లమీదో/ సరయూనది స్నానఘట్టం దగ్గరో/ చెయ్యిచాచి కూలబడిన ఫకీరుల, యాచకుల కళ్ళలో/ ఘనీభవించిన బీభత్సం సామ్రాజ్యవాదం'గా గుర్తించటం దేవిప్రియ దృక్పథం. సమకాలీన పరిస్థితులు, సంఘటనలు, ఆవేశం, ఆలోచన, ఆర్ద్రత నిండిన దేవిప్రియ కవిత్వం సంయమనంతో కూడిన ఒక అండర్‌ప్లే...

కవిత్వంతో అనునిత్యం సహవాసం చేస్తూ, నిరంతరాయంగా రాస్తూవస్తూన్న కవి విషయంలో కవిత్వం కేవలం ఒక ప్రక్రియామాత్రంగానే కొనసాగదు, అంతిమంగా అది అతని వ్యక్తిత్వంగా మారిపోతుంది. అభివ్యక్తి అభివ్యక్తిగా మిగలదు, కవి అస్తిత్వంలో అంతర్భాగమవుతుంది. దేవిప్రియ విషయంలో అక్షరాలా అలా జరిగింది.



కవి 'ఉచ్ఛ్వాసలో లోనికి వెళ్ళిన లోకం నిశ్వాసతో పద్యమై బయటికి వస్తుంది.' శ్వాసక్రియా జనితమయిన ఒక శబ్దరహిత లయ కవి దేహాన్ని సదా అంటిపెట్టుకుని వుంటుంది. తన పదిహేనో సంపుటం 'ఇం..కొకప్పుడు' నాటికి దేవిప్రియ తననుతాను లిఖించుకునే ఒక నూతనక్రమం ప్రారంభమయింది. మరి తననుతాను లిఖించుకోవటం కవిత్వం అవుతుందా? ఖచ్చితంగా అవుతుంది. అయితే కవి తననుతాను లిఖించుకోవటానికి ముందు తననుతాను సృజించుకోవలసి వుంటుంది. తనకీ, కవిత్వానికీ మధ్య అగాధాన్ని ఆసాంతం చెరిపేయవలసి వుంటుంది.ఒక కవిగా ఈ కర్తవ్యాన్ని దేవిప్రియ అత్యంత సమర్ధవంతంగా నిర్వర్తించారు. తన జీవితంలో ఎదురయిన పలు విషాదానుభవాలను దీనికి అవసరమయిన పునాదులుగా పదిలం చేసుకున్నారు. 'అమ్మచెట్టు', 'నీటిపుట్ట', 'తుఫానుతుమ్మెద', 'పిట్టకూడా ఎగిరిపోవలసిందే', 'చేపచిలుక', 'గంధకుటి', 'గాలిరంగు', 'అరణ్యపురాణం', 'ఇం..కొకప్పుడు' సంకలనాలను నిశితంగా పరిశీలిస్తే దేవిప్రియలో తననుతాను సృజించుకునే ఈ ప్రక్రియాక్రమం మనకు స్పష్టంగా అవగతం అవుతుంది. ఈ క్రమం ఇదే వేగంతో ముందుకు సాగితే కవిగా దేవిప్రియ స్థానం ప్రపంచ కవుల సరసన వుంటుందనటంలో ఎటువంటి సందేహం అవసరం లేదు.

మానవప్రపంచంలో దుఃఖం అనివార్యం. అది దేవిప్రియ కవిత్వంలో అతి పుష్కలం. రకరకాల రూపాలలో అతిసహజంగా, సౌందర్యశోభితంగా సాక్షాత్కరిస్తుంది. ఈ దుఃఖంలోంచే సౌఖ్యలోకపు ద్వారాలు తెరచుకుంటాయి. దుఃఖం లేనిదే సౌఖ్యాన్ని ఊహించటంకూడా అసాధ్యం. ప్రత్యామ్నాయ రాహిత్యం మనిషి జీవితంలోకెల్లా అత్యంత విషాదకరమయిన దుఖం. ఈ దుఃఖం లోతుల్లోంచి భవిష్యత్ ప్రత్యామ్నాయాలను ప్రదర్శించటం దేవిప్రియ కవిత్వం ప్రత్యేక నైజం. ఎటుచూసినా నలువైపులా హింస, అసహనం, రకరకాల ఉన్మాదం విశృంఖల స్వైరవిహారం చేస్తున్న ప్రస్తుత సమయంలో మానవాత్మను సూటిగా తాకగల ఇటువంటి సునిశితమయిన కవిత్వం, మరీముఖ్యంగా దేవిప్రియలాంటి సున్నిత మనస్కులయిన కవుల అవసరం గతంలో ఎప్పటికన్నాకూడా ఇప్పుడు మరింత ఎక్కువ.

*(వివిధ, ఆంధ్రజ్యోతి దినపత్రిక*





మాడభూషి శ్రీధర్

# బహుముఖ సంగమం

సమాజానందస్వామి, రన్నింగ్ కామెంటరీ అంటే చాలు దేవిప్రియ గుర్తు కొస్తాడు. పత్రికారచన కవితా రచన ఇక్కడ సంగమిస్తాయి. ఇదొక కొత్త ఒరవడి.

దేవిప్రియ వ్యంగ్య రచయిత, సుప్రసిద్ధ కవి, సీనియర్ జర్నలిస్టు. ఆయన రచించిన గాలిరంగు కవితాసంపుటికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం ఒక మైలురాయి. అవార్డు రాకపోయినా దేవిప్రియ గొప్పకవే. కాకపోతే అవార్డు రావడం ఆయన రచనల గాంభీర్యాన్ని గుర్తు చేసుకోవడానికి, మిత్రులు అభిమానులు కలిసి మాట్లాడుకోవడానికి అవకాశం, దేవిప్రియ కవితలను మరోసారి చదువుకునే సందర్భం.

సీరియస్ వార్తలతో గంభీరంగా ఉండే దినపత్రికల్లో ఆహ్లాదకరమైన మార్పు అందించేవి కార్టూన్లు. దానికితోడుగా ఉదయంలో దేవిప్రియ వాక్ చురకలూ ఉండేవి. ఏరోజు వచ్చే వార్తలపై ఆరోజు సునిశితమైన విమర్శలతో చురకలు పెడుతూ సాగే రన్నింగ్ కామెంటరీని ఆయనే ప్రారంభించారు. అద్భుతంగా దశాబ్దాలపాటు నడిపారు.

మొదటిసారి ఇండియా ప్రపంచ క్రికెట్ కప్పు గెలిచినప్పుడు...

*"వరసపెట్టి వదలగొట్టి*
*అరివీరుల తుప్పు*
*మన క్రికెట్టు సాధించిందోయ్*
*ఘన ప్రపంచ కప్పు"*

అని ప్రశంసించడం నాకు ఇంకా గుర్తుంది.

దేవిప్రియకన్న పదునుగా ఈ రన్నింగ్ కామెంటరీ రచించడం సాధ్యం కాదనిపిస్తుంది. ఆయన సాహితీసేవ దాదాపు అరశతాబ్దానికి చేరువలో ఉంది. దేవిప్రియ



రచనలు ఎంత గొప్పగా ఉంటాయంటే ఆయన అసలు పేరు షేక్ ఖాజా హుస్సేన్ అని ఎవరికీ తెలియదు. ఎవరూ అడగరు. అసలు పేరుతో పనే లేదు. దేవిప్రియ ఆయన కలం పేరు అనికూడా ఎవరూ అనుకోరు. కలం పేరునే సొంతపేరుకన్న లోతుగా సొంతం చేసుకున్న కలం ఆయనది.

మా సోదరతుల్యుడు, సీనియర్ మిత్రుడు టంకశాల అశోక్‌ను కలవడానికి హైదరాబాద్ వచ్చినపుడు దేవిప్రియ ప్రజాతంత్ర సంపాదకుడుగా నాకు పరిచయం. అప్పటికే ఆయన పెద్ద జర్నలిస్టు. నేను జర్నలిజంలో అడుగులు వేస్తున్న రోజులు. ఆయన సంపాదకత్వంలో వెలువడిన ప్రజాతంత్ర పత్రికలోనే నేను శ్రీశ్రీ అనంతం చదివాను. అప్పుడే ఆయన వ్యంగ్యరచనలుకూడా అందులో చదివాను. ప్రజా వాహిని, నిర్మల, ప్రజాతంత్ర, జ్యోతి, మనోరమ మొదలైన పత్రికలలోనూ, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఉదయం, హైదరాబాద్ మిర్రర్ దినపత్రికలలో ఆయన పని చేశారు. దాసి, రంగులకల సినిమాలకు స్క్రీన్‌ప్లే, పాటలుకూడా దేవిప్రియ రచించారు. ప్రజా గాయకుడు గద్దర్‌పైన ఆంగ్లంలో పూర్తి నిడివి డాక్యుమెంటరీ ఫిలిం మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్ పేరుతో నిర్మించి దర్శకత్వం వహించాడు.

తన పుట్టిన రోజుగురించి దేవిప్రియ ఇలా కవితాత్మకంగా చెప్పారు.

*నా పుట్టిన రోజుదేముంది,*
*ఒక కాడ్వెల్ తరువాత,*
*ఒక శ్రీశ్రీ తర్వాత,*
*ఒక పాణిగ్రాహి తర్వాత,*
*ఒక చెరబండరాజు తర్వాత,*
*పుట్టినవాణ్ణి నేను"*

అనువాదంలో దేవిప్రియది అందెవేసిన చేయి. పదపదానికి అనువాదం చేయడం కాదు. అర్థంలేని వాక్యాలు వదిలేసి, సమర్థవంతంగా అర్థవంతంగా వాక్యాన్ని నడపడం ఆయనకు తెలిసిన విద్య. ఉరిమే ఉత్సాహం అనే పదాన్ని సృష్టించి, దానిని థమ్సప్. ఒక శీతల పానీయం ప్రచారంలో ఆయన ఒక అస్త్రంవలె వాడాడు. చాలా గొప్పగా ఉంది.

సమాజానందస్వామి, అమ్మచెట్టు, నీటిపుట్ట, గరీబుగీతాలు, తుఫాను తుమ్మెద, పిట్టకూడా ఎగిరిపోవాల్సిందే, చేపచిలుక, గంధకుటి, ఇన్షాఅల్లాహ్ (పద్యకావ్యం) ఇలా ఒకటేమిటి దేవిప్రియ అద్భుతమైన కవితా సంపుటాలెన్నో ఉన్నాయి.

ఆయన జీవితం అక్షరంతో మమేకం. వేరే ఉద్యోగాలు వర్తకం తెలియదు. డబ్బు ఉందో లేదో చూసుకోకుండా పత్రికను నడిపి చేతులు కాల్చుకోవడం, బాధ అనిపిస్తే ఆత్మగౌరవం కోసం ఉద్యోగం వదిలిపెట్టడం, తరువాత కొత్త ఉద్యోగం వెతుక్కోవడంతో దేవిప్రియ జీవితం. మామూలుగా సమాజం పట్ల పట్టింపు ఉన్న



కవి. విలేకరి జీవితంవలెనే సాగిపోతున్నది. మంచి ఉద్యోగం ఉందనుకుంటే మరొకటి ఆలోచించడం ఉండదు. మరో ఉద్యోగం దొరికితేనే ఉన్న ఉద్యోగానికి రాజీనామా చేయాలనే ఈ తరం తెలివితేటలుకూడా అవసరం అనుకోలేదాయన.

1984 నుంచి 94 వరకు నేను ఉదయంలో పత్రికలో పని చేసినప్పుడు ఆయన ఆదివారం సంచికను కూడా నడిపేవారు. కాని ఆయన రన్నింగ్ కామెంటరీ రచయితగానే జర్నలిస్టులలోకూడా పాప్యులర్. నేను చెకొస్లవేకియా వెళ్లివస్తే నన్నడిగి అక్కడి జనజీవనంమీద నాతో వ్యాసం రాయించి ఆదివారం సంచికలో ప్రచురించారు. తిరుమలలో సహజ శిలాతోరణం ఏ విధమైన రక్షణ లేకుండా ఉన్నదని నేను వార్త రాస్తే, ఆ శిలాతోరణం ఎంత ప్రాచీనమైందో, దాని వివరాలేమిటో వివరిస్తూ సండే ఫీచర్ ఆర్టికిల్‌గా రాయాలని కూడా ప్రోత్సహించడం నాకు జ్ఞాపకం. మా హైదరాబాద్ ఎడిషన్‌లో మరో సుప్రసిద్ధ రచయిత ప్రతిభావంతుడు శ్రీ కె.ఎన్.వై పతంజలి ఉండేవారు. ఆయన దేవిప్రియను ప్రశంసిస్తూ 'దేవిప్రియవలె ఇంత వైవిధ్యం విస్తృతీ ఉన్న కవి తెలుగులో శ్రీశ్రీ తప్ప మరెవరూ లేరు' అన్నారంటే, దేవిప్రియ గొప్పదనం అర్థం చేసుకోవచ్చు.

గాలిరంగు కవితా సంపుటిలో ఒక పంక్తి : "అటుగాలి ఇటురాదా, అటువాన ఇటు పోదా" అనే మాటల్లో ఎంత అర్థం? అలతి పదాల్లో అపూర్వమైన భావాలు పలికించడం దేవిప్రియ ప్రతిభ.

ఆయన ఇంటికి అమ్మచెట్టు అని పేరు పెట్టుకున్నారు. ఆ పేరులో తెలుగు దనం ఉంది. అమ్మదనం ఉంది. కమ్మదనం ఉంది. అమ్మకు చెట్టుకు మధ్య విడదీయని అనుబంధం ఉంది. రెండు మాటల్లో ఇంత అర్థాన్ని ఇమడ్చడం దేవిప్రియకే చెల్లింది.

ఆడంబరమైన పదాలు కవితకు అవసరం లేదు. భావం సహజంగా వ్యక్తం చేయడానికి పదాలు వాటంతటవ అవే రావాలి. అదే కవిత్వం. ప్రత్యేకంగా మెరుగులు దిద్దనవసరం లేదు. మేలుకున్న వాడే కవిత రాయగలడు అని దేవిప్రియ విశ్వసిస్తారు. అవును. చైతన్యం అంటే అదేకదా.

⚜

***నిన్నటి ఇసుకలోనే ఇంకా***
***తలదూర్చి పడుకుంది ఈ దేశంఉష్ట్రపక్షి***

(దేశం : అమ్మచెట్టు)



బండ్ల మాధవరావు

# సునిశిత కవి దేవిప్రియ

దేవిప్రియ పేరు ఎంత ప్రియత్వం గోచరిస్తున్నదో ఆయన కవిత్వం కూడా అంతే ప్రియంగా, తాజాగా, నూతనంగా, సున్నితంగా వుంటుంది. తనదయిన ఒక ప్రత్యేకమైన సున్నిత భాషని, ఒక నిర్మాణ సంవిధానాన్ని సమకూర్చుకున్న అరుదయిన తెలుగు కవి దేవిప్రియ. తన కార్టూన్ కవిత రన్నింగ్ కామెంట్రీతో తెలుగు పాఠకులకు బాగా సుపరిచితులు. 'అమ్మచెట్టు' కవితా సంపుటితో తెలుగు వచన కవిత్వంలోకి అడుగుపెట్టిన ఈయన గత నాలుగున్నర దశాబ్దాలుగా తన కవితా కృషీమత్వాన్ని కొనసాగిస్తూనే వున్నారు. కవిగా దేవిప్రియను అంచనా వేయాలంటే ఆయన ఇతర పార్శ్వాలనుకూడా ఎంతోకొంత పరీక్షించాల్సిందే. ఈయన కవిగా ఎంతటి ప్రతిభాశాలో సంపాదకుడుగా, సినీపాటల, మాటల రచయితగా, డాక్యుమెంటరీ నిర్మాతగా, మీడియా సలహాదారుగాకూడా అదే స్థాయిలోతన ప్రతిభను ప్రదర్శించారు. తెలుగు, ఆంగ్లభాషలపై ఈయనకున్న పట్టును గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. చదువుకునే కాలంనుంచే ఛందస్సులో, మరీముఖ్యంగా కందంలో పద్యాలు రాయడం ఈయనకు అలవడింది. అది తరువాత కాలంలో ప్రజాతంత్ర వారపత్రికలో సమాజానందస్వామి పేరుతో వ్యంగ్యపద్యాలుగా వెలువడటానికి దోహదం చేసింది.

'గాలిరంగు'లోని కవితలన్నీ సామాజిక తాజాదనంతో నిండివుంటాయి. ఇందులోని ఒక కవిత ఒక మహాకావ్య మంతటి ఉన్నతిలో వుంటుంది. ఏ కవితను స్పృశించాలన్నా గుండె లోతుల్లో ఎక్కడో ఓ అలజడి. ఇలా ఎందుకున్నాం అనే ప్రశ్న నిరంతరం వెంటాడుతూ వుంటుంది. దేవిప్రియ కవిత్వం వ్యక్తిగతమా అన్నట్లు అనిపిస్తూనే సామాజికతను బలంగా మన ముందుకు తెస్తుంది. గాలికి రంగును ఊహించగలమా మనం? కవి చీకట్లలోకికూడా వెలుగును ప్రసరింపజేయగల ప్రతిభాశాలి. అందుకే గాలికికూడా రంగును ఊహించ గలడు. మారుతున్న సమాజంలో



'ప్రవక్తలు పారిపోతారు. స్వాప్నికులు శిలువనెక్కుతారు. నియంతలు త్యాగపురుషులవెనక శరణు తీసుకుంటారు. రక్తపిపాసులు చేతిలో పుష్ప గుచ్ఛాలతో తిరుగుతారు' అంటూ నువ్వు నేను మాత్రం నిస్సహాయంగా ఉన్నాం. 'గాలిరంగునైనా ఊహించగలం కానీ, రానున్న రేపటి రూపే చూపుకందడం లేదు...!' అంటాడు.

చిరమాలిన్యం అనే కవితలో 'ఆకాశానికి భూమికి మధ్య అవతరించాం. గగన ఢమరుక లయనీ, అడవిని ఊయలలూగించే వాయురాగాలనీ విన్నాం. హోరు జల పాతాల బృందగానాలని ఆదరించాం అంటూ, సాధించిన ప్రగతిని ప్రస్తావిస్తూ ఎంత ఎదిగినా 'మనిషి మాలిన్యాన్ని ఇన్ని నులివెచ్చని కన్నీళ్లతో కడిగి శుభ్రం చెయ్యలేక పోయాం' అంటాడు. కవితలకు కవితా సంపుటలకు పేర్లు పెట్టడంలో దేవిప్రియకు ప్రత్యేక అభినివేశం ఉంది. ఎప్పటినుంచో పేరుకుపోయిన మాలిన్యాన్ని 'చిరమాలిన్యం' అనడం కళ్లకు కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్న తరువాత చూస్తున్న కొత్త చూపును 'కొత్తకళ్లు' అనడం, చెమట చెలమల అలల ఘోష, గగన బీభత్సం, ఏకాంత తటాకం లాంటివి కొన్ని మచ్చుతునకలు.

నమోదవుతున్న చరిత్ర ఎవరిది? ఎవరి ఉత్థాన పతనాల్ని వారు రాస్తున్నారు. తరతరాలుగా అణిచివేయబడుతున్న జాతుల నెత్తుటి బడబానలాల మూలచరిత్రని ఎవరు నెత్తికెత్తుకుంటున్నారు అని ప్రశ్నిస్తూ 'ఏ హోమరు, ఏ వాల్మీకి, ఏ వ్యాసుడు, ఏ నన్నయ రాశాడు రక్తబీజాలు చల్లుకుంటూ ఇతిహాస ఊసర క్షేత్రాలలో మందార పాదముద్రలు వదిలివెళ్లిన జనవీరుల గాథ? అని, ఇప్పటిదాకా రాసింది చరిత్ర కాదు. రాయాల్సింది ఎంతో వుంది' అంటాడు.

ఆత్మసాక్షి గురించి మాట్లాడుకుంటాం. కొన్నిసార్లు తెలిసో తెలియక చేసిన తప్పులు మనల్ని పశ్చాత్తాప జ్వాలలతో దగ్ధం చేస్తుంటాయి. జీవితంలో కొంత ముందుకెళ్లిన తరువాత ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే నడిచొచ్చిన అడవులు, మైదానాలు, నదులూ జీవితాలే కాదు, కొన్ని అపరాధ భావనలుకూడా మనల్ని వెంటా డుతూ వుంటాయి. అటువంటి భావనలతోనే దేవిప్రియ 'క్షమ' కవిత రాశాడు. 'తన్మయ యవ్వనాన, పచ్చగడ్డి మైదానంలో పరుగెత్తినప్పుడు ఏమో, ఎప్పుడెలా గుచ్చుకుందో, అరికాలిలో ఈ తుమ్మముల్లు, ఇప్పుడు నిప్పురవ్వలు గుచ్చినట్లు సలుపుతోంది.' ఇక్కడ ప్రతి అక్షరం అక్షరం గుండెగాయాలను కెలుకుతూనే వుంది. వాక్యారంభమే 'తన్మయ యవ్వనాన' అనడం ఒక సరికొత్త పదబంధ సృష్టి. యవ్వనం ఎప్పుడూ ఎవరికైనా తన్మయంగానే వుంటుంది. అప్పటి చర్య అయినా కొంతకాలం తరువాత తీయని జ్ఞాపకంగా మిగలవచ్చు లేదా చిన్న గాయమై నిరంతరం సలుపనూవచ్చు. 'సగందాకా ఎక్కి, తాడిచెట్టు మీదనుండి పడి పోయినప్పుడు, ఎప్పుడు డోక్కుపోయాయో నవనీతపు ఈ కాళ్లూ చేతులు, ఇప్పుడు చెక్కులూడి ఎర్రగా బెదరగొడుతున్నాయి. అమ్మానాన్న

అవలీలగా క్షమించారుగానీ, అపరాధ భావనలు అస్సలు మన్నించడం లేదు. నన్ను లోలోపల సుడులు తిరుగుతుండే ఈ అపరాధ భావన ఎప్పటికీ తనను మండిస్తూనే వుంది' అంటాడు కవి.

హైదరాబాద్ కార్యక్షేత్రంగా నిరంతరం రగులుతున్న కవి దేవిప్రియ తనకు జీవికను ప్రసాదించిన, కవిగా నిలబెట్టిన గడ్డమీద కొనసాగుతున్న అస్తిత్వ పోరాట ఉద్వేగాల్ని తనలోకి ఆవాహన చేసుకున్నాడు. అయితే ఇవేమీ పేదవాడి ఆకలి పోరుకు తుది పలికేవి కావని, ప్రాంతాలమధ్య సరిహద్దులు మొలిచినంత మాత్రాన అట్టడుగు జీవితాల్లో పెద్దగా మార్పులేమీ చోటు చేసుకోవనే అవగాహనతో వున్నప్పటికి వస్తున్న మార్పులకు స్వాగతం పలికాడు దేవిప్రియ. 'కోస్తా, సీడెడ్, నైజాం, ఆంధ్ర, సీమ, తెలంగాణ మూడు ముక్కలు, మూడు చెక్కలు, గంజిలో మెతు కెరగదొకటి, తేళ్లూ నాపరాళ్ల నేలొకటి. రాగి సంకటి బండల రాజసమొకటి' అంటూ మూడుప్రాంతాల వాస్తవిక దృశ్యాన్ని కళ్లముందు పరుస్తూనే 'భాష కంటే బలమైనదొకటి, ఏదో శాసిస్తోంది కదా నీ ఊపిరిని. పీల్చుకోనీ కొత్తగాలిని. రాసుకో నీ సొంతకావ్యం' అంటూ ఉద్యమాన్ని స్వాగతించాడు. ప్రాంతాలుగా విడిపోయినా 'ఏ ఒడ్డున నిలబడినా మనిషి మనిషి కోసం పోరాడనీ. తెలుగు పలుకు, తెలుగు తీపి, సజీవ మానవ మహా శాసనంమీద చిరస్థాయిగా నిలిచిపోనీ' అంటూ భాష ఎప్పటికీ మనల్ని కలిపే వుంచు తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తాడు.



*సూర్యుడా*
*సర్వవినాశక యుద్ధభూమిలో*
*చిగురించిన నూతనమానవుడి నుదుటిమీద*
*నువ్వు ఒక నులివెచ్చని మార్పుముద్దగా*
*ఎట్లా మారతావో నేనొక చిరంజీవిచూపునై*
*చూడాలని వుంది !*

(అక్షయ దృష్టి : అరణ్యపురాణం)



యాకూబ్

# మహోన్నత కవి దేవిప్రియ

ఒక గుడిసె కథ, హిట్లర్ నవ్వు, తుఫానుతుమ్మెద, దెర్భ్సా ఉజాలా, సంగీత సూర్యుడు, పుట్టినరోజు గురించి, నీటిపుట్ట, అజంతా, దయలేని నగరం వీధుల్లో, ధరణి.. ధరిత్రి.. భూమి.., అమ్మపాడిన ఆ పాట, ఈమె ఎవరు? విషాద విదూషకుడు, ఇలా చెప్పుకుంటూ పోతే దేవిప్రియ కవితలు, నిద్రలోనూ గుర్తుండే లక్షణం కలవి, ఇంకా ఎన్నో. ఒక కవి సృజనశక్తికి సంబంధించిన కొలమానం ఇంతకంటే వేరే ఏం కావాలి? కవిత్వానికే పాఠాలు నేర్పగలిగిన నేర్పరి దేవిప్రియ. శిల్పనైపుణ్యం దేవిప్రియకి తెలిసినంతగా ఈయన సమకాలీనులలో మరెవరికీ తెలియదేమో. ఎన్ని ప్రక్రియలు ఈ కవికి దాసోహం అన్నాయో అని ఒకింత ఆశ్చర్యం, మరింత ప్రశంసాభావన కలుగుతాయి. దేవిప్రియ 'రన్నింగ్ కామెంటరీ'లు అప్పట్లో ఆంధ్రదేశాన్ని ఆవురా వురుమని చదివేట్లు చేశాయి. మా చిన్నప్పుడు ఆంధ్రప్రభ, ఉదయం, ఆంధ్రజ్యోతి మొదటి పేజీలలో ప్రతిరోజు వచ్చే రన్నింగ్ కామెంటరీలు క్యూలు కట్టి చదివింపజేసేవి. పుచ్చలపల్లి సుందరయ్యగారు చనిపోయినప్పుడు 'సోషలిజం ఈ దేశపు / బిడ్డల తల నిమిరినపుడు / ఎర్రబడిన ఏ మబ్బుల / తేరుమీదొ వచ్చిచూడు' అని దేవిప్రియ 'ఉదయం'లో రాసిన రన్నింగ్ కామెంటరీ మా ఖమ్మం జిల్లాలోని అనేక పట్టణాల్లో, గ్రామాల్లో, ఇంకా రాష్ట్రవ్యాప్తంగా సి.పి.యం. పార్టీ కార్యాలయాల గోడలమీద రాశారు. ఒక కవికి ఇంతకంటే గౌరవం, ప్రజల అభిమానం వేరేముంటుంది.

'జమ్ జమ్మల్ మర్రీ' వంటి ఆయన సినిమా పాటలు నేటికీ నిత్యనూతనంగా ప్రజలు పాడుకుంటూనే ఉన్నారు. పాటకు పదాలతో ప్రాణం పోసే కళ తెలిసినవాడు దేవిప్రియ. దేవిప్రియది అనునయకంఠం. ఆగ్రహాన్నికూడా అనునయంగా వ్యక్తీక రించడం ఆయన ప్రత్యేకత. ఈ ప్రత్యేకతే దేవిప్రియను సమకాలీన సాహిత్యంలో భిన్నంగా నిలబెడుతున్నది. తానే చెప్పుకున్నట్లుగా తన కవిత్వం – 'ఇంద్రధనుస్సుకి/



నిద్రలో కనిపించే బ్లాక్ అండ్ వైట్ స్వప్నం/ పద్మవ్యూహంలోంచి/ బయటపడే ప్రయత్నం చేయడం,' 'కనురెప్పల వెనుక మూసిన నిశీధిలో/ చూచుకాన్ని మీటుతున్న చూపుడువేలు,' 'నీటిలోకి నిటారుగా దిగిన / కత్తిలా నిశ్శబ్దంగా చీల్చుకుపోవడం.' ఇంత వైవిధ్యభరితమైన కవిత్వతత్వమే దేవిప్రియని కవితారంగంలో ఒక మహోన్నత కవిగా నిలబెడుతోంది. తన జీవితంలోని సంయమనం కవిత్వంలోను ప్రతిఫలిస్తుండ డంవల్ల ఆయన కవినాయక పాత్రపోషణకు దూరంగా ఉంటారు. సాహిత్యరంగంలో ఈ కవినాయక పాత్రల మంచు విడిపోతే తప్ప ఇంకా స్పష్టంగా దేవిప్రియ అర్థం కాదేమో.

దేవిప్రియ ఊహ చేసే పద్ధతి, ఆయన కవిసమయం భిన్నంగా ఉంటాయి. శబ్దాన్ని, అర్థాన్ని తన అదుపులో పెట్టుకుని, పదాలకు తన ముద్రతో కూడిన భావాన్ని అద్దడం ఆయన ప్రత్యేకత. ప్రతిపాదంలోను కవిత్వం తొణికిసలాడే సందర్భాలే అన్నీనూ. గద్దర్ గురించి ఆయన ఊహ చేసిన పద్ధతి చూడండి. "నల్లమబ్బు గొంగళి భుజానేసుకున్న / భువనజనహవనఘోష / ఒక నక్షత్ర ఖచిత నవనీత ఖడ్గం / నిప్పులనదిలో ఈదుతున్న / మహాద్భుతమైన మాటల మంచుచేప. ఒక్కో పదబంధం ఒక్కో ప్రతీక ఎంత ఒడుపుగా, ఎంత బిగుతుగా భావాన్ని మనకు బోధపరుస్తాయో గమనించండి. ఇది దేవిప్రియ కవిత్వంలోని సహజగుణం. 'మూడోకన్ను ఉదయించిన కవికి / ముప్పైమూడో కన్ను ప్రతీకగా" చేసుకున్నవాడు దేవిప్రియ. ఎన్నిబొమ్మలు, ఎన్ని కేకలు, ఎన్ని చిహ్నాలు – ఈ కవి కలంలోంచి ఏ ఏ పద్ధతుల్లో రూపుదిద్దుకున్నాయో పరిశీలిస్తే ఆధునిక కవిత్వంలో ఈయన స్థానమేమిటో స్పష్టంగా అర్థమవుతుంది.

తొలిదశలో 'నాలుకమీద కవిత్వం / తలమీద దారిద్ర్యం' తన రెండు నిధులుగా చెప్పుకున్న ఈ కవి, 'కవిత్వ నిత్య నిబద్దంగా బతకడం / దారిద్ర్యవిముక్తి యుద్ధం చేయడమే తన విధులు'గా చేసుకున్నాడు. కవిత్వ నిత్య నిబద్ధుడిగా బతికే దేవిప్రియ చుట్టుముట్టి వుండే జీవనవేదన ఆయనను సదా జాగరూకుడిగా చేస్తుంది. తాను ఏ మూలాలనుండి వచ్చాడో, తన జీవననేపథ్యం ఏమిటో మరవకుండా ఉంచుతుంది. ఇప్పటికీ తన బాధ్యతల్నీ, తన సహోదరుల్నీ కవచంలా కాపాడుతూ, జీవన బాధ్యతల్ని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కుంటున్న సాహసి.

'ఈ గుడిసెలోనే నాకు తొలిసారిగా / కానరాని కన్నీటి సముద్రాలు / ఉప్పొంగుతూ కనిపించాయి' అని పారదర్శకంగా తనను గురించి చెప్పుకున్న ఈ కవిని నిరంతరం మెలకువగా ఉంచిందికూడా ఆ గుడిసే. పొగాకు కంపెనీ సైరన్ మోతలు, కోడిపెట్ట వేసిన రంగురంగుల రెట్టలు, గుడిసెకు కాపలా కన్నె వెలిగిన గుడ్డిదీపం, రెల్లుపోచలు, అడివి, ఇంకా ఇటువంటి ఎన్నో జీవనవాస్తవికతలు ఆయన లోని నిత్యనిబద్ధతను కాపాడుతున్నాయి. ఆయనను తన సహజ జీవనశైలిలోనే



జీవించేట్టు చేస్తున్నాయి. తన సామాజిక కవితానేపథ్యం, ఆయన కవిత్వంలో స్పష్టంగా కచ్చితంగా ప్రతిఫలించింది. ఒక ప్రధాన మైనారిటీ మతంలో పుట్టిన ఈ కవి, 'అమ్మ పాడిన ఆ పాట', 'బాల్య రంజాన్' వంటి కవితలలో మైనారిటీ జీవనస్పృహనీ, వేదననీ స్పష్టంగా కవిత్వీకరించాడు. తాను ఒక సీతాకోకచిలుకగా, రాకాసి లోయవలే ఉన్న ఈ ప్రపంచంమీద వాలినప్పుడు తన తల్లి, చనుబాలలో కలిపి తాగించిన కవిత్వమే తనను బతికించి ఉంచిందని చెప్పుకున్నాడు. ఆమె తన చిన్నప్పుడు పాడిన ఖసీదాలు, ఆమెవల్ల తనకు సంక్రమించిన కవిత్వం – ఇవన్నీ తనలోపల ఆరకుండా వెలుగుతూ వుండడంచేతనే తాను కవిగా నిలబడ్డానని చెప్పుకోడంలో ఈ కవి అంతర్లోకం కచ్చితంగా కనిపిస్తోంది. మైనారిటీ వేదనను, సమాజవేదనను మేళవించి నిప్పులు కురిపించాడు. ప్రేమను కురిపించాడు. అన్ని వేళల్లోను, అన్ని సందర్భాల్లోను, అప్రమత్తంగా కను చూపుతో ఆకర్షిస్తున్నాడు.

కవిత్వానికి కావలసిన ముడిసరుకు దేవిప్రియ విషయంలో ఎవరూ ఊహించలేని కోణాలనుంచి, ఎవరూ పట్టించుకోని విషయాలనుంచి వచ్చి చేరుతుంది. 'దెర్సూఉజాలా', విప్లవకారుల కోసం ఎదురుచూస్తున్న ఖాళీ కుర్చీలు, విమాన ప్రయాణాలు, శిఖామణి పెళ్ళికి రైలు ప్రయాణం, రుతువర్ణన గురించి 'కిమ్ కాలమ్', బెల్లి లలిత హత్య, తన కవిత్వంలో విస్తృతంగా పరచుకున్న గద్దర్ (అనేక రూపాల్లో, మెటఫర్లలో), గరీబుగీతాలు, సమాజానందస్వామి, ఇన్షాఅల్లాహ్, అందులోని మహా వ్యంగ్యం, తొలిసారిగా తెలుగు కవిత్వంలో కవితావస్తువుగా సంగీతాన్ని, బిస్మిల్లాఖాన్‌ను స్వీకరించడం, సీసాయుధం వంటివి ఎన్నైనా దేవిప్రియ కవితావస్తువుల పరిధి అనూహ్యమైనదని చెప్పడానికి ఉదాహరించవచ్చు. ఈయన కవితానిర్మాణ నిపుణతవల్ల కవిత్వానికి అదనంగా అనుభూతి పరిధి విస్తృతమయింది. కవిత్వ వైశాల్యం, వైవిధ్యం, ఊహచేసే పద్ధతివల్ల దేవిప్రియ కవిత్వంలో పదేపదే చదివించే గుణం ఎక్కువ. భావుకత్వం తొణికిసలాడే కవి దేవిప్రియ. తక్షణ స్పందనల్నికూడా అపూర్వమైన రీతిలో అపురూప కవిత్వంగా మలిచే కళ దేవిప్రియకు తెలుసు.'నేను / శ్రమపోసి / పెంచుకున్న దేహం / పిడుగులు మోసుకు తిరిగే ఆకాశం, నన్ను / ఒక్కడినే ఫోటో తీసినా / కడిగి చూస్తే అందులో / మీరందరూ కనిపిస్తారు.'

దేవిప్రియలోని సహజ ముఖావలక్షణం కవిత్వంలో అంతర్ముఖతగా దర్శనమిస్తుంది. ఆయన స్పందనల్లో సమాజాన్ని విశ్లేషిస్తూ రాసే కవిత్వంలో లేదా ప్రపంచ విషయాలు ప్రస్తావిస్తున్నప్పుడు కానీ, ఈ అంతర్ముఖత లక్షణంవల్ల కవిత్వంలో ఒక భిన్నమైన కోణం ఆవిష్కృతమవుతుంది. శబ్దం పట్ల, అర్థం పట్ల, నడక పట్ల ఆయనకు ఉండే శ్రద్ధవల్ల, ప్రాపంచిక దృక్పథంవల్ల ఈయన కవిత్వానికి వేరొక చోట కనబడని మెరిసే లక్షణం వస్తుంది. ఈ మెరుపు కవిత్వమే కవిగా దేవిప్రియ చిరునామాను



ప్రకాశింప జేస్తుంది. ఆ లక్షణం, దేవిప్రియ కవితలు మనకు లెక్కలేనన్ని గుర్తుండి పోడానికి కారణమవుతుంది. పై లక్షణాలతోపాటు దేవిప్రియ కవిత్వాన్ని 'ఉల్లేఖన స్థాయి'కి చేరుకున్న కవిత్వంగాకూడా చెప్పుకోవలసి ఉంది.

ఒక కవిత్వం ఉల్లేఖనాస్థాయికి చేరడం అరుదు. పఠాభి, శ్రీశ్రీ, ఆరుద్ర వంటి వారి కవిత్వాలను సభల్లోనూ, వ్యాసాల్లోను, ప్రత్యేకసందర్భాల్లోను, సంభాషణల్లోను కోట్ చేస్తుంటాం. అలా కోట్ చేసే కవిత్వ పాదాలు దేవిప్రియ కవిత్వంలో కోకొల్లలు. 'ఆకాశం చెట్టుకి కట్టిన/ అద్భుతమైన ఊయలలా వుంది విమానం', 'నాకు రెండు/ విధులున్నాయి / కవిత్వనిత్యనిబద్ధం/ దారిద్ర్య విముక్తియుద్ధం', 'కవులు ప్రేమిస్తారు / నిజానికి వాళ్ళకు చేతనైంది / అదొక్కటే', 'గాలినదిలో తేలే / గాలిపటం పడవ', 'మరణం ఒక తీర్చలేని రుణం', నిప్పుల నదిలో ఈదుతున్న మహాద్భుతమైన మంచుచేప వంటివెన్నో ఈ కోవకు చెందినవి.

దేవిప్రియ కవిత్వంలో మరో ప్రధానలక్షణం లయ. అత్యాధునిక వచన కవిత్వంలో ఇది అతితక్కువగా కనిపించే లక్షణం. ఈ గుణంవల్ల దేవిప్రియ కవిత్వం చదువుతున్నప్పుడు ఒక గంభీరమైన నడకతో సాగుతుంది. శబ్దప్రధానమైన ఈ గుణం వల్ల అనుభూతి సాంద్రత పెరుగుతుంది. ఈ అనుభూతి సాంద్రత పెరగడానికి కేవలం శబ్ద ప్రాముఖ్యతే కాక, వస్తువులోని భిన్నతకూడా కారణం. తీసుకున్న వస్తువులోని సున్నితమైన పార్శ్వాలు ఆవిష్కారమవుతుండడం, శబ్దలయ దానికి తోడవడం, దేవిప్రియ కవిత్వంలో ఎల్లెడలా కనిపిస్తుంది. 'అడివీ, నువ్వంటే నాకిష్టం', 'అసామాన్య పర్వత పవనగాన జలపాతం', 'ముందుకు దూకుతున్న/ ఇనుపజింకలా వుంది మా రైలు', 'నీ పాటలో / నీ చెవులకు లోలాకులై కదలాడిన నక్షత్రాలు / నీ చేతులకు గాజులై నిక్వణించిన చంద్రరేఖలు / నీ సిగలో నాగరమై ప్రజ్వలించిన సూరీడు/ నాకు కనిపించ లేదమ్మా' – ఇలా సాగుతుంది కవితల నడక, ఆ లయతో కూడిన నడక అనుభూతిని సాంద్రతరం చేస్తుంది.

ఇక పాటల విషయం – ఒక చిన్న ఉదాహరణతో ఆయన పాటను కూడా ఎలా దోచుకున్నాడో చెబుతాను. 'జమ్‌జమ్మల్ మర్రీ – వెయ్యికాళ్ళ జెర్రీ' అనే పాటలో 'ధారలు కట్టిన చెమటే జరీ పైట నీకు, చల్' అనే చరణంలో ఎంత కవిత్వం దాగుందో విశ్లేషిస్తే పాటలో దేవిప్రియ కలం ఎలా ఉరకలెత్తుతుందో, పాటనుకూడా కవిత్వంతో ఎలా నింపుతుందో ఇట్టే తెలిసిపోతుంది. రన్నింగ్ కామెంటరీలు, వ్యంగ్య, కందాలూ, సినిమా స్క్రిప్టులు, హత్తుకునే అడ్వర్టయిజ్‌మెంట్లు, ఇలా బహుముఖీనమైన ప్రతిభావ్యుత్పత్తులతో, నైపుణ్యంతో వాస్తవిక ప్రాపంచిక దృక్పథంతో సాహిత్య రంగంలో,

అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద, అరణ్య పురాణం, గాలిరంగు, ఇంకొకప్పుడు వంటి కవితాసంపుటులతో కవిత్వరంగంలో పెనవేసుకున్న అసాధారణ కవి దేవిప్రియ. కుడోస్ టు దేవిప్రియ.

వచనకవితా సంపుటి 'గాలిరంగు'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా దేవిప్రియకు జయహోలు!

*(మన తెలంగాణా, 25.12.2017)*

⚜

*పలనాడంటే నా లో*
*పల జలజలమని పొరలు భావనలేవో,*
*గలగలల చంద్రవంకకు*
*ఇల గలదా సాటి ఏరు, ఇన్నా అల్లాహ్ !*

*మానవవేదన కంతం*
*భూనభలోకాల నడుమ పొంచుంటుందా?*
*కానన మునులకు కా దది*
*ఈ నరులకె తెలియగలదు, ఇన్నా అల్లాహ్ !*

*ఆకలిదప్పులు వుండని*
*లోకమొకటి కావలెనని లోపల యేదో*
*వ్యాకుల స్వప్నం ఇంకా*
*ఈ కవి మది వీడలేదు, ఇన్నా అల్లాహ్ !*

(ఇన్నా అల్లాహ్ శతకం)



వంశీకృష్ణ

# గాలికి రంగులద్దిన దేవి

కొన్ని వార్తలు విన్నప్పుడు, కొన్ని దృశ్యాలు చూసినప్పుడు మనకు ఆనందం, ఆశ్చర్యం, దుఃఖంలాంటి భావావేశాలు అన్నీ ఒకేసారి కలుగుతాయి. మనసు దేనినీ పూర్తిగా అనుభవించలేని ఒక నిరామయ స్థితికి వెళ్లిపోతుంది. ప్రముఖ కవి దేవిప్రియకి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది అన్న వార్త టీ.వీ. తెరమీద స్క్రోలింగ్ అవుతున్నప్పుడు నాకు ఆనందం, ఆశ్చర్యం ఒకేసారి కలిగాయి. ఇప్పటివరకు దేవిప్రియ కి కేంద్ర సాహిత్య పురస్కారం లభించనందుకు ఆశ్చర్యము, ఇప్పుడు లభించినందుకు ఆనందము, పోనీ ఇప్పటికైనా వచ్చింది కదా అన్న నిట్టూర్పు ఒకేసారి కలిగినయి.

దేవిప్రియను మొదటిసారి ఖమ్మంలో అఫ్సర్ పెళ్ళికి వచ్చినప్పుడు కలిశాను. అప్పటికే నేను రన్నింగ్ కామెంటరీతో ప్రేమలో వున్నాను. మౌనంగా చూడటం తప్పిస్తే పెద్దగా మాట్లాడిందేమీ లేదు. తన కవిత్వంలాగే చాలా మృదుభాషి దేవి. తనను ఒక చట్రంలో ఇమడ్చటం, ఒక ఛత్రంకింద నిలపడం చాలా కష్టం.

సినిమా, పాత్రికేయ వృత్తి, కవిత్వం, గీత రచన ఇలా అన్నిటినీ అలవోకగా అమిత సీరియస్‌గా నిర్వహించినవాడు దేవిప్రియ. నాటి అమ్మచెట్టు నుండి నేటి ఇం...కొకప్పుడు వరకు తన ప్రయాణం అనితర సాధ్యం. గరీబు గీతాలు, సమాజానంద స్వామి, ఇన్షాఅల్లా, రన్నింగ్ కామెంటరీ కవిత్వయాత్రలో ఇష్టంగా చేసిన కొన్ని మజిలీలు. ప్రజాయుద్ధనౌక గద్దర్‌లాంటి డాక్యుమెంటరీలు, జమ్‌జమ్మల్‌మర్రీలాంటి సినీగీత రచన తన కవిత్వమనే వెండిమబ్బుకు తానే అందంగా గార్నిష్ చేసిన జరీ అంచు.

దిగంబర కవిత్వం తెలుగు సాహిత్యంలో కలిగించిన సంచలనం తక్కువేమీ కాదు. దాని ఉద్దేశ్యాలతో ఏకీభవించినవారు సైతం దాని భాష విషయంలో కొంత అసంతృప్తితో ఉన్న సమయంలో దేవిప్రియ, సుగంబాబు, ఓల్గా, కిరణ్, కమలాకాంత్



పైగంబర కవులుగా ముందుకు వచ్చారు. ఈ ఐదుగురిలో ఓల్గా వచనంవైపు వెళ్లిపోగా నిరంతర కవిగా మిగిలింది దేవిప్రియ ఒక్కడే.

*కవిత్వమంటే*
*కనిపించే అక్షరాలు*
*వినిపించే శబ్దాలు మాత్రమే కాదు*
*కవిత్వమంటే*
*రెండు విరుపులు*
*రెండు చరుపులు మాత్రమే కాదు*
*కవిత్వమంటే*
*పందిరిమీదకు ద్రాక్షను పాకించడం*
*పద్మవ్యూహంలోనుండి బయటపడే ప్రయత్నం చేయడం*
*నీటిలోకి నిటారుగా దిగిన*
*కత్తిలా నిశ్శబ్దంగా చీల్చుకుపోవడం*
*పియానో మెట్లమీద*
*సమ్మోహన రాగ జలపాతాలను దూకించడం*
*కవిత్వమంటే*
*కనురెప్పల వెనుక మూసిన నిశీధిలో*
*చూచుకాన్ని తిప్పుతున్న చూపుడు వేలు*
*ఇంకా చెప్పాలంటే*
*కవిత్వం*
*ఇంద్రధనస్సుకి*
*నిద్రలో కనిపించే బ్లాక్ అండ్ వైట్ స్వప్నం*

కవిత్వానికి దేవీప్రియ ఇచ్చుకున్న నిర్వచనం ఇది. తాను కవిత్వం రాయడం మొదలు పెట్టిన చాలా రోజులకు, అమ్మచెట్టు, నీటిపుట్ట లాంటి సంకలనాలు వేసిన తరువాత వచ్చిన తుఫానుతుమ్మెద సంకలనంలోది ఈ కవిత. కవులు ఎవరైనా తమ కవిత్వ కెరీర్ మొదటిలోనే కవిత్వం గురించి, మళ్ళీ తమ కవిత్వం గురించీ నిర్వచనాలు ఇచ్చుకుని తమ సంకల్పం ఏదో తాము చెప్పుకుంటారు. దేవి మాత్రం కవిత్వం రాయడం మొదలుపెట్టిన రెండు దశాబ్దాల తరువాత కవిత్వానికి తనదైన నిర్వచనం ఇచ్చారు.

దేవిప్రియ నీటిపుట్టకి రాసిన ముందుమాటలో శివారెడ్డి నాకు కవిత్వమెప్పుడూ బార్బడ్ (ముళ్ళతీగ) వైర్ మీద పచ్చగా అల్లుకున్న బచ్చలాకు తీగలా కనిపిస్తుంది అన్నాడు. దేవిప్రియ దానిని ఇంకొంత విస్తరించి పందిరి మీదకు ద్రాక్షను పాకించడం అన్నాడు. బచ్చలాకు అప్రయత్నంగా దానికి అదే అల్లుకుంటుంది. కానీ ద్రాక్ష అలా

కాదు. దానికి కొద్దోగొప్పో సహాయం కావాలి. అది కవి తన అధ్యయనంతో తన పరిశీలనతో చేయాలి. నీటిలోకి నిటారుగా దిగిన కత్తిలా అది నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ వెళ్ళాలి. అప్పుడు మాత్రమే కవిత్వం జీవితమనే పద్మవ్యూహంలో చిక్కుకున్న సామాన్యుడికి బయటపడే మార్గం చూపుతుంది. పైగా అది కనురెప్పల వెనుక మూసిన నిశీధిలో చూచుకాన్ని తిప్పుతున్న చూపుడువేలు కనుక మనిషిలో ఒక ఆలోచనకి దారి వేస్తుంది. అతడి అంతరంగంలో మధనం జరిగి, తనలోతాను సంఘర్షించుకుని, తననుతాను సంస్కరించుకుని శక్తిని సమకూర్చుకుని పియానో మెట్ల మీదుగా సమ్మోహనరాగ జలపాతాన్ని దూకించగలుగుతాడు.



చేరాకి ప్రేమతో రాసిన ఈ కవితలో ఒక ఉత్తమ కవిత ఎలా ఉండాలో, అది ఏమేమి చేయగలదో ఎంత మృదువుగా చెప్పాడో కదా. విప్లవ కవిత్వ ఉద్యమంలో తనది శివారెడ్డిలాగా, గద్దర్‌లాగా బిగ్గరగా పలికిన గొంతు కాదని, తన కవిత్వమంతా గుసగుసలు మాత్రమేనని తానే ఒకచోట  చెప్పుకున్నారు దేవిప్రియ. అయితే ఆ గుసగుసలుకూడా స్ఫుటంగా, ఏ శషభిషలు లేకుండా చేశాడు, తన మొదటి కవిత్వ సంపుటి అమ్మచెట్టులోనే.

*అడవీ*
*నువ్వంటే నా కిష్టం*
*రేపటి దేశానికి*
*ఈనాటి తల్లివి నువ్వు*
*రేపటి ఆకాశానికి*
*ఈనాడే పూసిన సూర్య పుష్పానివి నువ్వు*
*ఏదో ఒక రోజు*
*ఈ దేశాన్ని ప్లాస్టిక్ తీగల*
*విష పుష్ప ఉద్యానవనాలనుండి*
*కాపాడటానికి*
*నీ సాయమే కోరతాను*

అంటూ విప్లవాన్ని బలంగా కౌగలించుకున్నాడు. విప్లవ కవిత్వ ఉద్యమంలో దేవిప్రియను తన సమకాలీన కవులకంటే భిన్నంగా నిలబెట్టింది అతడి కవిత్వ రూపం. మిగతా విప్లవకవులందరూ వస్తువు మాత్రమే పట్టించుకున్నప్పుడు దేవిప్రియ వస్తువుతోపాటు రూపాన్నికూడా పట్టించుకున్నాడు. నీటిపుట్ట అనడం ఇందులో భాగమే.

నీటిపుట్ట అంటే సముద్రం అని అర్థం. నిజానికి ప్రతి పదానికి తనదయిన అర్థం ఉంటుంది. తనదయిన వ్యక్తీకరణ ఉంటుంది. సముద్రాన్ని, వార్నిధి, శరధిలాంటి సంస్కృత పదాలతోకూడా సూచించవచ్చు. ఆ పదాలలో సముద్రపు అలల హోరు



ఉంటుంది. కానీ నీటిపుట్ట అనడంలో ఒక సున్నితత్వం ఉంటుంది. ఈ పుస్తకాన్ని సమీక్షిస్తూనే కె. శ్రీనివాస్ భక్తి ఏరూపంలోఉన్నా ఆత్మన్యూనతకి దారి తీస్తుంది అన్నాడు. అలాంటి భక్తికి దూరంగా వున్నవాడు దేవిప్రియ.

తూర్పు యూరప్ పరిణామాల మీద దేవిప్రియ వ్యాఖ్యానం హిట్లర్ నవ్వుగా రూపు దిద్దుకుంది. ఒక వేదన, ఒక నిస్సహాయత, ఒక పరాజయ భారం, కూలిన కలల శిధిలాల బరువు ఈ హిట్లర్ నవ్వులో ప్రతిధ్వనిస్తుంది.

*ఎన్ని ఆకాశాలని*
*జయించి వేసుకున్న పందిరి ఇది*
*ఎన్ని మంచు మైదానాలు దాటి*
*వెలిగించుకొన్న తూర్పు ఇది*
*ఎన్ని పెను తుఫానులకి*
*ఎదురు నిలిచి గెలిచిన*
*కొయ్యపడవ బెస్తవాడి కూనిరాగం ఇది*
*ఎక్కడ*
*ఏ పాత పుస్తకాల కొట్లో*
*ఏ మూల పడివున్నారు బాబూ*
*మార్క్సులూ, ఎంగెల్స్‌లూ*
*ఎక్కడ*
*ఏ సుందర సమాధుల మీద*
*వాడిన పూల దొంతరల కింద*
*వెక్కి వెక్కి ఏడుస్తున్నారు బాబూ*
*లెనిన్‌లూ గోర్కీలూ*

అంటూ ప్రారంభించి కోకాకోలాలు తాగించి సెక్స్‌షాపులు చూపించి రేషన్ అవసరంలేని స్వేచ్ఛలో పొర్లాడమని బహిరంగంగా కన్నుగీటు దృశ్యాలని చైనా గోడల బురుజులలో ప్రతిధ్వనిస్తున్న హిట్లర్‌నవ్వులా ఊహించడం దేవిప్రియకి మాత్రమే సాధ్యం.

**2**

దేవిప్రియ భాష, మరీముఖ్యంగా అతడి జీవితానుభవాలలో నుంచి రూపొందించుకున్నది. అది అతడికి మాత్రమే సొంతం. తన కవిత్వ సంపుటుల పేర్లుకూడా అందులో భాగమే. అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద, గంధకుటి, అరణ్యపురాణం, గాలిరంగు ఇలా అన్నీ ఒంటరి ఇద్దరులే. ఒకదానితో మరొక దానిని విడదీస్తే ఆత్మలేని శరీరాలు అవుతాయి. ఈ రెండుపదాల పదబంధాల వెనుక వున్నది అతడు, ఆమె, దేవిప్రియ రాజ్యలక్ష్మిలేనేమో. వాళ్ళిద్దరి అనుబంధంలాగే ఆ పదాలమధ్య



అనుబంధంకూడా అపురూపం, అవిభాజ్యనీయం.

*తుహినమేఘ రేణువులు పొదిగిన*
*నీలినీలి రెక్కలు సుతారంగా ఆడిస్తూ*
*పొగమంచు తలుపులు చప్పుడు కాకుండా తెరుచుకుని*
*ఒక కల ప్రతి వేకువనా*
*నా శయన మందిర సుప్తచేతనలోకి దిగివస్తుంది*
*దివ్య సుందరమైన తన సొగసు చూడమని*
*ఒక హంసతూలికతో నా కనురెప్పలను నిద్ర లేపుతుంది*

ఇంత సున్నితంగా కవిత్వంలోనూ జీవితంలోనూ తడి ఆరకుండా ఉండటం అరుదు. ఈ సున్నితత్వం వున్నది కనుకనే గాలిరంగును వూహించగలిగాడు దేవిప్రియ.

దేవిప్రియ కవిత్వంలో ఆమెది ప్రముఖ స్థానం. ఎంత ప్రముఖమైనది అంటే ఆమె లేకుంటే అతడు లేడు. అతడిని సాగుచేసే వాగు ఆమె. అతడి నులివెచ్చని స్పర్శ ఆమె. తన కవిత్వమంతా ఆమెకు సముచిత స్థానం ఇచ్చాడు. భావకవులలాగా ఆమెకు దేవతస్థానం ఇవ్వలేదుకానీ ఆమె లేకపోతే అతడులేడు అనే ఎరుకను మాత్రం బలంగా ప్రకటించాడు. ప్రతి పురుషుడూ స్త్రీమీద ఆధారపడవలసిందే, అమ్మనుండి సహచరి వరకు.

*కలుపు తీయడానికి పోయినప్పుడు*
*కందిన నా వేళ్ళు చూసి*
*ఎట్టా బతుకుతావురా అని ఏడ్చేది మా అమ్మ –*

అంటూ ప్రారంభించిన కవిత 'మా అమ్మ' చివరి స్టాంజా

*ఇప్పుడు ఇద్దరు పిల్లల తండ్రినై*
*ఇంత బతుకు బతుకుతున్న*
*నా సుతిమెత్తని అరచేతులు చూసికూడా*
*ఎట్టా బతుకుతావురా అని ఏడుస్తుంది మా అమ్మ*

అంటూ ముగిస్తాడు. అవును ఇది విశ్వజనీనమైన సత్యం. ఎంత పెద్దవాడైనా బిడ్డ ఎప్పుడూ తల్లికి చిన్నపిల్లాడులాగే కనిపిస్తాడు. అది పేగుబంధం. అది అతడిలో ఎంతలా జీర్ణించుకుని పోయిందంటే అతడు తన సహచరిని అచ్చం అమ్మలా ప్రేమిస్తాడు.

*నిన్నలానే అనిపిస్తోంది*
*ముప్ఫయి ఏడేళ్ల తరువాతకూడా*
*నీ నులివెచ్చని క్షణ పరిమళ స్పర్శ కోసం*
*పరితపించిన స్వప్న పరంపర*



*నేటికీ కొనసాగుతున్నట్టే వుంది*

అంటాడు దేవిప్రియ ఒంటరి ఇద్దరు అనే కవితలో. భార్య ఎలా ఉండాలో మన ధర్మ శాస్త్రాలు చెప్పాయి కానీ భర్త ఎలా ఉండాలో ఎక్కడా చెప్పినట్టు లేదు. ఆ పని దేవి ప్రియ చేశాడు, భర్త కూడా అమ్మలా తన సహచారిని ప్రేమించాలి, లాలించాలి.

జీవితం ఒక ప్రహేళిక. జీవితం ఒక అర్థం కాని పదబంధం. ఇలా ఎన్నైనా చెప్పవచ్చుకానీ దాన్ని నిండుగా జీవించడంలోనే అసలైన అర్థం తెలుసుకోగలం. దాన్ని స్వచ్ఛ శుభ్ర స్ఫటికంలా తీర్చిదిద్దుకుంటామా లేక ఆ చిర మాలిన్యాన్ని అలాగే కొనసాగిస్తామా అనేది మనమీదే ఆధారపడి ఉంటుంది

*ఆకాశానికీ అవనికీమధ్య అవతరించాం*
*గగన ఢమరుక లయనీ*
*అడవిని ఊయల లూగించే వాయురాగాలనీ విన్నాం*
*హోరు జలపాతాల బృందగానాలనీ ఆదరించాం*
*కానీ*
*మనిషి మాలిన్యాన్ని*
*ఇన్ని నులివెచ్చని కన్నీళ్లతో*
*కడిగి శుభ్రం చేయలేకపోయాం!*
*మనిషి వైఫల్యం ఇక్కడే వుంది.*

గాలిరంగును వూహించగలిగిన మనిషి సాటి మనిషి దుఃఖానికి ఎందుకు చలించలేకపోతున్నాడు. ఆ సున్నితత్వం మనిషిపట్ల మనం ఎందుకు కోల్పోతున్నాం? దీని అన్వేషణే దేవిప్రియ కవిత్వం. సాటి మనిషిపట్ల మనం మనిషిగా ప్రవర్తించకపోతే దేవిప్రియ అన్నట్లు....

*సగం దాకా ఎక్కి తాటిచెట్టు పైనుండి పడిపోయినప్పుడు*
*ఎప్పుడు డోక్కుపోయాయో ఈ నవనీతపు కాళ్ళూ చేతులు*
*ఇప్పుడు చెక్కులూడి ఎర్రగా బెదరగొడుతున్నాయి*
*అమ్మా నాన్న అవలీలగా క్షమించారు*
*కానీ అపరాధ భావన నన్ను అస్సలు మన్నించడం లేదు*

అపరాధ భావన మనలని మన్నించదు. తోవ ఎక్కడ అని మనం విలపించవలసిందే. దేవిప్రియ కవిత్వం చెపుతున్నది అదే.

**3**

దేవిప్రియ ఇన్షాఅల్లా మకుటంతో రాసిన ఆధునిక శతకందాలు అతడిని ఆధునిక వేమన అనిపిస్తాయి. ఈ కందపద్యాల నిండా ఆయన బోలెడన్ని జీవన సత్యాలని అలవోకగా చెప్పాడు. ఒక రకంగా ఇవి గరీబు గీతాలకు కొనసాగింపే



అయినా వీటికి ఇవే ప్రత్యేకమైనవి. ఇన్షాఅల్లాహ్ అంటే దైవం తలిస్తే అని అర్థం. అవును దైవం తలిస్తే ఏదయినా జరుగవచ్చు. ప్రతి మనిషిలోనూ ఎక్కడో ఒక చోట కొంత ఆధ్యాతిక చింతన ఉంటుంది. దానిని సంతృప్తి పరచడం కోసం ఏవేవో చేస్తూ ఉంటాడు. దేవిప్రియకూడా ఇన్షాఅల్లాహ్ శతకం రాసాడు. ముందే చెప్పినట్టు దేవిప్రియ కవిత్వమనే వెండిమబ్బుకు గార్నిష్ చేసిన జరీఅంచు ఇది. ఒకటి రెండు కందాలు మానస ఉల్లాసానికి...

*లోపాలకు లోటేమిటి*
*వేపాకుల మండలాగ వేలుగ వున్నాయ్,*
*చూపాలిక నవమార్గం*
*ఈ పాటుల నుంచి ఒకడు, ఇన్షా అల్లాహ్ !*

మనిషిలో ఎన్ని లోపాలువున్నా దైవం తలిస్తే, సరిఅయిన దారి చూపితే భ్రమలలో కూరుకుపోయిన బతుకు రహదారి మీదకు వస్తుందట. నిజమే కానీ దైవం తోడెప్పుడు కావాలి మనిషికి ?

*జీవన సరళికి చిటికెడు*
*పావన పరిమళ గుణాలు పచరిస్తేనే*
*ఆవల శీతల ఛాయలు*
*ఈవల ఒక యింత శాంతి, ఇన్షా అల్లాహ్ !*

*రివ్వున వీచే గాలికి*
*దవ్వున మెరిసే మెరుపుకి, ధరబడగానే*
*కెవ్వను బిడ్డడి కేకకి*
*ఎవ్వరు కర్తలొ, విచిత్ర, మిన్షా అల్లాహ్ !*

*ఆకలి దప్పులు ఉండని*
*లోకమొకటి కావలెనని లోపల ఏదో*
*వ్యాకుల స్వప్నం ఇంకా*
*ఈ కవి మది వీడలేదు, ఇన్షా అల్లాహ్ !*

ఆ వ్యాకులతేలేని కవి కవిగా వుండలేదు కదా.

*( గాలిరంగు సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం. దేవిప్రియకు శుభాకాంక్షలతో )*



రవూఫ్

# దేవి ఆత్మకవిత 'ఇం..కొకప్పుడు'!

తన కవితా వాక్యాలకు ఆఖర్న సంతకంతో పనిలేని 'పురానవ కవి' – దేవిప్రియ! ఆయన గొంతులోని ఒరిజినాలిటీయే అత్యాధునిక తెలుగు కవిత్వంలో ఆయనకొక ప్రాముఖ్యాన్ని సంతరించి పెట్టింది. తన కవిత్వంలో తన హృదయ స్పందనల్నీ, సంవేదనల్నీ చాలా స్పష్టంగా పలికిస్తాడాయన. కొత్త కొత్త పదబంధాలూ, శాబ్దిక సౌందర్యం, తటిల్లతలా తళుక్కుమనే భావ సంచాలనం దేవిప్రియ కవితా లక్షణాలు. అందుకే ఆయన్ని – నేను – 'పురానవ' కవి అని అంటున్నాను. గాలికి రంగులద్దే అద్భుతం తెలిసిన మార్మిక కవిమాంత్రికుడు ఆయన!

'దేవిప్రియ' ముద్దుపేరు – 'దే' అంటే – "ఇవ్వు" అని. సౌందర్యస్ఫోరకమైన తన భావనా ప్రపంచంలోకి మనల్ని లాక్కువెళ్ళి తన కవితా పంక్తుల్ని కానుకగా ఇస్తూనే వున్నారాయన! దేవిప్రియ రాసిన 'ఇం..కొకప్పుడు' ఒక అద్భుత కళాఖండం. ఈ కవిత్వంలో ఆయన హృదయంతోపాటు ఆత్మనికూడా పలికించారు. 'ఆత్మకవిత' శీర్షికన రాసిన కవితలో అంటారు – "నిట్టూరుస్తూ యెదురు చూసే క్షణాలు / బొట్టుబొట్టుగా నెత్తురోడుతూ..." అని! మరలిరాని లోకానికి తరలిపోయిన ప్రియసఖి కోసం తల్లడిల్లుతూ – 'నిశ్శబ్ద నిఘంటువు'లో చిక్కుబడిపోయారు దేవిప్రియ. "ఆమె ఒక పాటగా మారి / నా శ్రవణేంద్రియాలను సదా / ఆవహిస్తూనే వుంది, ఇంకా!" అనికూడా అంటారు.

కవి త్రికాలజ్ఞుడు. 'త్రికాలం' కవితలో దేవిప్రియ ఇలా అంటారు – 'గతం ఒక నాదం / వర్తమానం ఒక శ్రుతి / భవిష్యత్తు ఒక రాగం / మూడు స్వరాలనూ / ఆలపించి అన్ని కాలాలూ చరించి వచ్చాను నేను" అని. ఇంకో పద్యంలో "రాత్రిగా మారుతున్న సాయంత్రం / మరొక వేకువగా అవతరించే అనంత రహస్య రసాయనిక చర్య / అదృశ్యంగా వేకువ వెనక జరిగే అనంతరహస్య అదృశ్యంగా కొనసాగుతోంది'



అంటారు. ఉదయించే వేకువ వెనక జరిగే అనంతరహస్య అదృశ్య రసాయనిక చర్య తెలిసినవాడు – దేవిప్రియ! ఆయన కవిత్వ రహస్యమూ అదే!

అభివ్యక్తిలో నిత్యనూతనతా, శైలీ శిల్పంలో విభిన్నతే దేవిప్రియ కవితా తత్వం. శిథిలయోచన, అంతర్‌స్వరం, ఇనుపదారాలు, నిశ్శబ్దచలనం, ప్రాణాగమనం, శిఖరశిరస్సు, ఒంటరి మెలకువ, అనుభూతధ్యానం, జ్ఞాపకాల కుబుసం, స్వప్నబీజాలు, జ్ఞాపకవృక్షాలు, మట్టిపూలపానుపు, నెత్తుటి రెమ్మలు, కత్తులకవ్వం గొంతులో ముళ్ళు, ఆందోళననది...ఇలాంటి పదబంధాల్ని సృష్టించటం ఒక్క దేవిప్రియకే సాధ్యం! కవిత్వం హృదయం తొణికిసలాడే లిపిలేని భాష! 'ఇంకొకప్పుడు' కవిత్వమంతటా పరచుకొనివున్నది ఆయన హృదయమే! దేవిప్రియ అంత ఉద్వేగంగా యెవ్వరూ గానం చేయలేరు. మైమరచిన నక్షత్రాలుకూడా తమ పాటలు ఆపి ఆయన మంత్రస్వరానికి మూగబోతాయి.

ఇంతకీ – 'ఇం...కొకప్పుడు' వెల్లువలైన ఆయన జ్ఞాపకాలు గుదిగుచ్చిన పూలదండలోని సూత్రం మాత్రమేనా? జీవితమంతా విస్తృతమైన అనేకానేక సంఘటనల సమాహారం! పలు ప్రశ్నలూ, అంతులేని అన్వేషణలూ, పెల్లుబికే ఆవేదనల్ని పులకలెత్తిన అనుభవ తన్మయత్వంతో దేవిప్రియ పలికించిన –'అంతర్‌స్వరాలు'!

'నా మత్స్యావతారం' అనే కవితలో ఆయన ఇలా అంటారు – "నేనొక/ దారితప్పిన చేపపిల్లలా ఆందోళన నాది అడుగున / అటూ ఇటూ అగమ్యంగా ఈదు లాడుతుంటాను; / ఏటి నీటిలో / ఎంత తాగినా తీరని దాహం నాది" అని! తీరని దాహార్తిలోంచే కవిత్వం పుడుతుంది. అందులోనూ దేవిప్రియ "జలపాతాల ధారలు పట్టుకుని / ఊగుతూ దూకుతూ అరణ్యాలు దాటిన వాడా'యే మరి!

'ఇం..కొకప్పుడు' – దేవిప్రియ ఇప్పటి కవిత్వం! ఇంతక్రితం రాసిన కవిత్వం కంటే భిన్నం. ఎందుకంటే – 'ఇం..కొకప్పుడు' ఆయన లోపల జరుగుతున్న ఒక అనియంత్రిత మధనక్రియ! ఆత్మదర్శనం! ఆత్మావిష్కరణం! అంతరాత్మతో ఆయన నిరంతర సంభాషణం! 'రాజీ'పడని జీవన సంఘర్షణం!

కాలపరీక్షకి ఆయన నిలబడ్డారు. కవిత్వమే ఆయన్ని ఆదుకొంది. ఒక మహావిషాదంలోంచి తేరుకొని మళ్ళీ మన ప్రపంచంలోకి కవిత్వమే ఆయన్ని లాక్కు వచ్చింది. ఆయనంటారు – "అవునేమో ఇది / మరొక మరణమేమో / అవునేమో ఇది / మరొక జననమేమో...!?" అని! మళ్ళీ మళ్ళీ కొత్తగా జన్మించేవాడు ఒక్క కవి మాత్రమే! అందుకే దేవిప్రియ కవిత్వం అజరామరం.

*(వివిధ, ఆంధ్రజ్యోతి)*



డా. ప్రసాదమూర్తి

# మనకాలపు కవిదేవుడు

కవిత్వంలో నాకు ఊహ తెలిసినప్పటినుంచి నేను కొలిచే దేవుళ్ళు కవులే. కవులందరూ నాకు దేవుళ్ళు కారు. నేను ప్రేమించే ఆరాధించే పూజించే భజించే కవులు మాత్రం నాకు దేవుళ్ళే. వాళ్ళని బుద్ధిగా చదువుకోవడమే ఈ ప్రేమారాధన పూజాభజనల భౌతికాభౌతిక చర్య. అందుకే వాళ్ళని బాగా దగ్గరగా చూడ్డం కంటె దూరంగా చూడ్డానికే ఎక్కువగా ఇష్టపడతాను. ఎన్ని యుగాలుగా మానవుడు సాగించిన బహిరంతర సంఘర్షణల సారమో ఈ కవిత్వం అనుకుంటాను. మనిషి చర్మాన్ని తొడుక్కుని ఊడిపడిన జీవికి, కవిత్వాన్ని ముందేసుకుని లౌకికాలౌకిక ....చేతనాచేతన సంభ్రమావస్థలో తేలిపోవడంకంటె ఫలప్రదమైన జీవితం ఇంకేముంది? జీవ పరిణామాన్ని మనకు బోధించిన డార్విన్ తన చివరిరోజుల్లో ఆత్మకథ రాస్తూ తనకు మరికొంత సమయం మిగిలిఉంటే ఆ సమయాన్ని మంచి కవిత్వం చదువుకోవడం కోసం మంచి సంగీతాన్ని వినడం కోసం వినియోగిస్తానని అంటాడు. అతనికా సమయం పెద్దగా దొరకలేదు. విరామమెరుగని పరిశోధన అతని ఆరోగ్యాన్ని విరామం లేకుండా శిథిలం చేసింది. నేనా విషయం చదివాక దేవుడనే వాడుంటే ఆయనకు ఆ సమయాన్ని ఇచ్చి వుండేవాడుకదా అనుకున్నాను. ఏమైనా నేను చాలా అదృష్టవంతుడనే. అక్షరాల్లో అందాన్ని అగ్నిని గమనిస్తూ కళ్ళు తెరిచిన నాటినుంచి కవిత్వమే ప్రాణంగా బతుకుతున్నాను. దాదాపు నలభైఏళ్ళుగా నేను ఇష్టంతో ఎంతోశ్రద్ధతో మక్కువతో, ఈ అలవాటే గనక లేకపోతే ఇంక ఈ జీవితానికి అర్థం ఏమిటని చదువుకున్న ....చదువుకుంటున్న కవిత్వం చాలాఉంది. ఆ అక్షరాలను చెక్కిన శిల్పులను ఒక్కొక్కరినీ నాముందు బొమ్మల్లా పేర్చుకుంటే దేవిప్రియ ముందువరసలో ముగిపెంగా నవ్వుతూ కనిపిస్తాడు.

*ఎందుకో ఈ రోజు*
*నేనున్న చోట*
*లౌకికం అలౌకింగా మారిపోతోంది*



*...................................*

*ఎవరితోనూ పంచుకోలేని క్షణం ఒకటి*

*అనంతంలా వ్యాపిస్తున్నట్టు*

*ఏనాడూ ఎరగని కొత్త వ్యాకులత ఏదో తీగసాగుతోంది*

*.......................................*

*ఏమిటో కనుకొలకుల్లో*

*రెండు అతిశీతల సూక్ష్మ బిందువులు...!*(శీతలబిందువులు, ఇం..కొకప్పుడు)

మనుషులు దేవుళ్ళని ఏ వరాల కోసమో కొలుస్తారు. నేను మాత్రం ఇదిగో ఈ ఆనంద విషాద విమల స్వరాల కోసమే కవుల్ని ఆరాధిస్తాను. నిండుగా మనిషి ప్రతిఫలించే సూక్ష్మబిందువులవి. వాటిని నాకు మనసంతా నింపుకోవడానికి అవకాశం ఇచ్చిన కవి దేవిప్రియ. ఆయన 79లో అమ్మచెట్టు వేసేసరికి నాకు ఇరవయ్యేళ్ళు. అప్పటికే శ్రీశ్రీ గొంతులోనూ గుండెలోనూ కదం తొక్కుతున్నాడు. శ్రీశ్రీ వేలు పట్టుకుని చూపించిన కొత్తలోకంలోకి కొత్తకొత్తగా అడుగు పెడుతున్న కొత్తకాలమది. పాప పంకంనుండి పద్మాలు పుట్టించిన మహానుభావుల అక్షర ప్రపంచంలోకి విభ్రమానంద సందోహుడనై తొంగిచూస్తున్న రోజులవి. అయితే పద్యం కుబుసాన్ని పూర్తిగా విడవ లేదు. వచనాకాశాన్ని పూర్తిగా తొడగలేదు. అదో సంధికాలం నాకు. 82 లో ఎం.ఏ. కోసం విశాఖ చేరుకున్నాక అజంతా.. మో.. శివారెడ్డి.. దేవిప్రియ ఇలా ఒక్కరొక్కరే నాలో వచనోదయాన్ని అరుణారుణిమం చేశారు. దేవిప్రియ నాకెప్పుడూ ఆశ్చర్యంగానే అనిపించేవాడు. కవులను నేను పెద్దగా కలుసుకుని, వారితో నిత్యసంచారం చేసే అలవాటు లేదు. ఏదో సంకోచం. ఎందుకో భయం. భయంకంటె వారి అక్షరాలుండగా వారితో మనకు పనేంటనే కొంచెం ధిక్కారంతో కూడుకున్న భక్తిపూర్వక సంస్కారం.

*బాల సరస్వతి*

*సౌమ్య కంఠ మురళిలోంచి*

*తేలుతూ వచ్చి రాలిన రంగుల రాగాల మీద*

*గద్దర్ కాలి గజ్జెలు ఆడిఆడి అలసిపోతాయి.* (వెదురు పాట, అమ్మచెట్టు)

...............................................

రెండు విరుద్ధ అనుభూతుల్లోంచి నన్ను తాకిన మంటల వెన్నెల దేవిప్రియ. 'ప్రపంచంలో కదులుతున్న ప్రతి వస్తువూ యుద్ధరంగంవైపే నడుస్తున్నట్టు' అని పించిందట. 'ఉప్పొంగే నదులూ సముద్రాలూ ఆకాశహర్మ్యాలను ఆసాంతం ముంచ డానికే విరుచుకు పడుతున్నట్టు' తోచిందట. 'వీస్తున్న ప్రతిగాలీ నిప్పు రాజేయడానికే విసురుతున్నట్టు' అనుకున్నాడట. అంతే అప్పటినుంచీ అతను నాకు దేవుడయ్యాడు. అతనికి నేను ఫిదా అయ్యాను.



*ఓ నా నిరుపేద స్వప్నాల్లారా నిద్ర లేవండి..!*

అన్నాడు. నాలో అనేకానేక స్వప్నలోకాల తలుపులు ఒక్కసారే తెరచినట్టయింది. అంతే దేవిప్రియ కవిత్వం చదవడం ఒక వ్యసనమైంది. ఇంకేముంది.. అది మొదలు ఆయనే అన్నట్టు 'పడగ విప్పి నిలుచున్న / పాము లైటుస్తంభం నీడలో/ నిద్రపోతున్న నిరుపేద కలల నీడల్ని' తట్టి లేపుతున్నాను నేను. 'ముళ్ళకంపల మంటల చివర / రేపటి సూర్యోదయ కరవాలాల పదును చూస్తున్నాను' నేను. అతని కవిత్వంలో నేను కూరగాయల బస్తాలమీద కూర్చుని కునుకుతీసే అస్థి పంజరాలను చూశాను. నగరపు సోడియం వేపర్ లైట్ల ఆకలి చూపుల్లో తడిసిన మొగలి జడల దిగులు చూశాను. నువ్వు ఆలోచించువాడు ఆలోచనని అమ్ముకుంటాడు అన్న ఆయన మాటల్ని రోల్డు గోల్డు నగరాన్ని సీల్డు కవర్‌లా తెరిచి మరీ అనుభవంలో చదువుకున్నాను.

*కొండని రెండుగా చీల్చి చెట్ల నీడన చోటు చేసుకుని*
*సుఖంగా నిద్రపోతున్నాయి రెండు రైలు పట్టాలు..*

ఇలాంటి వాక్యాలు చదివినప్పుడు..

*వెలుగు పుప్పొడి వెదజల్లే బల్బు కింద పడుకున్నప్పుడు*
*నేనే బల్బుననుకుంటా..*

ఇలాంటి వాక్యాలు వెంటాడుతున్నప్పుడు..

*మాసిన దేశం తలలో రోల్డు గోల్డు నాగరంలా*
*మెరుస్తూ ఉంటుంది నగరం..*

ఇలాంటి వాక్యాలు మెదడు పొర పొరలో మెరుస్తున్నప్పుడు..

*బిస్మిల్లా,*
*నీ షెహనాయీ కొన మీద*
*బొంగరంలా తిరుగుతోంది భూగోళం*

ఇలాంటి వాక్యాలు గుండెకు తాడుకట్టి అలాగే ఊగుతున్నప్పుడు..ఆహా మనకు కూడా ఎంత మంచి కవి ఉన్నాడు..అని హాయిగా తృప్తిపడేవాడిని. కలిసే సాహసం ఎప్పుడూ చేయలేదు. చెప్పానుగా నాకు కాస్త బిడియమూ బిగువూ ఎక్కువే. అదే కారణంగా శ్రీశ్రీని చూడలేకపోయాను. అయితే నా అదృష్టవశాత్తు నా ఉద్యోగ ప్రయాణంలో ఒకచోట దేవిప్రియ తగిలాడు. అతి దగ్గరగా అతణ్ణి చూసే అవకాశం దొరికినందుకు నాఆనందానికి అవధుల్లేవు. కాని ఆయన కదిలే దుఃఖశిఖరంలా ఉన్నప్పుడు నాకు దొరికాడు. ఆయన ఆకాశంలో వెలుగంతా తానే అయిన తన రాజీని కోల్పోయిన విషాదాన్ని నెత్తిమీద మోసుకుంటూ తిరుగుతున్న రోజుల్లో నాకు కలిసాడు.

*నీడ నేలమీద పడకుండా ఎండలో నడవడం ఎలా?*
*రెండు శ్వాసల్లో ఒకటి లేకుండా బతకడం ఎలా?*

బొత్తిగా తనకు తెలీని అసలు చేతకాని ఈ విద్యలతో సతమతమవుతున్న

సందర్భంలో టక్ చేసుకుని షూస్ వేసుకుని వెండి వెంట్రుకలను నున్నగా దువ్వుకుని ఎంత ముస్తాబై కనిపించినా లోపలి దుఃఖనదితో నన్ను ఒరుసుకుంటూనే ఉండేవాడు. టెన్ టీవీలో మా సహప్రయాణం చాలా కొంచెమే అయినా ఆయనతో నా ప్రయాణం ఈనాటిది కాదు కాబట్టి ఆ గడిపిన క్షణాలు యుగాలుగా మిగిలిపోయాయి. అప్పుడే ఆయనమీద నేను ఒంటరి దుఃఖం అని కవిత రాశాను.



*చాలవు..ఒక్కోసారి*
*ఈ వేళ్ళూ చాలవు..ఈ కళ్ళూ చాలవు ఈ మాటలూ చాలవు*
*మనల్ని మనమే నవ్వించే*
*విదూషక విద్య నేర్చుకోవాలి*
*ఏది ఏకాంతం? ఏది అలికిడి?*
*ఓ కవీ..ఓ రుషీ..*

ఇలా నా కవితను ముగిస్తే ఆయన కనుకొలకుల లోయల్లోంచి పైకి పొంగిన మంచుపొగలా నన్ను కమ్ముకుని తడిమాడు. నాకు తెలుసు. నేను ముందునుంచే చదువుకున్నాను కదా. అంత తేలిగ్గా దుఃఖానికి లొంగడన్న ధీమా వుంది. 'నా సూర్యుడు ఉదయాస్తమయాలు లేనివాడు..గ్రహణ పోరాటాలలో శరీరం జల్లెడైనవాడు' అని ఎప్పుడో ప్రకటించాడు కదా.

*ఒంటరితనం కన్నీటి చుక్కయి రాలినంత మాత్రాన*
*కవిని కాకుండా పోను నేను..*
అని తనను తాను సంభాళించుకునే కవి కదా.
*నా ఏడుపు*
*ఏక్ తార*
*సహస్ర తంత్రీ సంక్షుభిత*
*సమరవీణగా మోగుతుంది*

అని తనలోని సముద్ర సంగీతాన్ని ఏనాడో వినిపించిన కవికదా. తప్పకుండా ఈ దుఃఖంనుండి అతి త్వరలోనే బయటపడతాడని గట్టిగా నమ్మాను. మనిషిని నమ్మిన వాడు.మనిషి అడవిలా నడుస్తున్నప్పుడు అడవిని తన స్వప్నం చేసుకున్నవాడు. అక్షరాల్లో మనుషుల్ని దట్టించి అజ్ఞాత వీరుల చేతుల్లోని అంబుల పొదిలో పొదిగినవాడు. కవిత్వమే జీవితమై.. జీవితమే కవిత్వమైన శ్వాసించినవాడు. అంత తేలికగా కాల ప్రహారానికి తెగిపోడు. దేవిప్రియ అలాగే సమస్త దుఃఖప్రహారాల అనంత గాయాలనుండి చాలా త్వరగానే కోలుకున్నాడు. కోలుకుని మేలుకున్నాడు. 'పాత కళ్ళజోడు జారి కిందపడి రెండు ముక్కలైంది చిరిగిన జేబులోంచి.' నిజమే. అయినా ఆయన మనోనేత్రం జ్వాజ్వల్యంగా వెలుగుతూనే వుంది. 'ఇప్పుడు బతుకున్నదుందే, అదే నిజమయిన మరణానంతర జీవితం.' అన్న ఎరుక ఆయనకెప్పటినుంచో ఉండనే వుంది.



*నా ఇల్లు నన్ను పిలుస్తున్నప్పుడు*
*నా లోపల వెలిగే దీపం*
*తెగిన శిరసు నుదుటి మీది మూడో కన్నులా*
*నన్ను భయపెడుతున్నప్పుడు*
*ఎవరు నా ప్రభాతాల కోసం*
*పశ్చిమాకాశాన సంజె వన్నెలో కలిసిపోతే ఏమిటి..?*

ఇలా అనుకోవడమే మరణానంతర జీవితం అనికదా ఈ కవి వాదన... నివేదన..? ఈ అచంచలాఖండ చైతన్యమే దేవిప్రియను బతికించింది. తెలుగు కవిత్వానికున్న అనేక శ్వాసనాళాల్లో ఒక ముఖ్యమైన నాళంలో మరికొంత ఊపిరి నింపింది. కవిత్వాన్ని చదువుకోవడమేతప్ప విశ్లేషణ జోలికి పోవడం పెద్దగా ఇష్టం లేనివాడిని. అయినా సామాజిక కళాంశాల గురించి ఎవరైనా మాట్లాడితే ... వస్తుశిల్పాల విషయాలు ఎవరైనా విశదీకరిస్తే....తెలుగు అభివ్యక్తిలో కొత్త వెలుగులు ఎవరైనా అన్వేషిస్తే తప్పకుండా దేవిప్రియను చెప్పకుండా ఉండలేరు. ఏ రేచీకటి కళ్ళూ ఆయన్ని తప్పించుకోలేవు. కవులను తప్పించుకుని ఏ కాలమూ ముందుకు పోలేదు. అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద, చేపచిలుక, గాలిరంగు అని ఆయన పుస్తకాలకు శీర్షికలుగా పెట్టిన పదచిత్రాలు చాలు కాలాలు చెరిపెయ్యలేని ఆధునికుడు దేవిప్రియ అని మనం తేల్చి చెప్పగలం.

*ఎందుకంటే*
*నాకు అంతిమంగా,*
*విరగ పండిన జొన్నచేను మధ్యలో*
*మంచెమీద నిలువెత్తున నిలబడి*
*రివ్వున వడిసెల తిప్పుతున్న మనిషి కావాలి.* ( ఇం..కొ..క..ప్పు..డు)

ఎందుకంటే ఇందుకే మరి దేవిప్రియను నేను ఇష్టంగా చదువుకునే కవిదేవుళ్ళ వరసలో పెట్టుకున్నది. కవి ప్రతిభకు అవార్డులు, సన్మానాలు కొలమానం కాని కాలంలో దేవిప్రియలాంటి కవులు తప్పకుండా జీవించి ఉంటారు. శివారెడ్డి ఆయన్ని దేవుడూ అంటాడు. నేను దేవిప్రియను కవిదేవుడు అంటాను.

*30.05.2018*



బాలసుధాకర్ మౌళి

# ప్రజలలో నిర్మించబడిన కవి!

ఆ మనిషి పేరు దేవిప్రియ

ఎప్పుడో ఎనిమిదో తరగతిలో శ్రీశ్రీ 'మహాప్రస్థానం', రావూరి భరద్వాజ 'వెలుతురు చినుకులు' చదివినతర్వాత ఆ చదివిన వాక్యాల మత్తు కొన్నాళ్ళపాటు వెంబడించిన తర్వాత... ఇక ఆ తర్వాతంతా వొక ఎడారి. ఒక ఎడారితనం నా ముందు ఆవరించినట్టయింది. కవిత్వం కోసం లోపల ఆవురావురుమని చస్తున్నా కవిత్వం దొరకట్లేదు. భిన్నభిన్న ప్రాంతాల కవిత్వాన్ని అందుకునే దారి తెలియదు. పుస్తకాలు కొనుక్కోడానికి డబ్బులెక్కడివి ?

ఆ సమయంలో శివారెడ్డిగారు రక్షించారు. శివారెడ్డిగారి కవిత్వం లోలోపల దొలుస్తూ యింకా లోపలి లోపలి పొరల్లోకి చొరబడి నిలువలేనితనం వొకటి అనుభవిస్తున్న వొకానొక వేళ దేవిప్రియ అనే పేరు పరిచయమైంది. అప్పటికి పత్రికల్లో దొరికినంతమేరా ఆయన కవిత్వం చదివాను. దేవిప్రియగారు శివారెడ్డిగారిపైన, శివారెడ్డిగారు దేవిప్రియగారిపైన రాసిన కవిత్వమూ చదివాను. 'దేవిప్రియ కవిత్వం చదివితీరాలి.' లోపల ఆకాంక్ష అలా విస్తరించుకుంటూ సాగుతోంది. 'దేవిప్రియ రాసిన కవిత్వమంతా నావద్దకు రావాలి. అది ఎలా నా సొంతం అవుతుంది? ఎలా?' సతమతమవుతున్నాను. అల్లల్లాడుతున్నాను. గ్రంథాలయాలలో ఎంత శోధించినా ఆ కవిత్వం దొరకట్లేదు. గ్రంథాలయాల్లో ఆధునిక కవుల కవిత్వం మచ్చుకికూడా దొరకని స్థితి.

కవిని, కవిత్వాన్ని అన్వేషించటం ఎప్పుడూ వొక ఉద్విగ్నవాతావరణంలో నడయాడటమే. కవి గొప్ప ప్రేరేపకుడయితే ఆ కవి ఆనందాలూ, దుఃఖాలూ, ఆలోచనలూ, ఆకాంక్షలూ, కోపాలూ, పోరాటాలూ సమస్తం మనవౌతాయి. కవితోపాటే మనం బతుకుతాం. కవి నడయాడిన స్థలాల్లో, కవి బతికిన సందర్భాల్లో కవితోబాటు మనమూ కలిసి అడుగులు వేస్తాం.



'దేవిప్రియ కవిత్వం'తో నడవటం ఎప్పటికీ వొక తాజాదనం. వొక పొద్దు పొడుపు. మొత్తానికి దేవిప్రియ నెమ్మది నెమ్మదిగా నాకు అందడం మొదలుపెట్టారు. అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద, చేపచిలుక, గంధకుటి... మొదటిసారి ఈ పేర్లు విన్నప్పుడు–ఆ పదబంధాలన్నీ నాలో వొక కుదుపుని కలిగించాయి. ఒక ఆసక్తిని రేపాయి. అడపాదడపా దేవిప్రియగారి కవిత్వం చదువుతూ చదువుతూ వొకానొక రోజు 'చేపచిలుక'ని చదివాను. కొత్తగా అనిపించింది. ఆశ్చర్యం. కొన్ని రోజులకు ఆ ఏడాదే అచ్చయిన 'గాలిరంగు' వచ్చింది. మళ్లీ ఆశ్చర్యం. దేవిప్రియగారి కవిత్వమంతా నాకు గొప్ప ఆశ్చర్యం. కవిది చాలా పదునుదేరిన చూపు. 'అరణ్యపురాణం' దేవిప్రియ గారే పంపారు. అరణ్యపురాణం ఎంతగా నచ్చిందంటే ఆ పేరుతో, అందులోని కవిత లతో పూర్తిగా connect అయినంత. 'అరణ్యపురాణం'లోని 'సూర్యుడా!' అని మొదలైన కవిత యిప్పటికీ గుండెల్లో మార్మోగుతోంది.

ఈ ఏడాది జనవరిలో అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద మూడు సంపుటాలూ కలిసివున్న 'దేవిప్రియ కవిత్వం' నా చేతుల్లోకొచ్చింది. దేవిప్రియగారే ఇచ్చారు. కొన్ని రోజులుగా ఆ వాక్యాల్లోనే బతుకుతున్నాను.

దేవిప్రియ ఎవరు !

2013 నవంబర్ 9 సాయంత్రం గం. 6:30 ల సమయంలో అబిడ్స్‌లోని హైదరాబాద్ యూనివర్శిటీ ఆవరణలో మొదటిసారిగా దగ్గరిగా దేవిప్రియగారిని చూశాను. కవిసంగమం వేదికమీద నా కవిత్వం వినిపించడానికి వెళ్లిన రోజది. నేను అబిడ్స్ వెళ్లేసరికే చీకటి ఆవరించివుంది. అబిడ్స్‌లోకి ప్రవేశిస్తూనే అక్కడ అప్పటికే ప్రారంభమై సాగుతున్న ఏదో నాటకాన్ని తిలకిస్తూ శివారెడ్డిగారు కనిపించారు. శివారెడ్డి గారి దగ్గరకు వెళ్లాను. తదేకంగా శివారెడ్డిగారి కళ్లల్లోకి చూస్తూ వెలిగిపోతున్న నా కళ్లతో మాట్లాడుతున్నాను. ఆయన పక్కనే యింకో కుర్చీలో దేవిప్రియగారు. ఇద్దరు ప్రభావశీలమైన కవులను అలా చూసిన వేళ నాలో గొప్ప ప్రకంపనలు కలిగాయి. శివారెడ్డిగారు భుజం మీద చెయ్యేసి 'ఎప్పుడొచ్చావ్..?' అన్నారు. 'ఉదయమేనండి' అన్నాను. 'ఎవరైనా వచ్చారా? నువ్వొక్కడవేనా?' అన్నారు. 'నేనొక్కడినే గురువుగారూ' అన్నాను. 'అంత దూరంనుంచి వొక్కడివి వచ్చావా.. దూరాలు ప్రయాణించేటప్పుడు తోడు తీసుకుని రావాలి మౌళీ.' అన్నారు దేవిప్రియగారు. ఆ మాట, ఆ ఉచ్ఛారణ యిప్పటికీ వినిపిస్తున్నాయి. ఆనాడే దేవిప్రియ అనే మనిషి అర్థమయినంత మేరా అర్థమయ్యారు. ఒక సృజనశీలుడు అర్థమవటానికి అతని సృజన ఎంత ముఖ్యమైనదో, అతను మనిషిగా ఎంత విజయవంతమయ్యాడూ అనేదికూడా అంత ముఖ్యపాత్ర వహిస్తుందని నమ్ముతున్నవాణ్ణి గనుక దేవిప్రియఅనే సృజనశీలుడు, మనిషి ఆ క్షణం

లోనే అర్థమయ్యారని యిప్పుడిలా చెప్పగలుగుతున్నాను. ఒకేఒక్క మాటతో, చూపుతో అర్థమవగలడు మనిషి.

ఆ తర్వాత్తర్వాత దేవిప్రియగారిని విజయనగరం, తణుకు, విజయవాడలో చాలాసార్లు దగ్గరగా చూశాను. కలిసివున్నాను. అనేకసార్లు సంభాషించాను ఆయనతో, ఆయన కవిత్వంతో. అప్పటినుంచి దేవిప్రియ అనే 'అక్షరాల కవి' యింకాయింకా సరళంగా, అచ్చమైన వచనకవితలా అర్థమవుతూనే వస్తున్నారు. 'కవి కవిత్వమే కవి వ్యక్తిత్వం' అనే మాట రుజువవుతూ వచ్చింది.

దేవిప్రియలో నాకు నచ్చేది ఆయన తీక్షణమైన చూపు. ఆ చూపు సామాజిక పరిశీలకునిగా ఆయన మాట్లాడే తీరులోనూ, సృజనశీలిగా ఆయన సృజించిన వాక్యాల్లోనూ ప్రతిఫలించడం ఆశ్చర్యమేమీ కాదు. అది ఆయన way of expression. ఒక వస్తువును ఆయన చూసే చూపే ఆయన కవిత్వ గాఢవ్యక్తీకరణ. దేవిప్రియగారి దృక్కులు చాలా తీక్షణమైనవి, అంతే సునిశితమైనవి, అంతకంత విలక్షణమైనవి. దేవిప్రియ గారి వొక్కో కవిత్వవాక్యం చదువుతున్నప్పుడు అవి సరాసరి కళ్లచూపుల్లోంచి ఈటెల్లా బయట పడినాయేమో అని అన్పిస్తుంటుంది నాకు. ఒక్కోసారి హృదయ ఖండితాల్లోంచి బయటపడిన వాక్యాల్లోనూ కొట్టుకుపోయాను. కొన్నిసార్లు అగ్ని శిఖల్లాంటి పదాలతో సేద తీరాను.

*'అడివీ*
*నువ్వంటే నాకిష్టం*
*రేపటి దేశానికి*
*ఈనాటి తల్లివి నువ్వు*
*రేపటి ఆకాశానికి*
*ఈనాడే పూచిన సూర్యపుష్పానికి నువ్వు'*

దేవిప్రియగారు శ్రమ ఆయుధమయ్యే తీరుని మొదటి సంపుటిలోనే కనిపెట్టిన కవి. దేవిప్రియగారి రాజకీయదృక్పథానికి ఆనాడే పునాదులు పడ్డాయి.

దేవిప్రియగారు గొప్ప శిల్పి. కలం ఉలితో ఎక్కడ చెక్కితే వస్తువుకి కవిత్వ రూపం సిద్ధిస్తుందో తెలిసిన శిల్పి.

*'సముద్రాలు యెవరివి?'* అంటూ

'తాటిబొత్తాల పడవలవి' అని రాసిన వాక్యాలు వాటి nativity తో నాలోపల గింగిరాలు తిరుగుతున్నాయి.

*'చూడండి*
*నేను నా ప్రజలతో నిర్మించబడ్డ కవిని'*







అని అన్నప్పుడు దేవిప్రియ నరాలు పట్టుకుని లాగి గుంజుతారు. ఆ వాక్యాలను మోయడం కష్టం.

జీవితానుభవాలతో రూపొంది, జీవితమర్మాలను ఎరిగిన మనిషి ఎంతటి తాత్వికతని కావలించుకుంటాడో, ఘోషిస్తాడో, సంవేదన పడతాడో 'ఇం.. కొకప్పుడు' లో శకలాలు శకలాలుగా కనిపిస్తుంది. దేవిప్రియ, ఆయన సగభాగాన్ని భౌతికంగా కోల్పోయిన తర్వాత ఆయన హృదయం ఇంకా ఎంత మెత్తనైనదో 'ఇం.. కొకప్పుడు' లో ఎరుకవుతుంది.

దేవిప్రియగారితో, దేవిప్రియగారి కవిత్వంతో ప్రయాణం చాలా ఇష్టపూర్వక మైనది. నేను ఆయన కవిత్వాన్ని ప్రేమిస్తాను. ఇటీవలి తణుకు, విజయవాడ సాహిత్య సంగమాల వరకూ, ఆ తర్వాత మొత్తం దేవిప్రియగారితో ఆయన కవిత్వవాక్యాలతో వున్నాను. వుంటున్నాను. ముందుతరం మనుషులతో కలిసి జీవించడం, వాళ్ల ప్రేమలో, ఆర్తిలో భాగంకావడం జీవితంలో మిగిలే అన్నింటికన్నా గొప్ప అనుభవాలుగా భావిస్తాను. 'మనుషులతో మనుషులు' వుండటంకన్నా జీవితంలో గొప్పదేదీ లేదని అనుకుంటాను.

తణుకులో 'కథ 2016' ఆవిష్కరణలో వేదికపైన దేవిప్రియగారు మాట్లాడు తున్నప్పుడు దేవిప్రియగారిలో పరిణితిచెందిన ఒక రాజకీయస్రష్టని తొలిసారి ప్రత్యక్షంగా చూశాను.

రోజులు రోజుల తరబడి, నిమిషాలు నిమిషాల తరబడి, క్షణాలు క్షణాల తరబడి లోకంమీద అక్షరాల విత్తనాలను వెదజల్లుతూ నిరంతరసేద్యం చేస్తున్న సాహిత్య జీవుల వెనుక నిలబడి రేపటిదారిని చూస్తున్నాను. రేపటి దారిని నావైన దుఃఖాలతో, నావైన గాయాలతో హత్తుకునే ప్రయాణంలో వున్నాను. కవిత్వం తీగెను పెనవేసు కున్నాను.

*(7 ఫిబ్రవరి 2018)*

⚜

***ఉద్యమాలలో యుద్ధాలలో***
***అలసిపోయిన***
***అవయవాలనీ ఆలోచనలనీ***
***కొమ్మచేతుల మీద మోసుకుపోయే***
***అమ్మ నా చెట్టు.***

(అమ్మచెట్టు : అమ్మచెట్టు)



బి. తిరుపతిరావు

# కవిత్వంలో 'తుఫానుతుమ్మెద'

రచయితలకి కొన్ని రంగాలలోవచ్చే పేరు, కీర్తి  మిగతా రంగాలలో వాళ్ళు చూపించిన ప్రతిభని మరుగున పడేటట్టు చేస్తుంది. సరిగ్గా ఇటువంటి స్థితినే కవిగా దేవిప్రియ ఎదుర్కొన్నారు. అంతకుముందే సినిమాల అనువాదకుడిగా శ్రీశ్రీ ఎదుర్కొన్నారు. మూడు దశాబ్దాలకు పైగా సాహిత్యరంగంలో వుండి రచన చేస్తున్న దేవిప్రియ గత దశాబ్దన్నర కాలంలో 'రన్నింగ్ కామెంటరీ' రచయితగా విశేష కీర్తిని ఆర్జించాడు. ఈ కీర్తి ఆయన వచన కవిత్వరంగంలో చేసిన కృషి పరిగణనకి రాకుండా చేసింది. అయితే సీరియస్ పాఠకుల దృష్టిలో దేవిప్రియ ఎప్పుడూ వుంటూనే వున్నారు. అమ్మచెట్టు (1979), నీటిపుట్ట (1990), తుఫానుతుమ్మెద (1999) అనే మూడు వచనకవితా సంపుటాలు వాటి  విలక్షణతవల్ల కవికి  సమకాలీన వచనకవితా క్షేత్రంలో సమున్నత స్థానాన్ని ఇస్తాయి. అలాగే వచనకవిత్వ విస్తృతిలో ఆయన ప్రాధాన్యతని గుర్తు చేస్తాయి.

ఏ సమాజంలోనయినా కవులు తక్షణ సమస్యలకి స్పందించడం సర్వసాధారణ విషయం. ఈ స్పందన వైయక్తిక అంశాలకు సంబంధించినదా, లేక మొత్తం సమాజానికి సంబంధించినదా అనే ప్రశ్న అనవసరం. అసలీ విభజనకి ఇవ్వాళ ఆస్కారం లేదు. వైయక్తిక అంశాలకు చెందినవయినా, సమాజం మొత్తానికి చెందినవయినా, సమస్యల అపసవ్యతమీద రచయిత నిరసన, విమర్శ, దాడి కొనసాగుతున్నదా లేదా అనేదే ప్రమాణం. ఈ ప్రమాణంలోంచి చూసినప్పుడు దేవిప్రియ దాదాపు మూడు దశాబ్దాలుగా సమాజ అపసవ్యతలమీద నిరంతరం కవిత్వనిఘా వేస్తూవచ్చారు. ఈ నిఘాలో భాగంగానే అనేక కవిత్వరూపాల్లో కృషిచేశారు. పైగంబరకవిగా మొదలైన దేవిప్రియ ఇవాల్టి 'తుఫానుతుమ్మెద' వరకూ చేసిన ప్రయాణంలో నిరంతరం ఎదుగుతూ వచ్చారు. కవిగా దేవిప్రియ ఎదుగుదల ఏదో ఒక రచయితల సంఘాన్ని ఆశ్రయించివుండటంవల్ల వచ్చింది కాదు. స్వయంగా సమాజాన్ని, దాని చలనాన్ని నిరంతరం పరిశీలిస్తూ విశ్లేషిస్తూ



రావటంవల్ల జరిగింది. జర్నలిజం ఈ కవి వృత్తి కావటం, కవిత్వం రాసేట ప్పుడు జర్నలిస్టుననే విషయాన్ని మర్చిపోగలగడం రెండుకూడా ఈ కవి వస్తుప్రపంచం విస్తృతం కావటానికీ, రూప సంబంధమయిన శక్తిని పొందటానికీ కారణాలయ్యాయి.

కవిగా దేవిప్రియ మౌలిక ప్రేరణ రాజకీయ ఉద్యమాలు, ముఖ్యంగా విప్లవ రాజకీయోద్యమాలు. ఈ విషయం ఈ కవి కవితావస్తువుల్ని చూస్తే చాలా స్పష్టంగా తెలుస్తుంది. నిజానికి 'అమ్మచెట్టు'లో అడివీ / నువ్వంటే నాకిష్టం' అని ప్రకటించిన ఈ కవి మూడు దశాబ్దాల తరువాత వెలువరించిన 'తుఫానుతుమ్మెద'ని, గద్దర్‌ని మెటఫర్ చేసుకుని రాయటంవల్ల ఈ కవి తాత్విక, రాజకీయ ప్రేరణలను గ్రహించడం మరింత సులువవుతోంది. ఒక కవి లేదా రచయితకి రాజకీయ భావాలు స్పష్టంగా వుండటం ఎంత అవసరమో ఆ రాజకీయ భావాల్ని కవిత్వం చేయటం, వాటిని వాటి స్థాయిలో ఆవిష్కరించగలగడం అంతే అవసరం. ఈ విషయంలో దేవిప్రియ విజయవంత మయ్యారు. బహుశ రాజకీయ అభిప్రాయాలు చాలా నిర్దిష్టంగా వుండి అవి విశ్వాసాల స్థాయికి చేరని కొద్దిమంది కవుల్లో దేవిప్రియ వొకరు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన జి. శ్రీరామమూర్తి 'తెలుగు కవితా సాహిత్యంలో ఉద్యమ కవిత్వాలు సృజనకు చేసిన హాని అపారమైనది' అని అభిప్రాయపడ్డారు. రామమూర్తిగారి అభిప్రాయం చర్చనీయాంశం అయినప్పటికీ దేవిప్రియ విషయంలో అది నిజం కాదు. ఎందుకంటే, విప్లవకవితా ఉద్యమం ఈయనకి ప్రధానప్రేరణ. ఈ ప్రేరణ లేకుండా 'తుఫాను తుమ్మెద'ని ఊహించలేం. అయితే ఉద్యమ ప్రేరణ ఈ కవి విషయంలో పాజిటివ్‌గా వుండటంవల్ల, కవిత్వాన్ని శుద్ధరాజకీయ ప్రకటనల స్థాయికి కుదించక పోవటంవల్ల దేవిప్రియ కవిగా మిగలడం జరిగింది. స్పష్టంగా చెప్పాలంటే కవిత్వ రూపంమీద ఈ కవికున్న శ్రద్ధ అతనిని కవిత్వరంగంలో మంచికవిగా మిగిల్చింది. లేకపోయినట్లయితే 1970–80లమధ్య అసంఖ్యాకంగావచ్చి అంతర్ధానమయిన కవుల పరంపరలో ఈయన కూడా చేరివుండేవారు.

ఒక కవికి కవిత్వాన్ని గురించివుండే ఆలోచనలు, నిర్వచనాలు, విమర్శలు మొదలయినవాటికి aesthetic value లేకపోవచ్చు కానీ, ఆ కవి ఏ తరహా కవిత్వాన్ని రాయాలని ఉత్సాహపడ్డాడు లేక ప్రయత్నించాడు అనే విషయాన్ని అర్థం చేసుకోవడానికి పై విషయాలు ఉపకరిస్తాయి. ఈ కోణంలోంచి చూసినప్పుడు, దేవిప్రియ కవిత్వాన్ని దాని అనేకరూపాల్లో, పార్శ్వాలలో చూశారు. ఒక రకంగా కవిత్వం ఈ కవికొక శుద్ధ సామాజిక విశ్లేషణా సాధనం. ఉదాహరణకి రన్నింగ్ కామెంటరీ తరహా కవిత్వం. మరొక రకంగా చూసినప్పుడు తన Splendourని ఆవిష్కరించటానికి చేసే ప్రయత్నమే ఇతని కవిత్వం. 'నీటిపుట్ట'లో ఈతరహా కవిత్వానికి అనేక ఉదాహరణలు దొరుకుతాయి. ఇంకొకరకంగా చూసినప్పుడు కొన్ని సున్నితమైన తాత్వికప్రకటనలు, రూప



సంబంధమైన వైచిత్రి సాధించే ఒక ప్రయత్నంగాకూడా ఈయన కవిత్వం వుంటుంది. ఇందుకు ఉదాహరణగా 'గరీబుగీతాలు' పేరుతో వెలువడిన పద్యాల్ని చూపవచ్చు. 'Poetry to a poet is the most rewarding work in the world' అని డైలాన్ థామస్‌లాగా అనుకుంటాడీ కవి. అందువల్లే 'కవిత్వం / ఇంద్రధనుస్సుకి / నిద్రలో కనిపించే బ్లాక్ అండ్ వైట్ స్వప్నం' అని గొప్ప భావుకతతో చెప్పగలిగారు దేవిప్రియ. కవిత్వంమీద ఈ కవికున్న మోహం అనేక సందర్భాలలో కవిత్వచరణాల్లో వ్యక్తమవుతూ వుంటుంది.

దేవిప్రియ కవిత్వాన్ని మనకున్న అనేకానేక భావవ్యక్తీకరణ సాధనాల్లో మరొకటిగా చూడలేదు. కవిత్వాన్నొక 'సాంకేతిక విన్యాసం'గా చూశారు. చూడటమే కాదు 'సమాజానందస్వామి' నుంచి ఇవ్వాల్టి 'తుఫానుతుమ్మెద' దాకా నడిచిన తన కవిత్వరచనలో ఈ సాంకేతిక విన్యాసాన్ని కొనసాగించారు. కవిత్వాన్ని కేవలం భావ వ్యక్తీకరణ సాధనంగా చూసేకవికి కవిత్వరచన కేవలం ఆత్మికమైన శ్రమ మాత్రమే. ఇందుకు భిన్నంగా కవిత్వాన్ని ఒక సాంకేతిక విన్యాసంగాకూడా చూసే కవి అనివార్యంగా రూపంమీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించాల్సి వుండటంవల్ల కవిత్వరచన ఒక భౌతికశ్రమగాకూడా వుంటుంది. ఈ శ్రమ దేవిప్రియ కవిత్వంలో ఎక్కువగానే కనిపిస్తుంది. అందువల్లనే దేవిప్రియ కవిత్వంలో సాంద్రతలేని పంక్తులు అరుదుగా కన్పిస్తాయి. రూపాన్ని మరీ సాగదీయకుండా దాని పరిమితుల్లోకి కుదిస్తూ రావటంవల్లకూడా దేవిప్రియ కవిత్వంలో సాంద్రతని సాధించడం జరిగింది. మనం ఎంత కాదన్నా రూపం విషయంలో పద్యకవులు పడే బాధ వచనకవులు పడరు. ముఖ్యంగా సమకాలీన కవులు అసలే పడరు. పద్యాలు రాసే అలవాటువున్న కవి కావటంవల్లకూడా దేవిప్రియ కవిత్వంలో రూపానికి ప్రాధాన్యత ఎక్కువగా వుంటుంది. కవిత్వరూపంమీద ఈ కవికున్న ప్రేమే అతనిచేత 'గరీబుగీతాలు' కందపద్యాల రూపంలో రాసేటట్టు చేసింది. అయితే పద్యాల్లోకూడా దేవిప్రియ కవిత్వాన్ని ఒట్టి సాంకేతిక విన్యాసంగా చూడలేదు. వస్తు రూపాల సమతుల్యతని సాధించడంవల్లనే ఈ కవి మనకున్న మంచికవుల్లో ఒకడు కాగలిగాడు. మూడు దశాబ్దాల కాలంలో, 'సమాజానందస్వామి', 'గరీబుగీతాలు' మినహాయిస్తే, కేవలం మూడు సంపుటాల్ని మాత్రమే వెలువరించిన ఈ కవి కవిత్వరచన విషయంలో గొప్ప నిగ్రహాన్ని చూపించారు. కుందుర్తి వచన కవితా ప్రవాహంలో ఈ కవి కొట్టుకుపోకుండా నిలబడడానికి ఈ నిగ్రహంకూడా ఒక శక్తి అయింది.

జననం, మరణం, దుఃఖం, ప్రేమ, సెక్స్, పునరుత్పత్తి అనే ప్రాథమిక బంధాల నుంచి ఏ కవీ ప్రేరణ పొందకుండా వుండలేదు. ఈ ధాతువుల్లో (Categories లో) జననం అనే ధాతువుక్రిందకు వచ్చే మాతృప్రేమ, స్పర్శ గురించి దేవిప్రియ చాలా సందర్భాలలో రాశారు. 'తుఫానుతుమ్మెద' సంపుటిలో అదొక Obsession అని



అన్నా ఆశ్చర్యం లేదు. చాలాకవితలు ఈ అంశంచుట్టూ తిరుగుతూవుంటాయి. 'అమ్మ పాడిన ఆ పాట' అనేది ఇందుకు ఒక నిర్దిష్ట ఉదాహరణ మాత్రమే. "అమ్మా, ఇప్పుడు/ నీ పాట, నా చిన్ని చిటికెనవేలుకి నువ్వు చేయించిన నీలంరాయి ఉంగరంలా తగులు తున్నదమ్మా, / నీ పాట నా అరచేతిమీద ఇంకా ములుకు దిగుతున్న బొంగరంలా తిరుగుతున్నదమ్మా" అని రాసినప్పుడు కవి పలవరింత లేదా నాస్టాల్జియా వర్తమాన సందర్భంలో కవి అస్తిత్వానికి ఊతం అవుతున్నదని అనిపిస్తుంది. అమ్మ గురించి రాసిన ప్రతి సందర్భంలోనూ దేవిప్రియ భావుకత తీవ్రస్థాయికెళ్ళటం గమనిస్తాం. ఇదే కవితలో ఇంకొకచోట ఇలా వుంటుంది. "పరివేష్టించిన ఫకీరుల తప్పెట లయ లకు/ పాటలు కట్టి మొహర్రమ్ రాత్రుల / పానకాల ప్రవాహాలలో పదచిత్రాల పడవలు వదిలిన / నా తల్లి నాకు నీ పాటలో కనిపించలేదమ్మా" అన్నది కవి తీవ్ర భావుకతకి మరొక ఉదాహరణ. అలాగే 'నగ్న కరవాలం' అనే కవితకూడా– "అప్పుడొకసారి అమ్మరెక్కల కిందినుంచి పైకి చూసినప్పుడు / చందమామ వెనీలా ఐస్‌క్రీమ్ ముద్దలా కనిపించాడు/ ఇప్పుడంతా మారిపోయిందాయేమిటి.../ రహదారి కంకరకోసం తొలిచిన రాతిగుట్టలావున్నాడు చంద్రుడు" అని కవి చిత్రించినప్పుడు కవి మనసులోని ఒకానొక భీతి పాఠకుడి మనస్సులోనూ మెదలకమానదు.

దేవిప్రియ రాసిన కొన్ని కవితలు, ముఖ్యంగా 'స్నేహం' లాంటి కవితలు వాస్తవికతను గురించిన ఒక sensuous apprehension పాఠకుడిలో కలిగిస్తాయి. ఒక మంచి కవిత లేదా కొన్ని పంక్తులు చదివినప్పుడు పాఠకుడికి అప్పటికేవున్న వాస్తవికతకు సంబంధించిన భావన ఏదో ఒక స్థాయిలో distortion కి గురవుతుంది. ఆ తరువాత కనీసం తాత్కాలికంగానయినా, వాస్తవికత తానూహించిన లేక భావించిన దానికి భిన్నంగా కన్పిస్తుంది. అంటే పాఠకుడి sense of realityని ఆ కవిత ఎంతో కొంత ప్రభావం చేస్తుంది. కొన్ని సందర్భాలలో పాఠకుడి ఆలోచన మౌలికంగా మారే అవకాశంకూడా వుంటుంది. వాస్తవికత వేరురూపంలో ఆ పాఠకుడికి దర్శనమిస్తుంది. "A good poem is a contribution to reality" అని డైలాన్ థామస్‌లాంటి వాళ్ళు అన్నది ఈ పైకారణం చేతనే. ఈతరహా ప్రయత్నాలు కొన్ని దేవిప్రియ కవిత్వంలో కనిపిస్తాయి.

కవి చేసే అనేకానేక పనుల్లో భాషను revitalize చేయడం అనేది ఒకటి. Social awareness తోపాటు కవికి మౌలికంగా వుండాల్సింది Sensuous awareness. దేవిప్రియలో ఈ అంశం పుష్కలంగా వుండడంవల్ల కొన్ని కవితల్లో అది తీవ్ర రూపంలో బయటపడుతుంది. "ఈమె ఎవరు? అనే కవితలో దీన్ని చూడవచ్చు. ఈ కవి ఒక delirium (దాని సానుకూల అర్థంలో) వుండి రాసినట్టుగా వుంటుంది. ఈ స్థితిలో ఆవిష్కారమయ్యే భాషకి స్థిరరూపమేదీ వుండదు. అందువల్లే ఈ కవితకూడా



మిగతా కవితల్లోవుండే రూపపటిష్టతకి భిన్నంగా వుంటుంది. అయితే కవిత్వం విష యంలో మాత్రం చిక్కగా వుంటుంది.

దేవిప్రియ కవితలు ఏదో ఒక సత్యాన్ని శాస్త్రస్థాయిలో ప్రతిష్టించటానికో, చెప్పటానికో ఉద్దేశించినవి కావు. నిజానికి అసలు ఏ కవిత లక్ష్యమూ అది కాదు. అయితే చాలామంది కవులు, ముఖ్యంగా ఉద్యమకవులు కొన్ని అంశాల్ని శాస్త్రస్థాయిలో, లేకపోతే అఖండంగా చూపించే ప్రయత్నం చేస్తారు. సైన్స్ పని ఏమంటే, Power - knowledge ద్వంద్వాన్ని ఏకశిలాసదృశంగా ప్రచారంలో పెట్టడం. ఆ క్రమంలో తన ప్రాముఖ్యతని సాధికారీకరించుకోవటం. కవిత్వం ఇందుకు పూర్తి భిన్నమయిన పాత్ర నిర్వర్తించటమే కాకుండా, అసలు సాధికారతల్ని ధ్వంసిస్తూ పోతుంది. దేవిప్రియ విప్లవ కవిత్వద్వారంలోంచి వచ్చినప్పటికీ ఈ రెండవ కోవలో వుండటం విశేషం. ఈ కవిత్వం ఒక అస్థిరస్థితిని గురించో, లేక ఒక తీవ్ర అనుభవాన్ని గురించో చాలా సాపేక్షికమయిన భాషలో మనముందు నిలుపుతుంది. ఆ స్థితి గురించిన అంతే సాపేక్షికమయిన దృష్టిని పాఠకుడిలో కలిగిస్తుంది. ఈ కవి కవిత్వాన్ని ఎప్పుడూ ఒక organised state of mindలో రాయకపోవడంవల్ల ఇది సాధ్యపడింది. కవిత్వం ఎప్పుడూ అనుభవాన్ని ఒక orderలోకి తెచ్చే ప్రయత్నం చేస్తూ ఆ ప్రయత్నంలో నిరంతరం విఫలమవుతూ వుంటుంది. అలా విఫలమవ్వటంలోనే కవిత్వానికి ఒక charm వుంటుంది. అలా కాకుండా కవిత్వంలో order కనుక సాధించబడినట్లయితే అది కవిత్వం కాకుండా పోతుంది. దేవిప్రియ కవిత్వంలో ఈ order లేకపోవడం ఒక మంచి లక్షణం.

కవితలో ఒక ప్రతిమని లేక ప్రతీకని కేంద్రం చేసుకుని మిగతా ప్రతిమల్ని ఒకదాని తరువాత వేరొకటి పేర్చుకుంటూ పోవటంవల్ల ఆ కవితలో narrative లక్షణం పెరుగుతుంది. ఫలితంగా కవితలో సాంద్రత తగ్గుతుంది. ఈ విషయంలో దేవిప్రియ చాలా జాగ్రత్తగా వుంటారు. అందువల్లే తన కవిత్వంలో ఒక ప్రతీక కేంద్రంగా వుండటంకాక అనేక ప్రతీకలు ఒకదాన్ని వేరొకటి అభావం చేసుకుంటూ నడుస్తూ వుంటాయి. ఈ తరహా రచనలో వేరొక ఉపయోగం వుంది. అదేమంటే, కవి మానసిక ప్రపంచంలోవున్న స్థిరరూపాలు(కవిత్వరూపాలు) చదవటంద్వారా కవికి పరిచితమయిన రూపాలు నిరంతరం అతని రూపసంబంధ విస్తృతిని నియంత్రిస్తూ వుంటాయి. ఈ నియంత్రణనుంచి బయటపడడం పైతరహా కవిత్వరచనలో సాధ్య పడుతుంది. ఈ తరహా రూపానికి చక్కటి ఉదాహరణ 'విషాదవిదూషకుడు' (తుఫాను తుమ్మెద) అనే కవిత. కోకిల కంఠం, / సూర్యుడి మృతదేహం, మబ్బుతునక సబ్బు, స్తంభించిన సెలయేరు, ఏకపత్రసూర్యుడు, నెత్తుటద్దం, పావురకలశాలు, చంచలకెరటం లాంటి ఒక పరంపరగా వచ్చే ప్రతీకలు దేనికదే ఒకదానితో సంఘర్షించి రెండవదిగా



రూపొందుతూ వుంటుంది. ఇవన్నీ మెటఫర్లు కావటంవల్ల కవిత్వంలో గొప్ప సంక్షిప్తతకి కూడా ఇవి తోడ్పడుతూ వుంటాయి. మెటఫర్‌మీద పట్టు లేనివాడు వచనకవిత్వంలో వచనాన్ని మాత్రమే మిగుల్చుతాడు. దేవిప్రియకి మెటఫర్‌మీద మంచి అధికారం వుంది. ఈ అధికారం మరింత శక్తివంతంగా 'నీటిపుట్ట' కవితా సంపుటిలో కన్పిస్తుంది.

దేవిప్రియ, 'బృందగానంలో లీనమయిన స్వతంత్రనాదాల సంగతి తలచు కున్నామా! అని వాపోవటం ఈసంపుటిలో కన్పిస్తుంది. ఏ సమాజంలోనయినా ఆయా సందర్భాలలో ముందుకువచ్చే వాదాలను, తాత్విక చట్రాలను దాటి, లేక వాటికి అతీతంగా రచయితలు వుండగలడం అసాధ్యం. చేతనంగానో, అసంకల్పితంగానో రచయితలు ఆయా భావవాతావరణాలల్లో తాము అసంకల్పితంగానైనా కొన్ని విషయాల గురించి మాట్లాడడం జరుగుతుంది. 'తుఫానుతుమ్మెద' అని గద్దర్‌మీద రాసిన కవితలో మనకు తారసపడే పైపంక్తులలో, వర్తమాన విశ్వనాదాల హోరులో అంతర్ధానమవుతూ వున్న 'స్వతంత్రనాదాల' ప్రసక్తి మనం చూడవచ్చు.

ఇంతకుముందే చెప్పుకున్నట్టుగా మూడు దశాబ్దాల రచనాచరిత్రలో దేవిప్రియ ప్రధాన రాజకీయ ప్రేరణ విప్లవోద్యమాలే. అయితే తెలుగులో విప్లవకవిత్వం కొన్ని అంశాలని గురించి రాయటంమీద అప్రకటిత నిషేధం విధించింది. విప్లవ రచయితల సంఘాల్లో సభ్యులుగా వున్నవాళ్ళు ఈ నిషేధాన్ని కొంతవరకు అమలు జరిపినా, విప్లవ సంఘాలకు వెలుపలవుండి విప్లవ రాజకీయోద్యమాల్ని ఆవాహనచేస్తూ వచ్చిన శివారెడ్డి, దేవిప్రియ లాంటివాళ్ళు ఈ అప్రకటిత నిషేధాల్ని నిర్ద్వంద్వంగా నిరాకరించి 'నిషిద్ధ' అంశాలమీద కవిత్వం రాశారు. నగ్నముని 'ఉదయించని ఉదయాలు'కి ముందు మాట రాస్తూ ఆరుద్ర అన్నమాటల్ని అనుకరిస్తే, విప్లవం గురించిరాస్తే తప్ప విప్లవ కవిత్వం కాదనే ఊహ అనవసరంగా విప్లవకవిత్వంలో చలామణి అయింది. ఈ చలామణిని తిరస్కరించడం వల్లనే 'తుఫాను తుమ్మెద' సంపుటిలో దేవిప్రియ కవిత్వం ఈ పని శక్తివంతంగా చేసింది. 'బాల్యరంజాన్' అనే కవిత పంతొమ్మిదివందల యనభై లకిముందు దేవిప్రియ రాసివుండటం సాధ్యపడి వుండేది కాదేమో! దేవిప్రియ విప్లవ సాహిత్య శిబిరంనుండి ఎంతోకొంత స్వయంప్రతిపత్తిలో వుండటం ఇందుకు ఒక కారణమయితే, రెండవ కారణం ముస్లింవాద కవిత్వం మొదలై కొనసాగుతూ వుండటం వల్లకూడా ఇది సాధ్యపడివుంటుంది. "రంజాన్ అంటే / నాకు ఖసీదాలు పాడుకుంటూ / తప్పెట వాయించుకుంటూ / తొలివెలుగు కంబళి కప్పుకుని / మా అమ్మయిచ్చే 'హదియా' కోసం వేచివుండే ఫకీరు / ....రంజానంటే నాకు / మసీదు బురుజుమీంచి / పావురాయి ఎలుగెత్తి పాడే అజా" అని దేవిప్రియ రాయగలగడం ఈ రెండు కారణాలవల్లనే.

కవికీ తాత్వికతకీ ఎప్పుడూ విడదీయరాని బంధమే వుంటూవుంది. నినాద



స్థాయికి వెళ్ళకుండా వుండగలిగినంతవరకు కవిత్వంలో తాత్వికత పాళ్ళు చాలా ఆకర్షణీయంగా వుంటాయి. ఈ విషయం దేవిప్రియకు బాగా తెలుసు అనటానికి ఈ సంపుటిలో చాలా నిదర్శనాలు  కన్పిస్తాయి. చాలా మామూలు అంశాలమీద కవిత్వం రాయడం అనేది, ముఖ్యంగా ఆ సాధారణ అంశాల్ని తాత్వికంగా చూడగలగడం అనేది చాల క్లిష్టమైన పని. 'కీ.శే.చందమామ', 'అమ్మపాడిన ఆ పాట', 'ఒకనాన్న – ఒక చందమామ...!', 'చీకట్లోంచి చీకటిలోకి....', 'స్నేహం !', 'మరణానంతరజీవితం!' లాంటి కవితల్లో ఈ తాత్వికఛాయలు బాగా కన్పిస్తాయి. 'ఒకనాన్న–ఒక చందమామ ....!' అనే కవితలోని "దారం తెగిన పతంగం కోసం / విలపిస్తున్న పసిబాలుణ్ణి నేను" అన్నవాక్యాలు John Berry Man రాసిన 'The ball poem' ని గుర్తుకు తెస్తాయి. Berry Man కవితకూడా ఒకానొక 'Epistemology of loss' ని గురించిన కవిత. దేవిప్రియ కవితకూడా సరిగ్గా ఈ 'Epistemology of loss' ని చిక్కటి కవిత్వంలో ఆవిష్కరిస్తుంది. చలనపూరిత అంశాలలో చలనరాహిత్యాన్ని, చలనరాహిత్య అంశాలలో చలనాన్ని చూడగలిగేది కవులు, తాత్వికులే. 'చీకటిలోంచి చీకటిలోకి....' అనే కవిత సరిగ్గా ఈ చలనరాహిత్య అంశాల్లో గొప్పచలనాన్ని చూసే క్రమంలో కవితగా రూపొందింది. అంతేకాకుండా అసలు మౌలికంగా ఈ రెండు వర్గీకరణల మధ్య అంతరాన్ని చెరిపేసి, రెండిటిని కలిపివేయటంకూడా ఈ కవితలో జరిగింది. ఉదాహరణకి "పక్షులు గాలిలో / ఈకల్లా తేలుతుంటాయి / ఈకలు గాలిలో / పక్షుల్లా ఎగురుతుంటాయి !" అనే పంక్తులు.

కవితల్ని ఎక్కువ సందర్భాలలో చాలా informal గా మొదలుపెట్టడం దేవిప్రియ కవిత్వ శిల్పవిశేషం. ఎంత informalగా మొదలుపెడతారో అంతే informalగా  కవితని ముగిస్తారు. మధ్యలో మాత్రం గంభీరమైన విషయాలు వుంటాయి. 'మరణానంతర జీవితం' అనే కవిత అనుకుంటాం కానీ, బతుకు కవిత్వమంత సాఫీగా సాగదు..." అంటూ మొదలయ్యి, అదేస్థాయిలో 'ఇప్పుడు బతుకుతున్నదుందే, ఇదే / నిజమయిన మరణానంతర  జీవితం!' అని  ముగుస్తుంది. మధ్యలో మాత్రం ఎదురు కాల్పులు, కూలిపోయిన లైట్‌హౌసు, తెగిపోయిన గాలిపటం, సొరచేపల వేటగాడు, సముద్ర సర్పాలు, ఎర్రటిజలస్తంభం, తెగిన శిరస్సుమీద మూడవకన్నులాంటి గంభీరమైన అంశాల ప్రసక్తి వుంటుంది. అయితే informal గావుండే వాక్యాల ద్వారానే దేవిప్రియ చాలా పదునైన విమర్శ చేయడం కనిపిస్తుంది. సగటువ్యక్తి అమలులోవున్న సామాజిక వ్యవస్థపట్ల చూపుతున్న ఉదాసీనతకున్న బహుళరూపాలమీద నిరంతరం అనేక కవితల్లో దేవిప్రియ దాడి చేస్తూ వుంటాడు.

సామ్రాజ్యవాదమంటే మనలో చాలామందికి కేవలం ఒకానొక ఆర్థిక  నిర్మాణపు విస్తరణ మాత్రమే. ఈ విస్తరణకున్న సాంస్కృతికపార్శ్వాన్ని ఇప్పటికీ మనం గుర్తించ డానికి సిద్ధంగా లేం. ఏ విషయాన్నయినా దాని మూర్తరూపంలో తప్ప మనం



ఎదుర్కోలేం. దాని అమూర్తరూపంమీద మనదాడి ఎప్పుడూ వుండదు. పౌరసమాజంలో, ముఖ్యంగా వినిమయవ్యవస్థలో సామ్రాజ్యవాదం దాని బహుళ రూపాల్లో వర్ధిల్లుతుంది. దానిమీద దాడిని ఇప్పటిదాకా ఏదోఒకస్థాయిలో కవులు మాత్రమే చేస్తూవచ్చారు. ఈ కవుల క్రమంలో దేవిప్రియ మరింత సూక్ష్మకోణాల్లోకి వెళ్ళగలిగాడు. కాబట్టే కాడ్‌బరీస్ చాక్‌లెట్లలో, నెస్‌కాఫే కాఫీ కప్పులో, పెప్సి, కోకాకోలాల్లో సామ్రాజ్యవాద ప్రకంపనల్ని చూడగలిగాడు, 'మంచుతెరలు అల్లే గొప్ప హస్తకళాకారిణి సామ్రాజ్య వాదం' అని ప్రకటించ గలిగినాడు.

ఇదే సందర్భంలో ఈ కవి పరిమితుల్నికూడా కొన్ని చెప్పుకోవాల్సి వుంటుంది. 'తుఫాను తుమ్మెద' కవితా సంపుటి 1990 నుంచి 1999 వరకు దేవిప్రియ రాసిన కవితల సంపుటి. ఈ దశాబ్దం ఒక ప్రత్యేకమయిన దశాబ్దం. ఆరు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యంలో కొనసాగుతూవున్న అభ్యుదయ, విప్లవ సాహిత్య ఉద్యమాల పరిమితుల్ని, లోపాల్ని చాలా తీవ్రంగా నిలదీసి ప్రశ్నిస్తున్న దశాబ్దం. నిజానికి ఈ క్రమం 1980లలోనే ప్రారంభమయింది. విప్లవసాహిత్య ఉద్యమానికి సమాంతరంగా, ఇంకా చెప్పాలంటే దాన్నిదాటికూడా స్త్రీవాద, దళిత, మైనార్టీ సాహిత్యధోరణులు కొనసాగుతున్న కాలం, ఈ వాదాలు చాలా ఉధృతితో అనేక విషయాల్ని బహిరంగ చర్చకు పెడుతున్న కాలం. రాజకీయ, తాత్విక సిద్ధాంతాల్ని మరింత సూక్ష్మక్షేత్రాల్లోకి విస్తరించటమే కాకుండా, ఆ సూక్ష్మ క్షేత్రాల ప్రాముఖ్యతను గురించి నొక్కిచెపుతూవున్న కాలం. ఈ క్రమం మొత్తాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా, అసలు అటువంటి క్రమం ఒకటి కొనసాగుతూ వున్నదనే స్పృహకూడా వున్నట్టు తెలియకుండా 'తుఫాను తుమ్మెద'ను ప్రచురించారు. ఇది అచేతనంగా జరిగిన పని అనుకోవటానికి వీలులేదు. 'బెల్లీ బైలెల్లినాదే....' అని తీవ్రస్వరంతో కవిత రాయగలిగిన కవికి కారంచేడులు, చుండూరులు, నీరుకొండలు, ఎందుకు కనిపించకుండా పోయాయి. చాలా విషయాల్లో ఎంతో sensitive గా స్పందించిన దేవిప్రియ పై అంశాలనుంచి ఒక autonomous statusలో ఎలా వుండగలిగారు? విప్లవసాహిత్యం తనమీదతాను విధించు కుంటూ వచ్చిన తాత్వికచట్రపు పరిధిని ఈ కవి దాటిరాలేకపోయారా? లేక విప్లవ సాహిత్యేతర వాదాలమీద ఆ కవికి సందేహాలు వున్నాయా? అయితే మైనార్టీవాద కవిత్వప్రభావాన్ని మాత్రం దేవిప్రియ తప్పించుకోలేకపోయారు. ఇంతకుముందే చెప్పు కున్నట్లు అలా తప్పుకోకపోవటంవల్లనే 'బాల్యరంజాన్'లాంటి కవిత రాయటం సాధ్య పడింది.

*(దేవి'30 'స్వరపత్రం' 2002 నుంచి)*



రామతీర్థ

# ఆసియాలో అగ్రశ్రేణి కవి

దేవిప్రియ ఒక నూతన అర్థంలో సింధు లోయవాసి. దేశం అంటే మతం కాదని, ఎరుక కలిగిన నాగరికుడు. తత్వచింతనల ప్రసక్తి వచ్చినప్పుడు, ఒక జైనుడు, ఒక బౌద్ధుడు, ఒక మహమ్మదీయుడు. అనేక ఉపనిషత్తుల సారాంశం అయిన బృందశ్రమ 'సహవీర్యమ్ కరవావహై' పై అమేయ విశ్వాసంగల భారతీయుడు. తెలుగు కవిత్వంలో మర్యాదలెరిగిన, మానవకోటి మహాదూత. కవిత్వం తన దౌత్యసంభాషణగా. అసంఖ్యాక ప్రజల తరపున రాజులు, రాజ్యాలు, మారణకాండలు, యుద్ధాలు, దోపిడీలు, దౌర్జన్యాలతో మాట్లాడే ఒక అనధికార శాసనకర్త.

కవిత్వం ఒక వాహనం, ఒక యానకం. తన అభివ్యక్తి నవీనతలో. ఇటీవలి ఇతివృత్తాలుకూడా. అంతకన్నా పదిలంగా గొప్పగా పూర్వకవులు రాసినప్పటికీ, దేవిప్రియ కాలంలో, ఆయన కలంలో సరికొత్తగా పలుకుతాయి. అది ఎప్పటికప్పుడు కవికున్న నిష్ఠ,తత్పరత, కళాకౌశలంపైన ఆధారపడి ఉంటుంది. అలా శ్రీశ్రీ, దేవిప్రియ, దశాబ్దాల ఎడంలో, ఒకే భావనకు రెండు కవితలుగా ఎలా నిలిచారో చూద్దాము.

కవిత్వవస్తువు మానవుడు. ఇది శ్రీశ్రీ మహాప్రస్థాన కవిత్వంలో ఒక పెద్ద కవిత. శీర్షికకూడా మానవుడా! శ్రీశ్రీ రాసిన కాలం 1938. అనేక కోణాలనుంచి మానవుడి భిన్నభిన్న దశలను పలురకాలుగా సంబోధిస్తూ ఈ కవిత సాధించిన తీరు కొత్తది. దీనికి ఎల్లలు లేవు. ఈ మానవుడు ప్రపంచ మానవుడు. ఎల్ల లోకములొక్క ఇల్లై, వర్ణ బేధములెల్ల కల్లై అన్న గురజాడ ఆశావాదం ఈ కవితలో ప్రస్ఫుటంగా నినదిస్తుంది. మనిషి గురించే మాట్లాడే రెండు కవితల సామ్యపరిశీలన ఇది.

శ్రీశ్రీ గేయం 'రాశి చక్రగతులలో, రాత్రిందివాల పరిణామాలలో, బ్రహ్మాండ గోళాల పరిభ్రమణాలలో, కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన పరమాణువు సంకల్పంలో ప్రభవం పొందినవాడా, మానవుడా, మానవుడా!" అంటూ రోదసీ



గర్భాంతరాలలో మొదలు అవుతుంది. శ్రీశ్రీ మానవుడు పూర్తిగా, విశ్వనరుడు అవుతాడో లేదో తెలియదు కానీ, ఒక విశ్వపశువు. ఆయనే అన్నట్టుగా సంఘ పశువు. విచిత్రంగా, ఈ కవిత, కేవలం విభిన్నమైన సంబోధనల మీద ఆధారపడ్డ కవిత. నిర్మాణం మానవ సహస్ర నామ సంకీర్తన. మానవుల సౌశీల్యతను విభిన్నంగా అందుకున్న ఈ గీతంలో శ్రీశ్రీ మానవుడిలోని దౌష్ట్యాన్ని, అతార్కిక క్రౌర్యాన్నికూడా మూడు సంబోధనల్లో నిలిపి ఉంచాడు, కాట్లాడుకునేవాడా, ఓర్వలేనివాడా, సంకుచిత స్వభావుడా అని. గీతం మధ్యలోనూ, ఆఖరున సామాజిక పరిస్థితులచే తయారయే నేరచరిత్రకు బలయ్యే మానవుల విషమస్థితిని మరోమూడు పిలుపుల్లో ఖైదీ, రౌడీ, ఖూనీకోర్ అంటూ చిత్రించాడు. మిగతా కవిత అంతటా, శ్రీశ్రీ చేసిన మానవనామ సంకీర్తనలో ఉన్నవి డెబ్భై ఎనిమిది పిలుపులు. అప్పటికింకా నాజీలచే యూదుల ఊచకోత జరుగలేదు. జర్మనీ అందుకు సిద్ధం అవుతున్నది అతి పూజిత, అతి కామిత హిట్లర్ పరిపాలనలో. వీటిలోనే కవిత్వ సిరిసంపదలు అనబడే శరీరపరీవృతుడా, ఏకరక్తబంధూ, రక్తకణ సమష్టి కుటుంబీ వంటి నూతన భావనలు పిలుపులుగా చోటు చేసుకున్నాయి.

మనిషి అంటే శరీరం మాత్రమే కాదు అనే వేదాంత భావన. ఎందుకో అప్పటికి కేవలం ఇరవై ఎనిమిదేళ్ళ కుర్రవాడు అయిన శ్రీశ్రీ రాశాడు పరిపక్వంగా. ఇది తరువాత భౌతికవాదులకు పెద్ద చర్చనీయాంశం అయింది. అయినా ఈ కవిత ఒక సృజనశిఖరంగా నిలిచింది. ఈ కవిత మానవుడిని రకరకాల పేర్లు పిలిచి, ద హ్యూమన్ కండిషన్‌లోని మానసిక విచలతను గుప్పిట పట్టుకుంటుంది. పిలిచే పేరు లోనే ఒక గుణప్రతిపాదన చేస్తూ, ప్రపంచం ఎలా సకల గుణాభిజాత్యంగా వర్ధిల్లుతుందో, ఎలా సంఘర్షణలోంచి ప్రగతిని సాధిస్తుందో చెప్పే ఈ కవిత చాలామటుకు వైజ్ఞానికం కూడా తన సారంలో.

ఇదే హ్యూమన్ కండిషన్. నిరంతరం కవులను వేధిస్తూ ఉంటుంది. ఆల్బర్ట్ కామూ రాసిన వ్యాసం ద మిత్ ఆఫ్ సిసిఫస్‌లో, ఎలా మానవశ్రమకు ఫలితం వైఫల్యం అని ఒక గ్రీక్ తాత్విక అంశాన్ని చెప్తుందో, ఇది, చాలామంది సాహిత్యకారులు తమ రచనల్లో దాటిపోలేని ఒక ఊగిసలాట. మనిషి భవిత గురించిన ఒక సంశయగ్రస్త సందర్భం. దీన్ని శ్రీశ్రీ రాసిన ఆరు దశాబ్దాలకు, దేవిప్రియ, (2001లో రచన) పిల్ల వాడు కవిత రాసినప్పుడు, పలుకు సింగారం, కొత్త నగలుగా భావాల పుత్తడిని తీర్చి దిద్దుతూ నడిచింది. శ్రీశ్రీ గీతం రోదసీగర్భాంతరాల్లో మొదలయితే, దేవిప్రియ గీతం అమ్మ కడుపులోంచి అప్పుడే పుట్టిన పసివాడి దగ్గర మొదలు అవుతుంది. అభివ్యక్తి ఆవర్తం మారిపోయింది. మాట బొంగరమై కొత్త గుండ్రాలు తిరుగుతుంది. విషయం సూటిదనాన్ని అలవర్చుకుంటూ, ఒక పౌరాణికుడికి ఉండే వచోకోలాహలానికి దూరం గా జరిగి, పక్కా ఆధునిక నిర్మాణంగా, ఎన్ని అంతస్తులనైనా మోసే ఒక కాంక్రీట్ పిల్లర్‌వలె నిలబడుతుంది. దానిమీద కొత్త నిర్మాణం జరుగుతుంది.



అదీ,విషయం ఒకటే అయినా, అరవైఏళ్ల ఎడంలో వచ్చిన ఈరెండు కవితల్లో గల తేడా. 'పిల్లవాడుకదా',అని ప్రతి పంక్తీ దేవిప్రియ కవితలో నొక్కి వక్కాణిస్తుంటుంది. చైల్డ్ ఈజ్ ద ఫాదర్ ఆఫ్ మాన్ – అనే సూక్తికి నిలువెత్తు సంకేతంగా నిలబడే ఈ కవిత. ఇలా మొదలవుతుంది. కన్నది నల్లేరునో, నాగజెముడ్నో అయితే చెప్పచ్చు అది ఎలా పెరుగుతుందో, నువు కన్నది పిల్లవాణ్ని కదా... అంటూ సాగి, పువ్వులూ, ముళ్ళకంపలూ, పులులూ, తోడేళ్లూ, కొండచిలువలు, కుందేళ్ళతోకూడా యిలాంటి సందేహ, సంశయచరణాలుగా విస్తరించి గొప్ప అబ్బురపాటుకు లోనవుతుంది. విస్తు పోతుంది. మానవప్రస్థాన విస్తరణ పట్ల, ఆచరణ వైశాల్యాల అనివార్యతలపట్ల ఇది శ్రీశ్రీ చేసిన మానవచిత్రణకు ఒక సారభూత, నిక్షిప్త నిర్మాణశిల్పం. ఇందులో ఎలా దేవిప్రియ తృతీయ సహస్రపు గొంతుగా ప్రగతి సాధించాడో పరిశీలిద్దాము. 'హిట్లరవు తాడో, చార్లీ చాప్లినవుతాడో, ఇదీ అమీనవుతాడో, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవుతాడో, డాములూ, మహాభవనాలూ కడతాడో, మసీదులూ మందిరాలూ కూలగొడతాడో, దేశాన్ని కొల్లగొడతాడో, ప్రపంచ బేంక్‌కు చెల్లబెడతాడో, ఏడేడు సముద్రాలు జయిస్తాడో, కన్నవారి కన్నీటికి కాలువలే తీస్తాడో; కన్నది గాలి బెలూన్నో, అణుబాంబునో అయినా చెప్పవచ్చు అది ఎలా తేలబోతోందో, ఎలా పేలబోతోందో... నువ్వు కన్నది సాక్షాత్తూ మనిషినికదా!' అంటూ సంశయాల కూడలి లోనే, మంచి చెడుల మధ్య ఒక పోరాట రథ్యలోనే కవితను ముగిస్తాడు కవి.

కానీ చెప్పిన సంఘటనలన్నీ మనిషి చరిత్రలో దేశదేశాల్లో జరిగినవే. అదీ కవికిగల కాలస్పృహ. శ్రీశ్రీ స్మరించిన 'మానవుడా' కవితలో వీరందరూ ఉన్నారు స్వభావ రూపేణా ఇంకా పెద్ద కాన్వాసులో, ఒక పౌరాణిక కోలాహలంలో. దేవిప్రియ ఈ కవిత రాస్తున్న కాలం ఒక తృతీయ సహస్ర ఆరంభం. ఆధునికతకు ప్రధాన లక్షణం క్లుప్తత. కవిత్వ విషయంలో మానవుడి గురించిన సంశయం సోక్రటీస్ ప్రశ్న అంత పురాతనం అయినా, ఎత్తుబడి, నిర్మాణం, ముగింపు, దేవిప్రియ పాటించే ఖచ్చితమైన సమకాలీనతకు బలమైన ఉదాహరణలు. కవిత్వంలో ఆధునికతకు లక్ష్య లక్షణ నిర్వచనంగా ఈ కవిత సదా నిలబడి ఉంటుంది.

తానెరిగిన వ్యక్తుల గురించి, అపురూప పంక్తులు రాసినవాడీ కవి. మన కాలపు మహనీయుడు అంటూ గద్దర్‌ను శ్లాఘించడమే కాక, ఆయనపై ఒక డాక్యు మెంటరీకూడా తీసినవాడు దేవిప్రియ. 'పద్యాలమధ్య ఒక పాట' అంటూ గద్దర్‌పైన ఒక లేడి దుముకుల, వాగు పరుగుల, చిరుత దూకుల రచన చేశాడు దేవిప్రియ. కాకరాల గురించి, ఆఖరుదశలో తాను చూసిన నందిని సిధారెడ్డి నాన్నగారి గురించి, ఇస్మాయిల్ కవి గురించి, తమ్ముడికి ఎలిజీగా, సహచర అబ్బూరి రాజ్యలక్ష్మికి రాసిన గీతాల్లో, చాప్లిన్‌పైన పద్యంలో, హయాత్ అనే ఇరానియన్ సినిమాకు రాసిన మెప్పు



కోలులో, నగరాలూ, దేశాలూ, తిరుగుతూ నీటిపుట్టలో, అమ్మచెట్టు కొమ్మల్లో, గాలిరంగు, వానరంగు జలతంత్రులతో, ప్రతీ వేకువన గూడు కట్టుకునే, రెక్క ముడవని రాగం (ఇది ప్రసిద్ధ కవయిత్రి ఆదూరి సత్యవతీ దేవి గారి మాట) దేవిప్రియ సృజన.

ఆసియా కవుల్లో అగ్రశ్రేణిన నిలువగల కవిత్వసంపన్నుడు దేవిప్రియ. విస్ఫోటక వచనాన్ని నవలలుగా, కథలుగా, పత్రికా రచనలుగా వెలువరించిన సాహిత్య శతఘ్ని పతంజలి. నిదానంగానే అయినా నిష్ఠుర సత్యాలను అక్షర అక్షౌహిణీలుగా పేర్చే ప్రతిఘటనల సైన్యాధిపతి దేవిప్రియ. ప్రశ్నిస్తేనే భవిష్యత్తు అని ముందుకు నడిచే మానవాళికి విలువైన ప్రతినిధులు వీరిద్దరూ. ఇలా ఒక అవార్డ్, వీరిని కలపడం, లౌకికశక్తులకు బలం.

*(ఈ అర్ధ శతాబ్ద సాహిత్య సృజనకు, 2017 మార్చి, ఇరవై తొమ్మిది ఉగాది నాడు, కె.ఎన్.వై. పతంజలి జన్మదినం సందర్భంగా, విజయనగరంలో దేవిప్రియకు 'పతంజలి పురస్కారం' ప్రదానం జరిగిన సందర్భంగా. ఆంధ్రభూమి దినపత్రిక.)*

⚜

***సంగీతవలయాల వలలో చిక్కుకుని***
***విలవిలలాడుతూ, గింగరాలు తిరుగుతున్న***
***ఫ్యానుపిట్టలైపోతున్నాయి***
***నా అంతర్లోకాలు..***
***నా వెన్నుపూసకలంలో***
***సిరానై ప్రవహిస్తున్న నేను***
***వయొలిన్‌నో***
***వయొలిన్ గీతాన్నో!***
***సితారునో***
***సితారు సంగీతాన్నో !!***

(నేను గీతాన్నో, సంగీతాన్నో : అమ్మచెట్టు)





పెనుగొండ లక్ష్మీనారాయణ

# తాడి'కొండంత' కవి దేవిప్రియ

'మహా స్నేహదర్శనం కోసం' తొలి పొద్దున్నే నన్ను నిద్దురలేపుతూ మోగే నా సంచారవాణిలో ఆ పేరు కనబడగానే నమస్కరిస్తాను. 'ఇప్పుడే గుంటూరు చేరాను. రవిశంకర్‌లో దిగాను. కలుస్తావుగా?'

అప్పుడే మా పంతులమ్మగారిని అమరావతి బస్సెక్కించటానికి బయలు దేరాను. అమరావతి అనగానే నాకో గొప్ప పులకరింత. మనం పాతేసి పాతరేసిన బౌద్ధం ఆనవాళ్ళు యింకా మన కళ్లకు దర్శనమిస్తూ కన్నీళ్ళను కుమ్మరిస్తూ దుఃఖి స్తుంటాయి. మనం కోల్పోయిన ప్రేమ, దయ, కరుణ, జాలినీ జాలిజాలిగా గుర్తు చేస్తాయి. ఆ అమరావతికి గుంటూరుకు మధ్యలో కొద్దిగా పక్కకు వెళితే తాడికొండ. ఆ వూరి కొండలు చూడగానే ఆ కొండమీదే ఏదో ఒక ధ్యాసలో, ఒక ధ్యానంతో 'అమ్మకథ'తో సాహిత్యయాత్ర మొదలెట్టిన ఆ వూరి పిలగాడు మనల్ని స్వాగతిస్తూ కనిపిస్తాడు. శిక్షణా, క్రమశిక్షణా లేని బాల్యం, దిగుళ్ళు ఎగుడు దిగుళ్ళతో నడిచిన, గడిచిన బాల్యమతనిది.

నడుస్తున్నా, కూర్చున్నా పెద్ద పులిలాగే వుండే నల్లటి వేమన పద్యంలాంటి తన పోలీసు తండ్రినీ, పరమ దయామయి అయిన పెద్దమ్మనూ, ఎట్టా బతుకుతావురా అని తన గురించి పదే పదే ఏడ్చే అమ్మనూ, తన హీరోలైన జట్కావాలాను, జీపు డ్రైవరునూ మనకు పరిచయం చేస్తాడు. అంతేకాదు, ధ్వజస్తంభం గంటల్ని మోగించి మంద్రమంద్రంగా వినిపిస్తాడు. కోనేటినీళ్ళను దోసిళ్ళతో తానొక్కడే కాకుండా మనచేతా తాపించి దాహం తీరుస్తాడు. ఆ తరువాత కోనేటిలోకి కాళ్లు జారవిడిచే ఒక అద్భుత బాల్యక్రీడను మనం ఆడేట్లు చేస్తాడు. జారిపోతున్న ఖాకీలాగును పైకి లాక్కుంటూనే మన చిటికెన వేలు పట్టుకొని తన బాల్యంలోకి, తన వూర్లోకి మనల్ని ఎగరేసుకెళ్తాడు. నవ్వుల్నే కాదు విషాదాల్నీ ఆలపిస్తాడు. తన తాడికొండ ప్రపంచ అలమరాలో యింకా



తాను అపురూపంగా దాచుకున్న జ్ఞాపకాల దొంతర్లను మనముందు పరిచి వాటిని ఆస్వాదించమని, అనుభవించమని చెబుతూ అతనేమో వినువీధుల్లో 'నక్షత్రయాత్ర' చేస్తుంటాడు.

ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థలో ఒక్కొక్క మెట్టూ పైకి ఎక్కాలని అందరూ ఆరాట పడుతుంటే తను మాత్రం ఒక్కొక్క మెట్టు దిగుతూ బాల్యంలోకి, పసితనంలోకి, మళ్ళీ అమ్మ కడుపులోకి యిలా ఒక పురాస్మృతిలోకి వెళ్ళాలని వేయి కవితలతో వేడుకుంటూ మనకు అచ్చ కవిత్వమై కనిపిస్తుంటాడు. కావాలంటే ఎప్పుడైనా తీరిక దొరికినప్పుడు అటుగా మీరు వెళ్ళండి. అక్కడికి వెళ్ళాక అక్కడే వుద్యోగిస్తున్న మన పాపినేనినికూడా తీసుకెళ్ళండి. తనంత ఎదిగిన మరో కొండను చూపిస్తుంది తాడికొండ. ఈ కవులెప్పుడూ ఇంతే. ఒక జననాంతర సౌహృదానిలాగా వెన్నాడుతూనే వుంటారు. ఈ మిత్రుడైతే మరీను. చెట్టునూ, పుట్టనూ అదే 'అమ్మచెట్టు'నూ 'నీటి పుట్ట'నూ ఆర్ద్రతతో, ప్రేమతో కొసవేళ్ళతో స్పర్శిస్తూ, అంతలోనే 'ప్రపంచం కోసం ఇంకా పాటలు మోసుకొస్తున్న 'తుఫాను తుమ్మెద'గా మారి 'ఇప్పుడు బతుకుతున్నదుందే ఇదే నిజమయిన మరణాంతర జీవితమ'ని నిగ్గు దేలుస్తూ కేవలం ఒకే ఒక్క వాక్యంలో జీవన వ్యాకరణాన్ని, జీవిత వ్యాఖ్యానాన్ని గానం చేస్తాడు. ఇతని పద్యాలు చదువుతుంటే "అమ్మలందరూ ఒక సముద్రమై మన ఇంటిముందుకు పొంగి పొరలుకుంటూ రావటం" మనకగుపిస్తుంది. ఇంకా ఇతను ప్రేమ, దయ, కరుణ, జాలి కలగలిపిన పద్యాలతో మనల్ని అల్లుకుపోతాడు. ఊపిరాడనివ్వడు, తన కవిత్వంతో ఊపిర్లూదు తాడు. "కవులు ప్రేమిస్తారు. నిజానికి వాళ్ళకు చేతనైంది అదొక్కటే' అని తనను తనే పలుమార్లు రుజువు చేసుకుంటుంటాడు. స్వేచ్ఛ కోరే మానవుడు కాబట్టే "కాలికి చుట్టుకున్న వలని విదిలించుకుని 'చివరికి పిట్టకూడా ఎగిరిపోవలసిందే' అని స్వేచ్ఛా గానాన్ని ఆలపిస్తాడు. 'నీటితోటలో బిలబిల ఎగిరే, 'చేపచిలుక'ను మనముందు దృశ్యీకరిస్తాడు.

ఈ కవి తనగురించి చెప్పే దాంట్లోనే యితరుల గురించీ చెపుతాడు. ఇతరుల గురించి చెప్పేదాంట్లో ఎన్నెన్నో యితరేతర విషయాలు ప్రస్తావిస్తాడు. 'నేను సమస్త లోకాన్నీ సమస్త లోకానికీ అచ్చొత్తి చూపిస్తాను' అని ఎలుగెత్తి చాటుతూ సాక్ష్యాలుగా తన పుస్తకాలను ప్రవేశపెడతాడు.

'నాకు రెండు నిధులున్నాయి –నాలుక మీద కవిత్వం. తలమీద దారిద్ర్యం! నాకు రెండు విధులున్నాయి – కవిత్వ నిత్యనిబద్ధం, దారిద్ర విముక్తి యుద్ధం' (ద్వయం). ఈ విముక్తి యుద్ధం చేయడానికి 'సుత్తి కొడవలి నెత్తిన ఒక నక్షత్రం చెమటచుక్కలా మెరిసే ఎర్ర చేనేత జెండా కావాలి నాకిప్పుడు' అని కోరుకుంటూ 'ఎంత కాలమైనా నేనిలా ఎర్రజెండాని గురించి కలగంటా!' అని ఒక మహాస్వాప్నికుడైపోతాడు.



ఇంతలోనే నిజాన్ని గ్రహించినవాడై 'ఉద్యమించవలసిన గాలులు' తలా ఒక కొమ్మమీద విశ్రమిస్తున్నాయి' అంటూ వామపక్షాల బాధ్యతారాహిత్యంపట్ల బాధ్యతతో కూడిన ఒక నిరసనను వ్యథతో ప్రకటిస్తాడు. ఇంతలోనే తేరుకుని 'నా ప్రపంచం నా ప్రజల దీనమైన చూపుల చివర, నా జనులు పదునుపెట్టిన ఆయుధాల అంచులమీద తేలే మిరుమిట్లలో వుంద'ని ఆశాభావంతో తన కవిత్వ లక్ష్యాన్ని మన ముందుంచుతాడు.

ఈయన కవిత్వాన్ని యువకులు సిలబస్‌గా స్వీకరిస్తే చాలు, మంచి కవిత్వం జాలువారుతుంది. మలినమైపోతున్న వ్యవస్థను శుభ్రపరచటానికి రాసిన ఈయన కవిత్వాలు పాఠ్యగ్రంథాలైతే సమాజానికి మేలు జరిగినట్లే. ఇంత మంచి కవిత్వాన్ని పంచిన ఇతన్ని అందుకోలేనందుకు విశ్వవిద్యాలయాలు, అకాడమీలు చిన్నబోయి చూస్తున్నాయి.

గుంటూరునుండి 'నిర్మల' పత్రికను కొద్ది సంచికలే తెచ్చినా ఎన్నో సాహిత్య దీపాలను వెలిగించాడు. పైగంబరకవిగా ప్రసిద్ధిచెందాడు. 'గరీబుగీతాల'ను అల్లిన కవి నవాబుకూడా ఇతడే. సమాజానికి 'రన్నింగ్ కామెంటరీ' చెప్తున్న పాత్రికేయుడు కూడాను. ఎందరో మహనీయులు తిరిగిన గుంటూరులో ఇతను పెరిగాడు. ఇప్పుడు అక్కడ వీళ్ళందరి వారసుడిగా నేనూ, మరికొందరు మిత్రులం ప్రయాణిస్తున్నాం. ఇది మాకెంతో గర్వకారణం.

కులమతాలు గీసుకున్న గీతలజొచ్చి పంజరాన గట్టుపడని మనిషతడు. అంతేకాదు వాటి నతిక్రమించిన విశ్వనరుడుకూడా! ఇతని కవిత్వం 'కాలాతీత కాంతి రేఖ.' స్వాతంత్ర్యం వచ్చిందన్న పంద్రాగస్టునాడు పుట్టిన ఈ కవి నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఎప్పుడూ తన కవితా పతకాన్ని ఎగరేస్తూనే వుంటాడు. కవి అరవైయేళ్ళే కాదు – ఆరువందల ఏళ్ళూ తన కవిత్వం ద్వారా బతుకుతూనే వుంటాడు. అందుకే కవి చిరంజీవి.

ఇన్ని శబ్ద చిత్రాలను ఇన్ని భావ స్వప్నాలను,
కాగితం మీదికి ఎక్కించి మన కందించిన ఆ అరచేతికి
ఆ అరచేతిలోని స్వరపేటికకూ 'లాల్ సలామ్'.

***... నా సూర్యుడు మదమతిప్పని మహోద్యమకారుడు***
***విరామమెరుగని విప్లవవీరుడు.***

(విరామమెరుగని సూర్యుడు : అమ్మచెట్టు)



పసునూరు శ్రీధరబాబు

# కవిజర్నలిస్టు... జర్నలిస్టుకవి...

దేవిప్రియ... పరిచయవాక్యాలు అక్కర్లేని పేరు. తెలుగు సాహిత్యంలో. తెలుగు జర్నలిజంలో కొత్తదనం గురించి రాయాల్సి వచ్చినప్పుడు మస్తిష్కంలో వెలుతురు పిట్టలా రెక్కలల్లార్చే పేరు. సినిమా, టెలివిజన్ మాధ్యమాల్లోనూ వైవిధ్యానికి చిరునామాగా నిలిచిన పేరు. మూడు దశాబ్దాలకుపైగా కవిగా, జర్నలిస్టుగా సాహిత్య, పత్రికా రంగాలను ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి దేవిప్రియ.

అక్షర ప్రవాహాల్ని సృష్టించే నీటిపుట్ట. తెలుగు పదాలను ప్రేమగా పొదివి పట్టుకుని ఆకాశ వీధుల్లోకి పావురాలుగా వదిలే అమ్మచెట్టు. రాజకీయ క్రీడకు, సమాజ పరిణామానికి రన్నింగ్ కామెంటరీ. తెలుగు సినిమాకు జాతీయ గౌరవాన్ని సాధించే కృషిలో రంగుల కలలను పాటగా నిలబెట్టిన కలం.

అరవయ్యేళ్ళ దేవిప్రియ జీవితమంతా ఇంతే. గుంటూరు జిల్లా తాడికొండ నుంచి ఎగుడు దిగుడుల దారిలో ఆయన ప్రయాణం మొదలైంది. ఈ కవి 1962లో కథారచయితగా తన సాహితీయానాన్ని ప్రారంభించారు. కథలు, డిటెక్టివ్ నవలలు, జానపదాలు, వృత్తాలు, మాత్రాఛందస్సు ఇలా తనకు నచ్చిన ప్రతి ప్రక్రియలో ప్రయత్నించి అక్షరాలమధ్యే ఈ జీవితం అనుకుంటూ పెరిగారు దేవిప్రియ. డాక్టర్ సి. నారాయణరెడ్డి రచించిన కర్పూర వసంతరాయలు చదివి ఆ ప్రేరణతో ఆయన రాత్రికి రాత్రే వనజారాయలు అనే పద్యకావ్యాన్ని రచించారు. కాలేజీ చదువులతో కుస్తీ పడుతూనే మరోవంక గుంటూరు న్యూస్, స్వతంత్ర సందేశ్, తెలుగుసీమవంటి పత్రికలలో పని చేయడం ప్రారంభించారు. అలా ఇరవయ్యేళ్ళ వయసులోనే సాహిత్యం, జర్నలిజాలనే రెండు పట్టాలమీద, పడవలు కాదు, ప్రయాణం సాగించారు. తన సీనియర్ యం.కె. సుగమ్‌బాబుతో కలిసి విప్లవం సంకలనంలో రాసిన కవిత, ఆ తరువాత కంచికచర్లలో ఓ హరిజన యువకుడిని సజీవ దహనం చేసిన సంఘటనలకు







కకావికలమై 'జ్వాల' పత్రికలో రాసిన సుదీర్ఘ కవితతో దేవిప్రియ రాజకీయకవిగా తెరముందుకు వచ్చారు. మూడున్నర దశాబ్దాల కిందట సృజన పత్రికలో దేవిప్రియ ప్రచురించిన కవితలు, అమరవీరుల సంస్మరణ గీతాలు.. అడవీ/నువ్వంటే నాకిష్టం అని నినదించిన దేవిప్రియ రాజకీయ విప్లవోద్యమాల పునాదులమీదే తన సాహితీ భువనాన్ని నిర్మించుకున్నారు. కానీ, కవిత్వంలో ఎక్కడా ఎప్పుడూ నినాదప్రాయంగానో ఉత్త వచనంలానో తేలిపోయిన దాఖలాలు లేవు. కవిత్వ వ్యూహనిర్మాణ రహస్యాలు బాగా తెలిసిన దేవిప్రియ  రాజకీయ కవిత్వాన్ని వైయక్తిక పరివేదనగా మలచడంలో విజయం సాధించారు. ప్రజాగాయకుడు గద్దర్‌కు ప్రతీకగా తుఫానుతుమ్మెద పదబంధాన్ని సంధించినప్పుడు కూడా రాజకీయ తాత్వికతను కవిత్వం చేయడంలోని ఆ నైపుణ్యమే స్ఫురిస్తుంది. రాజకీయ సైద్ధాంతికతను అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, ప్రేమించడం దాకా వెళ్ళిన దేవిప్రియ ఆ మోహంలో పడిపోలేదు. అందుకే,ఆయన కవిత్వం చర్విత చరణంగా మారలేదు. కవిత్వాన్ని శుద్ధ సామాజికవిశ్లేషణ సాధనంగానే కాకుండా సౌందర్యాత్మకదృష్టిని, భాషమీది మమకా రాన్ని, హృదయ సంస్పదనల్ని విస్మరించలేని మానవీయ బలహీనతలను వాహికగా మార్చుకున్నారు కనుకే దేవిప్రియ కవిత్వం నిత్యవసంతం. ఈ పైగంబరకవి నిలువనీరు లాగా ఎన్నడూ లేడు. నిరంతర ప్రవాహంలా కొత్త ఆకాశాల్ని ప్రతిఫలిస్తూ, వినూత్న పరీవాహక ప్రాంతాల్ని సృష్టించారు. అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫాను తుమ్మెద, పిట్టకూడా ఎగిరిపోవలసిందే, చేపచిలుక... ఇటీవలే వచ్చిన గంధకుటి సంపుటాలు అందుకు ప్రత్యక్షర నిదర్శనం.

కవి దేవిప్రియలోని జర్నలిస్టుకు రన్నింగ్ కామెంటరీ ఒక మెటఫర్ అయి కూర్చుంది. అది ఎంతగా హిట్టయిందంటే, ప్రజాతంత్ర సంపాదకునిగా వ్యవహరించిన నాటినుంచి ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఉదయం, ఇటీవలి హైదరాబాద్ మిర్రర్, హెచ్.ఎమ్.టి.వి. వరకూ పాత్రికేయునిగా, సంపాదకుడిగా ఆయన రాసిన అనేకానేక విలక్షణ కథనాలు, వ్యాసాలు, సంపాదకీయాలన్నీ రన్నింగ్ కామెంటరీ అనే మహావృక్షం నీడలో మగ్గిపోయాయి. కవిత్వం తెలిసిన పాత్రికేయుల్లో చాలా కొద్దిమందే రెండు రంగాల్లో రాణించారు. దేవిప్రియ స్వతహాగా కవి కాబట్టి, జర్నలిజంలో ఆయన కవిత్వం ఒక సంచలనమైంది. త్వరలో రానున్న దేవిప్రియ సంపాదకీయాలు గ్రంథం... ఈ అసంతృప్తిని చెరిపేస్తుందని ఆశిద్దాం.

దృశ్య మాధ్యమంలో దేవిప్రియ చేసిన ప్రయోగాలు అనేకం. అనన్య సామాన్యం. నిజమే, ప్రముఖ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి ఓ సందర్భంలో అన్నట్లు, దేవిప్రియ జర్నలిస్టులు చేయలేని చాలా పనులను చేయగలరు. కవులకు సాధ్యం కాని ఘనకార్యాలెన్నింటినో సాధించగలరు. మీకు తెలుసా, జెమిని టెలివిజన్లో ప్రసారమైన తొలి తెలుగు వ్యాపార విషయాల కార్యక్రమం 'బిజినెస్ ట్రాక్'కు ఆయన



వంద వారాలు స్క్రిప్టు రాసి, దర్శకత్వం వహించారు. సిటీ కేబుల్‌లో 'దేవిప్రియాస్ ఎలక్షన్ షో–1999' రూపొందించి, నెలరోజులు నిరంతరాయంగా సమర్పించారు. తెలుగు సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన మా భూమి చిత్రానికి తెర వెనుక కీలక పాత్రధారుల్లో దేవిప్రియ ఒకరు. రంగులకల చిత్రంలో 'జమ్ జమ్మల్ మర్రీ వెయ్యి కాళ్ళా జర్రీ..." అనే జనగీతంతో తెలుగు హృదయాల్లో నిరంతర ఢమరుకంగా మోగిపోతున్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను అంతర్జాతీయ సమాజానికి పరిచయం చేసేందుకు "ది మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్" అనే 96 నిమిషాల డాక్యుమెంటరీని స్వీయ దర్శకత్వంలో ఇంగ్లీషులో నిర్మించారు. ఇంకా... ఎన్నో సినిమాలకు పాటలు రాశారు.

ఇన్ని భిన్న కోణాల్లో సృజన ప్రవాహంలా చెలరేగిన దేవిప్రియ ప్రభావం తెలుగు సాహిత్యంలో, పాత్రికేయ లోకంలో అనివార్యంగా కొనసాగుతూనే ఉంటుంది.


*(2013లో)*

⚜

*రమ్మని కబురు వచ్చాక*
*రాయంచలైనా రయ్యిన*
*ఎగిరిపోవలసిందే....*
*హంసలదీవికి*
*కొత్తహంసలను పంపవలసిందే*
*నవధవళ వర్ణాలను నింపవలసిందే!*

(హంసలదీవి : అరణ్యపురాణం)






మహాకవి శ్రీశ్రీ, మిరియాల రామకృష్ణలతో దేవిప్రియ, మద్రాసులో.



కాకరాల, దేవిప్రియ, డా. గోపాలకృష్ణ, మద్రాసు పాండీబజార్‌లోని
హమీదియా హోటల్ అరుగుమీద




అక్కినేని నాగేశ్వరరావు, అప్పటి సమాచార శాఖ మంత్రి పిడతల రంగారెడ్డిలతో
'ప్రజాతంత్ర' ఎడిటర్‌గా ప్రథమవార్షికోత్సవ సభ : 1976



మిత్రుడు వేణుగోపాల్ థక్కర్‌తో...



తన ఇష్ట రచయిత వి. రాజారామమోహనరావుతో...




సారధి స్టూడియోలో 'రంగులకల' పాటల రికార్డింగ్
గద్దర్, దేవిప్రియ, బి. నరసింగరావు – 1982





దేవిప్రియ, హరి, గోపి, చే.రా. ఒక సెమినార్‌లో.



విజయవాడలో పుచ్చలపల్లి సుందరయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న
కె. రామచంద్రమూర్తి, దేవిప్రియ – మే, 19, 1985.



తన అభిమాన హాస్యరచయిత నండూరి పార్థసారథితో




యాకూబ్, శిలాలోలితల పెళ్ళికి దేవిప్రియ సాక్షి సంతకం



ఒక చరిత్రాత్మక ఛాయాచిత్రం : 1981లో ఉప్పల నరసింహం, దేవిప్రియ, జయధీర్, భూపాల్, శివారెడ్డి, వంగపండు, గద్దర్, నమ్ము, చిరంజీవులు ఇవా, సమత, హైదరాబాద్‌లో – దేవిప్రియ నివాసం, 1981. ఫొటో : బి. నరసింగరావు.




ఢిల్లీ ఎర్రకోట ముందు ఆశారాజు, సిధారెడ్డి, దేవిప్రియ, శివారెడ్డి, నాళేశ్వరం శంకరం, 1991



కుందుర్తి సంస్మరణ సభ : జ్వాలాముఖి, శివారెడ్డి, దేవిప్రియ, కాళోజీ








***వినుకొండ మా వూరు***
***తాడికొండ మా వూరు***
***రాసుకుంటూ పోతే లోకంలోని***
***ఊళ్ళగోడలన్నీ కూడా సరిపోని***
***ఒక అనంతఅద్భుత వాక్యం***
***మా వూరు!***

*(ఒక అనంతవాక్యం మావూరు : పిట్టకూడా ఎగిరిపోవలసిందే)*



సిధారెడ్డి, దేవిప్రియ, నగ్నముని, మహాస్వప్న, పొనుగోటి
మోహన్‌రామ్‌ప్రసాద్, శివారెడ్డి, 'మో', సుభాష్‌చంద్ర, 1974


నిలబడినవారు : ప్రకాష్, ఆశారాజు, గాలి నాసరరెడ్డి.
కూర్చున్నవారు : సుగమ్‌బాబు, దేవిప్రియ, అజంతా, శివారెడ్డి, జగన్నాథశర్మ.
1988 జులై 5 హైదరాబాద్ రవి ఫొటోస్టుడియో.







అజంతా, దేవిప్రియ, ఖాదర్‌మొహియుద్దీన్, గాలి నాసరరెడ్డి, నాళేశ్వరం.
నారాయణస్వామి – విద్యల పెళ్ళి సందర్భం.



దేవిప్రియ, అజంతా, శివారెడ్డి



మేనకోడలు షబ్బీ కొడుకు సొహెయిల్ , చెల్లెలు సలీమున్, షబ్బీతో దేవిప్రియ



గద్దర్, దేవిప్రియ.



సిధారెడ్డి 'భూమిస్వప్నం' ఆవిష్కరణ. డి. వెంకట్రామయ్య, దేవిప్రియ, సి. నారాయణరెడ్డి, శివారెడ్డి.



ఒక పత్రికారచన సదస్సులో పురాణం, పొత్తూరి, దేవిప్రియ, వరదాచారి.





దేవిప్రియ, భరత్ భూషణ్, స్మైల్



గద్దర్‌తో – 1983



సి. నారాయణ రెడ్డి, 'ది హిందూ' కేశవరావు లతో...





'రగులుతున్న భారతం' సినిమా పాటల రికార్డింగ్ :
చల్లా సుబ్రహ్మణ్యం, దేవిప్రియ, అల్లాణి శ్రీధర్, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, నిర్మాతలు




డా॥ సి. నారాయణరెడ్డి, దేవిప్రియ, ఆశారాజు, శివారెడ్డి




మహాభారతం టి.వి. సీరియల్ దర్శక నిర్మాత బి.ఆర్. చో[ప్రాతో, ముంబైలో




తుఫానుతుమ్మెద విడుదల : దేవి[ప్రియ, సినారె, శివారెడ్డి, గోపి, నాళేశ్వరం





'తుఫానుతుమ్మెద' విడుదల



దేవిప్రియ, సి.నారాయరెడ్డి, కె. శివారెడ్డి






నీటిపుట్ట, 1990 – భీమిలీ బీచ్‌లో.



దేవిప్రియ, నాళేశ్వరం, రామతీర్థ – భీమిలీ బీచ్‌లో



త్రీచీర్స్.... నర్సింగ్, స్మైల్, దేవిప్రియ. దేవి '30 సందర్భం.



దేవిప్రియ కవితల పుస్తకం 'గాలిరంగు' స్వీకరిస్తున్న కె. రామచంద్రమూర్తి



దేవిప్రియ ఇంట్లో 'గరీబు గీతాలు' ఆవిష్కరిస్తున్న హరి పురుషోత్తమరావు, రాజ్యలక్ష్మి








దేవిప్రియ సంపాదకీయాలు 'అధ్యక్షా, మన్నించండి' విడుదల...
మల్లేపల్లి లక్ష్మయ్య, కె. రామచంద్రమూర్తి, దేవిప్రియ, పాశం యాదగిరి




'పిట్టకూడా ఎగిరిపోవలసిందే' విడుదల



ఒక నువ్వు! ఒక నేను ! శివారెడ్డి, దేవిప్రియ



టి.వి. మహాభారత్‌లో శకుని గూఫీ పెయింటల్‌తో



నర్సింగ్ – దేవి



సిద్దిపేటలో నందిని సిధారెడ్డి నివాసంలో ఒకరోజు.





దేవి 30 ఆహ్వానసంఘం తొలి సమావేశం : సెప్టెంబర్, 2011.
యాకూబ్, నరసింగరావు, దేవిప్రియ, ఇతర మిత్రులు




దేవి 30 ఆహ్వానసంఘం తొలి సమావేశం : సెప్టెంబర్, 2011.
చేరా, సుధామ, కె.ఎన్.వై. పతంజలి, కేతు విశ్వనాథరెడ్డి, సుగమ్‌బాబు



'మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్' షూటింగ్ : గద్దర్, దేవిప్రియ



షూటింగ్ భోజన విరామంలో...




'మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్' షూటింగ్ : గద్దర్, దేవిప్రియ



గుంటూరులో – పెనుగొండ, దేవిప్రియ, పాపినేని







దర్భశయనం శ్రీనివాసాచార్య

# ఒక వాస్తవిక స్వప్నం

నాలుగక్షరాల కలంపేరు దేవిప్రియ. నాలుగు దశాబ్దాల కవితా ప్రయాణం. ఆ ప్రయాణం గురించి నాలుగు మాటల్లో ఎలా చెప్పేది? విస్తారంగా రాసిన కవిని గురించి బహుక్లుప్తంగా చెప్పడం కష్టం కదా! విస్తారంగానే కాదు, ఎప్పటికప్పుడు వైవిధ్యంతో సృజన చేసిన కవిని గురించి చెప్పడం ఇంకా కష్టం. చెప్పడం కష్టమేమో కానీ, ఇష్టంగా చెప్పొచ్చు. అతనేది రాసినా గొప్ప స్వేచ్ఛా ప్రియత్వంతో, ఇష్టపూర్తిగా రాసాడు కనుక దానికంత తళుకూ, తాజాదనం. కొత్తదనానికి మరో పేరు దేవిప్రియ కవిత.

ఏమిటా కొత్తదనం? 'దేవిప్రియ' అని ఎంచుకున్న పేరే కొత్తది (దేవిలోని'వి'కి దీర్ఘం లేకపోవడమూ గమనించాలి). కవితాసంపుటులకు పెట్టుకున్న పేర్లో! 'అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద, పిట్టకూడా ఎగిరిపోవలసిందే, గరీబు గీతాలు, చేపచిలుక, ఇన్‌షా అల్లాహ్, గంధకుటి' – ఎంత కొత్తగా వున్నాయి! అదీ దేవిప్రియ ప్రియత్వం. పేర్లతో ఆగిపోలేదీ కొత్తదనం. వస్తువుల నెంచుకోవడంలో, శైలీసంవిధానంలో, శబ్దాల ఎంపికలో నవ్యత కొట్టొచ్చినట్టు కనపడుతుంది. ఆయన చూసే పద్ధతిలోవున్న ప్రత్యేకతే రచనల్లో ప్రతిఫలించింది.

1969లో ఆయన కవితా ప్రయాణం మొదలైంది. పదేళ్ళకు 'అమ్మచెట్టు'గా రూపెత్తింది. జీవకాంతితో తొణికిసలాడుతూ, విప్లవదృక్పథాన్ని వ్యక్తపరుస్తూ, 'సమ తోత్సవ సంఘటన కోసం' కదం తొక్కుతూ, కొత్త అభివ్యక్తి నైపుణ్యాల్తో వెల్వడిన కవితల సమాహారమది. స్థూలంగా చైతన్యశీలత, ఉద్యమానుకూలత అంతస్సూత్రంగా ఆ కవితల్లో కనపడుతుంది. దేవిప్రియ చూపుకున్న భిన్నకోణాల్ని ఆ తొలి సంపుటిలో స్పష్టంగా చూడవచ్చు. 'అడివీ! నువ్వంటే నాకిష్టం' అనే పంక్తితో మొదలవుతుంది ఆ సంపుటి. మామూలుగా 'అడవి' అనడాన్ని ఈ కవి 'అడివి' అన్నాడంటే అదతని

ఇష్టంలో భాగమే. అడవిలోని పచ్చదనం, విస్తీర్ణత, బహుశ శబ్దసందోహంతోపాటు దానికున్న సాయుధసాన్నిహిత్యం కవిని ఆకర్షించింది. బహుశ ఈ విశిష్టతే తర్వాతి కాలంలోనూ దేవిప్రియ కవిత్వంలో స్పష్టంగా వ్యక్తమైంది. దీర్ఘకాల రచనా వ్యాసంగంలో సాధారణంగా ఎదురయ్యే 'మోనాటనీ' ప్రమాదంనుంచి ఈ కవిని కాపాడింది. అంతే కాదు. విప్పార్చింది కూడా.

చుట్టూరా విస్తరిస్తున్న అసమానతలపట్ల అసహనమూ, ఒకింత క్రోధమూ ప్రకటించిన సందర్భాల్లోనూ శైలిపట్ల దేవిప్రియ జాగ్రత్తగ వున్నాడు. అదీ డెబ్భయ్యవ దశకంలోనని గుర్తించాలి. అదే సందర్భంలో 'అమ్మచెట్టు'లో చక్కని దృశ్యచిత్రాలు, సంగీత ప్రియత్వాలూ, చరిత్రను దర్శించిన తీరూ, స్త్రీలపట్ల ఆయన దృక్పథమూ, సముద్రదర్శనమూ, జీవనచిత్రాలూ కనపడతాయి. 'బయట'ను చూసిన క్షణాల్లోనే 'లోపల'నూ దర్శించడం అపుడే మొదలైంది. 'విప్లవం చెట్టు మొదలు పట్టుకు వూపితే రాలేవి సమానతా సుమదళాలు / బెరడు తొలచిచూస్తే లోపల గెరిల్లా వెలుగు సమాధుల మీద ఎర్రపూల బందూకులు. ఒక దృశ్యాన్ని కవిత్వంచేసే తీరులో దేవిప్రియ ప్రత్యేకంగా కనపడ్తాడు. ఉదాహరణకు – పైన ఆకాశంలో చంద్రుడున్నాడు. కింద యేరుంది. ఏట్లో చంద్రబింబం – ఇదీ దృశ్యం. దీన్ని 'మెరుపులు' అనే కవితగా మలిచిన తీరును గమనిస్తే దృశ్యాల్ని పేర్చిన సీక్వెన్స్. దృశ్యాల్ని కళ్ళ ముందుంచడానికి స్వీకరించిన పదబంధాలు, పోలికలు–కవితకు సొంపునూ, శక్తినీ ఇచ్చాయని అర్థమవుతుంది. చుక్కలతళుకుటద్దాలు కుట్టిన నీలాకాశం జిలుగుతెర అంటాడు. వెన్నెల తాగిన మత్తులో పారుతున్న యేరంటాడు. ఆకాశం ఏనుగు మెడలో వెండిగంటలా వేలాడే ఒంటరి చంద్రుడంటాడు. ఎక్కడా చదునుగా కాక ఒంపుసొంపుల్తో కవిత తళతళలాడ్తుంది.

దాదాపు పాతికేళ్ల ప్రాయంలో దేవిప్రియ రాసిన 'చరిత్ర' కవిత ఆయన ప్రపంచాన్ని అర్థం చేసుకున్న తీరును వ్యక్తపరుస్తుంది. ఈజిప్ట్ పిరమిడ్లనుంచి, మహాబలిపురం ఏనుగు కంటినుంచి, వికృతమైన నాగసాకీ ధాత్రినుంచి, వియత్నాం మహిళల వీరత్వందాకా సాగిన చరిత్రను పట్టుకున్నాడు. ఒక రష్యన్‌తో తొలిసారి చేయి కలిపినప్పుడు అతనికి ప్రపంచంలోని ప్రతి సంపూర్ణ మానవునితోనూ చేయి కలిపినట్టనిపించింది. తొలిదశలోనే ఒక ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చుకున్న దేవిప్రియ తర్వాతి కాలంలో దాని ప్రాతిపదికగా మానవగతిని దర్శించడమూ, విశ్లేషించడమూ చేశాడు. 1990లో సోవియట్ పరిణామాలమీద ఒక లోతైన చూపుతో సృజన చేసిన కొద్దిమందిలో దేవిప్రియ ఒకరు. 'హిట్లర్ నవ్వు' కవిత ఆ చూపులోంచి వచ్చిందే. "ఇప్పుడిక్కడ ఎవ్వరికీ వినిపించడం లేదా కూలిన బెర్లిన్ గోడ శిథిలాలతో పుట్టి చైనాగోడ బురుజులలో ప్రతిధ్వనిస్తున్న హిట్లర్ నవ్వు?" అని ప్రశ్నించాడు. ఒక రాజకీయ కవిత సామాజిక వాస్తవికతనూ, సాంద్ర వ్యక్తీకరణనూ ఎట్లా పొదుగుకుని





సారాంశాన్ని బలంగా ప్రకటించగలదో చెప్పడానికి ఈ కవిత ఓ దాఖలా. పదిపన్నెండేళ్ల క్రితమే సామ్రాజ్యవాదమంటే ఏమిటో సులువైన ఉదాహరణల్తో చెప్పి మనల్ని అది ఎలా కొల్లగొడుతుందో వ్యాఖ్యానించాడు. ఒక అంతర్జాతీయ దురాక్రమణను చెప్పడానికి స్థానిక దృశ్యాల్ని పేర్చడంద్వారా పాఠకుడికి అత్యంత సమీపంగా వెళ్ళగలిగాడు. సామ్రాజ్యవాదాన్ని అర్థం చేసుకోవడం కష్టమనుకున్న కాలసంధిలో రాసిన ఆ కవితకు 'అనగా యేమి' అనే ఔచిత్యవంతమైన టైటిల్ పెట్టాడు.

దేవిప్రియ పల్లెటూరి నేపథ్యం కవిత్వంలోకి ప్రవహించింది. ఎక్కడ వీలైతే అక్కడ తన వూరు ప్రస్తావన తెచ్చాడు. ఊరి జట్కాబండి, జొన్న కంకులూ, సినిమా పోస్టర్లూ, సమాధులూ, నాంచారమ్మ కొలువులూ, ఊరి కొండా, కొండమీంచి దొర్లే వాన నీళ్లూ, ఎర్రమట్టి మరకలూ, పంటకాలవా... అన్నిటినీ పలవరించాడు. అంతేనా! 'రాసుకుంటూపోతే లోకంలోని ఊళ్ల గోడలన్నీకూడా సరిపోని ఒక అనంత అద్భుత వాక్యం మా వూరు' అని ఉప్పొంగి ప్రకటించాడు కూడా. తన నేపథ్యాన్ని స్ఫుటంగా చెప్పుకున్న సందర్భం 'ఒక గుడిసె కథ' అనే కవితైంది. దేవిప్రియ రాసిన బలమైన కవితల్లో ఇదొకటి. 'ఈ గుడిసెలోనే నా ప్రపంచం ఉదయించింది' అనే విస్మృతితోనే పరిచయం ప్రారంభమైంది. కురిసిన వాన చినుకులూ, వేపచెట్టు నీడా, పుస్తకాల పేజీలమీద కోడిపెట్ట వేసిన రెట్ట, బురదా, మట్టిగోడలూ, గుడ్డిదీపమూ, పొగాకు కంపెనీ సైరన్ మోత. తల్లి తత్తరపాటూ ఇన్నిటినీ చెబుతూ 'ఈ గుడిసెలోనే తొలిసారిగా కానరాని కన్నీటి సముద్రాలు ఉప్పొంగుతూ కనిపించాయి' అన్నాడు. దుఃఖమే ఆగ్రహమై 'ఈ గుడిసెమీద కప్పిన రెల్లు పోచలు బరిసెలై పోకూడదా అనిపించింది' అంటూ అంతటితో ఆగకుండా ఇంకా ముందుకెళ్ళి 'మా అమ్మతోడు. అప్పటినుంచి మా గుడిసె నా కళ్లకి ఆయుధాలు పూజలందుకునే కారంపూడి వీరుల గుడిలాగే కనిపిస్తుంది' అని ప్రకటించాడు. బాల్యజీవితం మనిషి ఆలోచనల్లో ఎలా ముద్రితమవుతుందో, అతని కార్యాచరణలో ఎలా భాగమవుతుందో ఈ కవిత చెబుతుంది. 'అమ్మతోడు'తో చెప్పడం ద్వారా భావనకు శక్తిని చేకూర్చాడు. కొడుకుని చూసి తల్లి ఎలా పరివేదన చెందుతుందో తన నేపథ్యంలోంచే మరో కవితలో దేవిప్రియ చెప్పాడు. కొడుకు కందిపోయిన వేళ్ళనూ, చేతుల్నీ, పగిలిన మోకాళ్ళనూ, దుఃఖాన్నీ చూసి బాధపడి 'ఎట్లా బతుకుతావురా అని ఏడ్చేది మా అమ్మ' అన్నచోట తల్లిపేగు బాధ మనల్ని కదిలిస్తుంది. ఆ వాక్యాన్నే ఆరేడుసార్లు refrainగా వాడి తల్లి మనసుకు హత్తుకునేట్లు ఆవిష్కరించాడు. సరళంగా చెబుతూ చిక్కనైన భావాన్నివ్వడం దేవిప్రియకి నచ్చిన పద్ధతని అతని కవితలు చెబుతాయి. మరోచోట తల్లీ కొడుకుల సంబంధం గురించి చెబుతూ అంటాడు – '*అమ్మ ఎప్పటిలాగే అమ్మలాగే వుంది కానీ ఈ కొడుకే కొడుకులాగా లేడు*'. దీన్ని వ్యాఖ్యానించ నక్కర్లేదనుకుంటాను.



బయట ప్రపంచాన్ని ఎంతో చూసిన దేవిప్రియ ఇంటినీ కవిత్వనేత్రాల్తో చూశాడు. అలా కాదేమో! ఇంటిని హృదయంతో చూసి కవిత్వభాషలో పలికాడు. ఎన్నోసార్లు ఎంతో ప్రేమతో తన జీవనసహచరిని 'రాజీ' అంటూ అత్యంత మోహనంగా, అత్యంత గాఢంగా, అత్యంత విస్తృతంగా ఆమెను ప్రస్తుతించాడు. ఇదే ఒక realisation లోంచి రాసిన 'నన్ను సాగుచేసే వాగువు నువ్వే' ఒక ప్రత్యేకమైన కవిత. చాలా దూరం ప్రయాణించాక ఒక పురుషుడు తన సహచరినీ, ఆమె ప్రేమాన్విత శక్తినీ అర్థం చేసుకున్నాక ఒకానొక ఆధిపత్య భావజాలాన్ని విదుల్చుకుని ఒక మహత్తర సత్యావిష్కరణలా ఆమెను ఆవిష్కరిస్తే ఎలా వుంటుందో చెప్పడానికి దాఖలా ఈ కవిత. తన మిగతా కుటుంబ సభ్యుల్నీ, కుటుంబ సంబంధాల్నీ కవిత్వంలో ప్రస్తావించినపుడు కూడా దేవిప్రియ ఊహల్లో తేలిపోలేదు. వాస్తవాన్నే ఆశ్రయించాడు. ఆ పనిని ప్రేమతో లలితంగా చేశాడు. అది చదివి చాలాచోట్ల మనం కదిలిపోతాం, మారిపోతున్న మానవ సంబంధాల జాడ వాటిల్లో కనపడుతుంది కనుక.

దేవిప్రియ ఏదో ఓదారి పట్టుకుని అలా సాగిపోయే పథికుడు కాడు. ప్రయోగ శీలి. ఒకే కాలంలో అనేక క్రియల్ని చేపట్టాడు. కవిత్వం రాస్తూనే సినిమావైపు మళ్లాడు. దినపత్రికల్లో రన్నింగ్ కామెంటరీ రాస్తూ రోజువారీ జీవితానికి కవితారూపాన్ని లయాత్మ కంగా ఇచ్చాడు. ఇక జర్నలిజం తనతో వుండనేవుంది. ఇన్ని వ్యాపకాలున్నా కవిత్వం ఆగలేదు. సినిమాలతోవున్న సంబంధం అతని కవిత్వపు frameను ఇంకా చక్కగా తీర్చిదిద్దిందనిపిస్తుంది. 'అకిరా కురసోవా' సినిమా 'దెర్సూ ఉజాలా' చూసాక రాసిన కవిత 'దెర్సూఉజాలా' దేవిప్రియలోని తాత్వికఆలోచనల్ని ఆవిష్కరించింది. గద్దర్‌మీద డాక్యుమెంటరీ తీయడమే కాకుండా, ఒక సంపుటికి 'తుఫానుతుమ్మెద' అనే టైటిల్ పెట్టాడు.'నల్లమబ్బు గొంగళి భుజాన వేసుకున్న భువనజనహవనఘోష'ను విన్పించాడు. సందర్భం కుదిరినపుడల్లా 'గద్దరన్న'ను కవితల్లో పేర్చి కూర్చాడు.

దేవిప్రియకు కవిత్వ వస్తువులు అనేకం. విమానాల్లో వెళ్తూ ఆ సందర్భాల్ని కవిత్వం చేసినవాళ్ళు తక్కువే. దేవిప్రియ ఒకటి రెండు కాదు ఐదారు రాసేశాడు. సందర్భాలు గాలి ప్రయాణాలైనా కవితలు నేలనంటిపెట్టుకున్నవే. 'కందం' మీద మక్కువతో సరదాగా 'గరీబు గీతాలు' విరచించాడు. సరదాల నడుమ 'ఎవరికి ఎవరో యేమో చివరికి మిగిలేది యేదో చిరతరమేదో, భవభయ ప్రశ్నలు తేలవు' అంటూ ఒకింత తాత్వికవ్యూహాల్నీ చేశాడు. ఇటీవలే విడుదలైన "ఇన్‌షా అల్లాహ్' కందపద్యాల్లో తనకిష్టమైన ఆలోచనల్ని సరళంగా పొందుపరిచారు. సంకోచాలతో కట్టిపడేసుకున్న కవి కాదు దేవిప్రియ. అందుకు ఈ కంద పద్యాలే సాక్ష్యం.

ఈ సంవత్సరంలోనే దేవిప్రియ వెల్వరించిన కవితా సంపుటి 'గంధకుటి'. ఎంత అభిరుచి! 'గంధకుటి' క్షేత్రాన్ని చూశాక ఆ దార్శనికతలో దేవిప్రియ పలికిన



నిశ్శబ్ద శబ్దచిత్రమది! కవితాధ్యానాన్ని ఏ మాత్రం భగ్నపరచని శబ్దాల్తో అల్లిన ధ్యాన కుటీరమది. అతని 'ద్రవస్వప్నా'న్ని దర్శిద్దాం. ఏమంటున్నాడు? నాలోపల ఒక సముద్రం వుందని తెలుసుకానీ ఇందులో ఇన్ని ధ్వజస్తంభాలూ, అనేకానేక తుఫానుల్లో మునిగి పోయిన ఇన్ని మహానౌకలూ, నౌకల్లో ఇన్ని అక్షౌహిణుల సైన్యమూ, లక్షలాది ఈటెలూ, కరవాలాలూ, అసంఖ్యాక శిరస్త్రాణాలూ, లోహకవచాలూ ద్రవమై వున్నాయని, ఇప్పుడే, ఆరుపదుల అనుభవాల అణువిస్ఫోటన జరిగినప్పుడే తెలిసింది ప్రియతమా!' అదీ అంతర్దర్శనం!

దేవిప్రియ తన ఇష్టాల్నీ,అయిష్టాల్నీ,ప్రేమల్నీ, దుఃఖాల్నీ కవిత్వంలో పలికించి నపుడు ఆవేశధారల్లో శబ్దాన్నీ కాపాడుకున్నాడు. ఇష్టమైన, యోగ్యమైన పదబంధాల్ని ప్రాణప్రదంగా ప్రయోగించాడు. ఒకసూర్యుణ్ణీ, ఒకచంద్రుణ్ణీ, ఒక మానవుణ్ణీ పరిపరి విధాలా అభివర్ణించాడు. వస్తువు బాగా చేసిన కాలంలోనూ రూపాన్ని అత్యంత శ్రద్ధతో తీర్చిదిద్దాడు. వస్తు శిల్పాల ఔచిత్య సమన్వయంతోనే మంచి కవిత రూపు దిద్దు కుంటుందని ఆయన విశ్వసిస్తాడని ఆయన నలభయేళ్ళ కవితా ప్రయాణం రుజువు చేస్తుంది. ఏ ప్రయోగం చేసినా ప్రయోగం కోసంకాక జీవనావిష్కరణ కోసం ఒక వినూత్న యత్నంలా ప్రేమతో చేసాడు. తన దారి తనది. అదే కొత్తగా వుండాలనే తపన. అందుకే కొత్తదనానికి మరోపేరు దేవిప్రియ!

*(ఆంధ్రజ్యోతి, 16, నవంబర్ 2009)*

⚜

***ఎన్ని యుగాలని తడిపిందో***
***ఈ వాన,***
***ఎన్ని దేశాల భూముల్ని***
***పులకరింప చేసిందో,***
***ఎన్ని జాతుల విత్తనాలని***
***మొలకెత్త చేసిందో ఈ వాన...***

(వాన : అమ్మచెట్టు)



వరవరరావు

# దేవిప్రియతో నా ఎన్‌కౌంటర్లు

దేవి 30 అని బ్రోషర్ చూసినపుడు దేవిప్రియకి ముప్ఫైఏళ్ళేనా అని ఆశ్చర్య పోయాను. కవిగాకూడ, విరసం ఏర్పడేనాటికే ఆయన పైగంబరకవిగా ప్రసిద్ధుడు. వయస్సు ఏభైదాటి ఉంటుందనుకున్నాను. అయితే కవి వయసు ఎప్పుడూ ముప్పైఏళ్ళే కదా. పైగా ఆయన త్రిదశుడు. ఏకకాలంలో త్రిదశుడు. కవి, జర్నలిస్టు, సినిమా అనండి, టి.వి అనండి దృశ్యమాధ్యమంలో కూడా అసమాన ప్రతిభ కనపరచినవాడు. అదికూడ ఒక దశ తర్వాత ఒక దశ కాదు. ఏకకాలంలో మూడురంగాల్లోనూ తనదైన ముద్ర వేసినవాడు.

నిజానికి ఈ అభినందన సందర్భంగా ఈ మూడు రంగాల్లో ఆయన అసామాన్య కృషి గురించి సీరియస్ విశ్లేషణ జరగాలి, ఆయన ఎంచుకున్న రన్నింగ్ కామెంటరీ కవితా కార్టూన్ జర్నలిజంలోకూడా (ఆ విషయంలో ఆరంభించిన రాంభట్ల కృష్ణమూర్తి గారు చెప్పడానికి మనమధ్య లేరు) ఆయన 'శశివిషాణం' కాలంనుంచి సమాజానంద స్వామి కాలానికి ఎంతో పరిణతిని సాధించాడు. అది 'ప్రజాతంత్ర'వంటి అభిరుచిగల పత్రికను ఎమర్జెన్సీ కాలంలో నడపడం కావచ్చు (చంచల్‌గూడా జైల్లో ప్రజాతంత్ర పత్రిక కోసం,అందులో అపురూపంగావచ్చే ఒకపేజీ కవిత్వం కోసం ఎదురు చూడడాన్ని ఇప్పటికీ ఇష్టంగా గుర్తు చేసుకుంటాను).ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధాన్ని సాహిత్యా భిమానులకు ఇష్టంగా మలచడం కావచ్చు. అది ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఉదయం – ఏ దినపత్రిక అయినా కావచ్చు ఈమూలన పాకెట్ కార్టూన్ స్థానాన్ని ఆక్రమించిన దేవిప్రియ, రన్నింగ్ కామెంటరీ' కోసంచూసే ఒక వ్యసనాన్ని ఆయన తెలుగు పాఠకు లకు కలిగించాడు. ఎందులోనూ ముచ్చటగా మూడేళ్ళయినా నిలవకుండానే ఆయన జర్నలిజంలో ఎప్పుడో ముప్పై దాటాడు.



అట్లాగే దృశ్యమాధ్యమంలో – దేవిప్రియ అనగానే సినిమాకు సంబంధించి – జమ్‌జమ్మల్‌మర్రీ వెయ్యి కాళ్ళ జెర్రీ – అన్న ఆయన హైదరాబాద్ నగరంపై రాసిన అజరామరమైన పాట గుర్తుకొస్తుంది. హైదరాబాద్, అందులో పురానాషహర్ అంటే పడిచచ్చే చలసాని ప్రసాద్ అడిగాడు, హైదరాబాద్‌వాళ్ళు, మీ తెలంగాణవాళ్ళు ఎవరూ హైదరాబాద్‌మీద తిలక్‌వలెనో, నార్ల చిరంజీవి వలెనో – ఎల్లకాలం నిలువగలిగిన కవిత రాయలేదేమిటి అని. వచనంలో రాసిన దాశరథి రంగాచార్య, అల్లం నారాయణ తప్ప – దేవిప్రియ పాటతప్ప నాకుకూడ గుర్తు రాలేదు. నాటికలు రాసాడు. దాసి, రంగులకలవంటి సినిమాలకు స్క్రిప్టు రాసాడు. పాటలు రాసాడు. అట్లా సినిమా రంగంలో ఒక స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు.

నేనిప్పటికీ చూడలేకపోయిన 'మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్' డాక్యుమెంటరీ గద్దర్‌పై నిర్మిస్తున్నప్పుడు దానికోసం నన్ను ఇంటర్వ్యూ చేయడానికి ఆయన చేసిన ప్రయత్నాలు మాకు ఒకరికి వీలయినప్పుడు ఒకరికి వీలుకాక ఫలించలేదు. ఆయన ఈ బహుముఖ కృషి విశ్లేషణ జరగాలి.

దేవిప్రియతో నా పరిచయంకూడా ముప్పైఏళ్ళది. మా పరిచయం స్నేహంగా, అతిపరిచయంగా మారకపోవడంవల్ల ఆయన బలహీనతలేమిటో చెప్పలేను. పరస్పరం ఉన్న గౌరవాభిమానాలనుంచి, నాళేశ్వరం శంకరం కోరినట్లు ఆయన కవిత్వంపై నాలోనే దాచుకున్న ప్రేమనుంచి కొంచెం, కవిత్వం గురించి కొన్ని ఎన్‌కౌంటర్ సందర్భాల గురించి ప్రస్తావిస్తాను.

మా మావృత్తులు, వ్యావృత్తులు, డిసిప్లిన్స్‌వల్ల మేం చాలా తక్కువ కలుసుకున్నాం. కాని అభిరుచి, అవగాహన, ప్రాపంచిక దృక్పథం, ఉద్యమాలమీద ప్రేమవల్ల సాహిత్య సాంస్కృతిక రంగాల్లో కృషివల్ల ముప్పైఏళ్ళుగా కలుస్తున్నదే లెక్క. 'పైగంబరకవులు' సంపుటం వెలువడీ వెలువడగానే కవిగా దేవిప్రియతో నా పరోక్షపరిచయం అయిపోయింది. 1970నుంచే సుగమ్‌బాబు, కిరణ్‌బాబు, ఓల్గాలతో ఏర్పడిన ప్రత్యక్ష పరిచయం. గుంటూరుతో వీళ్ళతో ఆరంభించి ఏర్పడిన అనుబంధంవల్ల ఆయనతో పరిచయంకూడ అయింది. 1970–72 మధ్యకాలంలోనే గుంటూరు, హనుమాయమ్మ హైస్కూలు హాలులో రెండురోజుల కోసం ఏర్పాటుచేసిన సాహిత్య సదస్సులో కవిత్వం 'కమిట్‌మెంట్' గురించి మాట్లాడడానికి రమ్మని పిలవడానికి, హనుమకొండ కోహినూర్ హోటల్ సందులో ఉంటున్న మా ఇంటికి దేవిప్రియ రావడం నా మొదటి జ్ఞాపకం. నేను కాలేజినుంచి తిరిగివచ్చిన మధ్యాహ్నానికి వచ్చి రెండుగంటలు మాట్లాడిపోయాడు. అట్లాగే నేనూ ఆయన ఇంటికి వెళ్ళిన జ్ఞాపకంకూడ ఒక్కటే.

1989 మార్చ్‌లో జైలునుంచి విడుదలయ్యాక బాగ్‌లింగంపల్లినుంచి ఆయన మోటార్‌సైకిల్‌పైన విద్యానగర్‌లో అపుడుంటున్న ఇంటికి తీసుకపోయాడు. రాజ్యలక్ష్మిని, పిల్లలను అపుడే చూసాను. అక్కడ బ్రేక్‌ఫాస్ట్ చేసాను. ఆయన 'ఆంధ్రజ్యోతి ఆదివారం'



సంచికను 'ఇదుగో వరవరరావు' అని నేనే ఎంబరాస్ అయిపోయేంత గ్లోరిఫైడ్‌గా తయారు చేస్తున్న సందర్భమది. అందుకోసం ఆ తర్వాత బాగ్‌లింగంపల్లికి వచ్చి కె.శ్రీనివాస్ ఇంటర్వ్యూ చేసాడు. ఇపుడు రాస్తునప్పుడు ఈ విషయాలు కొంత ఉద్వేగపూరితంగా నా కళ్ళలో మసులుతున్నాయి కనుక వివరిస్తాను.

నేను 1985 డిసెంబర్ 20న ప్రాణభయంవల్ల బెయిల్ క్యాన్సిల్ చేసుకొని జెయిల్‌కు పోయాను కనుక అది 'సరెండర్' అని వినుకొండ నాగరాజే కాదు కొందరు విప్లవమిత్రులుకూడా ప్రచారం చేసారు. ఒకరిద్దరు రాసారు. 'అరుణతార'లోకూడా చర్చసాగింది. కనుక మార్చ్ 22, 1989న ముషీరాబాదు జైలునుంచి విడుదలయి అడుగు బయట పెడుతున్నపుడు ఎటువంటి రిసెప్షన్ ఉంటుందోనని నాకు బెరుగ్గానే ఉండె. బయట అడుగు పెడుతుంటే క్లిక్‌మన్న పత్రికల కెమెరాలు, పత్రికా రచయితల ఆత్మీయమైన పలకరింపు, మర్నాడు 'ఉదయం'లో మోహన్ రాసిన తీరు కొంత ఆత్మ విశ్వాసాన్ని ఇచ్చింది. క్రమంగా పత్రికలు, అభిమానులు చూపిన అభిమానంతో పొరలు పొరలుగా విచ్చుకుంటున్న ధైర్యానికి దేవిప్రియ ప్రయత్నం నాకయితే మంచి బూస్ట్ నిచ్చిందిగానీ ఆయనను, బహుశ కె. శ్రీనివాస్‌నుకూడ కొంచెం ఇబ్బందుల్లో పడేసిందని అటలటలుగా విన్నాను. స్పష్టంగా తెలియదు.

'ఇదుగో వరవరరావు' అని కవర్ ముఖచిత్రంగా రంగుల్లోవేసి బ్లోఅప్ చేయ వలసినంత అవసరం ఉందా అని ఆంధ్రజ్యోతి మేనేజ్‌మెంట్ అనుకున్నదనుకుంటాను. వరంగల్‌కు పోగూడదని కోర్టు కండిషన్ కదా ఏంచేస్తారు అని కె.శ్రీనివాస్ అడిగితే 'ఏం చేస్తాను హైదరాబాద్‌నే వరంగల్‌గా భావించుకుంటాను' అన్నాను. ఆ తర్వాత వారంలో ఒక పాఠకుడు ఎవరో (వరంగల్ జిల్లానుంచి అనుకుంటాను) 'అంటే హైదరాబాద్‌ను చెడగొడతాడన్నమాట' అని రాసాడు. పన్నెండేళ్ళ తర్వాత, హైదరాబాద్ నుంచికూడా పది నెలల ప్రవాసంలో దేవిప్రియ ఇచ్చిన ఆ సాహిత్య చేయూతను ఆర్ద్రంగా తలచుకుంటున్నాను. (మరీముఖ్యంగా 'సరెండర్' ఆరోపణలు ఇంకా ఈదర గాలిగా వీస్తున్న ఈ సందర్భంలో) ఒక నిత్య అస్థిర జీవితంలోని కవి, కళాకారుడు, జర్నలిస్టు–మనిషిలోని కోణాలను– ఫ్రాంకో స్పెయిన్‌లోని లోర్కా వంటి కవి జీవితంలోని భయవిహ్వలస్థితిని – దేవిప్రియ అర్థం చేసుకోగలడను కుంటాను. రెండవ ప్రత్యేక అంశంగా చెప్పవలసింది– మా కవిత్వ చర్చలు. కలుసుకోకుండా కవిత్వంలోనే. దానికీ కొంచెం నేపథ్యం వివరించాలి.

జైల్లో విస్తృతంగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా సాహిత్యాలు చదివినపుడు ముఖ్యం గా భాష, సాహిత్యం సంస్కృతులపై గూగీ అవగాహన, విక్టర్ యారా (Victor Yara) అనే చిలీ ప్రజాగాయకుని జీవితం, కవితలు చదివినపుడు గద్దర్ విశ్వరూపం ఏమిటో నాకు విస్పష్టమైంది. అప్పటినుంచే అవకాశం వచ్చినపుడల్లా ఆయన కళా ప్రదర్శనలోని లెజెండరీ శక్తి గురించి మాట్లాడడం, రాయడం ప్రారంభించాను. ఆంధ్రభూమి కోసం



చేసిన ఇంటర్వ్యూలో ఖాదర్ మొహియుద్దీన్  అడిగాడుకూడ. ఇదివరకు శివసాగర్ కవిత్వంగురించి మాట్లాడేవాళ్ళు ఇప్పుడు గద్దర్ గురించి చెప్తున్నారు ఎందుకు? సత్య మూర్తి మీ ఉద్యమానికి దూరమయినందుకేనా అని. పైకారణం చెప్పాను.

కనుక 1989 మార్చినుండి కూడ గద్దర్ జననాట్యమండలి  కళాకారులు – అజ్ఞాత జీవితంనుంచి బయటికి వచ్చి మళ్ళీ బహిరంగ ప్రదర్శనలు ఇవ్వగలగాలనే ఆకాంక్షతో ప్రతి వేదికపైనా మాట్లాడుతుండేవాణ్ణి. అటువంటి ఒక సందర్భం వసీరా 'లోహనది' ఆవిష్కరణ. 'లోహనది' కవితల్లో పాష్ కవిత్వంలోని ఉక్కుబలాన్ని ప్రస్తావిస్తూ గద్దర్ బహిరంగ జీవితంలోకి రావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసాను. అపుడు దేవిప్రియ చాలా ఉద్వేగభరితంగా మాట్లాడుతూ – సాహిత్య, కళా సాంస్కృతిక రంగాల్లో ఉన్న మనం ఇందుకోసం ఏంచేయగలమో చెప్పండి. నిప్పుల్లో దూకడానికైనా సిద్ధమే – ఒక నిర్మాణయుతమైన కార్యక్రమం ఇవ్వండి అని విరసంకు విజ్ఞప్తి చేసాడు. 1989 –94 మధ్యకాలంలో వేరువేరు సందర్భాల్లో పాట గురించి–అన్యాపదేశంగా గద్దర్ గురించి ఆయన రాసిన కవితలు – నీటిపుట్ట, తుఫాను తుమ్మెదలో మనం చూడవచ్చు. ఆయనపైన గద్దర్ ప్రభావం ఎంత ప్రగాఢమయిందో  ఆయన మూడు కవితా సంకల నాల్లో చూడవచ్చు. దాని పరాకాష్టగా వచ్చిన డాక్యుమెంటరీ నేను చూడలేదు. కనుక తుఫాను తుమ్మెదలో చూసాను.

దేవిప్రియ ప్రాపంచిక దృక్పథం విశ్లేషించినపుడు, ఆయన కమ్యూనిస్టు ప్రపంచానికి చెందినవాడు. విప్లవం, ఉద్యమం, అంతిమంగా  కమ్యూనిజం  ఆయన స్వప్నాలు. అంత అభిమానం ఉండికూడ, అభిమానం వల్ల, వ్యగ్రతవల్ల అపుడపుడు నిష్ఠూరమాడతాడు. తనతో అటువంటి ఒక సందర్భం గురించిన కవితా ఎన్‌కౌంటర్ గురించి ఇంత వివరణ.

అది అజంతా కుమార్తె పెళ్ళిలో మేం కలుసుకున్న సందర్భమనుకుంటాను. మే 1989. అజంతా, నర్సింగరావు(బీనాదేవి)లు వియ్యమందిన సందర్భం గనుక హైదరాబాదులోని, బహుశా బెజవాడనుంచికూడా సాహిత్యబంధువులంతా అక్కడు న్నారు. ఆరోజు వచ్చిన 'ఆంధ్రజ్యోతి'లో దేవిప్రియ కవిత ఒకటి అచ్చయింది. – పాటప్రయాణం!  (21.5.1989).

ఒకవైపు  ముక్కు సుబ్బారెడ్డివంటి కేంద్రకమిటీ  సభ్యులు బయటకి వస్తున్నారు కానీ గద్దర్‌గానీ,  జననాట్యమండలి కళాకారులుగానీ బహిరంగ జీవితంలోకి రాలేని గడ్డుకాలం..

*వెన్నెలకీ, వేడికీ కూడా దూరమై*
*గజ్జె కట్టిన కాలితో*
*ఘల్లుఘల్లున అదృశ్యగానం చేస్తున్న గాలి*



*సంగతి మాత్రమే నేనడుగుతున్నాను - అంటూ*
*ప్లేటు ఫిరాయించినంత తేలికగా*
*పాట ఫిరాయించగలదా గాలి*

అని తీవ్రంగా ప్రశ్నించడంలో ఆగిపోకుండా అసలు ఉద్యమానికే ఒక ప్రశ్న వేశాడు ఉద్విగ్నంగా -

*'సముద్రంలో కలిసిపోయేదానికి*
*ఈ సుదీర్ఘ ప్రయాణం ఎందుకని*
*ఏ నదీ భావించదు*
*సాగుతోన్న ప్రయాణం సముద్రం వైపేనా*
*అన్నదే ప్రశ్న'*

ఆ ఉదయమే 'ఆంధ్రజ్యోతి'లో ఆ కవిత చదివిన నేను పెళ్ళిలో దేవిప్రియతో గోదావరి దారి మారదు అని చెప్పినట్లే గుర్తు. అదే తర్వాత కవితగా రాసి ఆంధ్రజ్యోతికే పంపించాను. సందర్భం దేవిప్రియది గనుక నా కవిత అంతా ప్రస్తావించను గానీ,

*'శుష్కించినపుడయినా*
*స్రుతిమించినపుడైనా*
*కరువులోనూ వరదలోనూ*
*గోదారి*
*దారిమాత్రం తప్పలేదు*
*గహనాటవిలో మైదానంలో*
*గమనంలో గతుకులేమైనా వచ్చినా*
*గమ్యం మాత్రం మారబోదు'*

అని భరోసా ఇచ్చాను.

దేవిప్రియ సంపాదకత్వం వహించిన 'ప్రజాతంత్ర' (ఎమర్జెన్సీ)లో ఎవరో ఇట్లాగే కవి సింహం - శుష్కించిన ప్రస్తావన తెస్తే 'కవి సింహం కాదు, ప్రవాహం (20.12.76) అని రాసాను.

ఇస్మాయిల్ కమ్యూనిస్టులపై నిందాపూర్వకంగా రాసిన 'వడ్రంగిపిట్ట' కవిత చదివి దేవిప్రియ, నేను ఒకే తీవ్రతతో స్పందించాం. నేను వడ్రంగిపిట్టను శ్రమకు సంకేతంగా వడ్రంగితో పోలుస్తూ 'ఆంధ్రజ్యోతి'లోనే కవిత రాసాను. దేవిప్రియ 'సీతాకోకచిలుక' అని నా కన్నా కవితాత్మకంగా రాసాడు. ఇంకా తీవ్రమైన కోపంతో రాసాడు.

*జనం గురించి, రంగులు పులుముకొని*
*వర్ణస్వప్నలోకంలో ఎగిరే*



*సీతాకోకచిలుకకి ఎలా తెలుస్తుంది?*
*గట్టిగా గాలివీస్తే*
*రాలిపోయే ఉల్లిపొర రెక్కలున్న*
*సీతాకోకచిలుకకి*
*వడ్రంగి పిట్టముక్కు సమ్మెట దెబ్బల్లో*
*వినిపించే నిత్యజీవిత వేదన*
*యెలా వినిపిస్తుంది.*

(సీతాకోకచిలుక 1982)

మా మూడో కవితా ఎన్‌కౌంటర్ ఒక గగుర్పాటు కలిగించే జ్ఞాపకంలో కలసి ఉంది గనుక వివరిస్తాను. నిజానికి నాళేశ్వరం శంకరం ప్రస్తావించిన పాత పద్యంమీది ప్రేమ ఇదే.

1993 జనవరి ఆఖరి వారంలో ఎ.ఐ.ఎల్.ఆర్.సి. పనులమీద మద్రాసుకు వెళ్లి జనవరి 27 రాత్రి పినాకినిలో బెజవాడలో దిగి బస్‌స్టాండ్‌కి వచ్చి బయటే ఉన్న ప్రైవేటు బస్సులో ఎక్కి హైదరాబాదుకు టికెట్టు కొనుక్కున్నాను. రాత్రి ఏ 10 గంటలో అయివుంటుంది. ఆ ప్రైవేటు బస్సు యజమాని టికెట్లు చెక్ చేస్తూ నాదగ్గరకి వచ్చి టికెట్ తీసుకొని నా మొహంలోకి చూసి, మీరు వరవరరావుగారు కదా! అన్నాడు. 'అవునన్నాను.' హైదరాబాదుకు పోతారా ఒక్కరే అన్నాడు. 'ఏం' అన్నాను. 'వ్యాస్'గారిని నక్సలైట్లు చంపేసారు. పరిస్థితి బాగాలేదు అన్నాడు. ఇపుడేం చేయగలనని అన్నాను. 'మీకు అభ్యంతరం లేకపోతే దిగి నా యింటికి వచ్చేయండి, రెండుమూడు రోజులయ్యాక పరిస్థితులు కుదుటపడితే వెళ్ళొచ్చు' అన్నాడు. 'సరే'నని దిగిపోయాను. మర్నాడు ఉదయం ఆయన తెచ్చి ఇచ్చిన పత్రికల్లో ఆంధ్రజ్యోతిలో దేవిప్రియ 'పాతపద్యమే' నన్ను ఉద్విగ్నమానసికస్థితిలో పట్టుకున్నది.ఆ కవిత చాలా సమకాలీనతఉన్న కవిత. దేవిప్రియ చైతన్యాన్ని ప్రాపంచిక దృక్పథాన్ని పట్టి ఇచ్చే కవిత. ఆయన సెక్యులర్, ప్రజాస్వామిక, కమ్యూనిస్టు మానసికత-ప్రపంచంలో నాటి కష్టమూ నష్టమూ జరుగు తున్న సందర్భంలో పడుతున్న వేదన అంతా ఆ కవితలో రూపు కట్టింది. ఎత్తుకోవడమే ఎంతో ఆవేదనతో...

*'ఇప్పుడు*
*ఎంత కొత్త పద్యమైనా పాత పద్యమే'*

అని ప్రారంభించి ఆ చరణాలను రిపీట్ చేస్తూ,

*'సంగినంగి కవిత్వాలు*
*వంగివంగి దండాలు*
*వేదికలపైన సెక్యులర్ నివేదికల వీధినాటకాలూ*



*రేయికి నిదుర రానీయని*
*వేయిపడగల వేలం జోల పాటలు,*
*హిట్లర్ పునర్జన్మలూ*
*ఎలిత్సిన్ దొమ్మరి ఫీట్లూ*
*షాంఘైలో షేర్‌బజార్ కేబరేలు*
*ఢిల్లీలో కూలిన బాబ్రీమసీదు*
*ఢాకాలో లేచిన మందిర శిధిలాల ధూళి*
*మన శిరస్సుమీద కరవాల ఛత్రమై కదులుతున్నప్పుడు,*
*ఎంత కొత్త పద్యమైనా పాతపద్యమే...'*

ఇలా సాగుతుంది.

1989 నుంచి 95 వరకు దేశీయ, అంతర్జాతీయ రంగంలో వచ్చిన షాంఘైలో షేర్‌బజార్ కేబరేలతో సహా) పరిణామాలు, కమ్యూనిజం కలలుగనే ఒక స్వాప్నికునికి ఎంత నిర్వేదాన్ని కలిగించాయో ఈ కవితలో శ్రీరామమూర్తి(నిజం) చూడగలిగి ఉంటే ఈ కవిత అచ్చయిన 'తుఫాను తుమ్మెద'కు అటువంటి ముందుమాట రాసేవాడు కాదు.

దేవిప్రియకు, అటువంటి గాయపడిన హృదయాలకు ఆశ్వాసం కలిగించాలని, ఈ సంక్షోభానికే మరోవైపు లేస్తున్న ఆశావహ కెరటాలను చూపాలని 'అప్నాసూరత్ బొంబాయి' కవిత రాసాను. ఆయన కవిత చదివిన వెంటనే అది రాసి బెజవాడలోనే డానీకి చేర్చాను. ఇంతలో బాలరాజు కిడ్నాప్ వగయిరాలతో పరిస్థితులు విచిత్రంగా మారి హైదరాబాదుకు వచ్చాను. అదంతా వేరే కథ. అదికూడా 'ఆంధ్రజ్యోతి' వార పత్రికలోనే అచ్చయింది.

*'ఎంతో చేసామనుకుంటున్న మన మందరికంటే*
*అజంతాలే నయమనిపించే*
*అధివాస్తవిక ఆశాభంగాలు రాయొద్దుగానీ దేవిప్రియా*
*మనం చేయాల్సినంత చేయడం లేదనీ*
*చేసింది చెట్టులోని చీడపురుగు తినేస్తుందనీ ఒప్పుకుంటున్నాను'*

అని ప్రారంభించాను

వివరంగా చరిత్రలోకి, వర్తమానంలోకి వెళ్లి
*'ఇంత రాసినా పాత పద్యమేనంటావా*
*ఎక్కడో గిల్టీ ఫీలింగు గిచ్చుకోలేదంటావా'*

అని పూర్తిగా ఆత్మన్యూనతకు గురి కావాల్సిన ఆత్మవిమర్శ కూడదనే ఆశ్వాసంతో

*'మనమెందుకు నయమంటావా*
*గులాం యాసిన్ కోసమో*



*గులాం రసూల్ కోసమో*
*రెండు రక్తాశ్రువులైనా వదలడానికి*
*మనకెక్కడో కవిత్వం గుండె సలుపుతున్న దని'* రాసాను.

శ్రీరామమూర్తి ప్రస్తావన ఎందుకు తెచ్చానో ఇక్కడే చెప్పాలి. దేవిప్రియ కవిత్వంలో, ముఖ్యంగా అమ్మచెట్టు, నీటిపుట్ట, ఎక్కువగా తుఫాను తుమ్మెదలో విప్లవ నిర్మాణాలపట్ల, ఉద్యమాలపట్ల నిష్ఠూరం లేకపోలేదు కాని అంతకన్నా ఎన్నోసార్లు ఎక్కువగా ఆయన విప్లవోద్యమాన్ని అడవిని 'అమ్మచెట్టు'గా భావించాడు. నీటిపుట్టగా భావించాడు. తుఫానుతుమ్మెదగా భావించాడు. ఆయనకు అడవిలో నిర్మాణమవుతున్న విప్లవోద్యమంతో దర్శనం తక్కువ. 'పైగంబర కవుల' తర్వాత ఎన్నడూ ఏ నిర్మాణంలో లేకపోవచ్చు. ఏ సంస్థలో లేకపోవచ్చు. ఎగుడు దిగుడుగా సాగిన విప్లవోద్యమంతో ఎన్నో పేచీలు ఉండవచ్చు. అవన్నీ 'అమ్మచెట్టు'తో దాని సంతానానికి ఉండే పేచీల వంటివి. ఆయన తనను మినహాయించుకొని కమ్యూనిజంపైగాని, నిర్దిష్ట విప్లవో ద్యమంపైగానీ ఎటువంటి నిందాపూర్వక విమర్శ పెట్టలేదు. ఆయనకు ఉద్యమాలపై అపారమైన గౌరవం ఉంది. తెలుగు కవిత్వంలో తమకంటూ–ప్రత్యేక స్థానం సాధించు కున్న అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద నక్సల్బరి, శ్రీకాకుళాల – ప్రభావం లేకుండావచ్చిన ఉద్యమకవిత్వం కాదు. 'తెలుగు కవితాసాహిత్యంలో ఉద్యమకవిత్వాలు సృజనకు చేసిన హాని అపారమైనది అని శ్రీరామమూర్తివలె దేవిప్రియ భావించి ఉంటే అసలు 'తుఫానుతుమ్మెద' (పేరుతోసహా) కవనమే వచ్చిఉండేది కాదు. (అందు కని శ్రీరామమూర్తి ప్రస్తావన).

దేవిప్రియలో కవికి ఉండవలసిన ఎంత కన్‌ఫెషనల్ నిజాయితీ ఉన్నదో తుఫానుతుమ్మెదకు, 'నీటిపుట్ట' తరువాత మళ్ళీ ఇన్నేళ్ళకు... అని రాసిన ప్రతి వాక్యంలో కనిపిస్తుంది. ఆయన 'ఎర్రమందారాలు' 'నిజం' (అప్పుడు ఆయన విరసం సభ్యుడు. అది విరసం ప్రచురించిన కవితా సంకలనం)లో నాలుగు ముందుమాటలు రాయించా లని చాలాకాలంగా అనుకుంటున్నాడు. తీరా ఆయనకు ఎడిటర్ జి. శ్రీరామమూర్తి ముందుమాట రాసాడు. అది దేవిప్రియలో పదేపదే తారసపడే యేదీ దాచుకోలేనితనాన్ని సరిగా అర్థం చేసుకోలేక, విప్లవోద్యమంపై, విప్లవ సాహిత్యోద్యమంపై ఆరోపణగా పరిణమించింది.

ఎవరినుంచి ఎటువంటి ప్రేరణ పొందినా ఏమాత్రం దాచుకోలేని, రుణపడి ఉండే కవితాస్వభావం దేవిప్రియది. అచ్చయిన ఆయన కవిత్వంలో ఎక్కడా (సమాజా నందస్వామి, గరీబు గీతాలు సహా) సినారె ప్రభావం లేదు. కాని చదువుకునే రోజుల్లో నారాయణరెడ్డి 'కర్పూరవసంతరాయలు' ప్రేరణతో రాసిన 'వనజారాయలు' అనే పద్యకావ్యం రాతప్రతిపై అంకితం డా.సి.నారాయణరెడ్డి గారికి అని రాసుకున్నాడు. అది అచ్చుకాలేదు. కనుక ఇన్నాళ్లకు ఆయనకు తన తుఫాను తుమ్మెద అంకితమిచ్చాడు.





పాతతరం సంగతి అలావుంచి, ఏభైలలోవున్న దేవిప్రియ తరంలో ఇంత బహుముఖ ప్రజ్ఞ వైవిధ్యభరితమైన ప్రతిభ ఉన్నవాళ్ళు చాల అరుదు. ప్రజ్ఞ, ప్రతిభలే కాకుండా స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం, తాను పనిచేసే అన్ని రంగాలలో జీవం పోయగల అభివ్యక్తి, ముఖ్యంగా ఇవ్వాళ అవసరమైన ఒక సెక్యులర్ ప్రజాస్వామిక ప్రగతిశీల అవగాహన దేవిప్రియ కవిత్వంలో ఉంది. బహుశా ఎప్పుడూ ఒక నిర్మాణం లో లేకపోవడంవల్ల అందులోని ఆటుపోటులు, ఒడుదొడుకులు, విజయాపజయాలు అర్థం చేసుకోవడంలో, అంచనా వేయడంలో సబ్జెక్టివ్ నిర్ణయాలకు రావచ్చుకాని అదే ఆయన కవిత్వ లేదా చైతన్యస్వభావం కాదు.

అందుకే ఆయనంటే నాకే కాదు, విరసంకు స్నేహాభిమానాలతో కలిసిన గౌరవం వుంది. ఆఖర్న, ఆయనతో ఆయా సందర్భాల్లో పంచుకున్నదే అయినా, నలుగురితో పంచుకోవాల్సిన ఒక ప్రశంస ఉంది. Praise without malice. అది ఆయన కూర్చే పదబంధాలు. అవి కవిత్వంలో తగిలినపుడు ముందుంచుకొని విశ్లేషణా త్మకంగా వినిపించాలి. ఆయన కవిత్వంనిండా అటువంటి సందర్భాలు ఎన్నోచోట్ల తగులుతాయి. ఆయన పుస్తకాలకు ముందుమాటలు రాసిన ప్రసిద్ధులంతా (శీలా వీర్రాజు, కె.శివారెడ్డి, వెంకటరామయ్య, జి. శ్రీరామమూర్తి) శ్రీశ్రీ కవిత్వ విశ్లేషణ చేసేవాళ్ళు, శ్రీశ్రీ వాక్యాలలోనే తమ అంచనాలుగా శ్రీశ్రీ గురించి చెప్పక తప్పనట్లే, దేవిప్రియ మాటల్లోనే ఆయన కవిత్వాన్ని అంచనా వేసారు. అదంతా ఒక ఎత్తు – ఆయన పుస్తకాలను ఎంచుకున్న పేర్ల పదబంధాలు ఒక ఎత్తు.

అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద – పుస్తకాల లోపలికి ప్రవేశించ కుండానే ఒక కవి – కవితాశక్తిని, దృక్పథాన్ని ప్రజాపక్షపాతాన్ని, సృజనను, ప్రతిభను పట్టివ్వగలపేర్లు ఇవి.

బహుశా చాల తక్కువమంది తెలుగు కవులు – తమ పుస్తకాలకు ఇంత ఉచితమైన పేర్లు ఎంచుకొని ఉంటారు. ఈ పేర్లు ఈ కవితా సంకలనాల్లోని కవిత్వాన్ని అంచనా వేయడానికి ఒక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తాయి.

అరుదుగా రాసిన వాలెంటైన్స్ డే సందర్భంగానో, అమెరికా యుద్ధం మీదనో, హిట్లర్‌నవ్వు మీదనో ఆయన రాసిన కవితలు దేవిప్రియ కవితాహృదయం ఎక్కడ ఉందో, నా వంటివాడు ఒక అసమర్థ ప్రయాస చేయనక్కర్లేకుండానే స్పష్టం చేస్తాయి.

మాతో లేనివాళ్ళు టెర్రరిజంతో ఉన్నట్లు అంటున్నారు జార్జ్ డబ్ల్యు.బుష్, లాల్‌కృష్ణ అద్వానీ. ప్రపంచ టెర్రరిజంగా మారిన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మూడు దశాబ్దాలుగా పోరాడుతున్న కలం యోధుడు, కళాకారుడు దేవిప్రియ అభినందనీయుడు. దేశమూ, ప్రజలూ కాపాడుకోవాల్సిన సృజనశీలి.

*('దేవి' 30 అభినందన సంచిక 'స్వరపత్రం' – 2002 నుంచి)*



ఓల్గా

# అసామాన్యుడు మా దేవిప్రియ

1967వ సంవత్సరం గుంటూరు ఆంధ్రాక్రిస్టియన్ (ఏ.సి.) కాలేజీలో చిన్న క్లాస్‌రూము. పది పదిహేను మందికంటే విద్యార్థులులేని ప్రత్యేక తెలుగు సాహిత్య తరగతి.

ఒకింత చిరునవ్వుతో, గంభీరంగా కూర్చున్న ఓ అబ్బాయిని మంచివాడని నిర్ధారించుకుని అతని నోట్సు అడిగాం ముగ్గురు అమ్మాయిలం, గాఢ స్నేహితులం. మాస్టారు చెబుతున్న పాఠం వినకుండా మా ఇష్టం వచ్చిన పనులు చేసే మమ్మల్ని కాస్త సందేహిస్తూనే పుస్తకం ఇచ్చాడా అబ్బాయి. పుస్తకంలో దేవిప్రియ ఖాజా హుస్సేన్ అనే పేరుచూసి ఆశ్చర్యపోయాం. దేవిప్రియ అంటే ఏమిటని ఆలోచించి, కరుణశ్రీలాగా మరో శ్రీ అని పెట్టుకోకుండా ఇదేం పేరని మాలో మేం వెక్కిరించుకున్నాం కూడా. అన్నీ మాలోనే. దేవిప్రియను ఎన్నడూ అడగలేదు. ఐతే అతను పెద్ద కవి కాబోతున్నాడని బి.ఏ. మొదటి సంవత్సరంలోనే మా అందరికీ ఖచ్చితంగా తెలుసు. కాలేజీ మాగజైన్‌లో అతను రాసిన కవితలు చూసి మాత్రమే కాదు. అతనప్పటికే రాసి నాకు చదువుకోమని ఇచ్చిన ఛందోబద్ధకావ్యాలను చూసి మేం తెగ ఆశ్చర్యపడేవాళ్ళం. ఏ విద్యార్థినీ ఖాతరు చెయ్యనివాళ్ళం, అతని ప్రతిభను ముందు గుర్తించి ఎక్కువ గౌరవించింది నేనూ, బీనా, సుభద్ర అని నేననుకుంటాను. మాలో మేం అనుకునేవాళ్ళం 'దేవిప్రియ' మన క్లాస్‌మేట్ కావటం అదృష్టం. అతను భవిష్యత్తులో ఆరుద్రలా, సినారెలా, పెద్దకవి కాబోతున్నాడు. అందరితో, ముఖ్యంగా మన పిల్లలతో ఈ "దేవిప్రియగారు మా క్లాస్ మేట్ తెలుసా? బి.ఏ. మేం కలిసి చదువుకున్నాం అని చెప్పుకోవచ్చు." ఇదంతా మొదటి సంవత్సరంలో.

మూడవ సంవత్సరపు ముగింపులో దేవిప్రియతోపాటు నేనూ పైగంబర కవులలో ఒకదానిని. దేవిప్రియ సుగమ్‌బాబునీ, కిరణ్‌బాబునీ మా ఇంటికి తెచ్చాడు. నా



స్నేహితుల్ని చేశాడు. అంతదాకా పుస్తకాలలో పత్రికలలో కవుల గురించి రచయితల గురించి చదివి, సాహిత్య వాతావరణాన్ని పరోక్షంగా తెలుసుకుని సంతృప్తిపడే నా చుట్టూ హఠాత్తుగా కవిమిత్రులు! 60వ దశాబ్దంలో అమ్మాయిలకు ఇది అపురూపమే. నేను సాహిత్య వాతావరణంలో భాగమయ్యానంటే అది దేవిప్రియ క్రెడిటే. అబ్బాయిలతో భయం లేకుండా స్నేహం చేసినందుకు నాకూ కొంచెం క్రెడిట్ ఇవ్వొచ్చుననుకోండి. భయమూ, విసుగూ, చిరాకూ పుట్టించని క్రెడిట్ మళ్ళీ దేవిప్రియదే. ఆ సంవత్సరం దేవిప్రియ స్నేహం నాకు చాలా మేలు చేసింది. ఆ ఏడాది నాకు విద్యార్థిసంఘం పనులు లేవు. విద్యార్థి నాయకులంతా (మగవాళ్ళు) శ్రీకాకుళానికో, యు.జి.కో వెళ్ళిపోయారు. నాకు పార్టీతో కాంటాక్టు దొరకలేదు. శ్రీశ్రీ షష్ఠిపూర్తికి ఒక్కతినీ విశాఖపట్నం వెళ్ళి రావటం తప్ప అంతా అసంతృప్తే, అశాంతే. ఆ సమయంలో దేవిప్రియ స్నేహం చాలా సహాయపడింది. గంటలకొద్దీ కవిత్వం గురించి మాట్లాడుకునేవాళ్ళం. నా చిన్ని స్టడీరూంలో దేవిప్రియ, సుగమ్‌బాబు, కిరణ్‌బాబు, నేనూ కిక్కిరిసి పోయేవాళ్ళం. మా హృదయాలుకూడా స్నేహంతో సాహిత్యంతో తొణికిసలాడుతుండేవి. చల్లని స్నేహ వాతావరణాన్ని సాహిత్యచర్చలు వేడెక్కించేవి. ఆ వేడి తాళలేక వరండా నాశ్రయించి సేదదీరేవాళ్ళం. ఎన్ని భిన్నాభిప్రాయాలున్నా ఎంత వాడిగా మాట్లాడుకున్నా చివర్లో దేవిప్రియ చిరునవ్వు నవ్వి అన్నింటినీ తుడిచేసేవాడు.

ఖమ్మంలో జరిగిన విరసం ప్రథమ మహాసభలకు నలుగురం కలిసే వెళ్ళాం. పైగంబర కవుల మొదటి సంపుటం 'యుగసంగీతం' ఆవిష్కరణ సభ బెజవాడలో జరిగింది. నేనూ దేవిప్రియా కలసి వెళ్ళాం. ఆ ప్రయాణం ఓ సాహితీయాత్రలా సాగింది. ఆ ప్రయాణాన్ని నేను మర్చిపోలేను. దేవిప్రియలో స్నేహితులపట్ల ఎంతో ఆప్యాయత. ఎక్కువ మాట్లాడకుండానే ఒక్క మాట, ఒక్క నవ్వు, ఒక్క చూపుతో ఆ ఆప్యాయతను మన మనసులమీద చల్లుతాడు. ఆయన స్నేహం ఊపిరాడని గాఢాలింగనం కాదు. అలవోకగా ఆత్మీయంగా మన భుజాన్ని తాకే చేయి. పదునుగా వెన్నుతట్టే అరచేయి. విరసం సభలకు వెళ్ళొచ్చాక నేను విరసంలో జొరబడిపోయాను. పార్టీ కాంటాక్టు దొరికింది.పౌరహక్కుల మీటింగులు ఆర్గనైజు చేయటం, ఊళ్ళు తిరగటం ఆ పనులలో మునిగిపోయాను. దేవిప్రియకు ఆర్గనైజింగులో ఆసక్తి లేదు. దాంతో తరచు కలుసుకోవటం తగ్గింది. మా కార్యప్రపంచాలు క్రమంగా దూరమయ్యాయి.

దేవిప్రియ మద్రాసు వెళ్ళాడు. హైదరాబాదు వెళ్ళాడు. పత్రికలలో పని చేస్తున్నాడు అనే వార్తలు, ఆయన కవితలూ తప్ప అనేక సంవత్సరాలపాటు ఆయన్ని చూడలేదు. ఐతే మా కాలేజీ స్నేహితులం ఎవరెప్పుడు ఎక్కడ కలిసినా దేవిప్రియ గురించి గర్వంగా మాట్లాడుకుంటాం. ఒక వ్యక్తి మన స్నేహితుడని చెప్పుకోటానికి



గర్వపడుతున్నామంటే ఆ వ్యక్తిగురించి ఎంతో గౌరవం ఉండాలి. ఆ గౌరవం దేవిప్రియ చిన్నవయసులోనే స్నేహితుల దగ్గర్నించి సంపాదించుకున్నాడు.

దేవిప్రియ కవిత్వ సారాంశం ఏమిటి? ఆయనా, ఆయన కవిత్వంకూడా పీడిత జన పక్షపాతులు. ఐతే ఆ పక్షపాతాన్ని అతివీర భయంకరంగానో, గుండెలు బాదు కుంటూనో ప్రదర్శించాలని అనుకోని కవి దేవిప్రియ. పీడితులపట్ల నిబద్ధతతోపాటు ప్రేమ, గౌరవాలు దేవిప్రియ కవిత్వంలో కనిపిస్తాయి. ఆయన కవిత్వంలో పీడితులంతా ఒక సమూహంగా కొట్టుకుపోరు. తమదైన అస్తిత్వంతో, భిన్నత్వంతో పాఠకులను కలవరపెడతారు. ఆయన ఎంచుకునే సంకేతాలు, పదచిత్రాలు సరికొత్తవి. ప్రయోగించే తీరులో పదును ప్రత్యేకమైనది. వ్యంగ్యంలో కూడా దేవిప్రియ ప్రత్యేకత కనిపిస్తుంది. ఆ బాణాలు వ్యక్తిని ఒక్కసారే సంహరించవు. నిరంతరం గుచ్చుకుంటూనే ఉంటాయి. సరదాగా ఉన్నట్లు కనిపిస్తూనే ఆయువుపట్టుమీద కొడతాయి.

చెప్పాను గదూ – చిన్నతనంనుంచే దేవిప్రియ తీరు అంతే. చాలా సామాన్యంగా కనిపిస్తూనే అసామాన్యుడని అనిపిస్తాడు. అల్లరి చేస్తూనే పెద్దమనిషిలా కనిపిస్తాడు. ఎంతో రగిలిపోతూనే చల్లగా ఉన్నట్లుంటాడు. జీవితంలో ఎన్నో ప్రయాణాలు చేసి, ఉన్నచోటినుండి కదలటానికి ఇష్టపడనట్లుగా ఉంటాడు. బతుకు లోతుల్నిచూసి వాటితో తలపడి పోరాడిన యోధుడైనా ఒడ్డున కూర్చున్న తాత్వికుడిలా నవ్వుతాడు.

సోమరిగాలీ, బద్దకపు మధ్యాహ్నాలు తారసపడ్డప్పుడు దేవిప్రియ ఎంత గుర్తొస్తాడో, కణకణ మండుతున్న నిప్పుకణిక కనపడ్డా, రెపరెపలాడే పతాకం కళ్ళబడ్డా దేవిప్రియ అంతే గుర్తొస్తాడు.

ఆయన కవితాయానం వయసు ముప్ఫైఏళ్ళు. ఆ ప్రయాణం నూరేళ్ళు సాగాలి, నూరేళ్ళు నిలవాలి.

*– (దేవి'30 – 'స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

***నిజమా...***
***జీవన ఆరాటం కూడా పోరాటమేనా?***
***అక్షరాలకి కూడా సాయుధస్వభావం వుంటుందా?***

(అవునా...? : అరణ్య పురాణం)



కె.ఎన్.వై.పతంజలి

# కవనమహాశిల్పి దేవిప్రియ

"నాకు

*రెండు నిధులున్నాయి,*
*నాలుకమీద కవిత్వం*
*తలమీద దారిద్ర్యం*
*నాకు*
*రెండు విధులున్నాయి,*
*కవిత్వ నిత్య నిబద్ధం*
*దారిద్ర్య విముక్తి యుద్ధం !"*

స్థూలంగా ఇదీ దేవిప్రియ కవిత్వ విధాన ప్రకటన.

దేవిప్రియ ప్రేమిస్తాడు, కవులకు ప్రేమ ఒక్కటే తెలుసుననుకుంటాడు. దేవిప్రియ అలుగుతాడు. అలిగి, అటువైపుతిరిగి కళ్ళు మూసేసుకుంటాడు.

*"ఇక సెలవు... సొంత ఆలోచనలకు, ఇక సెలవు, సొంత మెదడు కుండీలో పూచిన గులాబీలకు, గుల్‌మొహర్లకు ఇక సెలవు... విలువల చంద్రవంకలకీ, శుద్ధ సూర్యుళ్ళకీ సెలవు, సెలవు"* సెలవంటాడు.

*'ఇప్పుడు ఇద్దరు పిల్లల తండ్రినై*
*ఇంత బతుకు బతుకుతున్న*
*నా సుతిమెత్తని అరచేతులు చూసికూడా*
*ఎట్లా బతుకుతావురా అని ఏడుస్తుంది మా అమ్మ !'*

చేతులు, మనసే కాదు దేవిప్రియ కనులు కూడా చాల మెత్తన... చూశారో లేదో అవి విచిత్రంగా వుంటాయి, గాయపడిన వాటిలాగ, రాలిపడబోతున్న వాటిలాగ, కౌగిలింతకోసం ఎదురుచూస్తున్న వాటిలాగ, కన్నీటితో నిండిపోయి తొణుకుతున్న వాటిలాగ, చిగురిస్తున్న వాటిలాగ వుంటాయి.



సీతాకోకచిలుకనూ, వడ్రంగి పిట్టకు పోల్చి మకరందాన్ని దొంగిలించే సీతాకోక చిలుక మీద అగ్గిఫైర్ అయిపోయి గట్టిగా గాలేస్తే వాటి ఉల్లిపొర రెక్కలు రాలిపోతాయని చెప్పి (రాలిపోవాలని శపిస్తూ) వడ్రంగిపిట్ట ముక్కు సమ్మెట దెబ్బను చూసి విని దేవిప్రియ పొంగిపోతాడు. వెర్రివాడు దేవిప్రియ. వెర్రాడు కాకపోతే కేవలం పూల మకరందాన్ని మాత్రం తాగి బతికే సీతాకోక చిలుకల కాలర్ పుచ్చుకుని చార్మినార్ చౌరాస్తాలో నిలబెట్టేసి, చెట్ల బెరడులో, తొర్రల్లో తలదాచుకునే పురుగుల్ని పట్టిమింగే వడ్రంగిపిట్టను మెచ్చుకున్నాడు.

మరి అలాగ అమాయకంగా, వెర్రాడిలాగా, పిల్లాడిలాగా వుంటాడా, వుండి వూరుకుంటాడా? బెర్లిన్ గోడ కూలిపోతే "హిట్లర్‌నవ్వు" వింటాడు. 'హిట్లర్‌నవ్వు' దార్శనికులకు, మేధావులకు మాత్రమే వినిపిస్తుంది. 'బెల్లీ బైలెల్లినాదే'లో "అరణ్యనేత్రాలై విచ్చుకున్న ఆకులెందుకు ఇంకా పచ్చగావున్నాయి?"అని చాలా క్రోధంగా అడుగుతాడు.

"ఇప్పుడు ఎంత కొత్త పద్యమైనా పాత పద్యమే" అని పరాకుగా అనేస్తాడు మొహం గంటు పెట్టుకుని. దేవిప్రియకు చిరాకెక్కువ.

సరే ఇదంతా అమాయకత్వము, ప్రేమా, పసితనము, చిరాకు, దార్శనికతా. ఇవి కొంతమంది ఇతరుల్లోకూడా కనిపిస్తాయికాని దేవిప్రియ వెక్కిరింతలవాడు కాదు. కవులకు చాలమందికి కడుపుమంట వుంటుంది కానీ దాన్ని హృద్యంగా ఒక పద్యంగా వెలిబుచ్చే శక్తి వుండదు. ఆధునికుల్లో ఒక్క శ్రీశ్రీకి, ఒక్క దేవిప్రియకూ మాత్రమే ఆ విద్య తెలుసు.

చాలామంది కవులకు అటు కవిత్వం రాయడంగానీ, ఇటు చక్కని వచనం రాయడంగానీ రాదు. దేవిప్రియకు ఆ రెండూ తెలుసు. మొన్నటికిమొన్న 'వార్త' ఆది వారం సంచికలో 'నక్షత్రయాత్ర' శీర్షికతో ఆయన రాసిన జ్ఞాపకాలు దీనికి ఎంతో బలమైన సాక్ష్యం. వైవిధ్యభరితమైన కవితలూ, రచనలూ, చేయగలిగినవారు తెలుగు కవుల్లో చాలా తక్కువమంది. ఎక్కువమంది కవులు 'సింగిల్ కవిత' కవులు. ఒకేఒక కవిత రాసి జీవితమంతా దాన్నే రకరకాలుగా తిరగరాస్తుంటారు. అదీ ఒక కళే! అయితే దేవిప్రియ సమాజానందస్వామి, రన్నింగ్ కామెంటరీ, గరీబు గీతాలు పద్యాలు, అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెదలోని వచన కవితలు, సినిమా పాటలూ, టీవీ నాటకాలు, మామూలు నాటకాలూ, ఏడ్ ఫిలింస్, అడ్వర్‌టైజ్‌మెంట్స్‌కు కాపీ రాయ డాలూ – ఒకదానికి ఒకటి సంబంధం లేనంత వైవిధ్యం కనబరిచిన కవి దేవిప్రియ.

పద్యకవిగా మొదలై పైగంబర కవిగా మారి, సామాజిక చైతన్యస్ఫూర్తితో, ప్రగతిశీల దృక్పథంతో సొంతగొంతు విప్పి, సొంత భాషలో, సొంతశైలిలో, సొంత కవిత్వం రాసుకుంటున్న కవి దేవిప్రియ.

రాచకొండ విశ్వనాథ శాస్త్రిని, విశ్వంగాడనీ, విశ్వనాథ సత్యనారాయణను

సత్తిగాడని, చిన్నతనంలో అయినవాళ్ళు పిల్చుకొన్నట్టు. వారి గొప్పతనాన్ని గుర్తించలేక కేవలం స్నేహంగానో, చుట్టంగానో గుర్తించినట్టు, తోటి కవులు దేవిప్రియను దేవుడని, దేవీ అని చూస్తున్నారని నేను అనుకుంటున్నాను. ఆధునిక కవిత్వంలో దేవిప్రియకు ఇవ్వాల్సిన స్థానం ఇవ్వలేదని నా ఫిర్యాదు. అందువల్లనే ఆయన సాహిత్యంమీద నేటి దాకా ఒక్క ఎం.ఫిల్ గానీ, ఒక్క పి.హెచ్.డి. గానీ రాలేదని నా అనుమానం.



ఆయన రాసిన కవిత్వాన్ని ఉటంకిస్తూ పేజీలు పేజీలు నా సంతోషాన్ని వ్యక్తం చేయవచ్చునుగాని అది అంత మర్యాదైన పనికాదు. దేవిప్రియ విషయంలో నా గడుసు తనం ప్రదర్శించడం అన్యాయంకూడా అవుతుంది.

దేవిప్రియ కవిత్వంలో ఒక పువ్వులో, ఒక పూలమొక్కలో,ఒక అన్నం మెతుకులో ఎలాంటి సంపూర్ణత వుంటుందో అట్టి సంపూర్ణత వుంటుంది. అది సమకాలీన కవులను, కుర్రకారునీ ప్రభావితం చేయగలిగినంత బలంగాను, నవంగాను, జవంగాను కూడా వుంటుంది.

అయితే దేవిప్రియకు పి.ఆర్.అలవాటు లేదు. పైగా అప్రియ సత్యాలను చెప్పే 'దుర్గుణం' కూడా వుంది. తాను సంపాదకుడిగావున్న పత్రికలోకూడా తన కవిత్వాన్ని అదేపనిగా ప్రచురించుకోవడానికి జంకే పెద్దమనిషితనం వుంది. బటను నొక్కి, తీగలు కదిపి, తీగలు మీటి అవార్డులు, సన్మానాలు పోగేసుకోవాలన్న జ్ఞానంకూడ ఆయనకు కరువైంది.

ఆధునికుల్లో అగ్రశ్రేణి కవీ, అసమాన ప్రతిభాశాలీ, కోమలశిల్పీ నిరంతర ప్రగతిశీలీ, నిర్మల భావుకుడూ, నిర్మోహమాటీ దేవిప్రియ.

*– ('దేవిప్రియ కవిత్వం'. దేవి'30 – 2002 ప్రచురణ సంపాదక పీఠిక నుంచి)*

***మానవ చరిత్ర పుస్తకంలోని***
***ఏ పేజీలోంచి లేచి***
***వాలిందో ఈ పిచుక,***
***ఎంత తరిమినా***
***నాలోంచి ఎగిరిపోదు.***

(పిచుక : నీటిపుట్ట)



ఎండ్లూరి సుధాకర్

# షుక్రియా, దేవిప్రియా!

*కవులకి*
*కలలు కనిపించకూడదు*
*కవులకి కలలభాష వినిపించకూడదు*
*కవులు*
*వెర్రెత్తి పోతారు*
*కవులు*
*కల్పనాలోకాల్లో పడి*
*దిక్కు తెలియకుండా కొట్టుకుపోతారు*
*కవులు ప్రేమిస్తారు,*
*నిజానికి*
*వాళ్ళకి చేతనైంది అదొక్కటే !*

**– దేవిప్రియ**

అటు పత్రికారంగంలోను ఇటు సాహిత్య క్షేత్రంలోను సొంత సంతకం ఉన్న ప్రజాతంత్ర ప్రతినిధి దేవిప్రియ. జర్నలిజంలో బహుముఖాల ప్రజ్ఞావంతుడు, అలాగే సాహిత్యంలో బహురకాల ప్రక్రియావంతుడు, ఒకే సమయంలో మెదడు పొదిలోంచి ఉభయ ప్రతిభా బాణాలు వేయగల అక్షరాల కవ్వడి.

నేను కవితాభ్యాసం చేసే రోజుల్లో విపరీతంగా చదివేవాణ్ణి. నా ఇరవై ఏళ్ళలోపు నూనూగుమీసాల వయస్సులో చాలామంది తెలుగు కవులు నాకు పరిచయం అయ్యారు. నన్ను ఉగ్రూతలూగించారు. ఉద్రేకం కలిగించారు. హృదయోల్లాసం పుట్టించారు. నా అక్షరాలకు దిశానిర్దేశం చేశారు. డెబ్భయ్యో దశకం చివర్లో నాకు దేవిప్రియ అనే



పేరుతో పరిచయం ఏర్పడింది. ఎంత అందమైన పేరు అనుకున్నాను. అలా 'ప్రజాతంత్ర' పత్రికారూపంలో పల్లవించిన ఆ తొలినాటి అభిమానం ఇప్పటికీ చెక్కు చెదర లేదు. గత శతాబ్దపు దెబ్బయిల తర్వాత ఆధునిక సాహిత్యాన్ని దాని బలమైన భావజాలాన్ని పదిలంగా కాపాడుతూ వస్తున్న చాల కొద్దిమంది కవుల్లో దేవిప్రియ పేరుకు ప్రముఖంగానూ క్రియాశీలకంగానూ చెప్పుకోవాలి. పత్రికారంగం కొంతమందికి, కీర్తికీ, కళ్ళు నెత్తికెక్కిన గర్వానికీ పెట్టుబడిలాంటిది. ఈ విషయంలో దేవిప్రియ నిబద్ధతని తప్పకుండా గుర్తించాలి. దేవిప్రియ ఆత్మగౌరవం ఉన్న సంపాదకుడు. 'అమ్మచెట్టు' కవితాసంపుటి ముందుమాటలో ప్రసిద్ద రచయిత శీలావీ మాటలు నాకిప్పుడు గుర్తొస్తున్నాయి.

"పదేళ్ళక్రితం తారసపడిన ఈ కవిని చూసి చటుక్కున స్నేహం హస్తం చాచాను. బితుకు బితుకుగా, బిడియంగా అందుకున్న నా చేయిని పట్టుకుని, చూస్తుండగానే అతని నీడలో నేనే ఒదిగిపోయేంత ఎత్తుగా నామీదకి నేనే చూసుకునేంత పైపైకి సాహిత్యాకాశంలోకి ఎదిగిపోయాడు. నన్ను మించినవానికి నా యోగ్యతాపత్రం – నిజానికి అక్కరలేదు... ఉద్యమంలోంచి పుట్టినా, ఉద్యమాల్ని నిచ్చెనగా చేసుకోలేదు. అందుకే ఆయనన్నా ఆయన రచనలన్నా నాకు యిష్టం." ఈ వాక్యాలు చదివి శీలా వీర్రాజు గారిమీద గౌరవం పెంచుకోవాలో, 1979 నాటికే, ముప్ఫయి ఏళ్ళకే దేవిప్రియ ఎంత సుప్రసిద్ధుడయ్యాడోనని గర్వించాలో ఒక లిప్తకాలం అర్థం కాదు. దేవిప్రియ పైకి చాలా దర్జాగా కనిపిస్తాడు. ఉద్యోగంఉన్నా, వదిలేసినా హుషారుగానే ఉంటాడు. బహుశా తన జీవితాన్ని తానే ఆత్మకథపద్యంలో నేపథ్యంలో బేరీజు వేసుకున్నాడు. 'నీటిపుట్ట' కావ్యంలో, నిర్భయంగా...

*నాకు*
*రెండు నిధులున్నాయి*
*నాలుక మీద కవిత్వం,*
*తలమీద దారిద్ర్యం !*
*నాకు రెండు విధులున్నాయి*
*కవిత్వ నిత్య నిబద్ధం*
*దారిద్ర్య విముక్తి యుద్ధం.*

దేవిప్రియ వ్యక్తిత్వంలాగే ఆయన కవిత్వానికికూడా వ్యాఖ్యానం అవసరం లేదు. సూటిగా పఠిత హృదయాన్ని పట్టేస్తుంది. దేవిప్రియ కవుల్ని, వాళ్ళ కవిత్వాన్ని పసిగట్టడంలో అందెవేసిన చెయ్యి. శ్రీశ్రీ చేతనే 'ప్రజాతంత్ర' పత్రికకు ఆత్మకథ రాయించినవాడు సామాన్యుడా మరి! ఈ విషయంలో దేవిప్రియది స్వర్ణకారుడి దృష్టి. తరుగూ, మెరుగూ తెలిసినవాడు.



పని విషయంలో దేవిప్రియ రాజకీయ విశ్లేషణలకు, నాణ్యతలకు, ఆల్ రౌండర్. ఆదివారపు అనుబంధాలకు, వాటి రూపురేఖలకు ఆయన పెట్టింది పేరు. అసలు ఈ విషయంలో ఆయన పనితీరే వేరు. తెలుగు దినపత్రికల 'సండే మేగజైన్స్'కు విశేషమైన ప్రాముఖ్యాన్ని ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టింది ఆయనే. అందుకే 'దేవిప్రియే పత్రికాశీలే' అని ఆంధ్ర పాఠకలోకం పాడుకోక తప్పదు.

దేవిప్రియ కవిత్వ పక్షపాతి. ఆయన 'ఆంధ్రజ్యోతి'లో ఉన్నా, 'ఉదయం'లో ఉన్నా ఎక్కడున్నా కవులకూ కవిత్వానికి పెద్దపీట దక్కేది. అదొక 'కవికాలం'. 'కవిత్వోత్సవం.' దేవిప్రియ కవిత్వ విషయంలో ప్రతిభావాది. ప్రశంసలకు లొంగేవాడు కాదు. కవిత బావుండాలేకానీ కవి పరిచయం అఖ్ఖర్లేనివాడు. అంతెందుకు ఒక చిన్న సంఘటన గుర్తు చేస్తాను. ఇప్పటి ప్రముఖకవి యాకూబ్ మా అందరిలాగే ఒకప్పుడు కవిబాలుడు. సొంత శైలికోసం. సొంతగొంతు కోసం తపిస్తున్నాడు. ఓ రోజు హఠాత్తుగా 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక డిసెంబరు 26, 1988లో 'చీకటిద్వారం' అనే కవిత అచ్చయింది.

*"క్షణాలు ఆకాశం నుంచి / రాలి*
*ఎక్కడి వక్కడే ఆగిపోతాయి*
*నీ మీద నుంచి/*
*వందల అడుగుల నడిచిపోతాయి."*

ఇలా కొత్తగా సాగిపోయింది కవిత. అప్పుడు 'ఆంధ్రజ్యోతి'లో 'చేరాతలు' వస్తోంది. వయోభేదం లేకుండా కవులందరూ ఈ వారం చేరా ఏ కవిని అనుగ్రహిస్తారోనని 'ఎదురుతెన్నులు' చూసేవాళ్ళు. 'ముందు తెలిసెనా ప్రభూ'! అంటూ పలకరించేవాళ్ళు. చేరాకు లింగభేదం లేదు. అదట్లా పక్కన పెడితే ఓ వారం సీనియర్ కవుల కడుపు మండేలా బహుత్ ఖూబ్ యాకూబ్! అనే శీర్షికతో 'చేరాతలు' అట్టుడికించింది. పైగా ఫొటోలు కూడా. ఇంకేముంది, 'కె.బి.సి'లో రాత్రికిరాత్రే కరోడ్‌పతి అయినట్లు ఆ ఒక్క కవితతో యాకూబ్ ప్రముఖ కవుల భుజాలు రాసుకుంటూ సొంత కాళ్ళమీద నిలదొక్కుకున్నాడు. అంత బ్రహ్మాండమైన శీర్షిక పెట్టడానికి వెనక ఉన్నది దేవిప్రియే అని చెప్పడానికి ఇంత ఉపోద్ఘాతం.

ఇదొక్కటే కాదు, ఇలాంటివి ఎన్నో చెప్పగలను. అంతెందుకు, నా కవితల్ని చాలవరకు వెలుగులోకి తెచ్చింది దేవిప్రియగారే. నా 'గూర్ఖా' కవితను 'ఉదయం'లో ప్రముఖంగా అచ్చేసి, అది నాకు బోలెడంత పేరు ప్రఖ్యాతుల్ని, ఇతర భాషల అనువాదాల్ని అభిమానుల్ని తెచ్చిపెట్టడానికి ప్రధానకారణం దేవిప్రియగారే. లబ్ధిదారుడిగా ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకోవడం ఇప్పుడు కనీస కవి సమయం.

దేవిప్రియ ప్రభావం తెలుగు పత్రికలమీద, కవిత్వంమీద ఎంతో ఉంది. ఈ



అంశాలు ఈ వ్యాసకర్తకంటేకూడా పరిశోధకులు చెబితేనే పటిష్టంగా ఉంటుంది. కానీ ఈయన 'మౌనదేవిప్రియ.' తన గురించికానీ, తన కవిత్వం గురించికానీ ఎక్కడా చెప్పుకోడు. ఇటీవల రెండుమూడుసార్లు ఫోనులో పలకరించుకున్నా మాటవరసకైనా ఏయ్ సుధాకర్, నామీద వ్యాసం రాయి' అని శాసించలేదు. అటువంటివి ఎప్పుడూ ఆశించనూ లేదు. దటీజ్ దేవిప్రియ.

ఏమాటకామాట చెప్పుకోవాలి. ఎనభయ్యో దశకపు కవుల్ని, ఉద్యమాల్ని బల పరచడంలో నిలదొక్కుకోవడంలో పత్రికల పాత్ర విమర్శకుల పాత్ర మర్చిపోలేనిది. దేవిప్రియ పెద్దపెద్ద పత్రికల్లో కీలకస్థానాలలో ఉంటూ, కవిత్వాన్ని ఒక దీపస్తంభంలా కాపాడాడు. ఆయన కవిత్వంలాగే, దేవిప్రియ స్కూల్ ఆఫ్ లిటరరీ జర్నలిజం' ఇవాళ పత్రికల్లో ఒక ఒరవడిగా మారిందని అనుకుంటున్నాను.

ఇక విమర్శ విషయానికొస్తే 'చేరాతలు ద్వారా ఆధునిక కవిత్వానికి' ఒక గ్లామర్‌నీ, పాపులారిటీని తీసుకువచ్చింది దేవిప్రియే !

పదిహేను ఇరవైఏళ్ళనాటి ముచ్చట నాకు బాగా గుర్తు. దేవిప్రియ, చేరాగార్లు మంచి 'పలుకుబడి'లో చలామణి అవుతున్న రోజులు. వారిద్దరి దగ్గర ఎప్పుడు చూసినా కవుల గుంపు కనబడుతూ ఉండేది. రాష్ట్రం నలుమూలల్నుంచి రాజధానికి కవులు వచ్చేవాళ్ళు. తరువాత తాజా కవితలతో పరిచయ చిత్రపత్రాలతో ఈ ఇద్దరినీ విధిగా కలిసేవాళ్ళు. సరే, 'విన్నపాలు సేయవలె' ఉండనే ఉండేది. నేను మొదటిసారి దేవిప్రియ గారిని చూసినప్పుడు సరిగ్గా అక్షరరూపంలో ఉన్న 'అమ్మచెట్టు'ను చూసినట్టే అని పించింది. నిజానికి నన్ను దేవిప్రియ 'అమ్మచెట్టు' కావ్యం గురించి నాలుగు పేజీలు ఏదైనా రాసి పంపమన్నారు దోస్తులు నాళేశ్వరం శంకరం, యాకూబులు జమిలిగా. నేను మాత్రం చెట్టుగురించి చెప్పకుండా అమ్మ చుట్టు తిరిగాను.

కవి పరిచయంతోనే ఇంతదాక కాలక్షేపం చేశాను.

హైదరాబాదులో నారాయణగూడ అనే ప్రదేశంలో దేశీ బుక్ హౌస్ ఉండేది. శివాజీ గారనే సాహిత్య అభిమాని దాన్ని నష్టానికి నిర్వహిస్తూ ఉండేవాడు. అప్పటి వర్ధమాన కవులూ, సీనియర్సూ తమ తమ కవితా సంపుటాల్ని (ఎక్కువ భాగం శీలావీ ముఖచిత్రంతో) ఆ షాపులో అమ్మకానికి పెట్టేవాళ్లు. అక్కడికి కవులుకూడా వచ్చే వాళ్ళు. అప్పటికి నేనింకా విద్యార్థిగా ఉస్మానియా తెలుగు శాఖలో చేరలేదు. పగలు చిన్నాచితక పనులు చేసేవాణ్ణి. సాయంత్రం ఓరియంటల్ కాలేజిలో చదివేవాణ్ణి. ఇంట్లో ఇచ్చింది పోగా ఐదో పదో మిగిలితే కొత్త కవితా సంపుటాలు కొనుక్కోవడానికి దేశీ బుక్ హౌస్‌కి నా డొక్కు సైకిల్‌మీద వచ్చేవాణ్ణి. అక్కడే నా ఆధునిక కవితా జీవితం మలుపు తిరిగింది. అప్పట్లో మేజర్ పోయెట్స్ పుస్తకాలన్నీ దాదాపు సామాన్య పాఠకులకు అందుబాటులో ఉండేవి. శ్రీశ్రీ, సినారె, దాశరథి, కుందుర్తి, శేషేంద్ర మొదలైన



కవుల కవితా సంపుటాలు పరవాలేదు అనే ధరకే దొరికేవి. దిగంబర కవిత్వం మూడు సంపుటాలు ఐదు రూపాయలే. అలాగే శివారెడ్డి 'చర్య', నేత్రధనస్సు, గోపిసార్ 'తంగెడుపూలు', దేవిప్రియ 'అమ్మచెట్టు' ఇంకా ఎన్నో కవితా సంపుటాలు మూడు రూపాయలకే లభించేవి. ఆరోజుల్లో ఏ కొత్త కవిత్వ పుస్తకం చదివినా కవితో కరచాలనం చేసినట్టో, ఓరియంటల్ కాలేజి భక్తివల్ల ఆ కవి పాదాలకు నమస్కరించి నట్టో భావించేవాణ్ణి.

బహుశ అప్పటికీ ఇప్పటికీ కవిత్వంకన్నా ఇష్టమైంది నాకు మరొకటి కనిపించ లేదు. అలా 'అమ్మచెట్టు' పుస్తకాన్ని ఎంతో ఆప్యాయంగా ఆర్ద్రంగా చదువుకున్నాను. అప్పటికి నాకు ఆధునిక కవిత పూర్తిగా ఒంటబట్టలేదు. (ఇప్పుడు అంతా పట్టిందని కాదు) పద్యాలలాగా ప్రతిపదార్థం, భావం, తాత్పర్యం కోసం తల పట్టుకొని కూచునే వాణ్ని. 'అమ్మచెట్టు' అంటే అమ్మ అనే చెట్టు. రూపక సమాసం. అచ్చ తెలుగు పదాలు. 'మాతృదేవోభవ'లాగా 'మాతృతరువోభవ' ఇలా అన్వయించుకునే వాణ్ణి. సమాజాన్ని, రాజకీయాల్ని, సామాజిక సందర్భాల్ని తెలుసుకుంటున్న క్రమంలో 'అమ్మచెట్టు' ఒక బలమైన విప్లవ ప్రతీక అని అర్థమైంది. అలాగే మిగతా కవిత్వంకూడా. ఇస్మాయిల్ 'చెట్టు నా ఆదర్శం' అనుభూతి వాదానికి చెందిన వైయక్తికమైతే, దేవిప్రియ 'అమ్మచెట్టు' సాయుధ స్పందనకి సామూహిక చేతనగా గుర్తించగలిగాను.

'అమ్మచెట్టు'లో వస్తురీత్యా వైవిధ్యపూరితమైన వచన పద్యాలున్నాయి. జీవితాన్ని ఉద్యమంగా ఉద్యమాన్ని జీవితంగా చూడగల్గిన నవ్యదృష్టి దేవిప్రియది. అది అభివ్యక్తిలో మరింత పదునెక్కింది.

ఖాళీసీసాని పారేయకు
పగలేయ్,
అది ఆయుధమవుతుంది !

ఖాళీ సీసా శక్తివంతమైన ప్రతీక. ఈ కవిత్వపదాలు నన్నే కాదు చాలామందిని వెంటాడాయి. అటు హృదయాల్ని, ఇటు ఉద్యమాల్ని ప్రభావితం చేశాయి. దేవిప్రియ 'సీసాయుధం' కవిత, స్మైల్ 'ఖాళీసీసాలు' కథ నన్నెంతో కదిలించాయి.

దేవిప్రియ వచన పద్యనిర్మాణం విలక్షణమైంది అంటారు కానీ ఛందోబద్ధ పద్యం నిర్మించడం కష్టమని, అంతకంటే ఎక్కువ శ్రమ వచనకవిత్వానికే ఉంటుంది. ఏ పక్రియలోనైనా సొంత ముద్ర నిరూపించుకున్నవాడే బతుకుతాడు. నిజానికి బలమైన కవి తనరూపాన్ని తానే నిర్మించుకుంటాడు. ప్రాచీనకవుల పద్ధతిలో ఇప్పటి సంప్రదాయ కవులు పద్యకావ్యాలు రాస్తే పండిత విమర్శకులూ పద్యప్రేమికులు ఎంతో మురిసి పోతారు. ఆ పద్ధతి వచనకవిత్వంలో చెల్లదు. ఏ కొత్త రూపానికైనా పాత పునాదులు అవసరమని నా అభిప్రాయం. ఇక్కడే దేవిప్రియ రూప ప్రతిభ సువిశాలమవుతుంది. సామాజిక మవుతుంది.



'అమ్మచెట్టు' కావ్యంలో దేవిప్రియ పాతపదాలకు కొత్త అర్థాల ప్రతీకల్ని ఆపాదించాడు. ఒక దశాబ్దపు(1972–1979) కవిత్వపరిణామాలకు కొండగుర్తు 'అమ్మచెట్టు'.

'అమ్మచెట్టు' సమకాలీన యువకవుల్నీ ఎంతో జాగృతుల్ని చేసింది. విశ్వ విద్యాలయాల్లో చదివే సాహిత్య విద్యార్థుల్నీ, కొత్తతరం కవుల్ని బాగా ప్రభావితం చేసింది. ఈ సంపుటిలో ఏ కవితకు ఆ కవితే ప్రత్యేకమైంది.

దేవిప్రియ సామాజిక స్పందనల్నీ మానవ సంవేదనల్నీ 'అమ్మచెట్టు'లో బలంగా విప్లవీకరించాడు. అంతేకాదు ద్రష్ట అయిన కవి తన కాలంకంటే, ఉద్యమాలకంటే ముందుంటాడు. ఈ కవిత చదవండి మీకే తెలుస్తుంది.

*'తల్లీ,*  
*రోడ్డుమీద కిళ్ళీ ఉమిసిన మరకల్ని చూస్తే*  
*నువ్వే గుర్తొస్తావు నాకు*  
*ఏ కాలి కింద*  
*ఏ పువ్వు నలిగి పోయినా*  
*ఏ వికృత వాంఛ కింద*  
*ఏ నవ్వు మలిగిపోయినా*  
*నువ్వే గుర్తొస్తావు.*  
*..................*  
*స్త్రీ, సహోదరీ, సతీ,*  
*కాలే పెనం మీద*  
*రాలిన నీటి బిందువా*  
*పురుషాధిపత్యం చేత*  
*అపహరించబడిన చరితా, మాతా....'*

ఇలా సాగుతుంది, డెబ్భయి ఎనభై దశకాల్లో స్త్రీల గురించి ఇలా పరితపించి దేవిప్రియలా రాసిన కవులూ, కవితలు చటుక్కున చూపగలమా? అందుకే దేవిప్రియ కవితకు కాలపరిమితులు లేవు. మాములూ కవికీ, జర్నలిస్టుకూడా అయిన కవికీ కొంత తేడా ఉంటుంది. జర్నలిజంలో పనిచేసే కవులకు నిత్య ప్రపంచవార్తలు, మారే రాజకీయాలు క్షణాలమీద తెలిసిపోతుంటాయి.

అయితే కవిత్వీకరించడంలో తొందరపడే సాదా కవులకీ సంఘటనతో సొంతం తాదాత్మ్యం చెంది రాసే దేవిప్రియకీ అంతరముంది. 'అమ్మచెట్టు'లో 'రాజకీయ రాస క్రీడాకారులు' కవితలోనూ 'నీటిపుట్ట' సంపుటిలోని 'హిట్లర్‌నవ్వు' కవితలోనూ ఈ తేడా స్పష్టంగా గమనించవచ్చు.

కవిగా దేవిప్రియ గొప్ప భావుకుడు. అంతే గొప్ప శిల్పి. ఒక మంచికవితలో



భావుకత, శిల్పనైపుణ్యత తోడైతే ఆ కవిత సాహిత్యలోకంలో శాశ్వతస్థానం సంపాదించు కుంటుంది. ఎవరిదాకో ఎందుకు, దేవిప్రియ రాసిన అర్థరాత్రి నగరం, విశాఖపట్నం సముద్రం (ఆ తరువాత ఇలాంటివి చాలామంది రాశారు.) చూడండి.

'ఒక రష్యన్‌తో తొలిసారి చేయి కలిపినప్పుడు', 'రాధానగరి', 'తగరం', 'నేస్తం భవానీ'!, 'బల్బుమాడిన దృశ్యం', 'రామకృష్ణకి', 'అమ్మచెట్టు' కవితలుగానీ 'నీటిపుట్ట'లో నన్ను కుదిపేసిన 'ఒక గుడిసెకథ', 'నీరా,నీరా, నువ్వెక్కడ' అనే కవితలుగానీ మరపు రానివి. దేవిప్రియ కవిగా వస్తు దిశానిర్దేశకుడు. తన తరం యువకవులకి ఆయన వస్తు స్వేచ్ఛామార్గం చూపించాడు. బిస్మిల్లాఖాన్ షెహనాయి కచేరి విన్నాక రాసిన 'ఒక్క సంగీత సూర్యుడు' అనే కవిత ప్రభావంతో చాలా కవితలు పుట్టాయి. సైగల్, ముఖేష్, లత, శివకుమార్ శర్మ, హరిప్రసాద్ చౌరాసియా, జాకిర్ హుస్సేన్, గులాం ఆలీ ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో! సంగీత ప్రతిస్పందన కవితలు రాయడం దేవిప్రియ, 'అమ్మచెట్టు'లో 'నేను గీతాన్నో, సంగీతాన్నో' అనే కవితతోనే ప్రారంభించాడు.

దేవిప్రియ శబ్దప్రపంచం సువిశాలమైంది. లయరహస్యం తెలిసినవాడు. ఎన్నో కొత్తపదాలు పుట్టించిన సృజనశీలి. తెలుగుకవిత్వంలో శివసాగర్ తర్వాత, శక్తివంతమైన విప్లవధ్వనుల్నీ, అరణ్యప్రతీకల్ని ప్రయోగించింది దేవిప్రియ!

ఇక 'అమ్మచెట్టు'తో నా అనుబంధం.

అప్పటికీ, ఇప్పటికీ నాకు ఇష్టమైన ఉద్యోగం అధ్యాపకత్వం. 1985 నుంచి 1990 దాకా హైద్రాబాదులో తెలుగు పండితుడిగా పని చేశాను. 90ల తర్వాతే నా జీవితం మలుపు తిరిగింది. సినారె ఉపాధ్యక్షులుగా ఉన్నకాలంలో తెలుగు యూని వర్శిటీ రాజమండ్రి సాహిత్యపీఠంలోకి లెక్చరర్‌గా పాదం మోపాను. ప్రధానంగా ఎం.ఏ. వాళ్ళకి ఆధునిక సాహిత్యం కవిత్వం, కథ, నవల, నాటకం, బోధించడం నా బాధ్యత. నేను వచ్చిన సంవత్సరమే ఎం.ఏ. సిలబస్ మార్చవలసి వచ్చింది. ఆధునిక సాహిత్య పాఠ్యనిర్మాణం నన్ను రూపొందించమని ఉపాధ్యక్షుల వారి ఆదేశం.

సిలబస్ చాలా మోడ్రన్‌గా ఉండాలన్నారు. అప్పుడు రాజమండ్రి విభాగం పీఠాధిపతి బేతవోలు రామబ్రహ్మం గారు. ఆయన మాటకు తిరుగులేదు. ఆయన ఆత్మీయ సహకారం నాకు అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది. సామాన్యంగా విశ్వ విద్యాలయాల ఎం.ఏ. పాఠాల్లో ఆధునిక కవిత్వం పేపర్లో నలుగురైదుగురు కవులకంటే ఎక్కువమంది కనిపించేవారు కాదు. కందుకూరి, గురజాడ, రాయప్రోలు, (ఉస్మా నియాలో కంపల్సరీ) కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఇక్కడితో సిలబస్ పూర్తి అయ్యేది. మహాఅయితే ఒకటి రెండు తిలక్ ఖండికలకు అవకాశం చిక్కేది. ఈ నేపథ్యంలో మన తడాఖా చూపించాలని కొత్త ఉత్సాహంతో, ధైర్యంతో సిలబస్ రూపొందించాను. 1910 నుంచి 1990 దాకా విభిన్న ధోరణుల్లో విస్తరించిన ఆధునిక కవిత్వాన్ని తయారు చేశాను. సరే సంఘసంస్కరణ కవిత్వం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం ఎలాగా ఉండేదే.



అనుభూతివాద కవిత్వంలో తిలక్, ఇస్మాయిల్, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణలు ఉన్నారు. ఆ తరువాత కాలానుగుణంగా వచ్చిన ఉద్యమాల్ని విద్యార్థులు తెలుసుకోవాలని భావించాము. దిగంబర కవుల మొదటి సంపుటం. అదే సమయంలో పుట్టిన పైగంబర కవులు, చేతనావర్తం కవులు, తిరగబడు కవులు... వీళ్ళ పరిచయాలు అవసరమని గుర్తించాము. ఆ తరువాత విప్లవకవిత్వం, విరసం మానిపెస్టో, శివసాగర్ 'ఉద్యమం నెలబాలుడు' పాఠ్యాంశాల్లో చేర్చాము. అయితే ఈమధ్య ప్రత్యేక అధ్యయనం కవులు కుందుర్తి 'తెలంగాణా', సినారె 'విశ్వంభర', దాశరధి 'అగ్నిధార', సోమసుందర్ 'వజ్రాయుధం', ఆరుద్ర 'త్వమేవాహం', బైరాగి 'నూతిలో గొంతుకలు', మో 'చితి–చింత', శేషేంద్ర దేశం–నా ప్రజలు' మొదలైన సుప్రసిద్ధ కవుల ప్రాతినిధ్య కవిత్వమూ ఉంది. ఎనభైనుంచి తొంభైలదాకా వచ్చిన కవిత్వ పరిణామాల్ని ఆయా కవుల ప్రత్యే కతల్ని దృష్టిలో పెట్టుకొని, అజంతా 'స్వప్నలిపి' (పుస్తకం రాకముందే), కె. శివారెడ్డి 'ఆసుపత్రి గీతం', దేవిప్రియ 'అమ్మచెట్టు', డా.ఎన్. గోపి 'చిత్రదీపాలు' ఆ తరువాత నందిని సిధారెడ్డి, శిఖామణి, జయప్రభ, పాపినేని, త్రిపురనేని శ్రీనివాస్, అఫ్సర్ మొదలైన ప్రతిభావంతులైన యువకవుల్ని వాళ్ళ కవితా సంపుటాల్ని చేర్చాము. అప్పటికి నా కొలమానం ఫ్రీవెర్స్ ఫ్రంటు అవార్డు అందుకున్న కవితా సంపుటాలు.

'అమ్మచెట్టు' పాఠం నేను చెప్పేవాణ్ణి. ఇంతకుముందే చాలాసార్లు చదివాను కాబట్టి ఎన్నో కవితలు నాలో గాఢంగా నాటుకున్నాయి. ముఖ్యంగా 'బల్బు మాడుతున్న దృశ్యం' కవిత ఆర్ద్రంగా ఉంటుంది. దాని పనితనం వెనక దయగల హృదయం ఉంటుంది. సాహిత్యపీఠంలో చదివిన ఇక్బాల్‌చంద్ ('ఆరోవర్ణం' కవి), ఖాజా ('ఫత్వా' కవి), సంగుబొట్ల సాయిప్రసాద్ ('పొగమంచు') ఇంకా వినోదిని, వెంకటరమణ, బెల్లి యాదయ్య, సంకేపల్లి శివప్రసాద్, మొదలైన కవుల్ని వాళ్ళ ఎదుగుదలల్ని చూసినప్పుడు గొప్ప సంతృప్తిగా ఉంటుంది.

అంతెందుకు పి.హెచ్.డి. అయిపోయికూడా డా. ఇక్బాల్‌చంద్ ఇప్పటికీ అడుగు తుంటాడు. 'సార్ 'అమ్మచెట్టు'లో ఓ మంచి కవిత గురించి చెప్పండని.' అప్పుడు నాకు పెద్దయ్యాకకూడా 'అమ్మచుట్టు' తిరిగే బిడ్డల ప్రేమ గుర్తుకొస్తుంది. అంతటి అనుభూతినిచ్చిన నీకూ, నీ 'అమ్మచెట్టు'కూ షుక్రియా, దేవిప్రియా.

"కవులు ప్రేమిస్తారు
*నిజానికి*
*వాళ్ళకి చేతనైంది*
*అదొక్కటే !*"

*('దేవి' 30 'స్వరపత్రం 2002 నుంచి)*



డా. విజయ్ కోగంటి

# కవిత్వంలో 'మరపురానివి'

కవిత్వాన్ని నిర్వచించడం చాలా క్లిష్టమైన విషయమే. అనేకమంది కవులు, విశ్లేషకులు, విమర్శకులు కవిత్వాన్ని అనేకరకాలుగా నిర్వచించారు. బోర్హెస్ అనే అర్జంటీనా కవి 'ది క్రాఫ్ట్ ఆఫ్ వర్స్'లో ఇలా చెప్తాడు.."ఒక రంగుని ఎలా నిర్వచించ లేమో, ఒక భావాన్ని - కోపాన్నో, ఆనందాన్నో ఎలా నిర్వచించలేమో కవిత్వాన్ని అలాగే నిర్వచించడం చాలా కష్టం. కవి ప్రత్యేక భాషలో వాటి గురించి మాట్లాడటమే కవిత్వం" అని.

కవి వ్యక్తీకరించే భాష కవిత్వం. ఇది కవి ఆలోచనా పరిధి, అనుభవాల పరిధి, భాష, భావవ్యక్తీకరణ సామర్థ్యపరిధినిబట్టి తగుతగు స్థాయిలని పొందుతుంది. తన అనుభూతి అనుభవానికి ఒక విశిష్ట శబ్దస్వరూపాన్ని కల్పించడం వల్లనే కవిత్వానికి ప్రాణప్రతిష్ట జరుగుతుంది. విశిష్ఠమైన కవిత్వస్థాయి మాత్రం ఎపుడూ ఓ పరమాద్భుత విశేషం.

అందుకే కవిత్వం ఓ చైతన్యజ్వాల కావాలన్నాడు శ్రీశ్రీ. ఏ ఆలోచనకు తావీయలేనిదీ, ఎలాగూ మనసును కదిలించలేనిదీ, ఇపుడు చదివితే మరోగంటకు మరుగున పడేదీ కవిత్వం కాలేదు. కవిత్వం జెన్ అనుభవంలా చదువరిని, శ్రోతని కొత్త లోకాల్లోకి మేల్కొలపాలి. శాశ్వతమై నిలిచిపోవాలి.

ఎలాంటివారు మంచి కవిత్వాన్ని వ్రాయగలుగుతారు? పసితనపు చూపు కలిగినవారు లోకాన్ని సరికొత్త చూపుతో చూడగలుగుతారు. పిల్లలను చూడండి, మనకంటే ఎంత విభిన్నంగా చూస్తారో. అలాగే కల్మషం లేనివారు, పారదర్శకత, స్వార్థచింతనపట్ల అసహనం, ఓ మంచి మార్పుపట్ల విప్లవహృదయం కలవారు మంచి కవిత్వం వ్రాయగలుగుతారు. 'దగ్ధత కలవారే కవులౌతారంటారు' పాపినేని. మంచి కవిత్వం వ్రాయడం ఒక నిరంతర తపస్సు. 'గుండెలో కన్నీటి చెమ్మను, అగ్నిపర్వతపు వేడిని అనుభవించగలవారు కవి కాగలరు' అంటారు హృదయవాదనగల కవి దేవిప్రియ.



వచనంలో కవిత్వాంశను చొప్పించగలిగినా వచనం కవిత్వం కాదు. వచన కవిత్వానికీ కవిత్వ స్వరూపం ఒక రూపంతోనే సాధ్యం. కవిత్వానికి వచనానికి మధ్య వున్న గీత చాలా పెద్దదేనని దానిని గుర్తించాలంటారు దేవిప్రియ. పతంజలిలాంటి ప్రముఖులు ఆయన్ని 'కవన మహాశిల్పి' అని వ్యాఖ్యానించారు. గాఢత, కాల్పనికత, శబ్దచిత్రణ ఆయన సొత్తు. దిగంబర కవుల ఆవేశాన్ని అనూహ్యమైన ప్రశాంతతతో కవిత్వీకరించగలవాడు దేవిప్రియ. కొద్ది కాలమే నిలిచినా సుగమ్‌బాబు, ఓల్గాలతో కలిసి పైగంబర కవిత్వ శకాన్ని మొదలెట్టిన కవి ఆయన.

ప్రపంచ ప్రఖ్యాత రచయితలను, వారి రచనలను పరిశీలించాక Roland Barthes అభిప్రాయపడినట్లు రచయితల / కళాకారుల బాధ్యతలను గుర్తుచేస్తూ దక్షిణాఫ్రికా నవలా రచయిత నదీన్ గోడిమర్ The Essential Gesture అనే పుస్తకంలో ఇలా తెలియచేస్తుంది : ప్రతి సృజనాత్మక కళాకారుడికీ కళా ప్రేమికుడిగా, సంఘజీవిగా రెండు ప్రధానమైన బాధ్యతలుంటాయి: 1. వ్యక్తిగతమైనది / కళకు సంబంధించినది. 2. సామాజికమైనది. ఈ రెండు అంశాలనూ కళాకారుడు మరచిపోరాదు. దేవిప్రియ కవిత్వంలో ఈ పై వుదహరించిన రెండు బాధ్యతలూ సమాన నిష్పత్తిలో కనిపిస్తాయి.

దేవిప్రియ కవిత్వంలో ఏముంటుంది? ఆయనే 'నా కవిత'లో చెప్పినట్లుగా...

*"లోపల యేదో మెదులుతుంది*
*ఆలోచనలలో యేదో కదులుతుంది*
*చదరంగం ఆడుతున్న మెదడులా*
*వ్యూహం పదపదానికీ*
*పరివర్తన చెందుతూ పోతుంది*
*నిరాకార భావనలు రూపుదాలుస్తాయి*
*అక్షరాలు ఎగిరి వెళ్ళి*
*దేని గడిలో అవి పడిపోతాయి*

*పరుసవేది పని చేయడం ప్రారంభమౌతుంది*
*రంగురంగుల కుంచెలు*
*నెమలి పింఛాలై నటనమాడుతాయి*
*గణితం రసాయనం అలంకారం కలిసిన*
*ప్రతిసారీ ఒక నూతన పద్యం పుడుతుంది*
*రహస్యంగా నాలో జరిగే ఒక అపురూప ప్రక్రియ*
*ఇక ప్రదర్శనకు సిద్ధమౌతుంది."* (1-2)



'అవతారిక' నందించిన శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య చెప్పినట్లుగా 'శబ్దాల్లో తొణికిసలాడే ఒక అపురూప ధ్వాని చింతన వుంటుంది.' ఒక వంటరితనమూ, ఒక నిశ్శబ్దమూ వుంటాయి. ఒక ఆంతరంగిక పరిశీలన, ఒక మౌనిలా పరిసరాల్ని పరికించే విధానముంటుంది. ఒక అక్షరాన్ని శబ్దాన్ని చేసే వైవిధ్యభరితమైన కవితా రసాయన ముంటుంది. ఈ కవిత్వ సంపుటి పేరైన 'ఇం...కొకప్పుడు'లాగే ఒక ప్రయోగ ప్రియత్వం, ప్రయోగశీలతా వుంటాయి. 'ఇం..కొకప్పుడు'లో ఏముంది? 'ఇప్పటి' కవిత్వముంది. ఎప్పటిలాగే ఆంతరంగిక సామాజిక సమస్యలపట్ల వేదనతోపాటు తనను నిలువెత్తు విషాదతరంగాన్ని చేసి విసిరేసిపోయిన తన సహచరి శ్రీమతి రాజ్యలక్ష్మి అనూహ్య నిష్క్రమణం వుంది. అది సృష్టించిన అంతులేని వేదన వుంది. కుదేలైపోయిన నిస్సహాయత వుంది. మనశ్శరీరాలలో అణువణువునా అల్లుకుపోయిన మరువలేని జ్ఞాపకాలున్నై. సూక్ష్మాంశాల్ని అనునిత్యమూ పరికించే ఎడతెగని వుత్సుకతా, ఆసక్తీ వున్నై. తన మరువని, తనదైన, సాధారణదృష్టికి అందని రాజకీయ సామాజిక సాంస్కృతిక అవధుల పరిశీలనకూడా వుంది. ఆత్మానుభవ దృష్టి వుంది.

75 కవితలున్న యీ సంపుటిని మూడు భాగాలుగా వర్గీకరించవచ్చు. 1. ఆత్మానుభవాలు – వ్యక్తిగతమైనవి. 2. సామాజిక పరిశీలనలు. 3. వాడని వీడని రాజ్యలక్ష్మిగారి జ్ఞాపకాలు.

ఆత్మానుభవాలు ఆశలు, నిరాశలు, వేదాంత ప్రశ్నలు అందిస్తే, సామాజిక పరిశీలనలు పురాణాలు, చరిత్ర, సమాజ పరిశీలన, కవిత్వ లక్ష్యమూ పరిశీలిస్తాయి. వాడని వీడని రాజ్యలక్ష్మి గారి జ్ఞాపకాలు కవి అనుబంధాన్నీ, ఒంటరితనాన్నీ, వేదననూ పంచిపెడతాయి.

ఇపుడు ఒకో అంశాన్నీ వివరంగా పరిశీలించే ప్రయత్నం చేస్తాను.

'భయప్రాయం' (34–35) అనే కవితతో యీ పుస్తకం ప్రారంభమౌతుంది. భౌతిక ఆంతరంగిక స్థితులలో కొన్ని కొన్ని సందర్భాలలో భయాన్ని కలిగించే, భయానికి లోనయే వయస్సును గురించి వాటి సందర్భాల గురించి ప్రస్తావిస్తుందీ కవిత. 'గాలి బిగదీయకముందే ఊపిరి ఆగిపోతున్నట్టయి పోవడం' నుంచి మొదలై 'జంకెరగని నడక ఇప్పుడు కొత్తగా తడబడుతున్నట్టుండడం' వరకూ వర్ణిస్తుందీ కవిత. మీరే చదవండి:

*"కలం వంటిమీద*
*సిరా చెమట చుక్కలు గుచ్చుకుంటున్నాయి*
*గాలి బిగదీయక ముందే*
*ఊపిరి ఆగిపోతున్నట్టయి పోతోంది,*

*ఊగుతున్న నీడలేవో*
*నామీద తూలి పడుతున్నట్టు*



*ఎన్నడూ చూడని రంగులేవో*
*నా ముందు చిందు లేస్తున్నట్టు,*

*ఎప్పుడూ వూహించని ఉప్పెన యేదో*
*పక్కన ఎక్కడో పొంచి వున్నట్టు*
*నేననుకుంటున్నట్టు నా గుండె*
*కొట్టుకుంటున్నది నా లోపల కానట్టు,*

*అవునేమో ఇది*
*మరొక మరణమేమో*
*అవునేమో ఇది*
*మరొక జననమేమో...!?*

కవి రెండు పదాలని గనుక వాడి వుండనట్లైతే ఈ కవిత పూర్తిగా వ్యక్తిగతమే అయివుండేది. కానీ కవి యీ ప్రస్తుత రచనాకాలంకూడా ఎంతటి భయప్రాయమో తెలియచేసేందుకు మొదటి రెండు వాక్యాల్లోనే సూచన చేస్తున్నాడు చూడండి:

*"కలం వంటి మీద*
*సిరా చెమట చుక్కలు గుచ్చుకుంటున్నాయి."* (ఇం..కొకప్పుడు,34)

'కలం వంటిమీద','సిరా చెమట' యీ కవితను వ్యక్తిగత పరిథుల్ని దాటించి చూపుతాయి. దీనితోపాటు 'కలంవళ్ళు', 'సిరా చెమట'లాటి పదాలు కవి ప్రయోగ శీలతనూ పట్టి చూపుతున్నై. ఒక మరణసదృశమైన స్థితిని అనుభవించి మళ్ళీ దాన్ని బయటినుంచి గుర్తించే ఇంకో జననస్థితిలోకి మళ్ళడంతో ముగుస్తుందీ కవిత. ఇటువంటి భావగాఢత దేవిప్రియ కవిత్వపు మొదటి లక్షణమని వేరే చెప్పక్కరలేదు.

ఇలాటిదే మరో కవిత 'కలిపేదేది?' (64) చాలా తాత్త్విక భావనతో సాగు తుంది. ప్రకృతిలోని అనేకమైన వాటిని కలుపుతున్నదేదని ప్రశ్నిస్తూనే, 'మనిషినీ మనిషినీ', 'మనిషినీ మరతుపాకీనీ' కలుపుతున్నదేదని ప్రశ్నిస్తాడీ కవి.

*"నదినీ కడలినీ*
*కలుపుతున్నది యేది?*
*మట్టినీ మొక్కనీ*
*కలుపుతున్నది యేది?*
*పువ్వునీ పరిమళాన్నీ*
*కలుపుతున్నది యేది?*
*దృష్టినీ దృశ్యాన్నీ*
*కలుపుతున్నది యేది?*



*(...)*
*మనిషినీ మనిషినీ*
*మనిషినీ మరతుపాకీని*
*కలుపుతున్నది యేది?*

ఈ కవితలో అకల్మషంగా ప్రకృతిలోని అంశాలను కలిపేవాటి గురించీ, కల్మషధోరణితో మనిషినీ మనిషినీ కలిపేవాటి గురించీ చాలా సున్నితంగా ప్రశ్నిస్తూ తేడాలను నర్మగర్భంగా చూపుతాడు. ప్రేమపూరిత, స్వార్ధరహిత ప్రకృతినీ, ప్రేమరహిత, స్వార్ధపూరిత మానవసమాజాన్ని కలుపుతున్న వాటి గురించి చెపుతూ స్వార్ధం, యుద్ధ కాంక్షలెలా మనుషులను కలుపుతున్నాయో తలచి వేదన చెందుతాడు.

క్లుప్తత మంచి కవిత్వానికి ఒకానొక లక్షణంగా పేర్కొంటారు. క్లుప్తంగా చెప్పడమే కాదు చాలా తేలికైన, పదునైన మాటలలో భావాన్ని వ్యక్తీకరించడం దేవిప్రియ కవిత్వ పరిపుష్టికి మరో వుదాహరణ.

మరో కవిత 'ఒంటరి వేకువ'ను ఇపుడు చదువుదాం. ఒంటరితనమూ, ఒంటరితనపు వేకువా రెండూ బాధాకరమైనవే. ఒక ఒంటరితనపు దిగులు, వగపు, లోతు, అదునులను వేటితో పోల్చగలం? కవి చూడండి ఎలా పోల్చుతున్నాడో:

*"ఈ దిగులు*
*భూమికన్నా బరువు*
*ఈ వగపు*
*ఏటికన్నా లోతు*
*ఈ కోత*
*కత్తికన్నా పదును*
*ఈ అదును క్షణంకన్నా కురుచ..."* (ఒంటరి వేకువ, 80)

ఈ పోలికలు ఏ సామాన్య కవికీ అందనివి. ఈ బాధను, కారణమై బాధిస్తున్న ఇతర అంశాలను ఏ ఇతర వ్యర్థపద వర్ణనలు లేకుండా కేవలం పోలికలతోనే లోతుగా వర్ణించడం ఒక ఎత్తైతే తన 'ఒంటరి వేకువ' స్థితిని కొన్ని objective correlatives ద్వారా స్థిరీకరించడం మరో అద్భుత విషయం. చూడండి ఎలా అల్లుకొస్తాడో:

*"ఇన్ని పక్షుల మధ్య*
*ఒక పిట్టపిల్ల ఏకాంత కువకువ,*

*ఇన్ని మబ్బుల నడుమ*
*ఒక మబ్బుతునక ఒంటరి మెలకువ*
*(...)*
*సుడిగాలిలో చిక్కిన పతంగం*
*పల్టీలు కొడుతూ దారం తెంపుకుని*

*దూరందూరంగా ఒంటరొంటరిగా...*

*ఎవరిని పిలిచేది యెంతకీ*
*తెలవారని ఈ రాత్రి వచ్చి*
*నా చిటికెన వేలు అందుకోమని...!?"*

'ఒక పిట్టపిల్ల ఏకాంత కువకువ, ఒక మబ్బుతునక ఒంటరి మెలకువ, తెగిన తారక యేతెంచే ఎవరూ నడవని దారి, కరిగి కన్నీళ్ళయిన కొండ మెట్ల దారి ఉప్పొంగే నదిగా మారడం, దారం తెంపుకుని ఒంటరొంటరిగా సుడిగాలిలో చిక్కిన పతంగం,' – ఎంత గాఢంగా కవిత్వవిషయాన్ని కరుణరసపు లోతులకు తీసికెళ్తున్నాయి! పైగా 'ఒక 'ఏకాంత' పిట్టపిల్ల కువకువ, ఒక 'ఒంటరి' మబ్బుతునక మెలకువ' అని 'ఏకాంతత్వాన్ని' పిట్టపిల్లకూ, మబ్బుతునకకూ విశేషణాలుగా చేయలేదు. 'ఒక పిట్టపిల్ల 'ఏకాంత' కువకువ, ఒక మబ్బుతునక 'ఒంటరి' 'మెలకువ' అంటూ అవి unconscious గా చేసిన 'పనుల' లక్షణాలుగా చేశాడు. అలా చేయడంతో కవిత మరింతగా చిక్కబడింది. ఎక్కడా కవితా వస్తువునుండి పక్కకు జరగక స్వచ్ఛమైన కవిత్వపు వుదాహరణగా నిలిచింది. ఇదే కదా కవిత్వ రసాయనమంటే!

ఈ మొదటి వ్యక్తిగతమైన వాటి కోవకే చెందిన 'న భయం'ను చర్చించాక సామాజికాంశాలను తాకే కవితలను చూద్దాం. చాలా క్లుప్తంగా శక్తివంతంగా చదివింపచేసే మరో కవిత ఇది.

'జలపాతాల ధారలు పట్టుకు ఊగుతూ దూకుతూ అరణ్యాలు దాటినవాడు, బతుకు చిరుతపులి మీసాలు పట్టుకుని ఒకచేత, ఒకచేత పుస్తకం పట్టి ముళ్ళకంపల్లో పల్టీలు కొట్టినవాడు' దేనికి భయపడతాడు?

దేవిప్రియ అంటాడు:
*"దేనినీ పొమ్మనను*
*పర్వతం పైకి ఎగిరి వచ్చినా,*
*ఆకాశం తలమీద నెర్రెలిచ్చినా,*
*సముద్రం కాళ్ళకింద మట్టిని తవ్వుకుపోయినా;*

*నిశ్చయం*
*నా నిర్భయం..*
*దేనికీ భయపడను..."* (82)

తన నిర్భయత్వాన్ని 'దేనికీ భయపడను, దేనికీ వెనుకాడను, దేనినీ పొమ్మనను' అంటూ మూడు కవిత్వ వాక్యాల్లో చెప్తూ వాటికి తగిన ప్రతీకలలో అందంగా పొదుగుతాడు. సాధారణంగా అరణ్యాలలో ఊడలు పట్టి దాటే వారిని చూస్తాం. కానీ దేవిప్రియ





జలధారలు పట్టి దాటినవాడు. ఆయన జీవితాన్ని తరచిచూస్తే అవి 'కన్నీటి జలధారలు' కూడా. బతుకు చిరుతపై సవారీ చేసినవాడికి ఇంకా భయమనేది ఉంటుందా?

ఈ కవిత ముగింపుకూడా అంతే అందంగా ఉంటుంది:

*"చంద్రుడు సూర్యుడిలా మండినా*
*సూర్యుడు పత్తికాయలా ఎండినా*
*దేనికీ భయపడను"*

పరస్పర వైరుధ్యాలను పక్కన చేర్చి కవిత్వీకరించడంతో ఆయన నిర్భయత్వం మరింత ద్యోతకమౌతుంది. నన్నడిగితే ప్రస్తుత యువత ఇలాటి మంచి కవిత్వం చదవక చెడిపోతున్నారనిపిస్తుంది.

* * *

ఇపుడీ సంపుటిలో సామాజిక అంశాలను స్పృశించే కొన్ని కవితలను చూద్దాం. పైన మాట్లాడుకున్నట్లుగా సామాజిక పరిస్థితులని కవిత్వీకరించకపోతే కవి తన కర్తవ్యాన్ని విస్మరించినట్లే.

'మనుషులు' (60) అనే కవిత రెండు రకాల మనుషులని విశ్లేషిస్తుంది. ఎన్నో 'రెండు' రకాలైన మనుషులు –

'మరణించినవాళ్ళు, మరణిస్తున్నవాళ్ళు', 'మంచివాళ్ళు, మంచివాళ్ళు కాలేకపోయినవాళ్ళు', 'గెలిచినవాళ్ళు, గెలవలేక పోయినవాళ్ళు,' 'అరణ్యాలు దాటినవాళ్ళు, దాటలేక పోయినవాళ్ళు', 'పూలతోటలుగా మారినవాళ్ళు, మారలేక పోయినవాళ్ళు,' 'తోడేళ్ళుగా మారినవాళ్ళు, మారలేక పోయినవాళ్ళు', 'మనుషులూ, మనుషులుగా మారలేకపోయినవాళ్ళు', 'తిరగబడిన వాళ్ళు, తిరగబడలేకపోయిన వాళ్ళు' – అని చెపుతూ "మనుషులు ఇప్పుడున్నది రెండే రకాలు : మరణించిన వాళ్ళు, మరణించబోతున్నవాళ్ళు..."గా ముగిస్తారు. మనుషుల్లోని మంచి చెడు తనాలతోబాటు, సాహస ప్రవృత్తిని, ధైర్యం కోల్పోయినతనాన్ని, అంతఃసౌందర్యాన్ని, అలాంటి సౌందర్య రాహిత్యాన్ని, విప్లవధోరణిని, పిరికితనాన్నీ, క్రూరత్వాన్నీ, పరమ సాత్విక లక్షణాన్నీ, ప్రపంచంలోని దిగజారుడుతనంపట్ల తాత్వికంగా తనదైన సున్నిత వ్యంగ్య ధోరణిలో కవిత్వీకరిస్తారు.

'కీర్తి' (75) అనే మరో కవిత ఇతిహాసాలను, చరిత్రను పరిశీలిస్తూ గత కీర్తిచంద్రికలు ఎవరికి పనికొస్తాయో పరిశీలిస్తుంది. కవిత ఎత్తుగడ రామాయణ భారతాలవంటి ఇతిహాస పాత్రలతో మొదలై భారతదేశ యుద్ధ చరిత్రను కలయదిప్పి ఒక ముగింపు కొస్తున్నదా అనే సంశయం దగ్గర అనూహ్యమైన మలుపు తీసు కుంటుంది. కవి ఒక ప్రశ్నను సంధిస్తూ గత కీర్తి ప్రయోజన మెవరికో తెలియచేస్తాడు.

*"పురాణ పురుషులూ లేరు*
*చరిత్ర నిర్మాతలూ లేరు,*



*చరిత్ర విజయాలూ వైఫల్యాలూ*
*సృష్టించినవారూ అనుభవించినవారూ*
*కాలధూమంలో కలసిపోయారు,*
*వారికేమి తెలుసు*
*తదనంతర పురాణాల గురించి*
*ఇతిహాసాల గురించి చరిత్ర గ్రంధాల ప్రస్తుతి గురించి?"* అని అంటూ ఇలా తెలియ చేస్తాడు:

*"వారసత్వ జాతులకే*
*సమూహాలకే, ప్రవాహంతో ప్రయాణం*
*కొనసాగిస్తున్న కొత్త తరాలకే*
*గత సాఫల్యాలు నవనవోన్మేషంగా ఊపిరులూదేది"* అంటాడు.

ఇంకా కొనసాగిస్తూ దిగంబర కవులు చాలా ఆవేశంతో ఉపయోగించే తీవ్ర భాషా పదజాలానికి బదులు అనూహ్యమైన తూనిక, ఓర్పుతో "విశ్వసౌప్తిక విగత మానవులకు కాదు" తేలిగ్గా అలవోకగా తన పైగంబరత్వాన్ని ప్రదర్శిస్తాడు.

భవిష్య పథాన్ని ఇలా సూచిస్తాడు.

*"చరిత్ర సారాంశ దీపికలు పైకెత్తి*
*నవేతిహాసాల తలయెత్తి*
*ముందుకు సాగిపోవలసింది మనమే!"*

అంటూ కవితను ఒక ఇతిహాసగాన స్థాయికి (epic song stature) తీసికెళ తాడు.

ఇలాటిదే మరొక అద్భుతమైన కవిత 'గోడలు' (88). కవి తనలోతాను మాట్లాడుకున్నట్లు మొదలై ప్రస్తుత సామాజిక రాజకీయ ఆర్థిక ముఖచిత్రాన్ని మహోన్నతమైన కాన్వాస్‌పై చిత్రిస్తాడు. డీ మోనిటైజేషన్ దుష్ప్రభావాలను, దానిని పట్టించుకోక నిమ్మకు నీరెట్టినట్టుండే నాయకుల గురించి, బడుగు జీవుల అమాయకతను గురించి ఆవేదనను వ్యక్తపరుస్తాడు.

*"పోలింగు క్యూలలో*
*బ్యాంకుల ముందు పడిగాపుల క్యూలలో ఎవరూ*
*రాపిడి రాజేయరు రవ్వలు ఎగరనీయరు*
*ఎవరి గోడలమధ్య వారు నిలబడి*
*తిరుమలనీ, షిర్డీనీ, అజ్మీరునీ, అమృతసర్‌నీ*
*మక్కానీ జెరూసలేమునీ తలుచుకుంటూ వుంటారు.*
*ఎప్పటిలాగే విలాస లాస్య యోగమూర్తులు*



*స్విట్జర్లాండ్, మారిషస్, పనామా సీమలకి*
*నిరాటంక నిర్భయ విహారాలు సాగిస్తుంటారు.*
*విఫల విప్లవ ప్రభుత్వాల చరిత్ర చెప్పి*
*వాళ్ళు మట్టి మనుషులను ఇటుక గోడల మధ్య*
*స్వచ్ఛంద కారాగారాలలో ఖైదు చేసి*
*పవిత్ర గ్రంథాలమీద ప్రమాణం చేయిస్తుంటారు.*
*...”*

అంటూ హృదయాన్ని గాయపరుస్తున్న నిజంపై ఓ పైగంబర శాసనమై నిప్పులు కురిపిస్తాడు.

‘అనాయక’ (100) అనే కవిత నాగరీకపు తొలి నాయకులనుంచీ మొదలై ఇతిహాస యోధులనీ చారిత్రక మత సాహిత్య రాజకీయ నాయకులనీ గతంనుంచీ వర్తమానందాకా మథించి ‘నాయకులు అనాయకులుగా’ ఎలా మారుతున్నారో తెలియచేస్తుంది.

*“ఇరవై ఒకటో శతాబ్దంలో, ఇక్కడ*
*ఈ నేలమీద యేమయింది...*
*మనుషులు మౌనులయ్యారు, వియోగులయ్యారు,*
*వీరులు సరిహద్దులలో ఎడారులలో మంచుకొండలలో*
*పాలక ప్రభువుల కోసం కుబేర సంతతి కోసం బంటులయ్యారు,*
*పండితులూ అర్థశాస్త్రజ్ఞులూ విశ్వవిద్యాలయాలలో బందీలయ్యారు,*
*వాచస్పతులు అవాక్కయ్యారు,*
*నవీన ప్రతినాయక ప్రచలనంలో*
*నాయకులు అనాయకులయ్యారు!”*

గమనించండి– ఎంత తీవ్రమైన నిరసన స్వరమిది? ఎంతటి బాధనుంచో వుత్పన్నమైన వ్యంగ్యమిది. ఒక దీర్ఘ వ్యంగ్య కవితను ఆసాంతం కవితా వస్తువు పట్ల గాఢత చెదరకుండా పట్టుకురావడం నిజంగా కత్తిమీద సామే!

ఇలా మనసును కదిలించే అసాధారణ సామాజికాంశాల కవితలతో పాటు ఇప్పటి ఒంటరి బాటసారి అయిన దేవిప్రియ జ్ఞాపకాల వేదనా వెచ్చటి కన్నీరై పలకరిస్తుంది. “గాయం నాకూ, మరణం నీకా రాజీ!” అని దీనంగా పుస్తకం తీయగానే పలకరిస్తూ కనిపిస్తాడు దేవిప్రియ. 2015లో ఆయన సహచరి రాజ్యలక్ష్మి జీవన్మరణ పోరాటం చేస్తున్నప్పుడు కవిత్వమే ఆయనకాశ్రయమిచ్చింది. “రెండు వెలుగులు ఉన్నట్లుండి రెండు చీకట్లుగా మారిపోయిన ఘోరాన్ని,” ఆమె జ్ఞాపకాలనే పదేపదే తలుస్తూ వ్రాసిన కవితలు హృదయాన్ని కరుణరసంతో నింపేస్తాయి.



"పరాయి ఇల్లు" (41) కవిత ఆమెలేని తన యింటినే ఎలా భయంతో చూస్తాడో చెపుతుంది. తానొక యంత్రమై పోయిన స్థితిని చెప్తూ....

*"నీ పిలుపులూ, నీ జ్ఞాపకాలూ,*
*డ్రెస్సింగ్ టేబుల్‌మీదా, గోడలమీదా, తలుపులమీదా*
*అతికించివున్న సూర్యబింబాలవంటి*
*నీ నుదుటి మందార వర్ణపు బొట్టుస్టిక్కర్లు*
*నన్ను సన్నసన్నగా ముక్కలు తరుగుతున్నాయి?"* వర్ణిస్తాడు. అన్నీ అందరూ రోజూ చూసే వస్తువులే అయినా ఒక ఆవేదనాభరిత స్థితిని పంచుకుంటూ నిలుస్తాయి. ఆ 'కత్తుల వంతెన'పైనుండి 'కన్నీళ్ళ వరదలో మునిగిపోకుండా' ఆమె కోసం ఎదురు చూసే శక్తినివ్వమని అడుగుతాడు.

అంతరాత్మై మెదిలి నడిపించిన సహచరి అదృశ్యం అంత తేలికగా మరువ కలిగింది కాదు. తన ఆత్మవ్యథని "ఆత్మ కవిత" (44)లో ఇలా వర్ణిస్తాడు.

*"నీ కోసమే ఎదురు చూసే ఆమె సుగంధం*
*గాలిలో వ్యాపించి ఎదురొచ్చి*
*నిన్ను ఆవరించుకునే ఆ అనుభవం నీ కింక*
*ఈ జీవితంలో మళ్ళీ తిరిగిరాదు;*

*బొట్టుబొట్టుగా నెత్తురోడుతూ*
*ఇక చాలించు ఈ పరుగు;*
*అది ముగిసిన అధ్యాయం."* అని వేదనతో ముగిస్తాడు.

ఇలా "అపరిమిత నరకం," "నువ్వక్కడ నేనిక్కడ," "వలలో చిక్కిన వాగు," "నువ్వులేని తొలి పెళ్ళిరోజు," "ఆగనిపాట," "ఒక అర్ధరాత్రి," "చోరిణి," "ఒంటరితనపు వల," "వేడుకోలు," "అద్వైత" – ఇలా అనేక కవితలలో వారి అను బంధాన్ని, ఆమెను కోల్పోయిన ఆవేదనను, ఆక్రోశాన్ని తెలియచేస్తాడు.

బోర్హెస్ అభిప్రాయ పడినట్లుగా ప్రతి కవితా చదువరి / శ్రోత అనుభవించ గలిగినపుడే పరిపూర్ణత సాధిస్తుంది. కవి భాష తన వుద్దేశ్యాన్ని నేరుగా తెలపగలగాలి. ప్రతి కవితా ఒక అద్భుత జ్యోత్స్నాద్యోతకమై (రెవలేషన్) వుండాలి. ఇవన్నీ దేవిప్రియ కవిత్వంలో నిర్దుష్టంగా గోచరిస్తై.

ఇంతేగాకుండా తేలికైన మాటల్లో వివరించలేని, అనుభవంతోనే పొంద గలిగిందీ ఐన ఒక ప్రతిఘటన, అణగారిన వర్గాలపట్ల ఒక దీక్ష, దేవిప్రియ కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తై...

'లక్ష్యగానం' (169) అనే ఈ కవిత చూడండి. ఎంత ఆశ, బాధ, ఉద్వే గమూ దాగున్నాయో. ఒక పరిణతి చెందిన కవిగా తనకేం కావాలో చెబుతాడీ కవి...



"నాకు
ఆస్ట్రేలియా అబోరిజనుల
ఆదిమూలాలూ కావాలి
దండకారణ్య సంతాన సంకేతాల
అమ్మల పొదులూ కావాలి

నాకు
పురాణ పురుషుల
పుట్టుపూర్వోత్తరాలూ కావాలి
మానవ వికాస వనంలో
పురివిప్పి ఆడిన వసంత యామినుల
చెరిగిపోని పాదముద్రల జాడలూ కావాలి
....
నాకు సకల జనుల
సమస్త జాతుల
శాంతి కావాలి
శాంతి కోసం
అనివార్యంగా
జరిగే యుద్ధమూ కావాలి;

ఎందుకంటే
నాకు అంతిమంగా
విరగపండిన జొన్నచేను మధ్యలో
మంచె మీద నిలువెత్తున నిలబడి
రివ్వున వడిసెల తిప్పుతున్న మనిషి కావాలి."

ఇలా మనుషులను మనసులనూ ప్రేమించే విశ్వశాంతి నభిలషించే దేవిప్రియ కవిత్వమంతా

"అచంచల ఆత్మవిశ్వాస వసంతాలుంటాయి
తడియారని శాశ్వత విషాదాలుంటాయి
నిత్యమూ మొలిచే చిరస్వప్న బీజాలుంటాయి"

కవిత్వ ప్రేమికులంతా తప్పనిసరిగా చదవాల్సిన కవిత్వ సంపుటి దేవిప్రియ 'ఇం...కొకప్పుడు'!

*('కవితా!'లో ప్రచురితమైన ఒక ప్రసంగ పాఠం)*



చేరా

# నీటిపుట్ట లాంటి దేవిప్రియ కవిత్వం

సుమారు 1970 నుంచీ – అంటే విరసం పుట్టిందగ్గర్నుంచీ అనుకోవచ్చు, కమిట్మెంటు అనేది ఒక సాహిత్య విలువగా ప్రచారంలోకి వచ్చింది. దీన్నే తెలుగులో నిబద్ధత అంటున్నారు. నిబద్ధత దేనికి అనే విషయంలో సూక్ష్మ స్థూల బేధాలెట్లాగూ ఉంటాయి. విరసం వారు విప్లవానికి నిబద్ధులయ్యారు గనుక నిబద్దత అనే మాట విప్లవనిబద్దత అనే మాటకు సంగ్రహ పర్యాయ పదం అయింది. అయితే విప్లవం విందు భోజనం కాదు. ఆకాశంనుంచి హఠాత్తుగా అవతరించేదీ కాదు. అందుకు రాజకీయ కార్యాచరణ ఒకటి నిరంతరం కృషి చేస్తుంది.

దానికి అనుబంధంగా సాంస్కృతిక కార్యానుసరణ ఏర్పడుతుంది. సాంస్కృతిక కార్యకలాపాలద్వారా అధిక సంఖ్యాకులను విప్లవోన్ముఖులను చెయ్యటం కోసం కొన్ని సాంస్కృతిక సంఘాలేర్పడతాయి. వాటి కలాపాల్లో ప్రత్యక్షంగా చేరే వాళ్ళుంటారు. చేరకుండానే, సంఘానికి వెలుపలఉంటూనే, వారి పద్ధతిలో చరించేవాళ్ళూ ఉంటారు. వారి పద్ధతులకు భిన్నంగా ఉండేవారు ఉంటారు. వీరిమీద సంఘపు వత్తిళ్ళూ, సంఘం మీద వీరి ప్రభావమూ ఉండొచ్చు. ఈ కారణంవల్ల నిబద్ధత స్వరూపంలోనూ, ఒక్కోసారి స్వభావంలోనూ బేధాలు కనిపిస్తాయి. ఇవి వారి చర్యల్లో ప్రతిఫలిస్తాయి.

నిబద్ధత పరిధిని స్పష్టంగా నిర్వచించి చెప్పలేము. అంతేకాక నిబద్ధతలో తరతమ బేధాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. ఇది అర్థం చేసుకోకపోతే ఒక్కోసారి కళాకారుని నిబద్ధత గురించి అసమంజస వ్యాఖ్యలు చెయ్యటానికి వీలుంది. ఒక్కోసారి రచయితలు నిబద్ధత గురించి వాగాడంబరంలో పోటీలు పడుతూ సాహిత్య వాతావరణాన్ని కలుషితం చేసే ప్రమాదం ఉంది.

తెలుగు కవిత్వ పరిశీలన చేసేవారు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోకపోతే పొరపాటు నిర్ణయాలు చేసే వీలుంది.



దేవిప్రియ ఇటీవల ప్రచురించిన 'నీటిపుట్ట' అనే కవితాసంకలనంలో ప్రగతి దృక్పథం, పీడిత జనపక్షపాతం, విప్లవాభిమానం అంత వెతకక్కర్లేకుండానే కనిపిస్తాయి. అందుకు ప్రేరణలను వెతికి పట్టుకోవచ్చు. అంతేకాదు. ఒక్కోసారి తన లోపాల్ని తనే కనుక్కొని విమర్శించుకునే నిజాయితీ ఉంది. వీటన్నిటిలోనూ వేదన ఉంది. కవిత్వం ఉంది.

ఒక్కమాటలో చెప్పాలంటే దేవిప్రియలో విప్లవనిబద్ధత ఉంది. విప్లవాడంబరం లేదు. ఉదాహరణకు టైటిల్ కవిత 'నీటిపుట్ట' (పేజి. 103) అనే ఖండిక చూడండి.

*ఒకసారి*
*నీలిదెకొలామ్ టేబుల్ మీద*
*పాలు ఒలికినట్టుండే ఈ మేఘాలు,*
*మరొకసారి*
*క్షయరోగి ఎక్స్‌రే ఫిలిమ్‌లా*
*ఎందుకు కనిపిస్తాయో*

అంటూ కాల భేదాన్నిబట్టి ఒకే వస్తువు రెండు రకాలుగా ఎందుకు కనిపిస్తుంది? అని ప్రశ్నిస్తూ...

*ఒకోసారి*
*మహా విప్లవ వాంఛా వివస్త్ర ప్రభంజనాన్ని*
*ఆహ్వానించే నేను*
*మరొకసారి*
*మానవతా ముఖమల్ ఆచ్ఛాదనలకింద*
*ఊపిరాడక*
*ఎందుకు విసనకర్రలు వెతుక్కుంటానో...*

అని తన ప్రవర్తనలోని వైరుధ్యానికి ఆశ్చర్యపోతాడు. (ఇక్కడ 'వివస్త్ర' అనే విశేషణం ప్రయోజనం తెలీటం లేదు 'నగ్న' అనే మాటకున్న స్ఫూర్తి దీనికి లేదు). ఎందుకు తన చిర సముపార్జిత సామాజిక జ్ఞానం రిఫ్రిజిరేటర్‌లో మంచుముద్దై మౌనం వహిస్తుందో అని బాధ పడతాడు. ఈ 'నీటిపుట్ట' అనే ఖండికను వైరుధ్యాల జంటలుగా మలచటంలో ఈ కవి ఎన్నుకొన్న మెటఫర్లు చాలా కొత్తగాఉండి వైరుధ్యాల గురించి ఆలోచింపచేస్తాయి.

కవికి ఈ రకపు ఆవేదన కలగడం అసహజం కాదు. ఈ సంశయాలు నిజమైనవి. శ్రీశ్రీగారి నిజంగానే అనే గేయంలో ఈ సంశయం కనిపిస్తుంది. ఒకసారి అనిసెట్టి సుబ్బారావు గారు–

అందరి కన్నం పంచే
అన్నలకే కానివాణ్ణి



అని ఆవేదన చెందుతాడు. ఇట్లాంటివే కవి నిజాయితీని పట్టిస్తాయి.

జీవితంలో అన్నివేళల ఆశావాదిగా ఉండటం సాధ్యం కాదు. కొన్ని క్షణాల్లో నిరాశ ముంచుకొస్తుంది. చుట్టూఉన్న మనుషులమీద విసుగేస్తుంది. కొన్ని పరిస్థితుల మీద అసహ్యం వేస్తుంది. అన్నీ వదిలేసి పారిపోవాలనిపిస్తుంది. ఇది తాత్కాలికమే కావచ్చు. కానీ ఆ క్షణానికి అత్యంత నిజం. అట్లాంటి స్థితిని వర్ణించే పద్యం ఉప సంహారం.

సొంత ఆలోచనలకీ, సొంత మెదడుకుండీలో పూచిన గులాబీలకీ.. గుల్ మొహర్లకీ, సొంత భావనవయొలిన్ మీద తీగసాగిన భావోద్రేక స్వరాలకీ, సొంత ప్రజ్ఞాఫలకంమీద ప్రతిఫలించిన సప్తవర్ణప్రతిబింబాలకీ, స్వీయ ప్రతిభా రసవత్తర ఆవేశంలో ప్రదర్శించిన సర్కసు ఫీట్లకీ, నాటకీయ అనృత సన్నివేశ అంధకార కల్పన లకు నెలవైన లోకానికీ, విలువల చంద్రవంకలకీ, చిత్తశుద్ధి సూర్యుళ్ళకీ సెలవు చెప్పి దూరంగా వెళ్ళిపోదామనుకుంటాడు. చిత్తశుద్ధితో నమ్మిన విలువలకు వ్యాఘాతం కలిగినప్పుడు సహజంగా మనసు వికలమవుతుంది. ఇల్లాంటప్పుడే కవి భావతీవ్రతతో చలించిపోతాడు. సాధారణంగా మెటఫర్ల ముసురు ఎక్కువైతే అసలు పద్యపు కాంతిని కప్పేస్తుంది. కాని దేవిప్రియ మెటఫర్ల అసాధరణత, అపూర్వత, అదనెరిగి చేసే ప్రయోగం, భావ తీవ్రతను కాంతిమంతం చేస్తుంది. దేవిప్రియ బాగా ప్రాక్టీసు చేసిన ఆర్టు ఇది.

అనంతమైన కాలంలో అనవరతమూ వచ్చే ఋతుచక్రక్రమం ప్రాచీనకాలం నుంచీ కవులను ఆకర్షిస్తున్నది. కాళిదాసు, కృష్ణదేవరాయలు, విశ్వనాధ సత్యనారాయణ, నాయని సుబ్బారావు, సి. నారాయణరెడ్డి తమ కావ్యాల్లో విశేషంగా ఈ వర్ణనలు చేశారు. ఈ వర్ణనల ద్వారా లోకవృత్తాన్ని ప్రదర్శించారు. అత్యాధునిక కవులు ఈ వర్ణనల జోలికి సాధారణంగా పోరు. కానీ దేవిప్రియ ఒకేఒక్క పద్యంలో ఋతువర్ణన ఆధునికంగా చేసి తృప్తిపడ్డాడు. అపూర్వ రూపకాలను వాడి కవితా ప్రియులను మెప్పించగలిగాడు. 'కిమ్ కాలమ్' అనే పద్యం చూడండి.

*భూమివయొలిన్ మీద*  
*వదులొదులుగా పడుకున్న నదితీగలని*  
*లాగి బిగించి శ్రుతి చెయ్యడానికొస్తుంది*  
*వానాకాలం,*  
*అరచేతుల అద్దాలలో*  
*చలిమంటలు చాచిన నాలుకలను చూసుకోడానికి*  
*హిమాలయాలమీద నుంచి*  
*పొగమంచు రెక్కలతో ఎగురుతూ వస్తుంది*



*శీతాకాలం,*

*పిడుగుల్లాంటి అడుగులతో*

*సూర్యుడినుంచి వేలాడే నిప్పులనిచ్చెన మీద*

*నేలకి దిగివస్తుంది ఎండాకాలం.*

ఎంత చక్కటి కవిత్వమో చూడండి. నిండుగా ఒడ్డులొరసి ప్రవహించే ఏర్లను బిగించిన వయొలిన్‌తీగలతో పోల్చటం సమర్థమైన పోలిక. అరచేతుల అద్దాల్లో చలిమంటల నాలుకలను చూసుకోటం తెలుగునాట పల్లెల సంస్కృతిని గమనించిన వారికిగానీ తోచదు. అరికంతాలు కట్టుకొని భోగిమంటలు కాగుతూ కాసేపు చలి మంటల దగ్గర కూర్చొని పనిలోకి వెళ్ళిపోయే దృశ్యం కళ్ళకు కనబడుతుంది. అరి చేతులలో చలిమంటల వేడిని పట్టుకొని కళ్ళకూ, చెంపలకు అద్దుకునే దృశ్యాన్ని దేవిప్రియ ఈ శీతాకాల వర్ణనలో పట్టుకున్నాడు.

చలికాలం హిమాలయాల నుంచి పొగమంచురెక్కలతో రావటం, ఎండలు పైనుంచి నిప్పులనిచ్చెనమీద దిగిరావటం అద్భుతమైన ఉత్ప్రేక్షలు. ఈ రకపు వర్ణనలలో పూర్వ (ప్రబంధ) కవులతో పోటిపడి నిలుస్తున్నాడు దేవిప్రియ.

అయితే ఇవన్నీ జరిగేది "పురుగుపట్టి కంకిరాలిపోయిన పొలంలో." ఈ ఒక్క మాటలో పల్లెల ప్రస్తుత స్థితినీ వ్యంజించాడు.

*నగరం నడిబజార్లలో*

*నాగజెముళ్ళు మొలుస్తున్న*

*ఈ రాష్ట్రంలో*

*ఇది ఏ కాలం?*

అని ప్రశ్నిస్తున్నాడు. "నాగజెముళ్ళు మొలుస్తున్న" అనేచోట ఋతుచలనంలేని ఎడారివంటి ప్రాంతం అని లక్షణార్థాన్ని గ్రహించాలి.

విప్లవధోరణి ప్రచారసరళినుంచి భావుకతవైపు మళ్ళిన దానికి దేవిప్రియ కవి త్వం ఒక స్పష్టమైన ఉదాహరణ.

'ఖాళీ కుర్చీలు' అనే కవిత చూడండి.

'నా ఎదురుగా

ఈ రెండు కుర్చీలు

మీరు కూర్చోనప్పుడు కూడా

నాతో మాట్లాడుతూనే ఉంటాయి'

అని కుర్చీలను పెర్సానిఫై చెయ్యటానికి ఈ పద్యం రాస్తున్నాడా? అనిపించేట్టు మొదలుపెడతాడు.



మీరు
నా కోసం
ఎక్కడెక్కడినుంచో
ప్రయాణించి, అలిసిపోయి వచ్చినప్పుడు,
ఈ రెండు కుర్చీలే
నా చేతులై, నా ఒడి అయి
మీకు సేద తీరుస్తాయి.

అని సాగించినప్పుడు –

ఆగుమాగుము తెరువరీ ఆ
యాస ఖేదమునపనయింపుము
మా గృహాంగణ ప్రాంగణమ్మున,
మధువులియ్యవిగో

అని కొడవటిగంటి వెంకట సుబ్బయ్యగారిలాగా భావకవిత్వపు ఆధ్యాత్మిక ఆతిథ్యపు గొడవలో పడుతున్నాడా అని అనుమానం కూడా వేస్తుంది.

మిత్రులారా
భుజంమీద తుపాకులతో
విప్పారిన ఆశానేత్రపత్రాలతో
అరణ్యాలై, ఆకాశాలై
ప్రకృతినిండా ప్రసరిస్తున్న
మీరు
ఈ రెండు ఖాళీ కుర్చీలలో
నాకు పదే పదే దర్శనమిస్తారు.

అన్నప్పుడు ఈ ఆతిథ్యపు స్వభావం ఆధ్యాత్మికం కాదని తెలుస్తుంది. అయితే ఇట్లా ఇంత సస్పెన్సుతో చెప్పాలా అని అడగొచ్చు. ఈ ప్రశ్నకు ఏకైక సమాధానం ఉండద న్నంతవరకే నా పాయింటు. కవిత్వం వైవిధ్యాన్ని వరిస్తుందని చెప్పటమే నా ఉద్దేశం. అయితే

ప్రభంజన పాదాలతో
గగనగంగాతీరం మీద
కోతకొచ్చిన ఎర్రచుక్కల చేనుకి
పహారా కాస్తున్న మీరు
క్షణమాత్రం అలా కూర్చోకపోతారా అని
ఎదురు చూస్తున్నాయి
నా ఖాళీ కుర్చీలు



అని ముగించినప్పుడు మళ్ళీ రవీంద్రనాధ్ టాగూరుగారి ఆధ్యాత్మిక ఆతిథ్యంలోకి దారి తప్పినట్టు కనపడతాడు. కాదని తెలుస్తున్నది కానీ టాగూరుగారి దారికి మరీ సన్నిహితంగా పోతాడు. దానివల్ల ఇది గౌరవ గీతం పరిధిని దాటి భక్తిగీతం అయ్యే ప్రమాదం ఉంది. ఒక్క దేవిప్రియ కాదు, విప్లవ ధోరణిలో వైవిధ్యం తీసుకు రాదల్చు కున్నవారంతా గుర్తించవలసిన ప్రమాదం.

అంతర్జాతీయ పరిణామాల ప్రతిస్పందనకూడా దేవిప్రియ కవిత్వంలో కనిపిస్తుంది. అందుకు ఈ పాటికే అందరి దృష్టినీ ఆకర్షించిన 'హిట్లర్ నవ్వు' ఒక ఉదాహరణ. కార్మికవర్గం త్యాగాలు చేసి నిర్మించుకొన్న సోషలిస్టు ప్రపంచంలో ఒకవైపు సోషలిస్టు వ్యతిరేక సంచలనం, మరోవైపు ప్రజాస్వామ్య వ్యతిరేక హింసాకాండ సోషలిస్టు సిద్ధాంతాభిమానులను తప్పకుండా కలవరపెట్టే అంశాలు. చైనాలో నిరసన ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులపైన టాంకులతో, మరఫిరంగులతో జరిపిన హింసాకాండను దృష్టిలో పెట్టుకొని హిట్లర్నవ్వు రచించాడు. ఈ మాటను రెండుమూడు రకాలుగా వ్యాఖ్యా నించవచ్చు. బెర్లిన్ గోడ కూలినప్పుడు, చైనాలో విద్యార్థులపై ఫిరంగులను పేల్చినప్పుడు నియంత హిట్లర్ నవ్వుతున్నాడనుకోవచ్చు. లేదా హత్యాకారకులైన నేటి సోషలిస్టు నాయకులు హిట్లర్లా నవ్వుతున్నారనుకోవచ్చు. రెండర్థాలూ ఉద్దిష్టం (Intended ambiquity) కావచ్చు.

'ఒక గుడిసె కథ' లో......

*ఈ పంచలో పరుచుకొన్న*
*నా పుస్తకాల పేజీల మీద*
*మా కోడిపెట్ట వేసిన రెట్ట చూసే*
*నేను తొలిసారి రంగుల రహస్యం తెలుసుకొంది.*

అన్న పదాల్లో, ప్రపంచావగాహన క్రమంలో ఒక దశను దేవిప్రియ ఎంత జాగ్రత్తగా భద్రపరిచాడు అని ఆశ్చర్యమేస్తుంది.

*పొగాకు కంపెనీ సైరన్ మోత విని*
*నాతల్లి తత్తరపడి లేచినప్పుడు*
*ఈ గుడిసెలో*
*నాకు తొలిసారిగా*
*కానరాని కన్నీటి సముద్రాలు*
*ఉప్పొంగుతూ కనిపించాయి.*

అన్నప్పుడు కవి వర్గమూలం తెలుస్తున్నది.

*అప్పుడే నాకు తొలిసారి*
*ఈ గుడిసెమీద కప్పిన రెల్లుపోచలు*
*బరిసెలై పోకూడదా అనిపించింది.*

అన్నప్పుడు వర్గ స్పృహ కనిపిస్తుంది.

దేవిప్రియ తన ప్రయాణాల్లో తరచుగా కవిత్వపు మూడ్స్‌లోకి పోతాడనుకుంటాను. ఈ ప్రయాణపు అనుభవాలు అతని కవిత్వంలో దృశ్యచిత్రణకు వైవిధ్య ప్రదర్శనకు పనికొచ్చాయి.



విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు కలిగిన అనుభవాలను ఒక మూడు పద్యాల్లో పట్టుకున్నాడు. “ఫ్లయిట్ ఐ.సి. 540” అనే పద్యంలో వాడిన మెటఫర్లలో, పోలికలలో దేవిప్రియ ఊహాశాలిత్వం కనిపిస్తుంది. ఇతనికి విమానం, రెక్కల దేవదూతలాగా, మాయతివాచీలాగ, యంత్రవిహంగంలాగా కనిపిస్తుంది. ఇవి కవి అనుభవాన్ని పట్టుకుంటాయి.

*‘ఆకాశంచెట్టుకి కట్టిన*
*అద్భుతమైన ఊయలలా వుంది విమానం’*

అనే ఊహ పరమభావుకుడైన కవి మాత్రమే చెయ్యగలిగిన ఊహ. సందర్భం వేరైనా ఎంకిపాటల్లో ఈ లైన్లు గుర్తొస్తాయి.

*ఎంకి ఊగెను కొమ్మ ఉయ్యాలా చంద్ర*
*వంక ఊగెను బొమ్మ ఉయ్యాలా.*

విమానం ఇతనికి ఉన్మత్త ఊహావేశ రూపసిలా కనిపిస్తుంది. తనకు కలిగిన ఊహావేశాన్ని ఈ ప్రయోగంద్వారా సూచిస్తున్నాడు.

విమానంనుంచి బయటకి చూస్తే ప్రపంచం ఎట్లా కనిపిస్తుందో ‘ఉడాన్’ ఐ.సి. 515లో వర్ణించాడు. నదులు జలతారురిబ్బన్లలా మెరిసిపోతూ కనిపించాయి. దరిద్రదేవత పవళించడానికి పరుచుకున్న రంగురంగుల పాతగుడ్డపేలికల బొంతలా కనిపించింది రాయలసీమ.

దేవిప్రియ కవిత్వం సావధానంగా చదవాల్సిన కవిత్వమేకాని తలబద్దలు కొట్టుకోవాల్సిన కవిత్వం కాదు. ఇతని కవిత్వంలో వైశాల్యం ఉంది. వైవిధ్యం ఉంది. ఊహాబలం ఉంది. ఉద్దిష్ట లక్ష్యం ఉంది. ఇది ఒట్టి నీటిపుట్ట గాదు. తళతళా మెరుస్తున్న మంచి కవిత్వపు నీటిపుట్ట.

శ్రీశ్రీని సినిమా కవి అనుకున్నట్టుగా, దేవిప్రియని రన్నింగ్ కామెంటరీ కవిగా మాత్రమే అనుకోవచ్చు. అది దేవిప్రియ బహిరాకారం మాత్రమే. అతని కవితాంతరంగం నీటిపుట్టలో కనిపిస్తుంది.

పుస్తకం అచ్చెయ్యటంలో దేవిప్రియ చేసిన జాప్యానికి (‘అమ్మచెట్టు’ తర్వాత పదకొండేళ్ళు!) కోపం వచ్చినా, ఇప్పటికైనా ఇంత బాగా అచ్చు వేసినందుకు ఆ కోపం పోతుంది.

*“నీటిపుట్ట”కు ముందుమాట*



నగ్నముని

# సాహస ప్రియదేవి

దేవిప్రియ నా మనసులో క్లోజప్‌లో కొచ్చే కొన్ని సాహిత్య సంఘటనలు ప్రస్తావిస్తా.

1965లో, నా సమాజం అష్టవక్రాలమీదా, రాజ్యం పెంచి పోషిస్తున్న దుష్ట వికృతాల మీదా ఆగ్రహ లావా చిమ్ముతూ వెలువడుతున్న దిగంబర కవిత్వం రోజుల్లో మరోవైపున పైగంబర కవిత్వాల సంకలనప్రకటన కవుల్లో దేవిప్రియ పేరు మొదట విన్నాను. పట్టలేని సంతోషం పొందాను. ఉద్యమకవిగా అలా పరోక్షంగా పరిచయం. తర్వాత, హైదరాబాద్ ఆధునిక రచనా ప్రాంగణంలో ప్రత్యక్షంగా పరిచయమై, చిన్నదయినా, పెద్ద పత్రికలతో పోటీ పడగల వారపత్రిక 'ప్రజాతంత్ర' సంపాదకుడిగా సన్నిహితుడైనాడు. దేవిప్రియ ప్రియదేవుడైనాడు. భవిష్యత్‌ను దర్శిస్తూ రచనలో విజృంభించాడు.

అది 1975 జూన్ 25 అర్ధరాత్రి కేంద్రప్రభుత్వ నియంత ఎమర్జెన్సీ విధించిన క్షణాలు. భారత ప్రజాస్వామ్యానికి గ్రహణం పట్టిన దుర్దినాలు. 18 నెలలపాటు దేశ మేధను చెరబట్టి, అణగదొక్కుతూ అటవికపాలన సాగించిన రోజులు. నా విశ్వాసాలు, అభిప్రాయాలు, ఉపన్యాసాలు, కవిత్వాలు, గిట్టని ప్రభుత్వంవారు – 1958 నుండి ఆంధ్రప్రదేశ్ లేజిస్టేటివ్ అసెంబ్లీలో నేను చేస్తున్న ఉద్యోగంనుండి కారణం చూపకుండా, కోర్టుకు వెళ్లే అవకాశం లేకుండా, నిర్దాక్షిణ్యంగా, బలవంతంగా బర్తరఫ్ చేశారు. ఆ చీకటి గడ్డురోజుల్లో ఓ సాయంత్రం నేనూ, దేవి సాహిత్య కబుర్ల మధ్యలో – ప్రజాతంత్రకి ఓ కథ రాసివ్వకూడదా – అన్నాడు దేవి. ఒక కథకాదు, కొన్ని కథలు వరసగా రాస్తానన్నాను. తప్పకుండా రాయమన్నాడు దేవి. ముందు, మూడు కథలు రాసియిచ్చాను. అవే మన రాజకీయ, సాంఘిక విలోమ విలువలపై రాసిన కథలు. దేవి సంతోషించి, ఒకవారం, రానున్న కథల గురించి ప్రకటించి, తరువాత



వారంనుండి విలోమకథలు ప్రచురణ ప్రారంభించాడు. మొదటి కథ అచ్చయి, పత్రిక మార్కెట్లోకి రాగానే, ఎమర్జెన్సీకి పహారా కాసే సెన్సార్ ఆఫీసర్లు 'ప్రజాతంత్ర' ఆఫీసుపై వాలారు. విలోమకథల ప్రచురణ వెంటనే ఆపెయ్యమని ఆజ్ఞాపించారు, లేకపోతే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.

సరే, సరేనంటూనే మరో రెండు కథలు ప్రచురించాడు దేవి. ఆ రోజుల్లో ఆ విధంగా చెయ్యడానికి చాలా సాహసం కావాలి. నా కథల విషయంలోనేకాదు. యితరుల రచనల విషయంలోకూడా, అప్పుడు దేవి కవిగా, రచయితగా, సంపాద కుడిగా సాహసంతో సహవాసం చేశాడు.

మరోసందర్భం, 1977 నవంబరు 19వతేదీ దివిసీమపై విరుచుకు పడింది తుఫాను ప్రళయం. నాలుగైదు జిల్లాలకు దీని ప్రచండ ప్రభావం కనబడినా, అది దివిసీమ ఉప్పెనగా ప్రసిద్ధి. వేలజనం శవాలుగా మారిపోయారు. పంట, కొంప, గోడూ సమస్తం కొట్టుకుపోయింది. గ్రామాలకు గ్రామాలు యిసకదిబ్బలకింద సమాధులైపోయినై. ప్రకృతి వికటాట్టహాసం చేసింది. ప్రళయంలో పూర్తిగా ప్రకృతిని అదుపులోకి తీసుకోవడం ఎవరికీ సాధ్యం కాకపోవచ్చు. కాని, ఆ తర్వాత కాలంలో ప్రభుత్వాల అత్యున్నత యంత్రాంగం ఏమి చేసిందన్నదే ప్రధానం. ఆనాడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బతికివున్న ప్రజలను ఆదుకోవడంలోనూ, జనజీవనాన్ని తిరిగి చక్కదిద్ద డంలోనూ పూర్తిగా విఫలమై, అసమర్థతతో, స్వార్ధచింతనతో, ఎన్నికల దృష్టితో, అవినీతికరమైన పనులతో వ్యవహరించాయి. ఇటువంటి భీకరమైన పరిస్థితులలోనే ప్రభుత్వాల సమర్థతా సమర్థతలు, దృక్పథాలు బయటపడతాయి. సమాజం ఎంత నిస్సహాయస్థితిలో వున్నదీ తెలుస్తుంది. ఈ సందర్భంగానే నేను 'కొయ్యగుర్రం' కావ్యం రాశాను. ఆ నెలలోనే, 1977 నవంబర్‌లోనే, ఆకాశవాణిలో అది ప్రసారమైంది. వెంటనే దేవిప్రియ విజయనగర్ కాలనీలోని తన నివాసంలో నా 'కొయ్యగుర్రం' పఠన కార్యక్రమం ప్రత్యేకంగా ఒక సాయంత్రం ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత, చాలాచోట్ల 'కొయ్యగుర్రం' కావ్యగానం నేను చేశాను. దేవిప్రియ 'కొయ్యగుర్రం' మొత్తం కావ్యాన్ని 'ప్రజాతంత్ర'లో ఒకే సంచికలో ప్రచురించాడు. దీనికి తన సంతోషం ప్రకటిస్తూ, కావ్యంపై గాఢమైన తన స్పందనను తెలియజేస్తూ చేకూరి రామారావుగారు ఒక లేఖ రాశారు. ఆ లేఖనుకూడా దేవి తన తరువాతి సంచికలో అచ్చువేశాడు. ఆ లేఖ, ఆ స్పందన–తదనంతర కాలాన 'కొయ్యగుర్రం' పుస్తకంగా తీసుకువస్తున్నప్పుడు, దీనికి 'ఆధునిక మహాకావ్యం' అనే శీర్షికతో ముందుమాటగా వెలువడడానికి దారితీసింది. అది తర్వాత ఆధునిక కవితారంగంలో అల్పపీడనకు దారి తీయడంకూడా అందరికీ తెలిసిందే. తెలుగు కవిత్వం తూచేటప్పుడు వ్యక్తుల యిష్టానిష్టాలు పక్కనబెట్టి, రాజకీయ, సామాజిక, తాత్త్విక, ఆధునిక, ఆధునికా నంతర రచనలను విశ్లేషించడానికి



అవసరమైన పరికరాలు లేకపోవడంవల్ల కూడా యిటువంటి గందరగోళాలు చోటు చేసుకుంటూనే ఉంటాయి.

దేవిప్రియ అనగానే నాకు – నవీన పత్రికా సంపాదకుడిగా, సమకాలీన కవిగా, రచయితగా, కవనమాధ్యమం ద్వారా దైనందిన సంఘటనా చరిత్రపై చెరగని కామెంటరీ చేసిన కమాండర్‌లా కనిపిస్తాడు.

*(దేవి '30' 'స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

***వీరులే యుద్ధానికి వెళతారు***
***వీరులే మెరుపులై మెరుస్తారు***
***వీరులే పిడుగులై కురుస్తారు***
***వీరులే అమరులై నిలుస్తారు...***
***కథలైనా రాద్దామా***
***ఆ గాథలైనా పాడదామా,***
***నాలుగు చుక్కలు సిరాపోసి మనం వాళ్ళ***
***కాళ్ళయినా కడుగుదామా...!***

(భద్ర చరిత : అరణ్యపురాణం)



సి. యస్. రాంబాబు

# జ్ఞాపకాల సెలయేరు

దేవానాం ప్రియ అని అశోకుడిని పిలిచేవారట
దేవతలకు ప్రియమైనవాడు అని
దేవిప్రియ మాత్రం అందరికీ ప్రియమైనవాడు
'గాలిరంగు' తెలిపిన ఘనుడు
గాలిలో తేలే అక్షరాలను
కవితాశరాల్లా ఎక్కుపెట్టిన విలుకాడు
'అమ్మచెట్టు'లా చల్లని నీడను అందరికీ పంచుతూ దారి చూపుతాడు
ఆలోచనలను దరిచేర్చే ఆధునిక కవితాశాల ప్రయోక్త
కవిత్వం జర్నలిజం స్క్రిప్టు రైటింగ్ రన్నింగ్ కామెంటరీ ట్రాకులపై
బతుకు బండిని నడిపిన ధీమంతుడు అతను
ఆ కళ్ళవెనక దాగిన
నీలి అంబరాలలో అనంతలోకాల అనుభూతులుంటాయి
అతని ఒక చిరునవ్వు
పండువెన్నెల్లో నడిచిన అనుభూతినిస్తుంది
రింగులు రింగులుగా ఎగిసిపడే ఆ జుట్టు
ఎంతమందినో తన జట్టుగా తయారు చేసింది
ఏడుపదుల కుర్రవాడతను
జనపథంలో జానపదనాయకుడిలా
జ్ఞానపథాన్ని చూపే కథానాయకుడు మా దేవిప్రియ
అందరికీ ప్రియమైనవాడు...

దేవిప్రియగారితో నా పరిచయం 2008 లో జరిగింది.. ఆకాశవాణిలో



వారిని ఈ వారం అతిథి కార్యక్రమంలో పరిచయం చేయటం కోసం వారిని హైదరాబాద్ మిర్రర్ పత్రిక ఆఫీస్‌లో కలిశాను. అదప్పుడు మా పక్క బిల్డింగులోనే ఉండేది. తొలి పరిచయంలోనే ఎంతో ఆత్మీయంగా పలకరించారు. ఎవరినైనా ఆయన ఆ కంఫర్ట్ జోన్లో కూచోపెడతారు. కవి సుధామగారు నిర్వహించారు వారితో పరిచయాన్ని. అలా రికార్డు చేస్తూ వారి బహుముఖీనత్వాన్ని తెలుసుకున్నాను. అన్నీ తెలిసి ఏమీ తెలియనట్టు అతిసామాన్యంగా ఉండటం వారి గొప్పదనం...

ఆ తరవాతి కాలంలో వారితో పరిచయం పెరిగి వారిలోని నిశిత పరిశీలనను గమనించే అవకాశం కలిగింది. నిర్మలమైన చూపు ప్రశాంతతను పోగు చేసుకున్న చూపులతో వారొక మౌనఋషిలా ఉంటారు. కవి శివారెడ్డిగారిని, వారిని నారాయణ గూడ తాజ్ మహల్ హొటల్‌లో చూసిన ప్రతిసారీ దేవిప్రియగారి చిరునవ్వు మనసంతా చుట్టేసివచ్చేది. ఆయన మాటకన్నా మౌనం విలువైనది. మౌనసంభాషణ వారు చేసినట్టు మరొకరు చెయ్యరు.. వారిపట్ల అభిమానం పెరుగుతూ వచ్చింది. అసలు వారికి చుట్టూ సన్నిహితులుంటే అదే దైవసన్నిధానం. అదే ధ్యానమందిరం. ఇప్పటికీ ఫోన్ చేయటం మరిచిపోతే ఎలా ఉన్నావయ్యావా అని ఆయన ఫోన్ రావలసిందే. అలా అని నిష్ఠుర మాడరు. సన్నగా వారి నవ్వు వాయుతరంగాల్లోంచి మనలోకి వ్యాపిస్తుంది. అది ఒక మౌనఋషి పరిణితవాణి.

కవిత్వం రాసినా, రన్నింగ్ కామెంటరీతో పాఠకలోకాన్ని కమ్మేసినా మనిషి కేంద్రంగానే ఆయన ప్రయాణం.. అది బహుశాః సాగుతూనే ఉంటుంది. జీవితంలో ఉద్వేగాలు సంవేదనల నడుమ ఆయన పలకరింపు వేసవిలో కురిసిన వానలా, వర్షర్తువు తొలి పరిమళంలా ఎంత హాయి గొలుపుతుందో వారితో పరిచయం ఉన్నవారికి చెప్పక్కర్లేదు...

కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న అనంతరం, హైదరాబాద్ ఆకాశవాణి స్టూడియోలో వారితో రికార్డు చేసిన వారి సాహిత్య ప్రయాణం ఎంత హాయిగా సాగిందో. మా పూర్వ సంచాలకులు డా.పి.ఎస్.గోపాలకృష్ణ, ప్రముఖ కవులు ఖాదర్ మొహియుద్దీన్, ప్రసాదమూర్తిలతో వారి ఆంతరంగిక సంభాషణ వారిలోని అనేక కోణాలను సున్నితంగా ఆవిష్కరించటమే కాదు.. శ్రోతల మన్ననను పొందింది.. కవిగా, జర్నలిస్ట్‌గా, గీతరచయితగా, డాక్యుమెంటరీ మేకర్‌గా, ఎన్నో అడ్వర్టయిజ్ మెంట్స్‌కు కాపీరైటర్‌గా ఆయన ఎన్నిపాత్రలు పోషించినా ఆయన అంతిమంగా సమూహంలోని ఏకాంతప్రియత్వాన్ని ప్రేమించే జ్ఞానఋషి.. రారమ్మని పిలిచే జ్ఞాపకాల సెలయేరు...



పున్నా కృష్ణమూర్తి

# దేవి 'ప్రియ' తరంగాలు

మిర్యాలగూడ పాతబస్టాండులో పేపర్ లచ్చయ్యషాపు కలిసివచ్చిన కొందరు యువకులు, విడివిడిగా మరికొందరూ అక్కడ గుమిగూడేవారు, "ప్రజాతంత్ర" బస్ పార్శిల్ కోసం ఎదురుచూస్తూ! 1974–75 ప్రాంతంలో మిర్యాలగూడ యువతరాన్ని దేవిప్రియ సంపాదకత్వంలో వెలువడే 'ప్రజాతంత్ర' ఏకం చేసింది. ప్రతి అక్షరమూ, బొమ్మా పలవరింపజేసింది.

దేవిప్రియగారి తొలినాటి అభిమానుల్లో టి.కె.శేషు, పి.సుబ్బారావు, దేవులపల్లి కృష్ణమూర్తి, చెన్నూరి నాగరాజు, కె.జె.రూతిన్, పి.సుదర్శన్‌లాంటి సీనియర్లేకాకుండా నాలాంటి ఆటో ఎలక్ట్రీషియన్, ఎన్. శ్రీరాములువంటి రైస్‌మిల్లు ఉద్యోగికూడా ఉండేవారు. చదువుతూ సిమెంట్ గూనల వ్యాపారం చేసే అజాజ్, రామలింగయ్య, శశిధర్, శర్మ, నర్సింగ్, ధనూ, విజయేందర్‌రెడ్డివంటి విద్యార్థులూ! సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన పురోగామిశీలురను ఏకం చేస్తున్న వాతావరణం అది. ఆ వాతావరణంలో విద్యుత్ ప్రసరణ దేవిప్రియ ప్రజాతంత్ర ! ఆ పత్రిక అనేక తొనల సుఫల!

టవరింగ్ ఇన్ ఫెర్నో గురించి రాసినా, షోలే గురంచయినా, మాస్ ప్రేక్షకుడిని క్లాస్ ప్రేక్షకునిగా, ఆర్ట్‌లవర్‌గా మార్చేవిధంగా రివ్యూలు వచ్చేవి. 'చెప్పుకోదగ్గమనిషి' శీర్షిక ద్వారా – జయప్రకాష్ నారాయణ్, నీరజ్.సి. చౌదరి, శివాజీ గణేశన్, ఖాజా అబ్బాస్ తదితరులు గురించి భిన్నంగా తెలుసుకొన్నాం.

కమలాదాస్ 'నాకథ' సెన్సేషన్ ! ఫలితంగా ప్రజాతంత్ర మిర్యాలగూడ సాహితీ మిత్రుల్లో స్పందన వచ్చింది. స్పందన సాహితీ ద్వారా చెన్నూరి నాగరాజు 'స్పందన' మాసపత్రికకు సారథ్యం వహించారు. వివిధ ఆలోచనా విధానాలుగల పెద్దలు స్పందన పత్రిక ఆవిష్కరణకు విచ్చేశారు. ప్రజాతంత్ర ద్వారా రంగనాయకమ్మ గారి "రామాయణ



విషవృక్షం” అభిమానులైన యువకుల తీరుకు కోపించిన లత ‘రామాయణవిషవృక్ష ఖండన’ రాస్తానని మిర్యాలగూడలోనే శపథం చేసారు. ‘తిరిగివచ్చిన కార్టూన్’ శీర్షికన రాగతిపండరి ‘స్పందన’ ద్వారా పాటకులకు పరిచయం అయ్యారు.

పేరున్న రచయితలు అనే ప్రయోగాన్ని త్రోసిరాజని, ‘విషయమున్న రచనలు’ అనే ప్రాతిపదికన రచయితలను ప్రోత్సహించారు దేవిప్రియ. అందులో భాగంగానే శేషు రాసిన ధలా, కదలిక అనే కథలు అచ్చేసి మాకు తెలిసిన శేషును సాహితీ ప్రపంచానికి పరిచయం చేశారు.

సమాజానందస్వామిగా, తర్వాతి కాలంలో రన్నింగ్ కామెంటేటర్‌గా దేవి వ్యక్తీకరణలు నిత్యనూతనాలు.

సామాన్యుడి స్థితిగతులను వర్ణిస్తూ – ‘వెన్న చేతికందని వెన్నెల’ అన్నారు. దశాబ్దాలుగా రాస్తున్న దేవీ – 30 చేతికీ వెన్న అంటలేదు ! పాఠకులకు వెన్నెల తప్ప! దేవీ, నీ ప్రియ తరంగాలు ఎన్నో, మేమంతా వారిమే!

*(‘దేవి’ 30 ‘స్వరపత్రం 2002 నుంచి)*

⚜

***నేను లేకుండాపోయి***
***శూన్యాన్ని సృష్టిస్తున్నా కదా,***
***సృష్టి శూన్య మెలాగ అవుతుంది?***
***తత్వమో వేదాంతమో***
***చింతనమో దర్శనమో***
***శూన్యశోధనమో***
***ఒక ఆలోచనతో నిండుతోంది కదా***
***ఇక శూన్యమేమిటి***
***మహాయోగులారా...?!***

(శూన్యసృష్టి : అరణ్యపురాణం)



*జింబో*

# ఆనాటి, మానాటి దేవిప్రియ

'ప్రజాతంత్ర' పత్రిక ద్వారానే దేవిప్రియ నాకు 1976 నుంచి తెలుసు. 1976, 77 ప్రాంతంలో ప్రజాతంత్రని రెగ్యులర్‌గా చదివేవాళ్ళం. చాలా ఇష్టపడ్డ పత్రిక. కాంటెంపరరీ విషయాలమీద 'సమాజనందస్వామి' కవిత్వం ఆ పత్రికలో వుండేది. ఆ విధంగా దేవిప్రియ తెలుసు. టాబ్లాయిడ్‌నుంచి 1/8 డెమ్మీవరకు ప్రజా తంత్ర తెలుసు. పత్రిక మొదటి పేజిలోని కవితనుంచి చివరి పేజి సమాజానంద స్వామి వరకూ ప్రతి వారం క్రమం తప్పకుండా చదివే వాళ్ళం. అప్పుడప్పుడే సాహిత్యం గురించి ఆసక్తి ఏర్పడుతున్న సమయం.

1977 ప్రాంతంలో మా వేములవాడలో 'నటరాజ కళానికేతన్' అనే సంస్థను నేను వఝుల శివకుమార్, రవీంద్ర, నడుబోయ చంద్రమౌళి ఇంకా కొందరు మిత్రులం కలసి స్థాపించాం. అప్పుడు చొప్పకట్ల చంద్రమౌళి సార్ మా వూళ్ళో లేరు. మైసూరులో వున్నారనుకుంటా. మా సంస్థ మొదటి మీటింగ్ అయిన తరువాత ఆయన తిరిగి మావూరొచ్చారు. ఆ తరువాత ఆయన్ని మా సంస్థకి సలహాదారుగా పెట్టుకున్నాం. మా సంస్థ పేరు గురించి ఆయనకు కొన్ని అభ్యంతరాలుండేవి.

నాకు బాగా గుర్తు. ఓ కవి సమ్మేళన కార్యక్రమం ఆగస్టు 1977లో ఏర్పాటు చేయాలని, ఆ కార్యక్రమానికి దేవిప్రియని పిలవాలని నేనూ, రవీంద్ర, శివకుమార్ అనుకొని చంద్రమౌళి సార్‌కి చెప్పాం. ఎవరీ దేవిప్రియ అన్నారు ఆయన. మేం చెప్పాం. ఆ తరువాత ప్రజాతంత్ర పత్రికలు ఆయనకు చూపించాం. ఆయన సరే నన్నారు. దేవిప్రియను పిలవడానికి నేను హైదరాబాద్ వచ్చాను. నాంపల్లి స్టేషన్ రోడ్‌లోని 'ప్రజాతంత్ర' ఆఫీసుకి వెళ్ళాను. దేవిప్రియని కలిశాను. విషయం చెప్పాను. మా సంభాషణల్లో సంస్థపేరు ప్రస్తావనకి వచ్చింది. దాని గురించి చర్చించవద్దన్నాను. ఆయన మా వూరు సభకి రావడానికి అంగీకరించారు. అయితే తాను ఎక్కువగా ఉపన్యాసం చేయలేనని, శివారెడ్డి బాగా మాట్లాడతాడని, యువకవులకి ఉత్సాహంగా



వుంటుందని ఆయన్ను పిలవమని చెప్పారు. అప్పటికి శివారెడ్డి గురించి నాకు తెలియదు. నాకే కాదు, మా మిత్రులెవ్వరికీ తెలియదు. దేవిప్రియే శివారెడ్డిని ఆ రోజు సాయంత్రం పరిచయం చేశారు. ఇద్దరినీ మా వూరికి ఆహ్వానించాను.

ఆగస్టు 1977 మొదటి వారంలో మా వూర్లో సభ జరిగింది. సభ జరిగింది అనే బదులు 'కవిసమ్మేళనం' జరిగింది అంటే బాగుంటుంది. మొదట కవిత్వం గురించి శివారెడ్డి మాట్లాడారు. ఆ తరువాత మా ప్రాంతం యువకవులందరూ కవిత్వం చదివారు. ఆ సభలో  మా సంస్థ పేరుకూడా ప్రస్థావనకి వచ్చింది. చివరగా చంద్రమౌళి సార్, దేవిప్రియ, శివారెడ్డి కవిత్వం చదివారు. ఆ తరువాత మామిడిపల్లి సాంబశివవర్మ తన పద్యపఠనం చేశారు. సభ వూగిపోయింది. కవుల కవిత్వంతో భీమేశ్వర సభా మంటపం తన్మయత్వం చెందింది. కవిత్వంగురించి చెప్పినదానికన్నా కవిత్వం చదవడాన్నే అక్కడున్న సాహిత్యాభిమానులంతా ఆస్వాదించారు. సభ తరువాత మా వూరి సాహిత్యాభిమానుల మధ్య మూడు నాలుగు అంశాలమీద చర్చ జరిగింది.

మొదటిది మా సంస్థపేరు గురించి దేవిప్రియ అభ్యంతరాలు లేవదీయడం మా అభిమానుల్లో చాలామందికి నచ్చలేదు. ఎందుకంటే మా వూరు వేములవాడ. అక్కడున్నది రాజేశ్వరస్వామి. కొంతమంది అభిమానులు దేవిప్రియ పేరు గురించి కూడా చర్చించారు. పేరు గురించి మీకెందుకూ కవిత్వం గురించి మాట్లాడండి అన్నాను మా మిత్రులతో. ఆయన కవిత్వంతో మాకు పేచీ లేదు. మన సంస్థ పేరు గురించి ఆయన మాట్లాడలేదా అన్నారు వాళ్ళు. కొన్ని పేర్లు భావంవల్ల, మరికొన్ని పేర్లు విచిత్రంగా వుండటంవల్ల తరుచూ చర్చలకు ప్రశ్నలకు గురవుతుంటాయి.

రెండవది – కవిత్వం గురించి – కొన్ని కవిత్వాలు గమ్మత్తుగా అన్పించాయి కానీ కవి హృదయం అర్థం కాలేదని అయితే ఆ విమర్శ దేవిప్రియ కవిత్వం గురించి మాత్రం కాదు. నిజానికి ఆయన కవిత్వం మా వూరి సాహిత్యాభిమానులు ఇష్టపడ్డారు.

మూడవది – సాంబశివవర్మ కవిత్వం – ఆయన సామాజిక పద్యపఠనం చేశారు ఆరోజు. హైదరాబాద్ కవులని ఆయన ఆశ్చర్యచకితులని చేశారని మా అభిమానుల అభిప్రాయం. నిజంకూడా అదే. ఎందుకంటే మేం భోజనాలు చేస్తున్నప్పుడు దేవిప్రియ సాంబశివవర్మ గురించి అడిగారు. ఆయన కవిత్వం, ఫోటో, ఆయన గురించి రాసి ప్రజాతంత్రకి పంపించమని కోరారు.

అదండీ ఈ 'సమాజానందస్వామితో' మా తొలి పరిచయం. దేవిప్రియతో నా పరియం గురించి మాత్రమే ప్రస్తావించాను. ఆయన కవిత్వం జోలికి నేను పోలేదు. అయితే చివరికి ఒక్క మాట చెప్పదలిచాను. ఆ రోజు మా ఊరిలో జరిగిన కవి సమ్మేళనంలో దేవిప్రియ కవిత్వం మా వూరి సాహిత్యాభిమానులు చాలా ఇష్టపడ్డారు. నేనూ అదే మాట చెబుతున్నాను.



*శిలాలోలిత*

# ఆయన ఒక నిశ్శబ్దస్వాప్నికుడు

మనుషుల్ని దూరంగా ఉన్నప్పుడు తెల్సుకోవడం కష్టం. ఎంత దగ్గరగా వెళ్తుంటామో అంత తెలుస్తూ పోతారు. సముద్రమూ అంతే. సముద్రం లాంటివారు దేవిప్రియ.

నిశ్శబ్దంగా కన్పిస్తుండే నిరంతర శ్రమశీలి. జీవితం అతలాకుతలం చేస్తున్నా చలించనివారు. ప్రణాళికలేవీ ముందుగానే సిద్ధం చేసుకోకుండా, జీవితాన్ని యథాతథంగా జీవిస్తారు. అతి సున్నితమైన స్వభావం, దేన్నీ లెక్కచెయ్యని తెగువ.

ఇప్పటివరకూ ఆయన జీవితకాలంలో సాయపడటమే బాధ్యతనుకొని, సాహిత్య వ్యవసాయంలో ఎన్నో చిన్నచిన్న మొక్కలకు నీరుపోసి, పాదు చేసి వృక్షాలుగా మలిచారు. ఎప్పుడూ ప్రతిఫలాన్ని ఆశించని 'అమ్మచెట్టు' ఆయన. ఆయన పని చేసిన సంస్థలు, పత్రికలు ఎంతమందిని వెన్నుతట్టి ప్రోత్సహించాయో వేరే చెప్పాలా! సాయం పొందినవారు, ప్రోత్సహించబడినవారు జ్ఞాపకం చేసుకుంటే చాలు.

తనలోని అంతర్గత మథనాల ఆనవాలుకూడా అన్యులకు చిక్కనీయని నిరంతరమైన 'నీటిపుట్ట'లా అన్పిస్తారు దేవిప్రియ.

నిశ్శబ్దంగా నడుస్తూపోయే చలనచిత్రమాయన. మనుషుల బలహీనతల్నీ, హిపోక్రసీని, పదవీ వ్యామోహాల్నీ, కీర్తిదాహాన్నీ, అవకాశవాదతనాన్నీ, అవార్డుల కోసం చేసే పైరవీల్నీ, వేదికల కోసం వెర్రిగా పరుగులు పెట్టేతనాన్నీ, మనుషుల్ని సోపానాలుగా చేసుకుని మర్చిపోవడమేకాక, వాళ్ళని నాశనం చేసేంతవరకూ నిద్రపోని వాళ్ళనీ, అందర్నీ ఒక విరాగితత్వంతో క్షమిస్తూపోయే సహనశీలి,

స్వతంత్ర మొచ్చిన తరువాత స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తూ జన్మించిన స్వేచ్ఛాగీతిక ఆయన. బతుకు 'రంగులకల'కు 'దాసి'గా కాక, పోరాటస్ఫూర్తితో 'రగులుతున్న భారతం'లాంటి జీవన నేపథ్యంలో 'గరీబు గీతాలు', 'సమాజానందస్వామి' లాంటి



కవిత్వంలో వ్యంగ్యాన్ని ఎంతో బలంగా పండించినవాడు. 'ఆరుద్ర' ఆనందించాడు. దేవిప్రియను హాయిగా అక్కున చేర్చుకున్నాడు. ఇంతేనా, దేవిప్రియ సృష్టించిన 'సాహిత్య కాలాలు' ఎన్నో. 'ప్రజాతంత్ర'లో 'సి.ధర్మారావు' గారితో 'విస్సన్నవేదం' 'ఆంధ్రజ్యోతి'లో 'చేకూరి రామారావు' గారితో 'చేరాతలు' వంటివే కాక, శ్రీశ్రీ 'అనంతం' రాయడానికి పూర్తిగా తెలుగులో తొలిసారిగా 'కమలాదాస్ మై స్టోరీ' అనువాదం చదివే అవకాశం కలగడానికి పాక్షికంగా కారణం దేవిప్రియగారే.

జనాన్ని పరిగెత్తించే రన్నింగ్ కామెంటరీలను రోజూ పూయిస్తూ, ఆలోచనాత్మక వ్యంగ్యాత్మక, రచనా విన్యాసాలు చేసి, సుమారు నాలుగు వేలకు పైగా 'రన్నింగ్ కామెంటరీలు' 'చల్తే చల్తే' వంటివి "గిన్నిస్ బుక్‌కు పంపగలిగితే రికార్డుగా నమోదు కాగలిగినన్ని రాశారు.

"నోరెండిన ప్రతిసారీ, బతుకు చెండాడిన ప్రతి సెకనూ, గాయం సలపరిస్తున్న ప్రతినిముషం, కవిత్వపు చెట్టే నీడనిచ్చి, సేదతీర్చి, ఒడిలో చోటిచ్చిందని అంటారు దేవిప్రియ.

కవిగా, ఎడిటర్‌గా, పాటల, మాటల రచయితగా నాటక ప్రయోక్తగా, విమర్శ కుడిగా, విశ్లేషకుడిగా, వ్యంగ్యకారుడిగా, బహుముఖీన సాహిత్య చైతన్యం ఆయన చిరునామా.

దుఃఖపు స్పర్శకు ఉండే తడి, గుండెను ద్వీపం చేసి, నీటి కొరడాలు కొడుతూ ఉంటే, కమిలిన గాయం గేయమైతే, అప్పుడు పుట్టిన పాటలాంటి వాడాయన.

అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫాను తుమ్మెద – ముప్పైఏళ్ళనాటి కృషి. కవితా సంపుటుల పేర్లలోనే ఒక విలక్షణత. ఒక భిన్నమైన మార్గం. కవిత్వానికి ఆర్ద్రమైన, సహజమైన ముడిసరుకులతో నింపి ప్రాణవంతం చేయడమేకాక నిర్వచనస్థాయికి కవిత్వాన్ని చేర్చినవాడు. "రెండు నేత్రాలలోనూ / రెండు సూర్యబింబాలు / బిగించిన పిడికిలిలో / కాగడాగా మండుతూ కలం / నేనే / నవతరం కవిని."

కవిత్వరూపం విషయంలో దేవిప్రియ అత్యంత శ్రద్ధాసక్తులు కనబరుస్తారు. ఆయన ఉపమానాలు, రూపకాలు విభ్రమకు, ఆశ్చర్యానికి లోను చేస్తాయి. "నన్నొక గాలిపటంగా మార్చి / శూన్యంలోకి ఎగరవేస్తున్నారెవరు / ఎవరోయ్ నన్నొక తన్మయ వేణువుని చేసి / ఊదిపారేస్తున్నారు" వంటి ఊహలతోపాటు 'శరీర మృణ్మయపాత్ర', 'ఫ్యానుపిట్టలు', 'వెన్నుపూసకలం', 'అలలధరాలు', 'కిరణాధరాలు', 'రైఫిళ్ళ పంట', 'సాయుధ సముద్రం', వెన్నెముకల ఉద్యమం', మెదడు ఏకునుంచి తీస్తున్న ఆలోచనదారం' 'బతుకు సూది బెజ్జం' వంటి పదబంధాలు దేవిప్రియగారి కవిత్వంలో కోకొల్లలు. వచనకవిత్వం ఒక స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంటున్న పరిణామ దశలో దేవిప్రియ తన ప్రయోగాలతో, ప్రత్యేకతలతో, పదబంధాలతో, భాషతో ఎంతో ప్రభావం చేశారనే విషయం ఎవరైనా అంగీకరించి తీరాలి.



అనేక పత్రికల్లో ఆయన కవిత్వ పాదాలు హెడ్డింగులుగా వాడుకునే స్థితిని చూస్తే ఆయన కవిత్వస్థాయి ఏమిటో వేరే చెప్పుకోవాలా? ఆయన రాసిన పాటల ప్రస్తావనకూడా ఇక్కడ అవసరమే. "జమ్‌జమ్మల్ మర్రీ, వేయి కాళ్ళ జెర్రీ"పాట, 'ముక్కలైన స్వప్నం ఇది నా దేశం కాదు, రెక్క తెగిన స్వర్గం ఇది నా దేశం కాదు', 'గురుతుందా నీకు, మరుపురాదు నాకు' వంటి పాటలు చూస్తే దేవిప్రియకి లిరిక్ మీద ఉన్న పట్టు తెలుస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తు. ఆయన 'The Music of a Battle-ship' డాక్యుమెంటరీ ఒక ఎత్తు. ఆయన డాక్యుమెంటరీ నిర్మాణానికి గద్దర్‌నే ఎన్నుకోడానికి కారణం ఆయన ప్రాపంచిక దృక్పథం. గద్దర్‌తో ఆయన అనుబంధం. స్పష్టంగా ఆయన తన మార్గంలోనే తాను పయనిస్తారనడానికి ఈ డాక్యుమెంటరీ నిర్మాణమే ఒక నిదర్శనం. తను ఎన్నుకున్న మార్గంలో ఒడుదుడుకులు వస్తాయని తెలిసికూడా, కష్టాల్ని, నష్టాల్ని ఎదుర్కోవాల్సివస్తుందని తెలిసికూడా ఆయన ఈ సాహసానికి పూనుకోవడం ఆయనలోని మొండి ధైర్యానికి ప్రతీక. అదే ఆయనను నడిపిస్తున్న ప్రధాన చోదకశక్తికూడా !

మనుషులు కనబడని ఈ కాంక్రీటు మహారణ్యంలో మలినమంటని ఈ 'అమ్మచెట్టు'ని మనం కాపాడుకుందాం.

*– ( 'స్వరపత్రం' 2002 నుంచి)*

***ఏటిగుండె స్ఫటికం,***
***అందుకే అక్కడ ప్రతిఫలిస్తాడు***
***ఎక్కడో***
***ఏనుగుమెడలో***
***వెండిగంటలా వేలాడే చంద్రుడు.***

(మెరుపులు : అమ్మచెట్టు)



నందిగం కృష్ణారావ్

# అసాధారణ కవి

'ప్రజాతంత్ర' వస్తున్న రోజుల్లో దేవిప్రియగార్ని నేను ఎరుగను. అయితే ఆ పత్రిక వెనుక దాగివున్న ఆయన హృదయాన్ని నేను ఎరుగుదును. ఆ పత్రికల్లో తమ రచనలు వెలువడాలని చాలామంది కవులూ, రచయితలూ ఆశించేవారు. ఆ పత్రికలో నా కథ ఒకటి అచ్చయితే ఆయన హృదయంలో నేను కాస్త చోటు సంపాదించుకునేవాణ్ణే అనుకొనేవాణ్ణి.

అయితే ఆయన హృదయం చాలా విశాలమైంది. అది అనేక లోకాల్ని తనలో ఇముడ్చుకోగలిగిందని ఆయన పరిచయంతో నేను గ్రహించాను. ఆయన సాధారణ మేధావి కాదు. ఆయన హృదయం వున్నవాడు. అందుచేతే ఆయన ఒక అసాధారణ కవి కాగలిగాడు. కళాకారుడు కాగలిగాడు. సంపాదకుడు కాగలిగాడు.

ఆయన మాటలకున్న శబ్దాన్ని చూశాడు. శబ్దం వెనుక వున్న సంగీతాన్ని విన్నాడు. పదఘటనల్లో, శబ్ద సంగీతంలో మైమరచి పోయాడు. అందుకే ఆయన 'సంగీత సూర్యుడు' అని బిస్మిల్లాఖాన్ షహనాయి గురించి అద్భుతమైన కవిత్వం రాయగలిగాడు. ఆ కవిత గురించి అప్పట్లో నేను ఫీలైంది – 'This piece of Art is something like having sex in a dream' అని! ఆయన కవితలు చాలా వరకు ఈ కోవకు చెందినవే. అందుచేత నా యీ అభిప్రాయం ఆయన కవితలన్నిటికీ వర్తిస్తుంది. ఆస్తి ఐశ్వర్యాల ముందూ, అధికారం ముందూ తలవంచడానికి అలవాటు పడ్డ మనకి మంచితనం, సహృదయతా, అణుకువల విలువ తెలియకుండా పోయాయి. దేవిప్రియగార్ని చదివినవాళ్ళు అట్టి విలువల్ని గ్రహిస్తారు.





మృణాళిని

# వ్యంగ్యప్రియ 'దేవి'

సృజనాత్మక సాహిత్యంలో అభివృద్ధి వ్యూహాలు అనేకం. వీటిలో వ్యంగ్యం చాల శక్తివంతమైనది. వ్యంగ్యం తాత్కాలిక ప్రయోజనం నవ్వించడం; దీర్ఘకాల ప్రయోజనం ఆలోచింపచేయడం. స్వచ్ఛమైన హాస్యం గిలిగింతలు పెట్టి ఊరుకుంటుంది. వ్యంగ్యం నవ్వించి, కవ్వించి, మోచేత్తో పొడుస్తుంది. తెలుగు సాహిత్యంలో హాస్య రచయితలు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. కానీ వ్యంగ్యం రాసినవాళ్ళూ రాయ గలిగినవాళ్ళూ అల్పసంఖ్యాక వర్గమే. ఈ 'అల్పుల్లో' అధికుడు దేవిప్రియ. ప్రక్రియ ఏదైనా (పద్యం, వచన, కవిత, గేయం) చక్కని వ్యంగ్యం పండించిన కవి దేవిప్రియ. దీనికి సాక్ష్యాలు 'గరీబు గీతాలు', 'రన్నింగ్ కామెంటరీ', 'సమాజానందస్వామి.'

పాత్రికేయ వృత్తికి, వ్యంగ్య, అధిక్షేప రచనకూ బాదరాయణ సంబంధం ఉంది. పత్రికారచనలో భాగస్వామ్యంవల్ల, ప్రపంచవ్యాప్తంగా జరిగే అన్ని విషయాలపై స్థూల, సూక్ష్మ అవగాహనలు కలుగుతూ ఉంటాయి. దానికితోడూ వాటిపై వ్యాఖ్యానించే 'కాలమ్' వంటిది నిర్వహించినపుడు దానికి వ్యంగ్యాన్ని మించిన సాధనం లేదు. ప్రజాతంత్ర, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ పత్రికల్లో వచ్చిన ఈ వ్యంగ్య రచనలు, పాత్రికేయ వృత్తికి, పత్రికా పాఠకులకూ దేవిప్రియ ఇచ్చిన అపురూపమైన కానుకలు.

వ్యంగ్యం రాయడానికి కవికి (అంటే రచయితకు అనికూడా) ఎన్నో లక్షణా లుండాలిగానీ, కనీసం మూడు ముఖ్యమైనవి ఉండాలి. అవి స్పష్టత, స్వంత దృక్పథం, నిర్భీతి. విషయం స్పష్టంగా అర్థమైనపుడే దాన్ని వెక్కిరించగలం. కాని ఆ కనీస పరిజ్ఞానం చాలదు. దానిపైన మనకో ఖచ్చితమైన అభిప్రాయం ఉండాలి. లేకపోతే హేళన చేయడానికి ఏమీ ఉండదు. ఇవి రెండూ ఉన్నా సంకోచం, భయం, మొహ మాటం ఉంటే కలం కదలదు. అందుకే నిర్భీతికూడా అవసరమే. దేవిప్రియలో ఈ మూడూ పుష్కలంగా ఉన్నాయి.



నగ్నముని గారన్నట్లు, "కాంటెంపరరీ సమాజం పైన కవిత్వం రాయడమేకాక, కామెంట్ చేయడానికి ఒకటి కాదు, రెండు కాదు, చాలా గుండెలుండాలి."

దేవిప్రియకు గుండె బహువచనంలో ఉందని ఒప్పేసుకోవచ్చు. ఆయన ఎన్ని రకాలుగా వ్యంగ్యం పోషించాడా అని ఆలోచిస్తే, ఆ వైవిధ్యానికి ఆశ్చర్యం కలుగుతోంది.

వ్యంగ్యంలో, అధిక్షేపంలో కామిక్, హైజిక్ అని రెండు రకాలుంటాయి. ఈ రెండింటి నిర్వహణలోనూ దేవిప్రియ సమర్ధుడే.

*'గుండెలెందుకు బాదుకోడం*
*పాల ధర పెరిగిందని,*
*పేద ప్రాణం రేటు మినహా*
*దేని ధర తరిగిందని'*

అన్నపుడూ...

*'బడ్జెటంటే ఎందుకోయి*
*బడుగు వాడికింత భయం,*
*ఇంకా, బతికున్నందుకు*
*పన్ను లేదు గురూ, నయం'*

అన్నప్పుడూ అందులో విషాదం, వ్యంగ్యం రెండు ఉన్నాయి.

*'ఆటో ఎక్కేముందే*
*అడగాలోయ్, ఏమని !*
*డ్రైవర్‌గారూ, తమరు*
*ఎటుగా వెళతారని'*

అనే హైదరాబాద్ నగర జీవితవాస్తవాన్ని చూపినపుడూ....

*'అన్న మెడలో దండ ఎందుకు*
*వేయలేదే ఏనుగా ?*
*అన్ని విడిచిన అపరజ్ఞానికి*
*దండ దేనికి దండగా'*

అని నటరత్నపై శబ్దాలంకారం విసిరాడు. స్వచ్ఛమైన వ్యంగ్యం అలరించే హాస్యం. అధిక్షేప దృష్టి రచయిత కుండాలేగాని, ఈ ప్రపంచంలో అసంగతాలకు, హాస్యాస్పదమైన వస్తువులకు ఏమాత్రం కొరతలేదు. తెలుగు యూనివర్సిటీ నుంచి సిఐఏ వరకు, క్రికెట్ నుంచి ఎన్నికల వరకు అన్నిటిపైనా, అందరిపైనా విసుర్లు కుమ్మరించిన దేవిప్రియ ఏ చిన్నవస్తువుకో తన రచనను పరిమితం చేసుకోలేదు.

వెక్కిరించడానికి, కాసేపు నవ్వించడానికి మాత్రమే పనికివచ్చేదైతే అది గొప్ప వ్యంగ్యం కాదు. అలా నవ్విస్తూ మనలో ఆలోచనను రేకెత్తించాలి. దేవిప్రియ వ్యంగ్యం

కేవలం వ్యంగ్యం కోసం కాదు. సమాజంలోని మన వ్యవస్థల్లోని, మన మనస్సుల్లోని కుళ్ళును, ద్వేషాన్ని ఎత్తి చూపడానికి. 'ఎమర్జెన్సీ' సమయంలో ప్రజాస్వామ్యం గురించి ఇలా అంటాడు.

*'సర్కసు చూస్తున్నప్పుడు*
*కనిపించిందోయి నాకు*
*మన భారత సర్కసులో*
*డెమోక్రసీ ముసలి పులిగ'*

అని మొదలుపెట్టి

*'కటకటాల నడుమ పులిని*
*వింతగా చూస్తారు జనం,*
*కనిపించని కటకటాల*
*మధ్యన పడివున్న మనం'*

అని ముగిసే ఈ కవితలోని వాస్తవం అన్ని దేశాలకు ఏదో ఒక కాలంలో వర్తిస్తుంది.

అలాగే, దళితులు అభ్యుదయం గురించి ఉపన్యాసాలు ఎంత శుష్కమైనవో చెబుతూ..

*'హరిజనాభ్యుదయము వలయు,*
*కానీ*
*పురమధ్యమునందు కాదు'* అంటాడు –

ఎంత కోపంగా రాసినా, కవిత్వగుణం వదిలిపెట్టని వ్యంగ్యం దేవిప్రియది. తుఫాను వచ్చినప్పుడు ప్రభుత్వం మొసలి కన్నీళ్ళని, ఆర్భాటాన్ని చూపెడుతూ,

*'హెలికాప్టర్ మీది నుంచి*
*సానుభూతి జల్లు,*
*తడిసి కూలిపోతున్నాయ్*
*మిగిలివున్న ఇళ్ళు'*

అని గొప్పగా వ్యాఖ్యానిస్తాడు. దాదాపు గ్రామమంతా తుఫానుకు కొట్టుకుపోతే, మిగిలివున్న ఇళ్ళు పాలకుల సానుభూతి జల్లుతో తడిసి కూలిపోయాయట.

దేవిప్రియ చీల్చి చెండాడిన విషయాలు, వ్యవస్థలు, వ్యక్తులు అసంఖ్యాకం. తెలుగు సినిమాలు, సినిమా పాటలు, దయ్యం నవలలు, ప్రణయనవలలు, కుహనా కవులు, బిరుదులు, సన్మానాలు, ఎలక్షన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, అవినీతి, దేవుడు, స్వామీజీలు, రాజకీయ నాయకులు ఇలా చెప్పుకుంటూపోతే బోలెడు. 'రన్నింగ్ కామెంటరీ' 'సమాజానందస్వామి' లలో పైన చెప్పిన వస్తువులన్నిటిని చక్కని, చిక్కని వ్యంగ్యంలో ఆవిష్కరించిన దేవిప్రియ 'గరీబుగీతాల్లో' అతి చిన్న విషయాలనుకూడా





ఆక్షేపిస్తూ, రమ్యమైన శతకాన్ని రచించాడు. వచనకవిగా సంపాదించిన కీర్తికి పద్య కవిత్వంతో మెరుగుపెట్టుకున్నాడు. సుమతి, వేమన వంటి అసాధారణ శతకకారులు గుర్తుకొస్తారు 'గరీబు గీతాలు' చదువుతుంటే.

*'నక్కకి శాకాహారము*
*కుక్కకి కుదురైన తోక, కుమతికి సూక్తుల్,*
*టక్కరికి సూటిదనమూ*
*లెక్కకి రావోయి యెపుడు లేత గరీబూ'*

కవిత్వానికి అందరూ చెప్పే అన్ని ఆదర్శాలకు, ప్రయోజనాలకూ దిష్టి తీసేస్తూ, 'పేదవాడికి శాలువ సుఖాన్ని' జోడించిన చమత్కార కవి దేవిప్రియ.

*'చలికాలం విసిరిన ఈ*
*వలలో పడి గజగజమని వణకకపోతే,*
*గిలికితె పద్యం చిన్నది*
*కలగద శాలువ సుఖమ్ము కాస్త గరీబూ'*

భాషపై, కవితా మాధ్యమంపై పుష్కలంగా అధికారంఉన్న కవి కనక, దేవిప్రియ వ్యంగ్యం అర్థానికే పరిమితం కాలేదు. శబ్దాల సార్థక వినియోగం ద్వారా ఆయన ఎంతో చమత్కారాన్ని సాధించాడు. కలలో బతికే పేదవాడికి ఏ భయమూ ఉండదని గొప్పగా వ్యాఖ్యానించిన పద్యమిది.

*'కలవారికి, ద్రోహగుణం*
*కల వారికి, రాజముద్ర కల వారికి, లా*
*కల వారికి కాని భయం,*
*'కల'వారము మనకు భీతి కలద గరీబూ'*

కందపద్యం నడకలో శ్రీనాథుడు, శ్రీశ్రీలను తలపించిన దేవిప్రియ, వస్తువు ఎంపిక, వ్యంగ్యం పోషణలో వేమనను గుర్తుకు తెచ్చారు.

దేవిప్రియ వ్యంగ్యం సమాజంలోని లోపాలను ఎత్తిచూపి, వాటిని సంస్కరించాలనే లక్ష్యంనుంచి పుట్టింది. తన కవితలకి ఎంచక్కని బొమ్మలేసిన కార్టూనిస్టులతో కలసి, ఆయా పత్రికలకు పాఠకుల సంఖ్యను ఆయన పెంచాడని ఖచ్చితంగా చెప్పొచ్చు.

చక్కని వ్యంగ్యానికి సార్థకత – దానికి కేంద్రమైన వాళ్ళు తమ నిజరూపాలను తెలుసుకోగలిగినపుడు. రాజకీయనాయకుల గురించి అతి తక్కువ మాటల్లో అద్భుతంగా వ్యాఖ్యానించిన ఈ కవితకు ఉలికి పడని వాళ్ళుండరు.

*సింహాలకు*
*జూలుండును*
*సిన్మాలకు*





క్యూలుండును
మనిషికి ఒక
రూలుండును
'పోలి(ట్రిక్సు)' కే ముండును !
భీరువులకు
భీతుండును
వీరులకొక
నీతుండును
జూదాలకు
రీతుండును
పొలిటికులకు
ఏముండును ! (సమాజానందస్వామి)

వస్తు రూపాల్లో చైతన్యం, సజీవత్వం నిండిన దేవిప్రియ కవిత్వ వ్యంగ్యం హృదయాన్ని తాకుతుంది. బుద్ధినీ పదునెక్కిస్తుంది. వ్యంగ్యం సిసలైన ప్రయోజనం అదే.

*(దేవి '30' 'స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

***స్త్రీ, సహోదరీ, సతీ,***
***కాలే పెనం మీద***
***రాలిన నీటిబిందువా,***
***పురుషాధిపత్యం చేత***
***అపహరించబడిన చరితా, మాతా,***
***ఈ సాగరాలూ, సరస్సులూ,***
***ఈ జలపాతాలూ, వాగులూ,***
***ఈ పాతాళగంగలూ, జలాశయాలూ,***
***గుక్కెడు నీ చనుబాలు లేనినాడు***
***ఎందుకమ్మా, వృథావృథా! కాదా కాదా!***

(అపహరించబడిన చరిత : అమ్మచెట్టు)



కాకరాల

# సినీ దేవి 'ప్రియ' దర్శనం

సినిమా కినిమాకి సమానార్థకంగా రూపొందింది. కినిమాకి 'పురోగమనం' అన్న అర్థం వుంది. మూకీగా మొదలైంది టాకీగా విస్తరిస్తోంది. ప్యాపులర్ సినిమాగా ప్రారంభమైంది రియలిస్టిక్ సినిమాగా వృద్ధి చెందుతోంది. ఈ కళారూపం తెలుగులో పాప్యులర్ సినిమాగానే ప్రారంభమైంది. చాలాకాలం ఆ కక్ష్యని దాటలేదు. ఇతర భారతీయ భాషల్లో రియలిస్టిక్ సినిమా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించుకున్నాక, తెలుగులో రూపొందినా అది అంతర్వాహినిగానే వుండిపోయింది.

విశ్లేషించుకుంటే ఇందుకెన్నో కారణాలు కనిపిస్తాయి.

వాటిల్లో ఒకటి –

సినిమా అనేది నిర్మాతకి వ్యాపారం. దర్శకుడికి కళ. వ్యాపారానికీ, కళకీ వంతెనగా వ్యవహరించగల నిర్మాత దర్శకుల చేతుల్లో అది వున్నంతకాలం దాని నిర్మాణ శిల్పం వృద్ధి చెందుతూవచ్చింది. ఏభైల్లో కొస్తూనే కనబడని ఆ వంతెన కూలే క్రమం మొదలైంది. పూర్తిగా పెట్టుబడి కమేండ్లోకి పోతున్నకొద్దీ తెలుగుసినిమా – ఫార్ములాకి పరిమితమైపోతూ తన వ్యక్తీకరణ శక్తియుక్తుల్ని కోల్పోతూ వస్తోంది.

పందొమ్మిదొందల ఏభైల్లోనే మొదలైన ఈ క్రమం అరవైల్లో, నేను సినిమా రంగంలో అడుగుపెట్టేనాటికి 'ఇంతై అంతై వటుడింతై' అన్నట్టు ఆకాశం హద్దుగా ఎదిగిపోయింది. నేను సినిమా రంగానికొచ్చిన పదిపన్నెండేళ్ళకి దేవిప్రియ మద్రాసు కొచ్చి నాకు పరిచయమయ్యాడు. అప్పటికే పైగంబరకవిగా అతను సుప్రసిద్ధుడు. అతను "నా అరచేతికి స్వరపేటిక వుంది. లేకుంటే నాకలం నుంచి ఇన్ని శబ్దచిత్రాలు, ఇన్ని భాషాస్వప్నాలు కాగితం మీదకి గలగలలాడుతూ ఎలా కదిలివస్తున్నాయి"! అన్న ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టాడు.

నాకు కవిత్వంతో, మిగిలిన సాహిత్యకళాప్రక్రియలతో కాస్తో కూస్తో పరిచయం వుంది. కానీ – నేను కవిని కాదు, రచయితనీ కాదు, నటనతో కొంచెం లోతైన

పరిచయమే వుంది గాని పూర్తిగా వినియోగించుకునే అవకాశాలు రాలేదు. ఆ అసంతృప్తి సెలేసి మనసులో సన్నగా సలుపుతూ వుండేది.



*"నాకు*
*రెండు నిధులున్నాయి -*
*నాలుకమీద కవిత్వం,*
*తలమీద దారిద్ర్యం !*
*నాకు*
*రెండు విధులున్నాయి*
*కవిత్వనిత్యనిబద్ధం*
*దారిద్ర్య విముక్తి యుద్ధం"* అని కవితాత్మకంగా అతనే అన్నాడు.

బహుశా అప్పటికి ఇద్దరం ఒకే పరిస్థితిలో వున్నాం. నాలో లేని 'నిధులు, విధులు' అతనిలో నాకు కనిపించినందువల్లేమో తొలిచూపునుంచి ఆత్మీయంగా కలసిపోయాం. అక్షరగతమైన నా ఆలోచనల్ని అంతకుముందే తొలిసారి 'అచ్చేసి' ఎ.బి.కె. వదిలితే, నాలో నిద్రాణంగావున్న రచనోత్సాహానికి ఎన్నో అవకాశాలిచ్చి పెంచిపోషిస్తూ వచ్చాడు దేవిప్రియ. ఆవిధంగా నాలోని నటన,రచన, అభివృద్ధి చెంద డానికి ప్రాణవాయువులాంటి ఆత్మవిశ్వాసాన్ని అందిస్తూ వచ్చాడు. ముప్ఫయేళ్ళుగా అతనితో, అతని కవిత్వం పెనవేసుకున్నట్టే మా స్నేహంకూడా పెనవేసుకుంది.

సరైన సమయానికి ఆత్మవిశ్వాసాన్ని యిచ్చిపుచ్చుకున్న ఆత్మీయ స్నేహం మాది. ప్రతి మనిషిలో 'ప్రియం అప్రియం' వుంటాయి. విజ్ఞులు ప్రియాన్ని స్వీకరించి అప్రియాన్ని విస్మరిస్తారు. ఇందుకెవరూ మినహాయింపు కాదు. అతి సన్నిహితంగా సాగిన మా స్నేహంలో మేం అందరితో అలాగే మసిలాం. ఆ రోజుల్లో దేవి'ప్రియ' దర్శనం నాకు అనేక రూపాల్లో అయింది.

అతను వచ్చిన కొత్తల్లోనే కవిత్వాన్ని - వచనమైనా ఛందోబద్ధమైనా - అవలీలగా చెప్పేవాడు. అంతే సునాయాసంగా - ట్యూనుకిగాని లయబద్ధంగాగాని-పాట రాసేవాడు. అనిసెట్టి సుబ్బారావుగారి దగ్గర అనిసెట్టి అప్పారావుగారితో కలసి పని చేసినపుడు అనువాద చిత్రాలకి కవిత్వాన్ని - వచనమైనా ఛందోబద్ధమైనా - అవలీలగా చెప్పేవాడు. అనువాద చిత్రాలకి స్వతంత్ర రీతిలో, 'సింకుకి' సరిపోయేలా మాటలు, పాటలు అంతే సులువుగా రాయగల్గడం నేను చూశాను. వీటిన్నిట్లో తేటతెలుగు జీవధార అతిసహజంగా ఆవిష్కరించబడుతూ వుండేది.

ఇంతేనా? నాకు తెలిసి "సెంట్రీ"తో ఆరంభించి "ఆడతోడు - మగనీడ" "సీతా ఓ సీతా" లాంటి విలక్షణమైన నాటికలు రాశాడు. ఇవిగాక నే రాయమని అడిగితే ఒక పంజాబీ నవల ప్రేరణగా "త్రినేత్రం" అనే పెద్ద నాటకం రాశాడు. అలాగే అతను రాసి 'వేకువ'లో ప్రచురించిన "గొడ్డళ్ళులేవాల" చూసి, చైనా బేలే



"ఫిషర్మెన్స్ రివెంజ్" ప్రేరణతో ఆట పాట నాటక మిశ్రమంగా నూతన దృశ్యరూపకం "మనం బాంచలం" రాశాడు. ఇది నిత్యానందమనే సంగీత దర్శకుని ద్వారా స్వరకల్పన జరిగి రిహార్సిల్సు చేసి, ప్రదర్శనకి రాజకీయ పరిస్థితులు కలిసిరాక ఆగిపోయింది. అలనాటి ప్రజానాట్యమండలి నటుడు పెరుమాళ్ళు, యువ నాటక ప్రయోక్త ధవళ సత్యం ఇందులో చురుకుగా వున్నారు.

వీటిలో, దురదృష్టవశాత్తు నవంబరు తుఫానులో నేనున్న యింట్లోకి మొల్లోతు నీళ్ళొచ్చి, "త్రినేత్రం" "మనం బాంచలం" రాతప్రతులు తడిసిపోయి పనికి రాకుండా పోయాయి. కానీ "సెంట్రీ" "ఆడతోడు – మగనీడ" "సీతా ఓ సీతా" నాటికలు ప్రచురితమై బహుమతులందుకున్నాయి. సినిమాకి ఏదో ఒకరూపంలో పనికొచ్చే నాబోటివాళ్ళకి అవకాశాలు రాకపోవడం అసహజం కాదు. సినిమా నిర్మాణ విద్యకి సంబంధించిన సాహిత్య కళారూపాల నిర్మాణ రహస్యాల్ని 'సాంగోపాంగంగా' నేర్చిన దేవికి అవకాశాలు రాకపోవడం అప్పుడు నాకు ఆశ్చర్యంగా వుండేది.
అతనే ఓ కవితలో అన్నట్టుగా :

*"బతుకు కవిత్వమంత సాఫీగా సాగదు*
*ఒక క్షణం విమానం*
*గాలిలోకి లేవడానికి పరిగెత్తే రన్‌వే*
*మరుక్షణం పాదాలకి రంధ్రాలు పొడిచే కంకరరోడ్డు"*

నాకు తెలిసి ఆనాటినుంచి ఈనాటిదాకా అతని బతుకు సాఫీగా సాగలేదు. రన్‌వే, కంకర రోడ్లమీంచి "పడిలేచే కడలితరంగంలా" మదరాసు హైదరాబాదుల మధ్య వూగిసలాడి, చివరికి హైదరాబాదులో నిలబడింది. ఈ పడిలేచే ప్రస్థానంలో కవిగా సాహిత్యంలో, జర్నలిస్టుగా పత్రికల సంపాదక బాధ్యతగా సాధించిన మైలు రాళ్ళు, పెట్టిన కొత్త ఒరవళ్ళు అందరికీ తెలుసు. ఇక్కడ ప్రత్యేకం చెప్పక్కర్లేదు.

సినిమాకి సంబంధించి దేవి మద్రాసులో సీతారామరాజు, చెరుకూరి జనార్ధన రావు కలసి ధవళ సత్యం దర్శకత్వంలో తీసిన "జాతర" నిర్మాణంతో సన్నిహితంగా వున్నాడు. హైదరాబాదులో "రంగులకల", "దాసి", "రగులుతున్న భారతం" లాంటి కొన్ని సినిమాలకి పాటలు, స్క్రిప్టులు రాశాడు. అవి జాతీయ బహుమతులందుకున్నాయి. ఇక 'రంగులకల'లోని "జమ్‌జమ్మల్ మర్రీ వెయ్యి కాళ్ళా జెర్రీ" పాటయితే, వాస్తవాన్ని సుందరంగా కళ్ళకి కట్టించడమే కాదు. సినిమా పాటల రచనలో అతని కలానికున్న వైవిధ్యపు వెలుగుల్ని సూచించింది.

ఒక జాతి పక్షులు ఒకే కొమ్మమీద కొచ్చినట్టు నిర్మాతలు నరసింగరావు, రవీంద్రనాథ్ గార్లిచ్చిన అవకాశంవల్ల "మాభూమి"లో నేనూ పని చేశాను. నిర్మాత, దర్శకుడుగా నరసింగరావు గారిచ్చిన అవకాశంవల్ల "రంగులకల"కీ పని చేశాను. పూలవాసన దారానికంటినట్టు తమ అనుభవ అధ్యయనాలతో, జీవితాన్నీ, లోకాన్నీ



తరచి చూస్తున్న కవుల కళాకారుల సాన్నిహిత్యంవల్ల నా రాజకీయ అవగాహన కాస్తంత పెరిగింది. ఆ అవగాహననుంచి జీవితంయొక్క "వికృత దర్పణం" సమాజవాస్తవికతని సుస్పష్టంగా చూపించింది.

దేవిప్రియ మాటల్లోనే ఆ "వికృత దర్పణం" యిలా వుంది.

*"నీ*
*చెమట చెరువులో*
*నిన్నేముంచి*
*నీ*
*నరాలతో*
*నీ బతుక్కే ఉరిపోసి*
*నీ*
*చూపుతో*
*నిన్నే వికృతంగా చూపే*
*చోటు నీది కాదు !*

కనక నేటి "ప్రపంచం సినిమా ప్రపంచం" నా దేవిదే కాదు, 'శ్రమకి' ప్రాధాన్యమిచ్చే వారి ఎవరిచోటూ  కాదుగాక కాదు. కాస్తంత లోతుగా విశ్లేషించి చూసుకోగలిగితే స్థూలంగా ఆ వివరమూ తెలుస్తుంది.

విలువలు ఆకాశంనుంచి వూడిపడవు. వర్గప్రయోజనాల సారరూపమే విలువలు. పాలకవర్గం ఈ నగ్నసత్యాన్ని ప్రజలకి తెలియనియ్యదు. అది ప్రజలందరి జీవితానికి ఆధారమైన సామాజిక విలువలని నమ్మిస్తుంది. అలా అందంగా ప్రచారంచేసి ప్రజల్ని ఒప్పించగల వారిని ఆదరిస్తుంది. ఆ విలువల్ని ఆచరించి తనకి విధేయులైవుంటే, మహానుభావులని కీర్తించి మన్నిస్తుంది. ఇందుకు "కాళిదాసు" నుంచి 'విశ్వనాధ' దాకా ఎన్నో ఉదాహరణలు.

వచ్చేకాలపు విలువలకి నిబద్ధమై, వృత్తిగా పోయేకాలం విలువల్ని ప్రచారం చేసేవారున్నారు. వీరెంత "ప్రొఫెషనల్ స్కిల్"తో, అందంగా, ప్రచారం చేస్తున్నా ముందు గుర్తించనట్టుగా వుంటుంది. తప్పకపోతే తన ప్రత్యామ్నాయం దొరికేదాకా పని చేయించుకుంటుంది. అది సుదీర్ఘకాలంపాటు దొరక్కపోతే వారిని మహానుభావులని ముఖస్తుతి చేసి మన్నిస్తున్నట్టు కనిపిస్తుంది. ముఖం వెనక బలహీనతల్ని బయటపెట్టి మోహాలు చిట్లిస్తుంది. నిబద్ధత ప్రదర్శనయి 'కైలాట'లాడగల్గిన లయ బ్రహ్మలకిది మినహాయింపు. పెట్టుబడి "కమేండ్లోకి" పూర్తిగా వచ్చేస్తున్న తెలుగు సినిమాకి సంబంధించి శ్రీశ్రీ నుంచి దేవి దాకా ఇందుకెన్ని సాక్ష్యాలైనా కనిపిస్తాయి.

జీవితాన్ని లోతుగా విశ్లేషించి చూపిస్తున్న దేవికీమాత్రం తెలీదా?!! నిజానికి నాకన్న ఎక్కువగానే తెలుసు. మూలధనం చలనానికి ఇంధనమైన 'ధనం' యొక్క 'సర్వోపరిస్థితి'ని అత్యద్భుతంగా వివరిస్తూ –



*"నీ ప్రేమకి పునాది,*
*నీ స్నేహదీపానికి కరెంటు,*
*ఆమె జడలో అందంగా గుబాళిస్తున్న మల్లెలు – అదీ డబ్బే !*
*సూర్యుడా?*
*చంద్రుడా?*
*ఏడిచారు,*
*వాళ్ళు రూపాయి బిళ్ళకి*
*బొమ్మా బొరుసూ !"* అని ఛీత్కరించాడు.

ఈనాడు 'బజారు' విలువల జీవితానికి బొమ్మా బొరుసుగావున్న సూర్యచంద్రుల సాక్షిగా – దేవి చెప్పినట్టు మనం "ఇప్పుడు బతుకుతున్నదుందే, ఇదే నిజమైన మరణానంతర జీవితం. ఈ జీవితంలో "ఉదయాస్తమయాలు" నిక్కచ్చిగా యిలాగే వుంటాయి.

*"నువ్వు*
*ఆలోచించు*
*వాడు*
*ఆలోచనని అమ్ముకుంటాడు.*
*నువ్వు*
*శ్రమించు*
*వాడు కరెన్సీ కర్టెన్ల వెనక*
*విశ్రమిస్తాడు,*
*నువ్వు*
*అక్షరానివికా*
*వాడు శిలాక్షరమై చెల్లుతుంటాడు.*
*నువ్వు*
*వాడి సేవలో అస్తమించు*
*వాడు నీ సమాధి మీద ఉదయిస్తాడు !"*

ఈ 'ఉదయాస్తమయాల' చరిత్ర భావికి బాధ్యత వహిస్తున్న 'నిబద్ధతనిప్పుని' ఆర్పేస్తోంది. ఆ వ్యక్తుల్ని నిర్దాక్షిణ్యంగా "భుజాలమీద వేసుకుని పశ్చిమానికి నడిచి పోతోంది." మనలో ప్రతి ఒక్కరినీ "అనాదిగా కూలిపోతున్న పునాది లేని గోడను" చేస్తోంది. మనల్ని మన సమాజానికే అంతఃశత్రువులుగా మార్చేస్తోంది.

దీనికి విరుగుడుకూడా దేవికి బాగా తెలుసు –

*"నీ తలమీద*



*తమ ఆకాశాల్ని మోసేవాళ్ళ*

*నీ*

*కాళ్ళు తెగకోయకముందే*

*ఆకాశాన్ని భూమికి దొర్లించి*

*శతకోటి పాదాల*

*సముద్రానివై పో !"* అన్నాడో కవితలో.....

కారణాలు వేరైనా నేనూ దేవి 'శతకోటి పాదాలతో' – కదం తొక్కుతున్న మహాసాగరం 'కెరటాల్లో కెరటాలం' కాలేకపోయాం. కానీ ఆ సముద్రం ఆటుపోటుల్ని – అపార్థం చేసుకోకుండా – అర్థం చేసుకుంటూ అడుగేస్తూ వస్తున్నాం. ఎటొచ్చీ నేను మునిలా మౌనంగా వస్తున్నాను. అతను కవిగనక సాగరం హోరుని కవిత్వీకరించి అక్షరబద్ధం చేస్తూవస్తున్నాడు. మేం కెరటాల్లో కెరటాలం కాలేకపోయినా మా 'ప్రాణాలు' ఆ కెరటాలతో కలిసి కదం తొక్కుతూ వున్నాయి కదా.

దేవి ఇలా ఏటికెదురీదుతూనే, సముద్రం వినిపిస్తున్న 'రక్తచలన సంగీతానికి' సంకేతమైన" తుఫాను తుమ్మెద"కి తోడుగావుండి నీడలా అనుసరించాడు.

*"అది తీరాన*

*లాంతరు పట్టుకొని నిశ్చితంగా నిలిచిన లైట్‌హౌస్ కాదు.*

*అది కల్లోల కడలిలో*

*కొట్టుమిట్టాడుతున్న కొయ్యపడవ*

*ప్రపంచం కోసం ఇంకా పాటలు మోసుకొస్తున్న తుఫాను తుమ్మెద !"*

అని ఎలుగెత్తి కవితల్లో చాటాడు

అక్కడితో ఆగలేదు. ఉద్వేగభరితమైన ఆ తుమ్మెద జీవితగాధను ఇంగ్లీషు 'డాక్యుమెంటరీ సినిమా'గా తీశాడు. తానే రచించి దర్శకత్వం వహించి నిర్మించిన "ది మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్" అనే ఆ చిత్రం అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ప్రశంసలు అందుకుంటోంది.

సినిమా దేవిప్రియ అనే ఈ స్థూలసమీక్ష యొక్క సారాంశం యేమిటి?;

తనచుట్టూ తాను తిరుగుతూ సినిమా చుట్టూ తిరిగిన దేవిప్రియ ముప్ఫ య్యేళ్ళుగా కవిగా, రచయితగా, దర్శకుడుగా తానేమిటో నిరూపించుకున్నాడు. తన 'నిధుల్ని' వదలకుండా, 'విధుల్ని' మరవకుండా, కవితాప్రస్థానాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తున్నాడు. ఆ కవితలు దేవి'ప్రియ' దర్శనాన్ని ఫిలిం మాంటెజ్‌లా కళ్ళముందు కదిలిస్తూ నాబోంట్ల కెందరికో ధైర్యస్థైర్యాల్నిస్తున్నాయి. ఎదురీదక తప్పని 'జీవన సముద్రాన్ని' ఈదగల ఆత్మవిశ్వాసాన్ని అందిస్తున్నాయి.

*('దేవి' 30 'స్వరపత్రం' 2002 నుంచి)*



సామల సదాశివ

# తెలుగుకు ఉర్దూ షేర్ల పదును!

ఆప్తమిత్రులు శ్రీ దేవిప్రియ గారికి,

నమః! మీరు దయతో పంపిన 'తుఫానుతుమ్మెద' అందుకున్నాను. మీరు పంపకపోతే ఎక్కడయినా కొనుక్కునేవాణ్ణి. ఎవరింటి లైబ్రరీలోనైనా వుండదగిన గ్రంధమిది.

మీ కవిత్వం బాగున్నదని ప్రత్యేకంగా రాయటమెందుకు? మీరెటో చూస్తూ వుంటారు, ఏదో వెతుక్కుంటున్నట్టు. మీ చూపుల్లో నేను చాలాకవిత్వం చదువు కుంటాను. మీరు రాసిన,

*'భూమి*
*మధ్య మధ్యలో మతి భ్రమించే*
*మమతానురాగాల మాతృమూర్తి.'*

అనే ఈ రెండు చరణాలు గజల్ షేర్‌లా నాలో నిల్చిపోయినవి. ఈలాంటి షేర్లను హాసిలె-గజల్, బైతులే గజల్ అంటారు. వివరించలేను. మలిక్‌భాయి నదు గండి... ఈ భావాన్ని ఏ భాషలోనూ ఇంతకంటే చక్కగా, పొందికగా నేను చదవలేదు. ఇట్లాంటి షేర్ విని 'వాహ్వా' అనలేము. మౌనం వహిస్తాము. మౌనాన్ని మించిన ప్రశంసలేదు. మీరు నాకంటే చిన్నవారు కనుక మీకోసం 'అల్లాహ్ కరే జోరె - ఖలమ్ ఔర్ జియాదా' అని ప్రార్థిస్తున్నాను.

ఇది చదివినప్పటినుంచి నాలో నేను లేను. అంతగా కదిలించినారు మీరు.

*'నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు*
*తళుకు బెళుకు రాళ్లు తక్కెడేల?*

అన్నాడు వేమన.



'తుఫాను తుమ్మెద' పంపి నాకు ఆత్మానందం కలిగించినారు. మీకు నమస్కారం. ఈ పుస్తకం నిండా ఇట్లాంటి షేర్లు చాలా వున్నవి.

యాభైయేళ్లుగా భిక్షాపాత్ర పట్టుకొని తిరుగుతున్నానండీ! మీలాంటి పుణ్యాత్ములు అప్పుడప్పుడిలాటి వెలలేని రతనాలు వేసి పోతారు. ఉర్దూ షేర్ల పదును తెలుగు ముక్కలకు రాదనుకునేవాణ్ణి. నా అభిప్రాయం సరికాదని నిరూపించే ఈలాటి ముక్కలు సకృత్తుగా కనిపిస్తాయి. నన్నింతగా పులకింపజేసిన మీకు మళ్ళీ నమస్కారం.

*('తుఫాను తుమ్మెద' చదివి, కీ.శే. సదాశివ దేవిప్రియకి రాసిన లేఖ.*
*దేవి '30' స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

**వాళ్ళు నాలుగు దిక్కులనుంచీ**
**ఉరుముల్ని తరుముకుంటూ**
**పిడుగుల్ని విసురుకుంటూ వస్తారు**
**వాళ్ళు**
**పగుళ్ళు బారినా బాధ యెరగని కాళ్ళతో**
**కదం తొక్కుతూ వస్తారు**
**దేశదేశగాయాలకు**
**కట్లు కడుతూ కాపు పెడుతూ**
**సరిహద్దులు తెలియని చికిత్సని తెస్తారు**
**వాళ్ళు ఆవేదనల్ని మోస్తారు**
**ఆందోళనలై లేస్తారు....**

(వాళ్ళు : అమ్మచెట్టు)



డాక్టర్ జె.భాగ్యలక్ష్మి

# నిరుపమాన రూపకాలు

ఉపమానాలలో కాళిదాసు నిరుపమానుడు అంటారు. అలంకారాల విషయానికి వస్తే ఉపమాలంకారం, రూపకాలంకారం చాలా దగ్గరగా ఉంటాయి. ఆధునికులలో రూపకాలంకారాలను విరివిగా, తెలివిగా, అనూహ్యంగా, పదునుగా, బరువుగా, నూతనంగా, విలక్షణంగా వాడగలిగిన కవి దేవిప్రియ అని నిస్సందేహంగా చెప్పవచ్చు. “అమ్మచెట్టు”, “నీటిపుట్ట”, “తుఫానుతుమ్మెద” వంటిపేర్లు ఒక్క దేవిప్రియకే తోస్తాయి. అందుకే దేవిప్రియ నిరుపమానుడు.

‘అడివి’లో ప్రకృతి సౌందర్యం ఉంది. ఇక్కడా అమ్మతనముంది. ప్రత్యక్షంగా తెలియజేసేది ఒకటి. పరోక్షంగా సూచించేది ఒకటి. సంకేతభాషలో తెలుసుకోవలసిన వాళ్ళు తెలుసుకోదగినట్టు వ్రాసేది మరొకటి.

“ఈ దేశాన్ని ప్లాస్టిక్‌తీగల విషపుష్పాల ఉద్యానవనాలనుంచి కాపాడడానికి ఏదో ఒకనాడు నేను నీ సాయమే కోరతాను.”

ప్రకృతే మనకు గురువు అని ఒక ఆంగ్లకవి అన్నంత సరళమైన మాటలు కావివి. మనిషి తిరిగి ప్రకృతినే శరణ్యం కోరుతాడు, ప్రకృతి వొడిలోకి వస్తాడు, అదే సహజం, అదే సరయిన మార్గమని ప్రకృతి ప్రేమికులు అనుకొనే మాటలూ కావు. “ప్లాస్టిక్ తీగలు కృత్రిమం. ప్రాణరహితాలు. విషపుష్పాలలో “విషం” సజీవమే. దానిని సజీవంగా ఉంచిన ఉద్యానవనాలూ అంతే. యధాలాపంగా, సరళంగా వెలువడిన ఈ కవితాధార యధాలాపమూ కాదు, సరళమూ కాదు.

“మెరుపులు” కవితాఝురి ఊటలా పైకి ఎగజిమ్మిన ధార. అందుకే స్వచ్ఛంగా ఉంది. పైగా ఆత్మావలోకనం. ఎవరూ నమ్మరుకానీ దేవిప్రియలో అది సాధ్యం. ఈ కవి అచ్చుబోసిన బొమ్మలా ఉండడు. ముద్రితం, పునర్ముద్రితంలా మాటలు మార్చి



చెప్పిందే చెప్పదు. లేకపోతే ఈ మాటలకు అర్థమేమిటి? ఎంత అవగాహనతో పాఠకుడు చదివితే అంత గొప్పగానూ, లోతుగానూ అర్థమవుతుంది.

*"ఏరు తాగుతుంది కపటం లేకుండా,*
*దాని గుండె స్ఫటికం;*
*అందుకే అక్కడ ప్రతిఫలిస్తాడు ఎక్కడో*
*ఆకాశం ఏనుగుమెడలో*
*వెండిగంటలా వేలాడే ఒంటరి చంద్రుడు".*

ఎవరీ ఒంటరి చంద్రుడు? స్ఫటికంలాంటి గుండెలో ఎందుకు ప్రతిఫలిస్తాడు? దీనికి జవాబు భావజాలాలు చెపుతాయా? తాత్త్విక చింతనా? మాటలకందని మర్మమా?

కవులకు, రచయితలకుకూడా గడ్డు సమయాలుంటాయి. భావాంబరవీధి విశృత విహారను పట్టుకోటం కష్టమయిన క్షణాలవి. అంతర్మథనం. ఎంతో వేదన. భాషకందని బాధ. చెప్పుకోలేని దుఃఖం. కారుమబ్బు కమ్ముకొన్న స్థితి. వెలుగు రేఖలేని చీకటి. అప్పుడు–

*"గాలిలో*
*నేనే గాలినై*
*గింగరాలు తిరుగుతూ*
*గిరికీలు కొడుతూ*
*నిశ్చలనంలో చలనాన్ని చూసే*
*కవినే అయితే"*
*జనస్పందనా ప్రవాహంలో*
*ముందు వురికే పాయని కాలేకపోతే*
*మరి నేనెవరిని?"*

ఈ సందేహంకూడా చాలాసేపు నిలవదు. వేణువై, వేణునాదమై, సితారు అయి, సితారు సంగీతమై, వయొలిన్ అయి, వయొలిన్ గీతమై వినిపించే ఈ కవి తన వెన్నుపూసకలంలోనే సిరా అయి ప్రవహిస్తాడు !

ప్రాణపరిమళం, సీసాయుధం, ఆకుకళ్ళు, జీవనేత్రం వంటి ప్రయోగాలు కవి నేర్పరితనాన్ని చెవుతాయి. తనలోనుండి పొంగివచ్చే కవితాధారను తానే ఆశ్చర్యపోయి చూస్తాడు. తననుతానే ప్రశ్నించుకొంటాడు. జవాబూ తనదే.

*"నా*
*అరచేతికి*
*స్వరపేటికవుంది–*



*లేకుంటే*
*నా*
*కలంనుంచి*
*ఇన్ని శబ్దచిత్రాలు*
*ఇన్ని భాషాస్వప్నాలు*
*కాగితం మీదికి*
*గలగలలాడుతూ*
*ఎలా కదిలి వస్తున్నాయి!"*

తన ప్రత్యేకానుభవం "గదినది." నభోంతరాళం చుట్టివస్తుంటాడు.

*"ఈ గదిలో కూర్చుంటే*
*నదిలో కూర్చున్నట్టుంది–*
*నా గర్భంలో నదీగర్భం*
*ఘనీభవించినట్టుంది –*
*మడిచిన మోకాలి సందులోంచి ఒక*
*పథమేదో పోరిపోయినట్టుంది"–*

ఆ గది "ప్రేమించే మది", "కలల గాలాలను పారదర్శక యవనికలనుంచి" దర్శించేది.

"అద్దాల గది"లా ఉండేది. బయటఉన్న నీళ్లన్నీ ఎర్రగా కనిపించి నగ్నదేహం మీద జెర్రులు పాకుతున్నట్టనిపించే భావననిచ్చే గది ఆ "గదినది."

"నీటిపుట్ట" మాత్రం సృష్టించే కల్లోలం తక్కువా? ఎంత అనిశ్చితస్థితి! ప్రశ్నలే ప్రశ్నలు, జవాబులు దొరకవని కాదు. జవాబులు వినగలిగే శక్తి ఉందా ఎవరికైనా? సత్యాన్ని ఆచ్ఛాదన లేకుండా చూస్తే ఆ తేజస్సుకు కళ్లుమూతలు పడవా? అప్పుడు కనిపించే దేముంటుంది?

*"ఒకసారి*
*మహావిప్లవ వాంఛా వివస్త్రప్రభంజనాన్ని*
*ఆహ్వానించే నేను,*
*మరొకసారి*
*మానవతా ముఖమల్ ఆచ్ఛాదనల కింద*
*ఊపిరాడక*
*ఎందుకు విసనకర్రలు వెతుక్కుంటానో,*
*... .... ...*





*ఎందుకు*
*నేనొక క్షుభితయోచనల నీటిపుట్టనై*
*నా సూర్యచంద్రాక్షరాలను*
*చేపచెదలు తినివేస్తోందో,*
*ఎందుకు*
*నా చంద్రుడి శీతలానికి*
*నా సూర్యుడు కరిగి ప్రవహిస్తున్నాడో –*
*ఎందుకో....ఎందుకో....!!!*

"సూర్యచంద్రాక్షరాలను," "చేపచెదలును" "నీటిపుట్ట"లో వెతుక్కోవలసింది మనం. సూర్యుడిని కరిగించిన ఆ చంద్రుడి శీతలమెంతటిదో ఊహించవలసింది మనం.

మనస్సాక్షిని మేల్కొల్పే వైనం, దారితప్పిన బండిని దారికితెచ్చే మార్గం. ఇంతకూ బండి ఎలా పక్క దారి పట్టింది?

*"కాలవగట్ల మీద*
*పాకుతున్న బురదనీటి మొక్కల్లాంటి పిల్లల్నీ,*
*రైలుస్టేషన్ రక్తంలో*
*బస్టాండు ఇనుప ఎముకల్లో*
*ఎండకి కరిగి తారై*
*పారే రహదారుల్లో లీనమైపోతున్న*
*అసంఖ్యాక భారత అనాధలని చూడకుండా,*
*ఎందుకు నేను*
*నా ఇద్దరు ముద్దులపిల్లలనే*
*జ్ఞాపకాల దారానికి గుచ్చి*
*మెడలో వేసుకొంటున్నాను" –*

ఈ పార్థివ జీవితంలో ప్రేమ, దుఃఖం, ఆకలివంటి బాధలెన్నో ఉంటాయి. అవి తీర్చుకొంటున్నంత మాత్రాన కవి వాటికే అంకితమయినట్లు, అదే ప్రపంచంగా జీవిస్తున్నట్టు కాదు. ఒంటరిగా, ఎంతో ఒంటరిగా ఉన్నా, కవి శక్తిని తక్కువగా అంచనా వేయకూడదు.

*"నా ఏడుపు*
*ఏక్‌తార*



సహస్రతంత్రీ సంక్షుభిత
సమరవీణగా మోగుతుంది –
నేను
గాలినదిలో తేలే
గాలిపటం పడవలా
నా ఊపిరిదారంమీదే
ఉన్నట్టూ లేనట్టూ ఊగుతుంటాను !"

"అధివాస్తవికతా ఆకాశం"లోని రూపకాలుకూడా అధివాస్తవికతనే చాటుతున్నాయి." ఆకాశం చింకిచావ," 'కాలం కాళ్లజెర్రి'!

నేను
ముఖం దాచుకున్న దిండు
నన్ను ఖండఖండాలుగా చేస్తోన్న
ఖండాంతరవేది –
నేను
శ్రమపోసి
పెంచుకొన్న దేహం
పిడుగులు మోసుకు తిరిగే ఆకాశం.

"తుఫానుతుమ్మెద"ను వర్ణించగలిగే సాహసం, భావనాశక్తీ దేవిప్రియకే ఉంది. కాదు కాదంటూనే తుమ్మెదపాటకీ, తూనీగ రాగాలకీ, తుఫానుగాలులకీ, తుపాకి మోతలకీ స్వరకల్పన జరిగింది. "అనంత త్యాగాల అనూహ్యారాగమాలిక, అదృశ్యనిగళ నియంత్రిత అసామాన్య పర్వత పవనగాన జలపాతం" మనముందు నిలిచింది. అది "భువనజనహవన ఘోష"ను వినిపించింది.

ఒక
నక్షత్రఖచితనవ్యనవనీత ఖడ్గం
నిప్పులనదిలో ఈదుతున్న
మహాద్భుతమైన మాటలమంచుచేప
గుండెలోనుంచి దూసుకుపోయే
బాణాలను చూడనిచ్చే పారదర్శక పావురం

మనకు దర్శనమిచ్చింది. "ప్రపంచంకోసం ఇంకా పాటలు మోసుకొస్తున్న తుఫాను తుమ్మెద"ను మనమందరమూ గుర్తించాం!

కాలం అనంతం. ముందుకు సాగుతూనే ఉంటుంది. అందుకే దీనిని ప్రవాహంతో పోలుస్తుంటారు. కాని దేవిప్రియకు అది “సంవత్సర సముద్ర” మవుతుంది. “ఆకాశం అంచున చీకటిదండేనికి వేలాడుతున్న చింకిపాత సముద్రం.” “చిన్నచిన్న పాదాలకికూడా వొంగివొంగి దండాలుపెట్టే వెర్రిబాగుల బానిస సముద్రం!” అయితే మాత్రం తక్కువగా అంచనా వేయగలమా? ఇది కాలాన్నిమింగే సముద్రం.

*“ఒక్కొక్క సంవత్సరమే సుడిలో చిక్కిన పడవలా*
*సముద్ర గర్భంలోకి నిష్క్రమిస్తుంది!”*

కలలు కల్లలై, ఆశలు అడియాసలై “ఎన్ని గిరికీలు కొట్టినా, ఎన్ని ప్రదక్షిణలు చేసినా, ఎన్ని సంకేతాలు చూపినా, ఎన్ని సంగీతాలు పాడినా, పైనుంచి నా సముద్రం, నా భూమి, నా చెట్టూ, నా గూడూ ఏవీ కనిపించటం లేదే” అని కరవరపడినా...

*“చిటారుకొమ్మమీద*
*చీకటిలోకూడా తళతళమెరుస్తూ*
*నాకోసం నిలిచి ఉన్న నగ్నకరవాలంమీద*
*వెళ్ళి వాలవలసే ఉంది నేను”*

అని దేవిప్రియ స్పష్టంగా గుర్తిస్తాడు. ఇప్పుడున్న బతుకే “మరణానంతర జీవితం” అని చెపుతున్న మాటలు –

*“నా కలల్లో, కళల్లో ఇంకా*
*లోకోద్ధరణ స్వప్నాలే*
*వాస్తవిక ఖడ్గధార మీద*
*నడుస్తున్నప్పుడు బొట్టుబొట్టుగా*
*నేలరాలే నెత్తుటిచుక్కల్లో*
*ఘనీభవిస్తున్న అగణితగాయాలు–”*

అంతేకాదు. నిర్దయమైన, క్రూరమైన, అననుకూల పరిస్థితులలోని నిస్సహాయ మైన నిట్టూర్పు –

*“సొరచేపల వేటగాడొకడు సముద్రసర్పాల*
*కాటుతిని ఎర్రటి జలస్తంభంలా*
*పైకి లేచాడంటే,*
*ఏమో....ఏమేమో.....ఎవరికి పట్టింది....*
*నా ఇల్లు నన్ను పిలుస్తున్నప్పుడు*
*నాలోపల వెలిగే దీపం*





*తెగినశిరసు నుదుటిమీది మూడోకన్నులా*
*నన్ను భయపెడుతున్నప్పుడు*
*ఎవరు నా ప్రభాతాల కోసం*
*పశ్చిమాకాశాన సంజవన్నెలో కలిసిపోతే యేమిటి....”*

కవులు, కథకులు, రచయితలు ఆ మాటకొస్తే ప్రతిమనిషి పరిణామం చెందుతూనే ఉంటాడు.

కొన్నేండ్ల క్రితం ఆలోచించిన ధోరణిలోనే ఈనాడు ఆలోచింపకపోవచ్చు. అంతెందుకు ఒకరోజులో, ఒకసంఘటనలో, ఒకక్షణంలో జీవితాన్ని అవలోకించే పద్ధతి మారిపోవచ్చు. ముఖ్యంగా సృజనాత్మకతలో మునిగితేలే కవుల, రచయితల పరిణామాన్ని గురించి విమర్శకులు చర్చిస్తుంటారు. “అమ్మచెట్టు” కవితలు 1972–79 మధ్య వ్రాసినా, “నీటిపుట్ట”లోని కవితలు 1980–90 మధ్య వెలువడినా “తుఫాను తుమ్మెద” 1990–99 నాటి కవితలను చేర్చుకొన్నా 1972 నాటికి 1999 నాటికి దేవిప్రియ దృష్టి బాగా విస్తరిస్తూ పోయింది. ఎన్నిటినో తన అఖండ ప్రపంచంలో చేర్చుకొంటూ వచ్చాడు. ఈ “పదహారు పాదాల దీపం” పదహారు కళలనూ వెదజల్లుతూ వచ్చింది.

*“పూలమీద ప్రమాణం చేసి*
*అంతా నిజమే చెపుతాను. అబద్ధం చెప్పను*
*పూలని నేనొక చామనచాయ పువ్వు*
*పూజకోసమే దొంగిలిస్తాను.*
*వానగుర్రపుడెక్కలు వాటిని*
*రెక్కలు విరిగి నేలకి అతుక్కునేలా*
*తొక్కివేసే ప్రళయ ఘడియదాకా*
*డాలియాలని నేను*
*దొంగిలిస్తూనే ఉంటాను.”*

ఈ దేవిప్రియ మనకు తెలుసా? “వానగుర్రపుడెక్కలు”
“ఆలోచనారథాన్ని ఎటువైపు మళ్లిస్తున్నాయి
*“సూర్యరశ్మినీ నేనే*
*సూర్యుడినీ నేనే*
*ఎండని పీల్చివెలిగే పత్రహరితాన్నీ నేనే”*
... .... ....



"వ్యాధినీ నేనే
వైద్యుడినీ నేనే
రోగినీ నేనే
రోగాన్నీ నేనే"

"గగన విహారి పిట్టనీ నేనే
విల్లంబునీ నేనే
వేటగాడినీ నేనే."

ఈ కవి ఏ తాత్త్విక చింతనలో మునిగి తేలుతున్నాడు? ఏ పరమార్థాన్ని దర్శిస్తున్నాడు? ఏ విశ్వరూపం గురించి చెపుతున్నాడు?

"వాయుసముద్రం మధ్యకూడా
నువ్వు ఊపిరాడక తపిస్తున్నపుడు
నిస్సహాయంగా నిలబడిపోతాను నేను -
అగ్నికీలల్లా సదా జ్వలించే నీ కళ్ళు
అప్పుడే వలలో పడ్డచేపల్లా
గిలగిలలాడుతున్నప్పుడు
నిస్సహాయంగా నిలబడిపోతాను నేను-
... ... ...
ఇన్ని కొండల్లో
ఒక చిన్న గుట్టయినా నీకోసం
సంజీవినీ పర్వతశకలం కాకూడదా..."

దుఃఖపర్వతం విరిగి మీదపడుతున్నప్పుడు, లోలోపలనుండి లావా పొంగి బయటికి రావటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, నిస్సహాయంగా చిక్కుకు పోయినస్థితి, గడ్డకట్టిన క్షణం, గాయమవుతున్న హృదయం, ఇది కవి హృదయం.

"మరణం
ఒక తీర్చలేని రుణం -
తల్లి కడుపునుంచి
తుదిశ్వాస నిశ్శబ్దంవరకూ
అదే నీ అసలు బతుకు,
దరహాసాల్లో
పరిహాసాల్లో



*బృందఘోషలో*

*ఏకాంత శోషలో*

*మరణమే నీ యదార్థచాయ–"*

ఏ దార్శనికుడు ఈ మాట చెపుతున్నాడు? ఒక నిర్దిష్టసత్యాన్ని ఏ సత్యాన్వేషి గుర్తుకు తెచ్చుకొంటున్నాడు? "జన్మించేదీ నేనే, జీవించేదీ నేనే, మరణించేదీ నేనే" అనే అభేదాన్ని, అద్వైతాన్ని మననం చేసుకొంటున్న దేవిప్రియ మనకు తెలుసా? దేవిప్రియ కవిత్వంలో నిరుపమాన రూపకాలే కాదు, దగ్గరగా చూస్తే కవిత్వమంతా, కవితాభావమంతా, జీవిత సత్యమంతా రూపకంలోనే చెప్పినట్టనిపిస్తుంది.

*(దేవి'30 'స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

***కవిగారూ, ఇలా రండి***
***మాటున్నది మీతో,***
***అర్థం కాకుంది, మీరు***
***మానవులో, కోతో !***
***ఆ కొమ్మన కొంత సేపు,***
***ఈ కొమ్మన కొంత సేపు,***
***ఎగిరి ఎగిరి దూకుతారు.?***
***ఒళ్ళుమరిచి వాగుతారు***
***డబ్బుంటే మహాకవిగ***
***మారవచ్చు ననుకుంటే,***
***అబ్బో! బిర్లా, తాతా***
***వీరమహాకవులేగద!***
***ఒకే మాట, ఒకే దిక్కు***
***గొప్పకవికి ప్రాణం,***
***లేకుంటే వినడెవడూ***
***మీ కవితాగానం!***

( సమాజానందస్వామి)



జి. శ్రీరామమూర్తి

# కవితాసముద్రం ఒడ్డున నిలబడి...

మహానగర ఎడారిలో, సిలికాన్ శ్రీమంతుల హైటెక్ దారుల్లో చూపుల ఒంటెమీద ప్రయాణిస్తూ 'రన్నింగ్ కామెంటరీ' ఖర్జూరాలు చప్పరిస్తూ పోయే కవి మహాజనానికి చిరపరిచితుడే. ప్రతిపొద్దూ తెలుగుగుండెను శ్రుతిచేసి వదిలిపెట్టడంలో సిద్ధహస్తుడు. సాటికవులకు 'దేవుడు.' కవిత్వానికి ప్రియుడు. ఎప్పుడు తాగాడో తెలియదు, రెండు దోసిళ్ళ నిండా అవగాహనామృతం. ఎప్పుడు తిన్నాడో తెలియదు, రెండు కమ్మని తెలుగు చెరుకు గెడలు. బహుశ అమ్మ ఒడిలో. వాటి మాధుర్యం అజ రామరంగా ఆయన కలంలోంచి జాలువారుతూనే ఉంటుంది. అది ఊట జల.

మా ఊళ్ళో ఓ మంచి నీటిబావి ఉంది, సంతతోటలో. మండు వేసవిలో చెరువులు, దొరువులు అన్నీ ఎండిపోయి జనం నాలుకలు తడి ఆరిపోతున్నప్పుడు ఆ బావి నిరంతరంగా సజలస్రవంతిగా ఊరుతూనే ఉంటుంది. చుట్టుపక్కల ఊళ్ళ వాళ్ళంతా ఎక్కువగా స్త్రీలు – అర్థరాత్రి అపరాత్రి అనకుండా ఫర్లాంగుల దూరం కాలినడకన తలమీద ఖాళీకుండలతో ఆ బావివద్ద క్యూలు కడతారు. ఎవ్వరికీ కాదన కుండా బొట్టుబొట్టు రాల్చి ఇస్తుంది మధురజలాలు. దేవిప్రియ కవిత్వం చదివినప్పుడల్లా నాకు ఆ బావే గుర్తుకు వస్తుంది.

ఉద్యమకవిత్వ కెరటాలమీద దాని సైదుకాల్వల ఉరవడిమీద కీర్తి శిఖరాలందు కోవడంలో సిద్ధహస్తులైన కవులున్నారు. దేవిప్రియ వారి కోవలో చేరడు. అలా చేరకపోవడమే ఆయన ప్రత్యేకత. లాబీలు, శిష్యగణాలు, సాహిత్య కురుకులాశ్రమాలు నడిపే అలవాటున్నవాడు కాడు. తాను, తన కవిత్వమే ఎడబాటులేని జంటగా (రాజ్యలక్ష్మి గారికి క్షమాపణలతో) అక్షరకాపురాన్ని ఒద్దికగా సాగించుకుంటూ వస్తున్నవాడు. స్వతంత్ర జీవనంలోని ఒడుదుడుకులను ఒక్క కవిత్వపాద సృష్టితో తుడిచేసి మరిచిపోయి నవ్వుకుంటూ ముందుకు సాగించుకుంటూ వస్తున్నవాడు.



కెరీర్‌కి, కీర్తికి, రెండింటికీ ఏ ప్లానింగు, ఏ ఇంజినీరింగు లేకుండా ఏది నిచ్చెనో, ఏది పామో గుర్తించకుండా ఆ అవసరమున్నదనే ఆలోచనకు సైతం తావివ్వకుండా అడుగులు వేస్తూపోయే వాడు. హృదయానికి రక్తమాంసాలుంటే, కవికి హృదయముంటే అతడే దేవిప్రియ.

తెలుగు కవితాసాహిత్యంలో ఉద్యమ కవిత్వాలు సృజనకు చేసిన హాని అపార మైనది. స్వతంత్రమైన ఆలోచనను అంకురించనీయకుండా కవి తన కాళ్ళకింద నేలను, దాని ఎత్తుపల్లాలను స్వయంగా చూసి అవగాహన చేసుకునేలోపలే ఓ మూసలోకి నెట్టివేసి కట్టిపడేసిన ఖ్యాతి ఉద్యమ కవిత్వానికున్నది. ఆ మూసకు అతీతంగా తన కవిత్వాన్ని, దాని స్వచ్ఛతను, ప్రయోజనాన్ని కాపాడుకున్నవాడు దేవిప్రియ.

శ్రీశ్రీ అనే చెలియలికట్టకు కొట్టుకొని కరిగిపోయిన అసంఖ్యాక కెరటాల్లా కాకుండా, అలాగే విప్లవ కవిత్వం గుడ్డమడతలకు వాసనలద్దడంలో తెల్లారిపోయిన కవుల్లా కాకుండా దేవిప్రియ తన తనాన్ని, జనంతో తన అక్షరబంధాన్ని, దాని గంధాన్ని జాగ్రత్తగా కాపాడుకున్నవాడు. శ్రీశ్రీ నాటి తెలుగు కవిత్వపు ఏకవచనాన్ని అనంతర కాలపు బహువచనాన్ని గమనించే వారెవరికైనా దేవిప్రియవంటి ఎడారి చెలమలను గుర్తించవలసిన రీతిలో గుర్తించకపోవడంలోని అపరాధం తెలిసి రాకమానదు. భాష, భావక్లిష్టతగాని, అన్వయక్లిష్టతగాని ఎక్కడా కానరాని ద్రాక్షపాకం దేవిప్రియ. 'పందిరి మీదికి ద్రాక్షతీగను పాకించడమే" కాదు దానిని ఫలింపచేసినవాడు దేవిప్రియ. ఆయన "భావోద్రేక శకలాలు", "పదస్ఫటిక ఫలకాలే" కాదు ఆయన కవితా "సాంకేతిక విన్యాసం"నిండా మనిషి అంతరంగ తరంగాలే. "అమ్మచెట్టు", "నీటిపుట్ట", తుఫాను తుమ్మెద" – ఒక్కొక్క సంపుటి శీర్షిక ఒక్కో గంభీరభావసముద్రం. రెండే రెండు పదాల కావ్యశకలాలు. భాషనూ, భావాన్ని జమిలిగా పట్టుకొని కన్నెపిల్ల వల్లెవాటు మాదిరిగానో, కోడెయువకుడి ఉత్తరీయం మాదిరిగానో జాగ్రత్తగా కత్తిరించి కుట్టడం తెలిసిన ఆరితేరిన అక్షరాల దర్జీ దేవిప్రియ.

అమ్మతో కవి అనుబంధం అక్షరక్షరంలోనూ ఆర్ద్రంగా, సౌహార్దంగా తొణికిస లాడుతుంది. ఇంత పెద్దవాడైన తర్వాతకూడా కవి అమ్మ చెంగు పట్టుకొని బులిబులి నడకలు నడవడం, ఆ అనుభూతి అరక్షణం వయసునైన పుంజుకోనివ్వకుండా అలాగే అప్పటి స్థితిలోనే కాపాడుకొని అక్షరాల ఉలితో అందులోనుంచి కొత్త కొత్త శిల్పాలు సృష్టిస్తూ ఉండడం ఆయనకే చెల్లు. "అమ్మా! నీ పాటలో పొగాకు కంపెనీ సైరన్ మోత మరలా ప్రతిధ్వనించిందమ్మా, నీ పాటలో గుంటూరునుంచి హైదరాబాద్‌వరకూ వ్యాపించిన మన ఎడబాటు ఎడారిలో ఇసుకతుఫానులు నన్ను ఛిద్రఛిద్రం చేశాయమ్మా, నువ్వు ఇలా అమ్మ పాటను అనంతంగా అసంఖ్యాక కవితలుగా అవ్వచెప్పే కథల కల్హారమాలగా సృష్టించగల కవి. నిజంగానే అమ్మకవి. ఆయన కవిత్వమే అమ్మకవిత్వం.



ఒక అజంతా ఒక బైరాగి ఒక నగ్నముని ఒక దేవిప్రియ. సముద్రం అంచున కూచున్న ప్రతివారు సముద్రాన్ని చూసినవారు కాలేరు. దాని లోతును, వైశాల్యాన్ని కొలిచినవారు కాలేరు. దేవిప్రియ కవితా సముద్రాన్ని చవిచూడదలచేవారికి వాదాలకు, వివాదాలకు అతీతమైన జీవితపు చూపుకూడా ఉండాలి.

"ఇన్ని కట్టెపుల్లల కోసమో, పిడికెడు రేగుపళ్ళ కోసమో పులినోట్లో తలదూర్చే .....బాలచంద్రులే రేపు పులిమీదస్వారీ చేసే వీరాధివీరులు." పీడక వ్యవస్థ క్రౌర్యాన్ని బాధిత మానవుడి దుస్థితిని దూరంనుంచి చూసి రాయడం కాదు., అదే పడగనీడలో, అదే మనిషి అడుగుల్లో అడుగై అతడికి అక్షరాలగొడుగు పట్టడమే పరమావధిగా కవిత్వం రాస్తున్నవాడు దేవిప్రియ. దేవిప్రియ ఒకచోట చందమామను అందుకోవ డానికి దూసుకువెళ్ళే జానపదహీరోలా కనిపిస్తాడు. మరోచోట జేబులో భద్రంగా దాచుకున్న బాల్యపు జ్ఞాపకాలు జారిపోతాయేమోనని గతుక్కుమంటూ వాటిని జాగ్రత్త చేసుకుంటూ సాగిపోయే బాటసారిలా అనిపిస్తాడు. అనితరసాధ్యమైన దేవిప్రియ కవిత్వశైలిని అనుకరించవచ్చేమోగాని దానిలో పైనుంచి కిందిదాకా ఉండే మనిషితనపు తడిని ఎవ్వరూ సృష్టించలేరు. అదే దేవిప్రియ ఒరిజినాలిటీ.

జీవితాన్ని, జీవితపు ఆర్ద్రతను ఇంతలా "వెన్నెలకిరీటం" చేసుకొని ధరించిన కవి ముమ్మాటికీ అరుదు. దేవిప్రియ కవిత్వరీతిని లోతుగా అధ్యయనం చేసి, తెలుగు కవిత్వంలో దానికిగల ప్రత్యేక స్థానాన్ని నిర్దుష్టంగా నిర్ధారించవలసిన తప్పనిసరి చారిత్రక బాధ్యత విమర్శకులపై ఉన్నది.

*('తుఫానుతుమ్మెద' కి ముందుమాట)*

⚜

***పిరమిడ్‌లోపలి పీనుగు ఒంట్లో***
***మహాబలిపురం ఏనుగు కంట్లో***
***నేను చూశాను చరిత్రని***

(చరిత్ర : అమ్మచెట్టు)



నలిమెల భాస్కర్

# కవిత్వ రహస్యాలు తెలిసిన కవి

సున్నిత మనస్కుడైన మనిషి సమాజంలోని అపశ్రుతుల్ని చూసి తీవ్రంగా కదిలిపోతాడు. అలా వ్యాకుల హృదయుడైన వ్యక్తి ఒకవేళ కవి అయితే ఆ అపశ్రుతుల్ని బలమైన అభివ్యక్తులుగా అక్షరాల్లోకి ట్రాన్స్‌ఫామ్ చేస్తాడు. తన 'సూదంటురాయి' లాంటి కవిత్వశక్తితో సహృదయుల్ని ఆకర్షించి తనదైన ఒక భావుకతా ప్రపంచంలోకి తీసుకువెళతాడు. ఈ సున్నిత మనస్కత, వ్యాకుల హృదయం, ఉద్విగ్న భావుకతలు దేవిప్రియ 'నీటిపుట్ట'లో పుష్కలంగా కనిపిస్తాయి.

మదరాసు సిటీ బస్సుల్లో
*'అస్థిపంజరాలు*
*కూరగాయల బస్తాల మీద కూర్చుని*
*కునుకు తీస్తాయి'* (మదరాసు మల్లెలు)

వ్యక్తులు రక్తమాంసాలులేని ఉత్తనిర్జీవ అస్థిపంజరాలుగా కవి కంటికి కనిపించడం ఈ వ్యవస్థలోని అత్యంత దయనీయ స్థితికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

'శ్రమ' పద్యంలో –

*'ఎండవెన్నెల్లో*
*రైతుకూలీ శరీరం*
*సన్నాయికర్రై'*

అంటూ దేవిప్రియ రైతుకూలి సజీవ శరీరాన్ని సన్నాయికర్ర అనే వస్తు స్థితిలోకి మార్చి శ్రమ సంగీత సుస్వరాల్ని వినిపింపచేస్తాడు. నిప్పులు చెరిగే ఎండని వెన్నెలగా అధ్యారోహణం కావిస్తాడు. ఇంకోచోట శ్రమైక జీవులకు ప్రతీకలుగా ఆయా వస్తువుల్నీ, చిహ్నాల్నీ కవిత్వంలో బలంగా ప్రవేశపెడతాడు.

*పగలంతా రగిలిపోయి*



*చల్లగా విశ్రమిస్తున్న*
*పారలకి, పలుగులకి*
*కొడవళ్ళకి, కన్నీళ్ళకీ*
*నిద్రాభంగం కాకుండా*
*విచ్చుకత్తులు పట్టుకొని*
*పహారా కాయాలని వుంటుంది.*

అంటూ పారలూ, పలుగులూ మొదలైన పదాల్ని సాంకేతికంగా ఉపయోగిస్తాడు. దేవిప్రియ కవిత్వ రహస్యాలు తెలిసిన కవి. చేయి తిరిగిన శిల్ప నైపుణ్యం అతని చాల కవితల్లో గోచరిస్తుంది. కవిత్వ నిర్మాణ పద్ధతులు బాగా ఎరిగిన కవి కనుక దాదాపు ఏ పోయమ్ ముట్టుకున్నప్పటికీ చక్కగా బిల్డప్ చేస్తున్నట్లుంటుంది.

'పహారా' కవితలో

*'అంతా*
*లోకమంతా*
*శోకమంతా*
*శరీరమంతా నిద్రిస్తున్నప్పుడు*
*నేను మేలుకొని తిరగాలని ఉంటుంది*

అంటూ ఒక 'బిట్' ఇక్కడికి పూర్తవుతుంది. రెండవ 'బిట్' చివరలో 'జలజలా' పాకాలని వుంటుంది. తర్వాతి శకలాల్లో వరుసగా 'రెపరెపలాడాలని వుంటుంది' 'కవిత్వమై వర్షించాలని వుంటుంది' అని పూర్తవుతుంది. ఇది శిల్పమర్మం తెలిసిన కవి పనితనం. కవిత్వాన్ని ఎంతో శ్రద్ధగా ఫ్రేమ్‌లోకి బిగిస్తే తప్ప అది పఠితల గుండెగోడలమీద స్థిరనివాసం చేయదు, పైగా దేవిప్రియకు వాగర్థాలు రెండూ ప్రధానమే! కవిత్వంలో శబ్దాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయడు. 'అంతా లోకమంతా శోకమంతా....' యిలా ఎత్తుకోవడంలో పద్యానికి, ప్రారంభంలోనే ఒక తూగు, ఒక భావలయ సిద్ధించి జోడుగుర్రాల (వాగర్థాలు) శకటమై కవిత్వం భాసిల్లుతుంది. 'నీటిపుట్ట' లోని కవితలు దాదాపు ఎనభై, తొంభైలమధ్య వచ్చినవి కాబట్టి ఆ దశాబ్దిలో రూపపరంగా వచ్చిన మార్పుల్నికూడా అవి ప్రతిఫలింపచేస్తాయి. దేవిప్రియకు రంగుల రహస్యంకూడా బాగా తెలుసు. గొప్ప చిత్రకారుడిలా కళ్ళ ముందు బొమ్మ కట్టింపచేసే విద్య అందరికీ అబ్బేది కాదు...

'శ్రమ' కవితకు –

*ఎండలో*
*ఎత్తిన పలుగులు*
*ఉత్తేజంతో మెరుస్తాయి.*

అంటూ అంకురార్పణ జరుగుతుంది. అది 'నుదురు అద్దంమీంచి చెమట బిందువులు బంగారు చుక్కలై మట్టిపెళ్ళలమీద రాలుతాయి' గా ...లెత్తి పుష్పించి



క్రమంగా ఫలశ్రుతిలోకి మారుతుంది. ముందు స్పష్టమైన ఔట్‌లైన్సు వేసుకుని ఆ తర్వాత్తర్వాత్త అపూర్వమైన తన కల్పనాశాలీనతతో సామాజిక వాస్తవాలనుండి వైదొలగకుండానే దేవిప్రియ మనల్ని నిలువునా కవిత్వమయం చేస్తాడు. దేవిప్రియ పదాలను సాలోచనగా, స్ఫూర్తిమంతంగా వాడతాడనడానికి ...

*సముద్రం నిద్రిస్తే*
*ఆకాశం కలలోకొస్తుంది*
*సిగనిండా చుక్కల్ని తురుముకొని*
*కళ్ళనిండా కాటుక రేఖల్ని దిద్దుకొని,*

అనే పంక్తులు ఉదాహరణ. అది రాత్రి కనుక 'ఆకాశం కళ్ళనిండా కాటుక రేఖల్ని దిద్దుకోవడం' సమయోచితం.

నీటిపుట్టలో పదప్రయోగాలు సరికొత్తగానూ, కాయినేజ్ కావడానికి వీలుగానూ వుంటాయి. 'నీటిపుట్ట, నిప్పుపురుగు' ఇలాంటి కొత్త మాటలు సమాస రూపాల్లో చాలా కనిపిస్తాయి.

దేవిప్రియ కవిత్వానికి సామాజిక వాస్తవికత గొప్ప ఉత్ప్రేరకం. సమూహాన్ని ప్రాణప్రదంగా ప్రేమించే గుణం అనేక కవితల్లో కనిపిస్తుంది.

*'నేను ఒంటరిగా వుండికూడా*
*నలుగురి వాడినవుతాను'*

అంటూ 'ఐసోలేట్' అయినప్పటికి సోషలైజేషన్ గురించే ఆలోచిస్తాడు.

*మరోచోట –*
*నన్ను*
*ఒక్కడినే ఫోటో తీసినా*
*కడిగి చూస్తే అందులో*
*మీరందరూ కనబడతారు.*

అంటూ చమత్కృతితో మేళవించిన సామూహిక చేతనను తన అక్షరాల్లో అత్యద్భుతంగా పలికిస్తాడు. దేవిప్రియ 'నీటిపుట్ట'కు పెద్ద రిసోర్సు విప్లవ సానుభూతి. ఎంతో బలంగాను; మరెంతో సజీవంగాను కవిగొంతు 'స్మృతిగీతం, ఖాళీ కుర్చీలు, హిట్లర్ నవ్వు' మొదలైన కవితల్లో స్పష్టంగా వినిపిస్తుంది.

*'మీ సమాధులు*
*సమాధులు కావు'*

అంటూ మొదలవుతుంది 'స్మృతిగీతం'

*మీ త్యాగాలు*
*పరిమళించిన*

'స్మృతుల పొదల మీద మేఘాలు ఆగి వర్షించడం, నదులు ప్రవాహమార్గం మార్చుకుని పాదపీఠాలను ముద్దాడడం....' ఉదాత్తమైన అభివ్యక్తులు. సామాజిక



పరివర్తన కొరకు సర్వం త్యాగం చేసిన వీరుల సాహసాలను ఉన్నతీకరించే క్రమంలో కవి నిజాయితీ చాలా గొప్పగా బయటపడుతుంది.

మిత్రులారా,
*భుజంమీద తుపాకులతో*
*విప్పారిన ఆశానేత్ర పత్రాలతో*
*అరణ్యాలై, ఆకాశాలై*
*ప్రకృతినిండా ప్రసరిస్తున్న*
*మీరుకూడా*
*ఈ రెండు ఖాళీ కుర్చీలలో*
*నాకు పదేపదే దర్శనమిస్తారు.* (ఖాళీ కుర్చీలు)

అంటూ వీరుల విశ్వరూప సందర్శన భాగ్యం లభించిన విప్లవ సానుభూతి పరుడిగా 'ఖాళీ కుర్చీల'ను సాయుధ వీరులకు ప్రతిరూపాలుగా సింబలైజ్ చేస్తాడు.

ఒక కల హఠాత్తుగా భగ్నమై శ్రమైక జీవన సౌందర్యం ముక్కలు చెక్కలైపోగా ప్రపంచీకరణ, ప్రవేటీకరణ, సరళీకరణలు యింకా వేదమంత్రాలుగా ఉచ్ఛరించ బడటానికి చాలారోజులు ముందే కవి 'హిట్లర్‌నవ్వు'ను పసిగట్టి బలమైన కవిత్వం రాశాడు. 'అగణిత త్యాగాల అసంఖ్యాక రేకల ఎర్రపువ్వు మాడిమసై పోవడం, చైనా గోడ బురుజులలో హిట్లర్ నవ్వు ప్రతిధ్వనించడం కవిని కలవరం పెట్టిన సన్నివేశాలు.

దేవిప్రియ కవిత్వానికి ఒక స్పష్టమైన మేనిఫెస్టో 'ద్వయం' కవిత.

*నాకు*
*రెండు నిధులున్నాయి*
*నాలుక మీద కవిత్వం*
*తలమీద దారిద్ర్యం;*

*నాకు రెండు విధులున్నాయి*
*కవిత్వ నిత్య నిబద్ధం*
*దారిద్ర్య విముక్తి యుద్ధం!*

యింత స్పష్టంగా తన దారిని నిర్వచించుకున్న కవి చాల సందర్భాల్లో ఢీలా పడిపోతాడు, నిరాశలో కూరుకుపోతాడు, పెరిగిపోతున్న 'అవ్యవస్థ'ల పట్ల ఒక్కసారి నిర్వేదంలోకి జారిపోతాడు, టైటిల్ పోయం 'నీటిపుట్టలో'లో అనేక వైరుధ్యాలమధ్య ద్వైధీభావాల నడుమ కొట్టుకొంటోన్న కవి కనిపిస్తాడు.

అయితే దేవిప్రియలోని పాజిటివ్ లక్షణం... ఆశావాదాన్ని ఉద్దీప్తం చేసినా, నిరాశావాదిలా బాధపడినా నిఖార్సైన కవిత్వాన్ని పలికించి, నిండైన ఆర్తిని అక్షరాలకు అద్దుతాడు. తీగసాగిన దుఃఖంలో కవిత్వ చరణాలను ముంచుతాడు.

ఫెళ ఫెళలాడే ఎండనీ



ప్రవహిస్తున్న చెమటను ధరించిన

రిక్షావాలాను ఒక మహామానవుడిలా చిత్రించే మానవీయ స్పర్శను విస్మరించడు.

'సంజాయిషీ'లో

ఇనుపగేటు సందుల్లోంచి

ఖాళీ గిన్నెలు చాచిన చేతులు అంటూ మనల్ని ఉన్నపళంగా దుఃఖభాజనులను చేస్తాడు.

*'ఆకాశంచెట్టుకి కట్టిన*

*అద్భుతమైన ఊయలలా వుంది విమానం'*

గాలి పొట్టని

పరపరా కోసుకువెళుతున్న ఖడ్గంలా వుంది విమానంలాంటి ఊహాశాలీనతతో ఉపమల పరంపరల్ని తామరతంపరులుగా వెదజల్లుతాడు.

*'గాలానికి తగిలిన చేపపిల్ల కన్నీళ్ళు*

*కాలువ నీళ్ళలో కలిసి*

కనబడకుండా పోతాయి (కోత) అంటూ కత్తికోతకు గురిచేస్తాయి కొన్ని పంక్తులు. అటు వస్తు వైవిధ్యాన్ని, ఇటు శిల్ప వైవిధ్యాన్నీ సరిసమానంగా వరిపోషిస్తూ వచ్చిన దేవిప్రియలో కనిపించిన అనేక పార్శ్వాలున్నాయి. గుండె శూన్యంతో బరువెక్కినప్పుడల్లా కాసేపు 'ఒక గుడిసె కథ' లాంటి కవిత్వం రాసి మనల్ని నిలువనివ్వని గుణం దేవిప్రియది. అరుదుగా రాసినప్పటికీ, కలకాలం నిలిచిపోగల 'నిలుకడ వలయు కృతికి' అనే రహస్యం తెలిసిన కవి దేవిప్రియ.

*(దేవి'30 'స్వరపత్రం' 2002 నుంచి)*

**ఖాళీసీసాని పారేయకు**

**పగలేయ్**

**ఆయుధమవుతుంది,**

**అది**

**రేపటి సంగ్రామానికి**

**ఈనాడే సమాయత్తమవుతుంది**

(సీసాయుధం : అమ్మచెట్టు)





అఫ్సర్

# అంతర్ముఖీనత ఆయన ప్రత్యేకత

మహాకవి అయ్యప్ప ఫణిక్కర్ ఓ కవితలో –

Yesterday-or was it the day before -
I met whitman the Whitman
who talks aloud in the solitude
of the mulitude.

అంటారు. అలా అంతర్ముఖీన వేళల్లోనూ ప్రకాశంగా సామూహిక గానం చేయ గలిగిన కవి దేవిప్రియ. కవిత్వం ఏదో వొక కొసకి వెళ్ళితీరాల్సిందేనేమోనన్న భావన బలంగా వీస్తున్నకాలంలో, 'నిబద్ధత' నిర్వచనాన్ని విస్తరించుకున్న తరంలో ఊగిసలాటలేని కవిత్వవ్యక్తీకరణా, నిస్సంకోచమైన సామూహికశక్తీ అవహించిన కవి దేవిప్రియ. బహిర్ముఖచిత్రాల్ని స్పష్టంగా చిత్రిస్తున్న దేవిప్రియలో సమకాలీన కవులకు లేని ఓ ప్రత్యేకత వుంది… అది ఆయన అంతర్ముఖీనత ! ఆ కారణంవల్లనే దేవిప్రియ కవిత్వం 'నిత్యనిబద్ధం'గా వుంటూనే, సున్నితమైన పార్శ్వాల్ని కోల్పోకుండా మూడు పదుల కాలం తాజా పరిమళంలా వీస్తోంది. దేవిప్రియ జీవితం వడ్డించిన విస్తరి కాదు. 'పొగాకు కంపెనీ సైరన్ మోత' జీవితాన్ని శాసించే నేపథ్యంలో దేవిప్రియ పుట్టారు. 'ఒక గుడిసె కథ' కవితలో దేవిప్రియ తన కవిత్వానికి ప్రాథమికమైన ముడిసరుకులేమిటో చెప్పారు. తన పంచేంద్రియాల ద్వారా సంపాదించుకునే జ్ఞానం కవికి ఎప్పుడూ ప్రాథమికమైందే. ప్రేరణలు ప్రభావాలుగా స్థిరపడకముందు కవిలో నిక్షిప్తమైన భావసంపుటి అది. వ్యక్తిజీవనసారాన్ని సాంద్రతరం చేసేవి ఈ భావాలేనని ఫ్రాయిడ్ అంటాడు. అలా దేవిప్రియ జీవనతాత్వికతని నిర్దేశించే చూపుడువేళ్ళు 'ఒక గుడిసె కథ'లో కనిపిస్తాయి.

'ఈ గుడిసెలోనే నా ప్రపంచం ఉదయించింది' అని అంటున్నప్పుడు ఆ



ప్రపంచం కేవలం భౌతిక ప్రపంచం కాదు. కొత్త వ్యక్తిత్వాన్ని రూపుదిద్దే తాత్విక ప్రపంచం. ఈ కవితలో గతంమీది జాలీ, ప్రేమా మాత్రమే కాదు, వర్తమానంనుంచి భవిష్యత్తులోకి సాధికారికంగా నడిచివెళ్ళగలిగిన ఆత్మ స్థైర్యం వుంది. అయితే, దేవిప్రియ ఆలోచనలమీద ముద్రవేసిన పరోక్ష అనుభవాల ప్రస్తావన 'పుట్టినరోజు గురించి' అనే కవితలో చూడవచ్చు.

*'నా పుట్టిన రోజుదేముంది*
*ఒక కాడ్వెల్ తరువాత*
*ఒక శ్రీశ్రీ తరువాత*
*ఒక పాణిగ్రాహి తరువాత*
*ఒక చెరబండరాజు తరువాత*
*పుట్టినవాణ్ని నేను'*

– ఈ నాలుగు పేర్లు కేవలం పేర్లు కాదు, చరిత్ర వికాసానికి సంకేతాలు. కాడ్వెల్‌ని మినహాయిస్తే, మిగిలిన మూడు పేర్లు తెలుగు సాంస్కృతికజీవనం తిరిగిన మలుపులే.

ఈ రెండు కవితలు దేవిప్రియ కవిత్వవ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తాయి. 'పైగంబరకవి'గా కన్ను తెరచిన దేవిప్రియ తర్వాత్తర్వాత ఏ వర్గం భావజాలానికి ప్రాతినిధ్యం వహించారో 'నీటిపుట్ట', 'తుఫాను తుమ్మెద' సంపుటాల్లో తేటపడుతుంది. ఈ రెండు సంపుటాలు ఇరవయేళ్ళ కాలవ్యవధిలో అచ్చయ్యాయి. చిరకాలస్వప్నమైన 'శ్రామికస్వర్గం' కళ్ళముందే నరకప్రాయమైన స్థితినికూడా వీక్షించిన కాలం ఇది. 'కార్మికవర్గం త్యాగాలు చేసి నిర్మించుకున్న సోషలిస్టు ప్రపంచంలో ఒకవైపు సోషలిస్టు వ్యతిరేక సంచలనం, మరోవైపు ప్రజాస్వామ్య వ్యతిరేక హింసాకాండ సోషలిస్టు సిద్ధాంతాభిమానులను తప్పకుండా కలవరపెట్టే అంశాలు.' (చే.రా. సాహిత్యవిమర్శ – పరామర్శ). 'హిట్లర్ నవ్వు' ఈ కలవరపాటుకి కవిత్వీకరణ. చరిత్రకి సంబంధించిన చైతన్యాన్ని మార్క్సిస్టు దృక్పథంతో వ్యక్తం చేసిన కవిత్వంలో 'హిట్లర్ నవ్వు' ఒకటి. ఈ కవిత అంతా తూర్పు యూరప్ అనంతర ప్రపంచాన్ని అన్వేషించే ప్రయత్నమే. దానికి సంబంధించిన మైలురాళ్ళనీ, మేలురాళ్ళనీ వెతుక్కునే పోరాటమే.

*ఎక్కడ*
*ఏ పాతపుస్తకాల కొట్లో*
*ఏ మూలనబడి వున్నారు బాబూ*
*మార్క్సులు ఎంగెల్సులూ–*
*ఎక్కడ ఏ సుందర సమాధులమీది*
*వాడిన పూదొంతరల కింద*



*వెక్కి వెక్కి ఏడుస్తున్నారు బాబూ*

*లెనిన్‌లూ గోర్కీలూ...*

ఇలా ఈ తరం చైతన్యానికి గీటురాయిగా మిగిలిన తెలంగాణా, చేగువేరా, చిత్తప్రసాద్‌లు అంతా ఈ 'హిట్లర్ నవ్వు' కింద కనిపిస్తారు, వినిపిస్తారు. దేవిప్రియ కవిత్వంలో 'నీటిపుట్ట' నుండి చరిత్రస్పృహ బలపడటం ప్రారంభమైంది. 'తుఫాను తుమ్మెద' వచ్చేసరికి అది ఇంకా సాంద్రమైంది. 'జరిగిన కథ' ని వర్తమానంతో బేరీజు వేసుకోవడంలో దేవిప్రియ తనదే అయిన దృక్కోణాన్ని చూపిస్తారు.

*ఎవరి స్వతంత్రం కోసం ఎవరు మృత్యువుకు బందీలయ్యారో*

*ఎవరి పతాకాల కోసం ఎవరు నెత్తురు కలిసిన రంగులయ్యారో*

*ఎవరి జాతీయగీతాలకోసం ఎవరు రాగాలయ్యారో, త్యాగాలయ్యారో*

*అవునేమో, చరిత్ర లెక్కల పుస్తకం కాదేమో !*

అంటారు.

'నీటిపుట్ట' ప్రధానంగా ఈ సందిగ్ధసమరానికి ప్రత్యక్షసాక్షి కాబట్టి, అందులో చాలా కవితలు ఈ కోణంనుంచే బయలుదేరుతాయి. చరిత్రని గురించి కొత్త ఆలోచనలు జరుగుతున్న సందర్భంలో ఒక పురోగమనశీలి తన సాక్ష్యాన్ని కవితాత్మకంగా రికార్డు చేయడం 'నీటిపుట్ట'లో చూడవచ్చు. నిబద్ధత నిప్పు ఆరిపోతున్న పరిస్థితినికూడా దేవిప్రియ గమనించకపోలేదు. తూర్పునుంచి పడమరకు ఓటమితో వాలిపోతున్న విషాదాన్ని గమనించారు కనుకే ఆయన 'నిర్భీతి రక్తానివై' ప్రవహించమని కవిత్వాన్ని ఆదేశించారు. 'అంతుపట్టని ఆదిరహస్యం మానవుడు' అనే కవితలో దేవిప్రియ చారిత్రకదృష్టి ఇంకా పదునుగా అనిపిస్తుంది. చైనాలో అమెరికా పెట్టుబడులు, రష్యాలో డిస్కో సంస్కృతి అంటారు. శ్రమలోని ఆనందాన్ని, సౌందర్యాన్ని మరచిపోతున్న తరంలోకి అప్పుడప్పుడే ప్రవేశిస్తున్న కాలం అది. అలాంటి స్థితిలో...

*'పగలంతా రగిలిపోయి*

*చల్లగా విశ్రమిస్తున్న*

*పారలకీ, పలుగులకీ*

*కొడవళ్ళకీ, కన్నీళ్ళకీ*

*నిద్రాభంగం కాకుండా*

*విచ్చుకత్తులు పట్టుకుని*

*పహరా కాయాలని వుంటుంది'* అంటారు.

'అమ్మచెట్టు' నుంచి 'తుఫాను తుమ్మెద' దాకా అనేక సందర్భాల్లో, సన్నివేశాల్లో సౌందర్యాన్ని దేవిప్రియ పాడతారు. ఆ పాట సహజంగా, చెమటబొట్టంత అచ్చంగా వుండటం దేవిప్రియ ప్రత్యేకత. దారిద్ర్యాన్నికూడా సహజమైన 'నిధిలా' స్వీకరించారు



కాబట్టే ఆయన స్వేదంలోని అందాన్ని చూడగలిగారు. రెక్కలు ముక్కలైతే తప్ప పూట గడవని పేదరికం, చెమటబొట్టుని తప్ప ఇంక ఏ దేవుణ్ణి గట్టిగా నమ్ముకోలేని కన్నతల్లి అందించిన ప్రేమ ఆయనలో ఈ శ్రమైకజీవన భావనకి పునాదినిచ్చి వుంటాయి. అన్ని సంఘర్షణలూ విఫలమయ్యాయని అనిపించిన 80ల తర్వాత ఆయన కన్నతల్లి, పెంచిన వూరు, ప్రేమల్ని పంచిన పూర్వస్నేహితులూ, స్వచ్ఛమైన అనురాగానికి చిరునామాలైన మనుషులూ ఆయన కవిత్వంలోకి ప్రవేశించడానికి, ఆయన తాత్త్విక స్థాయిలో ప్రేమిస్తున్న శ్రమైకజీవనభావనకీ సంబంధం వుంది. నిజానికి ఇవన్నీ ఒకే అన్వేషణకి భిన్నరూపాలు.

దేవిప్రియ కవిగా, వ్యక్తిగాకూడా ఏనాడు వ్యక్తివాది కారు. వొంటరిగా తనలో తాను అన్నట్టుగా కనిపించే దేవిప్రియ సమూహాన్ని ప్రేమిస్తారు. తన 'సాలిట్యూడ్'లోకి వెళ్ళి 'మల్టీట్యూడ్' ని ఆహ్వానిస్తారు. గుంపులో నిలబడి ఘనంగా కేకవేయడం కన్నా, తనలోకి వెళ్ళి ఓ బిగ్గర కేక వేయడానికే ఎక్కువ సహనం కావాలి. ఆ విధంగా ఆయన సాహసి. నిశ్శబ్దంగా కనిపించే ఈ కవి శబ్దాన్ని అమితంగా ప్రేమిస్తారు. కాని ఆయన కోరుకునే శబ్దం గద్దర్ పాటల గజ్జెల మోతలో వుంది.

*నిస్తబ్ద లోకంలోకి*
*ప్రభంజనంలా హోరెత్తి పరుగెత్తే...*

ఆ గద్దర్ గజ్జెల శబ్దానికి వొక కవిత్వప్రతీకగా మారేంత గాంభీర్యాన్నీ, ఔన్నత్యాన్ని ఇచ్చిన కవి దేవిప్రియే. బహుశా గద్దర్‌ని వొక ప్రతీకగా అంత బలంగా వుపయోగించుకున్న కవి మరొకరు కనిపించరేమో ! తుఫాను తుమ్మెద ఝుంకారాన్ని అక్షరంలోకి వొడిసిపట్టుకునేంతటి శక్తి ఆయనకే సాధ్యపడిందేమో! ఇది సాధ్యపడడానికి ఒకే వొక కారణం ఆయనలోని Sense of history. Edward Said వొక సందర్భంలో అంటాడు. a historical sense of what real experiences actually go into the making of a work of literature....

అలాంటి 'సెన్స్ ఆఫ్ హిస్టరీ'ని కోల్పోకపోవడం వల్లనే దేవిప్రియ ఏ సామాజిక వైరుధ్యాలు, ఏ వైయక్తిక జీవన సంఘర్షణలూ, ఏ అల్లకల్లోలాలూ ఆయనలోని 'అవిచ్ఛిన్నత'ని గాయపరచలేకపోయాయి. నిజమైన అనుభవాల కాంతిపేటికని ఎప్పుడూ భద్రంగా వుంచుకోవడమే ఆయన కవిత్వవిజయం. అదే ఆయన మూడు పదుల జీవనసత్యం !

ఆ 'సత్యాన్వేషణలోనే ఆయన
పావురాన్నై
పర్వతాలు చుట్టివస్తాను
*గాలిదుమారాన్నై*

గగనతలాన్ని చుట్టచుట్టుకుపోతాను
తుఫానునై
దిక్కులన్నీ తుడిచిపెడతాను
నక్షత్రమండలాన్నై
మానవనేత్రాలను వెలుగువరదలో ముంచెత్తుతాను
మంచుఢక్కనై
భూనభోంతరాళాలు పారదర్శకంగా ప్రతిధ్వనిస్తాను
శీతల పవన ప్రకంపనాన్నై
ప్రకృతి నవనాడులనూ జివ్వుమనిపిస్తాను
.... అంటారు. అదే ఆయన జీవన, కవిత్వసారాంశం.

*(దేవి '30' 'స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

***చావంటే***
***ఊపిరి శరీరాన్ని విడిచిపోవడం కాదు***
***ఆశయం ఆచరణని వదిలివెళ్ళడం,***
***చావంటే***
***నరమాంసం స్మశానానికి అమ్ముడుపోవడం కాదు,***
***ఆలోచనల మీద స్మశానాలు మొలవడం!***

(ప్రాణపరిమళం : అమ్మచెట్టు)



జ్వాలాముఖి

# మెత్తని పదజాలం.. పదునైన భావజాలం

కవిత్వమంటే అనుభూతిసౌకుమార్యమనే ధోరణి భావకవిత్వ వారసత్వంగా బలపడింది. ఆ ఆత్మాశ్రయతత్వం సౌందర్యాన్వేషణను పెంచింది. సౌందర్యాన్ని సంస్కారపరిధిలోకి తేవడానికి ఇష్టపడలేదు అనుభూతివాదులు. తనకు లభించినట్లే తన తోటిమానవులకూ బతుకుసౌకర్యం లభించాలని అనుభవాల సాంద్రత లాలించాలని సౌందర్యప్రియులేనాడూ భావించలేదు.

తన్నుకువచ్చిన చరిత్ర, తోసుకువచ్చిన ప్రపంచం, దేవిప్రియవంటి భావుకుడిని లాక్కొనివచ్చి దుర్భర పరిస్థితుల్లో పడేసింది. విలవిల కొట్టుకున్నాడు. శాపనార్థాలు పెట్టుకున్నాడు. మొండికేసిన పరిస్థితుల్ని గుండెతో ఢీకొన్నాడు.

*"ఉద్యమాలలో యుద్ధాలలో*
*అలసిపోయిన*
*అవయవాల్నీ ఆలోచనల్నీ*
*కొమ్మ చేతులమీద మోసుకుపోయే*
*అమ్మ నా చెట్టు"*

నిజానికి ఇక్కడ 'అవయవాల' ప్రసక్తి అనవసరం. 'ఆలోచనలు' యుద్ధాలు చేస్తున్నప్పుడు, ఉద్యమాల్లో ఈదుతున్నప్పుడు విషయం భౌతికంగా వాచ్యం కాకూడదు. ఆత్మాశ్రయ వారసత్వం ఆవహించిన ఘట్టంలో తాత్విక చింతన అలసట అవయవ అభివ్యక్తినాశ్రయించింది.

*"కన్నీటి కాయలు కాసే*
*జీవితం చెట్టు;*
*ఆకురాల్చడమే కాదు*
*చెట్టుకి ఆకు తొడగడంకూడా తెలుసు*
*ప్రభంజనాలు వీచడంకూడా తెలుసు"*





ప్రభంజనాలు వీచే కాలం. 70వ దశకం దందహ్యమానంలో గుండె అక్షయత్వం కన్నా ఆలోచనల యుద్ధాలే కవిని "అమ్మచెట్టు"ను చేసింది. తెలియకుండానే కవిని "శ్రమవృక్షం" ఆశ్రయించేట్టు చేసింది. "విల్లనంబు" ప్రాసంగికంగా దూసుకువచ్చింది. "బాంబులతో బంతులాడుకునే, అంతర్జాతీయ రాజకీయ క్రీడాకారులు" మోహరించిన ప్రపంచంలో "పసిపిల్లల రక్తపుటేళ్ళమీద యుద్ధవిమానాలు – జరుగబోతున్న యుద్ధాలు – దేశాల్ని తాకట్టు పెట్టేవాళ్ళు – కవి భావనా ప్రపంచంలో "ఆవేదనల్ని మోసేవారు ఆందోళనలై లేచేవారు కథానాయకులై సాక్షాత్కరించారు – కవిని "రెండు నేత్రాలలోనూ, రెండు సూర్యబింబాలు, బిగించిన పిడికిలిలో కాగడాగా మండుతూ కలం, నేను, నవతరం కవి" అంటూ ఆత్మాశ్రయ కవి జనాశ్రయ రవిలా ప్రకాశించాడు. ఇది "అమ్మచెట్టు" దృశ్యంలోని కాలాశ్రయ సాదృశ్యం. ఇది 1972 – 1979 నాటి భావుకత చింతనగా మారి 'అడవి' సాయం కోరిన నగరవైముఖ్యం.

1980–90 దశకంలో జీవిత సంక్లిష్టతను కల్పించుకొని గందరగోళపడ్డ చేరాతల కాలంలో సౌందర్యజిజ్ఞాసకు సామాజిక నిబద్ధతకు సమన్వయం చేకూర్చడానికి అక్షర యుద్ధం చేశారు.

*"నీ గుండె పువ్వు తెంచి*
*వాడి చేతిలో పెట్టు*
*వాడు*
*దాన్ని రెమ్మలు విడదీసి*
*అమ్ముకుంటాడు"*

'ప్రపంచీకరణ' వాకిట్లో తలుపు తట్టుతున్న కాలంలో ఆత్మీయానుభూతి బజారు స్థాయికి దిగజారిన దుస్థితి వచ్చిన వైరుధ్యంలో, సమాజ (వర్గ) స్వభావాన్ని జీవిత సుకుమార అనుభూతికి బింబప్రతిబింబ స్వరూపాన్ని చూపుతూనే గుండె తడిని కాపాడాడు కవి. కవి ఎంత హృదయవాదో అంతజ్ఞాని. "దోపిడీ" ని కొలిచే "కాలమాపకం." కవిలో "యేదో నిప్పు పురుగు(లా) తొలుస్తోంది !

*"అక్షరాలు మొలుస్తున్న*
*తెల్లకాగితం నేలంతా*
*కోసిన జొన్న చేనులా,*
*పిడిబాకుల బీడులా కనిపిస్తుంది"*

కవి ప్రతిక్షణం అక్షరాన్ని వెదికే యుగచింతకుడు –

*"దుఃఖం*
*కవిత్వం కాలేకపోయినప్పుడు*
*నిప్పు*



*జ్వాలాశిఖరం కాదు*

*నా*

*వేదనా కుసుమమే*

*జనచైతన్యమై ఫలిస్తుంది"*

వ్యక్తి దుఃఖానికి, పరాకాష్టగా కవిత్వం రావడం యుగసంస్కారం. ఆ సంస్కారమే జ్వాలా శిఖరమవుతుంది. కవి వేదనాకుసుమమే జనచైతన్యమై ఫలిస్తుంది. నిబద్ధకవి సాక్షాత్కరించే సన్నివేశం – కవి తనలో తాను ముడుచుకపోయినప్పుడు "రాయనితనం" సృజనశీలిని పట్టిపీడిస్తుంది.

*"లోచెట్టు కొమ్మ కదిలి*

*ఆలోచనఆకు చివరినుంచి*

*కన్నీటి బొట్టొకటి రాలి*

*చైతన్యమోహంలో*

*నన్ను ముంచెత్తదా?"*

ఒక అమరవీరుడు లేచివచ్చి కవి మగతని ఛెళ్ళుమనేలా తొలగించిన సామాజిక సందర్భం. చచ్చిపోతున్న కవికి ప్రాణం పోశాడు "అమరవీరుడు."

*"ఈ ప్రపంచం*

*నా ప్రపంచంలోనే వుంది*

*నా ప్రపంచం*

*నా ప్రజల దీనమైన చూపుల చివర*

*నా జనులు పదునుపెట్టిన ఆయుధాల*

*అంచులమీద తేలే మిరుమిట్లలో వుంది*

*నా రేపటి లోకం*

*ఈనాటి కల్పనలోనే*

*యిమిడి వుంది "*

కవికీ ప్రపంచానికీ వైరుధ్యమూవుంది. అది సంఘీభావంవల్ల తొలిగి పోయింది. నిజానికి తనకూ ప్రపంచానికీమధ్య వచ్చే వైరుధ్యం తొలిగేదాకా పోరాడే అక్షరయోధుడు. కవి "ఒంటరిగా వుండికూడా నలుగురి మనిషి"గా తయారయ్యే చైతన్య ప్రపంచం.

"గుడిసె" శాపగ్రస్తజీవితానికి వర్గసమాజంలో ఒక గుర్తు. దుఃఖానికి దుర్భర దారిద్ర్యానికి, పరాధీనతకు ప్రతీక. కాని ఈ కవి ఊపిరిపీల్చిన వారసత్వం పోరాటాల అంతేవాసిత్వం. పలనాటి పోరాటాల ఆయుధపూజల జ్ఞాపకంగా నేటి "కానరాని కన్నీటి సముద్రాలు ఉప్పొంగే" గూడులా ఎదురు పడగానే కవి చరిత్రకారుడయ్యాడు.



*"అప్పుడే నాకు తొలిసారి*
*ఈ గుడిసెమీద కప్పిన రెల్లు పోచలు*
*బరిసలై పోకూడదా అనిపించింది.*
*మా అమ్మతోడు,*
*అప్పటినుంచి మా గుడిసె నా కళ్ళకి*
*ఆయుధాల పూజలందుకొనే*
*కారంపూడి వీరుల గుడిలాగే కనిపిస్తుంది !"*

'ఒక గుడిసె కథ'కు పరిష్కారం ఒక సాయుధ పోరాటమనే అభిప్రాయాన్ని కవి ముందుకు తెచ్చాడు. దాని సాధ్యాసాధ్యాలు చరిత్రకు వదిలేశాడు. గూడు కట్టిన గుడిసె కానరాని కన్నీటి సముద్రాల ఉప్పెన పోరాటవీరుల సాహసంతోనే తొలుగుతుందని చరిత్రగాథను ప్రాసంగికం చేశాడు. ఇక్కడ "సంక్లిష్టత" లేదు. ఆలోచన స్పష్టంగా వున్నప్పుడు, "అవగాహన" చరిత్రగతిని తెలుసుకున్నప్పుడు అకడమిక్ దారిద్ర్యం ఆవహించదు. అభివ్యక్తి నిర్దిష్టంగా ముందుకువస్తుంది. "మహా విప్లవ వాంఛా వివస్త్ర ప్రభంజనాన్ని ఆహ్వానించే" భావునికునిలాగా కవి తనను తాను పుటం పెట్టుకున్నాడు! కవి 'ఎందుకు చిరసముపార్జిత సామాజిక జ్ఞానం రిఫ్రిజిరేటర్‌లో మంచుముద్దై మౌనం వహిస్తుందో, ఎందుకు కవి క్షుభిత యోచనల నీటిపుట్టై సూర్య చంద్రాక్షారాలను చేపచెదలు తినివేస్తుందో, ఎందుకు చంద్రుడి శీతలానికి సూర్యుడు కరిగి ప్రవహిస్తున్నాడో" !?! ఆ... "సదసత్సంశయానికి కారణం ఆత్మాశ్రయసాంద్రత సామాజీకరణ చెందకపోవడమే.

మరో పదేళ్ళు గడిచేటప్పటికి కవికి శబ్దసాంద్రత, బింబవైవిధ్యం తెచ్చిన సమ్మర్ధంనుండి బయటపడే అవకాశం వచ్చింది. మితిమీరిన ఉపమలు, రూపకాలు, మున్నగు అలంకారాలు "అర్థగౌరవాన్ని" గల్లంతు చేస్తాయి. సందేహ కవిత్వాలు, యుగావేశాలు, సందర్భ సమాధానాలు వెతికే వారికి నిర్దిష్టత చాలా అవసరం. కవిత్వం అసందర్భంగా చిక్కనవుతున్న కొద్దీ, కాలం కోరే సమాధానం దూరం అవుతుంది.

*"సూర్యఢమరుకం చేత బూనిన*
*ఉద్విగ్న ఉన్మాదవివశతాండవరూపం*
*నల్లమబ్బుగొంగళి భుజాన వేసుకున్న*
*భువన జనహవన ఘోష"*

ఒక జనవైతాళికుని (గద్దరు) బొమ్మ కట్టించిన పరవశనాందీప్రస్తావన. అలంకారిక ఆవేశం, భావైక్యంచెందే రసావిష్కారం.

*"అది మా మర్మనర్మ కవన కవచం కాదు*
*అది తీరాన*



*లాంతరు పట్టుకుని నిశ్చింతగా నిలిచిన లైట్ హౌస్ కాదు*
*అది కల్లోల కడలిలో*
*కొట్టుమిట్టాడుతున్న కొయ్యపడవ,*
*ప్రపంచం కోసం ఇంకా*
*పాటలు మోసుకొస్తున్న తుఫానుతుమ్మెద"* !

గద్దర్‌ని పార్టీ దూరంగావుంచే ప్రయత్నం చేస్తున్నదని వార్తలు వచ్చిన సన్నివేశాన్ని బొమ్మకట్టించే సందర్భంలో కవి తాదాత్మ్యం చెంది రాసిన పంక్తులు చారిత్రక యదార్థాలు. రసావిష్కరణలు అద్భుతం.

"కాదుకాదు" లోంచి "ఔను ఔను" వెదకడం దేవిప్రియ కవితా రహస్యం. ఇది భారతీయ తాత్విక ప్రపంచంలోని "నేతి నేతి" "సత్యాన్వేషణ"లోంచి వచ్చిపడే నిష్ఠుర నైజం.

దేవిప్రియలో పుష్కలమైన శబ్దసౌందర్యం వుంది. నిత్యసత్యాలైన సామాజిక సందర్భాలువున్నాయి. అవగాహన, అభివ్యక్తి అద్వైతంలో తోసుకువస్తాయి.

ప్రతిభ కవి ప్రాణం. అభ్యాసం కవి ఉనికి. వ్యుత్పత్తి కవి తపస్సు. వీటి నిష్పత్తి సక్రమంగా అభివృద్ధి చెందాలి. ప్రతి సందర్భంలోనూ, ప్రతి అభివ్యక్తిలోనూ ఈ మూడు కవిని నడిపించాలి.

ఇన్నాళ్ళు మనం ఆధునిక యుగంలోవున్నా మనమీద సాంప్రదాయక ప్రభావం వుంది. తప్పుడు సంప్రదాయాన్ని ఆధునికం చేయాల్సిన కాలంలో మనం వున్నాం. 'సౌందర్యదృష్టి' కవిని కంటుంది, చంపుతుంది కూడా.

ప్రజాస్వామికయుగంలో సౌందర్య దృష్టిని ఎలా సామాజికం చేయాలనేది ఒక సమస్య. అలంకారిక వారసత్వాన్ని రాజనీతిగా మార్చడం ఎలా? ప్రతిసమస్య ఈనాడు సామాజికంగానే వుంది. ప్రకృతి వైపరీత్యమూ రాజకీయాతీతం కాదు. చాలా స్పష్టంగా కనిపించే రాజకీయదృశ్యాల్ని కవిత్వీకరించే మార్గాలు ఎలా వుండాలో అందరూ ఆలోచించాలి. "సాంద్రత-సంక్లిష్టత"ల పేర కవిత్వాన్ని పరాయీకరించారు ప్రబుద్ధ విమర్శకులు. దాని ముద్దుబిడ్డే "ఆధునికోత్తరవాదం." సందర్భాలు సన్నివేశాలు కవిసమయాలు సంఘటనలు, దృశ్యాలు స్పష్టంగా ఎదురైనప్పుడు, స్పష్టంగానే ప్రజలు చూస్తున్నప్పుడు కవి దాన్ని అస్పష్టంగా చెప్పడం ప్రజాస్వామిక యుగంలో భావ్యమా? ప్రజాస్వామిక యుగంలో అలంకారిక భాష ఎలా వుండాలి ! నిర్దుష్టతనుండి తప్పించే భావుకతగానీ, శబ్దజాలంకానీ కవితా ప్రయోజనాన్ని దెబ్బతీయవా? శేష ప్రశ్నలు, అందరూ ఆలోచించాల్సిన అంశాలు.

దేవిప్రియ కవిత్వం సెలయేరు. దానికి సంగీతం వుంది. నడకవుంది, జన్మస్థానం వుంది, గమ్యస్థానం వుంది. అది సమస్యలలో పుట్టి, సమస్యలలో తేలి, సమస్య



లలో కలిసిపోతుంది. రాళ్ళను ఒరుసుకొనిపోయే సన్నివేశాలలోని "ధ్వని" కర్ణపేయమే కాదు, జన ప్రయోజనమూ సాధించిన తాదాత్మ్యం కూడా. గుంటూరు కొరివికారం ఎంత ఎర్రగా వుంటుందో అంత కమ్మగానూ వుంటుంది. కారం కారంగా వుంటూనే కారం కూరని ఆకర్షిస్తుంది. మెత్తని కారం. కమ్మనికారం. అన్నానికి రుచినిచ్చే కారం. ఆకలిని తీర్చేకారం. హానిచేయని కారం. కారాన్ని కారం కాకుండా "పాకం" వేయడం ఒక సామాజిక నైపుణ్యం.

నిజానికి కవిత్వానికేది కావాలో గుంటూరు కారానికి అది వుంది. కారం కారంగా వుంటూనే కారం కమ్మగా పని చేయడం ఒక అద్భుత ప్రక్రియ. దాన్ని దేవిప్రియ సాధించాడు. 'తుఫాను తుమ్మెద' భావనలో తీవ్రతా వుంది, సౌమ్యతా వుంది. 'తుఫాను తుమ్మెద' భావనలో తీవ్రత "తుమ్మెద" శబ్దంతో జతపడగానే "శ్రావ్యంగా" మారి "సౌమ్యం"గా మిగిలింది.

దేవిప్రియ భావజాలంలోని తీవ్రతను, ఆయన శబ్దజాలం తగ్గించి, చదువరిని ఆకట్టుకుంటుంది. చదువరి భయపడడు. శబ్దజాలంలోని ఆత్మీయతకు దగ్గరై భావజాలంలో మునిగిపోయి ఆలోచనాపరుడవుతాడు చదువరి. ఆవేశం కన్నా ఆలోచన అంతర్గతంగా చదువరిని ఉన్నతీకరించి చైతన్యం వైపు పదిలంగా నెట్టుతుంది. భాషకు వినయాన్ని, భావానికి చైతన్యాన్ని సాధించడం కవి నైపుణ్యం. బుద్ధి ఆలోచించాలి. గుండె కొట్టుకోవాలి. ఈ రెండూ సమపాళ్ళల్లో సాగాలి. దేవిప్రియ ఆ విజయం సాధించగలిగాడు.

కోస్తా ప్రాంతాల అల్పసంఖ్యాకుల అభివ్యక్తి, సౌందర్య దృష్టి, భావకవిత్వ వారసత్వంలాగే సాగింది. అందుకు కాకినాడ ఇస్మాయిల్ నిదర్శనం. అది తప్పు కాదు. ఆ అవసరం కవిని సమాజంనుండే వేరు చేస్తుంది. ప్రజాస్వామిక యుగావసరం కవిని సామాజికం అయ్యేట్టు చేస్తుంది. ఆత్మాశ్రయ అనుభూతి అనివార్యంగా సమాజ శ్రేయ ఆక్రోశంగా మారుతుంది.

అనేక కారణాలవల్ల కవులు, రచయితలు, గుంపులకింద, ముఠాలకింద, లాబీలకింద విడిపోవడానికి నెట్టబడుతున్నారు. "యుగావశ్యకత" మాత్రం కవుల్ని, రచయితల్ని ఒక చోటకి తేవాలని కోరుతూవుంది. "దోపిడీ కూటమి" సంఘటిత పడుతూవుంటే పీడితులు ముక్కచెక్కలవుతున్నారు. కవులు, రచయితలు పీడితుల్ని ఏకం చేయాలి. కవులు వేరుపడితే అనుభూతులూ వేరుపడతాయి "ప్రపంచీకరణ ప్రతిఘటన" సందర్భంలో "సంఘటిత పడడం" రాజకీయ ఆవశ్యకత. వేర్పాటు వాదం శత్రువుకు మేలు చేస్తుంది.

"మసీదు మెట్లమీదో
సరయూనది స్నానఘట్టం దగ్గరో



*చెయ్యిచాచి కూలబడిన ఫకీర్లయాచకుల కళ్ళలో*
*ఘనీభవించిన బీభత్సం సామ్రాజ్యవాదం,*
*పొంచివున్న ప్రమాదాలకూ మనకూ మధ్య*
*మంచుతెరలు అల్లే గొప్ప హస్తకళాకారిణి సామ్రాజ్యవాదం,*
*కోట్లకీ, కూలికీ మధ్య శాశ్వత విభజన రేఖ,*
*అనునిత్య అనివార్య సంఘర్షణ సామ్రాజ్యవాదం"*

ఎంతో స్పష్టంగా ఎంతో నిర్దుష్టంగా, ఎంతో కవి ఆ సమయంతో మలిచాడు సామ్రాజ్యవాదాన్ని. సంక్లిష్టత లేదు. సమస్య వుంది. తలపడాల్సిన కర్తవ్యమూ వుంది. ప్రాసంగికతను ముందుకు తెచ్చిన కవి ప్రజలకు సన్నిహితుడవుతాడు. దేవిప్రియ పీడిత ప్రజల అంతఃకరణ.

*"ఈ ప్రపంచం బాంబులు కలవాడి బాస్టర్డ్ చైల్డు కాకూడదు"–*

ఈ దుష్టదుర్మార్గ వర్గసమాజం కవిని లౌక్యునిగా దిగజారుస్తుంది. మనుజేశ్వరాధములైన పాలకులమధ్య నిలయవిద్వాంసుల్ని చేస్తుంది. ప్రవృత్తిని దిగజార్చి వృత్తిని కొనుగోలు చేస్తుంది.

*"ఎంత కొత్త పద్యమైనా పాతపద్యమే....*
*నంగి నంగి కవిత్వాలూ*
*వంగి వంగి దండాలూ"*

ఈనాడు మనం చూస్తున్న సర్కారీకవుల వికృతాలు –

*హిట్లర్ పునర్జన్మలూ*
*ఢిల్లీలో కూలిన బాబ్రీ మసీదులూ*
*మన శిరస్సుమీద కరవాల ఛత్రమై కదులుతున్నప్పుడు*
*ఎంత కొత్త పద్యమైనా పాత పద్యమే....*

కవి ఎప్పుడూ కాలంతో కలియబడుతూనే వున్నాడు.

*"పార్లమెంటుహౌస్ లోనో*
*రాష్ట్రపతిభవన్‌లోనో కాదు*
*జాతీయ చిహ్నాలైన మహామురికి వాడల్లో*
*జారిపడకుండా జీవిస్తోంది ఢిల్లీ!"*

ఇది రాజధాని నిర్వచనమే కాదు, మొత్తం దేశం దృశ్యం కూడా యిదే ...

*"తలుపులున్న ఇళ్ళుకాదు*
*గడియలు బిగించిన గడీలు కాదు,*
*ప్రాణ సమూహాలు సంచరించే*
*పచ్చగడ్డిమైదానమై బతకాలి"*



ఒక పౌరుడి మనుగడ...యాభైసంవత్సరాల స్వాతంత్రం సామాన్యునికిచ్చిన దుర్భరజీవితం...

*"సముద్రతలం మీద తలపెట్టి*
*పాదాలు ఆకాశానికి ఆనించి*
*శీర్షాసనం వేసినప్పుడే తెలుసుకున్నాను*
*సొరచేపల వలయాన్ని నాచుట్టూ తిప్పేది*
*నా స్వరంనుంచి రాలే నెత్తుటిబొట్లేనని"!*

"గడ్డకట్టిన జలపాతం" లా స్తంభించిన మనుగడ బొమ్మ కట్టిన తీరు గమనార్హం...

*"చెల్లీ! నువ్వు*
*ముక్కలైపోయినా నీ పాట*
*ఒక్కటిగానే వుంది*
*నిన్ను చూసి నిన్ను విని,*
*తెలంగాణా పిచ్చిమాతల్లుల్లో కూడా ఒక*
*గద్దర్ పుట్టిందనుకున్నానే కానీ*
*నాకర్ధంకాని రాజకీయ వధ్యశిల మీద*
*నీ గొంతు యిలా ఇంతలోనే*
*పిట్టలా తెగిపడుతుందని*
*కవిత్వంలో కూడా ఊహించలేకపోయాను"*

బెల్లి లలితను స్మరింపజేసే ఈ స్మృతిగీతం అద్భుతం. "పిచ్చి మాతల్లుల్లో" అనడం ఒక దేవిప్రియకే సాధ్యం.

"అమ్మ" పట్ల, "చెల్లి" పట్ల అతనికున్న ఆర్ద్రదృష్టి అద్వితీయం.

*"ఇప్పుడు ఇద్దరు పిల్లల తండ్రినై*
*ఇంత బతుకు బతుకుతున్న*
*నా సుతిమెత్తని అరచేతులు చూసికూడా*
*ఎట్లా బతుకుతావురా అని ఏడుస్తుంది మా అమ్మ!"*

కవితా వస్తువును బిడ్డను చేసి, దానిలో మమేకం చెందడానికి అంతఃకరణ కావాలి. దేవిప్రియ నిశ్శబ్ద అంతఃకరణ, వాక్యాల్లో దొర్లే వాత్సల్యం నిరుపమానం. "మరణానంతర జీవితం" ఎంతో వాఖ్యానించదగ్గ తాత్వికరచన. దేవిప్రియలో సహజంగానే లోలోన, ఆరని కుంపటిలా "పరదుఃఖదుఃఖిత్వ చింతన" వుంది. అదే అతనిని కవిగా తీర్చిదిద్దింది. దానితో పాటు అతని సంస్కారం సమకాలీన సమాజంతో, ప్రపంచంతో మమేకం చెందే అనివార్యతను సృష్టించింది. సృజనశీలతను, సమకాలీనతను, సంస్కారంలో పుటంపెట్టి గొప్పకవి హృదయాన్ని సాధించాడు, దేవిప్రియ.



వెన్నాడుతున్న “ఆత్మాశ్రయత” నుండి బయటపడడానికి తననుతాను సామాజీకరించుకొని సమకాలీన సాహిత్యప్రపంచానికి అంతఃకరణ కవిగా దక్కాడు.

మెత్తని పదజాలం, పదునైన భావజాలం కలగలసిన కవిసమయమే దేవిప్రియ. సౌందర్యాన్ని సంస్కారంగా మలిచే ప్రక్రియే దేవిప్రియ. యుగసందర్భాన్ని గమనించి తాదాత్మ్యం చెందే భావుకుడే దేవిప్రియ. శబ్దాన్ని పట్టుకొని అర్థాన్ని పిండుకునే రస నిష్పత్తే దేవిప్రియ. మానవత్వం అతడి సంస్కారం. కవిత్వం అతడి ప్రాణం. ఊసర క్షేత్రంలో అతడు “అమ్మచెట్టు.” “ఎడారిలో నీటిపుట్ట.” తుఫానులో మ్రోయు తుమ్మెద” తెలుగు కవిత్వానికి దక్కిన అంతఃకరణ శీర్షిక దేవిప్రియ.

*(దేవి’30 ‘స్వరపత్రం’ 2002 నుంచి)*

⚜

***గోడల మీది***
***ఈ అనాకారి రాతలే***
***రేపు శ్రమసౌందర్య విప్లవవిజయగీతాలు,***
***నిన్నటి***
***గొంగళిపురుగే కదరా***
***ఈనాటి***
***పంచవన్నెల సీతాకోక చిలుక !***

(ప్యూపా : నీటిపుట్ట)



సి. వెంకటేష్

# కాలమిస్టుగా నాకు 'అమ్మచెట్టు'

ఆయన వయసులో నాకంటే పెద్ద. ఉత్సాహంలో నాకంటే హుషారు. ఎప్పుడూ చీర్‌పుల్‌గా ఉండే వ్యక్తిత్వం. అన్నిటినీ పాజిటివ్‌గా తీసుకునే స్వభావం. రచనల్లోనే తప్ప పైకి మాత్రం కనబడని ఇంటెన్సిటీ... డాక్టర్ జెకిల్, మిస్టర్ హైడ్.!

ఆశువుగా దొర్లే వన్‌లైనర్లతో ఆయనతో జరిపే ప్రతి సంభాషణ ఓ రన్నింగ్ కామెంటరీ. దేవిప్రియ అనేక విషయాలను అలవోకగా జీర్ణించుకున్న మూవింగ్ విజనరీ. అన్ని పార్శ్వాలలో నాకు బాగా తెలిసిన పార్శ్వం ఆయన క్రీడాభిమానం.

మాది దాదాపు రెండుదశాబ్దాల పరిచయం, మూడు పత్రికల సాహచర్యం. 1983 అసెంబ్లీ ఎన్నికలప్పుడు నేను 'ఆంధ్రప్రభలో' ఉన్నాను. అప్పుడే 'రన్నింగ్ కామెంటరీ' మొదలైంది. కాలేజీలో ఉన్నప్పుడు నెల్లూరు రీడింగ్ రూముల్లో 'ప్రజాతంత్ర' కోసం ఆత్రంగా వెతికి చదివిన 'సమాజానందస్వామి' పద్యాలు దేవిప్రియవేనని అప్పట్లో నాకు తెలీదు. ఆయన బహురూపి అని ముందే చెప్పానుగా. కవిత్వంలో సమాజాన్ని ఉతికి ఆరేసే దేవిప్రియలో ఓ మూలన సున్నితమైన పొరల్లో క్రీడాభిమాని దాగి ఉన్నాడు. 'రన్నింగ్ కామెంటరీ' టైటిల్‌లోనే అది తొంగి చూస్తుంది. సందర్భ శుద్ధితో ఆయన చేసిన వ్యాఖ్యానాలు 'రన్నింగ్ కామెంటరీలు అప్పుడప్పుడు మెరుపుల్లా మెరిసేవి. అప్పుడంటే మనం డ్రాయింగ్ రూంలో కూర్చుని టిఫిన్ తింటూ టెండుల్కర్‌ని, లంచ్‌కు తోడుగా లారాని టీవీలో చూస్తున్నాం. కానీ అప్పట్లో టీవీచానల్స్ పడగలింకా విప్పారని రోజుల్లో క్రీడాభిమానుల్ని వేళ్లమీద లెక్కగట్టొచ్చు. ముఖ్యంగా సీరియస్ రచయితల దృష్టిలో క్రీడాభిమానం ఓ 'యాంటీ ఇంటలెక్చువల్' వ్యాపకం అన్న ధోరణి ఉండేది. కానీ దేవిప్రియ అందుకు మినహాయింపు. అక్కడే మా దోస్తీ కుదిరింది.

'ఉదయం'లో ఆయన ఆదివారం సప్లిమెంటు దళపతి. నేను స్పోర్ట్స్‌డెస్క్ లో ఉండేవాడిని. తెలుగు జర్నలిజంలో తొలిసారిగా పూర్తిస్థాయి క్రీడావిభాగం, పూర్తిపేజీ





కవరేజి అనే సాహసంతో ముందడుగు వేస్తూనే తప్పటడుగులేమోనని జంకుతుండే వాడిని. నా బలం నాకు తెలిసేది కాదు. అలాంటి తరుణంలో దేవిప్రియ నన్నెంతగానో ప్రోత్సహించారు. బాగా రాస్తున్నానంటూ సండే సప్లిమెంట్‌లో నాచేత వ్యాసాలు రాయించేవారు. నేను స్పోర్ట్స్ జర్నలిస్టునుంచి స్పోర్ట్స్ కాలమిస్టుగా రూపాంతరం చెందానంటే అది దేవిప్రియ చలవే. 1985లో భారతక్రికెట్ జట్టు ఆస్ట్రేలియాలో మినీ ప్రపంచకప్ గెలిచినప్పుడు రన్నింగ్ కామెంటరీలో ఇలా రాశారు.

*"వరసపెట్టి వదలగొట్టి*
*అరి వీరుల తుప్పు*
*భరత క్రికెట్ గెలిచిందోయ్*
*ఘన ప్రపంచకప్పు"*

అది బ్రహ్మాండంగా పేలింది. "భరత క్రికెట్ గెలిచిందోయ్..." శీర్షికతోనే సండేలో నా చేత కవర్‌స్టోరీ రాయించారు. ఆంధ్రదేశమంతటా ఆ వ్యాసానికి గొప్ప ఆదరణ లభించింది.

'ఆంధ్రజ్యోతి'లోకూడా మా అనుబంధం కొనసాగింది. అప్పట్లో మేము నరోత్తమ్ పూరి అనే ఓ ప్రముఖ క్రికెట్ కామెంటేటర్‌తో స్పోర్ట్‌క్విజ్ నిర్వహించేవాళ్లం. ఆ క్విజ్‌కు టైటిల్ ఏం పెట్టాలా అని నేను స్ట్రగుల్ అవుతుంటే దేవిప్రియ అటుగా వచ్చారు. విషయం తెలుసుకొని ఒక్కమాటలో అద్భుతమైన టైటిల్ చెప్పారు "నరోత్తమ్ పూరించండి" అని. 'క్రీడాచిత్రం' అనే స్పోర్ట్స్ పేజి ఫీచర్‌కుకూడా తన కవితాగళాన్ని ఎరువిచ్చేవారు.

ఓసారి ఆంధ్రజ్యోతిలోనే, కపిల్‌దేవ్‌ని ఆఫీసుకు పిలిచి ఓ అవార్డు ఇచ్చాం. ఆ సందర్భంగా కపిల్‌కు ఓ మెమెంటోను ఇవ్వాలనుకున్నాం. మెమెంటో సెలక్షన్‌కి దేవిప్రియ నావెంట వచ్చారు. ఓ అజంతా సుందరి బొమ్మవున్న నిర్మల్ పెయింటింగ్ సెలెక్టు చేశారు. ఆ మెమెంటో కపిల్‌దేవ్‌కు ఎంతగానో నచ్చింది. కపిల్ ఆ మెమెంటో వైపు ఆరాధనగా చూస్తూ అందుకుంటున్న ఫొటో ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా కపిల్‌దేవ్ డ్రాయింగ్‌రూంను ఆ బొమ్మ అలంకరించి ఉంటుంది. ఆంధ్రజ్యోతి ఆదివారంలో 'బాడీలైన్' పేరుతో నాచేత కాలమ్ రాయించేవారు. అదికూడా బాగా క్లిక్ అయింది.

నేను జర్నలిజం వదిలేసి ప్రభుత్వఉద్యోగంలోకి వెళ్ళాకకూడా 'స్పోర్ట్స్ అనగానే దేవిప్రియ నన్నే గుర్తు చేసుకునేవారు. 'ఉదయం'లో అజరుద్దీన్‌లో క్రికెట్ పాఠాలు శీర్షికను దేవిప్రియ, రామచంద్రమూర్తిగారు నా చేతనే నిర్వహింపజేశారు. తరువాత 'మనోరమ'కు కూడా నేను వ్యాసాలు రాశాను. అందుకే కాలమిస్టుగా నాకు ఆయన 'అమ్మచెట్టు'.

*(దేవి '30' 'స్వరపత్రం' 2002 నుంచి)*



బైస రామదాసు

# చిన్నపత్రికలకి కొండంత అండ

నాకిప్పటికీ గుర్తు. మొదట ప్రజాతంత్రలో, 'స్కైలైన్' అనే ఇంగ్లీషు పత్రికలో పని చేస్తున్నప్పుడు, 'కేకలు' వారపత్రిక నిర్వహణకు దేవిప్రియ ఎన్నో సలహాలు, సహకారాలు అందించేవారు. పత్రికా రచనలో మెలకువలు చెప్పేవారు. రాష్ట్ర వ్యాప్తంగానూ, దేశంలోనూ, ప్రపంచంలోనూ పలుచోట్ల చిన్న పత్రికల విషయం గురువుగారిని అడిగి తెల్సుకున్నప్పుడు, అడగకుండానే చెప్పినప్పుడు నాలో ఎంతో ఉత్సాహం ఉరకలు వేసేది. ఒక రకంగా ఆక్సీజన్ నింపుకున్నట్లుండేది. కొన్ని సందర్భాలు పత్రికా నిర్వహణ ఒడిదుడుకుల్లో ఆయన్ను కల్సినప్పుడు గ్లూకోజ్ బాటిల్ ఎక్కించుకొని తేరుకుంటున్న వాడిలా అయ్యేది. నా కిప్పటికీ గుర్తు. కేకలు ప్రచురణకు హైద్రాబాద్‌లో తిరిగి తిరిగి అలిసిపోయి, ఆకలితో ఉన్నప్పుడు ఆ ఛాయలు మొహ మాటంతో పైకికనిపించకుండా జాగ్రత్తపడినా, పిలిచి మరీ మంచి భోజనం చేద్దామని, మార్కెట్‌కుకూడా తీసుకువెళ్ళి, తెచ్చి వండించి భోజనం పెట్టారు. అప్పటికీ ఇప్పటికీ దాదాపు పాతికేళ్ళు గడిచాయి మా పరిచయానికి. అప్పుడూ ఇప్పుడూ దేవిప్రియలో ఎలాంటి మార్పు లేదు. అదే వ్యక్తిత్వం. అదే ఆత్మీయత, అదే ఓర్పు, అదే ఓదార్పు, అదే ఉత్సాహం, అదే పలకరింపు, అదే ప్రోత్సాహం. అందుకే దేవిప్రియ ఎంత దగ్గర వున్నా, ఎన్నోయేళ్ళ తర్వాత కలిసినా నా ఈ అభిప్రాయంలో ఏ మాత్రం మార్పు లేదు. రోజురోజుకూ బలపడిందే తప్ప తగ్గలేదు. ఎప్పటికీ తగ్గదు కూడా.

'కేకలు' వారపత్రికను ఇన్నేళ్ళబట్టి ఎలా నడపగల్గుతున్నారు? చిన్న పత్రికల మనుగడ కష్టంకదా! అని ఎవరైనా అభినందించినప్పుడైనా, 'జమీన్‌రైతు' వంటి ఎంతో ప్రజాదరణ వున్నవారే దినపత్రికలకు తోక పత్రికలు వస్తున్న ఈరోజుల్లోను మీరెలా 'పొద్దు' వంటి చిన్నపత్రికను నడుపుతున్నారని ఆశ్చర్యంతో ప్రశంసాపూర్వకంగా ఎవరైనా వెన్ను తట్టినప్పుడుకూడా మనసులో దేవిప్రియగారికి పదేపదే కృతజ్ఞతలు



చెప్పుకునేవాణ్ణి. ఆయన్నుంచి నాకెప్పుడూ ఒక్కపైసా ఆర్థికసహాయం అందలేదు. ఒక్క అడ్వర్టయిజ్‌మెంటూ ఇప్పించిన గుర్తు లేదు. అయితే అంతకంటే ఎన్నోరెట్లు విలువైన ప్రోత్సాహం, ఆత్మవిశ్వాసాలనే అమృతాన్ని నాతో తాగించారు. ఈ చిన్న పత్రికల ముళ్ళదారిలో ఇంకా నడుస్తున్న నాలాటివారికి దేవిప్రియ అందించిన ఈ సహకారం అన్నిటికన్నా ఎంతోగొప్పది. అందుకు ఆయనకు నేను సదా కృతజ్ఞుణ్ణి. చంద్రునికి నూలుపోగులా నా మనసులోని ఈ నాలుగు ముక్కలు ఆయనకు అంకితం.

*('దేవి' 30 'స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

***పుస్తకాలే***
***నా బస్సులూ రైళ్ళూ విమానాలూ***
***పుస్తకాలే***
***నా నావలూ అంతరిక్ష నౌకలూ***
***పుస్తకాలే***
***నా హార్మోనియమ్‌లూ వేణువులూ వీణలూ...***
***నా కాలం***
***నా పుస్తకాలతోనే సంభాషిస్తుంది***
***బహుశా, కలకాలం !***

(నా కాలం : అరణ్యపురాణం)



మల్లేపల్లి లక్ష్మయ్య

# భావితరాలకు దేవిప్రియ ఒక నమూనా

దేవిప్రియ. ఇది ఒక పేరు. నిజానికి ఇది నడుస్తున్న చరిత్రకు ఒక నమూనా. పుట్టింది ఏ మతమైనా తాను ఒక మనిషిగా మాత్రమే అందరికి తెలిసిన వాడు. ప్రముఖ హిందీ రచయిత, కవి షాహిర్ లూథియాన్వి రాసినట్టు "తు హిందూ బనేగా న ముసల్మాన్ బనేగా, ఇన్సాన్ కా అవులాద్ హో ఇన్సాన్ బనే గా" అన్న తాత్వికతకు నిలువుటద్దంలాంటి వాడు దేవిప్రియ.

దేవిప్రియ కవిగా, రచయితగా, జర్నలిస్టుగా సినీమా రచయితగా, దర్శకునిగా ఎన్నో ప్రక్రియల్లో తనదైన ముద్ర వేసినవాడు. తన అరవై ఎనిమిదేళ్ళ జీవితంలో ఎంతో గుర్తింపును, ఎన్నో ప్రశంసలను అందుకొన్న దేవిప్రియ గురించి ఎందరో మిత్రులు, ప్రముఖులు, తమ అనుభవాలను ఎన్నో వేదికల మీద, పుస్తకాల రూపంలో పంచుకున్నారు. దేవిప్రియ కృషిని, సాహితీశక్తిని, భాషా పరిణతిని కొలవడానికి నేను సరిపోను. ఎందుకంటే ఆయనకన్న చాలా చిన్నవాణ్ణి. ఆయన రాసిన రాతల నుండి రాజకీయాలను నేర్చుకున్న విద్యార్థిని. దేవిప్రియ రాసిన పుస్తకాల గురించి నేను ఇక్కడ ప్రస్తావించదలుచుకోలేదు.

ఆయనొక అద్భుతమైన కవి మాత్రమే కాదు. సమకాలీన రాజకీయాలను అతిచిన్న పదాలతో ప్రపంచ గమనాన్ని ప్రతిరోజూ విప్పి చెప్పిన కవి, రచయిత, జర్నలిస్టు దేవిప్రియ మాత్రమే. ఆ మూడు లక్షణాలు ఉన్నవాళ్ళు మాత్రమే అటువంటి ప్రక్రియను కొనసాగించగలరు. ఆ ప్రక్రియనే 'రన్నింగ్ కామెంటరీ' ఉదయం పత్రికలో ప్రతిరోజూ మొదటి పేజీ కింది భాగంలో ప్రత్యక్షమయ్యే రన్నింగ్ కామెంటరీ ఆరోజు ఉధృతంగా సాగిన విప్లవోద్యమానికి, విప్లవోద్యమ కార్యకర్తలకి ఒక టాబ్లెట్ లాంటిది. ఆరోజు ఉద్యమ సంఘాలు ప్రచురించి, పంపిణీ చేసే కరపత్రాలకు మకుటాలుగా దేవిప్రియ గారి రన్నింగ్ కామెంటరీ పనికివచ్చేది. ఆ రోజుల్లో నేనొక విద్యార్థి కార్యకర్తను, విప్లవోద్యమంలో భాగస్వామిని, ఉదయం దినపత్రిక చదివిన ఎవరైనా రన్నింగ్ కామెంటరీ చూడకుండా పోవడం సాధ్యంకాదు. రన్నింగ్ కామెంటరీ అందించే అవగాహన, ఆలోచన కార్యకర్తలకు ఒక ఆయుధంలా ఉండేది. అది బడ్జెట్ కావొచ్చు,



ఎన్కౌంటర్, ఉద్యమం, ఊరేగింపు, రాజకీయ పరిణామాలు, ప్రజల జీవితాలు, దళితులపై అత్యాచారాలు, ఆదివాసుల అరణ్యరోదన, మహిళా హక్కుల ఆందోళనలు అన్నీ రన్నింగ్ కామెంటరీగా మారిపోతుంది. ఎనిమిది చిన్న చిన్న లైన్లలో సాగిన ఆ రన్నింగ్ కామెంటరీ జర్నలిజం చరిత్రలోనే అరుదైన విశేష ప్రక్రియ. రన్నింగ్ కామెంటరీ ఎంతోమందిని ఉద్యమాలకు చేరువ చేసిందంటే అతిశయోక్తి కాదు.

ప్రజాతంత్రకు సంపాదకుడిగా ఉన్న దేవిప్రియ ఎన్నో నూతన పద్ధతులను ప్రవేశపెట్టారు. విద్యార్థిగా వున్న సమయంలో ప్రజాతంత్ర పత్రిక మాకు అభ్యుదయ కరదీపికగా ఉండేది. ఆ రోజుల్లో నేను చదివిన పత్రికల్లో ప్రజాతంత్ర ముఖ్యమైనది. ప్ర.జ. పేరుతో శ్రీశ్రీ చేత చెప్పించిన జవాబులు ఎంతో ఆసక్తిగా వుండేవి. అవి ఆరోజు శ్రీశ్రీతో ప్రత్యక్షంగా మాట్లాడుతున్నట్లు అనిపించేవి. శ్రీశ్రీ అంటే ఒక ఆవేశం కలిగే మాలాంటి విద్యార్థులకు ఆ శీర్షిక ఒక అద్భుత ప్రత్యక్ష చైతన్యచిత్రం.

దేవిప్రియ సంపాదకీయాలు, ఉదయంలో రన్నింగ్ కామెంటరీని చదివి స్ఫూర్తి పొందిన నాకు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. 2008లో హెచ్.ఎం. టివి ఛానెల్‌లో అటువంటి అరుదైన అనుభవం కలిగింది. ఆయన ఏనాడూ ఆధిపత్యం, అజమాయిషీ చేసి ఎరుగరు. అతికింద స్థాయి ఉద్యోగి నుంచి, తోటి జర్నలిస్టులు, ఆపైన ఉన్న యాజమాన్య ప్రతినిధులందరితో ఒకే విధమైన సంబంధాలు కలిగి ఉండేవారు. నేను హెచ్.ఎం. టివి లో విరామం లేకుండా సాగించిన వీక్షణం కార్యక్రమం 150 ఎపిసోడ్స్ పూర్తయిన సందర్భంలో ఆయన నా గురించి రాసిన రన్నింగ్ కామెంటరీ ఇప్పటికీ మా ఇంట్లో ఫ్రేమ్ కట్టి ఉంది. నన్ను ఆయన చాలా ప్రేమగా, అభిమానంగా చూడటం ఒక నిండైన ఆనందాన్నిస్తూంటుంది. ఇప్పటికీ ఆయన చూపే ఆప్యాయత ఒక తండ్రిని గుర్తుకు తెస్తుంటుంది. అది నాకు ఒక అపురూప సందర్భం.

దేవిప్రియ అందరు కవుల వంటివాడు కాదు. ఆయన ఏ సంఘంలోనూ సభ్యుడు కాదు. ఏ సిద్ధాంత ప్రచారకుడూ కాదు. కానీ ఆయనలో సభ్యత్వాలు కలిగిన వాళ్లకన్నా, సిద్ధాంత ప్రచారకులకన్నా ప్రజల పట్ల ప్రేమ ఎక్కువగా వున్నది. విప్లవ, అభ్యుదయ, ప్రగతిశీల, ప్రజాస్వామ్య సంఘాలలో పనిచేసిన వారికన్నా చాలా నిబద్ధత కలిగి ఉన్నాడు. ఆయన తనకు తానుగా పదేపదే మార్క్సిస్టుగానో, సెక్యులరిస్టుగానో చెప్పుకున్న వాడు కాదు. కానీ ఆయన జీవితం దానికి నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా దేవిప్రియ జీవితం ప్రధాన భాగమంతా విప్లవోద్యమం బలంగా కొనసాగిన రోజులు. అటువంటి ఉద్యమాన్ని మనసారా గుండెలకు హత్తుకున్నవాడు. వాటిపట్ల కొనసాగిన దమనకాండను తీవ్రంగా వ్యతిరేకించినవాడు.

అదేవిధంగా తనది ఒక మతం, మతంలో పేరు వేరు, తాను కొనసాగించిన పేరు వేరు. తాను వరించిన రాజ్యలక్ష్మిది వేరేమతం. పిల్లలకు తమ జీవితాలను ఎంచుకునే స్వేచ్ఛను ఇచ్చినవాడు. ఇల్లే ఒక లౌకిక జీవనానికి 'అమ్మచెట్టు'. అటువంటి అరుదైన వ్యక్తి హిందువూ కాదు. ముసల్మానూ కాదు. క్రైస్తవుడు అంతకన్నా కాదు. ఆయన ఒక మనిషి. మహా మనిషి. భావితరాలకు ఆయన ఒక నమూనా.



స్మైల్

# స్నేహానికి మరోపేరు!

పాతికేళ్లకిపైగా స్నేహానికి మారు పేరుగా నిల్చిన మరోపేరు దేవిప్రియ. మారుతున్న కుగ్రామంలావున్న అప్పటి హైదరాబాద్. మారిపోయి తప్పిపోయిన మహా నగరంగా యిప్పటి హైదరాబాద్! ఈ విభిన్న నగరాల కథని టేల్ ఆఫ్ టూ సిటీస్‌ని ఎన్నెన్ని రకాలుగా, అతను యిన్నేళ్లుగా ఎన్నెన్ని సందర్భాల్లో రన్నింగ్ కామెంటరీగా చెప్పుకుంటూ వచ్చాడో!

అందుకు అతనంటే నాకు అభిమానం. అతను తప్పిపోలేదు. జారుకోలేదు. స్నేహితుడుగా, అలా చిరునవ్వుతో, ఎవరికీ కనిపించని బరువేదో మోస్తున్నట్టుగా కన్పిస్తూనే, చిరునవ్వుతో, యిప్పటికీ అలాగే వున్నాడు, మంచి స్నేహితుడిగా. అందుకే మరీ యిష్టం యితనంటే. ఇతని స్నేహహస్తాన్ని ఎవరొదలగలరు? ఇతనో పెద్దకవో, పెద్దజర్నలిస్టో, ఎందరో కవుల్ని ప్రమోట్ చేసినవాడో, ఇవన్నీ నాకిప్పుడు అవసరం లేదు. చిరకాలం, అందరికీ సేదతీర్చే స్నేహితుడిగా వుండాలని కోరుకుంటూ....

*('దేవి' 30 'స్వరపత్రం' 2002 నుంచి)*



గుడిహాళం రఘునాథం

# అతి నాజూకైన కవి

నాకు దేవిప్రియ అంటే విపరీతమైన ప్రేమ వుంది. ఆయన నాజూకైన కవి. నాజూకుగా భాషను ఉపయోగించే కవులలో మొదటి కవి. సరియైన మాటకు కరిగిపోయే కవి దేవిప్రియ. నెమ్మదిగా రాస్తాడు. లేత లేత కవిత్వం. దేవిప్రియ హాయిగా రాయడంలోనేకాదు, నెమ్మదితనం ఎక్కువ. నిజానికి కవిత్వానికి సంబంధించినంత మట్టుకు 70వ దశకంలో ప్రజాతంత్రను కవిత్వానికి చిరునామా చేసినవాడు దేవిప్రియ. 'తలతిరిగితే లత' వంటి పేర్లు పెట్టగల చమత్కార ధైర్యం ఆయనకే చెల్లుతుంది.

మల్లె
మరువం
దవనం
మనసెప్పుడూ పరిమళమే
పదం మరోపదం చెవిలో చేసే గుసగుస
గులాబీకీ గుండెకీ ఉన్న సంబంధం
మాటకీ మనిషికీ ఉన్న సంబంధం
అమ్మా
ప్రేయసి
స్నేహం
మోహం
అమ్మ కొడుకును నాన్న అంటుంది.
మట్టి మనిషికి చెప్పే రహస్యం
అమ్మలేని వాళ్ళకి అమ్మబాధ తెలిపేదే దేవిప్రియ అమ్మచెట్టు!



ఎన్. వేణుగోపాల్

# దేవిప్రియది ఒక విశిష్టధార!

దేవిప్రియ కవిత్వంలో వ్యక్తీకరణ పొందిన రాజకీయాల గురించి చెప్పాలంటే ఈ మూడు దశాబ్దాలలో ఏయే రాజకీయ సంచలనాలు ఈ నేలమీద పోటెత్తాయో, ఆ సంచలనాల్లో కొన్ని ఎట్లా సాంద్రమై, కవిత్వమై దేవిప్రియ అభివ్యక్తిలో వెలువడ్డాయో చెప్పాలి. ఆ వివరణలోకి వెళ్ళేముందు దేవిప్రియ కవిత్వంతో, దేవిప్రియతో నా పరిచయం దగ్గర ప్రారంభిస్తాను.

మొట్టమొదటిసారి దేవిప్రియ పేరు 1973 ఆగస్ట్ సృజన సంచికలో చూశాను. అమరుడు కొల్లిపర నరసింహారావు ముఖచిత్రంలో వచ్చిన ఆ సంచికలో కె.వి. రమణారెడ్డి 'నరసింహారావు కథ' పేరుతో రాసిన పన్నెండున్నర పేజీల దీర్ఘ కావ్యం తర్వాత మిగిలిన అరపేజీలో శీర్షిక లేకుండా పదిపంక్తులలో నరసింహారావు గురించి దేవిప్రియ రాసిన శోక / సంస్మరణ గీతం అచ్చయింది. ముప్పై సంవత్సరాల తర్వాత కూడా ఆ గీతం నాకింకా గుర్తున్నదంటే అది ఆ లేత వయసులో నామీద వేసిన ప్రభావం చాలా గాఢమయినదయి ఉండాలి.

అట్లా ఒక అమరవీరుడి సంస్మరణ గీతంతో పరిచయమయిన దేవిప్రియ పేరు ఆ తర్వాత రెండు సంవత్సరాలు నిత్యం సన్నిహితంగా ఉండింది. అది మరొక రాజకీయ సందర్భం. అత్యవసర పరిస్థితి ప్రారంభమయ్యే నాటికి పత్రికలూ, పుస్తకాలూ విపరీతంగా చదివే మోజులో ఉన్నాను. అత్యవసర పరిస్థితుల్లో అమలయిన కఠినమైన సెన్సార్ నిబంధనవల్ల ఏ పత్రికా ఆసక్తిని నిలిపేది కాదు. ఆ రోజుల్లో ట్యూషన్లు చెపుతూ నెలకు పదో పాతికో సంపాదిస్తూ, ఆ సొంత సంపాదనలోంచి పత్రికలు కొనుక్కుందామనుకుంటే ఆ చీకటి రోజుల్లోనూ ఆసక్తికరంగా వెలువడిన పత్రికలు రెండే రెండు – ప్రజాశక్తి, ప్రజాతంత్ర. రెండూ వారపత్రికలే. ఆరోజుల్లోనే న్యూస్ ప్రింట్ కొరత, రేషనింగ్ వల్లననుకుంటాను ప్రజాతంత్ర సైజు మారింది. ప్రజాతంత్రలో



దేవిప్రియ వారం వారం రాస్తుండే 'సమాజానందస్వామి' ఆయన సంపాదకత్వంలోని అన్ని రచనలూ, ముఖ్యంగా విషయసూచిక వెనుక నాలుగోపేజీలో ఒక మంచి బొమ్మతో సహా వెలువడే కవిత్వం - ఇవీ దేవిప్రియమీద అభిమానాన్ని పెంచినవి. 'అడివీ నువ్వంటే నాకిష్టం' అనే సుప్రసిద్ధమైన దేవిప్రియ కవితకూడా ఆ పేజీలోనే (నాకు గుర్తున్నంతవరకు 'ఇవా' అనే కలం పేరుతో. అది ఆయన కొడుకుపేరని తరువాత తెలిసింది.) అచ్చయినట్టు గుర్తు. ఆ తర్వాత, ఎనభైల మొదట్లో ఎప్పుడో ఆయన పరిచయమయ్యారు.

ఆ జ్ఞాపక శకలాలన్నీ ఎందుకంటే, ఇవి దేవిప్రియతో నా పరిచయాన్ని మాత్రమే కాదు, ఆయన కవిత్వం ఎదిగి వచ్చిన రాజకీయ వాతావరణాన్నీ వివరిస్తాయి గనుక.

దేవిప్రియ ఒక్కరిమీద మాత్రమే కాదు, 1970లలో ఎదిగివచ్చిన బుద్ధిజీవుల తరం మొత్తంమీద ప్రగాఢమైన ప్రభావం వేసిన పరిణామాలలో ఇవి ముఖ్యమైనవి. శ్రీకాకుళ విప్లవోద్యమంపట్ల సానుభూతి, గౌరవం, ఆ విప్లవోద్యమంలోకి వెళ్ళి అమరులయిన మధ్యతరగతి విద్యావంతుల త్యాగనిరతి ముందు వినమ్రత ఆ దశకంలోని ఆలోచనా పరులందరిలో ఉమ్మడి లక్షణాలు. అట్లాగే, 1947 తర్వాత భారత చరిత్రలో సమాజం మొత్తంమీద బహిరంగంగా అమలైన అణచివేత, ఇందిరా గాంధీ నాయకత్వంలోని పాలకవర్గాలు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి తమ సొంత ప్రయోజనాన్ని అమలు చేసుకోదలచుకున్న తీరు ఎమర్జన్సీ రూపంలో బయటపడి బుద్ధిజీవివర్గం దిగ్భ్రాంతి చెందింది. ఈ దిగ్భ్రాంతి వెంటనే 1975-77 చీకటి రోజుల్లో వ్యక్తీకరణ పొందడానికి సెన్సార్‌షిప్ అడ్డువచ్చినా, 1977 నుంచీ అది బైటపడి విస్తృత ప్రజాస్వామిక వాతావరణం ఏర్పడడానికి కారణమైంది.

సరిగ్గా ఈ సెన్సార్‌షిప్ రోజుల్లో పాత్రికేయవృత్తిలో బాధ్యతాయుత స్థానంలో ఉన్నందువల్ల దేవిప్రియకు అటు అభివ్యక్తిమీద సాగుతున్న అణిచివేత తెలిసి ఉంటుంది. ఇటు ఆ అభివ్యక్తిని ఏరూపాలలో ప్రకటిస్తే అణచివేతను అధిగమించ వచ్చునోకూడ తెలిసి ఉంటుంది. మొత్తంగానే దేవిప్రియ కవితా నిర్మాణవ్యూహాల్లోని విశిష్టతకూ, ఈ ప్రారంభదినాల అనివార్యస్థితికీ ఉన్న సంబంధాన్ని ఇంకా లోతుగా విశ్లేషించవలసి ఉంది.

అటువంటి విశ్లేషణ ఇంకా జరగలేదు గనుక దేవిప్రియది రాజకీయ కవిత్వం కాదనీ, ఉద్యమకవిత్వం లోపభరితమనీ, దేవిప్రియ కవిత్వం ఆ "ప్రమాదానికి" గురి కాలేదనీ, అతివేలవు, అలవోక అభిప్రాయాలెన్నో వెలువడ్డాయి, వెలువడుతున్నాయి.

దేవిప్రియ కవిత్వంలో రాజకీయాల గురించి, రాజకీయార్థిక పరిణామాల గురించి వెలువడిన స్పందనలను, ఈ మూడు దశాబ్దాల దేశరాజకీయ చరిత్రను దేవిప్రియ కవిత్వం పట్టుకున్న తీరు గురించి ఎంతయినా వివరించవచ్చు. ఇక్కడ

అంత వివరమైన విశ్లేషణకు అవకాశం లేదు గాని, తన కాలపు కవిత్వంలోని సాధారణ రాజకీయ లక్షణాన్ని దేవిప్రియ ఎంతగా తన కవిత్వంలో భాగం చేసుకున్నారో, ఏయే అంశాల్లో ఆ సాధారణత్వాన్ని అధిగమించి ప్రత్యేకతను సంతరించుకున్నారో ఒకటి రెండు ఉదాహరణలద్వారా వివరిస్తాను.

ఈ మూడు దశాబ్దాల విప్లవ, సామాజిక కవిత్వంలో రాజకీయ అంశ వచ్చిచేరిన చోటనల్లా కవిత్వం సామూహిక ప్రకటనగా ఉండడం పరిపాటి. ఇది కవిత్వ శిల్పానికి సంబంధించిన చర్చ కాదు. శిల్పం అద్భుతంగా ఉన్నచోటనైనా, పేలవంగా ఉన్నచోట నైనా కవిత్వవస్తువు చేసిన విశ్లేషణ, సామూహిక రాజకీయ ప్రకటనగానే కనబడుతుంది. దేవిప్రియ కవిత్వంలో ప్రత్యేకత అది. రాజకీయ విశ్లేషణకు తావిచ్చిన చోట్లకూడ వ్యక్తిగత ప్రకటనగా ఉంటుంది.

'వ్యక్తిగతమూ రాజకీయమే' అని స్త్రీవాద ఉద్యమం చేసిన నిర్ధారణకు ఇది భిన్నంగా ఉన్నట్టు కనబడుతుంది గాని, నిజానికిది ఆ నిర్ధారణను మరోవైపునుంచి చెప్పడమే. చాలమంది కవులూ, ఆలోచనాపరులూ కూడ రాజకీయాల గురించి మాట్లాడేటప్పుడు అవి ఏవో జీవితానికి సంబంధం లేనివన్నట్టు మాట్లాడతారు. 'జీవితం వేరు, సిద్ధాంతం వేరు, రాజకీయం వేరు' అంటూ ఉంటారు. జీవితం, రాజకీయం ఎట్లా పరస్పరం చర్య–ప్రతిచర్యకు లోనవుతుంటాయో, ప్రభావం వేసుకుంటాయో గుర్తించనట్టుగా ఉంటారు. అవి రెండూ ఒకదానిలో మరొకటి ప్రతిఫలించి, రెంటిమధ్యా ఎలా అభేదస్థితి ఏర్పడుతుందో గుర్తించనట్టుగా ఉంటారు.

'రాజకీయమూ వ్యక్తిగతమే' అని సూత్రీకరిస్తున్నట్టుగా దేవిప్రియ మాత్రం తనకు బైట, రాజకీయ ప్రపంచంలో జరుగుతున్న ఘటనలకు వయ్యక్తిక స్థాయిలో కవిత్వరూపం ఇస్తారు. చాల సందర్భాలలో ఆయన కవిత్వంలోని రాజకీయ సూచనలు తన వ్యక్తిగత అనుభవాలనుంచీ, వ్యక్తిగత స్థాయిలోని ప్రతీకలనుంచీ, సందర్భాలనుంచీ వ్యక్తమవుతాయి. అంటే చాలామంది రాజకీయ కవులకన్న భిన్నంగా దేవిప్రియ రాజకీ యాల్ని విడిపదార్థంగాకాక తన జీవితంలోని అవిభాజ్య భాగంగా గుర్తించి, తన కవిత్వంలో రంగరించి ప్రకటిస్తారు.

ఈ లక్షణంవల్ల ఆయన కవిత్వం ఎంత అనుభవ సాంద్రతతో, గాఢంగా వెలువడుతుందో విశ్లేషించడం ఆసక్తికరంగా ఉంటుంది. ఇక్కడ మాత్రం ఆ లక్షణం వల్ల దేవిప్రియ కవితా నిర్మాణంలోకి వచ్చి చేరిన నాలుగైదు ప్రత్యేకతలను వివరిస్తాను.

సామాజిక పరిణామాలూ, ఘటనలూ పెద్దఎత్తున, కొంతవరకు అర్థం చేసుకోవడానికి వీల్లేనంత వేగంగా, సంక్లిష్టంగా జరిగిపోతున్నాయి. వాటన్నిటినీ ఒకరి వయ్యక్తిక జీవితానుభవంనుంచే పట్టుకోవడం సాధ్యం కాదు. అట్లా పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు తప్పనిసరిగా ఒక వైరుధ్యం, ఒక సంఘర్షణ తలెత్తుతుంది.





ఆ సంఘర్షణ ఆత్మవేదనగా, ఆత్మనిందగా, నిరాశగా, సందేహంగా విచికిత్సగా వ్యక్తమవుతుంది. అమ్మచెట్టులో 'ఒఠి కవివేనా?' (పే. 9), 'రాజకీయ రాసక్రీడాకారులు' (పే. 41). నీటిపుట్టలో 'అధివాస్తవికతా ఆకాశం' (పే. 47) 'గార్డు గారూ, ఎర్రజండా చూపండి' (పే. 80), 'ఒక గుడిసె కథ (పే. 89), 'అంతుపట్టని ఆది రహస్యం మానవుడు' (పే. 100), 'నీటిపుట్ట' (పే. 103), 'పాట ప్రయాణం (పే118), 'హిట్లర్ నవ్వు (పే. 123), 'పాటలెందుకు మాయమైనట్టు? (పే. 13...) తుఫానుతుమ్మెదలో 'చీకటిలోంచి చీకటిలోకి' (పే. 23) వంటి ఎన్నో కవితలలో ఈ లక్షణం కనబడుతుంది.

తన కవిత్వంలో రాజకీయాలు, వ్యక్తిగతాంశాలు మిళితమై పోయాయని, అది ఒక విశిష్ట లక్షణమేనని దేవిప్రియకూడ గుర్తించినట్టు కనబడదు. సామాజిక అంతరంగ అంశాల మధ్య ఒక విభజన రేఖగీసి, ఆ రెంటికీ సంబంధం లేదు అని చాలామంది అనుకున్నట్టుగానే దేవిప్రియకూడ అనుకున్నట్టుంది. అందువల్లనే ఆత్మనింద, విచికిత్స, నిరాశ మరింత గాఢంగా వెలువడ్డాయి. ఆ అవగాహనను ఆయన 1980ల్లో వాచ్యం గానే ప్రకటించారు. "జండాలు చేసే యుద్ధాలను/ జండాలను మోసే చేతుల్ని / జండాలలో వెలిగే నేత్రాల్నీ / గానం చేసే నేను / వైయక్తిక / ఉక్కుగాలానికి/ ఎందుకిలా తగులుకొని/ వేలాడుతున్నాను/ అరణ్యాలలో / నగరాలలో/ అన్నలు అనంత వాయువులై / వీస్తున్నారనే ఆలోచనకి / అక్షర ప్రాణం పోసే నేను / ఎందుకిలా/ కబేళాలో తెగిన శిరసునై / గడ్డకట్టిన రక్తాన్నై/ కనిపించని కాలువలో పడి / కొట్టుకు పోతున్నాను" అంటూ రాశారు.

కాని ఆ తర్వాత ఈ ఆత్మనిందా ధోరణి తగ్గి సామాజిక ఘటనలమీద స్పందన వయ్యక్తిక అనుభవాల రూపంలో వెలువడడం కనబడుతుంది. అప్పుడిక ఆ వ్యక్తీకరణలో ప్రకటనకూ, వ్యాఖ్యకూ, విశ్లేషణకూ స్థానం పెరుగుతుంది. దేవిప్రియ కవిత్వ ప్రత్యే కతల్లో ఇది ఒకటి. వారం వారం పత్రికల్లోనూ, దినపత్రికల్లోనూ రోజువారీ సామాజిక, రాజకీయఘటనలమీద కవితా ప్రతిస్పందన, వ్యాఖ్య ప్రకటించడమనే అనివార్యస్థితి దేవిప్రియ కవిత్వంలోని రాజకీయ అంశను పదును దేర్చింది. సమాజానందస్వామి గీతాలలోనో, రన్నింగ్‌కామెంటరీలోనో క్లుప్తంగానూ, ఇతర కవితలలో తగినంత నిడివితోనూ రాజకీయాలమీద వ్యాఖ్యానించేటప్పుడు, అందరికీ తెలిసిన, అందరూ గత వారం పత్రికలోనో, నిన్నటి పత్రికలోనో చదివిన అంశంమీద, ఒక్కొక్కసారి ఇవాళ చదువుతున్న అంశంమీద కవి సద్యోవ్యాఖ్య చేయాల్సి ఉంటుంది. అంటే తప్పనిసరిగా ఒక భిన్నమైన కోణాన్ని, కొత్త వెలుగును ప్రకటించవలసి ఉంటుంది. బహుశా ఈ కారణంవల్లకూడ బైట, సామాజిక, రాజకీయ ఘటనల్ని తనలోకి తీసుకుని కొత్తగా, తనలోంచి చెప్పడం అనే ప్రత్యేకత దేవిప్రియకు అలవాటయి ఉంటుంది.

ఒక స్పందనాశీలి అయిన ఆలోచనాపరుడికి 1990 దశకం లెక్కలేనన్ని

ఆఘాతాల్ని, ప్రకంపనాల్ని సృష్టించి పెట్టింది. ఆ దశాబ్దాన్ని మొదలు పెట్టిన తూర్పు యూరప్, సోవియట్ పరిణామాల దగ్గరనుంచి, మత కల్లోలాలనుంచి, బాబ్రీమసీదు విధ్వంసంనుంచి, గద్దర్ తాత్కాలికంగా ఎదుర్కొన్న ఒక సంక్షోభం నుంచి, గద్దర్‌మీద జరిగిన హత్యా ప్రయత్నంనుంచి, బెల్లి లలిత హత్యనుంచి, సామ్రాజ్యవాదపు దూకుడు దాకా ఎన్నెన్నో అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ ఘటనలు జరిగాయి. దాదాపు ఈ ఘటనలన్నీ దేవిప్రియ కవిత్వంలోకి వచ్చాయిగాని ఎక్కడా ఒక కాటలాగ్‌గా కాదు, తన వ్యక్తిగత అనుభవపు, అధ్యయనపు, అవగాహనా సారంగా.

రాజకీయ కవిత్వంలో మరొక ముఖ్యమైన అంశం చర్చ. అది వాద, వివాద కవిత అయినా కావచ్చు. ఉత్తి సంభాషణ అయినా కావచ్చుగాని ఒక రాజకీయాభిప్రాయాన్ని కవిత్వంలో వ్యక్తం చేసేటప్పుడు అది కేవలం ప్రకటనగా ఆగిపోదు. దేవిప్రియ కవితలలో చాలచోట్ల ఈ చర్చా, సంభాషణా లక్షణం కనబడుతుంది. అమ్మచెట్టులో కుండలీకరణం (పే. 15), కుక్క గొడుగు (పే. 23)లనుంచి తుఫాను తుమ్మెదలో ఎన్నో కవితలవరకూ ఈ లక్షణం కనబడుతుంది.

ఈ రాజకీయ కవిత్వపు ప్రత్యేక లక్షణాలతోపాటు, పోరాట ప్రశంస, నేను కలిసిపోతాననే ప్రకటన, స్మృతిగీతాలవంటి లక్షణాలుకూడ దేవిప్రియ కవిత్వంలో కనబడతాయి.

దేవిప్రియ కవిత్వం తెలుగు రాజకీయ కవిత్వంలోనే ఒక విశిష్టధార అనీ, దాన్ని విశ్లేషించడానికి ప్రత్యేకమైన పరికరాలు వాడాలనీ గుర్తించలేని అమాయకత్వంతోనో, గుర్తించికూడ ధూర్తత్వంతోనో ఆయనను ఉద్యమకవిత్వానికి 'అతీతంగా' 'స్వచ్ఛతనూ ప్రయోజనాన్ని' కాపాడుతున్న కవి అనో, 'వాదాలకు, వివాదాలకు అతీతమైన కవి' అనో వర్ణించడం ఆయనకుగాని, ఆయన కవిత్వానికిగాని మేలుచేయదు.

*(దేవి '30' 'స్వరపత్రం' 2002 నుంచి)*



**ఇక్కడ అధికసంఖ్యాకులు పేదలు**
**పేదరికం మతం కాదు**
**ఇక్కడ అల్పసంఖ్యాకులు ధనికులు**
**ఐశ్వర్యం కూడా ఒక మతం కాదు..**

(సవరణ : అరణ్య పురాణం)



సుధామ

# ప్రసార మాధ్యమాల ప్రవక్త

మీరు చూశారా?

మీరు చదివారా?

మీరు విన్నారా?

పందొమ్మిదివందల ఎనభైఎనిమిది, ఎనభైతొమ్మిదుల్లో ఆంధ్రజ్యోతి ఆదివారంలో కొన్నివారాలపాట్లు దేవిప్రియ నడిపిన శీర్షిక పేరు అది. దేవిప్రియను గురించి నేనూ అదే అడుగుతున్నాను. ఎందుకంటే దేవిప్రియను చూడడం, చదవడం, వినడం మూడూ కూడా మామూలయిన విషయాలు కావు. అలాగంటే ఆయన మనకు అందనంత దూరంగా, ఎత్తుగా ఉన్నాడని కాదు. ఆయన ఎంత సన్నిహితంగా రాగలడో మిత్రు లందరికీ తెలుసు. తన ఆత్మీయత అందుకున్న వారందరికీ తెలుసు. దేవిప్రియను ఒకసారి చూడడం, ఒకమారు ఆయన రచన ఏదయినా చదవడం, సభలో తనను ఒకసారి వినడం జరిగినంత మాత్రాననే తాను చాలా ప్రభావోపేతమైన 'ముద్ర' వేసేస్తాడని నేను అనను.

తొలి పరిచయంలోనే 'ఇన్‌స్టంట్'గా ఊదరగొట్టే నైజం కానేకాదది. కానీ తనతో, తన పుస్తకంతో, తన మాటతో వెన్నంటి వెడుతున్నకొద్దీ చాలా విషయాలు తెలుస్తాయి. అవి మామూలు విషయాల్లాగానే, మనకు పరిచితమైన అంశాల్లాగానే వుంటాయి. కానీ దేవిప్రియ వాటిని అందిస్తున్నప్పుడు ఆ విషయాల గొప్పతనం, వాటి 'ఇన్‌డెప్త్' లోతుపాతులు, వాటిని తాను దర్శించి మనకు అందించే తీరు, ఆ దృష్టికోణం మనలను ఆకట్టుకుని, తనవెంట నిలబెట్టేస్తాయి. తనలోని బహుముఖీనత అబ్బురపరచడం మాత్రమే కాదు, నిబ్బరంగా అందుకుంటే మానవీయవిలువల మూలకందమైన 'నీటిపుట్ట'ను కదిలిస్తుంది. 'సమాజానందస్వామి'గా 'అమ్మచెట్టు' చెంతనిలచి, 'గరీబు గీతాల'నాలపించే కవి దేవిప్రియ 'తుఫానుతుమ్మెద'లా మనలను



చుట్టుకుంటాడు. ఇంక 'దేవిప్రియ – నేను అనే 'రన్నింగ్ కామెంటరీ' మొదలవుతుంది.

దేవిప్రియ 'ప్రజావాహిని'తోనే నాకు మొదటి పరిచయం. హైదరాబాద్ రామకోటి చౌరస్తాలో న్యూసైన్స్ కాలేజికి దగ్గరగా ఓ ప్రెస్సు వుండేది.

ఆ ప్రెస్సులోనే దేవిప్రియ సంపాదకత్వంలో వడ్డెంపూడి హనుమంతరావుగారి 'ప్రజావాహిని' వారపత్రిక టాబ్లాయిడ్ సైజ్‌లో వస్తూండేది. 1974లో తను కుర్ర ఎడిటర్‌గావున్న ఆ 'ప్రజావాహిని'లో తను చేసే 'సెన్సేషన్లు' కేవలం సెన్సేషన్స్‌గా కాక, వాస్తవాలను నిర్భీతిగా బయటపెట్టే సాహసిక ఎడిటర్‌గా తోచేవాడు. 'శ్రీశైలం దేవస్థానం ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారి హనుమత్సాహసం' వంటి అవినీతికర విషయాలను ఎండగడుతూ సామాజికాంశాలనూ, రాజకీయాంశాలనూ రంజుగా అందించేవాడు. అయితే స్వతహాగా సాహిత్యోపజీవిని కనుకనే 'చదువతగిన పుస్తకం,' తనకు ప్రియమైన వ్యంగ్యం అభివ్యక్తం చేసే 'చురక' వంటి శీర్షికలు అందులో ఉండేవి. నా చేత కార్టూన్లు (పొలిటికల్‌గా కూడా) గీయించిందీ, కవితలు, రాయించిందీ, వ్యాసాలు రాయించిందీ మాత్రమేకాక – కలిసి తిరుగుతూ ఒక అవగాహనను పెంపొందింప చేసుకునే వీలు కూడదీసుకున్నదీ తనతోనే. 'ప్రజావాహిని'లోనే తను రాసిన 'సెంట్రీ' నాటికకు అక్షరాలంకరణం చేయడం నాకు గుర్తే. వినుకొండ నాగరాజు తనకు అప్పట్లో సాహిత్య అకాడమీ ప్రకటించిన బహుమతిని ('ఊబిలో దున్న' నవలకు) తిరస్కరిస్తూ 17 అక్టోబర్ 1974న రవీంద్రభారతి మినీథియేటర్లో ఏర్పాటు చేసిన జర్నలిస్ట్‌ల మీట్‌కు దేవిప్రియ, నేనూ కలసి వెళ్ళినప్పుడే అవార్డుల తీరుతెన్నులను గురించి, సన్మానాలు బిరుదుల గురించీ దేవిప్రియ చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తే. ఈ ముప్పై ఏళ్ళల్లోనూ మా 'సమాజానందస్వామి' దేవిప్రియ వ్యాఖ్యలు అక్షర సత్యాలుగానే భాసిస్తున్నాయి మరి !

ప్రముఖ సినీనటులు కాకరాల గొప్ప అభ్యుదయ సాహిత్యశీలి అనే విషయం దేవిప్రియతోబాటు కలిసినప్పుడే తెలిసింది. మిత్రుడు నాగినేని భాస్కర్రావ్, నేనూ కలిసి రాసిన 'మేం' కవితా సంకలనాన్ని దేవిప్రియ ప్రజావాహినిలో కాకరాల చేత సమీక్ష చేయించి, మాకొక 'బూస్ట్' ఇవ్వడం ఎలా మరిచిపోగలను ! తరువాత తను 'ప్రజాతంత్ర' పత్రికలోకి వచ్చాడు. 1977 ఆగస్టు సెప్టెంబర్‌ల వరకూ తను ఆ పత్రికలో 'సినీతంత్ర' సినిమా పేజీలను స్వయంగా రాసేవాడు. ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా తనపేరు 1977 ఆగస్టులోనే చూసిన గుర్తు. అడుసుమిల్లి వెంకటేశ్వరరావు మేనేజింగ్ ఎడిటర్‌గా వుండే ప్రజాతంత్రకు ఎడిటర్ & పబ్లిషర్‌గా వి. శ్రీహరిరావు పేరుండేది. మొదటిసారి ప్రజాతంత్రలో ఎక్జిక్యూటివ్ ఎడిటర్‌గా 'దేవిప్రియ' పేరు చూసి – ఆయన సంతోషం సంగతి తెలియదు కానీ, నా మటుకు నాకు చాలా ఆనందం కలిగింది.

'సినీతంత్ర' దేవిప్రియలోని విమర్శకుడిని, సమీక్షకుడిని గొప్ప ఆలోచనాశీలిని పాఠకులకు పరిచయం చేసింది. కేవలం సినిమాల గురించిన విషయాలే అయినా



ఒక పత్రిక ఎంత సమర్ధవంతంగా, ప్రయోజనకరంగా అందించవచ్చో దేవిప్రియ నిరూపించాడు. తన సినిమా సమీక్షలు ఎప్పుడూ 'మూస' ధోరణిలో సాగలేదు. తాను ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అయ్యాక, సినీతంత్ర పేజీలను ఢిల్లీనుంచి టంకశాల అశోక్ వంటి వారిచేత, రామమోహన్‌రావు, శ్రీకంఠమూర్తి మొదలయిన నాటి ఔత్సాహికుల చేతకూడా రాయించాడు.

1977 ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలను గురించి – 'అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలను ఎలా నిర్వహించాలి?' శీర్షికన రాస్తూ "ప్రపంచ సినిమా ఉద్యమానికి మూలస్తంభాలవంటి మహాదర్శకులు కురసోవా, ఆంటోనియోనీ, కజన్, సత్యజిత్‌రాయ్‌లను ఒకే వేదికమీద చూసే మహదవకాశం ఈ చలనచిత్రోత్సవానికి హాజరైనవారికి లభించింది. ప్రపంచం మొత్తంమీద అత్యధికంగా ముడి ఫిలింని ఉపయోగించి, అధికాధికంగా చెత్తని తయారుచేస్తున్న భారతదేశం వంటి దేశాలలో యిది నిజంగా చెప్పుకోదగిన సంఘటన" అని వ్యాఖ్యానిస్తాడు దేవిప్రియ.

"గ్రామాలలోవున్న, పట్టణాలలోవున్న నిరక్షరాస్య ప్రేక్షకుడి అభిరుచిలో మార్పు తీసుకురావాలనుకోవడం అవసరం. ఎందుకంటే ఈనాటి సామాన్య ప్రేక్షకుడి అభిరుచి మననిర్మాత, దర్శకుల అభిరుచే. సినిమా వచ్చిన తొలిరోజుల్లోని నిరక్షరాస్య ప్రేక్షకుడికీ, ఈనాటి నిరక్షరాస్య ప్రేక్షకుడికి యేమీ తేడాలేదు. వాళ్ళ అభిరుచిని తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ మన నిర్మాతలదే, దర్శకులదే. సినిమా ధోరణి మారితేకాని వాళ్ళు మారరు. ఎటొచ్చీ మార్చవలసింది విద్యావంతులై వుండికూడా, ప్రపంచం తెలిసికూడా, ఏది చెత్త చిత్రమో, ఏది మంచి చిత్రమో తెలుసుకోలేని 'ఎడ్యుకేటెడ్ పర్సన్స్‌నే'! ఈ పని చలన చిత్రోత్సవాలు చేయగలవు" అంటూ దేవిప్రియ. అయితే అట్టహాసపు తతంగం మారాలి అనీ, వివిధ దేశాల చిత్రాలు పాల్గొనే ఈ ఉత్సవాలు ఎంత ఎక్కువగా వీలయితే అంత ఎక్కువగా జరగాలనీ, అయితే సినిమాలనుంచి ఎంతో కొంత నేర్చుకోవడానికేగానీ తారలను చూడడానికి ఉత్సవాలు కాదనీ, అందువల్ల సినిమాల ప్రింట్లు వస్తే చాలనీ, ఆయా చలనచిత్రోత్సవాల నిర్వహణలో ఫిలిం క్లబ్బులూ, ఫిలిం సొసైటీలకు తప్పనిసరి భాగం వుండాలనీ, ప్రతిసినిమా చూసే అవకాశం, ప్రదర్శనానంతరం, చర్చలు, వ్యాఖ్యానాలు, అభిప్రాయ ప్రకటనలూ జరగాలనీ, జిల్లా కేంద్రాలయిన పట్టణాల వరకూ యీ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు వెళ్ళాలనీ, అత్యుత్తమ చిత్రాలు అనుకున్నవి ప్రేక్షకులకు ప్రదర్శించడం ద్వారా మాత్రమే వారికి మంచి చెడుల మధ్య వ్యత్యాసం చూసే అవకాశం లభిస్తుందనీ అంటాడు. "... ఇతివృత్తాన్ని ఎవరు ఏవిధంగా చిత్రీకరిస్తున్నారో తెలుస్తుంది. మానవజీవిత మహాసముద్రంలో అడుగున యెన్నెన్ని వాస్తవిక కథారత్నాలను ఎంత అద్భుతంగా యితర దేశాల దర్శకులు వెలికి తీసుకువస్తున్నారో మన ప్రేక్షకుడికి అర్థమవుతుంది."



"అందువల్లనే" ప్రతి పట్టణంలోనూ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు నిరాడంబరంగా నిర్వహింపబడాలనడం. సత్యజిత్‌రాయ్ సినిమాలు, మృణాళ్‌సేన్ సినిమాలు, కారంత్ సినిమాలు ఎవడు చూస్తాడండీ అనగలిగే ధైర్యం యిది జరిగిన నాడు యే మద్రాసు నిర్మాతకీ, ఏ బొంబాయి నిర్మాతకీ వుండదు. సంవత్సరానికి తొంభై సినిమాలు నిర్మించినా ఊరూపేరూ లేకుండా పోవలసిన దుస్థితి ఆనాడు దేశంలోని యే ప్రాంతీయ చిత్ర పరిశ్రమకీ వుండదు" అని స్పష్టంగా అన్నాడు దేవిప్రియ (ప్రజాతంత్ర 2.10.77). కాని నేటికీ స్థితిలో మార్పేది? డి.పి. అనే పొడి అక్షరాలతో 'ముఖాముఖి' శీర్షికన చలనచిత్ర ఛాయాగ్రాహకుడు శ్రీనివాస్ ఘోష్ (25.9.77) మన కాకరాల (11.9.77) వంటివారితో ఇంటర్వ్యూ చేసి ప్రచురించిందీ దేవిప్రియే అనుకుంటున్నాను. అలాంటివి ఇంకా ఎన్ని రాసారు.

ప్రజాతంత్ర 'సినీతంత్ర' పేజీల్లో దేవిప్రియ – దక్షిణ భారతంలోని మొదటి సినిమాకంపెనీ హైద్రాబాద్‌లోనే పుట్టింది! కాని ఏం లాభం, 'న్యూ సినిమా ఉద్యమం కోసం', 'వాపేకానీ బలుపు కాదు', 'బాలల చిత్రాలంటే యేవి" (6.3.77సంచిక) 'సెన్సార్‌బోర్డ్ వారినుంచి తెలుగు సినిమాని రక్షించండి', 'మనం సినిమాలు ప్రేక్షకుల్ని ఎటు నడిపిస్తున్నాయి', తెలుగు నిర్మాతలకు డబ్బు ఎక్కువైందా', థియేటర్ల యజమానులకు హెచ్చరిక'వంటి రచనలు సూటిగా ధాటిగా ఆలోచనాత్మకంగా పదునైన కలం పలుకులుగా పాఠకులను ఉత్తేజపరుస్తాయి. ప్రజాతంత్ర సినీవ్యాసాలన్నీ పుస్తకంగా రాదగినవి.

నంది అవార్డులు వివాదాస్పదం కావడం ఇప్పటి మాటే కాదనీ, 1975 నాటికే ఆ అపసవ్య ధోరణులు ప్రతిబింబించడం వుందనీ – 'నంది అవార్డులు ఉత్తమ చిత్రాలకే లభించాయా' అని 1975 నంది అవార్డు పొందిన చిత్రాల గురించి దేవిప్రియ (10.10.76 సంచిక ప్రజాతంత్రలో) రాసిన వ్యాసం స్పష్టం చేస్తుంది. ఆ వ్యాసంలో తను రాసిన అంశాలు ఇప్పటికి తాజాగా ఆలోచించదగినవే.

"అన్ని విధాల ఉత్తమ చిత్రం అని చెప్పుకోడానికి వీలున్న సినిమా ఏదీ లేనప్పుడు ఆ సంవత్సరానికి ఏ చిత్రానికీ బహుమతి ఇవ్వడం లేదని ప్రకటించడం నిజాయితీ అనిపించుకుంటుంది. రాజీ పడడం ఎందుకు? ఉత్తమ చిత్రాలను ప్రోత్సహించవద్దనీ, నంది అవార్డులను ఎత్తివెయ్యమనీ చెప్పడం లేదు. బహుమతులు ప్రకటించేముందు, ముందువెనుకలు ఆలోచించడం మంచిది. ఉత్తమ చిత్రం లక్షణాలేమిటో కమిటీకి స్పష్టంగా తెలిసివుండాలి. దేశంలో ఇతర భాషలలో ఎటువంటి చిత్రాలు వస్తున్నాయో, న్యూ సినిమా పోకడలేమిటో, జాతీయస్థాయి బహుమతులు పొరుగునవున్న కర్నాటక, కేరళ రాష్ట్రాలకే ఎందుకు వెడుతున్నాయో అవార్డులు యిచ్చే కమిటీ అర్థం చేసుకుని వుండాలి."



రాష్ట్రప్రభుత్వం, ప్రభుత్వం నియమించే అవార్డుల కమిటీలు ఒక విషయం స్పష్టంగా తేల్చుకోవాలి. తాము ప్రోత్సాహించదలచింది మామూలు ...... బోటుషికార్ల, యుగళగీతాల, ఫార్ములా సినిమాలనా? లేక ప్రజల జీవితానికి దర్పణంపట్టి, వారి సమస్యలను వెలుగులోకి తెచ్చి, పరిష్కారాలు చూపే ప్రయోజనాత్మకమైన చిత్రాలనా? తెలుగు సినిమాల భవిష్యత్తు ఈ ప్రశ్నలకు లభించే సమాధానంమీదే ఆధారపడివుందని ఇటు ప్రభుత్వం, అటు పరిశ్రమవారు గుర్తించడం అవసరం."

– నేటికీ ఈ మాటలు ఒక్క పదమయినా పాతబడలేదు కదా!

'సినిమా ప్రపంచంలో కొత్తగా ప్రవేశించిన స్నేహితునికి 'శ్రేయోభిలాషి లేఖ' పేరిట ప్రియమైన సుందరానికి ముకుందం రాసిన లేఖగా దేవిప్రియ సినిమా పేజీలను ఒక కొత్తవొరవడిలో రాయడం 'సినీతంత్ర' కాలమ్‌లో ప్రజాతంత్ర 24.10.76 సంచికలో చూడవచ్చు. 2000 సంవత్సరం నాటికి సమాజం ఎలా వుంటుంది? అనే ప్రత్యేక వ్యాసం ప్రచురింపబడిన ఆ సంచికలోనే 'సమాజానందస్వామి' దేవిప్రియ ఇలా కాంక్షిస్తాడు.

*అంగారక గ్రహం నుంచి*
*లింగరూపధారులొచ్చి*
*కల్తీ సరుకులు అమ్మే*
*శాల్తీలను తగలేస్తే*
*ఎంత మంచిగుంటదో*
*పాతాళంలో దాగిన*
*భూతాలేవైన వచ్చి*
*ఇన్‌కమ్‌టాక్స్ ఎగ్గొట్టే*
*ఘనుల పీకలట్టుకుంటె*
*ఎంత సుఖంగుంటదో*
*ఎంత లాభముంటందో.*

చీకటిబజారు, అవినీతి చిద్విలాసంగా ఇంకా నవ్వుతూనే వున్నాయికదా! సరే! సినిమాలగురించి కూడా సమాజానందస్వామిలో ఉటంకించిన సందర్భాలు అనేకం!!

దేవిప్రియ జర్నలిస్టు, పత్రికాసంపాదకుడు కన్నాముందు బేసిక్‌గా కవి. అది కాదనలేని సత్యం. అయితే జర్నలిస్టుగా, పత్రికా రచయితగా పుంఖానుపుంఖాలుగా సినిమా కబుర్లు వంటివాటిని రాస్తూకూడ తన కవిత్వాన్ని సీరియస్‌గా నిలబెట్టుకోవడం నిజంగా ఘనతే. ఒకపక్క 'సమాజానందస్వామి' రన్నింగ్ కామెంటరీ'లతో హాస్యవ్యంగ్య ఫణితిలో ప్రాసలతో సైతం ఆడుకుంటూ, అనుదిన వర్తమాన ప్రపంచానికి, సంఘటనలకు వ్యాఖ్యానాలను సంతరించి ఆలోచింపచేస్తూ, అలరిస్తూనే తను సీరియస్ కవిత్వాన్ని

రాసేవాడు. 'రన్నింగ్ కామెంటరీ', 'సమాజానందస్వామి', 'గరీబుగీతాలు' దేవిప్రియ పాపులారిటీకి ప్రధానకారణాలని ఒప్పుకోక తప్పదు. వాటిల్లోని కవిత్వ గుణాన్ని చర్చించడానికి కవిమిత్రులు, విమర్శకులు వేరేవున్నారు.



ఈ వ్యాసప్రారంభంలో నేను ప్రస్తావించిన 'మీరు చూశారా? చదివారా? విన్నారా?' శీర్షిక గురించి చెప్పకపోతే దేవిప్రియలో మనం చూడవలసిన బహుముఖీనతకు పూర్ణత్వం సిద్ధించదు. అవి రాసికూడా ఒక పుష్కరకాలం గడిచింది కానీ, వాటిల్లో వారం వారం తాను ఎన్నుకున్న అంశాలు, సంగతులు ఒక వ్యక్తి గురించో, ఒక పుస్తకం గురించో, ఒక క్యాసెట్ గురించో, తాను చూసిన ఒక సినిమా గురించో అయినా సరే దానిని చెప్పిన తీరు విలక్షణమైనదిగా కనిపిస్తుంది.

ఈ 2002 సంవత్సరం జనవరిలో– భారతరత్న అయిన బిస్మిల్లాఖాన్ (షెహనాయ్ విద్వాంసులు) హైదరాబాద్‌కు వచ్చి సరియైన మర్యాద లభించక ఖేదిల్లడం, ఆ తర్వాత ముఖ్యమంత్రి స్వయంగా ఆయనను కలసి క్షమాపణ చెప్పడం ఇటీవలి వార్తల్లోని అంశమే. అక్టోబర్ 2, 1988 సంచికలో 'కేసెట్‌లో' షెహనాయి సంగీత సముద్రం' అని రాసిన రచనలో దేవిప్రియ ఇలా అంటాడు.

"బిస్మిల్లాఖాన్‌ని మన హైదరాబాద్ రోడ్డుమీద వదిలిపెడితే ఆయన ఒక మహా సంగీతకారుడని యెవ్వరూ అనుకోరు. ఆయన అంత సాదాసీదాగా, అంత అన్ ఎజ్యూమింగ్‌గా వుంటారు. ఆయన షెహనాయినుంచి జాలువారే ఆ వెన్నెల సంగీతం కూడా అంతే! రాగరహస్యాలు తెలిసిన సంగీత జ్ఞానులనే కాక పామరులను కూడా అది రంజింపచేస్తుంది."

నాటి టీ.వీ.సీరియల్ 'భారత్–ఏక్–ఖోజ్' గురించిరాస్తూ – శ్యామ్‌బెనెగల్ అన్నీ నిర్దుష్టంగానే చేశారు కానీ నెహ్రూ పాత్రపోషణకి తనుకూడా రోషన్‌సేత్‌నే తీసుకుని, అటెన్‌బరో చేసిన పొరపాటునే మరొకసారి చేశాడనిపిస్తోంది. గాంధీలో కూడా నాకిలానే అనిపించింది. చాలామంది నాతో ఈ విషయంలో ఏకీభవించక పోవచ్చు కానీ నేనెందుకో రాజీ పడలేకపోతున్నాను. వెతికిచూస్తే మరింతగా నెహ్రూని తలపింపజేసే మరొక నటుడు దొరక్కపోయేవాడా అని సరిగ్గా ఈ భావనే నాకు వుంది. దేవిప్రియ రాసింది చదవగానే "పర్లేదు, నా భావన సరియైనదే నన్నమాట" అని సంతోషం వేసింది. ప్రకృతి విజ్ఞానంమీదా, జంతుజాతుల సంరక్షణమీదా ఆసక్తి లేనివారుకూడా చూసితీరవలసిన సినిమా 'గొరిల్లాస్ ఇన్ మిస్ట్' గురించీ, 'చరిత్రలో నిజామాబాద్ జిల్లాపై గిరినాగభూషణం పుస్తకం గురించీ, 'జర్నలిజం ఈజ్ లిటరేచర్ ఇన్ హర్రీ' అనేమాట పేర్కొంటూ ఉడయవర్లు 'లోకాలోకనం' వ్యాసాల పుస్తకం గురించీ, చిత్తప్రసాద్ కాదు ప్రజా'చిత్ర' ప్రసాద్ గురించీ, ఇండియా టుడే అప్పట్లో తెచ్చిన 'న్యూస్‌ట్రాక్' 'వీడియో న్యూస్ మాగజైన్'ను గురించీ, కె.రామచంద్రమూర్తి



గారి 'సరదాల పరదా' గురించీ, మొఘల్–ఏ–అజమ్ మాటలు, పాటలు క్యాసెట్ గురించీ, బ్రూక్‌ఫీల్డ్ 'పెటీబేబీ' గురించీ, వి.నాగయ్య, కన్నాంబలు పాడిన ఆనాటి తెలుగుపాటల 'అలనాటి అందాలు' క్యాసెట్ల గురించీ, సలామ్‌బాంబే సినిమాగురించీ, లూయిస్ బ్యాంక్స్ గురించీ, ట్రేసీచాప్‌మన్ అమెరికన్ గాయని గురించీ, 'ది లాస్ట్ ఎంపరర్' చిత్రం గురించీ, ఆజాద్ జీవిత చరిత్ర గ్రంథం' ఇండియా విన్స్‌ఫ్రీడం గురించీ, 'బేగమ్ అక్తర్ మధురగానం' గురించీ ఇలా చెప్పిన బోలెడు కబుర్లన్నీ చదవడం గొప్ప అనుభూతే కాదు, నిజంగా పాఠకునిలో ఒక 'టేస్ట్' (అభిరుచి)ని కలిగించే మంచి రచనలు.

మంచిని గుర్తించే ఈ అవగాహన ఉంది కనుకనే – చిన్న తెరమీద, వెండితెర మీద కూడా దేవిప్రియ అవకాశాల కోసం అర్రులు చాచడం కాకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. జెమిని టీ.వీ.లో 'బిజినెస్‌ట్రాక్' నిర్వహించడం, బి. నరసింగరావు తీసిన రంగులకల, దాసి చిత్రాలకు పని చేయడం, 'రగులుతున్న భారతం' చిత్రానికి పాటలు రాయడం, 1992 లో ఉత్తమ గీత రచయితగా నంది అవార్డు పొందడం ఇవన్నీ తన కృషి విజయాలే. గద్దర్‌పై ఇంగ్లీషు డాక్యుమెంటరీ చిత్రం 'ది మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్' అతని రచన, నిర్మాణం, దర్శకత్వం అనే ప్రతిభా త్రిపుటికి నిదర్శనం.

'గీటురాయి' మాసపత్రికలో చివరిపేజి దేవిప్రియ రాయడం గమనించిన మా కొలీగ్ ఒకతను "మీ దేవిప్రియ ముస్లిం అని అతను నమ్మలేదు. దేవిప్రియకూడా మానవత్వాన్ని నమ్మాడేగానీ ఛాందసంగా మతాన్నయినా నమ్మలేదు. తన భావాలను ఏ స్వార్థప్రయోజనాలకీ అమ్మలేదు. తను అందరిమనిషి, అందరి కోసం మనిషి, శివారెడ్డి, దేవిప్రియ కలిసి, విడివిడిగాకూడా తెలంగాణా జిల్లాల్లో ఎక్కువ సాహితీ చైతన్యం ప్రోదు చేసారనిపిస్తుంది. అలాగని వారి కృషి ఆ జిల్లాలకే పరిమితమైనదని కాదు. వారివల్ల ఇక్కడి యువతకు ఒక ఊతం లభించింది. దేవిప్రియ తన పత్రికా నిర్వహణలో ఎక్కడ సంపాదక బాధ్యతల్లోవున్నా ఎందరినో ప్రోత్సాహించి 'న్యూ టాలెంట్'ను తెచ్చేవారు.

'ఉదయం' దినపత్రిక మ్యాగజైన్ సెక్షన్ తను చూస్తున్నప్పుడు నన్నొక కాల మిస్టుగా ప్రవేశపెట్టింది తనే. 'హ్యూమర్‌మరాలు' 'నవ్వునాలుగందాల స్వీటు' వంటి శీర్షికలను పదమవ్యూహం పేరిట గళ్ళనుడికట్టును నిర్వహింపచేసి పత్రికా రచయితగా మార్చాడు. నేను కవిత్వం రాయడం మానకూడదని ఇప్పటికీ ఆత్మీయంగా హెచ్చరిక చేస్తున్నది తనేకదా!

'తను నాకు తెలుసు' అని కొందరు వ్యక్తులు గురించి చెప్పుకోవడం ఒక గొప్ప. అటువంటిది ఆ వ్యక్తులు కూడా ఆ విషయాన్ని రికగ్నైజు చేస్తే అది ఇంకెంత



గొప్పోకదా! దేవిప్రియ గొప్పతనం తనలో సన్నిహితంగా తిరిగే మిత్రులందరికీ తెలుసో తెలియదో తెలియదు కానీ పరోక్షంగా ఎందరికో తెలుసు. ప్రత్యక్షంగా ఎందరు దానిని అభివ్యక్తం చేస్తారో, చేయగలరో తెలియదు కానీ ఆయన ప్రభావం నీరెండలా పరుచుకుని ఆ ఆత్మీయమైన అమ్మచెట్టునీడన స్నేహపరిమళాలు అందిపుచ్చుకున్న వారెందరో.

దేవిప్రియ – వైరుధ్యం లేని వైవిధ్యం.

అతని బహుముఖీనత అంతా నిత్యచైతన్యత అనే ఏకోన్ముఖంగానే
తను ఎన్ని ఆటుపోట్లకు గురి అయినా అది రాటుదేరిన వ్యక్తిత్వం
అతని ఆగ్రహోద్రేకాలు సహేతుకమైనవి.
అతని స్నేహానురాగాలు సప్రేమ ప్రీతి అయినవి
జర్నలిజం, సినిమారంగం, బిజినెస్ ప్రపంచం, ఎలక్ట్రానిక్ మీడియా
ఎక్కడెక్కడ ఎన్ని సంచారాలు చేసినా
అతని హృదయం కవిత్వం
సీరియస్‌గా కనిపించే తనలో బోలెడన్ని చెణుకులు

'సమాజానందస్వామి' 'రన్నింగ్‌కామెంటరీ' దేవిప్రియ జర్నలిజానికి ఇచ్చిన కానుకలు. తను ఒక కవితాత్మక విలేఖరి, పొయిటిక్ క్రిటిక్.

ఆఫ్రికా అరణ్యాలలో స్వైరవిహారంచేసే చోదక చీమలు (.......) సైనిక చీమలు (......) గురించి 'సైనిక చీమల స్వైరవిహారం' అని ప్రజాతంత్ర 7.11.76 సంచిక) దేవిప్రియ రాసిన ఓ రచన భలే కుతూహలంగా వుంటుంది. క్రూర మృగాలతో సహా అడవిలో తిరిగే జంతువులన్నీ సైనిక చీమల రాకను పసిగడితే చెల్లాచెదరై పారిపోతుంటాయి గాండ్రించే సింహాలు, ఘీంకరించే మదపు టేనుగులు. సాయుధులైన మనుషులుకూడా సైనిక చీమలు బయలుదేరితే పారిపోవలిసిందేనట.

ఆ వ్యాసంలోని వివరాల మాట ఎలావున్నా 'సైనిక చీమ' అన్న పదం నాకు ఎంతో బాగా నచ్చింది. 'పిపీలికం' యొక్క గొప్పదనం రావిశాస్త్రి లాంటివారు చెప్పకనే చెప్పాక – కవిదిగ్గజాలు, కవి సింహాలు, కవివృషభాలు వున్న సాహిత్య ప్రపంచంలో నిజానికి సైనిక చీమ బలమే గొప్పది.

'రచయిత ఒక సాంస్కృతిక సైనికుడు' అంటాడు మావో.

గమ్యం తెలిసి సాగే సైనికచీమ లాంటివాడు, వ్యష్టి సమష్టిగా రూపుదాల్చడమే ముఖ్యం అని విశ్వసించినవాడు, మతంకన్న మానవీయ అభిమతమే ఉదాత్తమూ, ఉత్తమమూ అని చాటినవాడు దేవిప్రియ.

'దేవి–థర్టీ' ఒక అభినందన సందర్భం మాత్రమే.

ఇలాంటి ఎన్నో సందర్భాలు తటస్థించాలనీ, తటస్థిస్తాయనీ నా ఆశ, ఆకాంక్ష.

*('దేవి' 30 'స్వరపత్రం 2002 నుంచి)*



సీతారామ్

# దేవిప్రియ ఓ తుఫానుతుమ్మెద

'Say one thing and mean another.' మెటఫర్‌లోని మర్మ మిదే. ఆధునిక కవిత్వంలో ఇది మరీ అధికం. మెటఫర్ అనగానే రూపకమేకదా అని అనువదించుకోకుండా 'చేరా'ని సంప్రదించాలి. మెటఫర్‌ని మెటఫర్ అనకుండా మెటఫోరైజేషన్ అని ఎందుకు అంటున్నారో సందేహనివృత్తి చేసుకోవాలి. దేవిప్రియ 'తుఫాను తుమ్మెద' ఒక ఆధునిక మెటఫర్. భాషలోనూ, కవిత్వంలోనూ మెటఫర్ ఒక అమ్నిప్రజెంట్ ప్రిన్సిపుల్. దీనిని గుర్తించిన కవి దేవిప్రియ. దేవిప్రియ రాసిన కవిత్వంలో మెటఫర్‌కి బహుళ ప్రాధాన్యం ఉంది. అలాగని ఆయన డెడ్ మెటఫర్‌లు వాడరు. దాన్ని పరిహరిస్తూ, వస్తువునూ, దృక్పథాన్నీ, సందర్భాన్నీ నూతనీకరించే క్రమంలో దేవిప్రియ కనిపిస్తున్నారు 'తుఫాను తుమ్మెద'లో.

దేవిప్రియ మెటఫర్‌ని ఒక సర్వజ్ఞ నియమంగా వాడి అపురూప కవిత్వాన్ని అందించారు.

గుండెగాయాలను గొంతుతో నిమురుకున్న కవి దేవిప్రియ. "కవిత్వం / ఇంద్రధనుస్సుకి నిద్రలో కనిపించే బ్లాక్ అండ్ వైట్ స్వప్నం" అంటూ కవిత్వానికి ఆయన ఇచ్చిన నిర్వచనం. "ఇప్పుడు బతుకుతున్నదుందే / ఇదే నిజమైన మరణానంతర జీవితం" అని ఆయన వ్యాఖ్యానం. ఇందులో అందరి, మనందరి జీవితాలున్నాయి.

"నా పాదాలు సామాజిక న్యాయవాదాలు / సంపూర్ణమానవ చైతన్య నినాదాలు" అంటూ తన కవిత్వం గురించి దేవిప్రియ ఇచ్చిన కవితాత్మక వివరణ. ఈ మూడింటి మధ్య దేవిప్రియ కవిత్వం మసలుతూ వాస్తవాన్ని వెలికితీసి చూపుతూ ఉంటుంది.

"మరణమే నీ యదార్థ ఛాయ" అన్నప్పుడు ఆయన తాత్వికుడు. 'తుఫాను తుమ్మెద'ను పలకరిస్తున్నప్పుడు ఆయన ఉద్యమకారుడు. మహంకాళి జాతరలో బెల్లి లలితను చూసినప్పుడు ఆయన క్రోధాగ్నిపరుడు.



"పూలను నేనొక చామనచాయ పువ్వు పూజకోసమే దొంగిలిస్తాను" అన్నప్పుడు నిర్మల ప్రేమికుడు. "పరివారాలకి అంకితమైనవాళ్ళు ప్రవాహాలకి నాయకత్వం వహించలేరు" అన్నది ఆయన కఠోక్తి. "ఈ ప్రపంచం బాంబులు కలవాడి బాస్టర్డ్ చైల్డేనా?" అన్నప్పుడు ఆయన ఓ మానవుడు, ఓ అధిమానవుడు. "మసీదు మెట్లమీదో / సరయూనది స్నానఘట్టం దగ్గరో/ చెయ్యిచాచి కూలబడిన ఫకీరులూ యాచకుల కళ్ళలో/ ఘనీభవించిన బీభత్సం సామ్రాజ్యవాదం"గా గుర్తించినపుడు దేవిప్రియ దృక్పథపటిమ మనకు కనిపిస్తుంది.

ఏ కవికైనా కవిత్వం పుట్టుకకు కావలసిన వనరు ఏదోఒకటి ఉంటుంది. మనకు తెలిసిన చిన్నమాటల్లో చెప్పుకుంటే దేవిప్రియకు వనరులు మూడున్నాయి. ఒకటి అమ్మ, రెండు రాజ్యలక్ష్మిగారు, మూడు ఉద్యమం. సమకాలీన పరిస్థితులు / సంఘటనలు. ఆవేశం, ఆలోచన, ఆర్ద్రత నిండిన దేవిప్రియ కవిత్వం ఒక సంయమనం తో కూడిన అండర్ ప్లే. ఏ ఇతర ఓవర్‌టోన్స్ లేకుండా ఈ దేశం కంటున్న పీడకల గుట్టును, రానున్న తుఫానుముప్పును విప్పిచెప్పిన ఆయన కవిత్వం 'ఝ్రోయు తుమ్మెద'కాదు. ఓ తుఫానుతుమ్మెద!.

*(దేవి '30 'స్వరపత్రం' 2002 నుంచి)*

***రానున్న చరిత్ర కింక రాజులొద్దు***
***రానున్న చరిత్రకింక బానిసలొద్దు***
***రేపటి చరిత్రకి నిర్జీవ శిలాశాసనాలొద్దు***
***పరలోక సుందరి పక్కలో పొర్లాడే ప్రవక్తలసలే వద్దు.***

(రామప్పచెరువు దాహం : అమ్మచెట్టు)



*హరిశంకర్*

# ఒకే ఒక్కడు దేవిప్రియ!

దేవిప్రియగారితో నా సాన్నిహిత్యం అనుకోకుండా, ఆలస్యంగా ప్రారంభ మైనా, కాలంతోపాటు గాఢంగా పెనవేసుకుపోయింది. నాకు దేవిప్రియ గారంటే ఇష్టం! దేవిప్రియ కవిత్వమంటే మరీ ఇష్టం. కాలేజీ రోజులనుండీ సాహిత్యం చదివే అలవాటు వుండడంచేత అనేక పుస్తకాలు చదివేవాడిని. అందులో భాగంగా దేవిప్రియ అమ్మచెట్టు, సమాజానందస్వామి, గరీబుగీతాలు పుస్తకాలు చదివి ఇంప్రెస్ అయ్యాను. వామపక్ష విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనే నాకు, నాతోటి మిత్రులకు ఆనాటి దినపత్రికలలో రోజూ వచ్చే రన్నింగ్‌కామెంటరీ అంటే చాలా ఇష్టంగా వుండేది. మాకిష్టమైన లైన్లను ఆనాటి మా కార్యక్రమాలకు అనుకూలంగా పోస్టర్లకు, కరపత్రాలకు ఉపయోగించేవాళ్ళం. అప్పుడే, అనుకోకుండా నా ప్రియమిత్రుడూ, కవీ యాకూబ్‌తో కలిసి ఒకరోజు 'ఉదయం' దినపత్రిక ఆఫీసుకు వెళ్ళాం. మాటల్లో "అదిగో దేవిప్రియ సార్ కేబిన్, పద పరిచయం చేస్తా" అనడంతో ఆశ్చర్యపోయాను! కారణం అంతకు క్రితం రోజే నీటిపుట్టలోని కవిత్వం చదివాను. అలాంటి కవిత్వం రాసిన కవిని కలుసు కుంటున్నానని తెలిసి చాలా సంతోషమేసింది. ఆయన గదిలో కెళ్లి పరిచయాల తర్వాత చాలాసేపు కూర్చున్నాము. మాతో ఆప్యాయంగా మాట్లాడినా, ఒక్కమాటా మాట్లాడినట్టు కనబడలేదు. ఆ మౌనముభావముద్ర ఆయన రూపంనుండి ఈనాటికీ కనుమరుగు కాలేదు. మౌనంగా వుంటూనే మాట్లాడటం ఎలా? అనేది నాకు ఈనాటికీ ప్రశ్నగానే వుంటుంది. మాట్లాడుతూనే కవిత్వం రాయగలగడం, మాటల్లోనే కవిత్వం రాసేయడం దేవిప్రియ గారిలోని ప్రత్యేక లక్షణం. ఒక్క కవిత్వాన్ని తప్ప ఏ ఇతర విషయాలనూ సీరియస్‌గా తీసుకోకపోవడం దేవిప్రియగారిలోని విలక్షణ లక్షణం. మిన్నువిరిగి మీదపడుతున్నా, భూమ్యాకాశాలు కాసేపట్లో కనుమరుగవుతాయన్నా అదే గాంభీర్యం, అదే నిశ్శబ్దం! భౌతిక విషయాలలో అంత నిర్లిప్తంగా ఉండగలిగే శక్తి నేను చాలా

తక్కువమందిలో చూశాను. బహుశా ఆయనలో అంతర్ముఖంగా సాగే కవిత్వ సాధనా తీరాలను తాకే శక్తి భౌతిక విషయాలకు లేకపోవడం వల్లనేమో !

దేవిప్రియ గారిలో మరోకోణం డిజైనింగ్‌కి సంబంధించిన పరిజ్ఞానం. ఏది చేసినా, కొత్తగా, కళాత్మకంగా వుండాలంటారు. వుండేలాగా సలహా ఇస్తారు కూడా. ఒక్కోసారి తానే ఇన్‌వాల్వ్ అయి అనుకున్న ఫలితం వచ్చేదాకా వదలరు. ఆయన ఇన్‌వాల్వ్‌మెంట్ చూసి డిజైనింగ్ వృత్తిలోవున్న నాకే ఆశ్చర్యం కలుగుతుంది. నిజానికి ఈ కారణంకూడా మా మధ్య సాన్నిహిత్యం పెరగడానికి కారణమేమో! అప్పుడప్పుడూ నా డిజైనింగ్‌కి సంబంధించిన విషయాల్లో కాన్సెప్ట్, కాపీ రైటింగ్ అవసరమైనప్పుడు ఆయన దగ్గరకి వెళితే చాలు, క్షణంలో ఒక అందమైన, సరిగ్గా సందర్భానికి అమిరే ఐడియా వచ్చేస్తుంది. ఇంతటి భావుకత ఉండటం చేతనేమో ఆయన ఏప్రక్రియలోనైనా తనదైన ప్రత్యేక ముద్రను వేస్తారు. దేవిప్రియగారిని చాలా రోజులనుండి చదువు తున్నాను. ఆయన గురించి వింటున్నాను. నా దృష్టిలో జనంలో ఇంత ప్రాచుర్యం పొందిన కవులు చాలా తక్కువ. ఏ కవికైనా తాను రాసిన రెండు లైన్లు కనీసం ఒక్కరు కోట్‌చేసినా అంతకన్న గౌరవం ఏముంటుంది. ఆధునిక కవిత్వపు ఏ ఆనందక్షణాల్లోనైనా, ఏ ఉద్వేగ సన్నివేశాల్లో నైనా దేవిప్రియను గుర్తుచేసుకోకుండా వుండటం అసాధ్యం.

*(దేవి'30 'స్వరపత్రం' 2002 నుంచి)*



***ఎంతకాలమయిందో***
***దగ్గరి కొండలని తడిమి చూసి;***
***ఎన్ని రుతువులయిందో***
***ఆకులు మొలవని కొమ్మని తరిచి చూసి;***
***ఎన్ని నెలలు దాటిందో***
***గుమ్మం పక్కనున్న గన్నేరు చెట్టుని నిలిచి చూసి;***
***ఎన్ని జన్మలయిందో***
***అద్దంలో రోజూ కనిపించే నా ముఖంలోపలికి తొంగి చూసి...!***

(కాల గణన : గాలిరంగు)



జగన్

# కల్తీలేని కవిత్వం!

ముప్పై ఏళ్ళ కవి దేవిప్రియ గురించి, ముప్పై ఏళ్ళ జర్నలిస్టు దేవిప్రియ గురించి, ముప్పైఏళ్ళ సినీ విమర్శకుడు దేవిప్రియ గురించీ...

నేను కవిని కాను. అయినా "నువ్వు రాయకుండా ఎట్లా" అని యాకూబ్ అభ్యంతర ధ్వనిలో మాట్లాడినప్పుడు ఫలానా కోణంలో 'దేవ్' అని రాద్దామనుకున్నాను. కాని కుటుంబరావుగారి 'పంచకల్యాణి'ల్లా 'కవి దేవి', 'జర్నలిస్టు దేవి' 'ఫిల్మ్‌క్రిటిక్ దేవి' మూడురూపాలలో కళ్ళముందు నిల్చుని "నేనున్నా, నేనున్నా" అనడం మొదలు బెట్టారు! తప్పుతుందా మరి ముగ్గురినీ పలకరించక !

ఆయన వయసుతోనూ, హోదాలతోనూ ప్రమేయం లేని మనిషి. అందుకే నాకు రెండు పదులుకూడా రాకముందే 'ప్రజాతంత్ర' ఎడిటర్ దేవిప్రియ పరిచయం. ('ప్రజాతంత్ర' ఇంకా అంతకుముందే పరిచయం.) కొ.కు.ని తప్ప మరో రచయితని ఒప్పుకోలేని ఒకానొక దశలో 'సమాజానంద స్వామి' "నన్నుకూడా చదవాలోయ్" అని చిరునవ్వులు చిందించాడు. సరేనని చదవడం మొదలుబెట్టానుగాని వెళ్ళి చూడాలని మాత్రం ప్రత్యేకంగా ఎప్పుడూ అనిపించలేదు. కలిసిన తర్వాత మాత్రం ఆ మనిషిని అంతకాలం 'మిస్' అయినందుకు చాలాకాలం బాధపడ్డాను.

మొదటి పరిచయం చాలా చిత్రంగా జరిగింది. సాహిత్యప్రక్రియలన్నింటి గురించీ రాసిన కొ.కు."పాట"మీద రాయకపోవడం వెలితిగా అనిపించి ముందు "ఇవి వినండి" అని గద్దర్ పాటలక్యాసెట్ ఇచ్చాను. (అప్పటికి ఇంకా క్యాసెట్లు రాలేదు.) విజయవాడలో ఒక బహిరంగసభలో గద్దర్ జలపాతంలా చిందులు తొక్కుతూ పాటలు పాడుతున్నప్పుడు రికార్డు చేసిన క్యాసెట్ అది – ఆ పాటల్ని కొ.కు. వెంటనే వినకుండా "గద్దర్ పాటల గురించి విన్నాను. సాయంత్రం మిత్రులు అందరినీ పిలుస్తానూ అప్పుడు అందరం కలిసి విందాం" అన్నారు. అలా వచ్చిన సాహితీమిత్రులలో దేవిప్రియ ఒకరు. (ఆ

సందర్భంగా దేవ్‌కి నన్ను పరిచయం చేస్తూ "మా బుద్ధికొలత మిత్రుడు" అని కొ.కు. చెప్పడం నాకు ఎప్పటికీ గర్వకారణం).



దేవ్ పరిచయమైన ఆ రోజున "కల్తీలేని చిరునవ్వు"ను చూసిన తృప్తి కలిగింది. మళ్ళీ ఆరేడేళ్ళకి హైదరాబాద్ ఉదయం ఆఫీసుకి వెళ్ళి పలకరించినప్పుడు అదే చిరునవ్వు అంతే కల్తీలేనిదనంతో కనిపించడం ఇంచుక విస్మయం కలిగించింది. (ఇప్పటికీ తరుచూ అదే విస్మయం!)

'ఆంధ్రప్రభ' రన్నింగ్‌కామెంటరీలో చివరిరోజున "మళ్ళీ ఉదయంలో కలుద్దాం" అని గుడ్‌బై చెప్పడం గురించి పోట్లాడదాం అని మనసులో అనుకున్నవాణ్ణి కాస్తా దేవ్ చిరునవ్వుతో కొట్టుకుపోయాను – "పోట్లాడాలి" – వీలు కుదిరినప్పుడెప్పుడైనా !

అక్షరాన్ని కదా నమ్ముకున్నాడు – అందువల్ల 'రన్నింగ్ కామెంట్రీలో అచ్చుతప్పులు దొర్లితే భరించలేకపోయేవాడు. ఆంధ్రప్రభలో రెండవ... 'రన్నింగ్ కామెంట్రీ' ప్రారంభమైనప్పుడు నేను న్యూస్‌ఎడిటర్ బాధ్యతలలో తలక్రిందులు అవుతుండేవాణ్ణి. దేవ్ ఏ ఊళ్ళో ఉన్నా ఏదో ఒకటైమ్‌కి రన్నింగ్ కామెంటరీ పంపేవాడు. ఫ్యాక్స్‌లో పంపినప్పుడు, దాన్ని కంపోజ్ చేసిన వాళ్ళు కాస్త 'అటు ఇటు' చేస్తే "ఆ పనేదో అక్షరాలు వచ్చినవాళ్ళకి అప్పగించకూడదు" అని సుతిమెత్తగా ఆక్షేపించేవాడు. ఏంచెప్పాలో తోచక 'టైమ్'లోగా పంపక, ... ఒక టైమ్‌కి పంపితే ఇలాగే అవుతుందని నవ్వేసి, అచ్చుతప్పులు దిద్దేపనిలో పడేవాణ్ణి. అక్షరం గాయపడితే నేనూ భరించలేను. మరి అక్షరయోధుడు ఎలా భరించగలడు?

దేవిప్రియ రిపోర్టింగ్ కూడా చేశారో, లేదో నాకు తెలియదు గాని 'ఆదివారం అనుబంధా'లతో మాత్రం ఆయనది వీడనిబంధం. ఎ.బి.కె. ఉదయం ఎడిటర్‌గా ఉన్నప్పుడు దేవిప్రియ ఉదయం ఆదివారం అనుబంధం చూసేవారు. అప్పట్లో ఆయన ప్రవేశపెట్టిన ఒరవడి ఇప్పటికీ కొనసాగుతోంది. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధానికికూడా దేవ్ తన 'బ్రాండు' జోడించాడు.

పత్రికలని ఎంతబాగా తీసుకురావచ్చో క్షుణ్ణంగా తెలిసిన దేవ్‌కి, ఎంత బాగా చేతులు కాల్చుకోవచ్చో 'మనోరమ' నేర్పినట్టుంది. అందుకే ఇప్పుడు సొంత పత్రిక గురించి మాట్లాడడం లేదు. అదే మంచిది. ఆ చిరునవ్వు ఎక్కడ కల్తీ అయిపోతుందోనని నా భయం, అందుకే ఈ మాట అనడం !

చెప్పొద్దూ, నాకు మరో భయంకూడా – మరో సొంతపత్రిక ప్రారంభిస్తే, ఆ ఊబిలో కూరుకుపోయి 'ఫిల్మ్ ఫెస్టివల్స్'కి రాడేమోనని! దాదాపు పన్నెండేళ్ళుగా ఇద్దరం క్రమం తప్పక ఇంటర్‌నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్స్‌కి వెళ్తూనే ఉన్నాం. ప్రపంచ సినిమా 'ట్రెండ్స్' గురించి ఆ పదిరోజులూ చర్చించుకోవడం, వ్యాసాలు రాసుకోవడం, మళ్ళీ రైలెక్కి వెనక్కి వచ్చాక ఎవరి పనుల్లో వాళ్లం మునిగిపోవడం. ఎంత గొప్ప దర్శకుడైనా 'ఈపట్టిక'గా కథ చెబితేనే దేవ్ సినిమాలో ఆద్యంతం కూర్చుంటాడు. లేకపోతే పదిహేను



నిమిషాలలోనే 'వాకౌట్'. అంత అసహనం వలదని వారిస్తానా, మళ్ళీ అదే చిరునవ్వు – ఒప్పుకోలో తప్పుకోలో తెలీదు !

దేవిప్రియగురించి నాలుగు మాటలు రాస్తున్న ఈ సందర్భంలో దేవిప్రియ కవిత్వంలోని నాలుగు మాటలు గుర్తు చేసుకోవడం నాకు బాగుంటుంది. లాతూరు భూకంపానికి కవి దేవిప్రియ కంపించిపోయిన తీరు జర్నలిస్టు దేవిప్రియను గ్రహణం నాటి చంద్రుడిలా అమాంతం మూసేసింది. మేమంతా టెలిప్రింటర్లమీద శవాల లెక్కలు తీస్తున్న సమయంలో కవి దేవిప్రియ "ధరణి... ధరిత్రి... భూమి." అనే అద్భుతమైన కవిత రాశారు.

*"భూమి*
*నారింజ తోటలనీ, జొన్నచేలనీ*
*మనకిచ్చిన మాత మాత్రమే కాదు..."*

అని ప్రారంభమయే ఆ కవిత–

*"భూమి*
*పచ్చపచ్చటి ఉద్యానవనాలే కాదు*
*వెచ్చవెచ్చటి రక్తజలపాతాలు కూడా,*
*భూమి*
*మధ్యమధ్యలో మతిభ్రమించే*
*మమతానురాగాల మాతృమూర్తి"*

అని ముగుస్తుంది.

ఈ కవితకు కేవలం "భూమి" అనో, "నేలతల్లి" అనోకాక "ధరణి... ధరిత్రి... భూమి..." అనే శీర్షిక పెట్టడంలోనే జర్నలిస్టు దేవిప్రియ కంటె కవి దేవిప్రియ ఎంతో ఎత్తున ఉన్నాడని తెలుస్తుంది.

ఈ విషయం మనకే కాదు, దేవిప్రియ అంటే 'రన్నింగ్ కామెంట్రీ' మాత్రమే అనుకునే వాళ్ళందరికీ తెలియాలి. "మూడుపదుల దేవిప్రియ" సందర్భం చేయవలసిన పని అదే.

సాహితీమిత్రులారా, దేవిప్రియ కవిత్వాన్ని మళ్ళీ కొత్తగా అంచనా వేయండి. ఆ అంచనాలను అందరితో పంచుకోండి.

⚜

***ఎండమావులూ***
***కలలూ వేరనుకున్నాను,***
***ఔనా, కలలు కూడా***
***ఎండమావులేనా...!***

(స్వప్నమరీచిక : అరణ్య పురాణం)



శాతవాహన అనబడే షేక్ గులాంగౌస్

# సూర్యసమానుడు దేవిప్రియ

నాటకం నడుస్తోంది !

తెర దిగని నాటకం !

తెర దించని నాటకం !

ఎన్నటికీ ఆగని నాటకం !

వేదం విన్నందుకు చెవుల్లో సీసం పోసినరోజు మొదలైన ఆ నాటకం ఆగలేదు!

నాటకంగా భ్రమింపజేస్తూ ఒక్క రక్తపుబొట్టుకూడా చిందించకుండా మహా నటుల్ని హతమార్చే మాయనాటకం! 'అయినవాళ్ళు' వెన్నెల వెలుగుల జలపాతం మీద నిలబడి చేతకాని నటనతో మహానటులుగా చెలామణి అవుతుంటారు!

'కానివాళ్ళు' ఎంతటి ప్రతిభాధురీణులైనాసరే, చీకట్లో నిలబడి నటించాలి. చరిత్ర రక్తనాళాల్లోకి చీకటిని జెయింట్ సిరంజీలతో ఎక్కిస్తుంటారు. ఇది నిరంతర దృశ్యం.

మర్చిపోయినట్టు నటించడం. వజ్రమైనాసరే, కావాలని బురదలో పాతేయటం!

నిజాయితీలేని ప్రవచనాలు

నిజాయితీలేని కవిత్వాలు

బృందాలూ, వర్గాలూ, వాటాలు..!

నిజాన్ని వినటానికి ఎవరూ సిద్ధంగా లేనప్పుడు అబద్ధమే ఎవరెస్టు శిఖరం. అసత్యమే భూతలస్వర్గం.

మా అన్న దేవిప్రియ !

'దేవి'30 అని ఎంతో గంభీరంగా, నిండుగావచ్చిన బ్రోషర్ చూసిప్పుడు చాలా భయమేసింది. వెన్నులో వణుకు పుట్టింది. ఆయన కవిగా, జర్నలిస్టుగా, మీడియా పర్సనాలిటీగా మూడు దశాబ్దాలు 'సునాయాసంగా' పూర్తిచేశారని అనుకుంటే అది



పొరపాటు. దేవిప్రియ, నిజం చెప్పాలంటే నా దృష్టిలో 30 ఏళ్ళనుంచి నిప్పులమీద నడుస్తున్నాడు!

దేవిప్రియలాంటి అద్వితీయ సాహితీమూర్తికే ఈ స్థితివుంటే, నాబోటి పావలా, బేడా రచయితల పరిస్థితి ఏమిటి?

జర్నలిజంలో దేవిప్రియ చేయని ప్రయోగం వుందా?

అటు సీరియస్ పొయెట్రీలో

ఇటు వ్యంగ్య రచనలో !

దేవిప్రియ ఒక మహాకవి! ఒక మహాప్రయోగశాల !

ఒక్క 'రన్నింగ్‌కామెంటరీ'నే తీసుకుంటే ప్రపంచ రాజకీయవ్యవస్థను ఔపోసన పట్టి కేవలం ఎనిమిది చిన్న పంక్తుల్లో దేవిప్రియ చేసిన రచన అనేక సంపాదకీయాలకు సమానం ! 'రన్నింగ్ కామెంటరీ'కి వున్న పాపులారిటీ సంపాదకీయాలకి లేకపోవడానికి కారణం ఇదే.

సూర్యుడికి ఎంతటి పాపులారిటీవుందో దానికి సమానమైన పాపులారిటీ ఆంధ్ర దేశంలో రన్నింగ్ కామెంటరీకి వుంది. ఈ విషయంలో సూర్యసమానుడు దేవిప్రియ.

దేవిప్రియలో

ఒక మహాకవి

ఒక గొప్ప సంపాదకుడు

ఒక మహా సెటైరిస్ట్

ఒక మహా వ్యంగ్యకర్త

ఒక మహా ప్రయోగశీలి

ఒక మహా వ్యాఖ్యాత

ఒక మహా వచనకర్త వున్నారు.

దేవిప్రియలాంటి సాహితీమూర్తి ఉన్నతవర్గాల్లో వుంటే ఆయన కోసం ఒక ప్రపంచ సాహితీ మహాసభ జరిపివుండేవాళ్ళు కాదా? ఆకాశాన్ని పరపరా చింపి శాలువాగా కప్పివుండేవాళ్ళు కాదా?

మన విశ్వవిద్యాలయాలు అనేక డాక్టరేటులు ఇవ్వదగినవాడు. అనేక డాక్టరేటులు చేయదగినవాడు దేవిప్రియ. ఎంతగొప్ప అవార్డుకైనాసరే అర్హుడైన అద్వితీయ సాహితీమూర్తి దేవిప్రియ.



*బి.కె. ఈశ్వర్*

# ప్రియ బాంధవ్యం

ఎలా మొదలు పెట్టాలన్నదే సమస్య! ఆయన కవిత్వంతో ఉన్న ఇదొక అనుబంధం. ఈ స్నేహంకూడా ఎలాంటిదంటే, ఆయన వేమనలాంటివాడైతే, నేను పామరుణ్ణి. దేవిప్రియ కవితలో చెప్పాలంటే –

*స్నేహం*
*పండిన కొద్దీ*
*బతుకు చెట్టుకొమ్మని*
*మరింత గట్టిగా అతుక్కుంటుంది*
*పెనవేసిన కొద్దీ*
*మరింత బలంగా ఉక్కుతీగలా అల్లుకుంటుంది*
*కాలం గడిచిన కొద్దీ స్నేహం*
*ప్రజ్వలిస్తూ పోతుంది...*

దేవిప్రియగారికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు రావడమనేది నాకెలా అనిపించిందంటే, అకాడమీ తననుతాను గౌరవించుకోడానికి – దేవిప్రియ ఒక మార్గం చూపిస్తే, అందుకు కృతజ్ఞతగా ఆయనకు ఈ బహుమతి ఇచ్చిందని ! ప్రజా హృదయపీఠంపై – ప్రత్యేక స్థానాన్ని దేవిప్రియ ఎప్పుడో పొందగలిగారు. అంతకంటే మించిన అవార్డులు ఇంకేం ఉంటాయి?

దేవిప్రియ కవిత్వం గురించి చెప్పే సాహసం నేను చేయడం లేదు. నా వరకు కవిత్వాన్ని అదీ సుకవిత్వాన్ని ఆస్వాదించి, అనుభవించాలి. ఆ అనుభూతిని మాటల్లో చెప్పడం, విశ్లేషించడం వంటివి – మధుర సంగీతానికి అడ్డుపడే శబ్దాల్లాంటివి! గొప్పకవితలు మనల్ని మౌనంగా మరో ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. డిస్టర్బ్ చేస్తాయి. ఆలోచింప చేస్తాయి. ఆవేశాన్ని, ఆందోళననూ కలిగిస్తాయి. ఒకోసారి నిద్రపట్టని



రాత్రులను మిగులుస్తాయి. దేవిప్రియ రాసిన కవితల్లో అలాంటివి చాలా ఉన్నాయి!

దేవిప్రియగారు, నేనూ ఇప్పుడు హైద్రాబాద్‌లో చాలాకాలంగానే ఉన్నా, మేం మద్రాసులో ఉన్న రోజుల్లోనే చాలా తరచుగా కలుసుకుంటూ ఉండేవాళ్లం. ఆ జనారణ్యంలో ఎంత గందరగోళంగా ఉన్నా, పాండీబజారు చెట్లనీడలు, మెరీనా బీచ్ హోరు, మౌంట్‌రోడ్‌లో ఎప్పుడూ హడావిడిగా పరుగులు తీసే జనాలూ... వీటిమధ్య మా ఇద్దరికీ ప్రత్యేక హోదా ఇచ్చినట్టుగా – బందరు మిఠాయి వారి జిలేబీ, పకోడీలు తింటూ కబుర్లు చెప్పుకుంటూ గంటలతరబడీ తిరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. తీరిక సాయంవేళల్లో మేమిద్దరం మద్రాసు వీధుల్లో తిరుగుతున్నప్పుడు 'ఈశ్వర్' అనే మకుటంతో ఆయన కంద పద్యాల్లో చాటువులు ఆశువుగా చెప్పడం, నేను రాసుకోవడం జరుగుతూ వుండేది. ఆ కాగితాలన్నీ పోగొట్టుకున్నాను. కొన్ని పద్యాలు మాత్రమే గుర్తున్నాయి.

దేవిప్రియగారు ఏ సబ్జెక్టు గురించైనా మాట్లాడగలిగేవారు. నేను 'రిస్క్' చేయడం ఎందుకని కవిత్వం గురించి చాలా తక్కువగా మాట్లాడేవాణ్ణి. సినిమాల గురించి ఎక్కువగా మాట్లాడుకునేవాళ్లం. ఐతే, నాకు తెలియని, అర్థంకాని కొన్ని విషయాల్లో ఆయనకున్న స్పష్టత నాకు ఆశ్చర్యాన్ని కలిగించేది.

ఉదాహరణకు 'మహాప్రస్థానం'లోని 'జ్వాలాతోరణం' కవితలో 'ప్రదీప్తకీలా ప్రవాళమాలా / ప్రపంచవేలా ప్రసారములలో మిహిర వాజితతి! మఖవ ధనుర్ద్యుతి...' లాంటి పదాలను ప్రజాకవి శ్రీశ్రీ రాయడం ఏమిటి? ప్రజలకు అర్థంకాని మాటల్లో కవిత రాయడంలో ఉద్దేశం – కవిని అందుకోడానికి ప్రజలు ప్రయత్నించాలనా? అసలు కవితే అర్థం కాకపోతే – ప్రజలు కవినుంచి చైతన్యస్ఫూర్తిని ఎలా పొంద గలుగుతారు?

ఇలాంటి ప్రశ్నలు లేవనెత్తేవాణ్ణి, మాటల సందర్భంలో కొందరు కవులు – ప్రతి చిన్న విషయానికీ తమ స్పందనను కవితగా రాయడం మరో అంశం! ఒకసారి ఓ మిత్రుడన్నాడు... తన కుక్కపిల్లకు జబ్బు చేసిందని ఒకాయన కవిత రాశాడట. 'కుక్కకు జబ్బు చేస్తే, వెటర్నరీ డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లాలిగానీ తన బాధను కవితగా రాసి, ఆయన మనమీద రుద్దడం ఎందుకని ఎగతాళి చేశాడు. నిజమే, శ్రీశ్రీగారన్నారు.. "కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా... హీనంగా చూడకు దేన్నీ – కవితామయమేనోయ్ అన్నీ!" అని. అన్నంతమాత్రాన అలా రాసేయడమేనా... మరి చలంగారూ అన్నారు. "క్రిష్ణశాస్త్రి తన బాధను అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు. క్రిష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని! మరి కవులు ఎలాంటి ధోరణిని అనుసరించాలి? అని నన్ను వేధించే ఇలాంటి ప్రశ్నల్ని దేవిప్రియ ముందుంచేవాణ్ణి.



బాధకు పర్యాయపదం కవిత అన్నట్లు – కవి తన మోదాన్ని, ఖేదాన్ని పాఠకుడితో పంచుకోవాలనుకోవడం న్యాయమేనేమో. వాటికి కొలబద్దలు ఎలా ఉంటాయి?

ఏదిఏమైనా, దేవిప్రియగారి గురించి తలచుకున్నప్పుడల్లా నాకు కొన్ని ప్రశ్నలు ఎప్పుడూ మిగిలిపోతుంటాయి.. శ్రీశ్రీగారు 'కలకానిది విలువైనది,' 'నా హృదయంలో నిదురించే చెలీ,' 'పాడవోయి భారతీయుడా' వంటి విలువైన సినిమా పాటలు రాశారు. అలాంటి పాటలు ఎన్నో రాయగల దేవిప్రియ తెలుగు చిత్రసీమలో ఎందుకు నిలదొక్కు కోలేదు? 'ప్రజాతంత్ర', 'మనోరమ' వంటి వైవిధ్యభరితమైన పత్రికలకు దేవిప్రియ రూపకల్పన చేశారు. తెలుగువాళ్లు వాటిని ఎందుకు నిలబెట్టుకోలేక పోయారు? 'యుద్ధనౌక గద్దర్' వంటి అద్భుతమైన చిత్రాన్ని రూపొందించడానికి దేవిప్రియ ఎన్నో వ్యయప్రయాసలకు లోనుకావలసివచ్చింది... మరి ఆ చిత్రాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళ డానికి ఎవరూ పూనుకోరెందుకు? డా॥ సి.నారాయణరెడ్డిగారు తాము ఎంపికచేసిన పాటలు–రాయడానికిగల నేపథ్యాన్ని ఆసక్తిదాయకంగా చెబితే, అదొక ధారావాహికంగా చిత్రీకరించడానికి దేవిప్రియ గారు కృషిచేసి, కొన్ని తీశారుకూడా. అలా మధ్యలో ఆగిపోయిన ప్రాజెక్టులు మళ్లీ పునరుద్ధరించడానికి ఎవరూ ముందుకురారు. ఎందువల్ల?

కవులు, ఉద్యమకారులు, అభ్యుదయవాదులు అందరూ 'పతితులూ, భ్రష్టులూ, బాధాసర్పదష్టులకోసం, పీడిత జనావళి కోసమే మేం పోరాడుతున్నామని తలా ఒక జెండాతో ఎవరి దారినవారు పోవడమేగాని అందరి ధ్యేయమూ ఒకటైనప్పుడు – అందరూ ఒకేత్రాటిపై నిలబడితే విజయం తథ్యమని ఎందుకు గుర్తించరు?

ఇలాంటి ప్రశ్నలు మస్తిష్కాన్ని చిందర వందర చేస్తుంటాయి. వీటికి సమాధానాలు ఉన్నాయా?

*(దేవి '30' 'స్వరపత్రం' 2002 నుంచి)*

⚜

***చూడగా చూడగా***
***వలలో చిక్కి ఒడ్డునపడ్డ***
***సొరచేపలా వుంది విశాఖపట్నం సముద్రం!***

(విశాఖపట్నం సముద్రం : అమ్మచెట్టు)



ధవళ సత్యం

# రాగప్రియ - దేవిప్రియ

దేవిప్రియ! ఈ పేరు వినడానికి సున్నితంగా, లలితంగా ఉంటుంది. ఈ పేరులో ప్రియుడూ ప్రియురాలూ ఇద్దరూ ఉన్నారు. ప్రియుడు ప్రియురాలిని 'దేవీ' అని పిలిస్తే, ప్రియురాలు 'ప్రియా' అని స్పందించినట్టు వుంటుంది. ఈ పేరుని గట్టిగా పలికితే, ఆ నాలుగు అక్షరాలు గాలిలో ఎగిరిపోతాయేమో అన్నంత తేలికగా, సుకుమారంగా వుంటాయి. ఆయన అసలు పేరు తెలుసుకోడానికి ఎవరూ ప్రయత్నం చేయరు. మరోసారి దేవిని 'ప్రియా' అని పిలవాలని ప్రయత్నిస్తారు. దేవిప్రియ మాట్లాడు తుంటే మాస్టారు పాఠం చెబుతున్నట్టు వుంటుంది. ఇలాంటి ఈ అపురూప వ్యక్తిని నేను తొలిసారి మద్రాసు (ఇప్పుడు 'చెన్నై')లో కలిశాను.

సినిమాల్లో అవకాశాల కోసం, ఎండా, కొండా మరిచిపోయి నిద్రా, నిప్పూ లేకుండా, ఆకలిదప్పులు లెక్క చేయకుండా సినిమాల్లో పని చేయాలనే కసితో నిర్మాణ సంస్థలచుట్టూ తిరుగుతూ వుండేవాళ్ళం. నాలాంటి వాళ్ళంతా సాయంకాలానికి రెక్కలు అలసిపోయిన పావురాలలా పాండీబజారు చేరేవారు. ఆరోజు అనుభవాలను పంచుకునేవారు. హమీదియా హోటల్ అరుగుమీది డా. గోపాలకృష్ణ ప్రజా హోమియో ఆసుపత్రి దగ్గర ఒక గుంపు, నారాయణ కేఫ్, శాంతాభవన్ చెట్లకింద మరో గుంపు, రాణి బుక్ సెంటర్ దగ్గర ఇంకో బృందం. నిలబడే కబుర్లు చెప్పుకునేవారు. పాండీబజార్ ఒక సినిమా అనుభవాల గ్రంథాలయం లాంటిది. అక్కడి చెట్లు అనుభవ గ్రంథాల వంటివి. ఆ రోజుల్లో పాండీ బజారును చూడని, చవిచూడని నటుడుగానీ, రచయితలుగానీ, దర్శకుడుగానీ లేరంటే అతిశయోక్తి కాదు. అలాంటి పాండీబజారులో నాకు పరిచయమయ్యాడు దేవిప్రియ. బీరం మస్తాన్‌రావు అనే నాటకాల మిత్రుడు పరిచయం చేశాడు. పరిచయం కూడా ఎలా చేశాడంటే... సత్యం..! ఇతడు మనలాగా సినీమా అవకాశం కోసం రాలేదు. సినిమా అవకాశమే ఇతన్ని ఇక్కడికి రప్పించింది.



అనగానే నేను నవ్వుతూ "మనలాంటి కష్టాలు లేవంటావు, అంతేగా.." అన్నాను. అప్పటికే మస్తాన్‌రావు సహకార దర్శకుడుగా ఎస్. భావనారాయణగారి కంపెనీలో పనిచేస్తూ వున్నాడు. దేవిప్రియ, మస్తాన్‌రావు ఇద్దరూ గుంటూరువాళ్ళు. నేను, మస్తాన్‌రావు ఇద్దరం నాటకాల మిత్రులం. అలా అనతికాలంలోనే దేవిప్రియ, నేనూ మంచి స్నేహితులం అయ్యాం. నేను 'దేవీ' అనడం, తాను 'సత్యా' అనడం ప్రారంభ మయిపోయింది. ఒకర్ని ఒకరం  అర్థం చేసుకున్నాం.

పాండీబజార్‌లో డా. గాలి బాలసుందరరావు గారి బంగళాలో రోడ్డు వైపునవున్న ఒక షాపులో చౌదరాణిగారు నడిపే బుక్ సెంటర్‌కి సినిమారంగంలో వుంటూ, పాత వాసనలు పోని అభ్యుదయవాదులు ఎక్కువగా వస్తూ వుండేవారు. కొంచెం ఇటూ అటుగా, ఇది దేవిప్రియ అనిసెట్టిగారి కొలువునుంచి బయట పడిన తరువాతి సంగతి. అప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అభ్యుదయ కవులు, విప్లవకవులు, కళాకారులు శాఖోపశాఖలుగా విడిపోయారు. అలా దేవిప్రియ పైగంబర కవి అయ్యాడు. నేను అరసం వాడినయ్యాను. మా రాజకీయ శాఖలు వేరైనా,  మా స్నేహానికి ఆ చీలిక అడ్డు రాలేదు. నేను ఎన్నో ఆశయాలతో చేరాల్సిన గమ్యాన్ని ఊహించుకుని ఎన్నో కలలు కన్నాను. కలలు నిజం కావేమో అనే నిరాశ ముసురుతున్న సమయంలో నన్ను వెన్నుతట్టి  ధైర్యం చెప్పిన బాహుబలి దేవిప్రియ. నన్ను తనకూడా తీసుకెళ్ళి తన రూమ్‌లో వుంచుకున్నాడు.

పుష్పకవిమానంలాంటి ఆ అతిచిన్న గదిలో ఎన్నో విషయాలు చర్చించుకునే వాళ్ళం.. ఎన్నో పాటలు పాడుకునేవాళ్ళం. కథలకు కావలసిన కథాంశాలు రాసుకునే వాళ్ళం. దేవిప్రియ కథాచర్చలకు, పాటలు రాయడానికి వెళ్ళేవాడు. తిరిగి రాత్రికి వచ్చేవాడు. ఎంత ఆలస్యంగావచ్చినా నేను, దేవిప్రియ ఆరోజు అనుభవాలనీ, జరిగిన సంఘటనల గురించి మాట్లాడుకునేవాళ్ళం. ఎందుకో తెలియదు, ఆరోజు అనుభవాలను పంచుకో కుండా నిద్రపోయేవాళ్ళం కాదు.

ఒకరోజు ఓ సంఘటన జరిగింది. ఉదయం నేను నిద్రలేచి చూసేసరికి దేవిప్రియ స్టూడియోకి వెళ్ళిపోయాడు. రోజూ ఇద్దరం కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసేవాళ్ళం.. ఆరోజు ఒంటరిగా బ్రేక్‌ఫాస్ట్ చేయాల్సివచ్చిందే అని నాలో నాకు కొంచెం వెలితి అనిపించింది. అలాగే గదికివచ్చి కథ రాస్తూ, గదిలోనే ఉండిపోయాను. కొంత కథ రాసి నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాను. మళ్ళీ సాయంకాలం వరకూ మెలకువ రాలేదు. టైమ్ అప్పటికే మూడు గంటలు అయింది. భోజనం టైమ్ దాటిపోయింది. టిఫిన్ చేద్దామని డబ్బుల కోసం జేబులు తడిమాను. చాలా తక్కువ డబ్బులు ఉన్నాయి. టీ కొట్టుకువెళ్ళి ఓ బన్ తిని, టీ తాగి ఆకలిని చంపేసి మళ్ళీ రూమ్‌కి వచ్చి ఏవో పుస్తకాలు తిరగేసి మళ్ళీ నిద్రపోయాను. చాలాసేపు తరువాత నిద్రలేచి ఓ నవల



చదువుతూ కూర్చున్నాను. అప్పటికి రాత్రి చాలా టైమ్ అయింది. దేవిప్రియ ఇంకా రాలేదేమిటీ అని అతని గురించి ఆలోచిస్తున్నాను. అంతలోనే వచ్చాడు. అతని చేతిలో ఓ పార్శిల్ ఉంది. బిర్యాని పార్శిల్ అన్నాడు. క్షణకాలం ఆశ్చర్యం. నేను చాలా ఆకలిగా వున్నాను. ఇద్దరం బిర్యానీ తిని ఆకలిని జయించాం. మనసు కుదుటపడింది. "నేను భోజనం చేయలేదని నీకు ఎలా తెలిసింది?" అని అడిగాను.

స్టూడియోకి వెళ్తూ చూశాను. నువ్వు నిద్ర లేవలేదు.. టీ తాగడానికి రాలేదు. బహుశా నీ దగ్గర డబ్బులు తక్కువగా ఉన్నాయేమో అనుకున్నాను. నీకు డబ్బులిద్దామంటే నా దగ్గరకూడా లేవు. అందుకే రికార్డింగ్ అయిన తరువాత, ప్రొడక్షన్ వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకున్నాను. హోటల్‌కి వెళ్ళి బిర్యాని ఆర్డరిచ్చాను. నువ్వు గుర్తుకు వచ్చావు. సర్వర్ని పిలిచి బిర్యాని పార్శిల్ చేయమన్నాను అన్నాడు.

నా గురించి, నా ఆకలి గురించి పట్టించుకునే స్నేహితుడు ఒకడు దొరకడం చాలా గర్వంగా అనిపించింది. నాకు తెలియకుండా నా కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి. అది రుచి బిరియానీ కాదు, ఆకలి బిరియానీ. అందుకే దానికి ' అమ్మ బిరియానీ' అని పేరు పెట్టుకున్నాం. తన ఆకలిని గురించి మాత్రమే ఆలోచించేవాడు స్వప్రియుడు. పదిమంది ఆకలిని గురించి పట్టించుకునేవాడు దేవిప్రియుడు.

దేవిప్రియలో ఇటువంటి మానవీయమైన మంచిలక్షణాలు అనేకం ఉండేవి. దేవి గొప్ప అల్పసంతోషి. అతి చిన్న అవకాశం లభించినా అతను అనుభవించే ఆనందానికి అవధులు వుండేవి కావు. ఆ అవకాశాన్ని గురించి ఆత్మీయులందరికీ చెప్పుకునేవాడు. ఆ ఆనందాన్ని అందరితో కలిసి పంచుకునేవాడు. ఓ డబ్బింగ్ సినిమాకి డైలాగులు రాసే అవకాశం వస్తే ఎంతో ఆనందించాడు. పని చేయడం అంటే దేవిప్రియకి చాలా ఇష్టం. పైగా ఇందుకోసమేగా మనం ఇక్కడికి వచ్చాం అనేవాడు. ఒకరోజు నేను రాస్తున్న కథ గురించి దేవిప్రియకు చెప్పాను. కథాసారాంశం చెప్పు చాలు – కథ ఎలా వస్తుందో చెబుతాను అన్నాడు. అప్పుడు సారాంశం చెప్పాను. "బానిసత్వం పుట్టినపుడే పోరాటం పుట్టింది. బానిసత్వం పోయేవరకూ పోరాటం సాగుతూనే ఉంటుంది" అని చెప్పాను. అది విని దేవిప్రియ చాలా ఆనందించాడు.

ఈ కథాంశంతో చాలా మంచికథ తయారవుతుంది అన్నాడు. నన్ను ఎంతో అభినందించాడు. బాగా రాయమని ప్రోత్సహించాడు. ఆ కథే నా మొదటి సినిమా "జాతర." ఆ కథే నన్ను దర్శకుడుగా నిలబెట్టింది. ప్రజాకళాకారులం అని చెప్పుకోవడం కాదు. ప్రజాకళారూపాలు తయారు చేయటంలోనే గొప్పతనం వుంది అంటాడు దేవిప్రియ. అతని రచనలలో ఎక్కడా పొల్లు మాటలు ఉండేవి కాదు. అలాగే జీవితం లోకూడా పాటించేవాడు. పాట అయినా, మాట అయినా రాసేముందు నువ్వు ఎవరిని ఉద్దేశించి రచన చేస్తున్నావో నిర్ణయించుకో. ఆ తరువాత రచన సాగించు అంటాడు.



తెలుగునాట ఎన్నో రచనా సంఘాలు, మరెన్నో ప్రజాకళాకారుల సంఘాలు, అభ్యుదయ భావాల కళాకారుల సంఘాలు, ఎన్నో ఎన్నెన్నో. ఒకప్పుడు ఒకటిగా వున్న కళాకారులు సైద్ధాంతిక విభేదాలతో కళాకారులు చీలిపోయి వేరు వేరు సంఘాలుగా ఏర్పడ్డారు. అవన్నీ విడివిడిగావున్నా ఎవరి భావాలను వారు తమ కళా రూపాలద్వారా ప్రదర్శిస్తునే వున్నారు.. జనం చూస్తూనే వున్నారు. అలాంటి సమయంలో గుంటూరులో వి.ర.సం. మహాసభలు జరపాలని నిర్ణయం జరిగింది. తెలుగు విప్లవ సంఘాలు, విప్లవ కళాకారులు, కళారూపాలు తయారుచేసి ఆ మహాసభల్లో ప్రదర్శించాలని కోరింది. అది అభ్యుదయవాదులందర్నీ ఆశ్చర్యపరచింది, ఉద్వేగపరిచింది. అప్పటికే మద్రాసు చిత్రపరిశ్రమలో కొంతమంది విప్లవ కళాకారులు ఒక కళారూపం తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. వారిలో పెరుమాళ్ళుగారు, కాకరాలగారు, వల్లం నరసింహారావుగారు, రాంబాబు ఇంకా ఇతర విరసం అభిమానులు ఉన్నారు.

మారూమ్ పక్కనే నిర్మాత, నటుడు పద్మనాభం గారి ఆఫీసు అవతలగా ఒక తాటాకు పాక ఉండేది. ఆ పాకలోనే విరసం సభ్యులు, కళాకారులు సమావేశం అయ్యేవారు. ఓ నృత్యరూపకం తయారు చేయాలని నిర్ణయించారు. దాని రచన బాధ్యతను దేవిప్రియకి అప్పగించారు. సమయం తక్కువగా వున్నందున రాత్రి పగలు శ్రమించి ఓ మంచి నృత్యరూపకాన్ని తయారు చేశాడు దేవిప్రియ. దాని పేరు "గొడ్డళ్ళు లేవాల." అడవుల్లోవున్న మన సహజ వనరులైన గనులను, చెట్లను దోచుకుపోయే దోపిడీదారులపై గొడ్డళ్ళు లేవాలి అనే ఇతివృత్తంతో రచన పూర్తయింది. దేవిప్రియ ప్రజానాట్యమండలి అనుభవం వున్న నన్నుకూడా ఆ నృత్యరూపకంలో నటించమని అడిగాడు.

అందరం కలిసి రిహార్సల్స్ ప్రారంభించాం.. ఆ నృత్యరూపకంలో పాటలు నటీనటులందరినీ బాగా ఆకట్టుకున్నాయి. అందరూ దేవిప్రియను అభినందించారు. ముఖ్యంగా ఓ పాట విశేషంగా అందరినీ ఆకర్షించింది. ఆ పాట ఇప్పటికీ నాకు గుర్తు. నేను ఎన్నో వేదికలమీద ఆ పాట పాడాను. జనం మన్ననలు పొందాను.

ఆ పాట..

*ఉడుకు నెత్తురు ధారలై కారిపోతోంది*
*భూమి పట్టిన గిన్నెలో చేరిపోతోంది*
*న్యాయమేది..? ధర్మమేదీ..?*
*ముళ్ళపై నడిచేటివాళ్ళకు*
*గుళ్ళు చేసే సాయమేదీ..?*

ఆ పాటతో సన్నివేశం అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసింది. మేమంతా ప్రదర్శన ఇవ్వడం కోసం గుంటూరు వెళ్ళడానికి సిద్ధపడుతూ వున్నాము. అంతలో పిడుగులాంటి



వార్త. గుంటూరులో జరుగుతున్న వి.ర.సం మహాసభలను పోలీసులు ఆపేశారని. ఆ మహాసభకు వచ్చేవారిని అరెస్ట్ చేసి, జైల్లో పెట్టారు. అందర్లో నిరుత్సాహం, నిస్పృహ, ఉప్పొంగిన ఆవేశం. పెరుమాళ్ళు గారు ప్రదర్శన అక్కడ ఆపుతారుగానీ ఇక్కడ ఆపలేరుగా అన్నారు. ఆ తాటాకు పాకలోనే గొడ్డళ్ళు లేవాలి ప్రదర్శించారు. ప్రదర్శన పూర్తి కాగానే నినాదాలు, తప్పెట్లు, తాళాలు ఆ తాటిపాక పరిసరాలలో మారు మ్రోగాయి.

"గొడ్డళ్ళు లేవాలి" అని నినదించిన దేవిప్రియ తరువాత ఎన్నో రచనలు సాగించాడు. "అమ్మచెట్టు," "నీటిపుట్ట," "గాలిరంగు" పేర్లతో మేధోతరంగాలలాంటి కవితా సంపుటలు – సీతా..! ఓ సీతా! లాంటి నాటికలు, రన్నింగ్ కామెంట్రి లాంటి వ్యంగ్య రచనలతో మన చుట్టూవున్న సమాజాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించారు. దేవిప్రియ అన్ని తరగతుల వాళ్ళ ప్రశంసలు అందుకున్నాడు.

అతని ఎదుగుదల చూసి నేను ఎంతో ఆనందించాను. ఇన్నాళ్ళకైనా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దేవిప్రియకు దక్కినందుకు చాలా ఆనందించాను.

భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సత్కారాలు, పురస్కారాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను..

*(ధవళ సత్యం సుప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు)*

⚜

***పాములా పాకుతూ***
***పక్షిలా యెగురుతూ***
***చేపలా ఈదుతూ***
***ఎండలా మెరుస్తూ***
***వానలా కురుస్తూ***
***గాలిలా గమిస్తూ***
***ఇందాకా వచ్చాను;***
***చీకటిలో తడుముకుంటూ***
***వేదనలో ముడుచుకుంటూ***
***అగమ్యాన్ని తలుచుకుంటూ***
***ఇక యెంతదూరం పోగలనో!***

(అగమ్యం : ఇం..కొకప్పుడు



డాక్టర్ కె. ఉమారాణి

# ఆ ఇద్దరూ

దేవిప్రియ గారి గురించి మాట్లాడటానికంటే ముందు రాజ్యలక్ష్మి ఆంటీ గురించి కొంత చెప్పాలి. సికిందరాబాద్‌లోని రాచకొండ టవర్స్‌లో దాదాపు పదేళ్లు ఇరుగుపొరుగున వున్నాం. ప్రతిరోజూ కాకపోయినా తరచూ కలుసుకుంటూ వుండేవాళ్లం. రెండు మూడు రోజులకొకసారైనా నేను 204లోకి వెళ్లడమో లేదా తను 306కి రావడమో చాలా సాధారణంగా జరిగే విషయం. ఉమా! అని పిలవడంలోనే ఎంతో ఆప్యాయత ధ్వనించేది. సమత, ఇవాల పెళ్లిళ్ళు అయిన తరువాత వీరిద్దరే వుంటున్న సమయంలో మాధవ్‌నీ, నన్నూ తమ పిల్లలలాగా చూసేది. ఇళ్లల్లో వండే వంటలు తరచూ ఎక్ఛేంజ్ అవుతూ వుండేవి. ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే ఈ ఎక్సేంజ్ చేసుకోవడంలో ఒకోసారి మాధవ్, దేవిప్రియ గారుకూడా పాలుపంచు కొనేవారు. "మీరెందుకు తెచ్చారు సార్ నేనేవచ్చేదాన్ని కదా" అంటే 'అదేంటమ్మా, మా పిల్లలకు ఇవ్వడానికి నేను రావడంలో తప్పేముంది' అనేవారు. చాలా బాధ కలిగించే విషయం ఏమిటంటే మేము అల్వాల్ వదలిపెట్టి విజయవాడ వచ్చిన మూడు నెలలకే ఆంటీ అనారోగ్యం పాలవడం, ఆతరువాత కొద్దిరోజులకే మమ్మల్ని అందరినీ విడిచి వెళ్లిపోవడం. ఆంటీ వెళ్ళిపోయిన తరువాత ఇంటికి వెళితే అసలు ఉండబుద్ధి కాలేదు. ఆంటీ లోపల ఏదో పనిలో వుండి ఇంకా బయటకు రాలేదు అని చాలాసేపు అనిపించింది. దుఃఖం పొంగుకు వచ్చింది.

దేవిప్రియ సారంటే నాకు అత్యంత గౌరవభావం. ఆయన రన్నింగ్ కామెంట్రీ గాని, కవిత్వంగాని అప్పుడప్పుడు చదువుతూ వుండేదాన్ని. ముఖ్యంగా ప్రకటనల కోసం ఆయన రాసేవి నాకు చాలా నచ్చేవి. ఆయన సాహిత్యాన్ని గురించి నేను ఎక్కువ మాట్లాడదలుచుకోలేదు కాని, 'ఇం...కొకప్పుడు'లో ఆయన రాసిన కవితలు చదివి మనసు ద్రవించిపోయింది. ఆయన రాసిన ప్రతి కవిత ఆంటీతో నాకున్న అనుబంధాన్ని గుర్తుకుతెచ్చింది.



ఈమధ్య విజయవాడలో మాయింటికి వచ్చిన దేవిప్రియసార్ నృత్య భంగిమతో వున్న నాఫొటో చూసి సంభ్రమాశ్చర్యాలతో ఆ ఫోటో కావాలని అడిగారు. అల్వాల్‌లో ఆ ఫొటో మా బెడ్‌రూమ్‌లో వుండడం వలన ఆయన చూడలేదు యెప్పుడూ. ఆ ఫొటో చూసిన తరువాత 'మంత్రముగ్ధ' పేరుతో ఆయన రాసి 'నవ్య' వారపత్రికలో ప్రచురించిన కవిత నన్ను మహదానందంలో ముంచెత్తింది. ఈ ఫొటో బెడ్‌రూంలో కాకుండా మా హాల్లో పెడితే ఎంత బావుండేదో. నేను కవితకు పొటోలా ఉండిపోకుండా చలనరూపమై కొనసాగుతూ ఉండేదాన్ని.

*"కాటుకరేఖల కళ్ళు*
*క్షణాలలో కావ్యాలు రాయడం చూశారా?*
*గోరింటముగ్గుల హస్తముద్రలు*
*నక్షత్రాలను వెదజల్లి నలుదిక్కులనీ*
*విస్మయపరచడం చూశారా?"*

అంటూ సాగిన ఆ కవిత నా జీవితాంతం మరిచిపోలేని మధురానుభూతి.

సార్‌కి కేంద్రసాహిత్య అకాడమి అవార్డు వచ్చిన ఈ సందర్భంలో వారిద్దరినీ ఈ విధంగా తలచుకునే అవకాశం రావడం నాకు చాలా సంతోషంగా వుంది. హైదరాబాద్ అన్నా, అల్వాల్ రాచకొండ టవర్స్ అన్నా నాకు చాలా ఇష్టం. ఆంటీ లేని రాచకొండ టవర్స్ అంటే ఆ ఇష్టంలో చాలా కొరత ఏర్పడింది. అయితే ఇప్పుడు దేవిప్రియ సార్ ఇద్దరూ తానే అయి ఆ ఇష్టాన్ని తిరిగి అందిస్తున్నారు.

⚜

***ఎవడికి పట్టింది అంటరానితనమిప్పుడు***
***భారతరాజ్యాంగ గంగలో అంబేడ్కరు ఆత్మని***
***అలవికాని సొరచేపలు మింగినప్పుడు...***

(అస్మిత : అరణ్యపురాణం)





రమణజీవి

# కవిత్వంగా జీవించిన దేవిప్రియ

ఈ అనంత విశ్వం వుంటుంది తప్ప అది గతానికి, భవిష్యత్తుకు చెందదు. కాలం కేవం మానవుడి మానసిక ఆవిష్కరణే కానీ నిన్న రేపు అనేవి లేవని ఎందరో మహానుభావులు చెప్పిన జీవనసత్యానికి నడయాడే ప్రతిరూపంగా కనిపిస్తాడు దేవిప్రియ. ఆశ్చర్యమేస్తుంది! అలా వుండాలంటే ఎంత నిర్భయం కావాలి? ఎంత యాతనకు సిద్ధపడాలి?? దేవిప్రియతో పరిచయమే లేకపోతే జీవితంలో ఈ ముఖ్యమైన పార్శ్వాన్ని దర్శించే అవకాశం లేకుండా పోయేది. ఎందుకంటే భవిష్యత్తును ఎడమకాలితో తన్నేసిన మనిషిగా దేవిప్రియ నాకు అబ్బురమే ఎప్పుడూ!

ఇప్పుడు తప్ప మరెప్పుడూ లేదనీ, వుండబోదనీ ఎందరో మహా కవులు, తాత్వికులు చెప్పగా విన్నాను. దాన్ని ప్రత్యక్షంగా వర్తమానపు వెలుగులతో విరాజిల్లడం దేవిప్రియలో చూశాను. షర్ట్ కాలర్‌లో రేపటి కోసం, ఫుల్‌షర్ట్ మడతల్లో మరుసటి వారం కోసం, బ్యాక్ పాకెట్‌లో వచ్చేనెల కోసం కరెన్సీని దాచుకుని పైజేబులో కనిపించేలా కాసింత చిల్లరతో నడయాడే మనుషులమధ్య తన చివరి 500 నోటుతో పదండి బిరియానీ తిందాం అనే దేవిప్రియ నిజంగా అబ్బురమే నాకు! తాను అమితంగా ప్రేమించిన జీవనసహచరి రాజ్యలక్ష్మి మరణించినప్పుడు తప్ప ఆయనలో ఎన్నడూ దుఃఖపు ఛాయనుకూడా నా 30 ఏళ్ల పరిచయంలో చూడలేదు. ఎలాటి జాగ్రత్తలూ వ్యూహాలూ లేకుండా అలా నిటారుగా జీవించడానికి పూనుకోవడం ఎంత సాహసం? ఆ సాహసం నాకు చాలా ఇష్టం. ఆ సాహసంనించి మొలకెత్తే ఆయన వాక్యంకూడా చాలాచాలా ఇష్టం.



⚜

నేనూహించుకుంటాను
సగం తెరిచిన 'అమ్మచెట్టు' తలుపు వెనక నుంచి
నువ్వు తల బయటికి పెట్టి
నాకోసం లిఫ్టు వైపు ఇంకా ఆత్రంగా చూస్తున్నట్టు,
నేనూహించుకుంటాను
నా కారు హారనువిని నువ్వు వంటగది బాల్కనీ నుంచి
తొంగి గేటువైపు చూస్తూ చేయి వూపుతున్నట్టు,
నేనూహించుకుంటాను
అర్ధరాత్రిదాటినా ఆపకుండా రాతపని చేసుకుంటున్న నన్ను
'ఓయ్' అని పిలిచి నువ్వు నిద్రకళ్ళతోనే
గోడగడియారం వైపు, నేను రోజూ ముద్దాడే
నీ గోరింటచూపుడువేలు చూపిస్తున్నట్టు,
నేనూహించుకుంటాను
కారులో నీ చేతి ఉంగరాలనీ గడియారాన్నీ
నా జేబు రుమాలుతో మెరుగుపెడుతుంటే
డ్రయివరు చూస్తున్నాడని నువ్వు నన్ను ఇంకా వారిస్తున్నట్టు,
నేనూహించుకుంటాను
ఆ తొలినాళ్ళలో ఒక్క దోసెని ఇద్దరం పంచుకుతింటున్నప్పుడు
ఒక చిన్న ముక్కతిని కడుపునిండిందని
నువ్వు మరొకసారి అబద్ధమాడుతున్నట్టు
నేనూహించుకుంటాను
నీ వియోగంతో విలపిస్తున్న నా కన్నీళ్ళు తుడవడానికి
సమాధిని బద్ధలుకొట్టుకుని నువ్వు
అనుక్షణం నా అక్షరాలరెక్కలతో ఎగిరివస్తున్నట్టు...!

('అమ్మచెట్టు' హైదరాబాదు ఆల్వాల్‌లోని మా అపార్ట్‌మెంటు పేరు. నా తొలి కవితా సంపుటి పేరు కూడా.)

(రాజీకి , ఇం.. కొకప్పుదు)



# రన్నింగ్ కామెంటరీ







ఆంధ్రప్రభ, ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికల్లో రెండు దశాబ్దాల పాటు అనుదినం అద్భుతమైన అనుదిన ప్రయోగంగా వెలుగొందిన దేవిప్రియ 'రన్నింగ్ కామెంటరీ' మూడు సంపుటాలుగా వెలువడింది. జనవరి 29న సా. 6 గంటలకు హైదరాబాద్ లక్‌డీకాపూల్ లోని ఫ్యాప్సీ భవన్‌లో విడుదల సభ జరుపుకున్న ఆ సంపుటాలల్లోని కొన్ని అభిప్రాయాలు...



ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

# తెలుగు జర్నలిజం ఆధునిక యుగకర్త

ఆధునిక పత్రికా రచన చరిత్రలో దేవిప్రియ 'రన్నింగ్ కామెంటరీ' ఒక చారిత్రక ఆవిష్కరణ. ఒక్క తెలుగు పత్రికల్లోనే కాదు, జర్నలిజం ఒక వృత్తిగా ఎదిగి, ప్రపంచవ్యాప్తంగా దానికి కొన్ని ప్రమాణాలు, పద్ధతులు యేర్పడిన తరువాత వచ్చిన అరుదైన ప్రక్రియ ఇది. దేవిప్రియ ఆవిష్కరించిన ఈ ప్రక్రియను ఆ తరువాత అనేకమంది అనుకరించాలని ప్రయత్నించినా దాన్ని కొనసాగించ లేకపోయారు. అందుకే అది దేవిప్రియ పేటెంట్‌గా మిగిలిపోయింది. సాధారణంగా న్యూస్ పేపర్‌లో ఏముంటాయి అని ఏ పాఠకుణ్ణి అడిగినా వార్తలు, సంపాదకీయాలు, వ్యాసాలు, ఇతర ఫీచర్స్, కార్టూన్స్ అని చెపుతారు. ఎందుకంటే చాలా దేశాల్లో పత్రికల్లో కనిపించే ప్రామాణిక శీర్షికలు ఇవే. కాని ఒకానొక కాలంలో తెలుగు పాఠకులు 'రన్నింగ్ కామెంటరీ' అనికూడా చెప్పేవారు. తెలుగు పాఠకుల ఆలోచనలమీద అటువంటి బలమైన ముద్ర వేసిన శీర్షిక అది.

ఆంధ్రప్రభ దినపత్రికలో దేవిప్రియ మొదలుపెట్టిన ఈ ప్రయోగం ఆయన ఎన్ని పత్రికలకు మారితే అన్ని పత్రికల్లో ప్రత్యక్షమయ్యింది. రన్నింగ్ కామెంటరీ మాత్రాచంధోబద్ధ రూపంలో ఉన్నా, అందులో వార్త, దానిని అర్థం చేసుకోవాల్సిన విధానం అంతర్లీనంగా ఉండేది. లోతయిన అవగాహనతో పాటు సమగ్ర విశ్లేషణ ఉండేది. అలాగే ఏదో ఒక హితబోధకూడా కనిపించేది. ఇవన్నీ ఎనిమిది లైన్లలో (పాదాల్లో) చెప్పడం ఒక్క దేవిప్రియకు మాత్రమే సాధ్యపడింది. ఒక వార్తకంటే సంక్షిప్తంగా, ఒక వ్యాఖ్యానంకంటే సునిశితంగా ఒక వార్తను కవిత్వీకరించి, దానికి తాత్వికత జోడించి సిద్ధాంతీకరించి చెప్పడం ఒక్క దేవిప్రియకు మాత్రమే సాధ్యమయ్యింది.

1980 దశకంలో పాత్రికేయ వృత్తిలోకి వచ్చిన మా దినచర్య రన్నింగ్ కామెంటరీతోనే మొదలయ్యేది. అది అశేష జనబాహుళ్యంలో ప్రాచుర్యం పొంది చివరకు కేవలం రన్నింగ్ కామెంటరీ కోసమే పత్రిక కొనుక్కునే పాఠకులు కూడా



తయారయ్యారు. నాకు తెలిసి అంతటి ప్రజాదరణ పొందిన ప్రక్రియ ఇంకొకటి తెలుగు పత్రికల్లో లేదు. బహుశ భవిష్యత్తులో రాదు.

దేశంలో, జర్నలిజంలో వైవిధ్యతను, ఆధునికతను పరిచయం చేసిన చరిత్ర తెలుగు పత్రికలది. తొలుత సాంప్రదాయ మూస పద్ధతుల్లో సాగిన తెలుగు పత్రికా రచన 1970 చివర్లో ఆధునిక యుగంలో అడుగుపెట్టి ఎనభయ్యో దశకంలో పరిపూర్ణతను సంతరించుకుంది. ఆధునికత అంటే కేవలం రంగుల హంగులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవడమే కాదు, వార్తా రచనా విధానాలు, వ్యాఖ్యాన పద్ధతులు, సంపాదకీయ శైలులు, వ్యంగ్య రచనారీతులు ఇట్లా వార్తాపత్రికల్లో ఉండే వివిధ అంశాల్లో అనేక మార్పులు ఈ కాలంలో వచ్చాయి. తెలుగు జర్నలిజంమీద పెద్దగా అధ్యయనాలు జరుగలేదు. జరిగినవన్నీ వెలుగులోకీ రాలేదు. 1960 దశకానికి ముందున్న ఒకరిద్దరు పాత్రికేయులకు, పత్రికా సంపాదకులకు మినహా ఇంకెవ్వరికీ చరిత్రలో దక్కవలసినంత చోటు దక్కలేదు. ఒకవేళ ఎవరికయినా అటువంటి గుర్తింపు వచ్చినా వారి వారి సామాజిక నేపథ్యమో, రాజకీయ చైతన్యమో, చతురతో, జర్నలిస్టుల వృత్తి వ్యవహారాలకు సంబంధించి వాళ్ళు చేసిన ఉద్యమాలు, పోరాటాల వల్లనో వచ్చింది తప్ప వార్తా రచయితలుగా, సంపాదకులుగా, కాలమిస్టులుగా మాత్రం కాదు. నిజానికి ఆధునిక తెలుగు సమాజ వికాసంలో అనేక కీలక సందర్భాల్లో ఎంతోమంది జర్నలిస్టులు క్రియాశీల పాత్ర పోషించారు. ఆధునిక తెలుగు జర్నలిజం చరిత్రతో సమాజంలో వచ్చిన చైతన్యానికి అబ్బురపడి వాటికి అండగా ఉన్నవాళ్ళు మాత్రమే కాదు, సమాజపు పెనునిద్దుర వదిలించే రచనలు చేసినవాళ్ళు కూడా ఉన్నారు. రెండో తరహా మార్పును ప్రేరేపించిన పాత్రికేయుడు, సంపాదకుడు దేవిప్రియ. తెలుగు జర్నలిజం ఆధునిక యుగకర్తల్లో దేవిప్రియ ఒకరు. ఆయన రన్నింగ్ కామెంటరీ రూపంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. అది పాఠకులపైనే కాదు, పత్రికల పైన, పాత్రికేయులపైనా ప్రభావం చూపింది. తెలుగులో చాలా పత్రికలు రన్నింగ్ కామెంటరీని అనుకరించి విఫలమయ్యాయి. అయితే అది మేధోపరమైన సృజనాత్మక వ్యవహారం అయినందువల్ల, అది ఒక్క దేవిప్రియకే సాధ్యమైన విద్య అవడం వల్ల అందరూ పూర్తిగా అనుసరించలేక పోయారు. కరీంనగర్‌లో జీవగడ్డ దినపత్రికలో మేముకూడా ఆ ప్రభావంతో ఒక శీర్షిక మొదలుపెట్టి అలాగే రాసే ప్రయత్నం చేశాం. శక్తి చాలక కొంతకాలం తరువాత విరమించుకున్నాం.



ఖాదర్ మొహియుద్దీన్

# ఆయన చెప్పుచేతల్లో తెలుగు శబ్దం

నాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులైన కవుల్లో దేవిప్రియగారు అతి ముఖ్యులు. దేవిప్రియగారి కవిత్వంలో నాకు కొట్టొచ్చినట్టు కనిపించే అంశం ఆయన వాడే పదాలలోని తాజాదనం. ఆయన చాలా సీరియస్ పొయెట్. అతి సుకుమారమయిన రీతిలో, పరిశుభ్రమయిన పదజాలంతో తన అనుభూతులను అభివ్యక్తం చేసే ఒక అద్భుతమయిన కవి ఈ కార్టూన్ కవిత్వం రాయటం అనేది మొదట్లో నాకు మింగుడు పడేదికాదు.

మహాకవి శ్రీశ్రీలాగే దేవిప్రియ తనువులోంచికూడా తొలగించటానికి వీలులేని విదూషకుడు ఒకడు ఉన్నాడనే వాస్తవాన్ని అర్థం చేసుకునేందుకు నాకు చాలా సమయమే పట్టింది. కవిత్వాన్ని గురించి నాకు ఓనమాలు కూడా తెలియని కాలంలోనే ఆయన సమాజానందస్వామి పేరుతో కార్టూన్ కవిత్వం ప్రారంభించారు. తన చుట్టూవున్న ప్రపంచాన్ని శాసిస్తూన్న వివిధానేక అంశాలను ఉద్దేశించి ఒక కవి నిరంతరంగా చేస్తూవచ్చిన వ్యాఖ్యాన పరంపరకు భాషా ప్రతిరూపం ఇది. తొలుత వారపత్రిక 'ప్రజాతంత్ర'లో ఒక సాధారణ ప్రతిస్పందనగా ముందుకు వచ్చిన 'సమాజానందస్వామి' తన పదాల్నీ, పాదాల్నీ పరిమితం చేసుకుని, పదునెక్కి దినపత్రిక తొలిపేజీలో మూలవిరాట్టుగా మారేసరికి స్పష్టమయిన నిర్దిష్టతని సంతరించుకుంది.

లిమరిక్కులవంటి ఒకటీ అరా ప్రయత్నాలు పాశ్చాత్యప్రపంచంలో జరిగినప్పటికీ, ఇంతటి సుదీర్ఘ కాలం, దాదాపు ఒకటిన్నర దశాబ్దాలపాటు ప్రతినిత్యం ప్రజల వీపులు తట్టినట్టు, నాయకుల చెంపలు చరిచినట్లు వ్యంగ్య కవితా రూపంలో వ్యాఖ్యానం చేయటం బహుశా ప్రపంచంలోనే ఒక అపూర్వ ప్రక్రియ.

ప్రతిరోజూ రన్నింగ్ కామెంటరీకి ప్రేరణ దినపత్రికలో అచ్చయ్యే ఒక వార్త.



అయితే ఆ వార్తని రెండోసారి మరెవడూ చదవడు. రన్నింగ్ కామెంటరీ అలా కాదు. శాశ్వతంగా నిలిచిపోయే కామెంటరీలు, మళ్ళీ మళ్ళీ చదివించే కామెంటరీలు ఈ సంపుటాల్లో అనేకం వున్నాయి. వార్తారచనకు ఉపయోగించే భాషలో ఒక పదానికి ఒకటే అర్థం వుంటుంది. ఆ వార్తని ఒకసారి చదవటంతో ఆ వున్న ఒక అర్థం ఖర్చయిపోతుంది. అందువల్లనే మరోసారి అదే వార్తని మరెవరూ చదవరు. ఒక అర్థం మాత్రమే వున్న పదాలు కవిత్వానికి అసలు పనికి రావు.

నిజమయిన కవి నిరంతరం పదాల్ని పరిశుభ్రం చేస్తుంటాడు. శబ్దాలచుట్టూ సంచారం చేస్తుంటాడు. కవి తన భావాలనే సమీపిస్తాడుగానీ, కవి శ్రమవల్లా, సున్నితమయిన స్పర్శావిశేషంవల్లా ఆ కవికే అంతుబట్టని అనేకమయిన అర్థచ్ఛాయలను ఆ శబ్దాలు సముపార్జించుకుంటాయి. కాబట్టే కవిత్వంలో ఒక పదానికి ఒక అర్థమే కాదు, వివిధ అర్థాలు వుంటాయి. అందుకే మంచి కవిత్వం ఎన్నిసార్లు చదివినా ఇంకా అర్థం చేసుకోవలసింది ఎంతోకొంత ఎప్పుడూ మిగిలే వుంటుంది.

భాషకు సంబంధించిన ఇటువంటి మర్మాలను ఆపోసన పట్టిన అపురూప మయిన కవి దేవిప్రియ. బాల్యంలో ఆయన బొమ్మలతో ఆడుకున్నాడో లేదో తెలీదుగానీ ఊహ తెలిసినప్పటినుంచీ అక్షరాలే ఆయనకు ఆటబొమ్మలు. అతి పిన్నవయసులోనే ఆయన ఈ ఆటలో బాగా రాటు దేలాడు. తెలుగు శబ్దాన్ని తన చెప్పుచేతల్లోకి తెచ్చుకో గలిగాడు. రన్నింగ్ కామెంటరీని దేవిప్రియలా రాయబోయి కాలిన చేతులతో చతికిలబడిన తెలుగు కవులు నాకు అనేకమంది తెలుసు. అక్షరక్రీడలో శ్రీశ్రీ, ఆరుద్ర లకు ఏకైక వారసుడు దేవిప్రియ.

⚜

***నా శరీరాన్ని తెరువు***
***నా కంఠాన్ని కత్తిరించు***
***నా చర్మం ఒలువు***
***నా గుండెని పెరుకు***
***చూడు నాలోపల***
***బరువుతో ఒంగిపోయి నేలని తాకుతూ***
***నా ప్రజలు...***
***నమ్ము, నేను***
***నా ప్రజలతో నిర్మించబడిన కవిని!***

(కవి శరీర నిర్మాణం : అరణ్యపురాణం)



కె. శివారెడ్డి

# రన్నింగ్ కామెంటరీ దశాబ్దాలు

ఆంధ్ర పత్రికా ప్రపంచంలో – ఎనభై దశాబ్దం – 80 నుంచి 90 దాకా – ఎనభైనుంచి 90 దాకా ఇంకో దశాబ్దం, మళ్ళీ 2000లో ఒక సంవత్సరం 2007, 2008–2009, 2010 – హైదరాబాద్ మిర్రర్, హెచ్ఎమ్‌టివి దాకా; కనీసం ఓ రెండు దశాబ్దాలు ఒక రకంగా దేవిప్రియ రన్నింగ్ కామెంటరీ దశాబ్దాలు. సామాజిక రాజకీయ సాంస్కృతిక రన్నింగ్ కామెంటరీ దశాబ్దాలు. సామాజిక రాజకీయ  సాంస్కృతిక రంగాలమీద వ్యంగ్యపూర్వకవిశ్లేషణ. ఆంధ్రప్రభ, ఉదయం, ఆంధ్రజ్యోతిలలో అవి అచ్చుయ్యేటపుడు–రన్నింగ్ కామెంటరీకోసం ఆయా పత్రికలు కొనుక్కునేవాళ్ళు నాకు తెల్సు. పత్రిక రాగానే ముందు చూసేది రన్నింగ్ కామెంటరీయే. చాలామందికి అవి నోటికి వచ్చేవి. సందర్భానుసారంగా వాటిని ఉటంకించటమూ నేను విన్నాను.

దేవిప్రియ రన్నింగ్ కామెంటరీద్వారా ఒక చరిత్ర సృష్టించాడు. 'ఓ, యిదే ముంది, ఎవడయినా రాయొచ్చు' అని బయల్దేరినవాళ్ళు అట్టర్ ఫ్లాప్ అవ్వటమూ నాకు తెల్సు. సమకాలిక రాజకీయ ఘటనల్ని కవితా పంక్తులుగా మలచటం మాత్రా ఛందస్సు మర్మాలు తెలిసిన దేవిప్రియకే సాధ్యమయ్యింది. కామెంట్ చేయటానికి తను ఎన్నుకున్న వస్తువు చాలా ముఖ్యం. దేవిప్రియ విజయం కామెంట్ చేయడానికి ఎన్నుకున్న వస్తువులోనే ఉంది. ఎక్కడో బయట ఏ మీటింగ్‌కో వెళ్ళినా అక్కడ్నుంచి రన్నింగ్ కామెంటరీలు అలవోకగా ఫోన్‌లో చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. చాలా అలవోకగా, అనాయాసంగా అతను పలికిన పలుకు మామూలు కవులకు సాధ్యం కాదని కొమ్ములు తిరిగిన కవులు ఫెయిల్ అయినప్పుడు అర్థమయ్యింది. దేవిప్రియ రన్నింగ్ కామెంటరీని అంతెత్తుకు తీసుకువెళితే, అది అతనికే సాధ్యం అని  రుజువు చేసింది. అనేకమంది ఆయన్ని చూసి వాతపెట్టుకున్న వాళ్ళే. ఛందస్సు మీద ఆయనకున్న గ్రిప్ మామూలయింది కాదు.





అత్యవసర పరిస్థితుల్లో 1975–76 ప్రాంతంలో, ప్రజాతంత్రలో దేవిప్రియ రాసిన 'సమాజానందస్వామి' – బహుశ రన్నింగ్‌కామెంటరీకి బీజం వేసిందనుకుంటా. అక్కడ్నుంచి చాలాదూరం నడిచాడు. తనదయిన ముద్ర వేశాడు, దేవిప్రియ మార్కు రన్నింగ్ కామెంటరీ దేవిప్రియే రాయాలి అన్నంతగా.

అప్పుడే పుస్తకాలుగా రావాల్సింది. ఇప్పుడయినా వాటిని క్రోడీకరించి, వింగడించి ఒక దగ్గరికి తేవటం ఆనందం. ఈ తరం కవులకు నాటి చరిత్ర తెలియని కవులకు ఇవి మార్గదర్శకాలవుతాయా? ఒక నమూనా సెట్ చేస్తాయా? అవుననే అనుకుంటున్నా. దేవిప్రియ చేతిలో రన్నింగ్ కామెంటరీ ఒక విలక్షణ కళారూప మయ్యింది. దీనికి రిప్లేస్‌మెంట్ లేదు.





కె. శ్రీనివాస్

# అనితర సాధ్యత సాధించాడు

కృష్ణశాస్త్రినుంచి, తిలక్‌నుంచి ఒక పాయను అందుకుని తన కన్నీటి ఊటతో కలిపి నీటిపుట్టగా మలచినవాడు దేవిప్రియ. కాలమహిమ వల్ల 'లేతవాళ్ల దారులకే' దిగివచ్చి కృష్ణశాస్త్రి ఆకలికేకలు వేసి ఉండవచ్చును కానీ, దేవిప్రియ మాత్రం ఆకలిని సైతం లేతగొంతుకతో పలికినవాడు. వేదనను ఉద్వేగాన్ని దిక్కులు దద్దరిల్లేట్లుకాక, ఏకతారమీద మీటిన మధురనిషాద ఆగ్రహకవి, కరుణ రౌద్రరసాలను మిళితం చేసి కొత్తరాగాన్ని ఆలపించిన తుఫాను తుమ్మెద దేవిప్రియ.

ప్రవృత్తి కవిత్వమయితే, వృత్తి పాత్రికేయమైతే ఏకకాలంలో రెండు హృదయాలను మోసుకు తిరగాలి. అక్షరమొక్కటే రెంటికీ కనిష్ఠ సామాన్యగుణిజం. కానీ, దేవిప్రియ రెంటికీ కలిపి ఒక సంకేత స్థలాన్ని ఆశ్రయించాడు. అదే కార్టూన్ కవిత్వం లేదా అధిక్షేప కవిత్వం లేదా వార్తావ్యాఖ్యాన కవిత్వం. రెండు జీవనవ్యాపారాలు ఒకదానికొకటి దాటుకుంటూ పోయేచోట, దేవిప్రియ ఆ వైరుధ్యానికి ఒక సార్థకత కల్పించాడు. అనితరసాధ్యత సాధించాడు.

సమకాలిక పరిణామాలపై వ్యంగ్యాన్నో, కవితాత్మక వ్యాఖ్యనో విసిరిన మహా కవులు మునుపు లేకపోలేదు. వారెవరూ దేవిప్రియ అంత నిరంతరాయంగా ఆ రూపాన్ని కొనసాగించినవారు కాదు. ఆ రూపాన్ని తమ సాహిత్యవ్యక్తిత్వంలో అంతర్లీనం చేసు కున్నవారు లేరు. సమాజానందస్వామి అయినా, రన్నింగ్ కామెంటరీ అయినా, గరీబు గీతాలు అయినా – దేవిప్రియ సాహిత్య సంపుటంలో ఒక ప్రత్యేక విభాగం, ఆయన అక్షరసర్వస్వంలో సహజాతి సహజమైన అంతర్భాగం. ప్రజాతంత్ర నుంచి, ఆంధ్రప్రభ, ఉదయం మీదుగా, హెచ్‌ఎమ్‌టివి దాకా దేవిప్రియ పాత్రికేయ కవిత్వం తెలుగు సాహిత్యానికి, పత్రికారంగానికి విలువైన నిక్షేపం. చకాచకా సాగిపోతున్న వర్తమాన



చరిత్రపై వేగపూరితమైన కవితావ్యాఖ్యానం అందించడం ఒక అపురూప ప్రయోగం. హడావుడిగా చేసే చరిత్ర రచన జర్నలిజమని అంటారు. కవులు సమాజానికి అనధికార శాసనకర్తలనీ అంటారు. కాలం తరుముతూ ఉంటే చేసిన కవితాశాసనాలు దేవిప్రియ వార్తాకవితలు. సాహిత్య విద్యార్థులయిన నావంటి పాత్రికేయులకు దేవిప్రియ ప్రత్యక్ష వ్యాఖ్యానాలు పరామర్శకావ్యాలు.

***కలకి కొనసాగింపే***
***కవిత్వం కదా***
***కవిత్వం పుష్పిస్తే***
***మనిషి కదా***
***మనిషి కథ రాస్తేనే***
***మహర్షి, కదా...***

(మూలం : అరణ్య పురాణం)



ప్రొఫెసర్ ఎండ్లూరి సుధాకర్

# ఇది దేవిప్రియ భారతం!

ఒక్క మాటలో చెప్పాలంటే, దేవిప్రియ ప్రతిభ రాజసం ఉట్టిపడే పది తలల రావణ చక్రవర్తిలాంటిది. ఈ పది తలలూ కలలు కంటూ ఉంటాయి. పది జమిలి కళ్లతో ప్రపంచాన్ని పరికిస్తూ ఉంటాయి. పది రకాల కళలతో పరిఢవిల్లుతుంటాయి. పలు పద్ధతులతో పరివ్యాప్తమవుతుంటాయి. దీన్నే బహుముఖీన ప్రతిభ అంటారు. ఈ ప్రతిభకు వ్యుత్పత్తి, అభ్యాసం అదనపు ఆకర్షణ. ఈ ఆకర్షణకు సృజనాత్మకత, సౌందర్యాత్మకత మరొక ప్రత్యేకత.

నా రెండు పదుల వయసులో దేవిప్రియ పరోక్షంగా పరిచయమయ్యాడు. తన 'ప్రజాతంత్ర' వారపత్రికతో నన్ను వాటేసుకున్నాడు. తన కవితాసంపుటి 'అమ్మచెట్టు'కు కట్టేసుకున్నాడు. 'ఆముక్తమాల్యద' కావ్యంలోని బ్రహ్మరాక్షసుడిలా నన్ను పట్టేసుకున్నాడు. నన్నేకాదు, నాలాంటి చాలామందిని ఆకట్టేసుకున్నాడు. విద్యార్థి దశలో దేవిప్రియ రన్నింగ్ కామెంటరీ చదివి నాలుగు పదాలు వెనకేసుకున్నాను. ప్రాస సంపదను పెంచుకున్నాను. గరమ్ గరమ్ చాయి తాగుతూ, కమ్మని సిగరెట్టు పీలుస్తూ కొన్నేళ్ళపాటు, ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్లోనో, ఇరానీ హోటల్లోనో ఆ పూట తాజా రన్నింగ్ కామెంటరీ / చల్తే చల్తే చదువు కోవడం ఎనభైల నాటి కిక్కు. ఆ వయసుకి అదే గొప్ప నిక్కు. పత్రికల్లో దేవిప్రియే మాకు పెద్ద దిక్కు.

జర్నలిస్టు కదా! అర్ధరాత్రి అపరాత్రి లేకుండా ఎన్నో నిద్రలేని రాత్రుళ్లు గడిపి ఉంటాడు. ఆ నేపథ్యంలో మస్తిష్కంలో మాత్రా ఛందస్సుల్ని మధించి వార్తాగేయాలు పత్రికల్లో పలికించాడు. అమృతాన్ని చిలికించాడు. వార్తాగేయాలు పత్రికల్లో పలికించాడు. అమృతాన్ని చిలికించాడు. దేవిప్రియకెలా అబ్బిందబ్బా, ఈ అతులిత చతురత, ఛలోక్తుల,పదగుంఫనాల, సింఫనీల సంవిధానం! దేవిప్రియ లయ నిర్మాణమంతా 'ఆలయ' నిర్మాణం వంటిదే. కనబడని ఆ దేవుడికి దణ్ణం పెట్టకపోయినా కనిపించే



ఈ దేవుడికి పెట్టాల్సిందే! అందుకేనేమో కవి శివారెడ్డి (శివుడు) దేవిప్రియను ముద్దుగా 'దేవుడూ!' అని పిలవడం కద్దు.

దేవిప్రియ సామాజిక రంగాన్ని, పత్రికా రంగాన్ని ఛందోరంగాన్ని మేళవించి కొత్త రంగులు వేశాడు. రెండు దశాబ్దాల ప్రపంచ గమనమంతా తన 'రన్నింగ్ కామెంటరీ'లలో నమోదు చేశాడు. సుమారు రెండు దశాబ్దాల మన రాజకీయ చరిత్ర నంతా భద్రపరిచాడు. భావితరాలు వాటిని పరిశోధించి, వాటిలోని అమూల్య నిధిని గుర్తిస్తాయని ఆశిస్తున్నాను.

దేవిప్రియ నిర్మాణ పద్ధతుల్లో ఊహాశక్తి, శబ్దశక్తి, శిల్పశక్తి ముప్పేటలుగా అల్లుకుపోతాయి. దేవిప్రియ రన్నింగ్‌కామెంటరీలూ, చల్‌తే చల్‌తేలూ ముక్తకాలు. ముక్తకం అంటే ముక్తసరిగా, ఏ భావానికి ఆ భావం ప్రత్యేకంగా ఉండడం. ఉదా: వేమన పద్యాలు ముక్తకాలు. సహజంగా ముక్తకానికి నాలుగు పంక్తులుంటాయి. దేవిప్రియవి జమిలి ముక్తకాలు. కలిపితే అష్టపదులవుతాయి.

ఒక్క ముక్తకంలో 2, 4 పాదాలకు అంత్య ప్రాస నియమం ఉంటుంది. ఈ ప్రాస ప్రతిముక్తకానికి శ్వాసలాంటిది. చదువరికి ఇదివరకే అనుభవం ఉంటే చక్కని ప్రాస చిక్కని ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. దేవిప్రియ ప్రాసల పాదుషా. ఆయన అంత్యప్రాస కొడితే సిక్సర్‌లా వెళ్ళి మైదానానికి ఆవల పడుతుంది లేదా బాక్సర్‌లా గుద్దు పడుతుంది. ఛందస్సుల సర్పపరిష్వంగం' అన్న శ్రీశ్రీ వాక్యాల్ని కాదని, దేశీ ఛందస్సుల ప్రయోగం చేసి పత్రికల పరిష్వంగంలో ప్రతిదినం ప్రేమగా కనిపిస్తూ, ఆబాలగోపాలానికి ఈ ఛందస్సు అలవాటు చేసిన జన సామ్రాట్టు దేవిప్రియ.

దేవిప్రియ 'రన్నింగ్ కామెంటరీ' పుస్తక రూపంలో రావడానికి ఒక భగీరథ ప్రయత్నమే జరిగింది. సీతాన్వేషణలాగ ఎంతో ప్రయత్నం జరిగింది. ఆ కాలంలో ధారణా యంత్రాలు (కంప్యూటర్లు) లేవు కనకా చాలామంది అభిమానుల స్మృతి పథంలో వీటిని భద్రపరుచుకునేవారు. ఈ గ్రంథంలో అచ్చు కాని విచ్చు ఆణిముత్యాల్లాంటి అనేక రన్నింగ్ కామెంటరీలు అంతరించిపోవడం, అలభ్యాలు కావడం ఆయన అభిమానుల్ని కలవరపెట్టింది. 30 ఏళ్ళుగా నా మెదడు గూట్లో కూర్చుని కువకువ లాడుతున్న ఒకటి రెండు ముక్తకాల్ని ఇక్కడ ప్రస్తావించడం అప్రస్తుతం కాదను కుంటాను. అది తెలుగుదేశం పార్టీ విజయ దుందుభులు మ్రోగిస్తున్న కాలం. అన్ని రాజకీయ పార్టీలూ కునారిల్లిపోయి అన్న ఒక్కడే ఆకాశమంత ఎత్తులో పసుపుపచ్చగా కనిపిస్తున్న పసిడికాలం. అప్పుడు దేవిప్రియ ఆంధ్రప్రభలో ఎలా ప్రతిస్పందించాడో గమనించండి.

*వాజపేయి వంటివాడు*
*వంగిపోతె భూమికి,*



*వరమాలలు వేసిందోయ్*

*ఓటు, తెలుగు స్వామికి!*

*పార్లమెంటు భవనంలో*

*అన్న చిన్న జెండా,*

*ఎగురుతోంటె బెదురుతోంది*

*కాంగిరేసు తండా!*

అప్రస్తుతం అనుకోకపోతే మరోక విషయం ఇక్కడే ప్రస్తావిస్తాను. దేవిప్రియ వేమన లాంటివాడు. ఇద్దరిదీ ఆశు సంప్రదాయం. ఉభయులూ వేల సంఖ్యలో పద్యాలు, గేయాలు చెప్పినవాళ్లు. ఇద్దరి రచనలు జనంలో కలిసిపోయాయి. వేమన పద్యాల్ని బ్రౌన్ సేకరించగలిగాడు కానీ – దేవిప్రియ గేయాల్ని సేకరించడానికి ఏ బ్రౌనూ దొరికినట్టు లేదు. దేవిప్రియ ఎన్నో సందర్భాల్లో ఎందరిమీదో ఆశువుగా గేయాలు చెప్పాడు. మరీముఖ్యంగా డిసెంబర్ 31 నాడు శివారెడ్డి ఇంట్లోనో, దేవిప్రియ ఇంట్లోనో మద్య పద్య రాత్రుళ్లు జరిగే ముంతల ముషాయిరాల్లో వింతలు గొలిపే ఎన్నో ముక్తకాలు అలవోకగా చెప్పేవాడు దేవిప్రియ. ఎక్కడా రికార్డుకాని ఒకటి రెండు నా జ్ఞాపకాల్లోనే ఉన్నాయి. వాటిని బయటపెడుతున్నాను చదివి సంతోషించండి. ఆ రోజుల్లో కలరు టివి కొనడం ఖరీదైన వ్యవహారం. తన దోస్తు, ప్రసిద్ధ కవి డాక్టర్ ఎన్.గోపి కలరు టీవి కొనుక్కోవడానికి వెనకముందాడుతుంటే ఆ విషయాన్ని ఎలా చమత్కరించి చెప్పాడో చూడండి.

*కలరు టీవి కొనమంటే*

*కొనడోయ్ మా గోపీ,*

*వచ్చిన జీతాన్నంతా*

*తన బొడ్లో దోపీ!*

అలాగే మరొక సందర్భంలో కవి శివారెడ్డి మీదకూడా ఓ ముక్తకాన్ని పలికించాడు.

*శివారెడ్డిలాంటి కవిని*

*ఇచ్చిందోయ్ తెనాలి,*

*తెలుగునాట ప్రతితల్లీ*

*ఇలాంటోణ్ణి కనాలి!*

ఇలా వివిధ సందర్భాల్లో, వివిధ సన్నివేశాల్లో దేవిప్రియ ఎన్నో 'రన్నింగ్ కామెంటరీ'లు చెప్పాడు. ధనాన్నే కాదు, దేన్నీ భద్రపరచుకునే అలవాటు లేని దేవిప్రియ వాటిని దేశం మీదకి వదిలేశాడు.

దేవిప్రియ రాజకీయ జీవితం చెలిమితో కూడుకున్నది కాదు. అది కొలిమి



ముందు కూర్చోవడం లాంటిది. ఆయన రన్నింగ్ కామెంటరీ రాస్తున్న రోజులన్నీ దందహ్యామానమైనవే. భూమిమీది అన్ని ఖండాలూ రకరకాల కారణాలతో, రణాలతో, రాజకీయ వ్రణాలతో భయంకర దినాలతో అట్టుడుకుతున్న సమయం. అంతర్ యుద్ధాలతో,అంతర్‌కలహాలతో ప్రపంచమంతా పరితపిస్తున్న కాలం. కరువులతో, కాటకాలతో, కక్షలతో, వివక్షలతో, అసమానతలతో, అసమ సమాజాలతో అతలాకుతలం అవుతున్న దశ. సామాన్య మానవులు విలవిల లాడిపోతున్నవేళ ఒక న్యాయం కోసం, ఒక ధర్మం కోసం ఆలోచనాపరులు, అక్షరయోధులు, సాయుధ జోదులు పోరాడుతున్న కాల నేపథ్యమే ఈ 'రన్నింగ్ కామెంటరీ'కి పురుడు పోసింది. ముఖ్యంగా వందకోట్ల ప్రజల భారతదేశ రాజకీయ పరిణామాలను, ఆయా పార్టీల క్షణక్షణ వ్యూహాలను, ఊసరవెల్లుల ఊహలను దేవిప్రియ ఎంత సునిశితంగా గమనించాడో, తనది మాత్రమే అయిన కోణంలోంచి ఎలా వ్యాఖ్యానించాడో 'రన్నింగ్ కామెంటరీ'ల శరపరంపర చాటి చెప్పింది.

అంతేకాదు, ఆనాటికీ, ఈనాటికీ ఈ ఇనుపవ్యవస్థ ఇసుమంతైన కదలలేదని, కరగలేదని వర్తమాన పరిస్థితులే రుజువు చేస్తున్నాయి. రన్నింగ్ కామెంటరీ ప్రాసంగికత చెక్కు చెదరలేదు. పాతికేళ్లు గడిచినా, ఈనాటికీ ఇవి వర్తిస్తాయి. 'ఏమిటి ఈ రన్నింగ్ కామెంటరీ గొప్ప' అని కొంతమంది బుద్ధిమంతులు బల్ల గుద్ది అడగవచ్చు. ఈనాడు పది ప్రసారమాధ్యమాలు చేయలేని పనిని ఆనాడు ఒక్క 'రన్నింగ్ కామెంటరీ' చేసింది. నాలుగు ఛానళ్లు కలిసి చేసేపని ఒక్కపూట 'చల్‌తే చల్‌తే' చేసి చూపించింది. క్రికెట్‌లోనైనా వన్‌డే మ్యాచ్‌లోనైనా సచిన్ టెండుల్‌కర్ పరుగులు తీయడంలో విఫలమయ్యాడేమో కానీ, దేవిప్రియ 'రన్నింగ్ కామెంటరీ' రాయడంలో ఏనాడూ విఫలం కాలేదు. తన 'ముక్తకాల' శత సహస్ర కామెంటరీల పరుగులు ఆపలేదు. అదీ దేవిప్రియ అంటే. దటీజ్ దేవిప్రియ. చెప్పుకుంటూపోతే ఇలా ఎన్నో విశేషాలున్నాయి.

రన్నింగ్ కామెంటరీల్లో తెలుగు పలుకుబడులు, నుడికారాలు, జాతీయాలు, కవి సమయాలు, మాండలికాలు, మణిప్రవాళ శైలులు, అంతర్జాతీయ పదబంధాలు, సాంకేతిక పారిభాషిక పదాలు, పొట్టి పేర్లు, మారుతున్న లోకం తీర్లు, ఓహ్! ఒకటా రెండా! వెండి గంపలకు ఎత్తవచ్చు. ఇది ఒక అపురూప పాత్రికేయుడి రెండు దశాబ్దాల వార్తాక్షేత్ర ఫలసాయం. ఒక్కొక్కటీ అమృత పేయం. దేవిప్రియ పాత్రికేయుడిగా ఏమి సంపాదించుకున్నాడో తెలీదు కాని, లక్షలాది పాఠకుల వహ్వాలూ, వారేవాలూ అందుకున్నాడు! కోట్లాది తెలుగు పాఠకుల హృదయాలు కొల్లగొట్టిన దేవిప్రియ ఒక కోహినూరు వజ్రం. ఎన్ని పురస్కారాలైతే దానికి సమానం? దాన్ని కొనగలిగిందీ, కొలచగలిగిందీ ఒక్క ప్రజాభిమానమే. అదే ఆయన ఎత్తుకి కొలమానం. భారతీయ సాహిత్యంలో 'మహాభారతం' కావ్యానికి ఎంత ఔన్నత్యం ఉందో, ఆధునిక రాజకీయ

సాహిత్యంలో ఈ దేవిప్రియ భారతానికి కూడా అంతే గుర్తింపు లభిస్తుంది. సమయం లేకపోవడం వల్ల తగినన్ని ఉటంకింపులు, ఉదాహరణలు ఇవ్వలేకపోతున్నాను.



*వినుడు వినుడు జనులారా*
*ఘనుడు కదా దేవిప్రియ,*
*ఎలా పొగడగలము మనము*
*మనకాలపు హీరోనయ!!*

*ఛందోలయ బృందాలయ*
*అందాలయ దేవిప్రియ,*
*చేతులెత్తి చప్పట్లతొ*
*చెప్పాలయ జయజయ!!*

*ఎంత బాగ నడిపావో*
*రసవత్తర ప్రక్రియ,*
*ఏమిస్తే తీరుతుంది?*
*చెప్పగలము షుక్రియ!!*

⚜

***నా శరీరాన్ని తెరువు***
***నా కంఠాన్ని కత్తిరించు***
***నా చర్మం ఒలువు***
***నా గుండెని పెరుకు***
***చూడు నాలోపల***
***బరువుతో ఒంగిపోయి నేలని తాకుతూ***
***నా ప్రజలు...***
***నమ్ము, నేను***
***నా ప్రజలతో నిర్మించబడిన కవిని!***

(కవి శరీర నిర్మాణం : అరణ్యపురాణం)



చేరా

# పాత పదాలకు కొత్త అర్థాలు

దేవిప్రియ ఆంధ్రప్రభ, ఉదయం, ఆంధ్రజ్యోతి దినపత్రికలలో రాసిన రన్నింగ్ కామెంటరీ, చల్‌తే చల్‌తే చూస్తే అతని భాషా కౌశలం, పద ప్రయోగ విశేషం కనిపిస్తుంది. నాకు యెంతో కాలంగా తెలిసిన దేవిప్రియకు ఇంతటి భాషా వైదుష్యం ఉన్నదని నేనెరగను! భాషను గురించి నాకెంత తెలిసినా, భాషా ప్రయోగంలో ఇన్ని విశేషాలు సాధ్యం అవుతాయని నాకు తెలీదు.

మనకు అలవాటయిన మాటలనే దేవిప్రియ కొత్త పద్ధతిలో ప్రయోగించి మనను ఆకట్టుకుంటాడు. ఉదాహరణకు చూడండి:

కిరసనూనె ధరలు కూడ
పెంచి కాంగి దొరలు,
కళ్ల ముందు దించారోయ్
శోషలిజం తెరలు!

కిరసనాయిలే మనకు అలవాటయిన మాట, కాని దాన్ని 'కిరసనూనె' అని ప్రయోగించాడు. అట్లాగే సోషలిజం మనకు తెలిసిన మాటే. 'శోషలిజం' అని మార్చాడు. 'శోష' అనే కొత్త అర్థం వచ్చేట్టు చేశాడు.

మామూలుగా మనం తెలుగు మాటల ప్రాసలకు అలవాటు పడ్డాం. దేవిప్రియ అప్పుడప్పుడు ఇతర భాషా పదాలను ప్రాసలుగా కూర్చి మనను ఆనందింపజేస్తాడు. ఉదాహరణకు చూడండి.

ఒకడినొకడు మింగడమే
రాజకీయ 'కల్చరు',
తెలుగువాడి శిరసుమీద
ఎగురుతోంది 'వల్చరు'!



దేవిప్రియ ఒక్కోచోట మనకు అలవాటయిన మాటనే విడదీసి వేరే అర్థం వచ్చేట్టు చేస్తాడు. అట్లాంటిచోట్ల మాటలను కొటేషన్సుతో వేరుచేసి చూపిస్తాడు.

"చదువు 'కొనే' వీలులేని
పిల్లల గతి మరచి," అనీ,

"అన్నగారి నిట్టూర్పుకి
ఆరిపోవు నక్స'లైట్లు' "! అనీ రాస్తాడు.

ఇక్కడ చదువు'కొనే' అనే చోట చదువును 'కొనటం' అనే అర్థం కొటేషన్ ద్వారా సాధించాడు. అట్లాగే నక్స'లైట్లు'. లైట్లు అనే పదానికి కొటేషన్ ద్వారా దీపాలు అనే అర్థాన్ని సాధించాడు.

తెలుగు నుడికారం దేవిప్రియకు చాలా బాగా తెలుసు. దాదాపు ఏ పేజీ తీసినా నుడికారపు సుడి కనిపిస్తుంది. ఉదాహరణకు చూడండి.

*ఎన్జీవో జీతాల దగ్గర*
*గుణిస్తారే సమ్మెలెక్క,*
*అమ్మ పూజకి జనం డబ్బుతో*
*ఆడతారేం చెమ్మచెక్క?*

*"ఇంటి పేరంటం అయిందా*
*ఇండియాలో ఎన్నిక,*
*బొట్టు కాటుక పెట్టి గోతిలో*
*తొయ్యలేరోయ్ నన్నిక!"*

పై ఉదాహరణల్లో 'చెమ్మచెక్క' 'బొట్టు కాటుక' అనే మాటలు అచ్చమైన తెలుగు జాతీయాలు.

సమాజానందస్వామి, రన్నింగ్ కామెంటరీ, గరీబు గీతాలు పరిశీలిస్తే, దేవిప్రియకు ఛందస్సులో బాగా ప్రవేశం ఉన్నట్టు తెలుస్తుంది. రకరకాల ఛందస్సులు, మాత్రా ఛందస్సులు వాడుకున్నాడు.

*ఒక్కడైనా చెప్పడేంది*
*రాజకీయ సిద్ధాంతం,*
*కులం పేర మతం పేర*
*చేస్తారేం రాద్ధాంతం.*

ఇది 12 మాత్రల ఛందస్సు. ఆరు మాత్రలకు పాదం మధ్యలో విరుగుతుంది. ఇదే ఛందస్సులో సరిపాదాలలో మాత్రలు తగ్గించికూడా చూపిస్తాడు.



*ఘనకార్యం చేసినట్టు*
*పొంగుతున్న వోటరూ,*
*కిరసనాయిలిస్తావా*
*బదులు పావు లీటరూ?*

ఇక్కడ సరిపాదాల్లో ఒక మాత్ర తగ్గింది. ఇల్లాంటి పాదాలతో చాలా రాశాడు. అట్లాగే ముత్యాలసరాలు పోలికతో గీతాలున్నాయి చాలా. ఉదాహరణకొకటి.

*మంత్రిగారూ అయిందా సం*
*క్షామ హోస్టలు దర్శనం,*
*బడుగు పిల్లల కడుపు దోపిడి*
*కిదే మంచి నిదర్శనం!*

కొన్ని రన్నింగ్ కామెంటరీలయితే అచ్చం ముత్యాలసరాలలోనే రాశాడు.

ఇట్లా చూసినకొద్దీ భాషా విశేషాలు, ఛందో వైవిధ్యాలు అనేకం కనిపిస్తాయి. దేవిప్రియ రచనలపైన ఎవరైనా పరిశోధన చేస్తే ఇంకా ఎన్నో విశేషాలు కనిపిస్తాయి. రన్నింగ్ కామెంటరీ ప్రచురణ సందర్భంగా దేవిప్రియను మనసారా అభినందిస్తున్నాను.

22, డిసెంబర్, 2013.

**భూమీ**
***సప్తాధికసముద్ర నదీనద సరసీనగాభిషేకితా,***
***ఎంత అందమైన ఆమెవి, నువ్వు...!***

(భూమికి : అరణ్య పురాణం)

బహుమతి







రాచకొండ టవర్స్, 'అమ్మచెట్టు' నివాసంలో... ఫొటో : శ్రీ వత్సన్, ది హిందూ.





దేవిప్రియ ఆంగ్ల రచన 'ది కోబ్రా డాన్సర్' విడుదల :
ప్రఖ్యాత జర్నలిస్ట్ శేఖర్ గుప్తా, కె.జె.రావు, జె.ఎం. లింగ్డో 2010, న్యూఢిల్లీ.







రన్నింగ్ కామెంటరీ సంపుటాల తొలి ప్రతిని దాసరి నారాయణరావు నుండి అందుకుంటున్న
దేవిప్రియ చెల్లెలు సలీమున్, ప్రక్కన సమత.




'ఇం...కొకప్పుడు' అంకిత ప్రతిని దేవిప్రియ నుండి అందుకుంటున్న డా. నీలిమ, డా. శ్రీనివాస్
ఎడమవైపు వెనుక డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి.



తన ఆత్మీయులు టి.ఆర్.ఎస్. నాయకులు, విద్యావేత్త, ఎం.ఎల్.సి, డా. పల్లా రాజేశ్వరరెడ్డితో దేవిప్రియ



ప్రతిభా గ్రాఫిక్స్ శర్మ, బి. నరసింగరావు, డా. ఎన్.గోపి, ఓల్గా, అక్కినేని కుటుంబరావులతో...




వరవరరావుతో...




'బహుముఖ' బృందంలోని
మాధవరావు, ఖాదర్ మొహియుద్దీన్, విశ్వేశ్వరరావుతో





తన అభౌతిక ప్రియపుత్రిక డాక్టర్ నీలిమతో దేవిప్రియ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా 'హంస' అవార్డు – 2015 అందుకుంటూ.
మండలి బుద్ధప్రసాద్, పల్లె రఘునాథరెడ్డిలతో



రమణజీవి, శ్రీశ్రీ విశ్వేశ్వరరావులతో




న్యూఢిల్లీలోని కేంద్రసాహిత్య అకాడమీ ప్రాంగణంలో
బండ్ల మాధవరావు, అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు, దేవిప్రియ, నాగమల్లేశ్వరరావు.
13, ఫిబ్రవరి 2018.



న్యూఢిల్లీ కమానీ ఆడిటోరియమ్‌లో అకాడమీ అవార్డు స్వీకరించిన తరువాత
బండ్లమాధవరావు, శివారెడ్డితో దేవిప్రియ






ఆంధ్ర విశ్వవిద్యాలయం సత్కార సందర్భంగా
గవర్నర్ నర్సింహన్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌లతో దేవిప్రియ. 2018




ఆంధ్రజ్యోతి న్యూఢిల్లీ ప్రతినిధి, ప్రముఖ కవి కృష్ణారావుతో....




మాఢభూషి శ్రీధర్, శివారెడ్డిలతో ఢిల్లీ తెలుగుసంఘం అభినందన సమావేశంలో...



తనకెంతో ప్రియమైన ప్రొఫెసర్ ఘంటా చక్రపాణితో దేవిప్రియ.



దేవిప్రియ అభినందన సభలో కవి సీతారామ్ కీలకప్రసంగం




కోయంబత్తూరులో సాహిత్య అకాడమీ సదస్సును నిర్వహిస్తున్న దేవిప్రియ



# ఇంటర్వ్యూలు



రేఖాచిత్రం : అన్వర్





ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో దేవిప్రియని ఇంటర్వ్యూ చేస్తున్న
ఆకాశవాణి మాజీ డైరెక్టర్ డాక్టర్ పి.ఎస్. గోపాలకృష్ణ,
ప్రసిద్ధ కవులు, వ్యాఖ్యాతలు ఖాదర్ మొహియుద్దీన్, డాక్టర్ ప్రసాదమూర్తి

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం. ప్రఖ్యాత కవి, ప్రముఖ పాత్రికేయులు దేవిప్రియతో ముఖాముఖం నిర్వహించింది. 2017వ సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ దేవిప్రియ 'గాలిరంగు' కవితా సంపుటికి అవార్డును ప్రకటించడం సరికొత్త సందర్భం. ఆకాశవాణి మాజీ సంచాలకులు డాక్టర్ పి.ఎస్. గోపాలకృష్ణ, ప్రముఖ కవులు ఖాదర్ మొహియుద్దీన్, డాక్టర్ ప్రసాదమూర్తి చేసిన ఈ ఇంటర్వ్యూలో దేవిప్రియ సమగ్ర మూర్తిత్వాన్ని ఆవిష్కరించే ప్రయత్నం జరిగింది. ఈ కార్యక్రమం ఆకాశవాణిలో మూడు భాగాలుగా ధారావాహికంగా ప్రసారమయింది. ఎంతో విలువయిన ఈ కార్యక్రమాన్ని నిబద్ధతతో, పట్టుదలతో రూపుదిద్దిన వారు ఆకాశవాణి సంచాలకులు శ్రీ సి.ఎస్. రాంబాబు. అలాగే దాదాపు రెండు వారాలపాటు ఎంతో శ్రమించి ఈ ఇంటర్వ్యూని ధ్వని తరంగాల నుంచి కాగితాలమీదికి దించినవారు యువకవి అనిల్ డానీ...



# నా కవిత్వాన్ని నేను స్పృహతో కాపాడుకున్నాను!

గోపాలకృష్ణ : నమస్కారం దేవిప్రియగారు

దేవిప్రియ : నమస్కారం

గోపాలకృష్ణ : ఒక మనిషి ఒక పని చేయడమే చాలా కష్టం అని అనుకుంటున్న రోజుల్లో మీరు కవిత్వం రాశారు, పత్రికా సంపాదకునిగా పనిచేశారు. సృజనాత్మక ప్రకటనల రూపకర్తగా విశేషమైన కృషి చేశారు, సినిమా లలోకూడా పని చేశారు. రచయితగా మొదలైన మీ ప్రస్థానం ఎప్పుడు మొదలైంది, ఎక్కడ మొదలైంది, ఎట్లా మొదలైంది?

దేవిప్రియ : ఇది చాలా పెద్ద ప్రశ్న. ఒక ఆటో బయోగ్రాఫికల్ సమాధానం చెప్పాలి దీనికి. నిజానికి అది ఇక్కడ మనకున్న పరిమితమైన వ్యవధిలో సాధ్యం కాదు గనుక క్లుప్తంగా చెబుతాను. మాది పల్నాడు ప్రాంతం. పల్నాటి యుద్ధం అంటేగాని అది వెంటనే గుర్తుకు రాదు. ఆ ప్రాంతంనుంచి వచ్చినవాణ్ణి. మా తాతలు పలనాటి వాళ్ళు. మానాన్న వాళ్ళు గుంటూరుకి వలస రావడంతో నేను అక్కడే పుట్టి, అక్కడే చదువుకున్నాను. మా కుటుంబంలో, ఆమాటకొస్తే మా వంశంలోనే, బహుశా, మొట్టమొదట బడికి వెళ్ళినవాణ్ణి, హైస్కూలు, కాలేజీల ముఖం చూసినవాడినికూడా నేనే నేమో! హైస్కూల్‌లో చదువుకుంటున్న రోజుల్లో ఈ కవిత్వం, సాహిత్యం గురించిన అవగాహన నాకు ఏమాత్రం లేదు. తాడికొండ వీధిబడిలో నా ఎలిమెంటరీ విద్య, ఎస్.వి.వి. హైస్కూలులో థర్డుఫారం వరకు చదివాను. మధ్యలో ఒక్క సంవత్సరం మాత్రం వినుకొండలో ఉన్నాను. అక్కడకూడా వీధిబడిలోనే చదివాను. ఆ తరువాత గుంటూరు వచ్చాను. మా హైస్కూల్లో ఒక చిన్ని లైబ్రరీ ఉండేది. ఎక్కువ సమయం అందులో గడపడం చిన్నప్పటినుంచే అలవాటయింది. ముఖ్యంగా పత్రికలు నన్ను బాగా ఆకట్టుకునేవి. చాలా చిన్నతనం. ప్రజామత, చిత్రగుప్త లాంటి పత్రికలు వచ్చేవి



ఆరోజుల్లో. రూపవాణిలాంటి సినిమా పత్రికలు ఎక్కువగా చదివేవాణ్ణి. డిటెక్టివ్ సాహిత్యం కూడా ఆరోజుల్లో చాలా విరివిగా వస్తూండేది. కిళ్లీకొట్ల దగ్గర బిస్కట్ల సీసాల పక్కన దొంతర్లుగా పేర్చి, ఎర్రరంగు, పసుపురంగు పూసిన నవలలు చిన్నచిన్న సైజుల్లో చూడముచ్చటగా వుండేవి. అవి నన్ను బాగా ఆకర్షించేవి. వాటిని చాలా శ్రద్ధగా చదువుకునేవాణ్ణి. నిజానికి అవే చిన్నతనంలో నన్ను ఆకర్షించిన తొలి రచనలు. అప్పుడప్పుడూ ఇలా నేనెందుకు  రాయ కూడదు అని అనుకునేవాడిని.  అట్లా నేను రాయడం మొదలు పెట్టాను. అది 60వ దశకం తొలి పాదం.

గోపాలకృష్ణ : అంటే మొదట రాసింది వచన రచనా?  కవిత్వమా?

దేవిప్రియ : నా మొదటి రచన కథ.

ఖాదర్ : దేవిప్రియగారూ... గోపాలకృష్ణగారు అడిగిన ప్రశ్న నేను ఇంకో రకంగా అడుగుతాను. మాటలకి మంత్రశక్తి ఉందనే స్పృహ మీకు ఎప్పుడు కలిగింది లేదా భాష గిలిగింతలు పెట్టిన తొలి సందర్భం, తొలి అనుభవం మీకేమైనా ఉంటే చెబుతారా?

దేవిప్రియ : మీరు నమ్ముతారో నమ్మరోగాని  నన్ను మొట్టమొదటిసారి, తొలి రోజుల్లో నన్ను ఆ వైపు ఆకర్షించినవి ఊళ్ళపేర్లు ఖాదర్. మా తాడికొండకి దగ్గర్లో నెమలికన్ను అనే ఒక ఊరుంది. నెమలికన్ను అనే ఒక ఊరుందని తెలిసి చాలా థ్రిల్లయేవాడిని. అలాగే "లేమల్లె", లేతమల్లె... ఊరిపేరు. ఇటువంటి పేర్లు నాకు చాలా వినసొంపుగా వుండేవి. బహుశా నాలోపల భావుకత పురివిప్పడానికి ఉపకరించిన  మొదటి అంశం ఇదే అనుకుంటాను.

ఖాదర్ : మీ 'ఒక గుడిసె కథ' వంటి రచనల్లో కొన్ని విషయాలను మీరు ప్రస్తావించారు. మిమ్మల్ని తొలిసారిగా కవిత్వంవైపు ప్రేరేపించినవి అని. అది  పేదరికం కావచ్చు, మీ చుట్టూవున్న ప్రకృతి, పరిసరాలు కావొచ్చు. వాటికి సంబంధించిన భాష, చిన్నతనంలో మీరు విన్న మాటలు మిమ్మల్ని ఎట్రాక్ట్ చేశాయా అనేది నా ప్రశ్న సారాంశం.

దేవిప్రియ : నిజం చెప్పాలంటే నాకు ప్రాథమిక దశలో, హైస్కూల్  రోజుల్లో, ముఖ్యంగా తాడికొండలో, నాకు టీచర్లు, గురువులు దీనికి సంబంధించి నంతవరకూ ఎవరూ లేరు. నన్ను నేనే ఎడ్యుకేట్ చేసుకున్నాను. ఆ విషయంలో చాలామంది,  అలాంటి సామాజిక పరిస్థితులనుంచి వచ్చిన ఆనాటి పిల్లల పరిస్థితి అదే అనుకుంటా.

ఖాదర్ : 'అమ్మ పాడే పాట' అనికూడా మీరు రాసుకున్నారు.

దేవిప్రియ : అది తరవాత దశ. మా అమ్మ నాకు చనుబాలు మాత్రమే ఇచ్చి పెంచలేదు. నాకు కవిత్వం ఇచ్చి పెంచింది అని రాశాను. మా అమ్మ ఖసీదాలు రాసేది. 'ఖసీదా'లు పాడేది. ముస్లింలు గ్యార్మీ పండగ చేస్తారు కదా! మా ఇళ్ళకు ఆ గ్యార్మీ పండగ సందర్భంగా తప్పెట్లు వాయించు కుంటూ ఫకీర్లు వచ్చేవారు. వాళ్ళందర్నీ చుట్టూ కూర్చోబెట్టుకుని వాళ్ళు వాయిస్తుంటే ఈమె పాడేదన్న మాట. ఈమె తాను అల్లిన 'ఖసీదా' లను మాత్రమే పాడేది. అలాంటి ఒక వాతావరణం ఉండేది మా ఇంటిచుట్టూ. ఏదో జరుగుతోందని తెలిసేదిగాని నాకవన్నీ అర్థం గావడానికి కొంత సమయం బట్టింది. అదీగాక ఈ స్త్రీ, పురుష సంబంధాల గొడవకి సంబంధించిన స్పృహకూడా నాలో ఆరోజుల్లోనే స్పష్టాస్పష్టంగా ఏర్పడిందని చెప్పొచ్చు. ఎందుకంటే ఆరోజుల్లో ఈ యాక్టివిటీ మా నాన్నకి అసలు యిష్టం ఉండేది కాదు. మా యింట్లో మా అమ్మ చేసే ఈ కార్యక్రమం, ఈ సంగీతం, ఈ రాయటమూ, ఈ ఫకీర్లతో కలిసి పాడటం అది. He was opposing it, tooth and nail. చాలా వ్యతిరేకించేవాడు, ఈ విషయంలో నిరంతరం వాళ్ళు ఘర్షణ పడుతుండేవాళ్ళు. ఇవన్నీ నాలోపల జ్ఞాపకాల రూపంలో బాగా ముద్రించుకుపోయాయి. అవికూడా ఎక్కడో రాశాను. తరువాతి కాలంలో అవన్నీ నా కవిత్వంలో రిఫ్లెక్ట్ అయ్యాయి. ఆ ప్రభావం నా మీద ఉంది. నేను పుట్టి పెరిగిన వాతావరణం నా కుటుంబ పరిస్థితి, ఇవన్నీ నామీద ప్రభావం వేస్తూవచ్చాయి. ఒక గుడిసె కథలో, నువ్వన్నట్టుగా దాంట్లోవున్న ఆ ఇమేజెస్ అన్నీ నేను ప్రత్యక్షంగా చూసి నవి, అనుభవించినవి, నన్ను ప్రేరేపించినవి, నన్ను ఇన్‌స్పైర్ చేసిన ఇమేజెస్ అవి. ఇపుడు 'ఈ గుడిసెలోనే నాకు మొట్టమొదట కన్నీటి సముద్రాలు ఉప్పొంగుతూ కనిపించాయి' అన్నాను. ఆ వాక్యాలు యధాతథంగా గుర్తు లేవు. I am very poor in remembering my lines. అట్లా ఇవన్నీ ఉన్నాయి. నేను పుట్టి పెరిగిన వాతావరణం, నా చుట్టూవున్న పేదరికం నా రచనలలో తప్పనిసరిగా ప్రతిఫలిస్తుంది. మానాన్న పోలీసు హెడ్‌కానిస్టేబుల్. వెరీ ఆనెస్ట్. చాలా పెద్దమనిషి. ఇంటిగ్రిటీ ఉన్నవాడు, కనుక చాలా ఇబ్బందులు ఉండేవి. వాటిని మరిచిపోవడానికి ప్రయత్నం చేయడం చాలా అసహజమైన విషయం. అందుకే ఇంటి పరిస్థితులు నన్ను ఎప్పుడూ వెంటాడుతూనే ఉండేవి.





తరవాత కాస్త కంఫర్టబుల్ లైఫ్ లీడ్ చేసే పరిస్థితులు ఏర్పడినప్పటికీ అవి నాలోపల్నుంచి ఎప్పుడూ బయటకు పోయింది లేదు. అవి నన్ను ప్రభావం చేయకుండా ఉన్నదీ లేదు. ఆ ఇమేజెస్ నా సృజనాత్మకతనీ, నా భావుకతనీ ప్రోది చేసేవి. దానికి తగ్గట్టుగా నా చదువు కొంత. క్లాసిక్స్ బాగా చదవడంకూడా ఒక కారణం అయి ఉంటుంది. ప్రాచీన సాహిత్యం, ముఖ్యంగా ప్రబంధ కవిత్వం చదవకుండా కవితా రహస్యాలకు సంబంధించిన గట్టిపునాదులు ఏ కవికీ ఉండే అవకాశం లేదనుకుంటాను.

ప్రమూ : మీ రచనాజీవితం ప్రారంభదశలో ఉన్నాం మనం. మొట్టమొదట కథ రాశానన్నారు. మొదటి రచన కథే. ఆ కథ పేరు గుర్తుందా....

దేవిప్రియ : అది అమ్మ కథ అనుకుంటా...

ప్రమూ : అమ్మకథా? అయితే నేను మళ్ళీ కవిత్వంలోకి వెళుతున్నాను. ఒక ప్రశ్న. మీరు వృత్తిగా జర్నలిజంను ఎన్నుకున్నారు. వచనాన్నికాని, కవిత్వాన్నిగాని రాయడంలో మీకు ఒక ప్రత్యేకత వుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మిమ్మల్ని ఒక మేజర్ పొయిట్‌గా గుర్తిస్తున్నారు. సరే, మీలో ఒక కవి ఉన్నాడని మొట్టమొదటగా మీకు ఎప్పుడు అనిపించింది?

దేవిప్రియ : కవిత్వాన్ని నేను ఒక ప్రక్రియగా చూసి దాని ఆకర్షణలో పడింది, బహుశా నేను తాడికొండనుంచి గుంటూరు వచ్చినాక అనుకుంటాను. 1964-65 ప్రాంతాలలో నేను హిందూ కాలేజ్ హైస్కూల్‌లో చేరిన తరువాత అటువంటి ఒక ఎరుక ఏర్పడింది. కవిత్వం అనేది అతి శ్రేష్ఠమైనది. మేలురకానికి చెందిన సాహిత్య ప్రక్రియ అని నాకు అనిపించింది. ఇక్కడ నేను ఆనెస్ట్‌గా ఒక వాస్తవం ఒప్పుకోవాలి. పి.యు.సి. నాటికి నేను కథలే రాస్తున్నాను. మా తెనాలి వి.ఎస్.ఆర్. కాలేజీ మ్యాగజైన్‌లో నా కథలు అచ్చయినాయి. తరవాత డిగ్రీలో వుండగా ఎ.సి. కాలేజీ మాగజైన్‌లోకూడా కథలే అచ్చయినాయి. "ఆకాశం ఆవులించింది" అనే కథ రాశాను ఎ.సి. కాలేజీ మాగజైన్‌లో. దానికీ కొంతమంది అభిమానులు ఉన్నారు. నేటి ప్రఖ్యాత రచయిత్రి ఓల్గా నాడు ఎ.సి. కాలేజీలో నా క్లాస్‌మేట్. ఈ విషయం తను చాలా సందర్భాల్లో చెప్పింది, రాసింది. చాలా క్వైట్‌గా ఉండేవాడిని. వాళ్ళు ముగ్గురు ఫ్రెండ్స్ ఉండేవాళ్ళు. వాళ్ళు చాలా అల్లరి పిల్లలు. క్లాస్‌లో



నేను చాలా బుద్ధిమంతుణ్ణి. మౌనంగా, గంభీరంగా వుండేవాడిని. ఈ అలవాటు చిన్నప్పటినుంచే ఉంది. మిత్రులు అంటూంటారు మిమ్మల్ని అప్రోచ్ కావడానికి చాలామంది వెనకాడతారని. మొదటి నుంచీ వున్నదే. ఇది కొత్తగా అబ్బిందీ కాదు, తెచ్చిపెట్టుకున్నది అంత కన్నా కాదు. అలా వాళ్ళు కొంచెం దూరం దూరంగా ఉంటూ ఉండేవారు. ఎ.సి.కాలేజీలో చాలా పెద్ద లైబ్రరీ ఉండేది. నేను క్లాసులోకంటే ఎక్కువ లైబ్రరీలో, చిన్నచిన్న పత్రికల ఆఫీసుల్లో ఉండేవాడిని. ఎ.సి. కాలేజీ లైబ్రరీలో నాకు సి. నారాయణరెడ్డిగారి 'కర్పూర వసంతరాయలు' కావ్యం కనిపించింది. దానిని కనుక మనం మోడ్రన్ పోయిట్రీ అను కుంటే, నా దృష్టికి వచ్చిన మొట్టమొదటి ఆధునిక సాహిత్యం అదే. మహాప్రస్థానం అనే కవితాసంపుటి ఒకటుందనికూడా నాకు అప్పటికి తెలియదు. ఆ దశలో నాకు సుగమ్‌బాబు పరిచయం అయాడు. సుగమ్ బాబుకి అమన్ వాచ్ కంపెనీ అని ఒక గడియారాల షాపు ఉండేది. నాలాంటి వాళ్ళకి అప్పట్లో అది ఒక సాంస్కృతిక కేంద్రంగా ఉండేది. పెద్దపెద్ద వాళ్ళు కూడా, గుంటూరు మీదుగా పోతున్న పెద్దకవులు, దాశరథి, శ్రీశ్రీ, కొలకలూరి ఇనాక్, పురాణం సుబ్రమణ్య శర్మలాంటి యోధానయోధు లందరూ ఆ షాప్‌ని విజిట్ చేసేవాళ్ళు. అలా వాళ్ళంతా నాకు పరిచయం అయారు. అక్కడే నేను మొట్టమొదటిసారి కమ్యూనిస్ట్ మేనిఫెస్టో చూశాను. అక్కడే నేను మొదటిసారి మహాప్రస్థానం పుస్తకం చూశాను. అయితే మొదటిసారి నేను చూసింది, చదివింది మాత్రం కర్పూర వసంతరాయలు. తరవాత ఆయన వేరే పుస్తకాలు చదివాను. కర్పూర వసంతరాయలు మొదటిసారి చదివినపుడు నేను నిలువునా ఒక జ్వరతీవ్రతకు లోనయ్యాను. వెంటనే ఇంటికి వెళ్ళి రాత్రంతా కూర్చుని 'వనజారాయలు' అనే కావ్యం రాశాను.

ప్రమూ : గేయ రూపంలోనా...?

దేవిప్రియ : కాదు. నారాయణరెడ్డి గారు మాత్రాఛందస్సులో కదా రాసింది. నేను రాసింది పద్యకావ్యం. దాదాపు రెండు వందల పద్యాలు. ఓవర్‌నైట్ రాసేశానన్న మాట.

గోపాలక్రిష్ణ : ఏమైనా పద్యం జ్ఞాపకం ఉందా...?

దేవిప్రియ : లేదు. అయితే అపుడు ఈ కావ్యాలన్నీ చదువుకుని, అవతారిక



అవీయివీ ఉంటాయికదా. కవులు తమను ఇన్‌స్పైర్ చేసిన వాళ్ళని ప్రశంసించడం, కృతికర్తలు కృతిభర్తల్ని ప్రశంసించడం – ఇలాంటి పద్యాలుకూడా రాశాను. "పుష్ప విలాపమన్ పూవుటుయ్యాలపై నిన్నూపి, స్వర్గాల నిష్ఠ చూపి" అని. అది కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి గురించి. మాటీచర్ ఆయన. మాకు స్పెషల్ తెలుగు చెప్పే వారు. అలా ఇలాంటి నాపూర్వకవుల్ని గురించిన పద్యాలు ఉండేవి. ఇప్పుడు అవేవీ జ్ఞాపకం లేవు. అవన్నీ దాటుకుని వచ్చాను గనుక, పెద్దగా దానిమీద ఆసక్తి లేకపోవడం వలనగూడా మర్చిపోయుంటాను, నా సహాధ్యాయి అంకమ్మరావు తన ముత్యాలవంటి దస్తూరీలో దానిని ఫెయిరన చేసి ఇచ్చాడు. ఆ రాతప్రతి కూడా దొరకడం లేదు.

ప్రమూ : వచన కవిత్వంలోకి ఎప్పుడు వచ్చారు?

దేవిప్రియ : వచనకవిత్వంలోకి అపుడే వచ్చాను. అది ఇమీడియట్‌గా జరిగి పోయింది. ఎక్కువ టైమ్ పట్టలేదు. సుగమ్‌బాబుతో ఇంటరాక్షన్ మొదలైన తరువాత వచనకవిత్వం రాయడం మొదలు పెట్టాను. దాశరథిగారి కవితాపుష్పకం చదవడం, అపుడే మాకు కొత్తగా ఇంద్ర గంటి శ్రీకాంతశర్మగారి పుస్తకం 'శిలామురళి' రావడం. శిలామురళి అనే పదబంధమే నాకొక కావ్యంలా అనిపించింది. శిలామురళి కావ్యం అంటే నాకు చాలా యిష్టం. అదికూడా వచన కవిత్వం అనడానికి లేదు. సుగమ్‌బాబు ఆ రోజుల్లో చాలా ప్రోమినెంట్ పొయట్. సుగమ్‌బాబు పోయమ్ లేకుండా పత్రికలు వచ్చేవికావు. సైనిక్ సమాచార్ అని ఒక పత్రిక ఉండేది. దాంతో సహా అన్నింట్లోనూ సుగమ్‌బాబు రచనలు ఉండేవి. అంత పాప్యులర్ పొయట్. చాలా విరివిగా రాసేవాడు. ఆరోజుల్లో తన ఇన్‌ఫ్లుయెన్స్ చాలామంది కవులమీద ఉండేది.

ప్రమూ : సార్! మీ కాలేజీ జీవితంలోనే వచన కవిత్వంలోకి రావడం జరిగిందా?

దేవిప్రియ : దాదాపుగా అంతే. నేను పద్య కవిత్వంలో ఎక్కువ రోజులు లేను. నేను రాయడం అయితే పెద్ద కావ్యం రాశానుగాని ఆ ధోరణిని కొనసాగించలేదు. తరువాత ఆరుద్రగారి కూనలమ్మ పదాలు చదివి 'నాయనమ్మ పదాలు' అని రాశాను. అపుడు చెప్పేవాళ్ళెవరూ లేరు. ప్రోపర్‌గా గైడ్ చేసే వాళ్ళెవరూ ఉండేవారు కాదు. సుగమ్‌బాబు కూడా ఇటువంటి విషయాలు చర్చించేవాడు కాదు. తన చుట్టూ ఉండడమే



ఒక ఎడ్యుకేషన్‌లాగా ఉండేది మాకు. అంతేతప్ప తనెపుడు ఇలా చేద్దామని చెప్పేవాడు కాదు. అలా జరిగిపోయింది. అయితే ఆరుద్రగారిని బాగా చదువుకోవడం, దాశరథిగారి కవిత్వం చదవడం, ముఖ్యంగా వచనకవిత్వం చదవడం, అనిశెట్టిని చదవడం, నయాగరా కవుల్ని చదవడం, కుందుర్తిగారు... వీళ్ళందర్నీ చదవడం వలన వీళ్ళంతా నన్ను ఉమ్మడిగా ఫ్రీవర్స్‌వైపు డ్రైవ్ చేశారనుకుంటాను.

ప్రమూ : అచ్చయిన మొదటి కవిత గుర్తుందా...

దేవిప్రియ : కష్టం.అచ్చయిన మొదటి కవిత మాత్రాఛందస్సులో రాసింది. అది గుంటూరులో. మనం చాలా ఆటోబయోగ్రఫికల్ డిటైల్స్‌లోకి వెళ్ళాల్సి వస్తుంది. అది చాలా విస్తారంగా ఉంటుందని నా భయం. చాలా సంక్షిప్తంగా, క్లుప్తంగా చెప్పడానికి ఎడిటింగ్‌లో నాకున్న అనుభవాన్ని ఉపయోగిస్తాను. స్థానికంగా గుంటూరులో అయిదారు పత్రికలు వుండేవి. 'తెలుగుసీమ' అని ఒక పత్రిక వుండేది. చిన్న పత్రిక అది. నేను దాన్ని 'తెలుగుచీమ' అని చిలిపిగా ఎగతాళి చేసేవాడినని ఆ పబ్లిషర్ గారికి నామీద చాలా కోపం. అలాగే "గుంటూర్ న్యూస్" "స్వతంత్ర సందేశ్" పత్రికలు వుండేవి. గుంటూరు వాణి అనికూడా ఒక పత్రిక ఉండేది. స్వతంత్ర సందేశ్ తో నాకు మంచి అసోసియేషన్ ఉండేది. దాని నిర్వాహకుడు తాడిశెట్టి ఆంజనేయులు నన్ను బాగా ఎంకరేజ్ చేసేవారు. ఆ పత్రిక మొదటి పేజీలో పైన నా పేరు గౌరవ సంపాదకుడు దేవిప్రియ అని వుండేది. అప్పుడు ఇంకా నా బి.ఏ కూడ పూర్తిరాలేదు! ఎక్కువ ఆయన దగ్గర వుండేవాడిని. నేను కాలేజీలో తక్కువ, సినిమా హాళ్ళలో, లైబ్రరీలో, ప్రెస్‌లో ఎక్కువగా ఉ ండేవాణ్ణి. అక్కడ ఉన్నపుడు 'గాంధీ మార్గం' అని కొన్ని వారాలు రాశాను. రన్నింగ్ కామెంటరీ మూలాలు చాలామంది సమాజానంద స్వామిలో వున్నాయని అనుకుంటారు. మరి సమాజానందస్వామి మూలాలు ఎక్కడున్నాయి అంటే, 'స్వతంత్ర సందేశ్'లో నేను రాసిన 'గాంధీమార్గం'లో వున్నాయి.

*'ఎర్రకోటపైన ఎగిరేటి జెండా*
*కూడు లేదే తల్లి మా కడుపు నిండా...'*

ఇలాంటివి నేను అపుడే రాశాను. అంటే 1967 ప్రాంతంలో. ఇటు వంటివి చాలా రాశాను. అదొక ఎక్సర్‌సైజ్‌గా పని చేసేది. అయితే



నేను సాధన చేస్తున్నాననే స్పృహ మాత్రం నాకు ఏమాత్రం ఉండేది కాదు. పేజీ ఖాళీగా ఉంది అంటే చాలు. ఏదో ఒకటి రాసేవాడిని.

ప్రమూ : తరువాత తరువాత, మీలో పరిపక్వత వచ్చిన తరవాత మీ రచనల్లో, మీ పాత్రికేయవృత్తిలో ఉపయోగపడిన ఆ వ్యంగ్యధోరణి, చతురోక్తులు సహజంగా అప్పటికపుడు కవితాత్మకంగా కామెంట్ చేసే శక్తి ఆ యవ్వన దశనుంచి వచ్చినవేనా...

దేవిప్రియ : నిజంగా మీకు అర్థం గానిది, చాలా మిస్టీరియస్‌గా అనిపించేది, ఒక విషయం చెబుతాను. ఇలా ఇంకొంతమంది ఇతరుల విషయంలో కూడా జరుగుతుందేమో నాకు తెలియదు. నాకు శ్రీశ్రీగాని, ఆరుద్ర గాని, గజ్జల మల్లారెడ్డిగాని కవులుగా పరిచయం కాకముందే, వాళ్ళ కవిత్వం చదవకముందే, ఆ ఎక్స్‌పోజర్ లేకముందే నాకు ఈ ధోరణి అలవడింది. నేను గుంటూరు వచ్చిన మొదట్లోనే ఇలాంటివి రాసే వాడిని. ఇప్పుడు చదివాను కదా. 'ఎర్రకోటమీద ఎగిరేటి జెండా' లాంటివి. వీటికి పూర్వం కూడా అటువంటి లైన్స్ వచ్చేవి. అవి ఎట్లా వచ్చేవో తెలీదు.

దిక్కులు చూస్తూ దినాలు మేస్తూ
చుక్కలు చూస్తూ లెక్కలు రాస్తూ

బతికిన బతుక్కి బై..బై..అని ఎపుడో రాశాను. ఎలా వచ్చిందంటే అది నా జీన్స్‌లో ఉందా, మా అమ్మ యిచ్చిన పాలల్లోఉందా, నాకు తెలియకుండానే స్వీకరించానా చెప్పలేను. మీలాంటివాళ్ళే... ప్రసాదమూర్తిలాంటి వాళ్ళు, ఖాదర్ మొహియుద్దీన్‌లాంటివాళ్ళు పరిశోధిస్తే ఏమైనా తెలుస్తుందేమో!

ప్రమూ : బోర్న్ పొయిట్ లక్షణాలు అలానే ఉంటాయి...

దేవిప్రియ : పెర్‌హాప్స్... ఏమో (నవ్వుతూ)...

ప్రమూ : మీరు మొదట్లో, దేవిప్రియ పేరుకు ముందు ఏ పేరుతో రాసేవారు?

దేవిప్రియ : మొదటినుండీ దేవిప్రియ పేరుతోనే. కాలేజీలోనే నాకు మా అమ్మనాన్న పెట్టిన పేరుని పరిహరించాను. ఆ పేరుని ఈ మధ్య అందరూ పత్రికల్లో రాశారుకదా, ఈ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చాక...

ప్రమూ : రాశారా... నాకే తెలీదు.

దేవిప్రియ : రాజ్యలక్ష్మికీ తెలీదు చాలాకాలం.

గోపాలక్రిష్ణ : మీరు చేసిన మొట్టమొదటి ఉద్యోగం, ఆ ప్రస్థానంలోంచి పత్రికల్లో మీరు చేసినవి చెబితే మళ్ళీ మీ అమ్మచెట్టు కవిత్వంలోకి వెళ్ళొచ్చు.

దేవిప్రియ : జర్నలిస్టుగా నా మొదటి ఉద్యోగం 'నిర్మల' అనే మాసపత్రికలో అని చెప్పాలి. అది 1973లో. అప్పుడు నేను హైదరాబాద్‌లో ఉంటున్నాను. 1974 మొదటి పాదంలో. బహుశా ఏప్రిల్ అనుకుంటాను. కేవలం నా బ్రతుకు దెరువు కోసం, నా వ్యాపకం కోసమని గుంటూరులో కొంతమంది మిత్రులు..., ఇ. శివారెడ్డి అని ఒక మిత్రుడు ఉండేవాడు, ఫిరంగిపురం నుంచి మా కిరణ్‌బాబు, వీళ్ళంతా కలిసి నా కోసం ఒక పత్రిక ప్రారంభించారు. నేను అప్పటికే పెళ్ళి చేసు కున్నాను. రాజ్యలక్ష్మిని. ఒక పత్రిక ప్రారంభించారు. దాని పేరు నిర్మల. దానిని ఒక ఆరు నెలలు నడిపాం. చాలా కష్టపడ్డాం. ఒక దేవిప్రియ కోసమో, ప్రసాదమూర్తి కోసమో, పత్రికలు నడవవు కదా! అలా అది ఆగిపోయే పరిస్థితి వచ్చినపుడు వడ్డెంపూడి హనుమంతరావు గారని చాలా సీనియర్ జర్నలిస్ట్. అప్పటికే గుంటూర్ న్యూస్ అని ఒక పత్రిక నడుస్తున్నదని చెప్పానుగదా. ఆయన హైదరాబాద్‌లో ఒక రాజకీయ వారపత్రిక ప్రారంభించారు. ఆ పత్రిక బాధ్యతలు నాకు అప్పగించారు. మళ్ళీ నేను హైదరాబాద్ వచ్చాను. దీంతో నేను మెయిన్‌స్ట్రీమ్ జర్నలిజంలోకి ప్రవేశించాను. ప్రజావాహిని పత్రిక బ్లిట్జ్‌లాగా వచ్చేది. చాలా డైనమిక్‌గా వుండేది. గౌలిగూడా బస్టాండ్లో పెడితే సాయంత్రం కల్లా అచ్చువేసిన కాపీలన్నీ అయిపోయేవి. అప్పటికే ప్రజాతంత్ర మార్కెట్‌లో వుంది. దాదాపు మూడు వేల కాపీలు వేసేవారు. ఆ కాపీలన్నీ అలాగే పడివుండేవి. ఇలా ఎందుకు జరుగుతోందని యాజమాన్యం తల బద్దలు కొట్టుకునేది. అందులో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు రాజేంద్రగారు వెళ్ళిపోయారు. అదే సమయంలో నేను పని చేస్తున్న ప్రజావాహిని ఆగిపోయే పరిస్థితి వచ్చింది. నేను రోడ్డున పడే పరిస్థితి. నాకు వెంటనే ఒక ఆధారం కావాలి. అపుడు ఎడిటర్‌గా ఎవరుంటే బావుంటుంది అని దాని యజమాని ఎ.వి. రావుగారు అన్వేషణ ప్రారంభించారు. ఆయన దృష్టి నామీద పడింది. ఆ పరిస్థితుల్లో నాకు ప్రజాతంత్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం లభించింది. అయితే ఆ పత్రిక అంత హిస్టారికల్ రోల్ ప్లే చేస్తుందని కానీ, నేను





ఎడిటర్‌గా అన్ని పనులు చేయగలుగుతానని కానీ ఎన్నడూ ఊహించలేదు.

ప్రమూ : అప్పటికి ఎడ్యుకేషన్ కంప్లీట్ అయిందా మీది?

దేవిప్రియ : దీనికి మూడేళ్ళ ముందే అయిపోయింది. ఈ మధ్యలో చాలా జరిగింది. నా మద్రాసు జీవితం, అనిసెట్టిగారి దగ్గర పని చేయడం. అదొక వేరే ట్రాక్. అందుకే అందులోకి వెళ్ళకుండా జర్నలిజం వృత్తిలోకి ఎలా వచ్చానో చెప్తే బావుంటుందంటే చెప్పాను. ఇక 'ప్రజాతంత్ర'... తరువాత తెలుగుదేశం పార్టీ పెట్టినపుడు తెలుగుదేశం అని ఒక వారపత్రిక పెట్టారు. నేను దానికి 'వ్యవస్థాపక' సంపాదకుడిని. ఆ తరువాత ఆంధ్రప్రభలో రన్నింగ్ కామెంటరీ ప్రారంభం. అయితే ప్రజాతంత్ర గురించి ఇక్కడ కొంత చెప్పాలి. నిజానికి ప్రజాతంత్రలో వారం వారం రాస్తూవచ్చిన సమాజా నందస్వామికి కొనసాగింపే రన్నింగ్ కామెంటరీ. ప్రజాతంత్రలోనే శ్రీశ్రీ ఆటో బయోగ్రఫీ 'అనంతం' సీరియల్‌గా పబ్లిష్ చేశాను. ప్రజాతంత్రలో అనేకమంది ప్రముఖులు రాసేవారు. వారిలో చాలామంది పెద్ద సంపాదకులు. వాళ్ళందరూ నేను చిన్నపుడు తల చాలా పైకెత్తి చూసిన పర్సనాలిటీస్. నండూరి రామ మోహనరావు గారు, ఎబికె ప్రసాద్‌గారు ఇలాంటి వారందరూ దానికి కంట్రిబ్యూట్ చేసేవారు. వీళ్ళంతా నా రెగ్యులర్ రైటర్స్. కమలాదాస్ ఆటోబయోగ్రఫీ పబ్లిష్ చేశాను. చాలా కాంట్రవర్షియల్ ఆటో బయోగ్రఫీ అది. తరువాత సినిమా గురించి కొత్తగా రాయడం. ఎక్స్‌పెరిమెంటల్ సినిమా గురించి, పారలల్ సినిమా గురించి, న్యూవేవ్ సినిమా గురించి. తెలుగులో వాటిని అప్పటిదాకా పట్టించుకున్న వాళ్ళెవరూ లేరు. I started writing about these things. అది చూసి బి. నరసింగరావు నా పరిధిలోకి వచ్చాడు. చాలా పెద్దపెద్ద వాళ్ళ గురించి కూడా నేను అనుకున్నది అనుకున్నట్టు రాయడమే. నాకా స్వేచ్ఛ ఉండేది. నేను ఎడిటర్‌గా చాలా గొప్ప స్వేచ్ఛ అనుభవించిన పత్రికలు ప్రజాతంత్ర, ఉదయం. I was ruling. ఆ రెండు పత్రికల యాజమాన్యాలు ఎవరైనా నాజోలికి వస్తే ఊరుకునేవి కాదు. ముఖ్యంగా దాసరి నారాయణరావుగారు. I Salute his memory.

ఖాదర్ : చేరాతలు ప్రవేశపెట్టిన క్రెడిట్‌కూడా మీదే కదా...

దేవిప్రియ : అటువంటి కాలమ్స్ కొన్ని ఉన్నాయి. చేరాతలు అనేది ఒక లాండ్



మార్క్ కాలమ్. చేరా మొదట నా ప్రపోజల్‌ని కాదన్నారు, చాలా blunt గా. He was so reluctant. అసలు తనవల్ల కాదని. కాలమ్ రాయడం నావల్ల ఎక్కడ అవుతుంది, చాలా ఇబ్బంది పడతావు అని చెప్పేవారు. నేను బలవంతంచేసి మీరు రాయాల్సిందే, నేనుంటాను, చూసు కుంటాను అని హామీ ఇచ్చాను. అనేకసార్లు ఆయన ఆఫీసుకి వెళ్ళి కన్విన్స్‌చేసి ఒప్పించాను. ఆయనతో రాయించడానికి చాలా కష్టపడ్డా. అలాగే శ్రీశ్రీ. ఆయనతోటి 'అనంతం' రాయించడానికి ఇనీషియల్‌గా బాగా శ్రమ పడ్డాను. దార్లో పడ్డాక చాలా హాయిగా రాశాడు. తెలుగు పత్రికల్లో అదొక చరిత్ర.

ఖాదర్ : టి.వి. మహాభారత్ హిందీ సంభాషణలు తెలుగు పత్రికలో ఎలా తీసుకు వచ్చారు?

దేవిప్రియ : టి.వి.లో బి.ఆర్. చోప్రా మహాభారతం సీరియల్ టెలికాస్ట్ ప్రారంభం అవుతుందని తెలిసింది. నాకెందుకో ఒక brain wave అలా సడన్‌గా వచ్చింది. why don't we publish the Hindi script in Telugu... సీరియల్ హిందీలో వస్తుంటే తెలుగువాళ్ళకేం అర్థం అవుతుంది? అసలు దక్షిణాదిలోనే అధిక శాతానికి అర్థం కాదుకదా! టి.వి.ల ముందు నిలబడి కృష్ణుడిని, ధర్మరాజుని, ద్రౌపదిని చూడటం తప్ప ఏం అర్థం అవుతుంది అని నాకు అకస్మాత్తుగా ఎందుకో అని పించింది. నేను వెంటనే మా మేనేజింగ్ డైరెక్టర్ జగదీష్ ప్రసాద్‌తో మాట్లా డాను. ఐడియా చాలా బావుంది. ఎవరితో డిస్కస్ చేయకు ఇది అన్నారు. వెంటనే next morning available flight కి బొంబాయి వెళ్ళిపోయాను. నా మిత్రుడు వేణుగోపాల్ ధక్కర్ బొంబాయిలో Pro video అనే స్టూడియో నడిపేవాడు. తనకి చాలా విస్తృతమైన కాంటాక్ట్స్ ఉండేవి. రవిచోప్రా వేణుకి మంచి ఫ్రెండ్. వేణుని తీసుకుని బి.ఆర్. ఫిల్మ్స్ ఆఫీసుకి వెళ్ళాను. బి.ఆర్. చోప్రాని, రవి చోప్రాని కలిశాం. నా ప్రపోజల్ విని, ఇలా కూడా చేయొచ్చా అని వాళ్ళు చాలా ఆశ్చర్య పోయారు. ఫస్టు ఐడియా నాదగ్గరనుంచే వచ్చింది కనుక వాళ్ళు రైట్స్ ఆంధ్రజ్యోతికి వెంటనే రాసి ఇచ్చారు. తెలుగు స్క్రిప్ట్ పబ్లిషింగ్ హక్కులు రాత పూర్వకంగా తీసుకుని ఆ సాయంత్రానికే నేను వెనక్కి వచ్చేశాను. ఆ రోజునుంచి ఆ సీరియల్ వచ్చినంత కాలం ప్రతి ఆదివారం మా పత్రిక సర్క్యులేషన్ దాదాపు రెండున్నర, మూడు లక్షలు ఎక్కువ ఉండేది. ఆదివారం ఆంధ్రజ్యోతి కోసం జనం ఎదురు చూసేవాళ్ళు.



ఉదయం తొమ్మిది గంటలకు దూరదర్శన్‌లో మహాభారత్ సీరియల్ టెలికాస్ట్ అయ్యేది. పత్రిక ప్రొద్దున్నే వస్తుందిగదా, అందరూ స్క్రిప్టును ముందుగా చదువుకునేవాళ్ళు. కొంతమంది ఆదివారం పత్రిక దగ్గర పెట్టుకుని చదువుకుంటూ సీరియల్ చూసేవాళ్ళు. అలాగే రామాయణం, వచ్చినపుడుకూడా చేశాం. దూరదర్శన్‌లో మహాభారతం టెలికాస్ట్ ముగిసేసరికి నేను ఉదయంలోకి మారాను. ఉదయంలో మేమొక స్పెషల్ ఇష్యూ వేశాం. అది ఒక లెజెండరీ ప్రోగ్రాం. నేను మళ్ళీ బాంబే వెళ్ళి వాళ్ళందరినీ కలిశాను. అదొక చరిత్ర.

అలాగే అపుడపుడూ నేను కొన్ని చిలిపి శీర్షికలు పెట్టేవాడిని. నీకు గుర్తుందో లేదో, “కలలోకొచ్చిన కథానాయిక” అని ఒక శీర్షిక నడిపాం. నువ్వు కూడా ఉన్నావు అపుడు. ఇది ఎలా రాయాలి.. శీర్షిక చాలా సరదాగా ఉందన్నారు దాసరి గారు. ముందు మీరు రాయండి సార్. మీతోనే మొదలు పెడదాం అంటే సినిమా ప్రపంచంలోకి అడుగు పెట్టకముందు నాకలాంటి కలలు రాలేదు అన్నారాయన నవ్వుతూ. ఎవరూ ముందుకు రాకపో వటంతో చివరికి నేనే రాశాను. కృష్ణకుమారి నా అభిమాన కథానాయిక ఆరోజుల్లో, ఆమె హీరోయిన్‌గా చేసిన సినిమాలు ఒక్కటీ విడిచిపెట్టే వాడిని కాదు, హీరో ఎవరైనాసరే. అలా నేనే కృష్ణకుమారి గురించి రాశానన్నమాట. ఆ తరువాత రకరకాల ఇన్‌హిబిషన్స్‌వల్ల ఎక్కువ మంది రాయలేకపోయారు. కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే రాశారు. అందువల్ల ఆ శీర్షిక ఎక్కువ కాలం నడవలేదు.

ప్రమూ : సాహిత్యంలో దేవిప్రియ తనదంటూ ఒక ముద్రవేసిన అనేక ప్రక్రియలు ఉన్నాయి. అలాగే పాత్రికేయ వృత్తిలో మీరు సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఈనాడు మీరు ఒక శిఖరస్థాయికి చేరుకున్నారు. పత్రికా రంగంలో ఎవరైనాసరే ఈ 4–5 దశాబ్దాల తెలుగు పత్రికారంగ చరిత్ర రాస్తే తప్పనిసరిగా దేవిప్రియని ప్రస్తావించకుండా, ఆయన చేసిన ప్రయోగాలు చెప్పకుండా రాయడానికి వీలులేని ఒక విలువైన జీవితాన్ని గడిపారు. అయితే నేను మళ్ళీ ఇక్కడ కవిత్వం దగ్గరికి వస్తాను. ఇంత బిజీగా ఉంటూ మీరు ఎట్లా దీన్ని బాలెన్స్ చేసుకున్నారు. సీరియస్‌గా కవిత్వం రాయడంవైపు ఎలా వెళ్ళారు? అమ్మచెట్టుతో ఒక బ్లాస్ట్‌లాగ వచ్చారు కదా… ఆ నేపథ్యం గురించి చెప్పండి.....





దేవిప్రియ : అమ్మచెట్టుకన్నా ముందు ఒక విషయం మీ ఇద్దరికీ చెప్పాలి. ఎందుకంటే ఖాదర్ మొహియుద్దీన్, నువ్వూ (ప్రసాదమూర్తి) వృత్తిపరంగా జర్నలిస్టులు. అలాగే మీరిద్దరు కవులుకూడా. చాలాచాలా prominent, important poets మీరు. మనం కవిత్వాన్ని కాపాడుకుంటూ వచ్చాం, జర్నలిస్టులుగా ఉంటూకూడా. నేనీమాట ఎందుకు చెబుతున్నానంటే చాలామంది కవులు నాకు తెలిసినవాళ్ళు పత్రికారంగంలో చేరి, చరిత్రలో కలిసిపోయారు. It is a great divourer. అది మింగేస్తది. అది ఎంతమంది కవుల్ని మింగేసిందన్నది చెప్పలేం. అట్లాచూస్తే నాకు చాలా prominentగా కనిపించేవాడు అజంతా. అజంతా అనేవాడు గొప్పకవి. ఆంధ్రప్రభలో పనిచేసి ఉండకపోతే ఆయన పుస్తకం నేనను కోవడం ఎపుడో దశాబ్దాల క్రితమే వచ్చుండాలి. దానికి మళ్ళీ ఎవరో పూనుకుని, తన తరంకాని త్రిపురనేని శ్రీనివాస్‌లాంటివాళ్ళు పూను కుంటేగాని రాని పరిస్థితి ఉండకూడదు. ఆయన రాసింది handful of poems మాత్రమే. అజంతాగారు అలా ఎందుకయ్యాడు. ఎందుకు prolificగా రాయలేక పోయాడు. జర్నలిజం కారణమా దానికి? ఇటువంటి ప్రశ్నలు వేసుకునేవాణ్ణి. ఆ భయం ఉండేది నాకు. succumb కాకూడదు ఆ pressureకి నేను. ఆ మోహంలో పడకూడదు అని నాకు చాలా ఉండేది. ఎట్టి పరిస్థితులలోకూడా నేను నా కవిత్వాన్ని దేని కోసమూ sacrifice చేయకూడదు అనేది నాకు గట్టిగా ఉండేది. నాకు ఆ స్పృహ ఉండేది. తరువాత నాకు పత్రికల్లో అప్పుడప్పుడే గుర్తింపు వస్తున్న దశలో, 'అమ్మచెట్టు' రావడం. అది ఎప్పుడూ లోపల వెలుగుతూనే ఉంటుంది. అది on లోనే ఉండేది ఎప్పుడు, నాలోని ఆ మీటకి off చేసే సదుపాయం లేదు. అటువంటి ఏర్పాటు నేను చేసుకున్నాను. ఆ సృహతోటి ఉండేవాడిని, కాబట్టి బహుశా నన్ను నేను కాపాడుకోగలిగానేమో. నన్నుచూసే మీరు చేశారని చెప్పను కానీ, బహుశా మీరుకూడా అదే చేశారు. ఖాదర్‌మీద నా ఆరోపణ, అభియోగం ఏమిటంటే, తను పుట్టుమచ్చ తరువాత రాయవలసినంత రాయలేదు, రాయాల్సినవి చాలా ఉండి ఉంటాయి.

ప్రమూ : అది మా అందరి కంప్లైంట్, కంప్లైంటే కాదు బాధగూడా.

దేవిప్రియ : ఇది ఆకాశవాణిలో రికార్డు అవుతోంది కనుక. దీనికి ఒక ప్రాధాన్యత ఉంటుంది. ఇది చరిత్రలోకూడా నమోదైందనే విషయం, ఖాదర్‌కూడా గుర్తుంచుకుంటాడని అనుకుంటాను.



ప్రమూ : 'అమ్మచెట్టు' గురించి చెబుతున్నారు. అమ్మచెట్టు గురించిన సందర్భం.

ఖాదర్ : నేనొక ప్రశ్న అడగదలుచుకున్నాను. అమ్మచెట్టులో అడివి అనే కవిత దగ్గర్నుంచి, నిన్నమొన్న మీకు అవార్డు వచ్చిన తరువాత రాసిన కవిత వరకుగూడా మీ సంవేదన విషయంలో మిగతా కవులకంటే భిన్నంగా. చాలా నిశితంగా ఉండటానికి కారణం చెప్పగలరా? చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

దేవిప్రియ : ఈ ప్రశ్నకు సమాధానం నేను చెప్పడంకన్నా ఎవరయినా విమర్శకులు చెబితే బావుంటుందని అనుకుంటాను.

ఖాదర్ : పోనీ, ఇంకొక ప్రశ్న వేస్తాను, దానికి అనుబంధంగా. ఒకే సామాజిక స్వప్నం, సాహిత్య సంవేదనలమధ్య మీరు అనుభవించిన సంఘర్షణ అసాధారణం అని నేననుకుంటాను. ఆ సంఘర్షణకు కారణం ఏమిటి?

దేవిప్రియ : నా సంఘర్షణ, నా భావజాలంతోటి, అది ఎప్పుడూ సంఘర్షణగా కనిపించలేదుగాని, నా జీవితంలోవున్న సంఘర్షణ, నా జీవితంలో ఉన్న ఒడిదుడుకులు, అంతేముఖ్యంగా నా కెరియర్. ఒక జర్నలిస్ట్‌గా, ఒక ఎడిటర్‌గా, నేనెదుర్కొన్న కొన్ని ఇబ్బందులు. వాటన్నింటిని అధిగమించి ఇప్పుడు ఈ స్థాయికి నేను ఎటువంటి సామాజిక నేపథ్యం నుంచి వచ్చానో, అటు వంటి సామాజిక నేపథ్యంనుంచి వచ్చిన జర్నలిస్ట్ ఒక ఎడిటర్ స్థాయికి, ఒక పెద్ద దినపత్రిక ఎడిటర్ స్థాయికి చేరడం అనేది నాతోనే మొదల యిందేమో బహుశా. నా తరువాత మళ్ళీ ఇంకొక ఎడిటర్, ఈ నా సామాజిక నేపథ్యం నుంచి, మైనారిటీ నేపథ్యం నుంచి, మళ్ళీ ఎప్పుడు వస్తాడో నాకు తెలీదు. అలాంటి అవకాశం ఉందో లేదోకూడా నేను చెప్పలేను. అది నేను అనుభవిస్తూ వచ్చాను. ఒక ద్వైదీభావం అనేది వుంటూవచ్చింది ఘర్షణపరంగా. నేను ఎట్లా ఢీకొనగలను ఈ సామా జిక పరిస్థితులని? ఇంతటి బలమైన వర్గాలు, చాలా బలంగా ఆయా స్థానాల్లోఉండి నాలాంటి వాళ్ళని నిలువరించడానికి చేసే ప్రయత్నాలన్నీ నేను దేనితో ఎదుర్కొనగలను? నా ప్రతిభతోటి, నా అంకిత భావం తోటి మాత్రమే! నన్ను నేను ఎప్పటికప్పుడు ఎలా అప్‌డేట్ చేసుకోవాలి? ఎలా దీన్ని, ఒక పత్రికని షేప్ చేయడానికి అవకాశం ఉంది? ఎవరూ చేయని పద్దతులలో చేయడానికి ఎలాంటి అవకాశాలున్నాయి అని



తెలుసుకోవడానికి నేను బయటి పత్రికలు చాలా పరిశీలించేవాడిని. బొంబాయి, ఢిల్లీ, కలకత్తా ఎక్కడికి వెళ్ళినా అక్కడి పరిస్థితులను తెలుసుకునేవాణ్ణి. అక్కడి పత్రికలు తీసుకుని వచ్చేవాణ్ణి. వాటిని చూడటం, వాళ్ళేం చేస్తున్నారో అర్థం చేసుకొనడానికి ప్రయత్నం చేయడం. కంటెంట్ ఒకటే కాదు, ఫామ్‌కూడా. ఒక పత్రిక ఫామ్ ఎలా ఉండాలి? ఒక విషయాన్ని ఎట్లా ప్రెజెంట్ చేయాలనే విషయంలో కూడా. అది ప్రయోగం అనుకుంటే అది ప్రజాతంత్రలోనే చేశాను. ప్రజాతంత్రని టాబ్లాయిడ్ నుంచి 1/8 డెమ్మీసైజుకి తేవడంవల్ల నేను అటువంటివి చేయగలిగాను, సాధించగలిగాను అనిపిస్తుంది. This applies to my poetry also, కవిత్వాన్నికూడా నేను ఎప్పటికపుడు ఆధునీకరించుకోవడానికి, నా స్టయిల్ కానివ్వండి, నా భాష కానివ్వండి. అప్‌డేట్‌గా ఉంచుకోవడానికి చాలా స్పృహతో ఉండేవాడిని. తరువాత నాకు నాదంటూ ఒక భాష, ఒక ఎక్స్‌ప్రెషన్, నాదంటూ ఒక పదజాలం, ఒక diction ఉండాలని. ఇపుడు 'నీటిపుట్ట', 'అమ్మచెట్టు' లేదా 'గాలిరంగు', 'గంధకుటి', 'చేపచిలుక' ఇటువంటివి అపూర్వం. అపూర్వం అంటే అంతకుముందు లేనిదని కదా. నా దృష్టంతా అలాగే ఉండేది. అలాగే ఉండాలి. I should not sound like any other poet, I should not read like any other poet, I should not write like any other poet. నాలాంటివాళ్ళు ఇంకొకళ్ళు ఉండకూడదు.

ప్రమూ : అంటే, మీరు మొదటే, చెప్పారు. ఇలా ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారి 'శిలామురళి' గురించి...

దేవిప్రియ : ఇపుడు, what separates prose from poetry.

ప్రమూ : అయితే దీనికి రిలేటెడ్‌గానే ఒక చిన్న ఎక్స్‌టెన్షన్. ఒక చిన్న ప్రశ్న. మీలాగే నేను పాత్రికేయవృత్తిలో ఉండి కవిత్వం రాస్తున్నాను. నాకొక డౌట్. ఎపుడుకూడా మీ పొయిట్రీ చదువుతున్నపుడు. poemకి poemకి structureలోకూడా చాలా different ఉంటుంది.. అంటే ఒక వస్తువుని తీసుకున్నపుడు తప్పనిసరిగా కవిత్వం చేయడానికి ఇలాంటి శిల్పం ఎంచుకుందాం అని ఏమైనా ప్రత్యేకంగా ప్లాన్ చేసుకుంటారా? దానంతటదే నిర్మితమవుతూ వెళుతుందా?

దేవిప్రియ : చాలా తొలిరోజుల్లో అటువంటి ఆలోచన కొంత ఉండేది. దీనికి



సంబంధించి చాలా ఎర్లీ స్టేజ్‌లో, నేను ఫ్రీవర్స్ రాయడం మొదలు పెట్టిన కొత్తల్లో, కొంత ఎక్సర్‌సైజ్ చేసేవాడిని. అది చాలా స్వల్పకాలమే. అటువంటి జాగ్రత్త, ఒక జాగరూకత నాకుండేది. తరువాత ప్రసాదా, ఇపుడు నువ్వు చెప్పినట్టుగా నేను ప్లాన్ చేసుకోను నా పోయమ్‌ని. రాయడం మొదలుపెట్టినాక, రాద్దామని పెన్ చేతిలోకి తీసుకున్న తరువాత, దాని స్ట్రక్చర్ అది స్వయంగా తీసుకుంటుంది.

గోపాలకృష్ణ : ప్రయత్నపూర్వకంగా కాకుండా సహజంగా వస్తుంది...

దేవిప్రియ : అవును. అది ఎట్లా వస్తుందో నేను చెప్పలేను కానీ, అట్లా వస్తుంది. It just happens like that. అంతే. ఆ పదాలు, మాటలు వాటి గడిలో అవి పడిపోతాయి. అంటే ఆటోమాటిక్‌గా ఒక రసాయన చర్య జరుగుతుంది అని నేనొక పొయమ్‌లో రాశాను.

గోపాలకృష్ణ : దేవిప్రియగారితో మాట్లాడడంలో ఉన్న ఇబ్బంది ఏమిటి అంటే, ఇంత బహుముఖంగా ప్రతిభ కనబరిచినపుడు, ఒక విషయానికి పరిమితం చేస్తే సమంజసంగా ఉండదు, కాబట్టి సినిమాలతో మీకుండే అనుబంధం గురించి మాట్లాడిన తర్వాత మనం 'గాలిరంగు' గురించి కూడా మాట్లాడుకుందాం. ముందు సినిమాలతో మీ అనుబంధం గురించి మాట్లాడండి.

దేవిప్రియ : సినిమాలతోటి, తర్వాత కమ్యూనికేషన్ రంగంతోటి నాకున్న సంబంధం గోపాలకృష్ణకు బాగా తెలుసు. మన పరిచయం ఈనాటిది కాదు. ప్రజాతంత్ర నాటిది. తొలినుంచీ నన్ను బాగా అభిమానిస్తూ ఇష్టపడుతూ నాతో స్నేహంగావుంటూ వచ్చిన అతి కొద్దిమంది మిత్రులలో మీరొకరు. సినిమాతోటికూడా నాకున్న అనుబంధం మీకు బాగా తెలుసు... As I said earlier. గొడవేమిటంటే నాకు వీటన్నిటితోటి పేచీలుండేవి. అపుడు వస్తున్న సినిమాలతోటి, కవిత్వంతోటి, జర్నలిజంలో వస్తున్న ధోరణుల తోటి, వాటి లిమిటేషన్స్‌తోటి నాకు చాలా తగాదా ఉండేది. నాలో నేనే తర్కించుకునే వాణ్ణి. ఎవరితోటి ఈ విషయాలు ప్రస్తావించేవాణ్ణి కాదేమో. బహుశా చెప్పి చేసేవాణ్ణి కాదేమోగాని నాకు నేనే పట్టించుకునేవాడిని, నాకు నేనే చెప్పుకునేవాణ్ణి. సినిమాని గురించి నేను డిఫరెంట్‌గా రాయడం మొదలు పెట్టినపుడు. ఒక different cinema. సినిమా, అంటే ఇపుడు మనం చూస్తున్నది గాదు. పిచ్చిపిచ్చిగా చూసేవాణ్ణి చిన్నపుడు



సినిమాలు. నేను చెప్పాను కదా కృష్ణకుమారి నా అభిమాన కథానాయిక. Adolacenseలో ఇటు వంటివన్నీ ఉంటాయి. Infactuations. కళాకారుల్లో కూడా ఇలాంటివి ఎక్కువ ఉంటాయి. ఆ గొడవలోంచి బయటపడిన తరువాత, నేను హైదరాబాద్ వచ్చిన తర్వాత సినిమాకి సంబంధించిన నా ప్రపంచం మారిపోయింది. నా standards మారిపోయాయి, ఇక్కడికి వచ్చినాక నేను ప్రపంచ సినిమాకి expose అయ్యాను. Hyderabad film club లో ప్రపంచ సినిమాలు చూడటం. యూరోపియన్ సినిమాలు ఎక్కువగా చూడడం. క్లాసిక్స్ చూడడం. ఇవన్నీ జరిగిన తరువాత సినిమా అంటే ఇది కాదు. మనం చూస్తున్నది ఒక డ్రామా. సినిమా పేరుతో మనం చూస్తున్నవన్నీ డ్రామాలు. థియేటర్‌ని మనం సెల్యులాయిడ్‌మీద చూస్తున్నాం. అంతే. అట్లా కాదు. సినిమాకి తన దంటూ ఒక భాష, ఒక గ్రామర్, ఒక వ్యాకరణం, తనదంటూ ఒక శిల్పాన్ని డిమాండ్‌చేసే తత్వం ఉంటాయి. ఇక్కడ అవన్నీకూడా లోపిస్తున్నాయి. ఎందుకు కన్నడంలో గొప్ప సినిమాలు వస్తాయి? ఎందుకు ఛెమ్మీన్ లాంటి సినిమా మళయాళంలోనే వస్తుంది? ఎందుకు ఆదూర్ గోపాలక్రిష్ణన్ లాంటి దర్శకులు అక్కడే ఉంటారు? ఎందుకు అరవిందన్ మళయాళంలోనే ఉంటాడు? మనకెందుకు అటువంటి దర్శకులు లేరు? అటువంటి సినిమాలు మన భాషలో ఎందుకు రావడం లేదు అనే దృష్టితో సినిమాల గురించి ప్రజాతంత్రలో నేను వరసగా, వారం వారం రాయడం మొదలు పెట్టాను. 'సినీతంత్ర' శీర్షికకింద దేవీదాసు పేరుతో రాసేవాణ్ణి. 'జమీన్‌రైతు' పత్రికలో 'పాదుషా' అనే పేరుతో ఒక సినిమా కాలమ్ రాసేవాణ్ణి. అలా నా అవగాహనలో చాలా మార్పు వచ్చింది. తరువాత  ప్రజాతంత్రలో నా సినిమా రైటింగ్స్‌చూసి బి. నరసింగరావు పరిచయం అయాడు. తను మాభూమి తీస్తున్నపుడు, ఆ ప్రొడక్షన్‌తోటి అసోసియేట్ అయాను. స్క్రిప్ట్ రాయలేదుగాని కొన్ని ఇన్‌పుట్స్ ఇస్తూ ఉండేవాడిని. అంతేకాకుండా మొత్తం ప్రొడక్షన్ డెసిషన్స్‌లో నా పాత్ర చాలా ప్రముఖంగా ఉండేది. తరువాత తను దర్శకుడుగామారి  'రంగులకల', 'దాసి' వంటి సినిమాలు తీసినపుడు నేను స్క్రిప్టు రాశాను. రంగులకలలో  గద్దర్ పాడిన "జమ్ జమ్మల్‌మర్రీ వేయికాళ్లా జర్రీ" అనే పాట రాశాను. ఆ పాట దేశమంతా మార్మోగింది. ఆకాశవాణి రికార్డ్సులో ఉండడం అవసరం అని చెబుతున్నా. అంత



హిస్టారికల్ సాంగ్ అది. వరవరరావుగారు దాన్ని అజరామర గీతం అన్నాడు. అటువంటివి చాలా... హాండ్‌ఫుల్ ఆఫ్ సాంగ్స్.

ఖాదర్ : తెలుగు సినిమాలో వచన కవిత ప్రవేశం మీ కవితతోనే అనుకుంటా....

దేవిప్రియ : అవును. రంగులకలలో మేము మొదటిసారిగా ఫ్రీవర్స్ ఇంట్రడ్యూస్ చేశాం. కథానాయకుడు, కథానాయికలకు మామూలు సినిమాల్లో అయితే యుగళగీతం ఉంటుంది. చెట్లచుట్టూ, పార్కులచుట్టూ ఎగురుతూ పాడుకునే సన్నివేశం వుంటుంది. రంగులకల సినిమాలో ఈ సంప్రదాయానికి భిన్నమైన రీతిలో చిత్రీకరణ జరిగింది. అది ఒక పెద్ద పచ్చగడ్డి మైదానం. ఫుట్‌బాల్ మైదానంకంటే పెద్దది. హీరో, హీరోయిన్లు నర్సింగరావు, రూప ఒక మూలలోంచి ఎంటర్ అయి ఇంకొక మూలలో ఎగ్జిట్ అవుతారు. ఈ వ్యవధిలో నెమ్మదిగా నడుచుకుంటూ పోతారు. దానిమీద వస్తుంది వచన కవిత్వం. "పచ్చగడ్డి మైదానంలా మన ముందు పరుచుకుంది జీవితం. రా ప్రియా. రా... పద పోదాం...ఇలా మొదలవుతుంది. అది ఒక కొత్త ప్రయోగం. తరువాత ఎవరూ చేసినట్టు లేరు. నేననుకోవడం అది ఒక యునిక్ ఎక్స్‌పరిమెంట్‌గా మిగిలిపోతుంది. తర్వాత నేను కొన్ని సినిమాలకి రాశాను, కొన్ని రికార్డైన పాటలున్నాయి. రికార్డు కాని పాటలున్నాయి. మద్రాస్‌లో అయితే 15-16 డబ్బింగ్ సినిమాలకి మాటలు, పాటలు రాశాను, గోపాలకృష్ణకి తెలుసు. అనిసెట్టిగారి దగ్గర పనిచేసే రోజుల్లో, వెండితెరమీద నాపేరు సహాయరచయిత అని ఉంటుంది. అలాగే ఇండిపెండెంట్‌గా రాసినవి కొన్ని ఉన్నాయి. అప్పట్లో ఒక సినిమాలో అయితే పాటలన్నీ నేనే రాశాను. ఆ పాటలన్నీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడారు. దాంట్లో నా పేరు లిరిసిస్ట్‌గా వుండదు. అలాగే ఇంకొక చాలా పాపులర్ సాంగ్ వుంది. దానిపేరు నేను చెప్పనుగానీ. సినిమా ప్రపంచంలో ఇవి చాలా మామూలు విషయాలని కాకరాల అంటుండేవాడు. అలాగే అల్లాణి శ్రీధర్ తీసిన 'రగులుతున్న భారతం' సినిమాలో పాటలన్నీ నేనే రాశాను. మద్రాస్‌లో దాసరి గారింట్లో ఆ పాటలన్నీ వినిపించాం. ఆరోజు మేము వెళ్ళేసరికి దాసరిగారి ఇంట్లో ప్రెస్‌మీట్ జరుగుతోంది. ఆయన వాళ్ళందరి ముందే ప్లే చేయండి అని అడిగారు. ఆ పాటలన్నీ ఆయన శ్రద్ధగా విన్నారు. పాటలన్నీ చాలా బాగున్నాయి. ఒక పాటని ఔట్‌స్టాండింగ్ సాంగ్ అని మెచ్చుకున్నారు. This is the cinima song of the decade అన్నారు.



"గురుతుందా నీకు...మరపురాదు నాకు" అనే డ్యూయెట్. హీరో హీరోయిన్లు జగపతిబాబు, దివ్యవాణి. అప్పటికే పెళ్ళయి చిన్న పాప ఉన్న దంపతుల మధ్య duet - ప్రేమగీతం. ఎలా పెడతావు, ఎలా రాస్తావు ఈ aproach తీసుకుని. 'గురుతుందా నీకు' అని ఎస్.పి. బాలు అంటే ఎస్.జానకి 'మరపురాదు నాకు' అంటుంది. అలా ఉంటుంది ఆ పాట. ఇలాంటివి నేను చాలా చేశాను. కానీ వాటికి పెద్ద ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఉంటుందని అనుకోను. ఊరికే గుర్తు చేసుకోవడానికి బావుంటాయి.

గోపాలక్రిష్ణ : ఇన్ని పనులు చేశారు కదా మీరు. కవిత్వం రాశారు, వచనం రాశారు. సినిమాల్లో పనిచేశారు, ప్రకటనలను చిత్రవిచిత్రంగా రూపొందించారు. మీరు చేసిన ఇన్ని పనుల్లో మీకు బాగా నచ్చిన పని ఏది? కొన్ని ఇష్టపడి చేసేవి వుంటాయి, కొన్ని కష్టపడిచేసేవి ఉంటాయి. దేవిప్రియ గారికి తనని కవిగా గుర్తు పెట్టుకోవడం ఇష్టమా? పత్రికా సంపాదకులుగా గుర్తు పెట్టుకోవడం ఇష్టమా?

ప్రమూ : సినిమా రచయితగా గుర్తుపెట్టుకోవడం ఇష్టమా?

దేవిప్రియ : అంటే, When a person is wearing so many hats, అది కొంచెం కష్టమవుతుంది. చేసే ప్రతి పని బాగా చేయాలి. క్వాలిటేటివ్‌గా చేయాలి అనే తాపత్రయం ఉండటం వలన, చేసిన ఈ రంగాలన్నింటిలోనూ నేను. ఎక్సెల్ చేయడానికి ట్రై చేశాను. ఏం చేసినా బాగా చేయాలి అనే స్వభావం ఉండేది. అది ఇప్పటికి పోయిందని అనుకోను. I try to do the best in what ever I do, what ever I did, ఇవన్నీ చాలా బాగా చేయడానికి ట్రై చేస్తుండేవాణ్ణి. ఆ క్రమంలో నాకు చాలా ఇష్టమైంది ఏమిటంటే నిస్సందేహంగా అది కవిత్వమే.

ఖాదర్ : ఏ పని చేసినా మీలో కవి ఎక్కువగా కనిపిస్తాడు. సరే, మీరు రాయాలనుకుని రాయలేక పోయిన సందర్భాలేమైనా ఉన్నాయా?

దేవిప్రియ : రాయాలనుకుని రాయలేకపోయినవంటూ ఏమీలేవు. అయితే ప్రణాళికలు అనుకుని చేయలేకపోయినవి కొన్ని ఉన్నాయి. లాంగ్ పోయమ్ రాయాలనేది ఎప్పటినుంచో ఉన్నది. లాంగ్‌పోయమ్ అన్నది ఒక ప్రక్రియలాకాకుండా రాయాల్సిన అంశాలు ఒక పోయమ్‌లో కన్‌ఫైన్ కావడానికి నిరాకరించేవి ఉంటాయి. నేను అనుకుంటున్నది ఒకటి



ఉంది. అది Day after. అంటే, ఎల్లుండి అనే దానిమీద దీర్ఘ కావ్యం రాయాలనుకున్నాను. పల్నాడునుంచి వచ్చానని చెప్పానుకదా ఆ పల్నాడు నేపథ్యంతోటి. పల్నాడు మీద ఒక డాక్యుమెంటరీ ఫిల్మ్ చేయాలని వుంది. పల్నాడు గురించి... Its a forgotten region. ఇప్పటికి కూడా చాలా neglected. దానిమీద నాకు చాలాప్రేమ. నేను చెప్పకుంటా ఉంటా కూడా నేను పల్నాటి వాడినని. నాకిష్టం అలా చెప్పుకోవడం.

ఖాదర్ : తీసిన డాక్యుమెంటరీ గురించి చెప్పలేదు. తీయాలనుకుంటున్న దాని గురించి చెబుతున్నారు.

దేవిప్రియ : మీరెవరూ దాని గురించి అడగలేదు. నేను ఈ డాక్యుమెంటరీలలోకి ఎలా వచ్చాను అని సందేహం ఉంటుంది. జర్నలిజంని వృత్తిగా చేసుకున్నవాడిని, ఎడిటర్‌గా ఉన్నవాడిని, ఈ డాక్యుమెంటరీ మేకింగ్ లోకి ఎందుకొచ్చాను, ఎప్పుడు వచ్చాను అంటే, గోపాలక్రిష్ణ జ్ఞాపకం చేసినట్టుగా, ఎడ్వర్‌టైజింగ్‌లోకి ఎప్పుడైతే వెళ్ళానో అపుడు అనుకోవచ్చు... సహజంగానే ఇవన్నీ దానికి అనుబంధంగా ఉన్న పనులు. చాలా షార్ట్‌ఫిల్మ్‌లు చేశాను. టివి కమర్షియల్స్ చేశాను, దాదాపు ఒక 100 దాకా చేసుంటాను, ఇవన్నీ గుర్తుపెట్టుకోవాల్సినవి కాదు. పెద్ద ప్రాధాన్యం ఉన్నవి కాదు. నేను నెదర్లాండ్స్ గవర్నమెంట్‌కొక ఫిల్మ్ చేశాను. వాళ్ళ గ్రౌండ్‌వాటర్ ప్రాజెక్ట్ అది. రాయలసీమ గురించి చేశాను. "The Sound of Ground water." తరువాత వీటన్నిటికంటే చాలా ముఖ్యమైనది. నాకు చాలా తృప్తినిచ్చింది. గర్వంగా ఫీల్ అయ్యేది ఏమిటంటే గద్దర్‌మీద చేసిన బయోగ్రఫికల్ డాక్యుమెంటరీ ఫిల్మ్. అది Full length Documentory. ఇంగ్లీషులో చేశాను. దానిపేరు "The Music of a Battleship" అంటే “యుద్ధనౌక సంగీతం” అది చాలా ముఖ్యమైన డాక్యుమెంటరీ అని నేననుకుంటాను. చాలా కీలకమైనది. అంతర్జాతీయంగా కూడా చాలా చోట్ల screen చేశారు.

ప్రమూ : ఇపుడు మనం మాట్లాడుకుంటున్న ఈ మాటల సందర్భంలోనే అందరికీ తెలిసింది. Devipriya is a Multi faceted personality. ఇంత బహుముఖీనమైన ప్రజ్ఞ మీలో ఉంది. నాలోవున్న కవిని నేను ప్రేమిస్తాను. అదే ప్రేమని ఇతరులనుంచికూడా నాలో ఉన్న కవిని అంతగా ప్రేమించాలని కోరుకుంటాను అని మరీ చెప్పుకున్నారు.



నిజంగాకూడా దేవిప్రియ కవిత్వాన్ని, దేవిప్రియని కవిగా అందరూ ప్రేమిస్తారు. అయితే మనకున్న కాలపరిమితిలో ఒకటిరెండు ప్రశ్నలు. 'గాలిరంగు' దగ్గరకి వద్దాం. ఏ సభలో చూసినా అవార్డు చాలా లేట్‌గా వచ్చిందని ఇప్పుడు ప్రతి వక్త మొదటిమాటగా చెబుతున్నాడు. దీనిమీద మీ ప్రతిస్పందన ఏమిటి?

దేవిప్రియ : నేనెపుడూ దీనికి ప్రాధాన్యత ఇచ్చినవాడిని కాదు. ఆ విషయం మీ ఇద్దరికి బాగా తెలుసు. నా గొడవంతా నాకు నచ్చింది నచ్చినట్టు రాయటమూ, బాగా రాయడమూ. ముఖ్యంగా ప్రజలను దృష్టిలో పెట్టుకుని రాయడం, వాళ్ళ గురించి రాయడం. దీనిమీదే నా దృష్టి. నా జూనియర్స్‌కి, నా సమకాలీకులకి చాలా గుర్తింపులొచ్చాయి. చాల పెద్ద అవార్డులొచ్చాయి. రామచంద్రమూర్తిగారు నా లాంగ్‌టైమ్ కొలీగ్. ఆయనంటూ ఉంటాడు ఇంత పాపులర్ ఎడిటర్ లేడు, డైరెక్ట్‌గా జర్నలిజంలోకి ఎడిటర్‌గా ప్రవేశించినవారు లేరు అని. I was the most popular one. ఒక దశలో దాదాపు రెండు దశాబ్దాలపాటు దేవిప్రియ అనేది ఒక house hold nameగా, ఇంటింటా వినిపించే పేరుగా ఉండటం అనేది నేనొక గొప్ప పురస్కారంగా భావిస్తాను కాబట్టి. ఆ విషయంలో నాకు ఎవరిమీద జలసీ లేదు, కంప్లయింట్ బొత్తిగా లేదు.

ప్రమూ : గాలిరంగు కాకుండా మీ ఇంకొక సంపుటికి వస్తే బాగుండేది అని అనిపించిందా?

దేవిప్రియ : కవి ఒక సంకలనానికి, ఇంకో సంకలనానికి ఏదో ఒక పరిణామం జరగకపోతే, అటువంటి కవిత్వం రాస్తూ వెళ్ళకపోతే ఆ కవి అక్కడితో ఆగిపోయినట్టు లెక్క.

గోపాలక్రిష్ణ : బహుమతికోసం ఒక పుస్తకాన్ని ఎన్నుకున్నప్పటికీ, ఆ ఎన్నుకోవడం వెనకాల ఆ కవి లేదా ఆ రచయిత చేసిన ఇతర కృషినికూడా దృష్టిలో పెట్టుకుని ఇస్తారు. అట్లా యిచ్చారని అనుకోవచ్చా?

దేవిప్రియ : ఏమో, జ్యూరీలో ఉన్న పెద్దలనడగాలి ఆ విషయం.

ప్రమూ : మీ కవిత్వం చదివిన వాళ్ళందరికీ తెలుసు మీరెటువైపున్నారు. ఏపక్షం వహిస్తారు అనేది. సమాజంపట్ల, ప్రజలపట్ల, అణగారిన వర్గాలపట్ల



మీకున్న అభిప్రాయం తెలుసు. అంటే పొలిటికల్ నిబద్దత. కవికి రాజకీయ నిబద్దత ఉండడం అవసరం అంటారా?

దేవిప్రియ : అవసరమే అని నేనుకుంటాను.

ఖాదర్ : మీరు పైగంబరకవిగా ఉన్నపుడు అదొక కల్లోల పరిస్థితి. దృక్పధానికి సంబంధించి, అప్పటికే అంత స్పష్టత ఎలా సాధ్యమైంది.

దేవిప్రియ : ప్రధాన స్రవంతి కవిత్వం రాయడం మొదలు పెట్టేటప్పటికీ నాకు ఒక స్పష్టమైన అవగాహన వుంది. నా చుట్టూఉన్న పరిస్థితులని ముఖ్యంగా నా కుటుంబ పరిస్థితులు, నామీద చాలా ప్రభావం చూపించి ఉంటాయి. తప్పకుండా అప్పటికే నాకొక స్పష్టత ఉంది. నేను ప్రజల గురించి, మరీముఖ్యంగా దుర్భరమైన జీవనం గడుపుతున్నవాళ్ళ గురించి ఆలోచిస్తూవచ్చాను. ఎందుకు మన ఇంట్లో టెలిఫోన్ లేదు, ఫ్యాన్ లేదు, కరెంట్ లేదు. ఇటువంటి ప్రశ్నలు నాలో నేనే వేసుకొనేవాడిని. ఎవరినీ అడిగేవాడిని కాదు. ఆ వాతావరణంలోంచి రావడం వలన question చేయడం అనేది. చాలా తొలి రోజుల్లోనే అలవాటు చేసుకున్నాను. ఇది నాకు సహజంగానే అలవడింది అనుకుంటున్నాను.

ప్రమూ : కొంతమంది మిత్రులు దేవిప్రియ మిగిలిన సీనియర్ కవులలాగా అందరితో కలవరు, రిజర్వ్‌గా వుంటారు అనుకుంటుంటారు. దీనికి కారణం?

దేవిప్రియ : నా దగ్గరికి రావడానికి, నన్ను అప్రోచ్ కావడానికి కొంత జంకుతా రనేది నేనూ వింటూఉంటాను, దశాబ్దాలుగా వింటున్నాను. కానీ వాళ్ళకి కూడా ఆ చొరవ ఉండాలి. దేవిప్రియతోటి నిజంగానే మాట్లాడాలి, కాసేపు సమయం గడపాలి అనుకునేవాళ్ళకి అటువంటి పరిస్థితి లేదను కుంటున్నాను. అలా కోరుకున్న వాళ్ళనెవరినీ నేను దూరం పెట్టలేదు. గంభీరతా..అలా గాంభీర్యంగా ఉండటం అదేం పనికట్టుకుని ఉండటం కాదు. అది అంతే.

ఖాదర్ : మీ సీరియస్ కవిత్వం కంటేకూడా మీ రన్నింగ్ కామెంటరీకే ఎక్కువ పేరొచ్చింది. కారణం ఏమిటి?

దేవిప్రియ : నూటికి నూరుశాతం నిజం అది. రోజూ లక్షలాది మంది చదివే పత్రికల్లో దాదాపు ఒక దశాబ్దంపాటు, ఏదో ఒక దినపత్రికలో వచ్చే



రన్నింగ్ కామెంటరీ నన్ను ఇంటింటికీ తీసుకెళ్ళింది. చాలామందికి నన్ను ఇష్టపడేలా చేసింది. వాళ్ళలో cross sections వుండేవాళ్ళు. So అది, it made me popular. మిగతా కవులందరికంటే దేవిప్రియ ఎందుకు పాపులర్ అంటే రన్నింగ్ కామెంటరీ వల్లనే. అమ్మచెట్టు వల్లనో, నీటిపుట్టవల్లనో లేదా గాలిరంగు వల్లనో కాదు. ఒక పెద్ద న్యూస్‌పేపర్, ఉదయంలాంటి న్యూస్‌పేపర్, ఆ రోజుల్లో ఆంధ్రప్రభ లాంటి అత్యంత విస్తృతమైన సర్క్యులేషన్ ఉన్న న్యూస్‌పేపర్. మొదట రన్నింగ్ కామెంటరీకి ఆంధ్రప్రభలో అటువంటి ఒక అవకాశం, ఒక ప్లాట్‌ఫామ్ దొరకడంవల్ల నాకు అంత కీర్తి, ప్రాచుర్యం రావడానికి ఉపయోగపడింది. దేవిప్రియగారి రన్నింగ్‌కామెంటరీ లాంటిది రాయాలని ప్రయత్నించా, ఇంకొక తాజ్‌మహల్ కట్టడం ఎంతటి మూర్ఖత్వమో, ఇదికూడా అటువంటిదే అని ఆ ప్రయత్నం విరమించుకున్నా అని పతంజలిలాంటి గొప్ప రచయిత, రికార్డు చేశాడు. రన్నింగ్ కామెంట్రీ అనేదే, నిర్వివాదంగా నాకు ఇంత పేరు ప్రఖ్యాతులు రావడానికి కారణమయింది.

ఖాదర్ : కుటుంబ జీవితాన్ని గురించి మీరేమన్నా మాట్లాడతారా? ఎందుకంటే మీది ప్రేమవివాహం. ప్రేమవివాహంలో మీ జీవిత భాగస్వామి మరణించిన తరువాత వచ్చిన పుస్తకం "ఇంకొకప్పుడు"లో గుర్తించ దగిన ఒక గుణాత్మకమైన మార్పు వచ్చింది. ఒక తాత్వికసాంద్రత అందులో కనిపిస్తుంది. ఏమైనా మీ కుటుంబ జీవితానికి సంబంధించి చెప్తే బాగుంటుంది.

దేవిప్రియ : జ్ఞాపకం చేసుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. చాలా ఉద్విగ్న పరిస్థితులు. మా అమ్మ కవిత్వాన్ని నాకు వారసత్వంగా ఇచ్చింది. నాకు ఇద్దరు అమ్మలు. నేను మా పెద్దమ్మ దగ్గర ఎక్కువ పెరిగాను. మా పెద్దమ్మ ముఖ్యంగా. నా చదువుకి, కాలేజీ స్థాయిలో నేను చదువుకోవడానికి ఆమె మొండి పట్టుదల కారణం. మా నాన్నకి నన్ను మెట్రిక్యులేషన్‌తో ఆపేసి, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేర్చాలని పట్టుదల. అది జరగలేదు. అలా జరగకూడదని కోరుకునేవాడిని. భయపడేవాడిని. చదువుకోవాలని ఉండేది నాకు. మా అమ్మ మొండితనం వలన ఆమె పట్టుదలవలన ఆ ప్రమాదం గట్టెక్కాను. తరువాత కాలేజీలోకి రావడం, నాకొక కొత్త ప్రపంచం ఏర్పడటం, అందులోకి అడుగు పెట్టడం ఇదంతా జరిగింది. ఒక మైనారిటీ



సామాజిక సముదాయానికి చెందిన కుటుంబంలో పుట్టిన పిల్లాడు పెరిగి పెద్దై ఇంత పేరు సంపాదించు కోవడం, పత్రికలకి ఎడిటర్‌గా పనిచేయడం, కవిగా ఇంతమంది మీలాంటి మిత్రులందరి అభిమానం పొందడం, అలాగే తను పుట్టి పెరిగిన ఆర్థిక జీవితానికి సంబంధంలేని పరిస్థితుల్లో జీవించడం పెద్ద పరిణామం. నా దాంపత్య జీవితాన్ని గురించి ఖాదర్ అడిగాడు, జ్ఞాపకం చేశాడు. రాజ్యలక్ష్మి మరణించడం ఇప్పటికీ కూడా నమ్మశక్యం కాని విషయం. అది నేను మరచిపోలేను. మీరన్నట్టుగా, ఆమె మరణం తర్వాత వచ్చిన నా కవిత్వంలో ఒక తాత్వికత ఉందనుకుంటున్నాను. నేనిట్లా బయటపడి నలుగురిలో కలిసి మాట్లాడతానని అనుకోలా. కాలం అనేది, it's a greatest healer అంటారు గదా. అలాగే మీలాంటి ఆత్మీయులు, ఆప్తులు నన్ను బాగా, చాలా గాఢంగా ప్రేమించే నా స్నేహితులు, మీవల్ల నేను బయటపడగలిగాను అని అనుకుంటు న్నాను. రాజ్యలక్ష్మి మరణం తర్వాత నేనొక అడుగందని అగాధంలోకి కూరుకుపోయిన మాట వాస్తవం. lonelynes అనేది ఎంత భయంక రంగా ఉంటుందనేది మొట్టమొదటిసారి, వ్యక్తిగతంగా ప్రత్యక్షంగా అనుభవించాను, అనుభవిస్తున్నాను కూడా ఇప్పటికీ. నేను దాంట్లోంచి బయటపడ్డానని కొంతమంది మిత్రులు అంటున్నారు. అది నాకు సంతోషంగా ఉత్సాహంగా అనిపిస్తుందిగాని, అది పాక్షిక సత్యం అని నాకు తెలుసు. ఎందుకంటే, the movement I go home, నా ఏకాంతం, నా ఒంటరితనం నన్ను చుట్టుముడతాయి వాటిల్లోంచి శాశ్వతంగా బయటపడటం అసాధ్యం అని నాకు అనిపిస్తూ ఉంటుంది. నేను ఈ మధ్య ఒక కవిత మొదలుపెట్టాను.

*"అక్కడ నువ్వు ఒంటరిగా ఉన్నావు*
*ఇక్కడ నేను ఒంటరిగా ఉన్నాను"*

అని ఇలాగ మొదలవుతుంది Poem. అలాగ అందులోంచి బయట పడటం అనేది చాలా కష్టం. I am trying to regil out of it.

ప్రమూ : రీసెంట్‌గా మీరు ప్రొఫెసర్ సాయిబాబా మీద రాసిన పోయమ్‌లో కూడా మీ ఏకాంతం గురించి ఉంది. "నువ్వక్కడ అండాసెల్‌లో" అని అన్నారు. మర్చిపోవడం కష్టమే.

దేవిప్రియ : సాయిబాబా గురించి రాసినా, ఎక్కడో అరణ్యాల్లో ఉండి ఒంటరిగా,

మంచులో తడిసిన తుపాకీ మడమల్ని నిమురుకుంటూ, దాన్ని కావలించుకుపడుకున్న కామ్రేడ్స్ గురించి రాసినా, అక్కడకూడా, I relate my lonelyness with them. వాళ్ళు అక్కడ ఒంటరిగా బతుకుతున్నారు. నేనెలాగయితే ఒంటరిగా బతుకుతున్నానో, అక్కడ వాళ్ళు, వాళ్ళ ఆశయాలు, వాళ్ళ ధ్యేయాలు, వాళ్ళ టార్గెట్స్, వాళ్ళ పాలిటిక్స్‌తోటి వాళ్లుంటారు. వాళ్ళూ ఒంటరిగానే బతుకుతున్నారు. కుటుంబాలకి, వాళ్ల జీవన సహచరులకి; వాళ్ల పిల్లలకి దూరంగా ఎంత పెద్ద శాక్రిఫైస్ అది.

ఇప్పుడు డాక్టర్ నీలిమ, డాక్టర్ శ్రీనివాస్‌లు నాకు చాలా పెద్ద సపోర్ట్ ఎమోషనల్‌గా. నాకు మా “సమత” మా “ఇవా” నా పిల్లలు, వాళ్లెంత సపోర్టో, వీళ్ళూ అంతే. ఫిజికల్‌గా నన్ను ఎంగేజ్ చేస్తున్నారు వాళ్ళు. అదికూడా చాలా ఆత్మీయంగా. అందుకే నీలిమని నా immaculate, pure daughter అని అన్నా, నా అభౌతిక పుత్రిక అని. అలా ఆ వాతావరణంలోకి నేను వెళ్లగలగడం వలన బహుశా నేను నీళ్ళల్లో మునిగిపోకుండా, నాముఖం, నా శిరసు ఇంకా కనబడేట్టుగా కొనసాగగల్గు తున్నానని అనుకుంటున్నాను. దీనికి మీ అందరి కంట్రిబ్యూషన్ ఉంది. రాంబాబు కంట్రిబ్యూషన్ ఉంది. ఖాదర్‌దీ ఉంది. మన ప్రసాదమూర్తిదీ ఉంది.


ప్రమూ : అందరి కోరికా అదే. మీరు బయటపడాలి. ఆరోగ్యంగా ఉండాలి. గొప్ప సాహిత్య సృష్టి కొనసాగించాలనేదే అందరి కోరిక.

గోపాలక్రిష్ణ : దేవిప్రియతో సంభాషణ చాలా ఉద్విగ్నంగా, ఒక మాటలో చెప్పడానికి వీలుకాని భావస్థితిలో పూర్తి చేస్తున్నందుకు, మాటల్లో చెప్పలేని వెలితి. అనేక విషయాలు చెప్పిన దేవిప్రియకి నాపక్షాన, మనందరి పక్షాన ఆకాశవాణి పక్షాన ధన్యవాదాలు.










కృష్ణుడు

# నేనొక చెట్టునైతే ...; దేవిప్రియ

*దేవిప్రియకు కేంద్ర సాహిత్య అకాడమీ 2017 పురస్కారం లభించిన సందర్భంగా అకాడమీ న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన 'ముఖాముఖి' కార్యక్రమంలో ప్రముఖ కవి, జర్నలిస్టు కృష్ణుడు 12, ఫిబ్రవరి 2018న ఆయనతో చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూలోని కొన్ని భాగాలు.*

కృష్ణుడు : దేవిప్రియగారూ, మీ సాహిత్యప్రస్థానం పైగంబర కవిత్వంతో ప్రారంభమైందికదా. దిగంబర కవిత్వానికి పోటీగా దాన్ని ప్రారంభించారా?

దేవిప్రియ : దిగంబర కవిత్వం ఉద్దేశం, వారి ఆవేదన, సరైనదే అయినప్పటికీ వారు వాడిన భాష విషయంలో ఆనాడు చాలా అభ్యంతరాలు వచ్చాయి. అందరికీ ఆమోదయోగ్యమైన భాషలో సామాజిక సమస్యలపైన మా భావాలను వ్యక్తీకరించాలనే ఉద్దేశంతో మేము పైగంబర కవిత్వం

రాశాం. పైగంబర కవిత్వం అనేదాన్ని నేను ఉద్యమం అని అనను. ఎందుకంటే మేము కేవలం రెండే సంపుటాలు వెంటవెంటనే వెలువరించాం.





కృష్ణుడు : పైగంబర అన్న పేరు ఎందుకు పెట్టుకున్నారు? దానికేదైనా సిద్ధాంతం ఉన్నదా?

దేవిప్రియ : పైగంబర అంటే ప్రవక్త. మేము ప్రవక్తలమన్న ఉద్దేశంతో కాదు కాని, సమాజ చైతన్యానికి కవులుగా మేము మా పాత్ర నిర్వహించాలన్న ఉద్దేశంతో ఆ పేరు పెట్టుకున్నాం. నాకప్పుడు మార్క్సిజం అంటే అభిమానం ఉండేది. మిగతావారికికూడా అవే అభిప్రాయాలు ఉండేవి. నేను అప్పుడప్పుడే కవిత్వం రాయడం ప్రారంభించిన రోజులవి. ఇప్పుడు ప్రముఖ నవలారచయిత్రి అయిన ఓల్గా అప్పుడు నా క్లాస్‌మేట్. పైగంబర కవిత్వంలో రమ్మని తనని కోరాను. కమ్యూనిస్టు మేనిఫెస్టో అధ్యయనం ప్రారంభించిన రెండేళ్లలో మార్క్సిస్టులుగా మారాం.

కృష్ణుడు : మీరు అప్పటినుంచీ ఇప్పటివరకూ కవిత్వం రాస్తూనే ఉన్నారు. సినిమాలకు కూడా రాశారు. జర్నలిజంలోకూడా ప్రవేశించారు.. సినిమాలు, జర్నలిజం, కవిత్వం మూడింట్లో ఏది మీకు ప్రియమైనది?

దేవిప్రియ : ఆ సమయంలో అనిసెట్టి సుబ్బారావు, బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి, కుందుర్తివంటి వారు ప్రగతిశీలకవిత్వం రాస్తుండేవారు. సరే, దిగంబర కవిత్వం ఎలాగూ ప్రవేశించింది. ఆ రోజుల్లో ప్రగతిశీల కవులైన అనిశెట్టి, శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్రవంటి మహానుభావులు పోలీసు యాక్షన్ తర్వాత మద్రాస్‌కు వలసవెళ్లి సినీ పరిశ్రమలో ఉపాధి వెతుక్కున్నారు. నేను కాలేజీ పూర్తి చేసి ఉద్యోగం వెతుక్కుంటున్న రోజుల్లో అనిసెట్టి సుబ్బారావు మద్రాసు వచ్చి తనతో చేరమని చేయి అందించారు. ఆ సమయంలో కొద్ది రోజులు నా జీవనోపాధి కోసం అక్కడికి వెళ్లాను కానీ నేనెప్పుడూ సినిమా రచయిత కావాలనుకోలేదు.

కృష్ణుడు : జర్నలిజంలో ప్రవేశించాలన్న ఆలోచన ఎలా వచ్చింది? రన్నింగ్ కామెంటరీ అనే విశిష్టమైన ప్రక్రియ ద్వారా జర్నలిజంలో కవిత్వం ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎలా కలిగింది?

దేవిప్రియ : ఆ రోజుల్లో చాలామంది కవులు జర్నలిజంలో ఉపాధి వెతుక్కు న్నారు. నా అభిప్రాయం ప్రకారం జర్నలిజం, సాహిత్యం అవినాభావ సంబంధం



గలవి. సరే, కొంతమంది కవులు జర్నలిజంలో చేరాక కవిత్వం రాయడం మానుకున్నారు. నేను కవిత్వాన్ని ఎప్పుడూ వీడలేదు. ఇక రన్నింగ్ కామెంటరీ అన్న పదం క్రికెట్ కామెంటరీనుంచి తీసుకున్నదే కానీ అదొక చారిత్రక సందర్భంలో ప్రారంభమైంది. మన వార్తా పత్రికల్లో అప్పటికే ఫ్రంట్ పేజీల్లో పాకెట్ కార్టూన్లు ఉండేవి. నేను ఆంధ్రప్రభలో పని చేస్తున్నప్పుడు 'ఎన్నికల కోలాహలం' అనే పేజీ ఇతరులకంటే భిన్నంగా వుండాలని సంపాదకుడు ఎబికె ప్రసాద్, నండూరి పార్థసారథి గారూ అనుకున్నారు. ఏదైనా భిన్నంగా రాయమని నన్ను కోరారు. అంతకుముందే నేను ప్రజాతంత్రలో 'సమాజానంద స్వామి' పేరుతో నేను 16 లైన్లతో కూడిన వ్యంగ్య కాలమ్‌ని కవితాత్మకంగా రాశాను. ఆంధ్రప్రభలోకూడా సంపాదకులు సూచించినట్లు నేను కవితా త్మక వ్యాఖ్యలు రాయడం జరిగింది. దానికి కార్టూన్లు జోడించడంతో ఎంతో జనాదరణ లభించింది. నేను రాసిన కొన్ని లైన్లు ఆ రోజుల్లో గోడలమీద కూడా ఎక్కాయి. 1983లో, సూపర్ స్టార్ ఎన్టీఆర్ ఎన్నికల బరిలోకి దిగిన రోజులవి. నా రన్నింగ్ కామెంటరీకి వచ్చిన ప్రతి స్పందన చూసి ఎన్నికల తర్వాత దాన్ని మొదటి పేజీకి మార్చారు. ఇది వార్తాపత్రికల రంగంలో వినూత్న ప్రక్రియగా గుర్తింపు పొందింది.

కృష్ణుడు : అసలు ఈ దేవిప్రియను ఎలా సంతృప్తి పరచాలి అని ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కూడా వ్యాఖ్యానించారటకదా..

దేవిప్రియ : (ఒక నవ్వు నవ్వేసి ఊరుకున్నారు.)

కృష్ణుడు : ఒక కవికి కవిత్వం రాయాలన్న ఆలోచన ఎప్పుడు కలుగుతుంది? మీకు కవిత్వం రాసేందుకు లభించే ప్రేరణ ఏమిటి? మీ బాల్యంలో మిమ్మల్ని ఎవరైనా ప్రభావితం చేసారా?

దేవిప్రియ : ఒక కవిత ఎలా అవిర్భవిస్తుందన్న ప్రశ్న ఎలాంటిదంటే ఒక పూవు ఎలా మొగ్గ తొడిగి వికసిస్తుందన్న ప్రశ్న లాంటిది. నేనొక చెట్టునైతే నా కవిత దాని పూవు లాంటిది. సూర్యుడి కిరణాలు భూమ్మీద తాకినప్పుడు వికసించే పూవు లాంటిది. నువ్వు కవివి కాకపోతే వేలాది పేజీలు, వేలాది అక్షరాలు పోగేసినా నువ్వు రాసేది కవిత కాబోదు. నాకు కవిత్వం మా అమ్మనుంచి వచ్చింది. ఆమె తన భావాలను కవితలుగా రాసుకునేది. మొహర్రం సమయంలో ఫకీర్ల డప్పులతో కలసికూర్చుని ఆమె తన కవితాగానం చేసేది. మా నాన్నకు ఇది



నచ్చేది కాదు. మా నాన్న పోలీసు. ఇంట్లోకూడా ఆయన పోలీసే. నా కళ్లముందే ఆమె అణిచివేతకు గురయ్యేది. నాకు ప్రేరణ ఆమే. ఆమె తిరుగుబాటు తత్వమే నాలో కవితను రగిలింపజేసిందను కుంటాను.

కృష్ణుడు : మీ కవితలో లయ ప్రధానంగా ఉంటుంది. అది ఎలా వస్తుంది. మీరు కవిత రాసిన తర్వాత దాన్ని సవరించుకుంటారా..

దేవిప్రియ : నేను రాసేటప్పుడే నా ఆలోచనలు లయాత్మకంగా సాగుతాయి. అవి అక్షరాల్లోకూడా లయిస్తాయి. కవితా వాక్యాలు నా మెదడులో రూపు దిద్దుకుంటున్నప్పుడు నా పదాల తూనిక తనంతట తానే జరుగుతుంది. ఒకసారి రాసిన తర్వాత సాధారణంగా దాన్ని ఎడిట్ చేయను. ఉప్పొంగిన భావతరంగాలు కవితలో ప్రవేశించిన తర్వాత దాన్ని ఎడిట్ చేస్తే అది కవితే కాదు.

కృష్ణుడు : ఈ జవాబే ఇస్తారనుకున్నా. మీరు గత అయిదు దశాబ్దాలుగా కవిత్వం రాస్తున్నారు. మీకు ఇంత ఆలస్యంగా సాహిత్య అకాడమీ పురస్కారం రావడానికి కారణమేమిటి? ఎందరో యువరచయితల తర్వాత మీకు పురస్కారం దక్కింది. మీపట్ల వివక్ష చూపారని భావిస్తున్నారా?

దేవీప్రియ : అలాంటి మాటలు వాడకండి. నేను ఎప్పుడూ పురస్కారాల కోసం కవిత్వం రాసేవాళ్లలో లేను. పురస్కారాలు వాటంతట అవే రావాలి. నాకే కాదు, గోపీచంద్, ఇస్మాయిల్ లాంటి వారికి కూడా పురస్కారాలు రాలేదు. ఇలా జరగడం కొత్త కాదు. నా కెవరిపైనా ఫిర్యాదులు లేవు.

కృష్ణుడు : నేటి యువకవులు కాళిదాసు, భవభూతి, వాల్మీకి, నన్నయ్య, తిక్కన, ఎర్రన, పోతనవంటి వారు రాసిన ప్రాచీనసాహిత్యం చదవడం అవసరం అంటారా? వాటిని చదవడం అవసరం లేదని, అవి సమాజానికి అవసరం లేదని చాలామంది భావిస్తుంటారు. మీ అభిప్రాయం ఏమిటి?

దేవిప్రియ : కృష్ణా, నీకు తెలుసు. ప్రాచీన సాహిత్యాన్ని తప్పకుండా చదవాలని గట్టిగా చెప్పేవాళ్లలో నేనొకడినని. యువకవులకు నేను ఈ విషయం పదే పదే చెబుతాను. సరే, భారత, రామాయణాల సంగతి అటుంచితే, తెలుగులో పంచ మహాకావ్యాలున్నాయి. యువ రచయితలూ, కవులూ భాషా సాహిత్యాలమీద పట్టు సాధించాలంటే, అలంకార శాస్త్రం గురించి నేర్చుకోవాలంటే, లభ్యమైన ప్రాచీన కావ్యాలు చదవాలి. వాటిని అధ్యయనం చేసేందుకు రకరకాల సాధనాలున్నాయి. సీనియర్ల సహాయం తీసుకోవచ్చు. అభినవ గుప్తుడినో, ఆనందవర్ధనుడినో తప్పని



సరిగా చదవమని నేను అనడం లేదు. కాని ఏదీ చదవకుండా సాహిత్యం గురించీ, శిల్పం గురించీ, సాహిత్య పరిణామం గురించీ మనకు పరిజ్ఞానం ఎలా పెరుగుతుంది? వాగ్గేయకారుల విషయం వేరు.

కృష్ణుడు : ప్రస్తుత సమాజంలో కవి తన ఆవశ్యకత ఎలా గుర్తించేలా చేయాలి? ఏ కవి అయినా తన చుట్టూ ఉన్న రాజకీయ, సామాజిక పరిణామాల్ని విస్మరించగలడా?

దేవిప్రియ : ఎలా విస్మరించగలడు, ఆ కవి గుడ్డివాడయితే తప్ప? నిజమైన కవి తన చుట్టూ ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల్ని విస్మరించలేడు.

కృష్ణుడు : కాని చాలామంది కవులు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలతో నిమిత్తం లేకుండా స్వాప్నిక లోకంలో విహరిస్తూ, ఉత్ప్రేక్షలు, అలంకారాలతో కూడిన వాక్యాలు రాస్తూ అదే కవిత్వమని అనుకుంటున్నారు కదా.. ?

దేవిప్రియ : కవిత్వానికి ఉత్ప్రేక్షలు, ఉపమానాలు, అలంకారాలు కావాల్సిందే. అవి లేకుండా కవిత్వం కాదు. ప్రజల కోసం రాసే రాజకీయ కవిత్వంలో కూడా అవి ఉండాలి. నా కవిత్వంలో ఇవి వుంటాయి.

కృష్ణుడు : కానీ మన చుట్టూ ఉన్న అన్యాయాలను ప్రశ్నించకుండా, మన సమాజంలో జరుగుతున్న వాటి గురించి చెప్పకుండా, సమస్యలకు పరిష్కారాల గురించి ప్రజలను చైతన్యపరచకుండా ఒక కవి కవి కాగలడా?

దేవిప్రియ : కాలేడు. అతడిని మనం బాధ్యతగల కవి అనలేం. కానీ ప్రశ్నించనంత మాత్రాన కవే కాదనలేం.

కృష్ణుడు : తన కళ్లముందే ఒక ఘోరం జరిగినప్పుడు అది ప్రశ్నించకుండా ఉండడం కవికి సాధ్యమా?

దేవిప్రియ : ఎలా సాధ్యమవుతుంది.. అలాస్పందించని వాడు కవే కాదు.

కృష్ణుడు : ప్రపంచీకరణ, వినియోగవాదం, పట్టణీకరణ, కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, మానవ విలువలు మృగ్యం కావడం మధ్య కవి అనుభవం ఎలా ఉంటుంది? సమాజంనుంచి పరాయీకరణ చెందకుండా ఉండడం సాధ్యమా?



దేవిప్రియ : నువ్వు వాస్తవికతను గ్రహిస్తే, నీ చుట్టూ జరుగుతున్న వాటి నేపథ్యాన్ని గ్రహిస్తే అవన్నీ నీ అనుభవంలోకి, నీ కవిత్వంలోకి వస్తాయి. కవి అన్నవాడు తన చుట్టూ ఉన్న ప్రపంచం మాత్రమేకాక సరిహద్దులు దాటి మొత్తం ప్రపంచంలో జరుగుతున్న వాటిని గ్రహించగలిగి ఉండాలి. నీకు తెలుసు. లెనిన్ విగ్రహం పడగొట్టినప్పుడు నేను ఒక కవిత రాశాను. నేను రాసిన అత్యుత్తమమైన కవితల్లో ఒకటిగా అది గుర్తింపు పొందింది. నీ చుట్టూ జరుగుతున్న పరిణామాలు, రాజకీయాల గురించి నీకు అవగాహన ఉంటే అది నీ కవిత్వంలో ప్రవేశిస్తుంది.

కృష్ణుడు : కవికీ, జర్నలిస్టుకూ మధ్య ఘర్షణ ఎలా ఉంటుంది? ఒక రైతు చనిపోతే వార్త రాదు. కాని పనికిమాలిన రాజకీయాలు, ప్రముఖుల శృంగార కలాపాలు వార్తల కెక్కినప్పుడు ఒక సంపాదకుడు ఏమి చేయగలడు? పత్రికల్లో సాహిత్యం తగ్గిపోవడం గురించి మీ అభిప్రాయం ఏమిటి?

దేవిప్రియ : ఈ ఘర్షణ నేనే కాదు, ప్రతి జర్నలిస్టూ, సంపాదకుడూ ఎదుర్కొంటాడు. తాను రాయాలనుకున్నవి రాయలేక, ప్రచురించాలనుకున్నవి ప్రచురించలేక పోయిన సందర్భాలుకూడా ఉంటాయి. ఇది భరించలేని స్థితికి చేరుకున్నప్పుడు, యాజమాన్యాలు నా అభిప్రాయంతో ఏకీభవించలేక పోయినప్పుడు నేను ఆ పదవినుంచి తప్పుకోవడానికి ఎప్పుడూ సందేహించలేదు. నేను రాజీనామా చేసినట్టుకూడా గుర్తు లేదు. నాకు ఇష్టం లేని వాతావరణం నుంచి తక్షణం మౌనంగా తప్పుకుని, అదృశ్యమై మరో ఉద్యోగం వచ్చేంతవరకూ వేచి చూసేవాడిని. నువ్వు చెప్పినట్టు ఇవి తెలుగు పత్రికలలోనే కాదు దేశంలో అన్నిచోట్లా జరుగుతున్నాయి. పత్రికల ప్రాధాన్యతలు మారిపోతున్నాయి. నాగపూర్ ఫ్యాషన్ షో కవర్ చేసేందుకు వందలాదిమంది విలేకరులు వెళ్లారు కానీ, అదే విదర్భలో రైతుల ఆత్మహత్యల గురించి రాసేందుకు వెళ్లిన వారి సంఖ్య అతి స్వల్పం...

మన పాఠకులు వినియోగదారులయ్యారు. వార్తాపత్రికలు డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ అయ్యాయి. ఫ్యామిలీ పేజ్, హెల్త్ పేజ్, పోటీపరీక్షల పేజ్. వీటన్నిటిమధ్యా సాహిత్యం వెతుక్కోవడం కష్టమవుతోంది. సాహిత్యం, సంస్కృతి అంటే తమకు సంబంధం లేనిదని పత్రికా యాజమాన్యాలు అనుకునే పరిస్థితి వచ్చింది.

కృష్ణుడు : సోషల్ మీడియా సాహిత్యం పైన మీఅభిప్రాయం ఏమిటి?



దేవిప్రియ : వార్తాపత్రికల్లో సాహిత్యం రాకపోవడంవల్ల రచయితలు సోషల్ మీడియాలో స్థానం కోసం వెతుక్కుంటున్నారు. ఇది మంచి పరిణామమే. సోషల్ మీడియా సాహిత్యంమీద నాకు ఎలాంటి వ్యతిరేకతా లేదు. కానీ ఒక వార్తాపత్రికలో లేదా ఒక దినపత్రికలో ఒక గౌరవనీయ సంపాదకుడు లేదా ప్రతిభగల సంపాదక వర్గం, కవిత్వాన్ని, కవిత్వ ప్రమాణాల్ని, భాషనుబట్టి అది ప్రచురణార్హం ఔనో, కాదో నిర్ణయిస్తుంది. కానీ సోషల్ మీడియాలో అతడే కవి, అతడే సంపాదకుడు. అతడే ప్రచురణకర్త. అతడికి ఇష్టం వచ్చినట్లు రాస్తాడు. అదో ప్రపంచం. పత్రికల్లో వచ్చే సాహిత్యం ప్రామాణికత అందులో ఉంటుందనుకోలేం.

కృష్ణుడు : ధన్యవాదాలు దేవిప్రియగారూ..

⚜

*లోపలయేదో మెదులురుతంది*
*ఆలోచనలలో యేదో కదులుతుంది*
*చదరంగం ఆడుతున్న మెదడులా*
*వ్యూహం పదపదానికీ*
*పరివర్తన చెందుతూ పోతుంది*
*నిరాకార భావనలు రూపుదాలుస్తాయి*
*అక్షరాలు ఎగిరివెళ్ళి*
*దేనిగడిలో అది పడిపోతాయి*
*పరుసవేది పనిచేయడం ప్రారంభమవుతుంది*
*రంగురంగుల కుంచెలు*
*నెమలిపింఛాలై నటనమాడుతాయి*
*గణితం రసాయనం అలంకారం కలిసిన*
*ప్రతిసారీ ఒక నూతనపద్యం పుడుతుంది*
*రహస్యంగా నాలో జరిగే ఒక అపురూప*
*ప్రక్రియ*
*ఇక ప్రదర్శనకి సిద్ధమవుతుంది!*

*(నా కవిత :ఇం..కొకప్పుడు)*



*గంగాధర్ వీర్ల*

# తడి ఆరని ప్రేమకావ్యం!

కొందరి గురించి చెప్పుకునేటప్పుడు మనసుని, శరీరాన్ని కొత్తగా, వైవిధ్యంగా మలచుకోవాలి. ఈ మాటేదో కొత్తగా ఉందే అనుకోవచ్చు. కానీ, కొందరితో కరచాలనాలు చేయడానికి సిద్ధపడాలంటే మనలో మనంగా, మన మనసులోనూ కొత్తదనాన్ని నింపుకోవాలి. అది ఎంతగా అంటే.. వొళ్ళంతా పూలపరిమళాలను అద్దుకోవాలి. అంతకీ చాలకపోతే కాసిన్ని నక్షత్రాలను అప్పు తెచ్చుకుని, కాసేపైనా వాటిని జేబులో ఉంచుకోవాలి. ఇంకా నీలినింగిలో తేలియాడే మబ్బుల్ని, చందమామ తునకల్ని, పచ్చని చేలల్లో అల్లరిచిల్లరగా తిరుగాడే పిల్లగాలుల్ని, భూమిపై అమాంతంగా వాలి చిత్తడి చిత్తడి చేసే చినుకు పలుకుల్ని.. ఇలా ప్రకృతితో చిన్నపిల్లల్లా మమేకమై పోవాలి. అలా అయితేనే కొందరితో కరచాలనాలు దొరుకుతాయి. వారి మనసు పొరల్లో దాచుకున్న అనుభూతుల్లోని అరుదైన జ్ఞాపకాలను కాసిన్ని పంచుకునే, తెలుసుకునే అవకాశాలు దక్కుతాయి. నిజంగానే అలాంటి వ్యక్తులు అరుదుగానే తారసపడతారు. గుండెవిప్పి అంతే అరుదుగానే మాట్లాడతారు. పైకి పొడిపొడిగా చెప్తున్నట్టు తోచినా మనసును గభాల్న తడి చేస్తారు. అలాంటి అనుభవమే కవి దేవిప్రియతో సాగిన చల్లని సాయంకాలపు కబుర్ల సెలయేరు.

ఈ నిత్యనవ్యనపు సెలయేరులో మనకు తెలియని ప్రేమైక సవ్వడులు, అంతర్వాహినిగా ధ్వనించే మానసిక బంధాలు, ఎప్పటికీ తరగని, ఎప్పటికీ తడుముతూ, తరుముతూ వచ్చే బాల్యస్మృతులు, రెండు హృదయాలమధ్య అల్లుకున్న కవిత్వోదయపు పరిమళాలు. ఇలా రూపాలు అనేకం. సుదీర్ఘ జీవన సహచరి ప్రయాణంలో 'రాజీ'పడ్డా, రాజీలేని దేవిప్రియ జీవన మాధుర్యంలోని కొన్ని ముత్యపు తుంపరలు ఇవి. చదవండి.. జగమెరిగిన కవి దేవిప్రియ 'జీవన' మాధుర్యం.



ఏ కవికైనా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తనదైన శైలిలో ఆవిష్కరించడం సులువే. కానీ తననితాను ఆవిష్కరించుకునే విషయంలో కష్టపడతాడు. ఆ మాటకొస్తే తనలోని మనిషిని, మనసుని ఎందుకు బయటపెట్టుకోవడం.. అనే భావిస్తాడు. ఎందుకంటే.. తనలోని మనిషి తనకు తెలిసినవాడై ఉంటే చాలు, తనలోనికి మరొకరు జొరబడి చూడాలనుకోవడం ఎందుకులే అనే చిన్నపాటి స్వార్థమైనా కావొచ్చు. అందుకే, చాలామంది కవులు, సృజనపరులు తమ వ్యక్తిగత జీవితపు స్పందనల్ని మదిలోపల్నే పదిలంగా దాచుకుంటారు. ముఖ్యంగా ప్రేమ, పెళ్ళి, ఆకర్షణ, వికర్షణ మరింకేదైనా కావొచ్చు. అవన్నీ తమతోనే ఉండాలని కోరుకుంటారు. దేవిప్రియ అందుకు అతీతమేమీకాదు. కానీ, కవిత్వంలో శిఖరాయమానమైన కీర్తిని పొందిన ఆయన మనసుని ఎలాగోలా కదిలించాలనే ప్రయత్నంలో.. ఆయన మనసు కాసేపు.. వెనక్కి వాలుతూ.. తడిబారిన కళ్ళతో పలికిన మాటలివి.

**అంతర్గత ప్రపంచం**

నిజం చెప్పాలంటే సుదీర్ఘమైన నా కవితా జీవితంలో అనేక ఇంటర్వ్యూల్లో.. సాహిత్యపరమైన విషయాలే మాట్లాడానుగానీ ఎప్పుడూ నా వ్యక్తిగత జీవితం గురించి చెప్పలేదు, చెప్పాలనీ అనుకోలేదు. ఇక్కడో విషయం మీకు చెప్పాలి. పర్సనల్ లైఫ్ అంటే.. నేను, భార్య, పిల్లలు అనే విషయాలు మాత్రమే కాదు. మనలో ప్రతి ఒక్కరిలో అంతర్గత ప్రపంచం ఒకటి ఉంటుంది. అది బయటకు కనిపించే సౌందర్యాలు, సౌఖ్యాలు, సౌకర్యాలు, వర్తమాన చర్యలు, వెసులుబాటుతో గడిపే అంశాలు మాత్రమే కావు. మనలోని, మనకు మాత్రమే తెలిసిన, గడిపిన ప్రపంచమూ వ్యక్తిగత జీవితమే. ఇక నా వ్యక్తిగత ప్రేమ విషయాలు, నా భార్య రాజీతో ముడిపడ్డ అంశాల గురించి చెప్పేముందు.. అంతకుముందు జరిగిన కొన్ని విషయాలు తడుముకోవాలి.

**సృజనపరుల లోకం వేరు**

కవులు, కళాకారులు, సృజనపరులు అనేవారు ఇతరులకంటే ఎక్కువగా తమ దైన లోకంలో విహరిస్తారనే అనుకుంటా. తెలియకుండానే తమ ఊహల్ని తమలో తాము విస్తరించుకుంటారు. తమదైన ప్రపంచాన్ని చాలా లేతప్రాయంలోనే కిటికీ తెరిచి మరీచూస్తారు. వాటినే కలవరిస్తారు. కలలూగంటారు. లోలోనగల రొమాన్స్, కలలు, ఊహలు అనేవి మనసులోని ప్రతిచర్యలు. ఇక్కడ రొమాన్స్ అనేమాట బాహ్యపు స్పందన కాదు. అంతర్గత భావనే. అది మాటల్లో చెప్పలేం. అలా నవయవ్వనపు ప్రయాణంలో కొన్ని అనుభవాలు, అనుభూతులు అనివార్యంగా ఎన్‌కౌంటర్లుగా దాడి చేస్తాయి (నవ్వుతూ).

**ఎన్‌కౌంటర్లూ ఎదుర్కొన్నవాడినే...**

నా జీవితంలో తప్పించుకోలేని, తప్పించుకున్న కొన్ని ఎన్‌కౌంటర్లూ ఉన్నాయి.



ఇక్కడ ఎన్‌కౌంటర్లంటే మనసుపైన ఎక్కుపెట్టిన భావసముదాయమూ కావొచ్చు. మరొకరివల్ల కలిగిన అనుభవాలూ కావొచ్చు. ఆ అనుభవాల్లో నేను పొందిన భావ స్వేచ్ఛ కావొచ్చు. అవన్నీ నేను ఎన్‌కౌంటర్లుగానే భావిస్తాను. తొలిప్రేమ ఎక్కడ మొదలైంది అని నన్ను అడిగితే ఆ ఎన్‌కౌంటర్ల గురించి కచ్చితంగా తడుముకోకుండా ఉండలేను. ఎన్‌కౌంటర్లంటే తుపాకులు, పిస్తోళ్ళు కాదు. (నవ్వుతూ) ఒకరకమైన (ఇన్‌ఫ్యాక్చుయేషన్స్) ఆకర్షణలూ కావొచ్చు. ప్రేమలాంటి అనుభవమూ కావొచ్చు. చిన్న ఉదాహరణ చెప్తాను. నేను ఇటీవల గుంటూరు వెళ్ళిన సందర్భంలో, చాలారోజుల తర్వాత అక్కడ నేను చిన్నప్పుడు తిరిగిన ప్రదేశాలు చూసినప్పుడు, అనుకోకుండా నేను నా బాల్యంలోకి వెళ్ళిపోయాను. ఒక అమ్మాయి తెలియకుండానే నాకు గుర్తొచ్చింది. ఆ అమ్మాయిపేరు బాలత్రిపుర సుందరీదేవి. ఎనిమిది, తొమ్మిది క్లాసుల్లో ఉండేటప్పటి ఆకర్షణ అది. రెండు జడలు, పట్టుపరికిణీ వేసుకుని ఎంతో అందంగా ఉండేది. బ్రాహ్మలమ్మాయి. నేనూ చిన్నపిల్లాడ్నేకానీ, ఆ అమ్మాయంటే ఎందుకో తెలి యని ఆకర్షణ ఉండేది. సైకిల్ వేసుకుని ఆ పిల్ల ఇంటిదాకా పోవడం, నాలాగే మరొక అబ్బాయికూడా ఆ అమ్మాయిని వెంబడించడం గమ్మత్తుగా ఉండేది. అంతటి చిన్నవయసులో అది ఆకర్షణ అనలేం. ప్రేమ అని అసలే అనలేం. దాన్నే నేను మనసుపై ఎవరో చేసిన ఎన్‌కౌంటర్ అంటాను.

**జీవితపు పరుగు ప్రయాణంలో...**

మద్రాసులో రైటర్‌గా సినిమాలకు పని చేసినప్పుడూ కొన్ని ఎన్‌కౌంటర్లు జరి గాయి. ఇద్దరు అమ్మాయిల (ఒకరు అప్పటికే పెద్ద పేరున్న డబ్బింగ్ ఆర్టిస్ట్, మరొకరు తర్వాత కాలంలో ఓ స్టార్ హీరోయిన్)తో ప్రేమ, పెళ్ళి అనే మాటలదాకా పరిచయాలు సాగాయి. అయితే, అవన్నీ నాకు నేనుగా ఆహ్వానించుకున్నవి కావు. వారితో నడవాలనీ అనుకోలేదు. వారి ప్రమేయంవల్లనో లేక నాకే తెలియని ఇష్టంవల్లనో కొంతకాలం సావాసం కొనసాగింది. చెట్టాపట్టాలేసుకుని తిరిగిన సందర్భాలూ ఉన్నాయి. తర్వాత వాళ్ళు పెద్దస్టార్లు అయ్యారు. అది వేరే విషయం అనుకోండి. కానీ, మనకు ఎక్కడో, ఎవరితోనో సిద్ధమై ఉన్నప్పుడు ఇలాంటివన్నీ తాత్కాలిక ప్రేరణాంశాలుగానే మిగిలిపోతాయేమో. ఇలాంటి అనుభవాలన్నీ జీవితంలో ఒక పరుగులాంటి ప్రయాణ మైతే, ఆ పరుగు ప్రయాణంలో నన్ను నేను తెలుసుకోడానికి, నియంత్రించుకోడానికి ఈ ఎన్‌కౌంటర్లన్నీ కొన్ని అవకాశాలుగా వచ్చి ఉండొచ్చు. బహుశా నా సహచరి రాజ్యలక్ష్మిని చేరుకోడానికి వీలుగా అవన్నీ నన్ను నిలువరించిన హర్డిల్స్ అనుకుంటా.

**విహంగాలై.. భాగ్యనగరాన వాలి...**

ఇద్దరిదీ ఒకే ఊరు (గుంటూరు). రాజ్యలక్ష్మి ఫ్యామిలీకూడా మా పొరుగునే ఉండేది. అలాంటి పరిచయం మాది. వాళ్లనాన్న పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సిఐగా పని



చేసేవారు. మానాన్న హెడ్‌కానిస్టేబుల్. ఆర్థిక అంతరాలతోపాటు సంస్కృతీ సంప్రదాయాలూ వేరే. కానీ, పరిచయాలు, ప్రేమగా ఒక్కటి కావాలనే బంధంగా మారాయి. అయితే, నేను స్థిరపడ్డాకనే పెళ్ళి అనుకునేవాడ్ని. ఎందుకంటే మద్రాసు అనుభవాలు నాకు కొన్ని పాఠాలు నేర్పాయి. కానీ, రాజీ ఇంట్లో పెళ్ళి ప్రయత్నాలు చేస్తుండటంతో ఇద్దరం కూడబలుక్కుని గత్యంతరంలేని పరిస్థితుల్లో బస్సు యెక్కి హైదరాబాద్ వచ్చేశాం.

అప్పటికే నాకవి మిత్రుడిగా ఉన్న శివారెడ్డి ఇంటికి వెళ్ళాం. ముందుగా షాక్‌కి గురైనా శివారెడ్డి దంపతులు అక్కున చేర్చుకుని, వారి స్నేహితుల సమక్షంలో పెళ్ళి చేయడం, దాదాపు తొమ్మిదినెలలపాటు వారి ఇంట్లోనే గడపడం, జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని ఓ జ్ఞాపకం. ఆ కొత్తజీవితంలో రాజ్యలక్ష్మి నాపట్ల చూపించిన ఓర్పు, పరిణతి, ప్రేమ నన్ను జీవితంలో నన్నుగా నిలబెట్టాయనే చెప్తా.

**ఆమె.. నేనూ...**

నలభై ఏళ్ళ వైవాహిక జీవితంలో మా మధ్య బంధాన్ని ఎలా వర్ణించను?! అన్నీ తానయ్యింది. నన్ను, నా అభిరుచుల్నీ అంతే ప్రేమించింది. పిల్లల్నీ తనే తీర్చి దిద్దింది. నా చుట్టూవున్న స్నేహప్రపంచాన్నీ నాకంటే ఎక్కువగా ఆదరించింది. అభిమానించింది. కవిగా, జర్నలిస్ట్‌గా, వృత్తిపరంగా నాకు నేనుగా రేపటి రోజుకోసం ఆలోచించకుండా ఆవేశంగా నిర్ణయాలు తీసుకున్నా ఏరోజూ బాధ పడలేదు సరికదా ఆ సమయంలోనే నాకు అండగా ఉండేది. తనకంటే ముందుగా నేను వెళ్ళిపోతే ఎలా అనుకునేవాడినేకానీ, తానే నన్ను విడిచి వెళ్ళిపోతుందని ఊహించలేదు. తన జ్ఞాపకాలు ఇంకా పచ్చిపచ్చిగానే ఉన్నాయి.

*ఆ పావలా బిళ్ళంత బొట్టు*
*ఆమె జ్ఞాపకంగా మిగిలిందిప్పుడు*
*మెటానమీ.. మాట్లాడబోతే*
*పచ్చరంగు మట్టిగాజుల చేతులు మరోజ్ఞాపకం*
*ఆ చేతులు అందించిన సెగలు కక్కుతున్న కాఫీ పొగలలో*
*చెదిరిన ఆమె కాటుక రేఖల*
*నగిషీల ప్రతిబింబం ఇంకో జ్ఞాపకం*
*గోరింట చూపుడు వేలు ఇంకో జ్ఞాపకం!! ..*

అంటూ సాగే దేవిప్రియ ఆలోచనల్లో, మాటల్లో, పదాల్లో, అక్షరాల్లో తన సహచరి రాజ్యలక్ష్మిపైగల ప్రేమ ఓ తడి ఆరని ప్రేమకావ్యం. కవిగుండెల్లో ఉదయించిన ప్రేమకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?!





దర్భశయనం శ్రీనివాసాచార్య

# రచన అనేది పని కాదు, పనితనం

'వేయి సంవత్సరాల్ వెనకాల కవినోయ్! వేయి సంవత్సరాల్ గడిచాక కవినోయ్' అని గుండెలమీద చేయి వేసుకుని ధైర్యంగా చెప్పగలిగే కవి. సంప్రదాయ ఆధునిక కవితారీతులను పుక్కిటపట్టిన కవి. ప్రతి అక్షరాన్నీ నేర్పుగా బొమ్మగీసి ఎదుట నిలబెట్టగలిగిన కవి. మౌనవీణను పలకరించగల కవి, నిశ్శబ్ద మురళిని పలికించగల కవి. మూక కోకిలను కవ్వించగల కవి...ఎవరు ఎవరంటేను 'దేవిప్రియ' అంటారంతా. ఆయన కరుణరసాభిమాని. కొనగోట కన్నీటి ముత్యం. కొందరు రాసినప్పుడే కవులు. ఇంకొందరు రాసినంత కాలమే కవులు. మరి కొందరు రాసినా రాయకపోయినా నిత్యకవులు. ఆ కోవకి చెందిన కవి దేవిప్రియ. కవిగానే కాదు, కథకుడిగా సంపాదకుడిగాకూడా వారు ప్రసిద్ధులు. ఆయనతో సంభాషణ వెన్నెల్లో విహరించడం లాంటిది. వేసవి వేళ వానలో తడవడం లాంటిది. మరెందుకాలస్యం? సంభాషించండి!

**బాల్యం, పఠనాసక్తి**

పుట్టింది 1949, ఆగస్టు 15 నాడు గుంటూరులో. అమ్మ హుస్సేన్‌బీబీ, నాన్న ఇమామ్. నాన్న పోలీస్ డిపార్టుమెంట్‌లో కానిస్టేబులుగా పని చేసేవాడు. ఉద్యోగరీత్యా ఆయన ఊళ్ళు మారడంవల్ల నేను చిన్నతనంలో చాలా ఊళ్ళను చూశాను. గుంటూరు, తాడికొండ, వినుకొండ, వినుకొండ దగ్గరి అడవి గ్రామం బొల్లాపల్లీ – ఈ ఊళ్ళలో బాల్యం గడిచింది. నా పెద్దమ్మ హలీమున్.

నామీద మా అమ్మ ప్రభావం ఎక్కువ. స్కూలు చదువు లేదు ఆమెకు. కొంత ఉర్దూ వచ్చేది. చాలా స్వతంత్ర వ్యక్తిత్వమున్న వ్యక్తి మా అమ్మ. ఖురాన్ చదివేది.



కవిత్వం చెప్పేది. నా చిన్నతనంలో పండగల వేళల్లో ఆమె ఖసీదాలు రాసి తాను పాడుతూ, తప్పెట వాయించే ఫకీర్లతోనూ పాడిస్తూ వుండేది. వాటిని నేను రికార్డు చేయలేక పోయాను. ఈ విషయంలో నేను క్షంతవ్యుణ్ణి కాను. మా వంశాన్ని గురించి ఆమె కథాగానంకూడా చేసేది. మా నాన్న చాలా సెన్సిటివ్. పూర్తిగా సంప్రదాయ బద్ధుడు. విముక్త ఆలోచనల్లేనివాడు. అందుకే అమ్మ స్వతంత్ర ధోరణి ఆయనకు నచ్చేది కాదు. అందుకే ఇద్దరి నడుమ ఘర్షణ వుండేది. నా ఇష్టాలుగానీ, అయిష్టాలుగానీ స్పష్టంగా వుండడానికి మా అమ్మ వ్యక్తిత్వం కారణమనుకుంటాను. అందుకే అమ్మను గురించి ఒకటి రెండు కవితలు రాశాను.

ఫస్ట్‌ఫామ్ నుంచి థర్డ్‌ఫామ్‌వరకు తాడికొండలో చదువుకున్నాను. స్కూల్లో చాలా సమయం లైబ్రరీలో గడిపేవాణ్ణి. ఊళ్ళోవున్న లైబ్రరీకి వెళ్ళి పత్రికల్ని చదివేవాణ్ణి. నేను ఉపాధ్యాయులనుంచి కంటే పుస్తకాలనుంచి ఎక్కువ నేర్చుకున్నాను. తాడికొండలో చదువు తర్వాత గుంటూరులో హిందూ కాలేజీ హైస్కూల్లో, ఆ తదుపరి వి.ఎస్.ఆర్. కాలేజీ, తెనాలిలో, ఏసీ కాలేజీ గుంటూరులో నా చదువు సాగింది. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులే వచ్చేవి కానీ ఒక్క లెక్కల్లో మాత్రం బొటాబొటీ మార్కులొచ్చేవి. చదువుకునే రోజుల్లో సినిమాల్ని తెగచూసేవాణ్ణి. ఒకోసారి క్లాసుల్ని ఎగ్గొట్టికూడా. ఐతే తెలుగు క్లాసును మాత్రం ఎగ్గొట్టేవాణ్ని కాను. తెలుగు చెప్పే సుబ్బరామయ్యశాస్త్రి గారు నన్నిష్టపడేవారు, నాకు తెలుగులో అత్యధిక మార్కులు వస్తున్నందుకు. చిన్నప్పుడు విరివిగా సినిమాలు చూడ్డంవల్ల సినిమా అనే క్రాఫ్ట్‌మీద నాకు ఆసక్తి పెరిగింది. సినిమా ఓ కళారూపమనే భావన నాలో పెరుగుతూ వచ్చింది. మున్ముందు నేను సినిమాలమీద భిన్నంగా రాయడానికి ఇది ఉపకరించిందనుకుంటాను.

**తొలి రచనలు**

తాడికొండలో వుండగానే తొలి కథ రాశాను. చిన్నతనంలో గేయాలు రాశాను. డిటెక్టివ్ నవలలు రాశాను. 'కర్పూర వసంతరాయలు' చదివి 'వనజారాయలు' అనే కావ్యాన్ని రాశాను. గుంటూరులో చదువుకుంటున్న రోజుల్లో స్థానిక పత్రికలైన 'గుంటూరు న్యూస్', 'స్వతంత్ర సందేశ్', 'తెలుగు సీమ'ల్లో పనిచేసి జర్నలిజానికి తొల్దొల్త దగ్గరయ్యాను. ఒక ప్రెస్ నడుపుకుంటున్న తాడిశెట్టి ఆంజనేయులుగారు నాకిచ్చిన ప్రోత్సాహాన్ని మాటల్లో చెప్పలేను. ఆయనవల్ల నా ఆలోచనా పరిధి విస్తృతమైంది. నా చదువు, జర్నలిజం సమాంతరంగా సాగాయి. నేను జర్నలిజం వైపు వెళ్ళడం మా నాన్నకు సుతరామూ ఇష్టం లేదు. మా అమ్మకీ విషయాలు అర్థం అయ్యేవి కావు.

**తొలి కథ**

తాడికొండలో మా ఇంటి ఎదురుగా తాడిగిరి పోతురాజుగారి ఇల్లు వుండేది.



అప్పటికే ఆయన కథలు పత్రికల్లో వచ్చేవి. ఒకానొక రోజు ఆయన రాస్తున్న కథను యాదృచ్ఛికంగా కొంచెం చూసినందుకు నాపట్ల విసుగును ప్రదర్శించాడాయన. నాకు ఉక్రోషమొచ్చింది. నేనెందుకు కథలు రాయకూడ దనిపించింది. మరుసటిరోజు మిట్ట మధ్యాహ్నం ఒక్కణ్ణే ఊళ్ళోవున్న గుడిపైకి వెళ్ళాను మెట్లను గబగబా ఎక్కేసి – కాగి తాలూ, కలమూ వెంట వున్నాయి – కోనేరులో కాళ్ళు పెట్టుకుని, చకచకా కథ రాసేశాను. చిన్న కథేమీ కాదది. పెద్ద కథ. కథ చివరన 'శుభం' అని పెట్టేసి చుట్టూ చూసేసరికి చీకటి పడుతున్నట్టు అర్థమైంది. అప్పటికే అమ్మ ఆందోళనతో నాకోసం ఊళ్లో వెతుకుతోంది. అలా నా తొలికథను ఒక ఊపులో ఒక్కణ్ణే కూర్చుని రాసేశాను.

**తర్వాతి కథలు**

వచన రచనల్లోనే నా సాహిత్య జీవితం ఆరంభమైంది. వి.ఎస్.ఆర్. కాలేజీ (తెనాలి)లో, ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీ (గుంటూరు)లో చదువుకున్నప్పుడు నేను రాసిన కథలు కాలేజ్ మ్యాగజైన్‌లో వరుసగా వచ్చాయి. మొత్తమ్మీద పది, పదిహేను కథలు రాశాను. 'విశ్వరచన'లో రెండుమూడు కథలు అచ్చయ్యాయి. ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రికల్లోకూడా అచ్చయ్యాయి. 'ప్రజాతంత్ర'లో పని చేస్తున్నప్పుడు ఆపద్ధర్మంగా ఓ కథ రాయాల్సివచ్చింది. ఓ వారం వేయాల్సిన కథేమీ అందుబాటులో లేదు. నేనే ఓ కథ రాశాను. 'కారులో మొక్క' టైటిల్‌తో 'ప్రియ' పేరుతో అది అచ్చయింది 19.12.1976 సంచికలో. ఆధునిక వచన కవిత్వపు ధగధగల కాంతి నామీద ప్రసరించే సరికి, కవిత్వంవైపు వెళ్ళాను కథల్ని వొదిలేసి. కథారచనను ఒదిలేశాను కానీ, కథాధ్యయనాన్ని ఆపలేదు.

**సంపాదకుడిగా కథల్లో**

ఎన్నో పత్రికలకు సంపాదకుడిగా వ్యవహరించాను. 'ప్రజావాహిని'లో కొంతకాలం పని చేశాను. 'ప్రజాతంత్ర'కు వెళ్ళాను. జ్యోతి మాసపత్రిక, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, 'ఉదయం' పత్రికల్లో వివిధ స్థాయిల్లో పని చేశాను. అప్పుడుకూడా, కథల్ని, కవిత్వంతోపాటు విస్తారంగా చదివాను. ఎప్పుడూ కథా ప్రక్రియను పక్కన పెట్టలేదు. ప్రచురణ కోసం వచ్చే కథల్ని శ్రద్ధతో చదివేవాడిని. కథావస్తువుతో పెద్దగా పేచీ వుండేది కాదు. చాలావరకు కథలు ప్రజాజీవితానికి సంబంధించినవే. కానీ కథంటే వస్తువొకటే కాదు కదా! రచయిత కథనెలా చెప్పాడనే అంశాన్ని గమనించేవాణ్ణి. వాక్యనిర్మాణం దగ్గర్నుంచి శైలికి సంబంధించిన అంశాల్ని లెక్కలోకి తీసుకునేవాణ్ణి. Syntax సరిగా వుందా లేదా అనేది చూసేవాణ్ణి. ఒక్కోసారి చాలా గుర్తింపు వున్న రచయితలు పంపే కథల్లోనూ Syntax సరిగా వుండేది కాదు. వాటిని ప్రచురించేవాణ్ణి కాదు. వస్తువుమీద వున్నంత ధ్యాస శిల్పంమీద లేకపోవడం చాలా కథల్లో కన్పించేది. 1980 తర్వాత ఈ లోపం స్పష్టంగా కనబడింది. ముఖ్యంగా ఉద్ధృతంగా సామాజికో



ద్యమాలు రంగం మీదికి వచ్చినప్పుడు రచనల్లో వస్తువు ప్రస్ఫుటమై శిల్పం మరుగున పడింది. అలా మౌలికంగా సృజనకు హాని జరిగింది. తెలుగు కథ మొత్తమ్మీద వికాసం చెందాల్సినంతగా చెందలేదు. సంపాదకుడిగా ఇది నా అభిప్రాయం.

**కథా విమర్శ**

మౌలికంగా నేను విమర్శకుణ్ణి కాను. ఐతే ఒకటి చెప్పగలను. మొట్ట మొదట్నుంచీకూడా తెలుగులో 'విమర్శ' బలహీనంగా వుంది. మనకు గొప్ప విమర్శ కుల్లేరు. కె.వి.ఆర్. తర్వాత మార్క్సిస్టు విమర్శకుడెవరున్నారు? ఒక ఖాళీ యేర్పడింది. ఐతే విమర్శకుడిగా పాపినేని శివశంకర్ చేస్తున్న కృషి చెప్పుకోదగింది. మంచి అధ్యయ నం, సామాజిక అవగాహన, రూపంపట్ల లోతైన చూపు వుండడంవల్ల శివశంకర్ మంచి విమర్శకుడయ్యాడు. నిజానికి విమర్శను తెలుగు సాహిత్య పరిధిలో మనం అసలు ప్రోత్సహించలేదు. అది గౌరవనీయమైన పని అని మనం Establish చేయలేకపోయాం. 'భారతి' పత్రికలో విమర్శకు సముచిత స్థానం వుండేది. ఆ తర్వాత దానికి ప్రాధాన్యత తగ్గిపోయింది. విశ్వవిద్యాలయాలుకూడా Schools ను రూపొందించలేకపోతున్నాయి.

**చైతన్య స్రవంతి సంవిధానం గురించి...**

నేను రాసిన 'కారులో మొక్క' కథ కొంతవరకు చైతన్యస్రవంతి పద్ధతిలో సాగింది. ఆ పద్ధతిలో రాయాలని ఓ ప్రణాళికతో రాయలేదు. కాకపోతే అప్పటికే జేమ్స్‌జాయిన్‌ను చదివివున్నాను. చైతన్యస్రవంతి శిల్పవిధానం ప్రత్యేకమైనది. శిల్ప పరంగా అదొక పాయ మాత్రమే. ప్రతి కథనూ ఆ పద్ధతిలో చెప్పలేం. కొన్ని కొన్ని సందర్భాలకు మాత్రమే అది ఒదుగుతుంది.

**శ్రీశ్రీ 'అనంతం'తో...**

'ప్రజాతంత్ర'లో పని చేస్తున్నప్పుడు పత్రికకు ఒక ప్రత్యేకతను తీసుకు రావడానికి శ్రీశ్రీ గారి ఆత్మకథను ప్రచురిస్తే బాగుంటుందని ఆయన్ని అడిగాను. అనిశెట్టి సుబ్బారావు దగ్గర పని చేస్తున్నపుడూ, ఆ తర్వాత జ్యోతిమంత్లీలో పని చేస్తున్న ప్పుడూ నాకు శ్రీశ్రీతో అనుబంధమేర్పడింది. పైగానాకు ఆయన Childhood Icon !

"మీరు ఆత్మకథ రాయకపోతే సాహిత్యానికి చాలా అన్యాయం చేసిన వారవు తారు" అన్నాను శ్రీశ్రీగారితో. ఒప్పుకున్నారాయన రాయడానికి. పోతే రాయించడానికి చాలా అవస్థలు పడాల్సివచ్చింది. అనేకమార్లు అర్ధాంతరంగా ఆగిపోతుందేమో అని పించేది. మొత్తానికి శ్రీశ్రీ గారితో 'ప్రజాతంత్ర' కోసం ఆయన ఆత్మకథను రాయించడం నాకెంతో తృప్తినిచ్చిన విషయం.

**నచ్చిన కథా రచయితలు**

చిన్నప్పుడు డిటెక్టివ్ నవలలు, చారిత్రక నవలలు చదివాను. తొలిదశలో



కొమ్మూరి సాంబశివరావుగారి రచనలంటే ఎంతో ఇష్టపడ్డాను. ఆయన శైలి నన్ను చాలా ఆకట్టుకుంది. తర్వాత్తర్వాత ప్రముఖ రచయితలందరి కథల్నీ చదివాను. నేనిష్టపడే రచయితలు – బుచ్చిబాబు, గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు. ఆ తర్వాత రావిశాస్త్రి గారినీ, కారా మాష్టార్నీ ఇష్టపడ్డాను. ఎందుకిష్టపడినానంటే రెండు కారణాలు. ఒకటి– సమాజంపట్ల వాళ్ళకున్న చైతన్యశీలత. దాని కోసమే రాయాలన్న నిబద్ధత. రెండో కారణం రూపపరంగా వాళ్ళ ప్రత్యేకత. They are the great masters of craft. పైన చెప్పిన వాళ్ళలో గోపీచంద్‌గారు శిల్పమ్మీద కొంచెం తక్కువ ధ్యాస పెట్టారేమో! చిన్నప్పుడు తాడిగిరి పోతరాజు కథల్ని ఇష్టపడ్డాను. కొలకలూరి ఇనాక్ కథలు కూడా నాకు ఇష్టమే.

అనువాద రచనల్నికూడా నేను ఎక్కువే చదివాను. రాహుల్ సాంకృత్యాయన్ నవలలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. తెన్నేటి సూరిగారి 'చెంఘిజ్‌ఖాన్'ను ఎన్నిసార్లు చదివానో చెప్పలేను. నిజానికి రాహుల్ సాంకృత్యాయన్ రచనల లాంటివి తెలుగులో రాలేదు. మనకు రచయితలున్నారు. కానీ చింతకుల్లేరు. ఈ విషయాన్ని గుర్తించాల్సిన అవసరం వుంది.

**దృక్పథం**

స్వతంత్రంగా వుండడం నాకిష్టం. నాదైన ఒకశైలి. ఒక దృక్కోణం నాకుండాలని నా నిరంతర యత్నం. 'ప్రజాతంత్ర'లో వుండగా పూర్తి స్వేచ్ఛను అనుభవించాను. జర్నలిస్టుగా పనిచేస్తున్న వేళల్లోనూ నాలోని కవీ, రచయితా మేల్కొని వుండేవారు. అందుకే నేను మిగతావారికంటే భిన్నంగా వుండేవాణ్ణి. సామాజిక రాజకీయ వాస్తవాల పట్ల నేను అప్రమత్తంగా వుండేవాణ్ణి. కుటుంబంకూడా సమాజంలో భాగమనీ, సమాజ పరివర్తనతోనే కుటుంబాల్లోని దుఃఖం అంతరిస్తుందని నేను గట్టిగా నమ్మేవాణ్ణి. నా అధ్యయనాలు నన్నలా నమ్మేట్టు చేశాయి. నా భావనలు, రాజకీయ విశ్వాసాలు చాలా పారదర్శకమైనవని నేననుకుంటాను.

**నా తర్వాత తరాల్తో...**

నా తర్వాతి రచయితల రచనల్తో నాకు సంబంధముంది. రచన బాగుంటేనే బాగుందని చెపుతాను. రచయిత అనేవాడు అందర్నీ మెప్పించాల్సిన పని లేదని నేను గట్టిగా నమ్ముతాను. ఏ యువకవో, యువరచయితో ఓ రచనను విన్పిస్తే, మెప్పుకోలు కోసం నేనెప్పుడూ మాట్లాడలేదు. నిజాయితీగా నా అభిప్రాయాలు చెప్పానని అనుకుంటున్నాను. నేను రూపంపట్ల ఎప్పుడూ జాగరూకతతో వున్నాను. అనుకరణ నాకిష్టం లేదు. అనేక సందర్భాల్లో కొత్త రచయితలకు వస్తువుతోపాటు శిల్పం గురించి అవగాహన వుండాలని చెప్పానంటే అది నా బలమైన అభిప్రాయం కనుక. అంతోఇంతో అనుభవం వున్నవారు చెప్పాల్సిన విషయాల్ని నిర్మొహమాటంగా చెప్పకపోతే కొత్త



రచయితలకు సరియైన మార్గం చూపనివారవుతారు. ఈ బాధ్యత చాలా ముఖ్యమైందని నేను భావిస్తాను. కవిత్వరచన కానీ, కథారచన కానీ ఒక పని కాదు. పనితనం. ఈ పనితనపు స్పృహ ఏ రచయితకైనా అవసరమని నా అభిప్రాయం.

**ఇదీ చెప్పాలి !**

రచయితకు ఉండాల్సిన మంచి అలవాట్లలో ఒకటేంటంటే – రాసిన వాటిని భద్రపరచడం. ఈ విషయంలో నేను చాలా వెనకబడ్డాను. నేను చేసిన చాలా రచనలు చాలావరకు నా దగ్గర లేవు. రాసిన కథల్ని భద్రపరచలేకపోయాను.

**కుటుంబం**

జీవనసహచరి రాజ్యలక్ష్మి, అబ్బాయి, ఇవాసూర్య. అమ్మాయి – సమత.

**వెనక్కు చూసుకుంటే...**

విశ్రాంతిలేని సుదీర్ఘ ప్రయాణం. ఎప్పుడూ కొత్తదనం కోసం నిరంతర అన్వేషణ!

*'నవ్య' వీక్లీ, ఆగస్టు 17, 2011*

⚜

శ్రీనాధుడి చాటువులను
మీ నాయన నోటివెంట మెండుగ వింటే,
'ఓనామహ' రానపుడే
శానా 'యిది' అయినది కద, శయన గరీబూ !

సుమతీ శతకం నేర్చిన
భ్రమరాంబిక గుడి అరుగుల భావన మదిలో
నెమలీకై కదలాడగ
మమజీవన గీతి పలుకు, మధుర గరీబూ !

గాలిబు మహానుభావుడు,
గాలిపటాలతడి ఆర్ద్ర గజలులు, కవితల్,
గాలికి బతికే వాడివి,
చాలిక ఆయనతొ పోటి, చాటు గరీబూ !

( గరీబు గీతాలు )

# ఒక లేఖ...✍



15-03-2017

హైద్రాబాద్

*కవిత్వాన్ని గాఢంగా ప్రేమించే*

దేవిప్రియ గార్కి

నమస్తే!

మీ రాబోయే పుస్తకానికి (ఇం...కొకప్పుడు) నా సుదీర్ఘవ్యాఖ్య రాసి మీకు పంపాక గత నెల రోజులుగా సాగిన నా అధ్యయనానుభవాన్ని నెమరేసుకుంటున్నాను. అది అపు రూపమైంది. ఒక కవి సృజనప్రపంచంలోకి వెళ్ళి అతని ఊహల్నీ, అనుభవాల్నీ, అనుభూతుల్నీ స్వీకరించే అనుభవం అపురూపం కాకుండా వుంటుందా?

అలా ఆలోచన రాగానే ఇలా రాసేసి పత్రికలకు అచ్చుకోసం పంపే కవుల సంగతి వేరు, ప్రతీ కవితలో శబ్దౌచిత్యాన్ని, అర్థగాఢతనూ సాధించే కవుల నిబద్ధత వేరు. మీరు రెండో తెగకు చెందినవారు కనుక మీ కవిత్వాన్ని చదువుకోవడం ఒక కళాత్మక అనుభవం. ముఖ్యంగా రాజ్యలక్ష్మిగారి స్మృతుల్లో సంచరిస్తూ మీరు రాసిన కవితలు నన్ను చలింపజేశాయి. ఓ రైలు ప్రయాణంలో 'గార్ల'కు వెళ్తూ ఆ కవితల్ని నేను చదివినపుడు కన్నీటి పర్యంతమయాను. గొప్ప కవిత ఇచ్చే అనుభవగాఢత అలాంటిది కదా!

వర్తమానాన్నే కాదు, అటు గతాన్నీ, ఇటు ఆగతాన్నీ తడమడం మీ రచనాపద్ధతిలో ముఖ్యాంశమని నా అభిప్రాయం. అందుకే కాలపరిధుల్ని దాటికూడా మీ కవిత్వం మనగలదని నేననుకుంటున్నాను.

ఈ అనుభవం నాకు సారవంతమైంది. నా ప్రయాణంలో కొంత భాగం ఎంతో అర్థవంతం కావడానికి ఇలాంటి అధ్యయనాలు దోహదం చేశాయి.

తాత్కాలిక ప్రయోజనాల కోసం కవిత్వమ్మీద పెట్టాల్సినంత శ్రద్ధ పెట్టకపోవడం ఒక విషాదం. కొంతమంది ప్రసిద్ధకవులూ ఇలాంటి విషాదస్థితిని కల్పిస్తున్నారు. అలాకాక ఎప్పటికప్పుడు తాజాతాజాగా విలువైన కవిత్వాన్ని రాస్తున్న మీకు నమస్క రించడంలో నాకు ఎంతో ఆనందముంది.

వుంటాను.

మీ

**దర్భశయనం శ్రీనివాసాచార్య**



I can't abandon poetry
to embrace gallery.

\- Devipriya





# బతుకుదారిలో....





# దేవిప్రియ బతుకుదారిలో....

దేవిప్రియ తల్లిదండ్రులు పలనాటి సీమనుంచి 1940 దశకం మధ్యలో గుంటూరు పట్నానికి వలస వచ్చారు. తల్లిది 'రెంటచింతల.' తండ్రి ఆ దగ్గరిలోని ఓబులేశునిపల్లెలో పుట్టి పెరిగారు. తల్లిపేరు హుస్సేన్‌బీబీ. తండ్రి ఇమామ్. ఆయనకి ఉత్తరాలు చదవడం, రాయడం వరకే తెలుగు తెలుసు. అదికూడా గుంటూరు చేరిన తరువాతనే నేర్చుకున్నట్టుంది. పోలీసు ఉద్యోగాలకి దేహదారుఢ్యంతప్ప చదువు సంధ్యలు పెద్దగా అవసరంలేని ఆ రోజుల్లో ఆరడుగుల ఎత్తున్న ఇమామ్‌గారికి కానిస్టేబుల్ ఉద్యోగం తేలికగానే దొరికింది. హలీమున్ అనే పలనాటి పడుచుని పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకి పుట్టిన పిల్లలు పుట్టగానే చనిపోతూవుండడంవల్ల హలీమున్ గారు సవతిపోరు నివారించుకోడానికి కావచ్చు, తన చెల్లెలు హుస్సేన్‌బీబీనే ఇమామ్ గారికి రెండవభార్యగా నిఖా చేయించింది. దేవిప్రియ ఈ అమ్మకి మొదటి సంతానం. తరువాత ఆయనకి ఒక చెల్లి, చివర ఒక తమ్ముడు పుట్టారు. తమ్ముడు ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దేవిప్రియ పెద్దతల్లిదగ్గరే ఎక్కువ మక్కువతో పెరిగారు.

| | |
|---|---|
| పుట్టింది | : 1951, ఆగస్టు 15నాడు, గుంటూరులోని 'కన్నెల ఆసుపత్రి' (సెయింట్‌జోసెఫ్స్ హాస్పిటల్‌లో) |
| బాల్యం | : గుంటూరు, తాడికొండ, వినుకొండ, వినుకొండ దగ్గరి అడవి గ్రామం బొల్లాపల్లిలలో |
| చదువు | : తాడికొండ, వినుకొండ, గుంటూరు, తెనాలి. |
| ప్రాధమిక విద్య | : తాడికొండ, వినుకొండ ప్రాధమిక పాఠశాలలలో. పెదపరిమి లోని రోమన్ కేథలిక్ మిషనరీ స్కూలులో. |
| హైస్కూలు చదువు | : ఎస్.వి.వి. హైస్కూల్, తాడికొండ, హిందూ కాలేజి హైస్కూల్, గుంటూరు |
| మెట్రిక్యులేషన్ | : రవి ట్యుటోరియల్ కాలేజీ, గుంటూరు |
| ప్రీ-యూనివర్సిటీకోర్స్ | : వి.ఎస్.ఆర్. కాలేజి, తెనాలి. |



బి.ఏ : ఆంధ్రాక్రిస్టియన్ కాలేజి, గుంటూరు.
(1967–68) : తండ్రి ఉద్యోగవిరమణ, దేవిప్రియ చదువు కొనసాగింపు)

హైస్కూలు లైబ్రరీలో, తాడికొండ గ్రంధాలయంలో మొదలైన పత్రికాపఠనం, సాహిత్యంపట్ల ఆసక్తి, అధ్యయనం కొనసాగింది. కథలు 'రాయడం' 1962లోనే, తాడికొండలో మొదలు. గేయాలు అల్లడం ఆరంభం. కథలూ, డిటెక్టివ్ నవలలు, జానపద నవలలు రాయడం, వృత్తాలలో, మాత్రాఛందస్సులో సాధన. సి.నారాయణరెడ్డి గారి 'కర్పూర వసంతరాయలు' ప్రేరణతో 'వనజారాయలు' అనే పద్యకావ్యరచన. చదువుకుంటూనే 'గుంటూరు న్యూస్', స్వతంత్ర సందేశ్, 'తెలుగుసీమ' వంటి స్థానిక పత్రికలలో పని చేయడం. తాడిశెట్టి ఆంజనేయులు ప్రోత్సాహం. 'దిక్సూచి' ఒక లిఖిత పత్రిక ప్రచురణ. డా. పరుచూరి రాజారామ్, పి.హనుమయ్యవంటి పెద్దల ప్రోత్సాహం.

తాడికొండ సీనియర్ సుగమ్‌బాబుతో, గుంటూరులో 1967–68లో పునః పరిచయం. తాడికొండ బాల్యమిత్రుడు కిరణ్‌బాబుతో గుంటూరులో మళ్ళీ స్నేహం. సుగమ్‌బాబుకి చెందిన అమన్ వాచ్ కంపెనీలో నిత్యనిరంతర సమావేశాలు. పలువురు యువరచయితలతో, కవులతో, సీనియర్లతో పరిచయాలు. కమ్యూనిస్టు మేనిఫెస్టోతో పరిచయం.

సుగమ్‌బాబు కవితాసంపుటి విప్లవంలో తనతో కలిసిరాసిన ఒక సుదీర్ఘగేయం ప్రచురణ. అనేక పత్రికలలో విరివిగా కవిత్వ ప్రచురణ. లేమల్లెలో ఒకపెద్ద టుబాకో కంపెనీలో వేయింగ్‌క్లర్క్‌గా తాత్కాలిక ఉద్యోగం. కంచికచర్లలో దళిత యువకుడు కోటేశును సజీవదహనం చేసినప్పుడు రాసిన సుదీర్ఘకవిత 'జ్వాల' వార్తాపత్రికలో ప్రచురణ, చర్చ.

**1969–70 :** పైగంబరకవులు. పలు కవితాసదస్సులు, పర్యటనలు, పైగంబర కవిత్వం గురించి రాష్ట్రవ్యాప్తంగా ప్రసంగాలు. 'పైగంబరకవులు' గురించి రాసిన వ్యాసాలు.

**1971–73 :** అనిసెట్టి సుబ్బారావు గారివద్ద సినిమాలలో సహాయరచయితగా మద్రాసులో పని. శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, ఆరుద్ర, కొడవటిగంటి కుటుంబరావులతో దగ్గరగా మసలడం. సుమారు డజను డబ్బింగ్ సినిమాలకి మాటలు, పాటలు, కొన్ని విడుదల కాని సినిమాలకి పాటలు. కాకరాలతో సాన్నిహిత్యం.'గొడ్డళ్ళు లేవాల', 'త్రినేత్రం' వంటి రూపకాలు, నాటకాల రచన. నిరుద్యోగం.

**1973 :** గుంటూరు తిరిగిరాక, అబ్బూరి రాజ్యలక్ష్మి పరిచయం, ప్రేమ. హైదరాబాద్ పోక. 1973 జూలై 16 న రాజ్యలక్ష్మితో రిజిస్టర్డ్ పెళ్ళి. కె.శివారెడ్డి ఇంట కొన్నిమాసాల ప్రవాసం.

**1974 :** తండ్రి మరణం, తిరిగి గుంటూరు చేరిక. ఫిరంగిపురానికి చెందిన మిత్రుడు ఇ. శివారెడ్డి, కిరణ్‌బాబు పూనుకొని తనకోసమే ప్రారంభించిన 'నిర్మల' మాసపత్రిక సంపాదకత్వం, 'ప్రజావాహిని' రాజకీయ వారపత్రిక సంపాదక బాధ్యత వహించి హైదరాబాదు తిరిగిరాక. 'సెంట్రీ' నాటిక రచన.



**1975–78 :** 'ప్రజాతంత్ర' వారపత్రిక ఎడిటర్‌గా బాధ్యతల స్వీకారం. శ్రీశ్రీ ఆత్మకథ 'అనంతం' ధారావాహిక ప్రచురణ. సినీమాకళ గురించి అర్థవంతమైన రచనలు. సమాంతరసినిమా గురించి వ్యాస పరంపర. నండూరి రామమోహనరావు, వాసిరెడ్డి సీతాదేవి, ఎ.బి.కె. ప్రసాద్, సహవాసి, వరవరరావు, కె.వి.రమణారెడ్డి, ఆరుద్ర, నగ్నమునివంటి పలువురు వెటరన్ల రచనల ప్రచురణ. తెలుగు పత్రికారచనలో, ప్రచురణలో ఒక కొత్త ఒరవడి, ఉరవడి. వారంవారం 'సమాజానందస్వామి రచన'. 'సమాజానందస్వామి' పుస్తకప్రచురణ. బి. నరసింగరావుతో పరిచయం. గద్దర్‌తో పరిచయం. ప్రతిభావంతులైన కొత్త రచయితలకు చేయూత. 'ప్రజాతంత్ర మూసివేత'. 'మాభూమి' సినిమా నిర్మాణంతో (రచన కాదు) అనుబంధం.

**1976** ఫిబ్రవరి16న కుమారుడు ఇవాసూర్య పుట్టుక. 1977 అక్టోబర్ 13న కుమార్తె సమత పుట్టుక.

**1979 :** ఆంధ్రజ్యోతి దినపత్రిక హైదరాబాదు న్యూస్‌బ్యూరోలో రిపోర్టర్‌గా ఉద్యోగం. నరసింగరావు చొరవవల్ల 'అమ్మచెట్టు' ప్రచురణ. లీలావతీ రాఘవయ్యగారి 'జ్యోతి' మాసపత్రిక సంపాదకబాధ్యత వహించడానికి రెండోసారి మద్రాసుకి. 'సీతా, ఓ సీతా!' నాటిక ప్రచురణ. ధనికొండ హనుమంతరావుగారితో సాన్నిహిత్యం.

**1981–82 :** 'జ్యోతి' మాసపత్రికతోపాటు హైదరాబాదుకి తిరిగిరాక. 'ది స్కైలైన్' ఇంగ్లీష్ డెయిలీలో న్యూస్ ఎడిటర్ ఉద్యోగం. 'తెలుగుదేశం' వారపత్రిక ఎడిటర్‌గిరి. 'ఆంధ్రప్రభ' దినపత్రికలో, ఎ.బి.కె. ప్రసాద్, నండూరి పార్థసారధి ప్రోత్సాహంతో, 1982లో 'రన్నింగ్ కామెంటరీ' చరిత్ర ప్రారంభం. నరసింగరావు దర్శకత్వంలో 'రంగులకల' నిర్మాణం ప్రారంభం. స్క్రీన్‌ప్లే రచన. గద్దర్ గానం చేసిన అజరామర గీతం 'జమ్‌జమ్మల్‌మర్రీ, వెయ్యికాళ్ళజెర్రీ' రచన, సినిమాల్లో తొలిసారిగా వచ్చిన వచనకవిత రచన.

**1983–86 :** దాసరి నారాయణరావుగారి 'ఉదయం' దినపత్రిక సంపాదకవర్గంలో ముఖ్యభూమిక, ఏ.బి.కె., రామచంద్రమూర్తి, కె.ఎన్.వై. పతంజలి వంటి ప్రతిభావంతుల సాహచర్యం. ఫీచర్లు, 'ఆదివారం ఉదయం' సంపాదకబాధ్యత. ఆదివారం అనుబంధాల కొత్తపుంతలు. 'రన్నింగ్ కామెంటరీ'కి అపారప్రజాదరణ. నరసింగరావుకి దర్శకుడిగా అంతర్జాతీయఖ్యాతి గడించిపెట్టిన 'దాసి' స్క్రిప్టు. 'దాసి'కి అయిదు జాతీయ బహుమతులు.



**1986-89 :** ఆంధ్రజ్యోతి దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరిక. 'చల్‌తే చల్‌తే' పేరుతో 'రన్నింగ్ కామెంటరీ' కొనసాగింపు. 'ఆదివారం ఆంధ్రజ్యోతి'లో 'బి.ఆర్. ఛోప్రా నిర్మించిన టి.వి. 'మహాభారత్' సంభాషణల సంపూర్ణఅనువాదం ధారావాహిక సంచలన ప్రచురణతో టెలివిజన్‌ని పత్రికలకి అనుసంధానంచేసే ఒక అపూర్వ ప్రయోగం విజయవంతం. సమకాలీన రచయితలకీ, పత్రికారచనకీ కొత్త జవసత్వాలు. సాహిత్యలోకంలో సంచలనం కలిగించిన 'చేరాతలు'కి రూపకల్పన. 'గరీబుగీతాలు' ధారావాహికంగా ప్రచురణ, తెలుగు యూనివర్శిటీవారి కోసం, నరేంద్ర లూథర్ ఆంగ్లరచన 'ప్రిన్స్, పొయెట్, బిల్డర్' (కులీకుతుబ్‌షా చరిత్ర) తెలుగు అనువాదం.

**1990-93 :** 'ఉదయం' దినపత్రిక అడ్వయిజరీ ఎడిటర్‌గా బాధ్యతల స్వీకరణ. 'రన్నింగ్ కామెంటరీ' విజయయాత్ర కొనసాగింపు. 'నీటిపుట్ట ప్రచురణ'.

**1992-93 :** 'గరీబుగీతాలు' ఆధునిక శతకం ప్రచురణ, 'రగులుతున్న భారతం' సినిమాకి అన్నిపాటల రచన.

**1993-94 :** 'మనోరమ' పత్రిక ప్రచురణ. ప్రయోగ వైఫల్యం, తేరుకోలేని ఆర్థిక సంక్షోభం. తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ డైరెక్టర్ ఎస్.ఎమ్.మలిక్ ఊరడింపు నీడ. ఆయన సంపాదకత్వంలో నడిచే ప్రముఖ వారపత్రిక 'గీటురాయి' సంపాదక మండలి సలహాదారుగా బాధ్యతల నిర్వహణ. 'గీటురాయి'కి కొత్త రూపురేఖలు.

**1995-97 :** ఎన్.బాలకృష్ణారెడ్డి నిర్మాతగా, జెమిని టెలివిజన్‌లో ప్రసారమైన తొలి తెలుగు వ్యాపార, వాణిజ్య విషయాల సీరియల్ కార్యక్రమం 'బిజినెస్‌ట్రాక్'కి వందవారాలకి పైగా స్క్రిప్టు, దర్శకత్వం, ఇతర టెలివిజన్ స్క్రిప్టులూ, కార్యక్రమాల రూపకల్పన.

**1997 :** అంతర్జాతీయ ప్రేక్షకుల కోసం, గద్దర్ గురించి, దేవిప్రియ రచయితగా, నిర్మాతగా, దర్శకుడిగా రూపొందించిన 96 నిముషాల ఇంగ్లీషు డాక్యుమెంటరీ చిత్రం 'ది మ్యూజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్' నిర్మాణం పూర్తి. కొన్ని అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకి ఎన్నిక.

**1998 :** తీవ్రమైన అనారోగ్యం, ఆసుపత్రి. ఇంటి నాలుగుగోడల మధ్య నిర్బంధ విశ్రాంతి. అడ్వర్టయిజింగ్, టెలివిజన్ రంగానికి పరిమిత సేవలు.

**1999 :** శాసనసభ ఎన్నికల సందర్భంగా సిటీకేబుల్‌లో రాష్ట్రవ్యాప్త ప్రసారానికి, జి.మట్టయ్య నిర్మాతగా "దేవిప్రియాస్ ఎలెక్షన్ షో 1999" రూపకల్పన. నెల రోజుల పాటు రోజుకి రెండు కార్యక్రమాల నిర్వహణ. కవి యాకూబ్ 'మాధ్యమం' వేదిక తరపున ప్రచురించిన 'తుఫానుతుమ్మెద' సంపుటి ప్రచురణ. ప్రముఖమైన అడ్వర్టయి





జింగ్ ఏజెన్సీ 'మైండ్‌సెట్ ఇ.వై. డబ్ల్యు'తో క్రియేటివ్ కన్సల్టెంట్ (కాపీ)గా అనుబంధం కొనసాగింపు. థమ్స్ అప్, బజాజ్ వంటి పలు భారతీయ, అంతర్జాతీయ బ్రాండ్లకి సృజనాత్మక ప్రచారం. 'థమ్సప్'కి 'తాగండి, ఉరిమే ఉత్సాహం' అనే ప్రఖ్యాత నినాద సృష్టి.

**2000 :** 'ఆంధ్రప్రభ' దినపత్రికలో 'రన్నింగ్ కామెంటరీ' పునఃప్రారంభం. 2001 వరకు కొనసాగింపు.

**2002 :** జనవరి 20నాడు మూడుపదుల దేవిప్రియ అభినందన సందర్భం దేవి'30. ప్రఖ్యాత మలయాళ కవి డా. అయ్యప్ప పణిక్కర్ ముఖ్యఅతిథిగా తెలుగు సాహిత్య, పత్రికా రంగాలలోని అతిరథ మహారథులు పాల్గొన్న సభ, హైదరాబాదులో. 'అమ్మచెట్టు', 'నీటిపుట్ట', 'తుఫానుతుమ్మెద'– 'దేవిప్రియ కవిత్వం'గా, 'సమాజానందస్వామి', 'గరీబు గీతాలు' – 'దేవిప్రియ వ్యంగ్యం'గా రెండు సమగ్ర సంపుటాలు ప్రచురణ. మూడుపదుల దేవిప్రియ అభినందన సంచిక 'స్వరపత్రం' ప్రచురణ.

**ముఖ్యమైన అవార్డులు :** ఫీవర్స్‌ఫ్రంట్ అవార్డు, ఢిల్లీ తెలుగుసంఘం సత్కారం, నంది అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయంవారి పురస్కారం, సాహిత్యగౌతమి అవార్డు, కొండేపూడి శ్రీనివాసరావు విశాలాక్షి అవార్డు, పరుచూరి రాజారామ్ అవార్డు, యోగివేమన యూనివర్శిటీ జీవనసాఫల్య పురస్కారం, తెలుగు యూనివర్శిటీ ఉత్తమ కవితా సంపుటి అవార్డు, హంస అవార్డు, ఆంధ్రా యూనివర్శిటీ సత్కారం, 'గాలిరంగు' సంపుటికి 2017 కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు.

**సభలు, సమావేశాలు, ఉద్యమాలు, సంకలనాలు, పత్రికలు** : వందలాది సాహిత్యసభలూ, సమావేశాలు, పలు కవితాసంకలనాలలో కవితలు, పత్రికలలో వైవిధ్యభరితమైన రచనలు. 1994నుంచి సుమారు 20 అంతర్జాతీయ చలన చిత్రోత్స వాలలో ప్రాతినిధ్యం, సమీక్షలు. అందుబాటులోవున్న ముఖ్యమైన ముందుమాటలు : నందిని సిధారెడ్డి 'సంభాషణ', నాళేశ్వరం శంకరం 'దూదిమేడ', కె. శివారెడ్డి 'జైత్రయాత్ర', చేకూరి రామారావు 'చేరాతలు', బసలింగప్ప 'నన్ను మాట్లాడనివ్వండి', సుధామ 'సం.సా.రా.లు.', డా.జె.భాగ్యలక్ష్మి 'రవీంద్రగీతాలు', యస్.యం.మలిక్ 'వెన్నెల తెరలు', డా.సి.నారాయణరెడ్డి 'నిరంతరం', బండ్ల మాధవరావు 'అనుపమ'.

**వర్తమానం** : హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రి 'నీలిమ' హాస్పిటల్ ముఖ్య సలహాదారు, మేనేజింగ్ బోర్డ్ డైరెక్టర్‌గా సేవలు.

**నివాసం** : 'అమ్మచెట్టు' 204, రాచకొండ టవర్స్, ఆల్వాల్, సికిందరాబాద్ – 500 010, tadikondadevipriya@gmai.com



*Wonder, when this Rainbow*
*Forever fluttering in my heart*
*Quietly sneaked out*
*And flew into the drizzling sky !*

*- Devipriya*

ఆశ్చర్యం....
నిరంతరంగా నా హృదిలో
రెపరెపలాడుతున్న ఇంద్రధనువు
అలికిడి చేయకుండా బయటపడి
కురుస్తున్న ఆకాశంలోకి ఇలా ఎప్పుడు ఎగిరి వెళ్ళిందో !


అనువాదం : దీవి సుబ్బారావు



# ENGLISH SECTION








A pillar installed in the premises of Sahitya Akademy on the day of the Awards presentation in New Delhi in February, 2018






Sahitya Akademy Award for Gaalirangu - 2017(Colour Of Wind)

*A brief thanks giving speech by poet Devipriya*

# KNOWLEDGE FROM TEACHERS ! LESSONS FROM PEOPLE !

**T**o the esteemed President of the Sahitya Akademy, Sri. Chandrasekhara Kambara, my beloved brother and secretary of the Akademy Sri Srinivaa Rao, distinguished personalities on the dias and the thinking galaxy that descended down in the hall,I offer my salutations.

When I stop and sit on this silver milestone with my soft palms pressing my cracking knees and look back at the road I travelled, I realise my debts are various and manifold; first comes my mother who fed me off her wheatish, fullmoon breasts an innate fondness for poetry in my infancy; thank you Ammaa, wherever you are in the ether. I must remember my departed wife Rajyalaxmi without whose companionship I couldnot have walked this far in life. With a weeping heart I dedicate this coveted Akademy award to her infinite memory.My son Iva, my daughter Samatha, my immaculate daughter Dr.Neelima, Dr.Srinivas, eminent poet Siva Reddy who many believe is my alter ego, Khadar Mohiuddeen,



Vasireddy Naveen, Dr. Pallaa Rajeswar Reddy, K.Srinivas, Mallepalli Laxmaiah, Naleswaram Sankaram, B.Narsinga Rao, Sidhareddy,Varavara Rao, Bandla Madhava Rao, Visweswara Rao, Penugonda, Sivasankar, Yakoob, Ramatheertha, Krishnudu, Prathibha Sarma.... all these and some others come to mind when I think of my debt of gratitude.

Having born into a typical small town, unpriviliged,low income family, I grew up watching the largely powerless masses suffering and persecuted; I was unaware of the politics and the socio-economical forces that drive and divide the society; like millions of teenaged boys of my age, hovering just above the dreaded BPL, I was also sucked into that magical dream world of social fantasies.

Thanks to the blurred images of my listless ancestors, I didnot have to crumble under the weight of history. I was left free to see my own dreams, build my own humble nest, which, over the years turned in to an edifice, in its own right. In the beginning, I have had my share of fanciful infatuations, both in my life and in my early, baby-step compositions. It took almost a decade for me to understand the elementary arthematics. Mine is a story of a ripple turning into a wave. Using this opportunity, I would like to share a few thoughts with the tiny oceans that are ebbing infront of me.

To tell you a bit about my roots, my forefathers came from 'Palnadu' in Andhra Pradesh,where the epic battle of Palnaadu, akin to Mahabharata, was fought between cousins for the kingdom. It is a parched zone of rocky land, ironically situated on the lowly banks of the perinnial river Krishna.

Could it be that the kind small-town midwife gently wiped the blood stains on my tender body and swaddled me in a warm soft towel, looked into my half closed eyes and whispered to my mom, 'Lo, a poet is born from your womb.'

Ever since I fell in love with this heady labour of writing poetry, some forty years ago, hardly was there any respite. Neither was there a moment of true peace. If your mind is not pathologically restive, you are not a poet. So it seems to me, after traversing and pouring into some ten books of poems.



I was taught the grammar and the basics of the Sanskrit Chandas at the school and college by some great teachers, but the greatest lessons that I learnt came from my interactions with the society, and the people. I learned that on the earth there was nothing apolitical. No epic, no purana, no holy book was free of politics.

If there is a god, who ever is the god - Vishnu, Allah, Christ or Budha, whatever is his or her name, violence in the name of god is, infact, violence against god. I used to ask my mother why do our great peace preaching gods are always armed to the teeth ? My father had never forgiven me for this question. As a poet and as a man I have a religion, If I can call it one; that is freedom. As the birds belong to the skies, as the fish belong to the waters, as the sheep belong to the earth, I, as a poet, belong to the people, the people of india, my country. And I believe that I should have the freedom to love the country where I am born. Unless your art touches a moral nerve it cannot be an art that can hope to change lives and I always believed my writings, my poetry should try to throw a rope to the marooned and hopeless of the country.

Men butcher other men regardless of the exhortions, comandments and the teachings handed down by their gods and prophets, hundreds and thousands of years ago. In which Sindhu river and in which Ganga the glowing Indian idea of 'Anrisamsa', the ultimate value of compassion, had sunk?

'Those who sow should eat,' said the early 18th century sufi thinker Shaw Inayat. This was much before the French revolution happened. Many of us still dream and write poems, plays and novels about this and watch helplessly as the world looks the other way.

May be I am not tough minded , may be I am not pampous about literature, may be I am not as eloquent as some of my better equipped counterparts behind the mic. But let me tell you that I am a biological believer in human redemption and committed to the backbone to champion the cause of the underdog. If we still chose to continue to defy our conscience and love to dwelve in the after life fantasies and the charms of utopia, I am afraid that our generation next may wakeup into a jurassic, savage future. The fear of getting



impaled like the heretics in the post Jainism era in Tamilnadu began to haunt the already dwindling numbers of inquisitive Indian minds in the land of the ever inquiring Upanishads.

The nightmares of systematic progroms may never again disturb the half sleep of this half hungry nation.

The laity still remain tame and voiceless as the liturgy continues to increase its volume and vocabulary.

After almost seven decades of the much celebrated freedom, a large section of my fellow Indians face the same persecution which they had been suffering and enduring for centuries. If this condition fails to affect our creative and intellectual world, then I am afraid, there is something seriously wrong with our state of mind. To think that the system is working fine and needs no correction, in my view is preposterous.

The alarm has started ringing and it is louder enough to be heard across oceans and continents. It is time the right thinking minds wakeup and stepout from their comfort zones and feel the tremors under their feet.

The preamble of the Indian constitution is a scripture of democracy handed down to us by Dr.Babasaheb Ambedkar and it is not an arty composition of empty words. We, the poor souls in the writing fraternity, along with the less fortunate lot of this country only beg to see the true spirit of our constitution prevail; and as a concerned citizen and a dutyful poet, I pray that only the history of the people who toiled to build this country should be sung in amplified voices and not those of the emperors and the jahaapanaas who wrought havoc and rained rivers of blood to guard and expand their dominions. As poets and authors, let us continue not only to dream but also to contribute a humble brick to build a country where everyone of our children will have a school to go, a hospital to cure, clothes to wear, work to do, food to eat, a home to live and above all the freedom to think and the right to speak. This is my idea of living free. And this is my idea of India. Thank you.



Srivathsan Nadadhur

# An ode to Intimate Poetry

Not many would christen their name; Guntur-born Khaja Hussain, popularly known as poet Devipriya, was privileged to do so. His poetry is repete with intimate and political motifs like 'dear'; his chiocde of words, often measured, advocate a firm opinion. His residence at Alwal in Hyderabad is named after his first anthology of poems Amma Chettu. Clearly, there's nostalgic reflection of childhood but there is also hope for the future. On one of his poems in Gaali Rangu for which he was honoured with the Central Sahitya Akademi award in 2017, he mentions 'Atugaali itu raada, itu vaana atu poda' (Won't that breeze come here? Won't our rain to there?). A renowned journalist, script writer, lyric writer and credited to be the father of political commentary in verse for Telugu journalism, he calls himself 's train running on four different tracks at the same time'. "It's upto you to spot me where you want," he says.

Hids poetic streaks unfolded in his teenage years, when he needed an outlet to express everything his heart and mind was experiencing.. "I was a student then and believe I'am still one. I trusted my ability to be different and express my inner world through words. Only an awakened mind can become a poet. A poet can't simply write, be in a slumber and get awakened again."

Having actively observed the intricacies of revolutions in his times matured him as a poet. After he completed college course, his father expected him to find a job to help him run the family. "I was of the belief that there would be a day, a liberation movement



would help build an equal society and we would get our due to live our lives at peace." Little did a young Devipriya realise the complexities of a modern society then. This comes full circle in Gaali Rangu, reflecting his holistic understanding of 'isms' and an aggression channelised towards progress.

**Process and precision**

whatever he writes is spontaneous, he doesn't remember an instant where he edited or reworked a poem. If he didn't like what he penned, he would merely discard it. "It;s not something that can be chiselled and sharpened later."

Poetic precision has been among his primary strengths, he toys with the thin line between direct and ornamental poetry. He attributes his love for mythological epics to his poetic evolution, "Why do I read Kalidasa or Valmiki? I was recently reading the Ramayana, not to know about its multifarious interpretations, but to understand how they described the moon back then. He describes them as a bird in a cage, a lion in a den in the mountain Mandra. I read epics to know how great Vedavyasa was a poet, how efficient was Srimatha in Srungara naishadham."

During his journalism stint, Devipriya was instrumental in making Sri Sri write his autobiography. Beyond poetry, his sojourn in films like Maa Bhoomi, his sojourn in films like Maa Bhoomi, ragulutunna Bharatam and Pallaki, his most celebrated contribution to Telugu literature remains the 'Running commentary' series in a Telugu daily. In the series, he'd give his own spin to the pocket cartoon by giving it a political commentary in verse. NTR, during his stint as a CM, had sportively commented, "How do we satisfy or please him at all?"

**Staying relevant**

Devipriya respects reactions of contemporary society as much as he loves the glorious Telugu past. For a poet to stay relevant, seeing isn't enough, that he proves through his latest award-winning book as well.

"He should always come out of his comfort zone, break



that invisible wall. Reacting and learning about events around you is important. Your poetry should reflect that time." His words resonate his poetry when he mentions, 'A poet of substance should be able to penetrate of substance should be able to penetrate into the depths of the earth and also believe that sky isn't a limit'.

The Sahitya Akademi for Gaali Rangu has put a grin on his face. "I feel humbled and nice about it. These things didn't brother me at any stage of my writing or journalistic career, but I must admit I'm very happy with the honour. People say Gaali Rangu is my best work, though every poem I write is dear to me." He labels his poem as a perennial stream that'll only end with him.

What has changed in all these years? "The way I understand thinds around me, the nature, the relationships. My values have gone through a chane. I've become more conscious of the nuances of my poetry, softened, philosophical, perhaps inverted and more reflective."

Legendary writer Patanjali had once felt Devipriya is the only poet as versatile as Sri Sri. "This made me more tense, it feels like a burden. I need to be more responsible."

*- Hindu, Jan5, 2018*

⚜

Genius is originality.
It rises from the strongest
personality of a writer.

- Devipriya



Jagadhathri

# Verse Vignettes of a Velocity poet

To say, 'Devipriya is a gifted poet is a gross under statement. He is an Editor of both print and electronic media for a considerable time, a political commentator, poet, maker of documentaries, writer of biographies and a translator. A socially conscious poet with literary dignity, he said "I have two treasures, poetry on my tongue and poverty on my head and I have two duties, one is an eternal dedication to poetry and the other struggles against poverty.

KNY Patanjali, a mercurial writer, editor, and a long time friend of Devipriya, writing a foreword to the anthology 'Chepa Chiluka' had said "Around 30 years ago, on a shanty there was rain. The rain flowed down from the eaves and became a perennial river. Some 30 years ago a tender forefinger jotted something on the walls of a poor man's hut. That very forefinger is now tweaking the silver strings of lightning and caring for the strings of the heart. And is showing to everybody where lurks the beast that devours the life. Asking us to hunt it down and is anointing the crimson invitation on the foreheads of hunters. The name of such phenomenon is Devipriya"

All his poetry carried interesting and innovative titles like 'Ammachettu' (Mother Tree), 'Neetiputta' (Watery Pit), 'Chepa chiluka' (Fish Parrot), 'Gaalirangu' (Colour of Air), 'Tuphanu



thummeda' (Strom Dragonfly), 'Gandhakuti' (Bower of Fragrance), 'Gareebu geetalu.' (Songs of the poor). 'Inshah Alla! Samjananda Swami' (satirical poetry in metrical verse) and running commentary of similar style, which appeared as a daily comment verse in various dailies, and 'Adhyakshaa Mannimchandi (Pardon, Speaker Sir) his newspaper editorials, all this output makes him a unique litterateur of significant contribution. He translated Gurajada's 'Poornamma' into English and penned down a commissioned biography of Bihar elections hero K.J. Rao, on English.

From the early background of Paigambara poets, which Volga, MK Sugambabu and Devipriya started in 1970's, the poet came a long way and remained steadfast in the progressive movement of the people and writers. Taking a broad canvas, employing simple and deep terms, Devipriya remains committed to the art of poetry and retains its intellectual space and indomitable will to raise valid objections about the ways of the world. In that, we can find in him a philosopher, in intense conversation with nature, world, co-human beings, flora and fauna. All listen to him in rapt attention, and in the process, he takes all that into him.

*-'The Hans India'. The author is a bilingual writer, translator, columnist and critic.*

⚜

Devipriya " ...write about the stars that shine like the eyes of a black cat"! A very powerful image, a deep image and one has to write several pages to bring out the shine of the eyes of a cat, the color of the black cat, the relation f the stars to these eyes of a black cat!

- Dr. Ayyappa Paniker



Dr. Ayyappa Paniker

# Devipriya is right into the 21st Century

Friends,

I came to Hyderabad, all the way from Kerala, on the kind invitation of my honored friend Mr. Narasinga Rao and my beloved young friends Yakoob and 'Sillalolitha', to be here to pay my homage to Mr. Devipriya, actually I should call him "Sarva Priya Devipriya"- and express my deep appreciation for the work he has done in many related fields of culture. In Kerala such a person who distinguishes himself in poetry, in Journalism, in lyric writing, in films, and so on will be called as “బహుముఖప్రతిభ!” (Bahumukha Prathibha) and this aspect as poet is reflected in Mr. Devipriya's poems also. There is “బహుస్వరత!” (Bahuswaratha) which no critic can reduce to a single formula. Mr. Devipriya is at the prime of his career. He has at least 30-40 years more of very active involvement in all these related fields of culture. Iam particuallary happy that you have choosen this “అభినందన సందర్భం!” (Abhinandana Sandarbham) when Devipriya is completing 30 years of creative involvement.

In Kerala, we honor a writer after he is dead; sometimes when he is about to die, just to remind him that it is time for him to leave the world! (laugh in the auditorium). But here you are honoring a writer who is at his prime and this I think is the best kind of homage we can pay to him. It is a great boost to his future work. His future is our future too. He is the future of Telugu language and poetry. He is the future of Andhra jounalism. So we are investing in him at this time for the development of Andhra culture in future. I have gone through a number of his poems. I found that he has poems of public themes on one hand and poems of very private nature on the



other hand. The poem "History" which was read by him on video here, is a good example of his concern with public themes. No one who lives at this time in human "History" cannot be ignorant of whatever is happening around him and many distinguished speakers here refered to the problems of Globalisation. The Song that was sung by legendary 'Gaddar' a few minutes ago is also an example of that dimension. But there are other dimensions. I translated some of his poems into Malayalam without his knowledge, behind his back! This is the time he knows that. This is a poem marked by not only his seriousness of purpose but also intimacy of his tone, which is very often lacking in the contemporary poetry. When you read that poem you think that he is speaking for you, speaking into your ears. This "అంతర్ముఖత" (Antarmukhatha) which is very rare, and I would consider that not a feature of "విప్లవకవిత" (Viplava Kavitha) "ఆధునికత" (Aadhunikatha) "ఆధునికోత్తరత" (Aadhunikottaratha). He is right into the 21st Century!. And this poem "Dont enter my thoughts" is marked by his intimacy of tone. The whispher that "Kaantha Sammitha"- there is no hold for you to speak like that, you think that somebody is whispering into your ears, may be your heart, using your heart beat which you might not hear in the noisy world of ours. I will read the Malayalam Malayalam translation. You have to put up with this, but Malayalam is also full of Sanskrit words. When I read Malayalam, you will have to read this poem in original Telugu to feel it.

(PANIKER RENDERS THE MALAYALAM TRANSLATION OF THE POEM)

"When your black body turns into the thorns of Red Roses!" Now this tone is marked by a combination of the public and private. This is the future of what we may call the Indian post modernism, not the European or American variety and this is the future of the Century Indian Poetry; and I am very happy to experience a poem like this. We call this "అనుభూతి" (Anubhoothi). It is so internalised and yet has in its structure the complex problems of our life not in any loud terms but in the form of the "whisper."

Here is another poem, a very short one called "work"... వేల (Vayla).

(PANKER RENDERS THE MALAYALAM TRANSLATION OF THE POEM)

"I see the sun as a ball being tossed to East and West by school children." The post modern feature I have referred to earlier may be seen in that.The sun as a ball hit from East to West and West



to East. This is what we are doing in international sphere also, even as we are discussing all kinds of problems of terrorism and war and so on. He is able to relate this with the sun in the midst like a ball.. and in a very tell tale image.

He is using in this poem a "ball tossed by school children". That is what we do with a child, and the child is symbolised by the "sun", but the sun is also rounded and therefore it is a ball and we are like school children tossing the sun from East to West, West to East, and East West disputes are there. The East tries to dominate the West and West tries to dominate East. This kind of games we are playing forgetful of the agonies of our everyday life and that is suggested by the rest of the poem.

Here is one more poem of outstanding quality and I could not resist translating it into my own language.

(PANKER RENDERS THE MALAYALAM TRANSLATION OF THE POEM)

"I write about the stars that shine like the eyes of a black cat"! A very powerful image, a deep image and one has to write several pages to bring out the shine of the eyes of a cat, the color of the black cat, the relation of the stars to these eyes of a black cat!

The leaves are like the wounds, swinging in the wings on the body of the tree! So nature is there and criticism of what we do with nature is also there. And I find this as a very profound kind of poetry in a few lines and this has been in the Indian tradition... to speak volumes within a few lines, and Mr. Devipriya has captured some of the basic concerns of our glorious Indian traditions as well as Telugu tradition... as well as my own Malayalam tradition! So I feel a kinship with him and through him with Telugu literature today, because of what he has given me, and these images linger in my mind and when I publish his poems in Malayalam, I think my Malayalam readers also will feel that there is a kindred soul in Andhra Pradesh which beats to the rythms of their own heart! What more can poetry do? What more we expect poetry to do? What more can a poet like Devipriya can do?!

And hence I called him "Sarvapriya, Devipriya!"

Thank you!

A Speech delivered by the celebrated Malayalam poet Dr. Ayyappa Paniker on the occasion of "Devipriya Abhinandana Sandarbham" on January 20, 2002 at Sundarayya Vijnana Kendhram, in Hyderabad.



Shanti Nanisetti

# THE MOVING FINGER WRITES...

Poetry and films? Do they go together? Before one can answer that, television too comes into the picture. Different mediums, yes, but the bottomline is one of expression.

With changing times and attitudes, visibility becomes important. Meet Devipriya. journalist, poet, scriptwriter and documentary filmmaker all rolled into one.

Naaku

Rendu Nidhulunnayi

Naaluka meeda kavitvam

Tala meeda daaridryam...

(I have two treasures... Poetry on my tongue, Poverty on my head).

These were his words in 1980. Today he defines poetry as "the black-and-white dream that the rainbow sees in sleep.”

Devipriya "hates cliched words / phrases.” His originality is reflected in the titles of his poetry collections, such as Neetiputta, Samajananda swamy, Amma Chettu, Gareebu Geetaalu and Tuphaanu Tummeda.

“I’m very selective about my verse, my metaphors and similies... Though I’m not averte spare use of words from other languages, I prefer using Telugu words in my Compositions as I try to reach the common man through my verse" he says.

Born on August 15, 1951, Devipriya describes himself as being independent. "I never used to listen to my parents," he says jokingly.



"Independence", to him, "is the freedom to live comfortably and with dignity, freedom to earn one's livelihood, freedom to guard your freedom and freedom to fight for one's needs. The masses may not be aware of their rights, but as enlightened men we can at least think about the issue if not, "talk' or 'do' anything. Freedom does not mean coming out into the streets, shouting slogans for unnecessary, silly causes."

On how he got into writing, he says, "I started off with short stories and wrote some detective novels too in the 1960s. In 1969, I switched over to poetry.

Honestly speaking, it was Dr. C. Narayana Reddy's poetry collections that I came across in my college library that inspired me to write poems. My aim was to get my works published in Bharati, a highly respected literary magazine then, considered a yardstick to measure a poet's/writer's worth."

"My mother was my biggest inspiration. She used to write poems, compose tunes and sing them. I can trace back my roots of poetry to her. Two poems in my collections are dedicated to her," he adds. "*Amma, nee paata metla meenche aakasam nelaki digi vachchindamma* (O mother; using your poems as stairs the sky has come down to the earth)," writes a doting son in *Amma paadina aa paata,* a poem dedicated to his mother.

"When I was studying in A.C. College, Guntur, I got to meet popular poet M.K. Sugambabu who hails from my village, Tadikonda. This meeting was a turning point in that he introduced me to books like Karl Marx's Communist Manifesto. I don't claim to be a Marxist or a Communist, but people think I'm one as I'm associated with Viplava Rachayitala Sangham (Virasam), which is considered to be the literary face of the People's War Group," he explains.

What made a modern poet like him use classical style of poetry - "Kanda padyam" - in Gareebu Geetaalu? "There is a saying in Telugu — Kanda Padyam raasina vaade kavi (a person who can write a poem in Kanda Chandas is a real poet). Kanda Padyam is considered to be the most difficult in chandas (grammar). I've always liked the rhythm of this style. Our Telugu teacher 'Karunasri" Jandhyala Papaiah Sastri used to give us a theme/subject and ask us to write a poem... but on the condition that yati or prasa (first and



second letters in each line) should rhyme. Thus, I got trained in chandas."

Later, Devipriya experimented with a lot of patterns in Telugu prosody. Prabhava, Sri Sri's famous poetry collection done in kanda style, he says, had inspired his Gareebu Geetaalu. "Chekuri Ramarao (Chera), one of the best literary critics in Telugu is an authority on prosody and Telugu poetry, and he is one of my inspirations," he says.

"I love film media, especially parallel cinema," says the writer who also wrote screenplays for films like Dasi and Rangula Kala. Perhaps the only writer to write extensively on parallel cinema, Devipriya had inspired director B. Narsing Rao (Dasi fame) as admitted by the latter openly.

"I used to bunk classes to watch N.T. Rama Rao's and Kanta Rao's films. After coming to Hyderabad I got to watch films by Satyajit Ray and Shyam Benegal. Today's Telugu films are more like stage plays. No time, no space, no continuity, no nativity, no period, no reality and no Telugu culture or life," he says.

"I've always wanted to do all the things I'm doing now. When I wrote songs for Raguluthunna Bharatam, an out-and-out commercial film, I realised that one can write film songs without compromising on creativity, and that even duets can be written clean sans vulgarity," says the satisfied litterateur.

"Even now, if I get a chance, I'm open to the idea of making a film. I've an offer from Dhavala Satyam to write a script for his next Telugu venture. There are a lot of TV productions (serials and talk shows) in the pipeline," he adds, Business Tracks, a 150-episode programme telecast on Gemini TV, was scripted and directed by Devi Priya. "I've : taken up TV quite seriously. That has given me my bread and butter for the past four years. Moreover, TV is more | powerful and convenient, " he says.

An ardent admirer of folk artist and communist Gaddar, he reminisces his association with the latter which dates back to 1978. "B. Narsing Rao, Gaddar's mentor, was producing Maa Bhoomi then. It is through Narsing Rao that I got to know Gaddar, who stands by his convictions. He's the sole true folk performer in the world," says Devipriya who made Music of a Battleship, a documentary film on Gaddar. The film was made becuase Devipriya,



"didn't want to let Gaddar's efforts go unrecognised. No film was made on Sri Sri and on Nazar (people's performing artist). I didn't want this to happen to Gaddar."

When asked if literature would cease to attract the readers with so many other distractions like TV channels, computer games and Internet dominating the literary scene, he says : "Books will never die. You can't put a computer in your lap/hands, lie back on your cot and read the 'Net version'of a book! A book, 'hence, can never die'." Asked to comment on women writers, Devipriya says: "I'm all for women's writing of any kind, because they alone know their problems and should be vocal about it. We as men" tend to be insensitive and ignore their dilemmas. Vimala (associated with Virasam), Ghantasala Nirmala, Mehzabeen, Jayaprabha, Kuppili Padma and Volga are wonderful writers among women."

His poems such as Hitler navvu, Amma paadina aa paata, Oka gudise katha and Dopidi are much talked about. He is connected with the Katha Sahiti, an organisation which - encourages writings in vernacular languages, and Virasam. After speaking with the multi-faceted personality, one comes out satisfied - with immense admiration and utmost respect for him. Kudos to the greying poetic genius.

The Hindu

*తరగని వాంఛా జలధులు*
*మరకత మాణిక్య నిధులు, మాగాణాలూ*
*విరగని స్వార్థం చేటని*
*ఎరిగితె మంచిదిర మనిషి ఇన్షా అల్లాహ్*

*(ఇన్షా అల్లాహ్ శతకం)*





Sammu

## I have two Aidens now !

Dad – a one syllable word with a meaning "one's father" according to the oxford dictionary. I am sure every one of us have a different meaning to that word. So do I. And that meaning changed at every stage of my life. As every daughter dreams, my dad was my prince who always rescued me and I thought "oh my god! I love him so much". I never thought I would love anyone more than him until I met Amith. I thought "oh my god! I love him so much". Then I reconciled with the reality of life and moved on. To add to this Aiden came into my life proving all theories wrong and the minute I saw him I was head over heels in love with him again and I thought "oh my god! I love him so much". In all this midst we lost mama. Suddenly there was a vacuum created in our lives. The Dad I always thought of was not the same. Now when I look back into the time, I realised dad was always there watching over me as my guardian angel throughout. He was the unseen thrust that was helping me walk that extra mile. No one can refill the vacuum mama left in our lives but he knows there is enough of her love to keep us going. I know I have two Aidens now – one who can be beaten up and the other whom I can't . Love you Dad more and ever.





Dr. P. Neelima.

## From an immaculate daughter...

Dearest Uncle , I have no words to express my emotions and sentiments about you. When I was asked to write a few words on you for Bahumukha, I was caught sorts of unawares and stuggling since then.

You are my godfather and much more. When ever you say that I am your immaculate daughter, I get goosebumps and tears well up in my eyes. You are my dearest friend , wisest guide both in my personal and professional life. More than that , uncle , my soul is cnnected to yours , always. When I am happy I want to share it with you and when I am sad I always seek solace in your presence. You always stand with me and help me to restart by a gentle pat on my back , whatever is the setback. You are also my strength in sticking to my principles. Equally important is your role in moulding and building a value system for my children and guidance for their careers. You know Uncle you mean so many things to me. Thank you for everything.





Iva

## Dad - The light of my life and the beat of my heart!

I could start writing about you by thanking you for many things that you have provided not only when I was a kid but even now.

Some people don’t believe in heroes, but that's probably because they haven’t met my dad.

Dad, you are the hero of my life and I am really proud to be your son for the unconditional and unfathomable love you have showered on me all through the years. I also want to thank you for all the countless times you carried me over your shoulders inspite of my mistakes and blunders through various phases in my life.

I am convinced that if god exists he would guide me in the exact way that you do. I can never forget your timely guidance and encouragement that have taught me to aim for the stars.

This is just a small token of appreciation for not only being the best father but even for being my best friend and hero.

My Love for you cannot be expressed in just a few words and if I ever get an opportunity I will paint your love and magnanimity across the endless sky.

I can proudly say that the World’s Best Dad belongs to me!





Amith Vincent

## Devipriya for me - Ignites, Inspires, and Instructs...

The world knows Devipriya for his unparalleled excellence and contributions in the telugu literary world. My biggest disappointment in life is that I couldn't relish the wonders of his literary magic, being from a non-telugu literary background. However, my world too lauds Devipriya for his contributions and excellence albeit in other areas. My world is exhilarated because it has found a visionary who can ignite in me a creative spark at the drop of a hat, because it has found a mentor whose deep insights inspires me to think and act beyond my abilities, and because it has found a guide who is an epitome of leadership and instructs me to do the right thing always. My world is complete because of his presence in my life.

Devipriya is more than a father-in-law, he is my father figure. I respect and admire him to the end of the earth, and beyond.

# ఊపిరిసలపని ఉద్వేగంతో...

మీ చేతుల్లోవున్న ఈ 'బహుముఖ' ప్రధానంగా నా ఆప్తమిత్రుడు బి.నరసింగరావు ఆలోచన. నా 'గాలిరంగు' కవితల పుస్తకానికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు- 2017 లభించిన సందర్భంలో తాను దీనిని 'సాహితీమిత్రులు' నిర్వాహకుడు విశేశ్వరరావుకి ప్రతిపాదించడం, నరసింగరావు, ప్రొ॥ ఘంటా చక్రపాణి, ఖాదర్ మొహియుద్దీన్, సీతారామ్, బండ్ల మాధవరావులతో ఒక అత్యున్నతస్థాయి సంపాదక వర్గం ఏర్పడడం చకచకా జరిగిపోయాయి. 'బహుముఖ' రూపకర్తలు కొమ్ములు తిరిగిన ఈ సంపాదకవర్గమే. ముఖ్యంగా, ఖాదర్, మాధవ్, సీతారామ్ కీలక భాగ స్వాములుగా వ్యవహరించారు. 'బహుముఖ' ఈ సంపాదక బృందపు 'ఏకోన్ముఖ' దీక్ష ఫలితమే. దీని బాగోగులు, ప్రణాళిక, ఆచరణ... అన్నీ వారివే. 1967-68లో ప్రారంభమైన నా ప్రయాణం యాభైఏళ్ళుగా సాగుతోంది. 2014, సెప్టెంబర్ 9న రాజ్యలక్ష్మి కన్ను మూసినప్పుడు, నా ప్రయాణంకూడా ఇక ముగిసిందనుకున్నాను. కానీ 'ఆమె', ఆ నా ప్రజ్వలిత దీపశిఖ తాను ఆరిపోయికూడా నన్ను ఇంకా వెలిగి స్తోంది. ఇప్పుడు నేను రాస్తున్నప్పుడు, నా కుడిచేతి మూడు మునివేళ్ళలో అతిసూక్ష్మ తటిల్లతలేవో మెరుస్తుంటాయి. అవి కాటుకదిద్దిన ఆమె చేపకళ్ళ చివరనుంచి చిరకాలంగా చిందుతూ వచ్చిన దివ్య దృగంత దిగంత కాంతులే అనుకుంటూ వుంటాను నేను.

'బహుముఖ'ను సృష్టించి, కష్టించి, నన్ను మరలా జాగరూకుణ్ణి చేసినందుకు నర్సింగ్‌కీ, మల్లేపల్లి లక్ష్మయ్యకీ, విశ్వేశ్వరరావుకీ, చక్రపాణికీ, ప్రేమాలింగనాలూ, నా ముద్దుతమ్ముళ్ళు ఖాదర్‌కీ, మాధవ్‌కీ, సీతారామ్‌కీ తడికళ్ళతో, తడబడే పెదవులతో హిమచుంబనలూ తప్ప నేనేమి ఇవ్వగలను! ఈ సందర్భంగా నా పిల్లలు ఇవా, సమ్మ, నా అభౌతిక పుత్రిక డా. నీలిమ, నా నిరంతర స్థైర్యం డా. పి. శ్రీనివాస్, ఆత్మబంధువు శివుడు, ఆత్మీయ ఛాయ డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్లిక్‌భాయ్, వాసిరెడ్డి నవీన్, తమ్ముళ్ళు రామ్ గేదెల, ప్రతిభాశర్మ, యాకూబ్, ఓల్గా, నందిని సిధారెడ్డి, బోయిన వెంకటేష్, పెనుగొండ లక్ష్మీనారాయణ, రమణజీవి, కె. రామచంద్రమూర్తి, ఆశారాజు, నాళేశ్వరం శంకరం, ఎండ్లూరి సుధాకర్, ప్రసాదమూర్తి, జగన్నాథశర్మ, క్రాంతి, స్వేచ్ఛ చెమ్మగిల్లిన కళ్ళలో కదలాడుతున్నారు. అయిదు దశాబ్దాల ఈ అనురాగానికీ, అభిమానానికీ, ప్రోత్సాహానికీ, అందరికీ అనంతానంద ధన్యవాదాలు! దయతో దీవించండి!

**హోటల్ ఐలాపురం** — దేవిప్రియ

**విజయవాడ**

17 సెప్టెంబర్, 2018.





*Special Thanks*




**RAM GEDELA**
Hyderabad

# bahumukha

critiques on devipriya's multifaceted personality

₹ 300

దేవిప్రియ గురించి సంక్షిప్తంగా చెప్పడం సాధ్యం కాదు. విస్తృతంగానే మాట్లాడాల్సి ఉంటుంది. ఆయన రాసిన 'అమ్మచెట్టు' కవిత్వం నుండి 'ఇం..కొకప్పుడు' దాకా నిర్మించి ఇచ్చిన రూపకాల రహదారులను, సామాజిక, రాజకీయ సంవేదనలను, కూర్చిపెట్టిన సిమిలీల సాగరాలను, వెలిగించి ఇచ్చిన దీప్తి చైతన్యాలను సతతమూ గుర్తుకు తెచ్చుకోవలసిందే. నిత్య పరిణామ శీలమైన కాలగతిలో దేవిప్రియ కవిత్వం ఒక ప్రధానమైన పాయగా కాక ఒక మహానదిగా ప్రవహిస్తూ వచ్చిందన్న సంగతి ఇప్పుడిప్పుడే తెలుగు సాహిత్యం గ్రహించగలుగుతున్నది.



సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ.